

శ్రీమాతను గురించిన ప్రత్యేక సంచిక

అఖిల

అఖిల భారత పత్రిక

జనవరి 2003

6/1/2003

శ్రీమాత

125 వ జన్మదిన మహోత్సవ సంచిక

(21 ఫిబ్రవరి 2003)

శ్రీఅరవిందుల ప్రవచనములు

శ్రీమాత ప్రవచనములు

అనుబంధం



The Mother (self-portrait)

ఉపోద్ఘాతము

శ్రీమాతను గురించి మొదట్లో ఎవరికీ ఎక్కువ తెలియదు. ఒక నాడు శ్రీఅరవిందులు ఆమెను మదర్ అని పిలవటం మొదలు పెట్టారు. అప్పుడు ఆమెను గురించి చెప్పమని చాలామంది సాధకులు శ్రీఅరవిందులను అడిగారు. దీని ఫలితమే 'The Mother' అనే చిన్న పుస్తకము. అందులో ఆమెను జగన్మాత అని, సృష్టి కంతటికి మూలమైన శక్తి అని పేర్కొన్నారు. మనం 'యా దేవి సర్వభూతేషు' అని స్తుతిస్తున్న దేవత ఈమెయే అని స్పష్టమవుతుంది. 'శివశ్శకాయుక్తో...' అనే శ్లోకంలోని శక్తియు ఈమెయే. అప్పుడు కొంతమందికి 'ఏమిటీ, మన ఎదురుగుండా రక్తమాంసములతో ప్రత్యక్షంగా నిలబడివున్న ఆమె ఒక దేవతా!' అనే అనుమానం కలిగి మళ్లీ శ్రీఅరవిందులను ప్రశ్నించగా ఆయన 'అవును' అని మళ్లీ నొక్కి వక్కాణించి వారి సంశయాల్ని తీర్చారు. ఇంకా కొన్ని వందల ఉత్తరాల ద్వారా శ్రీమాతను గురించిన అనేక విశేషాలను తెలియజేసారు. సూచనాప్రాయంగా కొన్ని వివరాలను మాత్రమే ఈ సంచికలో మీకందిస్తున్నాము. చివరి భాగంలో ఆమె సంగ్రహజీవితాన్ని కూడ పొందుపరచాము.

సంపాదకుడు

శ్రీఅరవిందుల ప్రవచనములు:

శ్రీమాత – దివ్యశక్తి

ఈశ్వరుడు కైలాసంలో వుంటాడంటారు. ఆయన యోగనిద్రలో వుంటాడు. ఈ సృష్టి తతంగాన్నంతా నిర్వహించేందుకు ఆయన ఒక 'శక్తిని' సృష్టిస్తాడు – తనకీ సృష్టికీ మధ్యవర్తన్న మాట. ఆ శక్తి కూడ తన కర్తవ్యపాలనకోసం అనేక భంగిమలను తాలుస్తుంది. దేవతారూపాలను సృష్టిస్తుంది. అనేక చేతనారీతులు, తరతమ భావములన్న మాట. ఈ విధంగా ఆమె కొన్ని దివ్యలక్షణాలతో అలరారుతూ వుంటుంది. ఆ లక్షణాలేమిటో మన మానవభాషలో తెలిపే ఓ చిన్న పుస్తకమే 'The Mother'. అందులోంచి కొన్ని భాగాలను మీ కందిస్తున్నాము.

– సంపాదకుడు

ఆమె యెవరు?

మనం శ్రీమాతగా ఆరాధించే వ్యక్తి సమస్తమైన సృష్టిని అధిష్టితమైవున్న దివ్యచైతన్యము (శక్తి). ఏకమే అయినప్పటికి బహుముఖి. ఆమె అనంతకోటి విన్యాసములు ఎంతటి సూక్ష్మబుద్ధికైనను, అఖండ మేధాసంపన్నుకైననూ అంతుబట్టునవి కావు. ఆమెయే పరమాత్ముని చైతన్యము, ఆయన శక్తి. తాను చేసిన సృష్టికి, సృష్టించిన జీవులకు అతీతంగా వుంటుంది. కాని తన బిడ్డలకోసం తనను తాను కుంచించుకొని పరిమితమైన దేవతారూపాలను తాలుస్తుంది. ఆ రూపములలో మానవులామెను దర్శించగలరు. ఆమెను గురించి తెలుసుకోగలరు.

ఆమె త్రివిధ స్థాయిలు

ఈ విశ్వానికి, మనకు ఆధారభూతమైన చేతనాశక్తితో ఐక్యానుభూతిని పొందినపుడు (విశ్వాతీతము, విశ్వగతము, వైయక్తికము – transcendental, universal and individual) శ్రీమాతయొక్క త్రివిధావస్థలను గురించి మనం తెలిసికొనగలుగుతాము. విశ్వాతీతమైన ఆద్యశక్తిగా ఆమె లోకాలకావల నిలిచి, ఈ సృష్టిని బ్రహ్మతో

అనుసంధిస్తుంది. విశ్వగతమైన మహాశక్తిగా ఆమె ఈ ప్రాణుల న్నింటిని సృష్టించి, భరించి, వాటిలో ప్రవేశించి, వీటికాధారభూతంగా వుంటూ, లక్షలాది కార్యాలను శక్తులను నిర్వహిస్తుంది. వైయక్తికరూపంలో ఈ రెండు అఖండశక్తులను ధరించి వాటిని మనకు సన్నిహితము చేస్తుంది. మానవవ్యక్తిత్వానికి, దివ్యశక్తికీ నడుమ మధ్యవర్తిగా అలరారుతుంది.

వివిధ రూపముల ధర్మములు

విశ్వాతీత మూలశక్తియైన మాత సకల లోకాలకు ఆవల నిలిచి తన సత్యచేతనలో పరాత్పరుని వహించియున్నది. ఆవిర్భవింపనున్న సత్యాల నిలయమైన పరాత్పరశక్తికి, అనిర్వచనీయమైన దివ్యసన్నిధికి ఆమె ఆశ్రయ మొసగును. ఆ దివ్య సత్యాలను వాటి రహస్య స్థావరాలనుండి క్రిందికి (తన అనంత చేతనాకాంతిలోనికి) కొనితెచ్చును. తన సర్వశక్తికి, అపరిమితమైన దేహప్రాణశక్తులకు నిలయమైన ఈ విశ్వంలో తాను పైనుండి కొనివచ్చిన సత్యాలకు శక్తివంతములైన రూపాలను కల్పించును. అమ్మయందు పరమాత్మ శాశ్వతసచ్చిదానందరూపంలో ఉంటాడు. తర్వాత ఆమె ద్వారా లోకాల్లో శివ-శక్తి, పురుష-ప్రకృతి, అనే ద్వంద్వచేతనతో కూడిన తత్త్వములలో వ్యక్తమౌతాడు. అనేకానేక లోకాల్లో, భూమికల్లో, దేవతల్లో, వారి శక్తుల్లో ఆమెచేత రూపు ధరించబడినందున ఆయన మనకు దృగ్గోచరుడవుతాడు. మనకు తెలిసిన, తెలియని లోకాల్లో అంతటా ఆమెయే వున్నది కనుక అలా జరుగుతుంది. ఇదంతా కూడా ఆమె ఆ పరాత్పరునితో ఆడే ఆటయే. ఆమె చేసే అనంతుని రహస్యశక్తులయొక్క అద్భుతాల ప్రకటనయే. అంతయూ నామెయే. ఎందుకంటే అంతా కూడ దివ్య చేతనాశక్తియొక్క భంగిమలే.

ఇక్కడ కానీ, మరెక్కడ కానీ ఆమె నిర్ణయించేదీ, పరాత్పరుడు అనుమతించేదీ తప్ప మరేదీ వుండజాలదు. ఆమె సృష్టి ఆనందహేలలో పరాత్పరుడు విత్తిన బీజం ఆమె దోహదక్రియచే అంకురించి రూపుదాల్చును. అలా కానిచో సృష్టిలో ఏదియూ రూపదాల్చ వీలుకాదు.

వైశ్వాన్వయ మహాశక్తి విన్యాసములు

జగన్మాతయైన మహాశక్తి, పరాత్పరుని నుండి తన విశ్వాతీతచేతన చేత వెలువరింపబడిన దానిని – దేనినైనను కార్యరూపంలో, నిర్వహించును. తద్వారా ఈ లోకాల సృష్టికార్యం కొనసాగును. అంతనామె తాను నిర్మించిన లోకాల లోనికి ప్రవేశించును. ప్రవేశించుటతో ఆమె దివ్యసన్నిధి, ఆయా లోకాలను, దివ్యశక్తి, దివ్యపోషకశక్తి, దివ్యానందములతో నింపి వాటికి ఆధారభూతమై నిలుచును. అలాంటి దివ్యజనని సన్నిధి ప్రభావమే లేకపోతే ఎలాంటి సృష్టికార్యమునకు ఉనికి వుండ జాలదు.

మనం ప్రకృతి అని పిలిచేది ఆ జగన్మాతయొక్క బాహ్య నిర్వహణ ప్రక్రియాత్మకరూపం. ఆమె ప్రకృతి పద్ధతులను, కదలికలను సామరస్యపూర్వకంగా ఏర్పాటుచేస్తుంది. అంతేగాక ప్రకృతికార్యాలకు ప్రేరణ కలిగించి ముందుకు నడిపిస్తుంది. ఆయా లోకాల మధ్య ఆమె రహస్యంగా తిరుగాడుతుంది. మన దృశ్యజగత్తులోను, అనుభవ జగత్తులోను ఆ తల్లి ఆవిర్భవిస్తుంది. లేదా జీవితగమనానికి ప్రేరణం కలిగిస్తుంది.

(*SABCL* Vol. 25, pp. 19-21)

అనువాదం: బి. నరసింహాయ్య

There is nothing that is impossible to her who is the conscious Power and universal Goddess all-creative from eternity and armed with the Spirit's omnipotence. All knowledge, all strengths, all triumph and victory, all skill and works are in her hands and they are full of the treasures of the spirit and of all perfections and siddhis.

Sri Aurobindo

(*Synthesis of Yoga*, p. 752)

శ్రీమాత అవతార ప్రయోజనము

శ్రీమాత జీవితమంతా ఈ భూలోకంతోడే ముడిపడి వున్నది. దీనిని పరివర్తింపచేయుటమే ఆమె కర్తవ్యము. భూలోకంతో తాదాత్మ్యము చెంది దాని తరఫున ప్రార్థించి ఆకాంక్షించి చీకటి శక్తులతో పోరాడి, భూలోకజీవితాన్ని పరివర్తింపజేయగల దివ్య జ్యోతినిక్కడికి తీసుకొనివచ్చుటయే ఆమె కర్తవ్యము. ఆమె దేహమును వదిలేసిన తరువాత కూడ సూక్ష్మరూపంలో ఈ భూలోకంలోనే వుండి మన సమీపంలోనే తిరుగుతూ తన కార్యానికెట్టి ఆటంకము లేకుండ నిర్వహిస్తూనే వున్నది.

– సంపాదకుడు

అతిమానసము (Supramental) ను క్రిందికి తీసుకొనివచ్చుటయే శ్రీమాత అవతారోద్దేశము. అతిమానసము దిగివచ్చినప్పుడే ఆమె యొక్క పూర్ణాభివ్యక్తి సాధ్యము కాగలదు.

*

పార్థివచైతన్యము అతిమానసాన్ని స్వీకరించుటకు, ఆమె శరీరధారణ ఒక గొప్ప అవకాశము. అది సాధ్యమగుటకు ఆమె రూపాంతరీకరణము (transformation) కూడ అవసరమే. అనంతరము ఇంకా ఎక్కువ మార్పులు రానున్నవి. అయితే భూలోకచైతన్యమంతా ఒకేసారి అతిమానసీకరింపబడదు. అదివరకు మనస్సును ప్రకటిస్తూ మనిషి ఎలా పుట్టేడో అలాగే ఇప్పుడు అతిమనస్సుని ప్రకటిస్తూ ఒక నూతనజాతి ఆవిర్భవిస్తుంది.

*

వ్యక్తిలోను, విశ్వంలోను, ఈ రెండింటికి అతీతంగా కూడ పని చేసే మహాశక్తి ఒకటి వుంటుంది. ఆ శక్తే శ్రీమాత. కాని ప్రస్తుతం ఈ లౌకికప్రపంచంలో ఇంతవరకూ వ్యక్తముకాని ఒకానొక తత్త్వమును క్రిందికి తీసుకొనివచ్చి ఈ జీవితమును పరివర్తింపజేయుటకై ఆమె పనిచేయుచున్నది. ఈ విధంగా పనిచేసే దివ్యశక్తియే శ్రీమాత – ఆమె సశరీరరూపము. ఆమె చైతన్యము మట్టుకు

భగవంతుని అన్ని స్తరములలోను, తరతమ స్థాయిల్లోను వ్యాపించి వుంటుంది.

*

పరిణామప్రక్రియ మనిషితో అంతం కాదు. మనస్సే దాని మకుటం కాదు. అతిమానసపరిణామము (The Supramental change) ఈ భూలోకచైతన్యంలోని అనివార్యమైన అంశము. అది దైవశాసనము. దానికాదేశము పైనుంచి రావాలి. ఇక్కడ క్రియాశీలము కావాలి. స్థిరపడాలి. ఈ మార్పుకు నాంది క్రిందినుండి పైకెగసే పిలుపు, పైనుంచి క్రిందికి దిగివచ్చే దివ్యజ్యోతి. ఆ జ్యోతిని మనిషి గుర్తించగలగాలి. ఆ మార్పుకు అంగీకరించాలి. మనిషి పిలుపుకు, పరమాత్ముని అనుగ్రహామునకు శ్రీమాతయే మధ్యవర్తి. అందుకు సమర్థవంతురాలు. మూతను తొలగించి, ఆచ్ఛాదనమును ఛేదించి పాత్రను తయారుచేయుట మానవమాత్రున కతీతమైన విషయము. ఒక్క శ్రీమాత శక్తియే ఆ బృహత్కార్యమును సాధించగలదు. అజ్ఞానము, అసత్యము, దుఃఖము, మృత్యువులతో నిండిన ఈ లోకములోనికి జ్ఞానమును, సత్యమును, దివ్యజీవనమును, అమరానందమును తీసుకొని రాగలదు.

*

విశ్వకార్యమును శ్రీమాత దాని ధర్మానుసారంగా నిర్వహిస్తుంది కాని ఇప్పుడామె మానవుల విషయంలో ప్రత్యేకమైన శ్రద్ధ చూపిస్తోంది. ఎందుకని? అని ఎవరో అడిగారు. విశ్వమహాశక్తి విశ్వాన్ని దాని ధర్మం ప్రకారం నడిపిస్తుంది కాని ధర్మాన్ని అతిక్రమించి దుమకాల్సి వచ్చినప్పుడు, ప్రత్యేకమైన పరివర్తనాన్ని చేయవలసి వచ్చినపుడు దైవమే అవతారమెత్తి ప్రత్యక్షంగా కలగజేసుకుంటుంది. అందుకై మూర్తీభవించివచ్చిన అనుగ్రహామే శ్రీమాత.

(*SABCL* Vol. 25, pp. 48, 49-50, 40-41)

అనువాదం: ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

దివ్యమాత – సాధన

శ్రీమాత మూర్తీభవించిన దివ్యశక్తి. ఆ మహాశక్తికి చేతకానిదేమైనా వుంటుందా? సాధన ఎలా చేయాలో నీకు తెలియకపోవచ్చు. ఏం పరవాలేదు. నువ్వు మదర్‌ను గురించి తల్చుకుంటే చాలు. నిన్నామె కప్పచెప్పుకోవాలి అంతే. ఎంత గాఢంగా నువ్వామెకు సమర్పించుకుంటె అంత తీవ్రంగా నీ సాధన కొనసాగిపోతుంది. ఇక నీ మనస్సుతో కుస్తీ పట్టవలసిన పనిలేదు. నువ్వు నీ సొంతాలోచనలను చేయటం మానేసినప్పుడు ఆమెయే నీకవసరమైన జ్ఞానాన్ని కలిగిస్తుంది. నీకు మార్గాన్ని చూపిస్తుంది. నిన్ను చేయి పట్టుకుని నడిపిస్తుంది కూడ.

– సంపాదకుడు

ఈ భూమ్మీద జన్మ యెత్తిన ప్రతి మనిషి అజ్ఞానమయ జీవితాన్ననుభవించి తద్వారా తన నిజరూపమును (ఆత్మను) కనుగొని, దైవాని కభివ్యక్తియై, దైవకార్య నిర్వహాణమునకు ఉపకరణముగా తయారవుతున్న శ్రీమాత అంశయే.

*

ఈ విశ్వములో ఏది జరిగినను దానిని దేవుడే తన శక్తి ద్వారా జరిపించును. కాని అతడు యోగమాయచేత కప్పబడి వున్నందున అపరాప్రకృతిలోని జీవాహంకారము ద్వారానే పనిచేయును.

యోగమునందు కూడా సాధకుడు, సాధనము దేవుడే. ఆయన శక్తియే తన ప్రకాశము, సామర్థ్యము, జ్ఞానము, చైతన్యము, ఆనందములతో ఆధారకేంద్రముపై పనిచేసి అది తెరుచుకొనగానే దానిని ఈ దివ్యశక్తులతో నింపి సాధకునకు అవకాశము కలిగించును. అపరాప్రకృతి సాధకునిలో పనిచేయుచున్నంతవరకు అతని వ్యక్తిగతప్రయత్నము అవసరమగును.

సాధకునిలో శరణాగతి, ఆత్మసమర్పణము అభివృద్ధి చెందుచున్న కొలది తనలోని దివ్యశక్తియే తన సాధనను జరిపించుచున్నదని అతనికి తెలిసిపోతుంది. ఆమెయే స్వశక్తులన్నింటిని

సాధకుని లోనికి ప్రసరింపజేయుచూ దైవీప్రకృతి లక్షణములైన స్వేచ్ఛాతత్వము, పరిపూర్ణతలను తనకు ప్రాప్తింపజేయుచున్న దని సాధకునికి తెలుస్తుంది. అతనిలో దివ్యశక్తి జరిపించు ఈ సాధనాప్రక్రియ అతని వ్యక్తిగత ప్రయత్నమునకు బదులుగా త్వరితగతిని కొనసాగినప్పుడు అతని అభివృద్ధి వేగము పుంజు కొనును. అయితే సాధకుడు సంకోచరహితముగాను, సంపూర్ణ ముగాను శరణాగతి, ఆత్మసమర్పణము గావించువరకు అతని వ్యక్తి గత ప్రయత్నము తప్పనిసరి.

*

సాధకుని నుండి దివ్యమాత అభిలషించునవి మూడు. అవి ఆకాంక్ష (అంతరంగమునుండి పిలుపు), నిరాకరణము, శరణా గతి. ఇవి మూడును సాధకుడు కలిగియున్నచో దివ్యమాత అనుగ్రహామువలన మిగిలినవన్నియు సమకూర్చబడి ఆమె శక్తియే అతనిలో పనిచేయ మొదలిడును. ఈ మూడింటిలో శరణాగతియే అతిముఖ్యమైనది. అది కుదురుటకు దివ్యమాత యెడల విశ్వా సము, నమ్మకము, కష్టసమయములలో సహనము అవసరమ గును. ఆకాంక్ష లేనిదే విశ్వాసము, సహనము ఉండకూడదనే నియమము, నిబంధనా లేవు. జడత్వమువలన ఆకాంక్ష (అంత రంగము నుండి పిలుపు) లేకపోయినను, విశ్వాసము, ధైర్యము కార్యసఫలతకు తోడ్పడగలవు. ఒకవేళ విశ్వాసము, ధైర్యము సన్నగిలి ఆకాంక్ష నిద్రాణమైయున్నచో సాధకుడు స్వప్రయ త్నము మీదనే ఆధారపడుచున్నాడని అర్థమగును. – అనగా అతడు "అయ్యో! ఆకాంక్ష నాలో లోపించినదే. ఇక నా ఆశ అడుగంటినట్లే. నాకు ఆకాంక్షే లేనప్పుడు ఇక దివ్యమాత మట్టుకు ఏమి చేయగలదు?" అని వాపోవుచున్నాడని భావము. అలా కాకుండా, సాధకుడు, "ఏం ఫరవాలేదులే, ఆకాంక్ష (పిలుపు) మరల వచ్చును అనే నమ్మకంతో వుండాలి. ఈలోగా దివ్య మాతానుభవము ప్రస్తుతము నాకు లేకపోయినను ఆమె నాతోనే వున్నదని నాకు తెలుసు, ఆమె గడ్డుసమయములలో నన్ను తప్పక ఆదుకొనును" అని అనుకుంటూ వుండాలి.

నిజమైన శరణాగతి – నీవు నీ ప్రయత్నమును సహితము దివ్య మాతకి సమర్పించుకొనుట ఒక్కటే అతిమానసయోగములో విజయానికి సాధనము. ఒక యోగి కాని సన్యాసి కాని, తపస్వి కాని అగుట మన లక్ష్యము కాదు. పరివర్తనే సాధకుని ముందున్న లక్ష్యము. దానిని నీ స్వశక్తివలన సాధించలేవు. అది దివ్యమాత యొక్క అనంతశక్తిసామర్థ్యములవలననే సంభవించగలదు. నీవు నిజముగా దివ్యమాత చేతులలో ఒక శిశువుగా మారినప్పుడే పరివర్తన సాధ్యమగును.

(*SABCL* Vol. 25, pp. 79, 6-8, 135, 129)

అనువాదం: డా॥ కె. వేంకటేశ్వరరావు

The power of the divine universal Shakti which is behind our aspiration is illimitable, and when it is rightly called upon it cannot fail to pour itself into us and to remove whatever incapacity and obstacle, now or later;...

*

This force we feel in ourselves also, but we can feel it too around us and above, one with the same energy in us, and can draw it in and down to aggrandise our normal action or call upon and get it to pour into us.

Sri Aurobindo

(*Synthesis of Yoga*, pp. 752, 727)

శ్రీమాత ప్రవచనములు:

కొన్ని జీవిత విశేషాలు

ఆధ్యాత్మిక గురువులు కూడ మొదట సాధారణ మానవులే. వారికి జ్ఞానోదయము ఎప్పుడెలా జరిగిందో తెలుసుకోవాలని ఉంటుంది. శ్రీమాతకు బాల్యంలోనే తనేదో గొప్ప కార్యము నిర్వహించవలసి వుంటుందని తెలిసింది. ఆమె పుట్టిందీ పెరిగిందీ ఐరోపాలో అయినప్పటికి తను భారతదేశానికే చెందాననే స్ఫూర్తి కలిగి ఉండేది. స్వప్నంలో అనేకమంది గురువులు కనపడి ఆమెకు ఉపదేశము చేస్తూ వుండటం విశేషం.

— సంపాదకుడు

పృథ్వి ఆవిర్భవించినది మొదలు ఎక్కడ ఏ కొద్ది చైతన్యఛాయలు కనిపించినా అక్కడ నేనున్నాను.

భూమ్మీద నేను నిర్వహించవలసిన కార్యాన్ని గురించి నేను ఎప్పుడు ఎలా తెలుసుకున్నాను? ఎప్పుడు ఏ విధంగా శ్రీఅరవిందులను కలుసుకున్నాను?

నీవడిగిన రెండుప్రశ్నలకూ క్లుప్తంగా సమాధానం యిస్తాను. నేను నెరవేర్చవలసిన మహాకార్యాన్ని గురించిన స్పృహ నాకెప్పుడు కల్గిందో చెప్పటం కష్టమే. నేనా జ్ఞానంతోనే జన్మించినట్లుగా ఉంది. నా బుద్ధి, మేధస్సు పెరగటంతోబాటు ఆ కార్యస్వరూపం, అవగాహన పెరిగి ఉంటాయి.

నా పదకొండో ఏటి నుంచీ పదమూడో ఏటివరకూ నాకు అనేకమైన అనుభూతులు కలిగాయి. చైత్యాత్మక, ఆధ్యాత్మిక అనుభవాలవల్ల దేవుని ఉనికి తెలియడమేకాకుండ, ఆయనను స్థిరచరావస్థలలో సమగ్రంగా సాక్షాత్కరింపచేసుకోవచ్చునే విషయాన్ని తెలుసుకున్నాను. ఆ పరమాత్మునితో ఐక్యమవడంకూడా సంభవమేననే జ్ఞానం కూడా కలిగింది. అంతేకాక ఈ భూమ్మీద దివ్యజీవనాన్ని స్థాపించి తద్వారా ఆ దైవాన్ని ఇక్కడే సుప్రతిష్ఠం చేయవచ్చని కూడా తెలిసింది. దీన్ని సిద్ధింపచేసుకోవడానికి

అవసరమైన ప్రత్యక్ష శిక్షణాక్రమాన్ని కూడా నిద్రలో అనేక మంది గురువులు నాకు బోధ చేసారు. ఆ గురువులలో కొంద రిని ప్రత్యక్షంగా దర్శించుకునే భాగ్యం కూడా ఆ తర్వాత కలి గింది.

కొంతకాలం గడిచాక క్రమంగా అంతర్గతంగానూ, బాహ్యం గానూ నా అభివృద్ధి కొనసాగుతున్నప్పుడు వీరిలో ఒకరితో నా చైత్యాత్మక, ఆధ్యాత్మిక అనుబంధం నానాటికీ స్పష్టమై వృద్ధి పొందసాగింది. అప్పట్లో నాకు భారతీయ మతతత్వజ్ఞానాన్ని గురించి తెలిసింది చాలా స్వల్పమే అయినా ఎందుకో ఆయనను 'కృష్ణ' అని పిలవాలనిపించింది. నేను నిర్వహించవలసిన దైవ కార్యం వారితోనే ముడిపడి ఉన్నట్లు అర్థమైంది. ఏదో ఒకరోజు వారిని ప్రత్యక్షంగా కలుసుకుంటానని కూడా అనిపించింది.

1910 లో నా భర్త పాండిచ్చేరి వచ్చి అసాధారణపరిస్థి తుల్లో శ్రీఅరవిందులతో పరిచయం సంపాదించుకున్నారు. అప్ప ట్నుంచీ మా ఇద్దరికీ కూడా భారతదేశం వచ్చేయాలనే తపన ప్రారంభమైంది. ఆ భారతదేశాన్నే చిన్నప్పట్నుంచీ కూడా నా మాతృదేశంగా ఊహించుకునేదాన్ని. చివరకు 1914 లో మాకు భారతదేశం వచ్చే భాగ్యం కలిగింది.

పాండిచ్చేరి వచ్చి శ్రీఅరవిందులను చూసి చూడగానే ఆయ నను నాకు బాగా పరిచయమున్న నా కృష్ణునిగా గుర్తించాను. భారతదేశమే నా కార్యాచరణకు స్థానమనీ, వారి సన్నిధిలోనే నా ఉనికి అనే విశ్వాసం నాకు కలిగిందని చెప్పటానికి ఇది చాల నుకుంటాను.

పాండిచ్చేరి, 1920.

*

21 ఫిబ్రవరి 1968 (శ్రీమాత 90 వ జన్మదినం)

కొన్ని చిరుస్మృతులు

నేను శ్రీఅరవిందులను కలుసుకోటానికే భారతదేశం వచ్చాను. శ్రీఅరవిందులతో కలిసి పనిచేయడం కోసం భారత

దేశంలో ఉండిపోయాను. వారు దేహత్యాగం చేశాక వారి కార్య నిర్వహణకోసమే – సత్యాన్ని సేవించి, మానవాళిని ఆధ్యాత్మిక సంపన్నులుగా చేసి – భువిపై దివ్యప్రేమసామ్రాజ్యాన్ని స్థాపించే కార్యక్రమాన్ని శీఘ్రతరం చేయుటకే ఇక్కడ నా జీవితాన్ని కొనసాగించాను.

(CWM Vol. 13, pp. 37-39, 45)

అనువాదకులు: ఎ. ప్రభావతి, ఎ. వెంకటరామ శాస్త్రి

తల్లీ ఎక్కడున్నావు?

(అమ్మ జవాబులు)

ప్రశ్న: అమ్మా నేనేం చెయ్యాలి? నేను పూర్తిగా చైతన్యాన్ని కోల్పోయాను. తల్లీ ఎక్కడున్నావు?

జవాబు: నీ చైత్యపురుషస్థానంలో (psychic being) ఉన్నాను. ఎల్లప్పుడూ అక్కడే వుంటాను. అక్కడే నువ్వు నన్ను కనుగొనగలవు – కనుగొని తీరాలి. నువ్వు ఎప్పుడైతే నీ గుండె లోతుల్లో నన్ను చూడగలవో అప్పుడు నా బాహ్యరూపంలో కూడా నన్ను గుర్తించగలవు.

*

ప్రశ్న: "నేను నీతో వున్నాను" అనే వాక్యానికి అర్థం ఏమిటి?

జవాబు: నేను నీతో వున్నాను. ఎందుకంటే నేనే నువ్వు, నువ్వే నేను. నేను నీతో వున్నాను అంటే అది ఎన్నో వాస్తవాల సమాహారం. మహోన్నతచైతన్యశ్రేణినుండి నా భౌతికచైతన్యంవరకు సమస్తభూమికలలోనూ, సమస్తశ్రేణులలోనూ నేను నీతో వున్నాను. నీకు తెలుసా శ్రీఅరవిందులు ఆశ్రమంలో ప్రతిమూలా ఈ విధంగా వ్రాయించి పెట్టారు – "నిరంతరం అమ్మ నిన్ను గమనిస్తున్నట్లుగా ప్రవర్తించు – ఎందుకంటే ఆమె నిత్యమూ నిజంగానే ఉన్నది". ఇవి లాంఛనంగా అనే వట్టి మాటలు కావు – సత్యము. అత్యంత

యథార్థమైన రీతిలో నేను నీతో వున్నాను. సూక్ష్మదృష్టిగలవారు నన్ను చూడగలరు కూడ.

భగవంతుడు నీ ఆకాంక్ష ప్రకారం నీతో వుంటాడు. అయితే నీ కళాకళలకు ఆయన తలవంచుతాడని దీని అర్థం కాదు. నేను నీ నైజాన్ని గురించి చెప్తున్నాను. కాని అప్పుడప్పుడు నీ బాహ్య ఆకాంక్షలను కూడ ఆయన పాటించవచ్చు. భక్తుల లాగే నువ్వు సంయోగవియోగాలలోనూ, ఆనందవిషాదాలలోనూ జీవిస్తుంటే, భగవంతుడు కూడా నిన్నులాగే మభ్యపెట్టవచ్చు. నీ విశ్వాసం ఎలా వుంటుందో ఆయన రూపం కూడ అలానే వుంటుంది. అందువల్ల భక్తుల వైఖరి చాలా ముఖ్యం. బాహ్య వైఖరి అయినా సరే. విశ్వాసం ఎంత ముఖ్యమో, విశ్వాసం ఎంతటి అద్భుతమో, ఎంతటి అద్భుతాలు సృష్టిస్తుందో ఎవ్వరికి తెలియదు. 'భగవంతుడు నన్ను తప్పక తన వైపునకు సముద్ధరిస్తాడు, లాక్కొంటాడని' ప్రతి క్షణం నువ్వు కనక భావిస్తే, నిన్ను ఉద్ధరించడానికి ఆయన తప్పక వస్తాడు. *సన్నిహితంగా, ఇంకా సన్నిహితంగా, మరింత సన్నిహితంగా నిత్యం ఆయన నీతో వుంటాడు.*

*

ప్రశ్న: 'అమ్మా! నిన్ను నా గుండెలో పట్టి బంధిస్తాను.'

జవాబు: నువ్వు ఎక్కువ దూరం వెళ్లనక్కర్లేదు. నేను నీ గుండెలోనే వున్నాను. నీ కన్నులు తెరుచుకోగానే నన్ను నువ్వు అక్కడ చూడగలవు. నీ తలపులన్నింటినీ నీ అంతరాంతరాలలోకి త్రిప్పు. వాటిని బయటకు పోనివ్వకు. నువ్వు చలి, వేడి ఎలా అనుభవిస్తావో, అలాగే నా సాన్నిధ్యాన్ని అంత యథార్థంగా అనుభవించగలవు.

*

ఓ ప్రియజననీ, నీకు నా ప్రణామాలు. నాలో నిత్యం భాసిస్తూ వుండు.

నేను నిత్యం నీతోనే వుంటాను. అయితే నన్ను పిలవడం మాత్రం మరిచిపోవద్దు. అలా పిలవడంవల్లనే నేను ప్రత్యక్షమై, క్రియాశీలమవుతాను.

(*CWM* Vol. 17, pp. 68, 13, 75-78; Vol. 16, pp. 92, 44-45)

అనువాదం: కె. యజ్ఞన్న

భువిపై అతిమానసావతరణ

(మాతృశ్రీ మంత్రవాక్కులు)

అమ్మ డైరీ "ప్రార్థనలు, ధ్యానములు" నుండి

సెప్టెంబరు 25, 1914

ఓ దివ్య ఆరాధ్య జననీ, నీ సహాయం వుంటే అసంభవం అంటూ ఏముంటుంది? మా తపస్సు ఫలించే దివ్యముహూర్తం దగ్గర పడుతోంది. భగవదేచ్ఛ సంపూర్ణంగా నెరవేర్చడానికి సహాయం చేస్తానని నువ్వు వాగ్దానం చేశావు.

ప్రభువు సంకల్పించాడు. నువ్వు నెరవేరుస్తావు.
ఒక కొత్త కాంతి పుడమిపై ఉదయిస్తుంది.
ఒక కొత్త ప్రపంచం సృష్టించబడుతుంది.
అదివరకు చేసినవాగ్దానాలు తీర్చబడతాయి.

*

1956 లో అమ్మ ఒక విషయాన్ని రాసిపెట్టి, 1960 ఫిబ్రవరి 29 న సందేశంగా పంపిణీ చేశారు. ఆ ప్రకటన ఇది:

1956 ఫిబ్రవరి 29
బుధవారం నాడు సామూహిక ధ్యానం.

ఈ సాయంత్రం దివ్యమూర్తి మీ మధ్య భౌతికంగా ప్రత్యక్షమైనాడు. నేను విశ్వంకన్నా పెద్దదైన సజీవ హిరణ్మయరూపాన్ని ధరించాను. భగవంతుని నుండి ప్రపంచాన్ని వేరుచేస్తున్న

ఒక బ్రహ్మాండమైన బంగారు ద్వారానికి[1] అభిముఖంగా నిలబడి వున్నాను.

ఆ బంగారు ద్వారంవైపు చూస్తూ, చైతన్యం పొంగిపొరలగా "*సమయమాసన్నమైనదని.*"[2] గ్రహించి, రెండుచేతులతోను ఒక బ్రహ్మాండమైన బంగారు సమ్మెటను పైకెత్తి, ఆ తలుపును ఒకే ఒక దెబ్బ కొట్టాను. అంతే ఆ తలుపు వెంటనే పటాపంచలై పోయింది.

అప్పుడు అతిమానస కాంతి, శక్తి, చైతన్యాలు అవిచ్ఛిన్న ప్రవాహంగా భూమ్మీదికి కుండపోతగా కురిసినయి.

*

1956

ఫిబ్రవరి 29 – మార్చి 29

ప్రభూ, నువ్వు సంకల్పించావు, నేను నెరవేరుస్తాను:
పుడమిపై ఒక కొత్త కాంతి ప్రభవించింది.
ఒక కొత్త ప్రపంచం అవతరించింది.
వాగ్దానాలన్నీ సఫలీకృతమైనవి.

*

దివ్యజీవనం కోసం ఆకాంక్షించే వారందరికీ ఓ సందేశం.

మీరా నూతనశక్తి వైపు ఉన్మీలనమవండి; దానిని మీలో పరివర్తనా ప్రక్రియను నిర్వర్తించనీయండి.

(CWM Vol. 1, p. 249; Vol. 15, pp. 102-104)

అనువాదం: కె. యజ్ఞన్న

---

[1] బంగారు ద్వారం – హిరణ్మయ పాత్రేన సత్యస్యాపి హితం ముఖం (ఈశావాస్యోపనిషత్)

[2] "సమయ మాసన్నమైనది" అనే వాక్యం గమనార్హం. ఆ మాటలు మాతృశ్రీకి ఆంగ్లంలో వినిపించాయి. శ్రీఅరవిందుల నుండి ఆ మాటలు వచ్చినట్లు గ్రహించాలి. అందుకే ఆ మాటలు మాత్రం ప్రత్యేకించి quotations లో పేర్కొనడం జరిగింది.

శ్రీమాత జీవితము (1878-1973)

శ్రీమాత ఫిబ్రవరి 21, 1878 న పారిస్ నగరములో జన్మించారు. ఆమెకు మీరా అని నామకరణం చేశారు. తండ్రి మారిస్ ఆల్ఫాసా టర్కీ దేశస్థుడు, బ్యాంకరు, తల్లి మేథిల్డా ఇస్మలూన్ కైరో నగరానికి చెందినామె. మీరా జన్మించటానికి ఒక సంవత్సరం ముందే ఆమె తల్లితండ్రులు పారిస్ వచ్చి స్థిరపడ్డారు. మీరా బాల్యం పారిస్ నగరంలోనే గడిచింది.

బాల్యము

తానొక కారణజన్మురాలననే స్పృహ మీరాకి బాల్యంనుంచే ఉండేది. నాల్గవ యేటనుంచే ధ్యానం, యోగాభ్యాసం చేసేవారు. ప్రత్యేకమైన తన చిన్న కుర్చీలో నిశ్చలంగా కూర్చొని ధ్యానం చేసేవారు. అప్పుడు ఒక కాంతిపుంజము పైనుంచి దిగి వచ్చి శిరస్సును స్పృశించి మనస్సులో తాండవించేది. తనకైతే ఏమీ తెలిసేదికాదు. తెలిసే వయసూ కాదు. క్రమేపీ ఈ లోకంలో తాను మరెవ్వరికీ తెలియని ఒక మహత్కార్యమేదో చేయవలసి ఉన్నదనే భావన కలిగేది. ఏయే శక్తులు తనపై పనిచేస్తూ ముందుకు నడిపిస్తున్నాయి? అంతరంగ స్వచ్ఛత, స్వేచ్ఛ ఎలా సిద్ధింపచేసుకోవాలి? ఇవి తెలుసుకునేటందుకు చిన్నవయస్సులోనే తాను కృషిచేసిన వైనం శ్రీమాత ఒకమారు విద్యార్థులతో ప్రస్తావించారు.

ఆధ్యాత్మికానుభూతులు

ఆమె అంతరంగ అనుభవాలు క్రొత్త పుంతలవైపు దారితీశాయి. 11, 13 సంవత్సరాల ప్రాయంలోనే కొన్ని చైత్య (Psychic) ఆధ్యాత్మికానుభూతులు కలిగినవి. భగవంతుడు సాక్షాత్కారించాడు. మానవుడు భగవంతుని తెలుసుకొనే దివ్యచైతన్యాన్ని ఈ భూమిపై అభివ్యక్తమయే అవకాశమున్నదని కూడా ఆమెకు స్పష్టమైంది. అందుకుతగిన శిక్షణను కొంతమంది మహాత్ములు ఆమెకు తన సుషుప్తావస్థలో ఇచ్చారు. వారిలో కొందరిని తర్వాత బాహ్య ప్రపంచంలో కలిసారు కూడా. క్రమేపి తన అంతరంగ వికాసంతోబాటు ఒక మహాత్మునితో తన ఆత్మానుబంధం తరచు స్పష్ట

మౌతూండేది. మీరాకి ఆ రోజులలో భారతీయ మత, ఆధ్యాత్మిక తత్త్వాలతో పరిచయం లేదు. అయినాకూడా ఆమె ఆ మహాత్ముని బొమ్మ వేసుకొని ఆయనను 'కృష్ణ' అని పిలుచుకుంటూ, ఏదో ఒకనాడు ఈ భూమిమీద ఆయనను చూడగలననే దృఢ నమ్మకంతో ఉండేది.

చిత్రకళాభ్యాసము

ప్రపంచప్రఖ్యాతి గాంచిన భావుక చిత్రలేఖన (Impressionism) కళాకారులకు నిలయమైన పారిస్‌లో శ్రీమాత పెరిగారు. అది మతిసె, మానె, సెజాన్ (Matisse, Manet, Cezanne) మొ॥ కళాకారులు ప్రఖ్యాతి గాంచిన కాలము. కళావైతాళికుల సంస్కృతీ సంప్రదాయ వాతావరణంలో మసలుతూ ఆమె తన చిత్రకళావిద్యను ఎకోల్ ది బూ ఆర్ట్స్ (Ecole des Beax Arts) అను చోట పూర్తిచేసికొన్నారు. ఆమె వేసిన కొన్నిచిత్రాలు సాలన్ (Salon) లో ప్రదర్శింపబడ్డాయి. 19 సంవత్సరాల ప్రాయంలో అక్టోబరు 13, 1897 న విశ్వవిఖ్యాత చిత్రకారుడు గుస్తాఫ్ మోరో శిష్యుడైన హెన్రీ మోరిసె (Henri Morisset) తో వివాహమైంది. ఆగస్టు 23, 1898 న పుత్రోదయం, కుమారుని పేరు ఆంద్రె.

నిరంతర దైవసాన్నిధ్యము

మొదట్లో శ్రీఅరవిందులకు భాష, సాహిత్యం, కవిత్వం, చరిత్రలలో అభిరుచి కాగా, శ్రీమాతకు సంగీతం, చిత్రలేఖన సంగీతనాదులంటే యిష్టం. అంతేగాదు, అవి తన అంతరంగ నిక్షిప్త భావప్రకటనకు సాధనాలు. ఆమె లక్ష్యం భగవదన్వేషణ, ఆత్మసాక్షాత్కారము, ఈ కృషిలో ఆమె ఏకాకి. ఓ పుస్తకమూ లేక ఓ వ్యక్తిద్వారా ఎప్పుడోగాని ఆమెకి కావలసిన సాయం లభించేది కాదు. 18, 20 సంవత్సరాల వయస్సులో ఆమె దైవంతో నిరంతర సాన్నిధ్యాన్ని సాధించారు. ఇందులో ఆమె కెవ్వరినుంచి ఎలాంటి సాయమూ దొరకలేదు. అయితే, వివేకానందుని 'రాజయోగం' ఆమెకి లభించినపుడు దానిని ఒక అద్భుతమైన పుస్తకంగా పరిగణించారు. ఆ ఒకట్టైనను ఆమెకు కొంత వివరించ గలిగినట్లు తెలిసింది. ఎన్ని ఏళ్ల తరబడి కృషిచేసినా పొందలేని

లబ్ధి కొన్నినెలలలోనే ఆమె ఆ పుస్తకం ద్వారా పొందగలిగినట్లు చెప్పారు.

భగవద్గీత అంతరార్థము

తన 21 వ యేట ఆమెకి ఒక భారతీయుని ద్వారా భగవద్గీత లభించింది. అది ఫ్రెంచి భాషలోది, తర్జుమా అంత బాగు లేదు. ఐనా ఆమె తన అవగాహనతో, భారతీయ వేదాంతగ్రంథమైన గీత యందలి యథార్థ సత్యమును గ్రహించింది. శ్రీకృష్ణుని భగవదవతారంగాను, అంతరంగ దైవంగాను భావించి భగవద్గీతను చదవమని ఆ భారతీయుడు ఆమెకు సలహా యిచ్చాడు. శ్రీమాత అతని సలహాను తు.చ తప్పకుండా పాటించి, ఒకనెలరోజులభ్యసించి ఫలితము పొందింది. ఆమెకు శ్రీకృష్ణభగవానుని సన్నిహిత సాక్షాత్కారము లభించింది.

రహస్యవిద్యలలో ప్రావీణ్యము

శ్రీమాతకు గూఢవిద్యంటే (Occultism) యిష్టం. మేక్స్ థియోన్ (Max Theon), ఆయన భార్య ఆల్మా లు ఈ గుప్తవిద్యలో నిపుణులు. 1905-1906 మధ్యకాలంలో వారిని పారిస్‌లో కలుసుకొన్నారు. వారితో ఒకటి లేక రెండుసంవత్సరములు 'ట్లెంసె' (Tlemcen) లో గడిపి క్రమబద్ధమైన శిక్షణలో తన అతీంద్రియజ్ఞానాన్ని ఇతోధికంగా మెరుగుపరచుకొన్నారు.

శ్రీఅరవిందులతో పరిచయము

కొన్ని సంవత్సరాల తర్వాత తన మొదటి వివాహాన్ని రద్దుచేసుకొని ఆమె పాల్ రిచర్డు అనే ప్రఖ్యాత తత్త్వవేత్తను వివాహంచేసుకొన్నారు. ఈయన ప్రాచ్యపాశ్చాత్య ఆధ్యాత్మిక తత్త్వాలతో బాటు భారతీయవేదాంతంపై కూడా ఆసక్తి కలవారు. ఫ్రెంచి రాజకీయాలలో ప్రవేశించాలనే ఆలోచన కలదు. ఫ్రాన్స్ ఎన్నికల ఓట్ల ప్రచారార్థం 1910 లో పాండిచ్చేరి వచ్చారు. అది అప్పటికి ఫ్రెంచి వలసరాజ్యం. అప్పటికే అక్కడికి చేరుకున్న శ్రీఅరవిందులు ఒక గొప్పయోగి అని తెలుసుకొని వారిని కలిశారు. ఫ్రాన్సు తిరిగివెళ్లాక శ్రీఅరవిందులను గురించి మీరాకి

విపులంగా తెలియజేశారు. అప్పటినుంచి ఆ దంపతులు శ్రీఅరవిం దులతో ఉత్తరప్రత్యుత్తరాలు సాగించారు.

అప్పటికే శ్రీమాత భారతదేశంవైపు ప్రబలంగా ఆకర్షితులై దానిని తన మాతృదేశంగా భావించారు. భర్తతో కలిసి 1914 లో భారతదేశ ప్రయాణం కావటంతో ఆమె అభీష్టం నెరవేరింది.

శ్రీఅరవిందులను కలుసుకొనుట

29, మార్చి 1914 న పాండిచ్చేరి చేరుకున్నారు. ఆ మధ్యాహ్నమే రిచర్డు దంపతులు ఫ్రాన్స్వా మార్తి రోడ్డులోని శ్రీఅరవిందుని నివాసంలో, ఆయనతో సమావేశమైనారు. శ్రీమాత కదొక అపురూప సంఘటన. జీవితానికి ఒక ఖచ్చితమైన మలుపునిచ్చే అనుభవం. ఇంతవరకు స్వప్నాలలో తన కగుపిస్తూ, తాను కృష్ణ అని పిలుచుకునేది ఆ మహనీయుడేనని గుర్తించారు. ఇక తన కిదే స్వస్థలమని, తన కార్యక్రమం ఇకనుంచీ ఇక్కడేనని నిశ్చయించుకున్నారు. సమావేశానంతరం ఆమె తన డైరీలో వ్రాసుకున్న మాటలు:

"వేలాది జనులు అజ్ఞానాంధకారంలో మునిగివున్నా ఏం ఫరవాలేదు. ఆయన – నిన్న మేము దర్శించిన వ్యక్తి – భూమ్మీద ఉన్నారు – వారు ఉంటే చాలు ఏనాటికైనా చీకటి వెలుగుగా రూపాంతరంచెందటానికి – దైవం ఏలుబడి ఈ భూమిపై నిజంగానే స్థాపించబడడానికి."

మనస్సు నిశ్శబ్దమగుట

ఇదివరకటి తన ఊహాలు, భావాలు, వదిలిపెట్టి, శూన్యమనస్కయై శ్రీమాత శ్రీఅరవిందులవారిని ఆవాహనం చేసుకొనేటందుకు వారి పాదాలచెంత ఉపవిష్టులైనారు. కొద్దిసేపటికి అనంతమైన నిశ్శబ్దం క్రిందికి దిగివచ్చింది. తన మనసులో స్థిరపడింది. ఈ అనుభవం ఆమె అంతరంగంలో ఒక బలమైన మార్పును తెచ్చిపెట్టింది, "నాకు పునర్జన్మ కలిగి గత విధివిధానాలు, అలవాట్లు ఇక మీదట పనికిరావనిపించింది. ఆ సిద్ధులన్నీ నేటి కోసం సన్నాహం మాత్రమే ననిపించింది. నా గతంతోపాటు నా గెలుపు ఓటములూ నానుంచి జారిపోయినట్లు, ఇంకా ఆకృతిదాల్చని ఒక

క్రొత్తజీవనంకోసం మాయమైనట్లు అనిపించింది. ఒక బ్రహ్మాండ మైన కృతజ్ఞతాభావం నా యెదలో పైకెగసింది. నేనెప్పటినుంచో అన్వేషించే దాని దరికి చేరినట్లనిపించింది."

'ఆర్య' పత్రిక ప్రచురణ

ఆధ్యాత్మిక పత్రిక 'ఆర్య' ప్రచురణలో శ్రీఅరవిందులకు రిచర్డు దంపతులు సహాకరించడం ఆరంభించారు. మొదటి ప్రపంచయుద్ధం సృష్టించిన గందరగోళపరిస్థితుల్లో తలక్రిందులైన ప్రపంచానికి దివ్యదీపికలా 'ఆర్య' సంచిక ఆగస్టు 15, 1914 న శ్రీఅరవిందుల 42 వ జన్మదినమున వెలువడింది. కాని పాల్ సైన్యంలో చేరడానికి పాండిచ్చేరి విడిచి వెళ్లవలసివచ్చింది. శ్రీమాత కూడా ఆయనతో కలిసి ఫిబ్రవరి 22, 1915 న ఆమె పుట్టినరోజు మరునాడు బయలుదేరి వెళ్లారు. ఇక 'ఆర్య' ప్రచు రణభారమంతా శ్రీఅరవిందులు ఒక్కరే భరిస్తూ శ్రీమాతతో ఉత్తర ప్రత్యుత్తరాలు మాత్రం కొనసాగించారు.

జపాను వాసము

ఫ్రాన్సు తిరిగివెళ్లిన దంపతులు అక్కడ ఒక సంవత్సరమే ఉన్నారు. ఈలోగా రిచర్డుకి మిలిటరీసర్వీసునుంచి విముక్తి లభించింది. మార్సైల్సు లండనుల మీదుగా మార్చి 13, 1916 న ప్రయాణమై జూన్ నెలలో ఆ దంపతులు జపాను చేరుకున్నారు. మొదటి సంవ త్సరం టోక్యోలోను మిగిలిన మూడుసంవత్సరాలు క్యోటోలోను వున్నారు. కొన్ని పుణ్యక్షేత్రాలు దర్శించారు. స్వల్పకాలం చైనాలో కూడ వున్నారు. 1919 లో శ్రీమాత రవీంద్రనాథ్ ఠాగూరును జపానులో కలిసినపుడు ఆయన తన విద్యాసంస్థ శాంతినికేతనం నిర్వహించే బాధ్యతను చేపట్టమని కోరగా ఆమె అందుకు అంగీ కరించలేదు. ఆమె భవితవ్యం మరోచోట వున్నదని ఆమెకు తెలుసు.

ఇక తుదిసారిగా ఏప్రిల్ 24, 1920 న శ్రీమాత పాండిచ్చేరి వచ్చేశారు. ఆమెతోకూడా పాల్ రిచర్డు, మరో ఆంగ్లవనిత కుమారి డరోతి హాడ్జ్‌సన్ వచ్చారు. ఈ ఆంగ్లవనిత శ్రీమాతకు ఫ్రాన్సులో పరిచయమైంది. పాల్ భారతదేశములో అనేక ప్రాంతములను

దర్శించిన పిమ్మట అమెరికా వెళ్లిపోయాడు. అచ్చట 'ఆసియా ఖండపు అధ్యయన కేంద్రము' అను ఒక సంస్థను స్థాపించాడు.

శ్రీమాత, ఆంగ్లవనిత కుమారి హాడ్జసన్‌లు మొదట్లో అతిథి గృహాలలో నివాసముండేవారు. నవంబరు 24, 1920 న కుండ పోతవర్షంతో పెద్దతుపాను చెలరేగింది. వీరు ఉండే ఇంటి పైకప్పు కూలిపోయే ప్రమాదం ఉన్నదనే విషయం తెలిసిన శ్రీఅరవిందులు, వీరిని వచ్చి ఫ్రాన్స్వా మార్టి రోడ్డులోవున్న తమ నివాసగృహంలో ఉండమన్నారు. నాటినుంచి శ్రీమాత అక్కడే స్థిరపడిపోయారు.

ఆశ్రమ నిర్వహణ

శ్రీమాత రాకతో శ్రీఅరవిందుల నివాస గృహంలో పలుమార్పులు చోటుచేసుకున్నాయి. ఇంతవరకు అనుయాయులు ఎవరికివారే స్వేచ్ఛగా మసులుతూ ఉండేవారు. శ్రీఅరవిందులు పట్టించుకునేవారు కారు. వారు వారి సాధనలో నిమగ్నులై ఉండేవారు. శ్రీమాత ఈ ఉమ్మడి వ్యవస్థలో ఉంటూ యింటివ్యవహారాలను క్రమబద్ధీకరించారు. సామూహిక ధ్యానంలో శ్రీమాతారవిందులతోపాటు ఇంట్లో వున్న వాళ్లు, బైటనుంచి వచ్చిన వాళ్లు, ఇతరులు కూడా పాల్గొనేవారు. ఈ విధంగా అనుకోకుండానే ఆశ్రమం దినదినాభివృద్ధి చెందింది.

అధిమానస ఆవిర్భావము

ఇది ఇలా ఉండగా శ్రీఅరవిందుల యోగ సాధన చకచకా ముందుకు సాగిపోతోంది. వారి లక్ష్యం, ప్రపంచసమస్యలకు పరిష్కారంగా పరమోన్నత దివ్యసత్యచేతనను అతిమానసాన్ని (Supra-mental) భూలోకంలోకి ప్రవేశపెట్టడం. ఆధ్యాత్మికచరిత్రలో వైదిక ఋషులు వ్యక్తిగతస్థాయిలో దానిని చూడగలిగారు. కాగా ఇది విశ్వవ్యాప్తంగా భూమిపై సుస్థిరం కావాలని శ్రీఅరవిందుల ఆకాంక్ష. 1926 సంవత్సరంలో శ్రీఅరవిందులు సాయంకాల సంభాషణలలో మనస్సుకు అతిమనస్సుకు మధ్య ఒక లంకె అవసరమని వెల్లడించారు. దానిని అధిమానసమని (Overmind) పేర్కొనిరి. 24 నవంబరు 1926 ఒక గొప్ప సుదినము. ఆనాడు అధిమానసము భౌతికంలోకి (భూమిపై) అవతరించింది.

తర్వాత కొంతకాలమునకు, శ్రీఅరవిందులు దాని విశిష్టత నుగురించి ఇలా వివరించారు. 24-11-1926 నాడు భౌతికసత్తా లోకి శ్రీకృష్ణుడు అవతరించినాడు. శ్రీకృష్ణుడు అతిమానసతేజస్సు కాదు. శ్రీకృష్ణావతారము అధిమానస దివ్యతత్వావతరణము. అది స్వయంగా అతిమానసము కాకపోయినను, అతిమానసమునకు, ఆనందమునకు మార్గమును తయారుజేయును. శ్రీకృష్ణుడు ఆనం దమయుడు, అతిమానసముద్వారా ఆనందానుభూతిని కలుగజే యుట కాధారభూతుడు.

శ్రీఅరవిందుల ఏకాంతవాసము

తదుపరి 9, 10 నెలలు అద్భుతమైన సంఘ టనలతో ఒక దివ్యస్వప్నంలా గడిచిపో యాయి. అతిమానసము సాధించేందుకు శ్రీఅరవిందులు ఏకాంతవాసంలో ఘోరతపస్సులో నిమగ్నమైపో యారు. నవంబరు 24 న అక్కడ ఉన్న 24 మంది శిష్యులతో వారు ఇకపై అన్ని కార్యాలు శ్రీమాత ద్వారానే నిర్వర్తిస్తానని, వారు తమకు కావలసిన సహకారాన్ని శ్రీమాతనుంచే పొందా లని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఊర్ధ్వమనస్సు (అధిమానసము) పదార్థంలోకి దిగివచ్చినప్పుడు జరిగిన అద్భుతపరిణామాలను గురించి శ్రీమాత ఇలా అభివర్ణించారు.

నూతనసృష్టి దిగివచ్చుట

ఊహించని అసాధారణమైన కాంతివంత మైన అద్భుత రూపాలతో కూడిన ఒక ఆశ్చర్యకరమైన నూతనసృష్టి దేవతలతో సహా దిగివచ్చి వెల్లివిరిసింది. ఈ అత్యంత ఆసక్తికరమైన విష యాన్ని ఉత్సాహంగా శ్రీమాత శ్రీఅరవిందులకు తెలియజేసిన పుడు శ్రీఅరవిందులు ఇదంతా ఊర్ధ్వమనోచేతనయే అన్నారు. ఇలాటి అద్భుత లీలావిన్యాసాలు సృష్టించి ప్రపంచాన్ని తల్లక్రిం దులు చేసి ప్రఖ్యాతిని పొందవచ్చును కాని మనకు కావలసింది అద్భుతాలు సృష్టించి ఖ్యాతి సంపాదించడం కాదన్నారు. చేయ వలసినది భూమిపై దివ్యచేతన (అతిమానస) ప్రతిష్ఠాపన అని స్పష్టం చేసారు శ్రీఅరవిందులు. సమగ్ర దివ్యమానసప్రపంచం

స్థాపించబడాలంటే ఇప్పటి ఈ అద్భుత ఫలితాలను తిరస్కరించాలి అని చెప్పారు.

శ్రీమాత తన అంతశ్చేతనతో అంతా అవగతం చేసుకొని కొన్ని గంటలలో ఆ నూతన అద్భుతసృష్టిని లయము చేసిరి. వేరే చైతన్యస్థాయినుంచి ఆమె సాధన పునఃప్రారంభమైంది.

యోగములో సాధకుల పాత్ర

ఆశ్రమంలోని సాధకులు, దివ్యశక్తిచే ప్రభావితులై ఆ శక్తిని గ్రహించి శ్రీమాతారవిందులతోపాటు ఆధ్యాత్మికంగా ముందుకు సాగిపోవాలి. తొలి సంవత్సరములలో కఠినమైన క్రమశిక్షణ పాటించబడింది. పిమ్మట ఆశ్రమంలో శిష్యుల సంఖ్య పెరుగుటవలన, రెండవప్రపంచసంగ్రామ సమయంలో చిన్నపిల్లలు ఆశ్రమంలో చేర్చుకొనబడుటవలన ఆశ్రమజీవితంలో అనేక రకములగు మార్పులు చోటుచేసుకున్నాయి. ఆశ్రమవ్యవస్థ ఒక విధముగా విస్తరింపబడెను. ఆశ్రమజీవనం విస్తృతస్థాయిలో రూపాంతరీకరింపబడాలని శ్రీమాత కోరుకున్నారు. ఐతే ఆశ్రమవాతావరణం కలుషితం కాకుండ చూచుటకు కొంత క్రమశిక్షణ వుండాల్సిందే. ధూమపానము, మద్యపానము, కామసంబంధాలు, రాజకీయాలలో పాల్గొనుట పూర్తిగా నిషేధించడమైంది. ఆశ్రమానికి సాధకుల రాక, భక్తుల రాక రోజురోజుకు పెరిగింది. సహజంగానే వారు తమ కష్టాలు, కోర్కెలు తీరేందుకు అమ్మ కృపాకటాక్ష వీక్షణంకోసం ప్రార్థనలు వరదలుగా పొంగిస్తుంటారు. చిత్తశుద్ధితో కూడిన ప్రతిప్రార్థనకి ఆమె అనుకూల ప్రతిస్పందన లభించింది. ఆ ప్రతిస్పందన ఇప్పుడు కూడా లభించుచున్నది. అమ్మయొక్క విశ్వజనీన కార్యక్రమంలో ఇదీ ఒక భాగమే.

రెండవప్రపంచ సంగ్రామము

శ్రీమాత, శ్రీఅరవిందులు ఒక నూతన స్వర్ణయుగమును స్థాపించు ప్రయత్నము చేయుచుండగా పరమకిరాతకులైన హిట్లర్, స్టాలిన్‌లు తమ రాక్షసకృత్యాలతో ప్రపంచంలో భయోత్పాతములు కల్పించి మానవాళిని వెనుకకు తీసికొనిపోవుచుండిరి. హిట్లరు ప్రపంచమునంతను ఆక్రమించి కబళించవలెనను అత్యా

శతో తన సామ్రాజ్యమును విస్తరింపజేసికొనెను; తక్షణ ప్రమాద కారియై యుండెను. శ్రీఅరవిందులు బాహ్యమైన ప్రాపంచిక జీవితమునుండి వైదొలగినను ఈ లోకములో ప్రధానంగా జరుగుచున్న విషయములనన్నిటిని గురించి తెలుసుకొనుచుండిరి. ఆయన అక్కడక్కడ అవసరమైన చోట తన శక్తిని ప్రయోగించుచూ, అనేక క్లిష్టసమయములలో ప్రాపంచిక ప్రమాదములను నివారించుచుండెడివారు. రెండవప్రపంచయుద్ధమే ఆనాటి ప్రధానవిషయము. శ్రీఅరవిందులు తన శక్తినంతయు మిత్రరాజ్యకూటమి (Allies) వెనుక, ముఖ్యంగా బ్రిటిష్ ప్రధాని చర్చిల్‌పై కేంద్రీకరించెను.

హిట్లరు నిజస్వరూపము

శ్రీమాత ఆమెకుగల గూఢవిద్యతో హిట్లరు అంతరంగంలోకి చూసారు. ప్రపంచంలో ఐక్యత నెలకొల్పబడకుండ అవరోధము కలుగజేయుచు, యుద్ధములకు మూలకారకుడైన ఒక అసురునితో అతనికి గట్టి సంబంధమున్నదని గ్రహించారు. గూఢవిద్యలో ఆ అసురుని 'అసత్యాధిపతి' (The Lord of Falsehood) అని పిలుస్తారు. యూరప్ ఖండంలో హిట్లరు యుద్ధములలో విజయపరంపర సాధించుచు అప్రతిహత విజయములతో అజేయుడగుచుండ, శ్రీమాత తన రహస్యశక్తులతో ఆ అసత్యాధిపతిని నిరోధించి హిట్లరు రష్యా నియంత స్టాలిన్‌పై దాడిచేయు నిర్ణయము తీసుకొనునట్లు చేసారు. మిత్రపక్షాలకు (Allies) ఊరట కల్గించారు.

దేవాసుర యుద్ధం

ధర్మాధర్మశక్తుల పోరాటమైన మహాభారత కురుక్షేత్ర సంగ్రామంలో శ్రీకృష్ణుడు ధర్మరక్షణార్థం అర్జున రథసారధిగా దైవీశక్తుల పక్షాన నిలిచాడు. మానసికసంక్షోభంలో నెలకొనివున్న అర్జునునికి సకాలంలో భగవద్గీతను బోధించి ఆత్మబలాన్ని అందించాడు. ధర్మాన్ని గెలిపించాడు. అలాంటి నాటకీయ పరిస్థితే 20 వ శతాబ్దంలోను పునరావృతమైంది.

శ్రీఅరవిందాశ్రమచరిత్రలో 1950 వరకు మూడుప్రధాన ఘట్టాలున్నవి.

1. 1914 – 26 శ్రీమాతారవిందుల ప్రథమసమావేశము, యోగసాధనలో పరస్పర సహకారము.

2. 1926 – 38 అధిమానసావతరణం, శ్రీమాత ఆశ్రమ నిర్వహణను చేపట్టడం.

3. 1938 – 50 శ్రీఅరవిందుల దుర్ఘటన. ఏకాంతజీవితానికి స్వస్తి. అసురశక్తులతో హోరాహోరి యుద్ధం.

స్థూల, సూక్ష్మ భూమికలలో సాధన

1950 లో శ్రీఅరవిందుల దేహత్యాగం, సూక్ష్మభూమికలనుండి కార్యనిర్వహణ. శ్రీమాత భూలోకములో నిలిచి, ఆయన లక్ష్యసాధనను కొనసాగించుట, అతిమానస ఆవిర్భవము; ఆరుసంవత్సరాల తర్వాత పార్థివలోకపు సూక్ష్మ భూమికలోనికి అవతరించుట.

శ్రీఅరవిందుల దేహత్యాగం ఎంత బ్రహ్మాండమైనదో ప్రపంచానికి తెలియదన్నారు శ్రీమాత. అంతకుముందు ఓ సంవత్సరం క్రితం మాటల సందర్భంలో తాను శరీరాన్ని విడిచిపోవాలని భావిస్తున్నట్లు శ్రీమాత అనగా, శ్రీఅరవిందులు అలా జరగటానికి వీల్లేదు అన్నారు. దివ్యచేతన అవరోహణ, రూపాంతరీకరణ సాధించేందుకు శ్రీమాత ఉండితీరాలని, అవసరమైతే తాను నిష్క్రమిస్తానని శ్రీఅరవిందులు బదులిచ్చినట్లు శ్రీమాత డాక్టర్ సన్యాలుతో డిశంబరు 6 న చెప్పారు. శ్రీఅరవిందుల నిష్క్రమణానంతరం తెంపులేని దృఢనిశ్చయంతో శ్రీమాత ఒక్కరే బరువునంతా భరించారు.

శ్రీఅరవింద అంతర్జాతీయ విద్యాకేంద్రం

డిశంబరు 2, 1943 న ఆశ్రమ పాఠశాల చిన్న ఎత్తున, శ్రీమాత విద్యావ్యాసంగములకు పునాదిగా ప్రారంభింపబడెను. అది ఒక పరిశోధనాత్మక విద్యాసంస్థగా రూపుదిద్దుకొనవలసిన సమయమాసన్నమైంది. ఏప్రిల్ 24, 1951 న శ్రీమాత దేశములోని ప్రముఖ మేధావులు, విద్యావేత్తలతో ఒక సమావేశమును ఏర్పాటుచేసి, అందు శ్రీఅరవిందో అంతర్జాతీయ విశ్వవిద్యాలయస్థాపనను గురించి సంప్రదించారు. జనవరి 1, 1952 న ఆ విద్యాకేంద్రము ప్రారంభించబడెను. 1959 వ సంవ

త్సరములో 'శ్రీఅరవింద అంతర్జాతీయ విశ్వవిద్యాలయ కేంద్రము' అను పేరు 'శ్రీఅరవింద అంతర్జాతీయ విద్యాకేంద్రముగా' మార్చ బడింది.

ఆరోవిల్ ప్రారంభోత్సవము

శ్రీమాత ప్రపంచము నలుమూలల ఉండే పౌరులకు ఓ నగరమును స్థాపించాలని ఎప్పటినుంచో కలలు కనేవారు. 'ఆరోవిల్లి' ని స్థాపించి ఆ కలలను నిజంచేసుకున్నారు. 'ఆరోవిల్లి' అంటే అరుణోదయనగరం. ఇది విశ్వజనులందరికి ఆవాసం. ప్రపంచంలో అన్ని దేశాలవాళ్లు – జాతి, జాతీయత, రాజకీయాలు – వీటికి అతీతంగా శాంతి, సామరస్య, సౌభాగ్యాలతో వసుధైక కుటుంబకం అనే నానుడికి ప్రతీకగా ఇక్కడ నివసిస్తున్నారు. ఆరోవిల్లి ప్రారంభోత్సవం ఫిబ్రవరి 28, 1968 న జరిగింది.

*

సూక్ష్మభూమికలలో పనిచేయుట

శ్రీమాత బాహ్యవ్యవహారమంతయు, అనగా 'ఆశ్రమనిర్వాహకురాలు, వ్యవహర్త్రి, సాధకులకు గురుగిరి' ఆమె జీవితమందొక భాగం మాత్రమే. ఆమె పొందిన ఆంతరంగిక అనుభూతులను పూర్తిగా గ్రంథస్థము చేసినచో ఒక గ్రంథాలయమంతా నిండిపోయేది. కాని అందులో కొంతభాగము మాత్రమే ఆమె ప్రసంగముల ద్వారా, శ్రీఅరవిందుల 'సావిత్రి' కార్యము ద్వారా నమోదు చేయబడినది. శ్రీఅరవిందులు తన యోగమార్గమునేగాక శ్రీమాత ఆత్మానుభూతులను కూడ సావిత్రి మహాకావ్యములో సంకేతాలుగా సూచించారు.

ప్రాపంచిక జీవితం మిథ్యకాదు

శ్రీఅరవిందుల సిద్ధాంతము క్రియాశీల పరిణామ సిద్ధాంతము (శ్రీఅరవిందులవారి దర్శనము, శ్రీమాత దర్శనము ఒకటేకాని, శ్రీఅరవిందులు తమ సిద్ధాంతములను తత్త్వశాస్త్ర పరిభాషలో బిగించారు.) శ్రీఅరవిందుల సిద్ధాంతములో ఈ ప్రపంచమొక వ్యర్థమైన భ్రాంతికాదు. దీనిని నిరసించి వదలుకొనుట సమ్మతము కాదు. ఇది బహురూపములు దాల్చి ఆవిర్భవిం

చిన పరాతత్త్వమే. భారతీయ తత్త్వశాస్త్రములోని మాయావాదమే ఒక అసంతృప్తికరమైన సిద్ధాంతముగా మిగిలిపోయినది. "ఈ సృష్టి అంతయు మిథ్య, ఈ మిథ్యాశరీరములోనికి, ఆత్మ ఎందు కవతరించినది? ఇందులో నుండి బయటపడుట కొరకు మిథ్యా సిద్ధాంతము నెందు కవలంబించవలెను?" అను ప్రశ్నలకు సరియైన సమాధానము లేదు. శ్రీఅరవిందులు తమ సిద్ధాంతములో ఈ అసంతృప్తికరమైన పరిస్థితిని ఎదుర్కొనిరి. మాయావాదము మౌలికముగ నిషేధాత్మకమై యున్నది. అది ఈ ప్రపంచములో మానవ జీవితమును తిరిగి పరాత్పర తత్త్వములో లయమగువరకు సాగించుటొక విధిగా, ధర్మముగా నిర్ధారించుచున్నది. మరియు ఈ ప్రపంచములోనికి తిరిగి అవతరించుట మిగిలినవారిని ఈ మాయలో నుండి ఉద్ధరించుటకేయని చెప్పబడినది.

ఆత్మ సాహసయాత్ర

దీనికి భిన్నముగ, శ్రీఅరవిందులు ఈ పరిణామశీల ప్రపంచములో జన్మపరంపరల ద్వారా అనుభవసారము నార్జించుట ఆత్మ చేయు సాహసకృత్యమని నుడివిరి. ఈ అజ్ఞానమయ పదార్థములోనికి చొచ్చుకొనిపోవుటయే ఒక సాహసకార్యము. కాని, పర్యవసానములో, అనగా పరిణామ ప్రగతి ఉన్నతదశలలో పదార్థము కూడ దివ్యతత్త్వమై యున్నదని అనుభూతి కలుగును. శరీరములోనికి అవతరించిన ఈ ఆత్మ సృష్టికార్యములో పాల్గొని దివ్యత్వ సాదృశ్యము, భూలోకస్వర్గము, నిత్యప్రేమ, సామరస్యములతో నిండిన జీవనము ప్రతిష్ఠిత మగువరకు, ఈ ఉద్యమమునకు తోడ్పడి నడిపించవలసి యున్నది.

జడపదార్థంలో జీవచ్ఛాయలు

ఆత్మ, పూర్ణ ఆవిర్భావానందము కొరకు సమ్మతించి యీ సాహసకృత్యమును యథేచ్ఛగా చేయ మొదలిడినది. అయినను ఈ ఉద్యమములోని ప్రథమ దశ అజ్ఞానములో చేయు ప్రయాణమే. మొదట అచేతనమైన పదార్థము వచ్చును. ఆదిలో దానికి ప్రాణము లేదని భావింపబడెను. కాని, నిష్పక్షపాతముగ నాలోచింప, భౌతికశాస్త్రజ్ఞులు నూతన పరిశోధనలచే పదార్థము

నకు కూడ జీవస్పందన కలదని తేలినది. పరిణామ సిద్ధాంత ములోని అనంతదశలలో వృక్షజాలము నుండియు, పశుజాతినుం డియు ప్రాణధాతువు ఆవిర్భవించినట్లు తేలుచున్నది. కాని శ్రీమాత వీటిలో ఇప్పటికే జాగృతమైన చైత్యపురుషసత్త (awakened psychic being) కలదని పేర్కొనినది. ఇందుకు తార్కాణ ముగ పుష్పములను, పిల్లులను చెప్పవచ్చును. చివరిదైన మూడవ దశలో, మనోధాతువు ఆవిర్భవించి, మానవుని తీర్చిదిద్దినది. ఈ మానవుడు కూడ చాలాకాలం అనేకమైన మధ్యంతర రూపము లను దాల్చి వాటిని విసర్జించి నేటి మానవరూపములో నిలిచి నాడు. ఈ రూపముతోపాటు ఇప్పటికిని ఆదిమ మానవుడు

పరిణామం మానవునితో ఆగదు

అక్కడక్కడ ఉండుట కానన గును. పరిణామ ప్రసారమింతటితో (మానవునితో) ఆగదు. ఎందుకు ఆగాలి? అది (పరిణామసిద్ధాంతము) మన మతసిద్ధాంతములకు, తత్త్వసిద్ధాంతములకు అతీతంగా నిలిచి మందహాసము చేయు చుండును. ఈ సృష్టి మనిషితో సమాప్తమగునను భావమును కాదని, మానవునికంటె ఉన్నతమైన సృష్టి రాగలదని ప్రకటిం చిన ప్రఖ్యాతి (జర్మన్ దేశస్థుడైన) నీట్షేకి (Nietzche) దక్కినది. కాని అతడు పేర్కొనిన పరిణామ ప్రక్రియలో పెద్ద పొరపాటులు చోటుచేసికొనినవి. శ్రీఅరవిందులు నీట్షే ప్రవచించిన పదమునే తీసికొని, తన అంతర్దృష్టితో ఈ భూలోకములో ఆవిర్భవింప నున్న తదుపరి ఘట్టము 'అతిమానస' మని నిరూపించి ఆ ఆవి ర్భావప్రక్రియనే తన జీవితలక్ష్యముగ జేసికొని, పరిణామప్రక్రి యలో అగ్రగామియైనాడు.

సత్యచైతన్యము మానవుని ధ్యేయము

అతిమానసమును గురించి చెప్పు టకుగాని, దానిని తెలుసుకొను టకుగాని చాలా కష్టము. కాని, అది పరిపూర్ణమైన జ్ఞానమును, అనంత ఆనందమును, సర్వతో ముఖ పూర్ణత్వమును పొందుటకై మానవుడు చేయు ఆకాంక్ష యని, సాధారణ పరిభాషలో చెప్పవచ్చును. అది ఈ భూలోక

ములో పదేపదే ప్రజ్వరిల్లి, ఎన్ని వ్యతిరేకశక్తులు, పైకి కనిపించు ఆభాసలు నిరోధించినను, అత్యున్నత సత్యచేతనకున్ముఖమై యుండును. దాని మూలము భావికాలపు స్మృతివలె, ఆ చైతన్యము నందుండును.

అతిమానస ఆవిర్భావము

1956 సంవత్సరము నుద్దేశించి, శ్రీమాత ఈ దిగువ సందేశము నిచ్చిరి. *ఘనమైన విజయములు ఎటువంటి ఆర్భాటము లేకుండా నిశ్శబ్దముగా సంఘటిల్లును, నూతనప్రపంచముయొక్క ఆవిర్భావము ఢంకాభేరీలతో ప్రకటింపబడదు.* ఆ సంవత్సరము మానవజాతి చరిత్రలో చాలా ముఖ్యమైనది. ఫిబ్రవరి, 29 తేది సాయంకాలము, అతిమానసావతరణము అనే ఒక గొప్ప సంఘటన సంభవించినది. శ్రీమాత మాటలలో "నేటి సాయంత్రం దైవసాక్షాత్కారము సజీవంగా మన మధ్య నిలిచి వున్నది. నేను దేదీప్యమానంగా బంగారువన్నెతో, ఈ విశ్వమునంతను మించిన రూపములో నుంటిని. నాకెదురుగ నొక బలిష్ఠమైన సువర్ణద్వారముండెను. అది ఈ ప్రపంచమును భగవంతుని నుండి వేరు చేయుచు నిలచియుండెను.

నేను ఆ కవాటమును తదేకదృష్టితో చూచుచు, ఒక చైతన్యస్పందనచే సమయమాసన్నమైనదని గ్రహించి రెండుచేతులతోను బరువైన ఒక బంగారుసుత్తిని తీసికొని బలముగ ఆ కవాటముపై నొక గట్టిదెబ్బ కొట్టితిని. ఆ ద్వారము ముక్కలుగ బ్రద్దలైపోయెను.

అంతట అతిమానస కాంతులు, శక్తులు, చైతన్యము భూమిపైకి అంతులేని ప్రవాహములో పడి చొచ్చుకొనిపోవుచుండెను. ఇది శ్రీమాత యోగసాధనాశక్తితో సాధించిన ఘనవిజయం."

అతిమానసమంటే (Supramental manifestation) ఏమిటి? దాని ఫలితాలెలా వుంటాయి?

చాలామంది సాధకులు ఏవో అద్భుతములు సంభవించుననియు, తమ కష్టములన్ని గట్టెక్కుననియు భావించిరి. మరికొందరు క్రొత్తజాతి జీవులే జన్మించుదురు అనునట్లు చుట్టు

ప్రక్కల ప్రాంతములను పరిశీలించుచుండిరి! కాని దాని అర్థం అది కాదని శ్రీమాత చెప్పిరి. ఈ భూలోకంలో మనస్సు అవతరించిన పిమ్మట ఇప్పటి మానవరూపము ఆవిర్భవించుటకు కొన్ని కోట్లసంవత్సరములు పట్టినది. అట్లే అతిమానసము ఆవిర్భవించిన తరువాత అతిమానసజాతి ఆవిర్భవించుటకు కనీసము కొన్ని వందలు లేక వేల సంవత్సరములు పట్టవచ్చును. కాని ఆ ప్రక్రియను తొందరగా సాధించుటకు అవకాశమున్నది. మర్కటమువలె కాక, మానవుడు తన మేధాశక్తితో పరిణామ ప్రక్రియకు సహకరించగలడు.

శ్రీమాత 1957 సంవత్సరాంతమునకు ప్రకృతితో ఒక నూతన సన్నిహిత సంబంధమును పొందినది. 8-11-1957 న ఒక నిశ్చితమైన అనుభూతి పరమోత్కర్షను పొందెను.

ప్రకృతి అకస్మాత్తుగా అర్థం చేసుకొంది. క్రొత్తగా అవతరించిన నూతనచైతన్యము, తనను నిరాకరించదనియు, పరిపూర్ణముగా ఆలింగనము చేసుకొనుననియు తెలుసుకొన్నది. అప్పుడు పరాత్పర తత్త్వం (పరమసత్యం) నుండి "ప్రకృతీ మేల్కొనుము సహకారానందమును పొందుము" అను ఆజ్ఞ వెలువడినది. అంతట ప్రకృతి ఆనందోత్సాహాలతో "నేనంగీకరించెదను, సహకరించెదను" అను సమాధానము నిచ్చుచు ముందుకు వచ్చెను. ప్రకృతి సమ్మతించెను. భవిష్యత్తంతయు తన కనుల యెదుట దృశ్యమానముకాగా ఈ అతిమానసచైతన్యము సంపూర్ణసిద్ధిని సాధించగలదనియు, తన సంచలనమునకు ఇతోధిక బలము చేకూర్చకలదనియు తన విశ్వఖేలనకు విస్తృతమైన విశాలతను, అమితమైన సంభావ్యతను కలుగజేయగలదనియు గ్రహించెను.

ప్రకృతి సహకారము

అతిమానసావతరణము జరిగి, దైవీకార్యములో ప్రకృతి పాల్గొనుటకనుమతించిన పిదప, ఇక శ్రీమాత నిర్వర్తించవలసిన కార్యం ఏమి మిగిలియున్నది? 1958 లో భౌతికపరివర్తనయోగము ప్రారంభమైనది. అది కేవల పదార్థములో, అనగా శరీరములోని జీవకణములను పరిశుద్ధముచేసి వాటిని భౌతికమనస్సుయొక్క

ప్రభావమునుండి విడుదలచేయుటయేకాక, శారీరక మనస్సంబంధము నుండి స్వేచ్ఛ పొందవలసి యున్నది. అది ఇప్పటివరకు యున్న జీవకణముల మూలచైతన్యములో సాధింపబడవలెను. భౌతికమనస్సు అభేద్యముగ కనిపించు దాని యంత్రాంగముతో మనము 'ఈ పని చేయనిచో రోగము వచ్చును. వర్షములో తడిసిన శిరోభారము వచ్చును, నేడు నీకు చెడ్డరోజు, ఇంకే పని జరగదు' మొదలైన సూచనలు, హెచ్చరికలు మనము ఆ మాటలు నమ్మువరకు వచ్చుచునే వుండును. ఈ భౌతికమనస్సును ఒక మంత్రం సహాయంతో మంచిమార్గంలో పెట్టవచ్చును. ఉదా॥ శ్రీమాత *'ఓం నమో భగవతే'* అను మంత్రమును భౌతికపరివర్తనమునకై వినియోగించుచుండెడిది. జీవకణములలోని చైతన్యము చేయు పనిని నిర్వచించుట అంత తేలిక గాదు.

శరీర కణముల వికాసము

ఈ పరివర్తనములో ప్రథమదశ ఈ కణములుచేయు పనినుండి పూర్తిగ విరమింపజేయు కార్యక్రమము, పదిసంవత్సరములు అంటే 1968 వరకు సాగింది. మిగిలిన ఐదు సంవత్సరములు 1973 వరకు శ్రీమాత ఈ కణములొక క్రొత్తకార్యక్రమమును చేపట్టి చివరకు ఒక నూతనశరీరమును భౌతికముగ అమృతత్వముగల ఉపాధిని (శరీరమును) సృష్టించునట్లుగా వాటిని మలచుటకు ప్రయత్నించినది. భౌతిక అమరత్వము ఒక అసాధ్యమైన సాహసకార్యముగ కనిపించవచ్చును. కాని, మానవజాతి చరమవిజయమును, రోగము, మరణముల శాశ్వత నివారణము సాధించుటకు చేయవలసిన ప్రయత్నమే యిది.

అది జీవితానికి మరణానికి మధ్య పోటీ; అనాదిగా చావుకి, అమృతమయ దివ్యతత్త్వములో నిత్య యౌవనముగా ఉండాలన్న నూతనకాంక్షకు మధ్య శ్రీమాత పరుగులు తీసింది. బాహ్యప్రపంచంలో సృజనాత్మక, విధ్వంసక శక్తుల మధ్య జరుగుచున్న సంఘర్షణ అతి క్లిష్టతరమౌతోంది. ఈ విధమైన పోటీలో లేక సంఘర్షణలో ఏ శక్తులు ప్రథమంగా గమ్యము చేరుతయో? వ్యతిరేకశక్తులు, దివ్యశక్తికి విరుద్ధశక్తులు, ప్రాణికశక్తులు కుప్ప



I am always seated in your heart,
consciously living in you.

The Mother

తెప్పలుగా భూమిపై దాడిచేస్తున్నాయి. అదే సమయంలో నూతనము, పరమోన్నతము, అతిశక్తివంతము అగు అధ్యాత్మికశక్తి కూడ భూమిపై నూతనజీవితమును తీసికొనివచ్చుటకు అవతరించింది.

1973 సంవత్సరము నవంబరు నెల మధ్యలో శ్రీమాత ఆరోగ్యపరిస్థితి ఆందోళన కలిగించింది. ఆమె అతితక్కువ ఆహారము తీసికొనుచుండెను. గుండె బలహీనమాయెను. ఆమె తన సేవకులను పదేపదే ప్రక్కమీదనుండి లేవదీయవలసినదని కోరెడిది. అందువలన ఆమెకు కొంత ఉపశాంతి కలుగుచుండెను. 17-11-1973 మధ్యాహ్నము ఆమె తిరిగి తనను లేవతీయుడని కోరినది. కాని ఆమె శరీరపరిస్థితి అతిక్లిష్టముగ (extremely critical) నుండెను. ఊపిరిపీల్చుట చాలా కష్టమైంది. డాక్టరు సన్యాల్ ఆమె నాడి పడిపోయిన విషయం తెలిసికొని ఆమె గుండెను మర్దనం చేశాడు. కాని శ్రీమాత భౌతికజీవితము అవసానమునకు చేరింది. సాయంత్రం గం. 7.25 లకు ఆమె తన భౌతికకాయమును త్యజించింది.

భౌతికంగా ఆమె మనకిక లేరు. కాని ఆమె కార్యమును నెరవేర్చుటకు ఆమె శిష్యులు సంసిద్ధులై యున్నారు. ఆమె సూక్ష్మశరీరంలో దివ్యచేతనాస్థరంలో భూకక్ష్యలోనే ఉంటూ సాధకులకు, భక్తులకు చేయూత నందిస్తూనే ఉన్నారు.

ఒక నూతనజాతి ఆవిష్కరణానికి, భౌతికజీవనాన్ని దివ్యజీవనంగా పరిణమింపజేయడానికి బీజం పడింది. శ్రీమాతారవిందుల తపః ఫలితంగా ఈ సమయంలో మనం ఈ భూమి మీద బ్రతుకుతున్నామంటే తెలిసో తెలియకో ఒక మహాప్రస్థానంలో పథికులుగా మనం కూడా పాత్రను వహిస్తున్నాం అన మాట. 1958 లో సాధకుల నుద్దేశించి శ్రీమాత అన్నమాటలు.

వాతావరణంలో అతిమానస పదార్థము

"నేను మీకు చెప్తున్నాను – ఈ సమయంలో ఈ భూమిమీద నివసిస్తూ మీరు పీల్చే గాలి ద్వారా భూవాతావరణంలో వ్యాపించి వున్న దివ్యచైతన్య పదా

ర్థాన్ని మీకు తెలియకుండానే మీరు పీల్చుకుంటున్నారు. అభివ్యక్తం కాబోయే (దివ్యజీవనం) దానికోసం సకాలంలో నిశ్చయాత్మకమైన ముందడుగు వేయటానికి మిమ్ములను ఇది సంసిద్ధం చేస్తోంది"

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

సమాచార పత్రం

శ్రీమాత 125 వ జన్మదినమును పురస్కరించుకొని శ్రీమాత వర్ణచిత్రము, శ్రీఅరవిందుల సందేశములతో కూడిన Page mark-cum-Pocket Calendar ను ఈ సంచికతో అందజేస్తున్నాము. అదనపు కాపీలు రు॥ 2.00 చొప్పున (8 కార్డులకు రు॥ 5.00 పోస్టేజీ) సొసైటీ ఆఫీసునుంచి లభ్యములు.

17 నవంబరు 2002 నాడు శ్రీమాత సమాధి దినము ఆశ్రమంలో జరుపబడినది. శ్రీమాత మందిర దర్శనము ఉదయం 4 గంటలకు మొదలైనది. 6 గం॥ లకు సమాధి వద్ద ధ్యానము. ఆనాటి సందేశము:

There is no one for whom it is impossible to realise the Divine. Only, for some it will take many, many lives, whereas there are others who will do it in this very lifetime. It is a question of will. It is for you to choose.

But I must say that at the present moment conditions are particularly favourable.

The Mother

దైవసాక్షాత్కారాన్ని పొందలేని వాళ్లెవ్వరూ ఉండరు. దానికందరు అర్హులే. అయితే కొంతమందికి అది అనేక జన్మలు పట్టవచ్చు, ఇతరులు ఈ జన్మలోనే సాధించగలరు. అంతా నీ సంకల్పం మీద ఆధారపడి ఉంటుంది. గట్టి సంకల్పం ఉంటే

చాలు. అయితే ఒకటి మాత్రం నిజం. నేటి పరిస్థితులు మట్టుకు యిందుకు చాలా అనుకూలంగా వున్నాయి.

శ్రీమాత

సాయంకాలం ఆశ్రమక్రీడాంగణంలో గం॥ 7.25 లకు ధ్యానము.

20 నవంబరు నాడు ఉదయం గం॥ 6 లకు సమాధి వద్ద, సాయంత్రం గం॥ 7.25 లకు క్రీడాంగణంలోనూ ధ్యానము.

24 నవంబరు, 2002 సిద్ధి దినము. ఆ రోజున ఉదయం గం॥ 4 ల మొదలుగా శ్రీఅరవిందుల పవిత్రమందిర దర్శనము, గం॥ 6 లకు ధ్యానము, సాయంత్రం క్రీడాంగణంలో కవాతు ప్రదర్శనము, ఆశ్రమం బేండువాయిద్యసమ్మేళనము, ధ్యానము. నాటి సందేశము.

We are sons of God and must be even as he:
His human portion, we must grow divine.
Our life is a paradox with God for key.

(*Savitri*) Sri Aurobindo

5 డిసెంబరు నాడు శ్రీఅరవిందుల సమాధి వార్షికోత్సవము. ఉదయం గం॥ 6 లకు సమాధి వద్ద, సాయంకాలం క్రీడాంగణంలోను ధ్యానముతో జరుపబడినది. 9 డిశంబరు నాడు ఉదయం గం॥ 6 లకు సమాధి వద్ద, సాయంత్రం గం॥ 7.45 లకు ధ్యానము జరుపబడినది. ఆ నాటి సందేశము.

Sri Aurobindo came to tell the world of the beauty of the future that must be realised.

He came to give not a hope but a certitude of the splendour towards which the world moves. The world is not an unfortunte accident, it is a marvel which moves towards its expression.

The Mother

రానున్న బంగారు భవిష్యత్తును గురించి మనకు తెలుపుటకే శ్రీఅరవిందులు అరుదెంచిరి.



అఖిల

అఖిల భారత పత్రిక

ఫిబ్రవరి 2003



Because Thou art

Because Thou art All-beauty and All-bliss,
    My soul blind and enamoured yearns for Thee;
It bears Thy mystic touch in all that is
    And thrills with the burden of that ecstasy.

Behind all eyes I meet Thy secret gaze
    And in each voice I hear Thy magic tune:
Thy sweetness haunts my heart through Nature's ways;
    Nowhere it beats now from Thy snare immune.

It loves Thy body in all living things;
    Thy joy is there in every leaf and stone:
The moments bring Thee on their fiery wings;
    Sight's endless artistry is Thou alone.

Time voyages with Thee upon its prow –
And all the future's passionate hope is Thou.

Sri Aurobindo

సమర్పణ

శ్రీమాత 125 వ జన్మదిన వార్షికోత్సవము

ప్రత్యేక సంచిక

మన యోగము ప్రపంచాన్ని, ప్రాపంచిక జీవితాన్ని నిరసించేది కాదు. అయితే మామూలు జీవితానికి యౌగికజీవితానికి తేడా ఏమిటి అనే సందేహం రావచ్చు. యోగికూడ మామూలుగా కర్మలు చేస్తూనే జీవిస్తాడు నిజమే. అయితే ఆ కర్మల వెనుక ఉద్దేశము వేరుగా వుంటుంది. కర్మలు అహంకార దర్పాదులను ప్రదర్శించే అజ్ఞానప్రయోగాలుగా వుండకూడదు. సమర్పణాభావంతో పెంపెసలారుతూ వుండాలి. ఈ సమర్పణా భావమంటె స్థూలమైన అభిప్రాయమే తప్ప కచ్చితంగా ఎవరికి తెలియదు. శ్రీమాతారవిందులు ఈ విషయాన్ని గురించి అనేకచోట్ల మూలగ్రంథాలలోను, సాధకులతో జరిపిన ప్రత్యేక ప్రసంగాలలోను, ఉత్తరాలలోను సవిస్తరంగా వివరించారు. వీటిలోనుంచి ఏరికూర్చిన కొన్ని విషయాలను మీ ముందుంచుతున్నాము. ఈ పుటలలో ప్రతివారికి వారి వారి అభిరుచుల ప్రకారం. ఎవరికి కావలసిన చిట్కాలు వారికి దొరుకుతాయని ఆశిస్తున్నాము.

సంపాదకుడు

నువ్వు చిన్నపిల్లవాడల్లె 'మదర్' కు లొంగిపోవాలి. అప్పుడు ఆమెయే నిన్నెత్తుకోని మోస్తుంది. నిన్ను రక్షిస్తూంటుంది.

శ్రీమాత

విషయసూచిక

శ్రీమాత ప్రవచనములు

యోగపంథ – స్వశక్తా లేక సమర్పణా?

యోగమనగా నిన్ను నీవధిగమించుట – నీ సామర్థ్యమును మించిన శక్తిని పొందుట. ఇది ఎటుల సాధ్యము? ఒకటి స్వశక్తి మీదనే ఆధారపడుట – అనగా "నేనిప్పుడు ఏం చేయాలి? ఎలా చేయాలి?" మొదలైన భావాలతో సతమతమైపోతూ వుండటం. రెండవది దైవము మీదనే ఆధారపడుట. నిన్ను నీవు దైవానికి పూర్తిగా సమర్పించుకొనుట. ప్రతి పనిలోను, ఆలోచనలోను, ఏ పని చేసినా ఆ సమర్పణను దృఢపరచుకొనుట. ఈ విధంగా దైవశక్తినే నీలోకి దింపుకొని దానిచే ప్రేరేపింపబడుతూ సాధనను కొనసాగించుట.

– సంపాదకుడు

ఆత్మసమర్పణ రాజమార్గము

యోగమునకు ఉన్న రెండుమార్గములలో మొదటిది తపస్సు, రెండవది సమర్పణ. తపస్సు అనేది దుష్కరమైనది. దీనిలో ప్రధానంగా నీవు నీమీదనే ఆధారపడవలసివస్తుంది. నీ స్వశక్తితో నీవు ముందుకు సాగిపోవాలి. తత్ఫలితంగా నీవు సర్వోన్నత శిఖరాలను అధిరోహించి, నీ తపశ్శక్తియొక్క ఫలమును అందుకోగలవు. కానీ, దీనిలో ప్రమాదకరమైన విషయమేమిటంటే, కాలుజారి క్రిందపడడం కూడా సంభవించవచ్చు. ఒకసారి క్రింద పడ్డావంటే కాళ్లుచేతులు విరిగి అధఃపాతాళానికి జారిపోతావు. ఆ తరువాత మరి నీకు నిష్కృతి లేదు. రెండవమార్గం సమర్పణ. ఇది నిరపాయకరమైనది, నమ్మకమైనది. ఇక్కడే పశ్చిమదేశస్థులు చిక్కులో పడుతుంటారు. ఈ విషయంలో వారు భయభ్రాంతుల వడం నేర్చుకున్నారు. ఏవయితే వారి వ్యక్తిగతస్వాతంత్ర్యాన్ని హరిస్తాయన్న సంశయం వారిలో తలెత్తుతుందో, వాటన్నిటిని వారు విసర్జిస్తారు. వారు తల్లిపాలతోనే వ్యక్తిగతస్వాతంత్ర్యం అనే భావాన్ని కూడా గ్రోలుతారు. పైగా సమర్పణ అంటే వ్యక్తిగత స్వాతంత్ర్యాన్ని వదులుకొనడమే అనుకుంటారు. ఇంకొక రకంగా చెప్పాలంటే, రామకృష్ణ పరమహంస చెప్పినట్లుగా నీవు మర్కట

కిశోర న్యాయమును అనుసరించాలి, లేదా మార్జాలకిశోర న్యాయ
మునైనా అనుసరించాలి. మర్కటకిశోరం ఏం చేస్తుందంటే, తన
తల్లికడుపును తానే గట్టిగా ఒడిసిపట్టుకుంటుంది. తల్లి ఒకచోటు
నుండి ఇంకొక చోటికి దుముకుతూ పోయినపుడు, కోతిపిల్లపట్టు
ఏమాత్రం సడలినా అది క్రింద పడిపోతుంది. మరొక పద్ధతి
మార్జాలకిశోర న్యాయము. పిల్లిపిల్ల తన తల్లిని పట్టుకోదు. తల్లే
తన పిల్లని జాగ్రత్తగా నోటకరుచుకొని పట్టుకుంటుంది. పిల్లిపిల్ల
తన గురించి తాను ఏ జాగ్రత్తలూ తీసుకోవలసిన అవసరము
లేదు. భయపడవలసిన పనీ లేదు. అదేమీ తనకు తానుగా చేయ
వలసిన పని లేదు. దాని తల్లే దానిని పట్టుకొని తిరుగుతుంది.
పిల్ల మాత్రం 'మా' 'మా' అని అరుస్తూంటుంది. అంతే.

కపటములేని సమర్పణ

నీవు యీ సమర్పణ మార్గమును సంపూర్ణ
ముగా, హృదయపూర్వకంగా స్వీకరించిన
యెడల ఏ అపాయములుగాని, తీవ్రమయిన
కష్టములుగాని నీ దరికి చేరలేవు. పోతే, ఎదురయ్యే ప్రశ్న చిత్త
శుద్ధిని (sincerity) గురించే. నీలో చిత్తశుద్ధి లేనియెడల నీవీ యోగ
మును ప్రారంభించవద్దు. సాధారణ మానవజీవిత కార్యకలాపా
లలో నీవు కపటంగా ప్రవర్తిస్తావేమోకానీ భగవంతుడిని నువ్వు
మోసగించలేవు కదా. నీవు యీ మార్గమున సురక్షితముగా సాగి
పోవలెనన్న, నిష్కపటముగా నీ హృదయాంతర్భాగమును ఉన్మీ
లనము గావించు. దివ్యుని, దివ్యోపలబ్ధిని పొందడమే నీ గమ్యం
కావాలి. దైవం నిన్ను ఒక పసిపిల్లవానిలా నడిపించుకుపోవాలి.
నిన్ను నీవు దివ్యమాతకు సమర్పించుకో. నిన్ను ఆమెనే గొనిపో
నివ్వు. అప్పుడు ఆపదలు నీ దరి చేరవు.

ఆటంకముల నెదుర్కొనుట

అంటే దానర్థం, నీకు ఇతరములైన కష్టములు
సంభవించవని, లేక నీవు పోరాడి, జయించ
వలసిన ఆటంకములు రావని కాదు. సమ
ర్పణద్వారా నీవు ఏ ఆటంకము లేకుండా, నిరంతర అభివృద్ధిని
సాధించగలవని కాదు. దానికి కారణం – నీ సత్త ఇప్పటికీ ఒక్కటి
కాలేకపోవడమో లేక, నీది మినహాయింపులులేని పరిపూర్ణసమ

ర్పణ కాదనో చెప్పాలి. నీ సమర్పణ సాక్షికం అన్న మాట. అంటే యీ రోజు ఒక అంశం అయితే రేపు ఇంకొకటి అన్నట్లుగా ఈ భిన్న విభిన్నములైవున్న అంశములన్నిటినీ ఒక్కటిగా చేర్చి, వాటిని కొలిమిలో వేసి, సానబట్టి, అఖండమైన ఐక్యతను సంతరింపజేయ డమే యోగముయొక్క ముఖ్యోద్దేశం. అంతవరకూ కష్టాలమీద కష్టాలు ఎదురవ్వకుండా ఉండవని ఆశించకు. ఉదా: అనుమానం లేక కృంగిపోవడం లేక సంకోచం మొదలైనవి....

చైత్య పురుషుడే నీ నిజస్వరూపము

నీ చేతన లోలోతులలో ఉన్నది నీ చైత్య సత్త (Psychic being). అదే నీలోనున్న దైవమందిరం. దీనిని కేంద్రబిందువుగా చేసుకొని, నీలో నున్న విభిన్న అంశములన్నీ దీని చుట్టూ చేరి ఏకీభూతం కాగలగాలి. నీ సత్తలోని పరస్పర వ్యతిరేక ప్రవృ తులు కూడా దీనిలో విలీనం కావాలి. ఒక్కసారి నీవు నీ చైత్య సత్త చేతనను అందుకోగలిగితే, దానిలోని అభీప్స నీలో జాగృ తమై నీలోనున్న సంశయములను, కష్టములను పటాపంచలు చేస్తుంది. దాని కోసం కొద్దో, గొప్పో సమయం పట్టవచ్చు. కానీ తుది విజయం నీకు తప్పదు. ఒకసారి నీవు భగవంతునివైపు తిరిగి "నేను నీవాడను" అన్నావనుకో, దైవం కూడా "అవును, నీవు నావాడవే" అంటాడు. ఇక యీ ప్రపంచం మొత్తం కలిసినా నిన్ను వేరు చెయ్యలేదు. ఎప్పుడైతే కేంద్రసత్త (Central being) తనని తాను సమర్పణ గావించుకుంటుందో, అప్పుడే ముఖ్యమైన కష్ట ములన్నీ అదృశ్యమవుతాయి. బాహ్యాసత్త అనునది ఒక తెరలాం టిది. సాధారణ మానవుల్లో యీ తెర అనేది ఎంత మందంగా, కఠినంగా ఉంటుందంటే, వారు ఎప్పుడూ తమలోనున్న దివ్య త్వంపట్ల సచేతనులు కాలేరు. ఒక్కసారి, ఒకే ఒక్క ముహూర్త కాలం నీలోని అంతఃసత్త "నేనిక్కడున్నాను, నేను నీవాడను" అని పలికితే, వెన్వెంటనే నీ బాహ్యాసత్తతో దానికి ఒక సేతుబంధన మేర్పడుతుంది. అప్పుడు ఇక మందంగా వున్న ఆ తెర కొద్దికొద్దిగా పల్చబడుతూ వస్తుంది. చివరికి ఆ రెండుసత్తలు ఒక్కటిగా కలిసి పోయి, బాహ్యాభ్యంతరాలు రెండూ ఒక్కటిగా మారిపోతాయి.

మానవ ప్రయత్నం ఆవశ్యకత

మార్జాలకిశోరన్యాయమును నీవు గుత్తకొన్నంత మాత్రాన ఇక నీవు పూర్తిగా నీ వ్యక్తిగత ప్రయత్నముల నుండి విముక్తిపొందవచ్చనే నమ్మకం పెంచుకొనడం ఉచితం కాదు. కారణం, నీవు పిల్లికూనవి కాదు కనుక. మానవులెప్పుడూ మార్జాలకిశోరములు కాలేరు. నీలో విభిన్నాంశములు దాగి వున్నాయి. అవి కేవలం వాటి మీదనే నమ్మకాన్ని పెంపొందించుకొనడానికి అలవాటుపడ్డాయి. వాటి పనిని అవే చేసుకోవాలనుకుంటాయి. అన్నిటికన్నా దీనిలో మనస్సు ముఖ్యమైనది: పర్యవేక్షణ గావించడం, సమీక్షించడం, విశ్లేషించడం, సమస్యలను పరిష్కరించడం కోసం ప్రయత్నించడం లాటివంటే అది చాలా ఇష్టపడుతుంది. "ఇలా చేస్తే బాగుంటుందేమో!" "ఈ విధంగా ఇంకా ఎక్కువ బాగుండొచ్చు కదా!" యీ విధంగా అనేక రకములైన ప్రశ్నలు వేస్తుంటుంది. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతునే ఉంటుంది. అటువంటప్పుడు మరి పిల్లిపిల్ల ఎక్కడుంటుంది? పిల్లిపిల్ల ఎప్పుడూ ఆలోచించదు. వీటన్నిటినుండి ఎవరు ముక్తులు కాగ లుగుతారో వారికే ఇవన్నీ సులభసాధ్యం కాగలుగుతాయి.

నీవు ఏ మార్గాన్ని అనుసరించినా, తాదాత్మ్యం కలిగేంత వరకూ నీ వ్యక్తిగత ప్రయత్నాలు ఎంతో ముఖ్యం. అది సిద్ధించిన ఉత్తరక్షణంలో నీ శరీరంనుండి జీర్ణవస్త్రాలు జాలువారినట్లుగా అవన్నీ జారిపోతాయి. నీవు నీవుకాకుండ వేరొక వ్యక్తిగా మారిపోతావు. మొదట్లో నీకు ఏది అసంభవమనిపించిందో, అది ఇప్పుడు సంభవమే కాదు, తప్పనిసరి అవుతుంది. నీవిక అదివరకల్లే ఉండలేవు.

(*CWM* Vol. 3, pp. 4-7; Vol. 16, pp. 311-12; Vol. 4, p. 94)

అనువాదం: ఆరోధృతి

సమర్పణ – అతి త్వరితమైన మార్గము

కోరికలను వదిలించుకున్నంత మాత్రాన ముక్తి లభించదు. కోరికలను వదిలించుకోవటం కూడ అంత సులభం కాదు. ఎందుకంటె మనిషి అనగా కోరికల పుట్ట. ఎట్టి బేరసారాలు లేకుండా నిన్ను నీవు భగవంతునికి సమర్పించుకొని నీ బాధ్యతనంతా ఆయనకే అప్పచెప్పాలి. ఎప్పుడూ నిన్ను గురించే ఆలోచించే దురలవాటును మానుకోవాలి. నీ మనస్సుకంటె చాల గొప్పది, శక్తిగలది, సంతోషమైనది, అనంతమైనది అయిన మరో వస్తువున్నది. నీకది కావాలా లేక నీ చిన్ని కోరికల తృప్తి కావాలా?

– సంపాదకుడు

(1957-58 లో శుక్రవారం క్లాసులో జగన్మాత బుద్ధుని "ధమ్మపద" నుండి కొన్ని సూక్తులు చదివి, అవసరమైనచోట వ్యాఖ్యానాలు చేసేవారు. ఒక సూక్తిని గురించిన వ్యాఖ్యలు ఇక్కడ ఇస్తున్నాము.)

> *నైతికసూత్రాలు, నైతికప్రవర్తనవల్లకాని, విశాలమైనజ్ఞానంవల్లగాని, ధ్యానంవల్లగాని, ఏకాంతజీవనంవల్లగాని, ఆలోచనవల్లగాని ప్రపంచంలో నివసించేవారికి తెలియని మోక్ష ఆనందాన్ని నేను పొందానన్న భావన వల్లగాని ఎవరూ కూడా భిక్షువు అనిపించుకోరు. సమస్తకోరికల నిర్వాణం సిద్ధించేవరకు మీరు జాగ్రత్త వహించాలి, ఓ భిక్షువులారా!"*

మనం ఈ చివరి పాఠం చదువుదాం. అది ఆసక్తికరమైనది.

ఆనందానికి మార్గం

నైతికప్రబోధాలవల్ల, నైతికసూత్రాలు పాటించడంవల్లగానీ, విశాలవిజ్ఞానం వల్లగానీ. ధ్యానంవల్లగానీ, ఏకాంతజీవనంవల్లగానీ, ఆలోచనవల్లగానీ నిజమైన ఆనందం రాదు. అన్ని కోరికలను త్యజించడంవల్లనే ఆ ఆనందం కలుగుతుంది. అన్ని కోరికలను త్యజించడం సాధ్యం కాదు. దానికి ఒక జీవితకాలం అవసరమవుతుంది. నిజం చెప్పాలంటే, ఇది నిషేధాత్మకమైన విధానం. ఒకానొక దశలో అటు

వంటి నియమం చాలా అవసరం. అనివార్యం కూడా. ఎందుకంటే మొదట ప్రధానమైన కోరికల్ని త్యజించడం ప్రారంభించాలి. అవే నిన్ను అధికంగా బాధిస్తుంటాయి.

కోరికలు దాగివుంటాయి

తరువాత రహస్యమైన కోరికలను వదలాలి. కాని అది చేయవలసిన పనుల రూపంలో ఉంటాయి. లోపలనుండి ఆవేశాలు రావచ్చు. వాటిని కనుగొని, అధిగమించడానికి ఎక్కువ చిత్తశుద్ధి కావాలి. సమయం పడుతుంది. బాహ్య భౌతికప్రపంచంలో, భావాలు, సంవేదనలు, ఉద్వేగాల ప్రపంచంలోని, మానసికప్రపంచంలోని భావతరంగాలు – ఇటువంటి క్షుద్రమైన వాంఛల్ని తరిమికొట్టామని భావిస్తారు. కాని అవి ఆధ్యాత్మిక ప్రపంచంలో తలయెత్తుతాయి. అవి మరీ ప్రమాదం, మరీ సూక్ష్మమైనవి. వాటికన్న అదృశ్యమైనవిగా వుంటాయి. వాటిని కోరికలని అనలేము. ఒక వేళ కోరికలను వదిలించుకున్నా కూడ ఒక విధమైన ఆనందం కలుగవచ్చునేమోగాని, అది అంత గొప్పగా ఏముండదు. అది గమ్యం చేరడానికి వేగవంతమైన దారి కాదు.

నిన్ను దైవాధీనం కావించుకొనుట

మొదటిలోనే అసలు సమస్యను పట్టుకోని, సాహసంతో, కృతనిశ్చయంతో అడుగువేస్తే, కోరికల్ని వేటాడడానికి సుదీర్ఘమైన, కష్టభూయిష్ఠమైన, బాధాకరమైన, నిరాశతో కూడిన మార్గంలో ప్రయాణించడంకన్నా, చాలా సరళంగా, సర్వసమగ్రంగా, బేషరతుగా.... ఎవ్వరైనా మహోన్నత సత్యానికి, మహోన్నత సంకల్పానికి, మహోన్నత పురుషునికి తనలో తాను సమర్పించుకుంటే, ఆయన దివ్యహస్తాలలోకి తనను తాను అర్పించుకుంటే ఎటువంటి లెక్కలు వేసుకోకుండా, మొత్తం అంతర్గత చైతన్యమంతా ఏకోన్ముఖమైన వెల్లువగా మారితే, – అహంకారాన్ని త్యజించడానికి అదే అతివేగవంతమైన, అతిసమగ్రమైన మార్గం. ఇది చాలా కష్టమని అందరు అంటారు. కాని కనీసం ఒక చురుకు, ఒక ఉత్సాహం, ఒక ఉద్వేగం, ఒక వెలుగు, ఒక సౌందర్యం, ఒక తీవ్రసృజనాత్మక జీవనం వుంటాయి.

నిర్వాణమనగా నేమి?

కోరికలు లేకపోతే అహం ఏ మాత్రం జీవించదు. నిజమే అహం కరిగిపోయినప్పుడు చైతన్యం శిథిలమైపోయినట్లనిపిస్తుంది. కోరికలన్నీ భస్మీపటలమైన నిర్వాణస్థితికి చేరడానికి సన్నద్ధం కావచ్చు. కాని మన అహం పరమాత్మని తేజస్సులో అదృశ్యం కావడమే నిజమైన నిర్వాణం అని భావించాలి. ఈ ఆత్మసమర్పణ పరిపూర్ణమైతే, సర్వసమగ్రమైతే, బేరసారాలు లేని, ఎటువంటి అరమరికలు లేని సమర్పణభావనే క్రియాత్మకమైన, నిజమైన మార్గం. తనను గూర్చి తను ఆలోచించకుండా, తనకోసం బ్రతకకుండా, తనను ప్రస్తావించకుండా, అతిలోక రమణీయమైనది, రోచిర్మయమైనది, ఆనందమైనది, శక్తిప్రదమైనది, కారుణ్యసహితమైనది, అనంతమైనది ఏదో దానిని గూర్చి ఆలోచించడం – అంతకు మించిన ప్రగాఢ ఆనందం మరొకటి లేదు. అదొక్కటే విశిష్టమైనది. పొందదగినది. ప్రయత్నించ తగినది. మిగతా అంతా కాలక్షేపం చేయడమే.

ఒక పర్వతం చుట్టూ తిరుగుతూ, నెమ్మదిగా, కష్టంతో, అడుగులో అడుగు వేసుకుంటూ వందల ఏళ్ల తరబడి శ్రమించడానికి, కనిపించని రెక్కలు ధరించి శిఖరాగ్రానికి ఒక్కసారి ఎగరడానికి మధ్య వున్న తేడా అది.

*

విశ్వచేతనకు దివ్యచేతనకు తేడా

దైవంతో సాయుజ్యం చెందడానికి ఆకాంక్ష, సమర్పణ మొ॥ అనేక మార్గాలు ఉన్నాయి. సహనం, పట్టుదల, చిత్తశుద్ధితో ఒక మార్గాన్ని అనుసరిస్తే ఆ మార్గం ద్వారా దైవాన్ని పొందవచ్చును. భగవంతుని చేరాలన్న కృతనిశ్చయం వెనుకగల వ్యక్తి ప్రకృతిని ప్రేరేపించే ఉద్దేశమే ఆకాంక్ష. వ్యక్తి అహంకారపు ఇరుకుదారులలోంచి బైటపడటాన్ని సమర్పణగా నిర్వచించవచ్చును. భగవంతునికి సమర్పించుకోవడం అంటే సంకుచితమైన సరిహద్దుల్ని చెరిపివేయడం.

భగవంతుడే వ్యక్తిని సంపూర్ణంగా ఆక్రమించి, భగవంతుని లీలకు కేంద్రబిందువుగా తనను తాను రూపొందడం – ఇదీ సమర్పణ.

యోగులు ఎంతగానో అభిలషించే విశ్వచైతన్యం భగవంతుడు కాదు. నీ సరిహద్దుల్ని నువ్వు విచ్ఛిన్నం చేసుకోవచ్చును కాని విశాలత్వాన్ని, విశ్వ అనేకత్వాన్ని దైవంగా భావించడం తప్పు.

సత్యం, అసత్యం కలగలుపే విశ్వచైతన్య భ్రమణం. అక్కడ ఆగిపోవడంకన్నా మించిన అపరిపూర్ణత్వం మరొకటి లేదు. విశ్వాతీతసత్యాన్ని సిద్ధింపచేసుకోకుండా, విశ్వచైతన్యాన్ని పొందవచ్చు. అయితే భగవంతుని పొందడంవల్ల అసత్యానికి తావులేని విశ్వజనీన సిద్ధి కూడా పొందవచ్చును.

(CWM Vol. 3, pp. 267-69, 168-69)

అనువాదం: కె. యజ్ఞన్న

సమర్పణకు త్యాగానికి తేడా

యోగమనగా నిన్ను నీవు అధిగమించుట. దైవానికి సమర్పించుకోవటం వలననే ఇది సాధ్యం. కాని సమర్పించుకోవట మనగా నిన్ను నీవు త్యాగము చేసుకొనుట కాదు. త్యాగమనగా బలి ఇవ్వటం అనుకోవటం చాలా పొరపాటు. త్యాగము చేయవలసినది నీ అహంకారమును, మానసిక వ్యాపారములను, క్షుద్రమైన బుద్ధులను. నిజమైన సమర్పణవలన నీకు చాలా గొప్ప ప్రయోజనములుంటాయి. నువ్వు నీ అల్పిష్టి మనస్సును వదిలేసి మరో విశాలప్రపంచంలోకి ప్రవేశిస్తావు. నీ మానవమానసము దివ్యమానసమౌతుంది. ఒక నీటిచుక్క సముద్రంలో కలిసిపోయి దానియొక్క గంభీరతను, విశాలతను, అనంతత్వాన్ని పొందుతుంది.

– సంపాదకుడు

ప్రశ్న: అర్పణ, త్యాగము ఒక్కటి కాదా?

దేనిని త్యాగం చేయాలి?

కాదు. మన యోగంలో త్యాగానికి తావు లేదు. అయినా ఈ మాటని అన్వయించుకోటాన్ని బట్టి అంతా ఆధారపడి వుంటుంది. భగవదర్పణం అని దీనికి నిర్దుష్టమైన అర్థం. కాని ఇప్పుడీ పదం ప్రముఖంగా ప్రయోజనాత్మకంగా కాక వ్యతిరేకార్థంలో నాశనకారి అనే అర్థంలో వాడబడుతోంది. అది నష్టాన్ని, ఆత్మాహుతిని సూచిస్తుందేకాని జన్మచరితార్థతని కాదు. ఇలాంటి త్యాగం నిన్ను భౌతికస్థాయినుంచి ఆత్మోన్నతస్థాయికి ఎదగనీయదు. అది నిన్ను దిగజార్చివేస్తుంది. ఒకవేళ ప్రాణత్యాగమే చేస్తే ఇక నువ్వు జీవితంలో సాధించవలసినదేమీ చెయ్యలేవు. ఈ రకమైన త్యాగభావం ఒత్తిడికి, బలవంతానికి, సంకుచితత్వానికి, ఆత్మనిరాకరణానికి లోబడి ఉంటుంది. ఇది అసహజమైనది. నీలోని అంతరంగ విస్తృత వికాసానికి ఆటంకం.

సమర్పణయొక్క స్వరూపము

ఇలాంటి త్యాగం సమర్పణ కాబోదు. నీ సర్వస్వాన్ని ఇచ్ఛాపూర్వకంగా, ఆనందంగా, దైవానికి అర్పించుకోవటమే సమర్పణ. దివ్యోన్నత చైతన్యాంశగా దివ్యచైతన్యంతో సంలీనం కావటమే దైవార్పణ. అర్పణ నిన్ను వృద్ధిపరుస్తుందే కాని హీనస్థితికి దిగజార్చదు. నీ వ్యక్తిత్వం బలపడుతుందే కాని నీరసపడదు. నీ సమర్పణ సంతోషంగా పరిపూర్ణంగా ఇచ్ఛాపూర్వకంగా ఉండాలి. ఏ కించిత్ త్యాగభావం మదిలో మెదిలినా అది సమర్పణ అవదు సరి కదా అయిష్టంగానో, ప్రయత్నపూర్వకంగానో, బాధగానో, నిన్ను నీవు నిర్దేశించుకుని ఇచ్చుకునేదిగానో ఉంటుంది. ఫలితంగా అర్పణభావంలో ఉన్న సంతోషం లోపిస్తుంది. ఒత్తిడికి లోనై చేసేది ఏదైనా అది సక్రమం కాదని తెలుసుకోవాలి. నిజమైన సమర్పణ నిన్ను పెద్దవాణ్ణిగా చేస్తుంది. నీ సామర్థ్యాన్ని పెంచుతుంది. ఫలితంగా గుణంలోను, పరిణామంలోను శ్రేష్ఠతరంగా భాసిస్తావు. సమర్పణతో నీవొక విశాల నవలోకంలో అడుగిడినట్లు భావిస్తావు. ఇది నీకు సమర్పణవల్ల తప్ప మరోలా సాధ్యం కాదు.

సముద్రాన్ని తాకిన నీటిబిందువు వేరుగా తన ప్రత్యేకరూపాన్ని నిలుపుకోవాలనుకుంటే అది కేవలం నీటిబిందువుగానే మిగిలి వుంటుంది. చుట్టూవున్న అపారసముద్రజలాల సమ్మర్ధనంతో ఉక్కిరిబిక్కిరైపోతుంది. అలాగాక సాగరవశమై, ఐక్యత పొందిన పుడు అల్పమైన నీటిబిందువు కూడ ఆ సముద్రమంత మహా శక్తిని, స్వరూపాన్ని పొందుతుంది.

జీవాత్మ పరమాత్మలు

ఈ పరివర్తనలో సంశయానికి తావు లేదు. ఇది స్పష్టమైనది, బలీయమైనది, నిశ్చయమైనది. జీవాత్మ విశ్వాత్మ అంశ. అలాటి జీవాత్మ వేర్పాటుధోరణితో తన ప్రత్యేకతను నిలబెట్టుకోవాలనుకుంటే దివ్యోన్నత సత్యాన్ని తెలుసుకోలేదు సరికదా ఆ దరిదాపులకే పోలేదు. అలాకాక, అల్పమైన జీవాత్మ అనల్పమైన విశ్వాత్మకు అర్పణకావించుకొని అనుసంధానించుకుంటే తను పోగొట్టుకునేది తన అల్పత్వము, వేర్పాటుభావము, వికృతాలే. పొందేది అనంత దివ్యతేజస్సును, విశ్వవైశాల్యాన్ని. ఎదురుతిరగటం, తిరుగుబాటు ధోరణి అర్పణకు అవరోధాలు. ఫలితంగా నీకు ప్రాప్తించేది ఘర్షణ, ఒత్తిడి, ప్రయాస. నిన్ను దివ్యశక్తికి దూరంచేసేవి అల్పత్వ, బలహీనతలే. అర్పణభావం లేకపోతే, హరించి అదృశ్యమౌతావు. దివ్యజ్ఞానానుబంధంతో సమర్పణ కావించుకున్న వ్యక్తి అస్పష్టతలను అజ్ఞానాన్ని తొలగించుకుని ప్రక్షాళనం పొందుతాడు. విశ్వాత్మజ్ఞానశక్తులకు తనూ భాగస్వామి కాగలుగుతాడు. అలాకాక దివ్యచైతన్యానికి దూరమై ఏకాకిగా ఉంటే, అవధిలేని ఈ విశాల విశ్వంలో ఓ చిన్ననీటిబొట్టుగా మిగిలిపోతాడు. ప్రతిఘటన, బుద్ధిహీనతకి దారితీస్తుంది. నీకంటె ఎన్నోరెట్లు బలమైనశక్తితో ఢీకొంటే నీ తల పగులుతుంది. నీ మానాన నీవు నీ గూటిలో సామాన్యజీవనం సాగిస్తూన్నంతవరకు నీకు ఏ బాదరబందీ ఉండదు. కాని నీవు దైవానికి దగ్గరయేకొలదీ నీకు రెండు ప్రత్యామ్నాయాలుంటాయి. ఒకటి దైవంతో సంలీనమయేందుకు ఆత్మార్పణ కావించుకొని విస్తృతిపొంది మహిమాన్వితుడవు కావటం;

అలాకాక ప్రతిఘటించి దైవోపహతుడవై శక్తులుడిగి ఆత్మోన్నతికి నోచుకోక ఎందుండి వచ్చావో అందులోనే విలీనమైపోవటం.

(CWM Vol. 3, pp. 114-16)

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

సమర్పణ అనగా వ్యక్తిత్వాన్ని చంపుకోవడమా?

ఏకము అనేకమగుటయే ఈ సృష్టి. కాని ఈ ప్రక్రియలో మనిషి అంధకారంలో మునిగిపోతాడు. కాళ్లుచేతులు కట్టుకొని ఈ ప్రపంచంలోకి వస్తాడు. ఈ మానసిక, ప్రాణిక, దైహికములు అంతేకదా మరి. వాటి నిర్బంధాలనుంచి తప్పించుకోవాలంటె దేవుని సాయమవసరము. "నా నిజరూప మేమిటో నాకు చెప్పు" అని దైవాన్ని వేడుకున్నట్లయితే ఆయనే నీకు బంధవిముక్తి కలిగిస్తాడు. అప్పుడు నీ నిజస్వరూపమేమిటో తెలుసుకొని నీవు ఆశ్చర్యపోతావు. మునుపటికంటె వెయ్యిరెట్లు జ్ఞానంతో భాసిస్తావు. దానిని నీ స్వశక్తితో పొందలేవు. — సంపాదకుడు

సమర్పణయొక్క నిజ స్వరూపము

సమర్పణగురించి చాలా తప్పుడు భావాలు ప్రచారంలో వున్నాయి. నిన్ను నువ్వు సమర్పించుకున్నట్లయితే నీ వ్యక్తిత్వం దెబ్బతింటుందని చాలామంది అనుకుంటారు. కాని అది శుద్ధతప్పు. వ్యక్తిత్వమనగా దివ్యచైతన్యంలోని ఒక అంశమే గదా. తనలోని దివ్యాంశను ఆవిష్కరించేందుకు ఉద్దేశించబడినవాడు వ్యక్తి. కానీ నిమ్నచేతన ప్రభావంవలన వికారము చెందుతాడు. దైవంపట్ల తానేర్పరుచ్చుకున్న సక్రమవైఖరితో నిమ్నప్రకృతి తాలూకు దుష్ప్రభావాలనుంచి పునీతుడు కాగలుగుతాడు. దైవానికి చేరువయేకొలదీ నిమ్నస్థాయిలో దాపురించే అజ్ఞాన, అస్పష్ట మాలిన్యాల కతీతంగా ఉన్న వ్యక్తిత్వశక్తితో విశిష్టంగా దేదీప్యమానంగా ప్రకాశి

స్తాడు. అప్పుడు తన వ్యక్తిత్వం మహిమాన్వితమై గరిష్ఠస్థాయిలో వైభవోపేతంగా వెలుగుతుంది. నిమ్నప్రకృతికి చెందిన పరిమితులను అజ్ఞానాన్ని, దోషాలను, వికృతాలను పరిత్యజించాలి. తన నిజ వ్యక్తిత్వాన్ని పెడత్రోవ పట్టించుకోకుండా జాగ్రత్తపడాలి. ఈ సంకెళ్లనుంచి విముక్తి పొందాలి.

దైవములో వ్యక్తి పరిపూర్ణత నొందుట

వ్యక్తి ఎప్పుడూ తన వేర్పాటుతనాన్ని, అజ్ఞానాన్ని పరిమిత స్థితినే ప్రేమిస్తాడు. (The world is in love with its own ignorance – *Savitri*) ఈ ప్రేమ, ఈ నైజం వ్యక్తి శరీరాకృతికి సహజమైనది. ఇది లేకపోతే తానొక ప్రత్యేక వ్యక్తిననే స్పృహ ఉండదు. ఈ స్వభావాన్ని పదిలపరచే లక్షణం మనిషికి సహజంగా ఉంటుంది. కాని దైవానికి సంబంధించినంతవరకు ఇది పొరపాటు. ఎందుకంటే దైవంలో నువ్వు నీ వ్యక్తిత్వాన్ని పోగొట్టుకోవు. పోగొట్టుకొనవలసినది అహంకారం. నిరంహంకారంలో నీ నిజవ్యక్తిత్వం నిలుస్తుంది. దివ్యవ్యక్తిత్వం భౌతికవ్యక్తిత్వంవలె తాత్కాలికం కాదు. దివ్యచైతన్య సంసర్గజ్ఞానం నీకే పాటి వున్నా నీకు పోయేదేమీ వుండదని గ్రహిస్తావు. మృత్యువుకి అతీతుడవని తెలుసుకుంటావు. నశించేది భౌతికశరీరమే కాని నిజవ్యక్తిత్వం కాదని నీకు తెలుస్తుంది. ఉన్నత రూపాంతరీకరణ సంసర్గంలో నీ భయాలన్నీ పటాపంచలైపోతాయి. భౌతికశరీరం మృదుత్వాన్ని సంతరించుకుంటుంది. నిజవ్యక్తిత్వం కోల్పోకుండా నీవెలా కావలిస్తే అలా మలుచుకోగలుగుతావు. ఇప్పుడు కూడా నీ శరీరం జడము. ఇతరుల తాలూకు సుఖదుఃఖాల ప్రకంపనలు మనలను కదిలిస్తాయి. వారిపట్ల సానుభూతి, సద్భావాలు కలుగుతాయి. ఆ కదలికలు మనస్సులో ప్రస్ఫుటమౌతాయి. ముఖం మనసుకి అద్దం పడుతుంది.

(CWM Vol. 3, pp. 116-17, 169)

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

శరణాగతి

మనిషి అజ్ఞానంలోంచి బైటపడేందుకు దేవుని సహాయాన్ని కోరు తాడు. నిన్ను నీవు సమర్పించుకోవటంవలన ఈ సహాయం లభి స్తుంది. మొదట "నేను నీ వాడనే" అని నీ మనస్సుతోను, "నేను నీకు బందీని, నన్ను వశం చేసుకో" అని నీ హృదయంతోను నివేదించుకుంటావు. నీకు తెలియకుండానే నీలోని అనేక విష యాలు ఎదురుతిరుగుతూ వుంటాయి. దీని కొక్కటే మందు. నువ్వు నిదానంగా నిన్ను శోధించుకొని మూలమూలల్లో నక్కి వున్న దొంగలను పట్టుకొని దైవానికి చూపించాలి. నిన్ను నీవు చాలా క్షుణ్ణంగా, నిశ్శేషంగా సమర్పించుకోవాలి. నీ వ్యక్తిత్వాన్ని అంతటిని నీ ఆత్మచుట్టు ఐక్యము చేసినప్పుడుగాని నీ సమ ర్పణ పూర్తికాదు.

— సంపాదకుడు

దైవమే శరణము

నీ జీవితభారాన్ని సంపూర్ణంగా దైవానికి అప్పగించడమే శరణాగతి. ఈ నిర్ణయమే లేకపోతే ఏదీ సాధ్యం కాదు. యోగసాధన ప్రసక్తే ఉండదు. యోగసాధన శరణాగతితోనే ప్రారంభమవుతుంది. జ్ఞానమార్గం లోగానీ, భక్తిమార్గంలోగానీ శరణువేడుకోవచ్చు. భగవంతుడు మాత్రమే సత్యమనే విషయము నీ అంతరంగంలో ప్రగాఢంగా దీపించవచ్చు. లేదా దైవం వినా నువ్వు బ్రతకలేవని అనిపించ వచ్చు. ఆనందంగా వుండాలంటే ఇదొక్కటే మార్గమనే అంతర్గత స్పందన నీలో కలగవచ్చు. "నేను పూర్తిగా ఆ దైవానికి

చైత్యపురుష ప్రభావము

చెందిన మనిషినే తప్ప నాదంటూ ఏమీ లేద" నే దృఢనిశ్చయంతో చైత్యపురుమని యిచ్ఛానుగుణంగా సర్వమూ దైవానికి అప్పగించుకోవచ్చు.

ఆ తర్వాతే ఆత్మార్పణ జరుగుతుంది. "మంచి, చెడు, చీకటి వెలుగుల సమిశ్రితజీవినైన నేను వున్నపాళంగా నీకు అర్పితమవు తున్నాను. ఉచ్చనీచాలు, పరస్పర విరుద్ధమైన ధోరణులు, ప్రేర

నీలోని వెలుగు నీడలు

ఱలు మొదలైన వాటన్నిటితోను నన్ను స్వీకరించి, నీ ఇచ్ఛవచ్చిన రీతిలో నన్ను పాలించు తండ్రీ" అని వేడుకుంటావు. ఈ విధంగా ఆత్మార్పణ చేసుకుంటూ ఈ భావానికి నాంది పలికిన నీ చైత్య పురుషుని సంకల్పానుసారంగా నీ వ్యక్తిత్వాన్ని ఏకోన్ముఖం చేయ నారంభిస్తావు. నీ వ్యక్తిత్వంలోని తంతువుల నన్నిటినీ శ్రుతి కలిపి ఒకదాని తర్వాత ఒకటిగా కేంద్రసత్తలో విలీనం చేయాలి. ఇలా నీలోని వివిధాంశాల ఏకీకరణ కాకుండా స్వతఃసిద్ధంగా నిన్ను ఆ పరమేశ్వరునికి సమర్పణ కావించుకోగలవు కానీ అదంత ఫలప్రదం కాదు. నీ వ్యక్తిత్వం ఎంత ఏకీకృతమైతే నీ ఆత్మార్పణ అంత సంపూర్ణమవుతుంది.

నీ సమర్పణకు పరాకాష్ఠ

ఈ విధంగా సర్వసమర్పణ పూర్తికాగానే యిక నిన్ను నీవు ఆహుతి (consecration) చేసుకుంటావు. నీ సాధనా క్రమంలో పరాకాష్ఠ అయిన ఈ ప్రపత్తి తర్వాత ఏ విధమైన కష్టాలు లేకుండా అంతా సవ్యంగా సాగుతుంది. అయితే ఒక్కసారే సమగ్రంగా నిన్ను నీవు నివేదించుకోలేవనే విషయం మాత్రం గుర్తుంచుకోవాలి. సాధారణంగా మొదట్లో ఒకటి రెండు రోజులు నిన్ను నీవు సంపూర్ణంగా నివేదన చేసుకున్నావనే భ్రమ నీకు కలుగవచ్చు. ఇక అంతా దానంతటదే సాగిపోతుందని అనుకోగలవు. అలా అనుకొని ఆత్మతృప్తి ఏమాత్రం పొందినా నీ పురోగతిని నీవే ఆలస్యం చేసుకుంటావు. ఎందువల్లనంటే నీలో పరస్పర

నీలోని విరోధశక్తులు

విరుద్ధమైన అనేక సంస్కరణలు పోరు పెడుతుంటాయి. ఒక విభాగము దైవానికి తనను తాను నివేదించుకుంటే మిగతా భాగాలు ఒప్పుకోవు. "మమ్మల్ని మేము సమర్పించుకోలేదు" అంటాయి. అంతేకాక తమ స్వేచ్ఛకోసం, గుర్తింపుకోసం ఘోషించడం ప్రారంభిస్తాయి. వాటన్నిటినీ నీవు సమాధానపరచి పరమ సత్యాన్ని వాటికి చూపించాలి. ఓపిగ్గా నీలో నీవు కలయచూసుకుంటూ మూలమూలల్లో శోధించి తిరుగుబాటుచేస్తున్న అంశా

లకు ఎదురునిలిచి వాటికి నచ్చచెప్పాలి. ఈ విధంగా నీ మానసిక, ప్రాణిక దైహిక విభాగాలన్నిటినీ క్షుణ్ణంగా పరిశీలించి అవన్నీ తాముగా దైవానికి నివేదించుకునేటట్లు చేస్తే అప్పుడే నీ సమైక్య సమర్పణ సంపూర్ణంగా జరిగినట్లవుతుంది. ఇక ఏ రకమైన కష్టాలూ వుండవు. అపుడిక నీవు అంధకారంలోనుంచి జ్ఞానజ్యోతివైపు కాకుండా జ్ఞానంనుండి విజ్ఞానానికీ, వెలుగునుంచీ దివ్య కాంతి దగ్గరకూ, ఆనందంనుంచి అమందానందం వైపుకు నడుస్తూ రూపాంతరీకరణకు ప్రయత్నిస్తావు.

దైవానుగ్రహమే ముఖ్యాధారము

సంపూర్ణమైన ప్రపత్తి అంత సులభతరమైనది కాదనేది నిర్వివాదాంశము. నీ అంతట నువ్వే చేయాలంటే ఎంతకాలం పడుతుందో నిర్దిష్టంగా చెప్పలేము. భగవత్కాటాక్షముంటే మాత్రం అలా జరగదు. కొద్దికొద్దిగా దైవబలం అప్పుడప్పుడు అన్నివైపులా సహాయపడితే అది సులభసాధ్యమే. అది ఎంతకాలంలో సాధ్యపడుతుందనేది వ్యక్తి మీద ఆధారపడి వున్నప్పటికీ పట్టుదలతో ఉంటే త్వరగానే పూర్తికావచ్చు. గట్టి నిశ్చయముంటే చాలు. దేన్నైనా సాధించవచ్చు.

(CWM Vol. 3, pp. 126-27)

అనువాదం: ఎ. వెంకటరామశాస్త్రి, ఎ. ప్రభావతి

In the mere fact of not thinking of oneself, not existing for oneself, referring nothing to oneself... there is such a profound delight that nothing can be compared to it

The Mother

సమర్పణ – ఒక అద్భుతమైన ఫిల్టర్

సామాజిక జీవితంలో ఒకరిమీద ఒకరి ప్రభావం తప్పకుండా వుంటుంది. నీ పరిసరములనుండి, ఇతర మానవులనుండి వారి వ్యక్తిగత తరంగములు బహిర్గతమౌతూ వుంటాయి. వాతావరణమంతా మనుమల కోపతాపాలతోను, ఇతర లక్షణాలతోను నిండిపోయి వుంటుంది. నువ్వు ఊపిరితీసుకున్నప్పుడల్లా గాలితోపాటు ఆ తరంగాలు కూడ నీలోకి ప్రవేశించి నిన్నేడిపిస్తాయి. అంటువ్యాధు లున్నప్పుడు ముక్కుకు గుడ్డ కట్టుకున్నట్టుగానే ఈ బాధలను తప్పించుకుండేందుకు నువ్వొక కవచాన్ని ధరించాలి. దైవమే ఆ కవచము. దైవానికి సంపూర్ణంగా సమర్పించుకోవాలి. నువ్వు చాల అప్రమత్తంగా వున్నట్లయితే నిన్ను సమీపించే శక్తులన్నీ అక్కడికక్కడే ఆగిపోతాయి. కొంతమంది మనుమలు నీకు కీడు తలపెట్టే వాళ్లుంటారు. ఆ తలపులు రూపుదాల్చి నీలోకి ప్రవేశిస్తాయి. గాలిలో ఇటువంటి శక్తులు అనేకం తేలుతూ వుంటాయి. వాటిని ఒక్కొక్కదాన్ని పరిశీలించి చూడటం చాలా శ్రమతో కూడిన పని. చాల టైము పడుతుంది కూడాను. అలా కాకుండా నిన్ను నీవు నిశ్శేషంగా దైవానికి సమర్పించుకున్నావనుకో. అప్పుడు ఆయన వెలుగు నిన్ను పరివేష్టించి ఒక అద్భుతమైన ఫిల్టరువలె పనిచేస్తుంది. నీమీదకు దాడిచేసే కీడుగాని, అవాంఛనీయమైన సంఘటనగాని ఆ ఫిల్టరు దగ్గిర ఆగిపోవలసినదే. ఆ శక్తులు ఎక్కడినుంచి బయిలదేరినయ్యో అక్కడికే తిరిగి వెళ్లిపోతాయి. నీకు హాని కలిగించే శక్తి ఏదైన నీ దగ్గరకు వస్తుందనుకో – నీ ద్వారములు మూసి వుండటంవలన అది అక్కడే ఆగిపోతుంది. ఒక్క దైవశక్తులకు (స్పందనలకు) మాత్రమే నీ ద్వారములు తెరచుకుంటాయి

(CWM Vol. 6, pp. 214-15)

అనువాదం: ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి, రా॥ లక్ష్మీప్రసాదమ్మ

సమర్పణ – సవివరణ

'యుజ్' అనే ధాతువునుండి వచ్చిన పదము యోగము. అనగా కలుపుట. కాని దైవము మనకు కనపడడు కదా? మరి ఆయన్ని పట్టుకోవడమెలా? ఈ పని ఆయనకే అప్పచెప్పాలి. "హే భగవాన్, నేను నీ సేవకుడను. నా జీవితాన్ని నీ కంకితం చేస్తున్నాను" అని చెప్పాలి. ఈ అంకితభావాన్ని సవిస్తరంగా అమలుచేయాలి. అడుగడుగునా దానిని నిర్ధారించుకుంటూ పోవాలి. ఎంత చిన్నవిషయమైనా సరే వదలకుండా నీ సర్వస్వాన్ని ఆయన వశం చేయాలి. ఎంత క్షుణ్ణంగా అంకితం చేసుకుంటే అంత చకచకా నీ సాధన సాగిపోతుంది. మనది పూర్ణయోగం. నేను ధ్యానం చేసుకుంటున్నప్పుడు దేవుడ్ని గుర్తు చేసుకుంటాను. మిగతా సమయాలలో యథేచ్ఛగా వుంటాను అంటే కుదరదు. కలలో కూడా ఏమరుపాటు పనికిరాదు.

– సంపాదకుడు

ప్రశ్న: యోగమార్గంలో ముందుకు సాగాలంటే దైవానికి మొత్తం సమర్పించుకోవాలంటారు కదా! తనదైన అత్యల్పమైన విషయాలనూ, అప్రధానమైన చర్యలనూ కూడా అర్పించేసుకోవాలనటంలోని అంతరార్థమేమిటో?

యోగమంటే దైవంతో సమాగమము; అది దైవానికి నిన్ను నీవు సమర్పించుకోవటంతో మొదలవుతుంది. ప్రారంభంలో "నేను దైవానికి దాసుడను, నా జీవితం దైవానికి మాత్రమే అంకితం; ఈ నా ప్రయత్నమంతా దివ్యజీవనం పొందడానికే" అని మామూలుగా చెప్పినట్లు చెప్పి సరిపోయిందనుకుంటాము. కానీ ఇది మొదటి మెట్టు మాత్రమే. కేవలం అలా అనుకున్నంతమాత్రాన సరిపోదు. *నీ జీవితమంతా భగవదర్పణంగా గడపాలని నిశ్చయం చేసుకుంటే అది ప్రతిక్షణం మననం చేసుకుంటూ నీ చర్య లన్నిటిలోనూ వివరంగా దాన్ని నిరూపించుకోవాలి.*

నువ్వు దైవానికే చెందినవాడివి

అడుగడుగునా దైవానికి చెందినవాడివనే ఎరుక నీలో ఉండాలి. నీ ఆలోచనల్లో, చేతలలో పనిచేస్తున్నది ఆ దివ్యచైతన్యమేననే అనుభూతి నీలో కలగాలి. ఇక నీదనేది వుండకూడదు. అంతా ఆ దైవాన్నుంచే వస్తోందనే భావనతో అంతా ఆ దైవానికే అర్పించాలి. ఈ భావన నీకు కలిగినప్పుడు సాధారణంగా అల్ప విషయాలని అశ్రద్ధగా వదిలేసిన విషయాలు కూడా ఎంతో ప్రాధాన్యత పొందుతాయి. నీ దృక్పథం చాలా విస్తృతమవుతుంది.

దేవుని సమక్షము నందుండుట

సాధారణ సమర్పణను జీవితంలో వివరంగా అమలుజరపాలంటే ఇలా నడచుకోవాలి. *నిరంతరం భగవంతుని సన్నిధిలోనే జీవించు. ఏ పని చేస్తున్నా ఆ దివ్యత్వమే నీలో ఉండి చేస్తున్నట్లు భావించు.* నీ కదలికల నన్నిటినీ దానికే అర్పించు. నీ ఆలోచనలూ, భావనలే కాకుండా తినడం, తాగడం వంటి అతిసాధారణ కృత్యాలను కూడా ఆ దైవమే నీ ద్వారా చేస్తున్న భావనలో నిరంతరం ఉండాలి. ఈ విధంగా నీ జీవన గతులన్నీ దివ్యత్వంతో కలిసి జరిగినప్పుడు నీలో భిన్నత్వం లేకుండా ఏకత్వమే రాణిస్తుంది. ఇక నీలో కొంతభాగం మాత్రమే దైవానికి కేటాయించి మిగతాదంతా సాధారణ విషయాల్లో మునిగి తేలడం కాకుండా మొత్తం జీవితం దైవకైంకర్యమవుతుంది. క్రమంగా నీలో సమగ్ర రూపాంతరీకరణ సిద్ధిస్తుంది.

సూక్ష్మాతి సూక్ష్మమైన నివేదన

పూర్ణయోగసాధన అంటే ప్రతి చిన్న వివరంతో సహా సమగ్ర జీవితమే పరివర్తనజెంది దివ్యమైపోవాలి. ఇందులో అక్కర్లేనిదీ, అల్పమైనదీ లేదు. "ధ్యానంలోనూ, ఆధ్యాత్మిక గ్రంథాలు చదువుకునేటప్పుడూ, సత్సంగంలోనూ వెలుగు కోసం తపిస్తూ దాన్ని ఆహ్వానించే స్థితిలో ఉంటాను. కానీ బయట తిరుగుతూ, స్నేహితులతో మాట్లాడేటప్పుడు మాత్రం ఇదంతా వదిలేస్తాను" అనుకుంటే మాత్రం నీలో ఏ మార్పు జరగదు. నిజమైన ఐక్యత జరగకుండా విడివిడిగానే ఉండిపోతావు. ఏదో కొద్దిగా

శ్రేష్ఠ జీవిత ఛాయలను మాత్రం కొద్ది కొద్దిగా దర్శించగలవేమో. ధ్యానంలోనూ, అంతర్గత చైతన్యంలోనూ కొన్ని కొన్ని అనుభవాలూ, సిద్ధులూ కలుగవచ్చునేమో కానీ నీ శరీరంలోనూ, బాహ్య జీవితంలోనూ ఏ మార్పూ లేకుండానే ఉండిపోతావు.

ప్రశ్న: ఆలోచనల్లో నిమగ్నమై వున్నప్పుడూ, మెదడుతో పని చేసేటప్పుడూ దైవాన్ని మరచిపోతామెందుకని? దైవంతో సంపర్క కూడా ఉండదెందుకని?

నీ చైతన్యమింకా వేర్వేరు భాగాలుగా ఉండటమే దానిక్కారణము. నీ మనస్సులో దైవమింకా స్థిరపడలేదు. దివ్యజీవనానికి నీవు పూర్తిగా అంకితం కాలేదన్న మాట. పూర్తిగా అంకితమైతే నీవు ఎన్ని పనుల్లో మునిగితేలుతున్నాకూడ దైవం నీతో వుండి సహాయం చేస్తున్నట్లు గమనించే వాడివే.

నీ కార్యకలాపాలన్నిట్లో, సాధారణమైనవీ, బౌద్ధికమైనవీ ఏ పనుల్లో ఉన్నప్పటికీ "స్మరించు, సమర్పించు" అనేది నీకొక మంత్రం కావాలి. చేసే ప్రతి పనిని భగవదర్పణంగా చేయటం వలన నీ పనులన్నీ అద్భుతంగా జరిగిపోతాయి. చెడ్డగా పరిణమించవు.

ప్రశ్న: అమ్మా! ఆరంభంలో మీరు చెప్పినట్లుగానే చేస్తాము కానీ పూర్తిగా పనిలో లీనం కాగానే మరచిపోతాము. గుర్తుంచుకోవాలంటే ఏం చేయాలి?

మనకు యోగసిద్ధి అనే లక్ష్యం ఒకటుంది కదా! అదే పరాకాష్ఠ. అదే మోక్షం. మిగతాదంతా అందుకు సన్నాహమే. అదే దివ్యచైతన్యం, దైవం వినా నీవు అశక్తుడవనీ, ఏమీ చేయలేవనీ అనుకోవడమే. ఆ పరిస్థితి వచ్చినప్పుడు దైవసన్నిధి లేకపోతే నీవు చేసే పనికి అర్థం కనిపించదు. నీ జ్ఞానం, శక్తి మొదలైనవన్నీ మాయమైపోతాయి. అలా కాకుండా నీవు వుపయోగించుకుంటున్నది నీ స్వశక్తే అని అనుకున్నన్నాళ్లూ దైవసహాకారం నీకు లభించదు.

దేవుని జ్ఞాపకం పెట్టుకోడమెలా?

యోగసాధన మొదలుపెట్టిన ప్రారంభంలో తరచుగా దైవాన్ని విస్మరించడం జరుగుతుంది. కానీ ఆకాంక్షను నిరంతరం జ్వలింప చేసుకుంటుంటే మర్చిపోవడం క్రమంగా తగ్గిపోయి జ్ఞాపకం పెరుగుతుంది. అయితే అదేదో బలవంతంగా కాకుండా ప్రేమగా, సంతోషంగా చెయ్యాలి. అలా కొంతకాలం జరిగినప్పుడు ఇక భగవంతుని తోడులేకుండా, అంటే దైవస్మృతి లేకుండా పనిచేయవలసివస్తే చాలా ఒంటరితనం, దుఃఖం, దైన్యం నిన్ను ఆవహించేస్తాయి.

దైవమే నీ సర్వస్వము

ఎప్పుడైతే దైవం తోడు లేకపోయినా పనిచేసుకోగలుగుతూ, నిశ్చింతగా సుఖంగా ఉన్నట్లు నీకు అనిపిస్తుందో అప్పుడు ఆ విభాగాన్ని నీవు దైవానికి సమర్పితం చేసుకోలేదని తెలుసుకోవాలి. సాధారణ మానవులు ఆ విధంగా భగవంతుని అవసరం లేకుండానే ఉండిపోతారు. కానీ దివ్యజీవితం కోరేవారి పద్ధతి వేరు. ఇంకా నీవు దైవంతో సంపూర్ణంగా ఐక్యత పొందిన తర్వాత మాత్రం ఆ దైవం రెప్పపాటుకాలం నీనుంచి దూరమైనా నీ ప్రాణం విలవిల్లాడిపోతుంది. ఎందువల్లనంటే ఇప్పుడిక నీ ప్రాణంలో ప్రాణం, నీ జీవనాధారం, నీ జీవితం అంతా ఆ దైవమే. దైవమే లేకపోతే నీకు ఉనికి లేదు.

(CWM Vol. 3, pp. 23-27)

అనువాదం: ఎ. ప్రభావతి, ఎ. వెంకటరామశాస్త్రి

నీలోని అపస్వరా (భిన్న విభిన్న పోకడల) లన్నిటిని పోగుచేసి ఒకే త్రాటిక్రింద ఐక్యపరచుటయే యోగలక్ష్యము.

శ్రీమాత

సరియైన వైఖరి

నువ్వు నిన్ను దేవునికి సమర్పించుకున్నావు కదా అని కాలు మీద కాలు వేసుకొని కూర్చునేవు జాగ్రత్త! నీ బుద్ధిని అటూ యిటూ పరుగెత్త నివ్వకూడదు. 'నీ యిచ్ఛయే జరుగు గాక' అని నువ్వు దైవసంకల్పాన్ని నెరవేర్చేందుకు మాధ్యమంగా నిల బడాలి. నిద్రలో కూడ నీకు జ్ఞానం కలగాలనుకుంటే "నేను నా నిద్రను సచేతనం చేయాలని ఉంది. నేనేం చేయవలెనో దైవమే నాకు మార్గదర్శకమగు గాక" అనే ధ్యాస నీలో ముఖ్యంగా వుండాలి. మరో విషయం, ఏ అభిప్రాయము లేకుండా శూన్య మనస్కుడవై వుండకూడదు. అస్తవ్యస్తంగా వుండి ఏ గాలి వీస్తే ఆ గాలికి కొట్టుకుపో కూడదు. దైవేచ్ఛని అమలుపరచా లంటే ఉత్సాహంతో, ఎక్కుపెట్టిన బాణమువలె లక్ష్యాన్ని ఛేదిం చేందుకు ఎల్లప్పుడు సంసిద్ధుడవై ఉండాలి. — సంపాదకుడు

నీ బుద్ధిని దైవానికి సమర్పించుట

నువ్వు భగవంతునికి సమర్పించుకుంటే నువ్వు ప్రయత్నానికి ఉద్వాసన చెప్పాలి. కాని దాని అర్థం సంకల్పబద్ధమైన సమస్త చర్యల్ని విడిచిపెట్టడం కాదు. దీనికి విరుద్ధంగా, నీ సంకల్పాన్ని భగవత్ సంకల్పానికి అర్పించుకుని జ్ఞానసిద్ధిని త్వరితం చేయాలి. అది కూడా మరోరూపంలో సమర్పణే.

నువ్వు చేయవలసింది నిష్క్రియాత్మక సమర్పణ కాదు. ఒక రాయిగా మారడం కాదు. భగవత్ సంకల్పానికి నీ సంకల్పాన్ని అర్పించుకోవాలి.

ప్రశ్న: సాయుజ్యం పొందడానికి ముందు ఈ సమర్పణ ఎలా చేయాలి?

నిద్రలో కూడ అప్రమత్తత

నీకు ఒక బుద్ధి (will) ఉంటుంది గదా. ఆ బుద్ధిని నువ్వు సమర్పించుకోవచ్చు. రాత్రుల సమయంలో నువ్వు స్పృహతో ఉండడం దీనికి ఉదాహరణగా తీసుకోవచ్చు. నువ్వు

నిష్క్రియాత్మక సమర్పణ వైఖరి వహిస్తే "నేను ఎరుక కలిగి వుండాలని భగవత్ సంకల్పమైతే, అప్పుడు నేను ఎరుకతో వుంటాను" అని నీ వంటావు. దీనికి భిన్నంగా నువ్వు నీ సంకల్పాన్ని భగవత్ సంకల్పానికి సమర్పిస్తే, నువ్వు సంకల్పించడం ప్రారంభిస్తావు. "నేను రాత్రుల సమయంలో స్పృహతో ఉంటాను" అని నీ వంటావు. అది జరుగుతుందని నీకు దృఢసంకల్పం ఉంటుంది. నువ్వు నిష్క్రియాత్మకంగా కూర్చొని నిరీక్షించవు. 'నా సంకల్పాన్ని భగవత్ సంకల్పానికి అర్పిస్తాను. రాత్రుల సమయంలో స్పృహతో వుండాలని తీవ్రంగా కోరుతున్నాను. నాకు సరియైన జ్ఞానం లేదు. నా కోసం భగవత్ సంకల్పం పని చేయును గాక' అని సద్వైఖరిని అవలంబిస్తే సమర్పణ సాధ్యపడుతుంది.

నీ దృష్టిని కేంద్రీకరించుట

నీ సంకల్పం నెమ్మదిగా, సుస్థిరంగా పని చేయాలి. ఏదో ఒక కార్యం ఎంచుకుని, లేదా ఏదో ఒక నిర్దిష్టవస్తువును కోరుతూ కాదు. లక్ష్యంపై కేంద్రీకరిస్తూ ప్రగాఢమైన ఆకాంక్షగా ఆ సంకల్పం ఉండాలి. ఇది మొదటి సోపానం. నువ్వు అప్రమత్తంగా ఉంటే, ఏం చేయాలో, ఏం చెయ్యడానికి ముందడుగు వేయాలో నీకు ఒక ఆవేశం (inspiration) రూపంలో ఏదో ఒక ఆవేశాన్ని తప్పక అందుకుంటావు. నువ్వు భావించిన దానికన్నా ఫలితం విభిన్నంగా ఉన్నా సరే, నీ చర్య ఫలితాన్ని నువ్వు ఆమోదించటమే సమర్పణ అని నువ్వు గుర్తు పెట్టుకోవాలి. అయితే, నీ సమర్పణ నిష్క్రియాత్మకమైతే, నువ్వేమీ చేయవు. దేనికీ ప్రయత్నించవు. ఒక అద్భుతం జరగాలని నిరీక్షిస్తూ నిద్రకు ఉపక్రమిస్తావు. దివ్యసంకల్పంతో నీ సంకల్పం లేక నీ ఆకాంక్ష ఒక ఒప్పందం కుదుర్చుకున్నదా లేదా అని తెలుసుకోడానికి, నీకు సమాధానం వచ్చిందో, రాలేదో, నీలోని మనస్సు, ప్రాణికం, శరీరం కాకుండా, నీ హృదయంలో, నీ అంతశ్చేతనలో ఎల్లప్పుడూ ఉండేదో నీకు ఊతమిచ్చిందో, వ్యతిరేకించిందో నువ్వు గ్రహించాలి.

*

ప్రతిరోజు, ప్రతిక్షణము సత్యాన్వేషణ

ఈ విషయాన్నే శ్రీఅరవిందులు ఒక లేఖలో[1] ప్రస్తావించారు. అదే నేను చదవబోతున్నాను. నువ్వు నిర్ణయించుకోవాలి. ఎప్పటికప్పుడు ఆ నిర్ణయం నీ ముందుకు తీసుకురాబడుతుంది. ఎప్పటికపుడు నువ్వు నిర్ణయించుకోవాలి. నీవు నిశ్చయించుకోలేకపోతే నువ్వు పురోగమించలేవు. నీవే నిర్ణయించుకు తీరాలి. నీ కోసం నిశ్చయించే శక్తి ఏదీ లేదు. అదృష్టం కాని, విధి కాని, యాదృచ్ఛికం కానీ ఏదీ లేదు. అది నిజం కాదు. నీ సంకల్పం స్వేచ్ఛతో కూడినది. ఉద్దేశ్యపూర్వకం గానే అది స్వేచ్ఛమయమై వదిలివేయబడుతుంది. నువ్వే నిర్ణయించుకోవాలి. దివ్యమహాత్కాంతి (Light) ని అన్వేషించాలి, సత్యాన్ని ఆకాంక్షిస్తూ సేవకునిగా ఉండాలి – ఈ విషయంలో నువ్వే నిర్ణయించుకోవాలి. అసలు ఆకాంక్ష ఉండాలా వద్దా అన్న విషయం కూడ నువ్వే నిర్ణయించుకోవాలి.

నువ్వు నిరంతరం దైవాన్నెంచుకోవాలి?

నీ సమర్పణను సమగ్రం చేసుకో, నీ కోసం పనిచేయబడుతుంది అని నీతో అన్నప్పుడు, అది సరియైనదే. కాని నీ సమర్పణ సమగ్రం కావాలంటే, నీ సమర్పణ సమగ్రం కావాలని ప్రతిరోజూ, ప్రతిక్షణం సమర్పణ సమగ్రం కావాలని నువ్వు నిర్ణయించుకోవాలి. లేకపోతే నువ్వు ఆ పని చేయలేవు. ఆ పని దానంతట అదే జరగదు. దానిని చేయవలసింది నువ్వే.

అలా జరిగినప్పుడు అంతా సక్రియమే. నీకు జ్ఞానం సిద్ధించినప్పుడు అంతా సవ్యంగా సాగుతుంది. నువ్వు దైవంతో సాయుజ్యం చెందితే ఇంకా బాగా సాగుతుంది. కాని అంతవరకు నువ్వే నిర్ణయించాలి, సంకల్పించాలి, ఎంచుకోవాలి. "నాకోసం సమర్పణ జరిగిపోతుంది. నేనేమీ చెయ్యనక్కర్లేదు. నిద్ర ప్రవాహంలో హాయిగా జారిపోతా!" అని అనుకుంటూ బద్ధకంగా నిద్రకు ఉపక్రమించ వద్దు. అది నిజం కాదు. సమర్పణ దానంతట అది

---

[1] యోగం పై లేఖలు పుటలు 1310-11

జరగదు. ఏదైనా చిన్న అడ్డంకి నీ సంకల్పాన్ని విచ్ఛిన్నం చేస్తే, "అది కాదు" అంటుంది నీ సంకల్పం. అప్పుడేం చేయాలి?

*

ప్రశ్న: "నువ్వు భగవానునికి సమర్పించుకుంటే ప్రయత్నాన్ని విరమించాలి. కాని దాని అర్థం సమస్త సంకల్పబద్ధమైన కర్మలన్నింటిని వదిలివేయాలని అర్థం కాదు" అని మీరన్నారు.

(ప్రశ్నలు, జవాబులు 1929 ఏప్రిల్ 21)

కాని ఏదైనా చెయ్యాలని అనుకున్నప్పుడు అది వ్యక్తిగత ప్రయత్నం అవుతుంది. అంతే కదా! సంకల్పం మాట ఏమిటి?

వ్యక్తిగత ప్రయత్నము – దైవేచ్ఛ

సంకల్పానికి, ఈ ప్రయత్నానికి (feeling of tension) మధ్య తేడా ఉంది – తనకు మాత్రమే సంబంధించింది వ్యక్తిగత ప్రయత్నం.

దృష్టిని ఏకాగ్రపరచుట

ఈ విధమైన టెన్షన్ చాలా తీవ్రమైనది. బాధాకరమైనది. ప్రతిక్షణం ప్రయత్నం చేయకపోతే అంతా పోగొట్టుకోవలసి వస్తుందన్న భావన. అది వ్యక్తిగత యత్నం. కాని సంకల్పం అంటే పూర్తిగా భిన్నమైనది – నువ్వు చేసే ప్రతి పనిపై ఏకాగ్రం చేసే శక్తి. సంకల్పం: నువ్వు ఉత్తమ పద్ధతిలో చేయగల్గింది అంతా చేయడం. అది పూర్తయిందని కచ్చితంగా లోనుండి ఆదేశం వచ్చే వరకు ఆ పనిని ఆపకూడదు. నీకు వివరించడం కష్టం కాని ఉదాహారణకు యాదృచ్ఛిక సంఘటనల ద్వారా కాకతాళీయంగానే నీ చేతులకు ఒక పని కల్పించబడిందనుకుందాం. కళాకారుని సంగతి తీసుకో. ఒక చిత్తరువును వెయ్యాలన్న ఆవేశం అతనికి వస్తుంది. చిత్తరువు గీయాలని తీర్మానించుకుంటాడు. తనకు ఆవేశం లేకపోతే, తనకతీతమైన శక్తుల ప్రోద్బలం లేకపోతే, తను ఏమీ చేయలేడని అతనికి తెలుసు. అతను ఆ స్థితిలో గీసిన చిత్రం ఏదో రంగులు పులమడం తప్ప అది చిత్తరువు కాదని అతనికి తెలుసు. అంత సవ్యంగా తీర్మానించి, అతను చిత్తరువు గీయాలని గట్టిగా అభిలషిస్తే, అతనికి నిష్క్రియావైఖరి మాత్రమే

ఉంటే – అతను తన బ్రష్, కాన్వాస్, రంగులు ముందు వేసుకుని, భగవంతునితో ఇలా అంటాడు: "ఇప్పుడు నువ్వు చిత్తరువును గీయబోతున్నావు".

పని చేయవలసినది నువ్వే

కాని భగవంతుడు ఏ పనీ అలా చెయ్యడు. చిత్రకారుడే సమస్తం సిద్ధం చేసుకుని, తన మనస్సును ఏకాగ్రం చేసుకోవాలి. రూపాలు, రంగులు వెతుక్కోవాలి. మరింత పరిపూర్ణమైన రూపకల్పన కోసం తన సంకల్పాన్ని కేంద్రీకృతం చేయాలి. ప్రతిక్షణంలోను అతని సంకల్పం ఉండాలి. ఆవేశానికి అతని మనస్సు తెరచుకుని ఉండాలి. కళకు సంబంధించిన జ్ఞానం ఎంత వున్నా, తన రంగులు, డిజైన్‌ను సిద్ధం చేసుకోవడంలో ఎంత జాగ్రత్తపడినా, అతనికి ఆవేశం లేకపోతే, ప్రపంచంలోని లక్షలాది చిత్రాలలో అదీ ఒకటి అవుతుంది. అతను గీసే చిత్రం ఆసక్తి కల్గించదు. తన చిత్తరువు దేనిని వ్యక్తం చేయదలచుకున్నదో, దానిని ఏ విధంగా వ్యక్తం చేయాలో అతను వీక్షించడానికి ప్రయత్నిస్తాడు. రంగులు, కుంచె, మోడల్‌ను సిద్ధం చేసుకుని స్కెచ్ గీసుకుని ఆవేశం కోసం ఆవాహన చేస్తాడు. ఏం చెయ్యాలో కొందరికి సుస్పష్టమైన vision వుంటుంది. రోజుల తరబడి, గంటల తరబడి, పనిచేయాలి, అధ్యయనం చెయ్యాలి, జాగ్రత్తగా చెయ్యాలన్న సంకల్పం వారిలో ఉంటుంది.

క్రియాశీలమైన సమర్పణ

అప్పుడే ఆవేశాన్ని పరిపూర్ణంగా అభివ్యక్తం చేయగల్గుతాడు. నిష్క్రియపద్ధతిలో కాకుండా, నిష్క్రియ సమర్పణ కాకుండా, భగవంతునితో సంస్పర్శ పొందుతూ భగవంతుని కోసం క్రియాత్మకమైన సమర్పణ, క్రియాత్మకమైన సంకల్పంతో అతను తన పనిని నిర్వర్తిస్తాడు. అప్పుడు ఫలితం అద్భుతంగా వుంటుంది.

*

ప్రశ్న: "నీ సమర్పణ సంతోషంగా, దృఢంగా, సహాయకారిగా వుండాలి" అంటే ఏమిటి?

దృఢమైన ఆత్మ సమర్పణ

ఆనందంగా ఉండడం అంటే ఏమిటో నీకు తెలుసా? పటిష్ఠంగా ఉండడం అంటే ఏమిటో తెలుసా? 'సహాయపడే' అంటే తెలుసా? భగవంతునికి సమర్పణ అనేది ఆనందమయంగా, హాయిగా ఉండాలి. బలహీనత, నిర్వీర్యత ద్వారా సమర్పించుకో కూడదు. క్రియాత్మకమైన, బలీయమైన సంకల్పం ద్వారా సమర్పణ చేసుకోవాలి. ఈ సమర్పణలో సోమరితనం పనికిరాదు. "నేను సర్వ సమర్పణం చేసేసుకున్నాను. ఇక నా జీవితంలో చేయవలసిందేమీ లేదు. నేను ప్రశాంతంగా, కదలకుండా, మెదలకుండా ఉండాలి. నేను సమర్పణ చేసుకున్నాను గదా" అని అనుకోవడం సోమరితనమే. అది సహాయకారిగా ఉండాలి. క్రియాత్మకంగా ఉండాలి. చైతన్య పరివర్తనను అది చేపట్టాలి. లేదా ఏదో ఉపయోగకరమైన పని చేయాలి.

*

నీ సమర్పణ సజీవవ్యక్తి సమర్పణగా ఉండాలి. ఏదో జడమయమైన యంత్రమానవుడు, ఏదో యాంత్రిక పరికరంగా సమర్పణ చేసుకున్నట్లు ఉండకూడదు.

*

ప్రతి చిన్న విషయంలోను సమర్పణ భావం

అసలు ప్రాధాన్యమే లేని జీవితంలోని అత్యల్ప విషయాలు, మనం చేసే కర్మలలోని అతిచిన్న అంశాలు, ఆలోచనలోని ప్రతి కదలిక, మన సంవేదనలు, ఉద్రేకాలు, ఉద్వేగాల వైపు నువ్వు సమర్పణభావంతో చూసిన మరుక్షణంలో అవి మారిపోతాయి. "దీనిని నేను భగవంతునికి సమర్పించుకోవాలని అనుకున్నానా? ఇది భగవంతునికి సమర్పణగా భావించానా? అని నిన్ను నువ్వు ప్రశ్నించుకుంటే అవన్నీ కొత్త అర్థాన్ని సంతరించుకుంటాయి. నీ జీవితంలో ప్రతిక్షణం దీనిని జ్ఞప్తికి తెచ్చుకుంటే, ఇంతకు ముందుకన్నా నీ వైఖరిలో ఎంతో

మార్పు వస్తుంది. విశాలమవుతుంది. చాలా చిన్ని చిన్ని విషయాలతో – వాటికిచ్చిన స్థానంలో అవి నిలుస్తూ – ఒక హారంగా ఏర్పడుతుంది. అంతకు ముందు నువ్వు వాటిని గూర్చి పట్టించుకోకుండా వాటి మానాన వాటిని వదిలివేశావు. అది చైతన్యవలయాన్ని విస్తృతిపరుస్తుంది. జీవితంలో ఒక అరగంటను తీసుకుని ఈ ప్రశ్న వేసుకో –

"ఈ అరగంటను నేను భగవంతునికి సమర్పించుకున్నానా?". అప్పుడు చిన్నవిషయాలు కూడ పెద్దవిగా మారుతాయి.

(CWM Vol. 3, pp. 18-19; Vol. 4, pp. 343-44; Vol. 5, pp. 46-48; Vol. 4, pp. 358, 133)

అనువాదం: కె. యజ్ఞన్న

ముఖ్యంగా సమర్పించుకోవలసినది

యోగమనగా నిన్ను నీవు అధిగమించుట. అది సమర్పణ ద్వారా జరగాలి. అయితే నీ మనసులోని ఆలోచనలను, నీ చేష్టలను మాత్రమే సమర్పించుకున్నంత మాత్రాన సరిపోదు. 'నేను' అనే పదార్థాన్ని మొత్తం దైవానికి సమర్పించుకోవాలి. అంటే ఏ ఒకటి రెండు విషయాలలోనే కాకుండా నిన్ను నీవు సర్వతోముఖంగా, చాలా క్షుణంగా నివేదించుకోవాలి. నువ్వెంత పూర్తిగా సమర్పించుకుంటే ఆయనకంత ఇష్టం, నీకంత లాభం. దేవునికి నువ్వొక పసందైన విందు చేయాలి!

– సంపాదకుడు

ప్రశ్న: సమర్పణ అనగా సేవాభావంతో నీ కర్మలను సమర్పించుకోవటమే కదా!

నీ స్వభావాన్ని సమర్పించుకోవాలి

కర్మాచరణా ఓ చక్కటి సాధనా మార్గమే, నేను కాదంటల్లేదు. అయితే ఒక సంగతి నువ్వు గుర్తుంచుకోవాలి.

యంత్రమువలె విధిగా పనులు చేయటం యోగం కానేరదు. అది కాదు. కేవలం పని చేయటం మాత్రమే కాదు.

అన్నిటికంటె ముఖ్యమైనది నీ ప్రకృతి, నీ ఉనికి, నీ స్వభావము. నీవు సమర్పించవలసినది వీటినే. ఎందుకో తెలుసా? అవి మారాలి కాబట్టి. అంతే కదా మరి. నీ ప్రకృతే కదా మారవలసినది. కాబట్టి నీవు సమర్పించవలసిన ముఖ్యమైన వస్తువు నీ వ్యక్తిత్వమే. నువ్వే. ప్రతి మనిషికి తన ప్రత్యేక లక్షణాలు – అర్థం చేసుకుండే తీరు, బాహ్యాస్పర్శలకు స్పందించే విధానము, ప్రత్యేకమైన ఫీలింగ్స్, అభివృద్ధిపొందే పద్ధతి, జీవితంపట్ల తన దృష్టి, జీవితంనుంచి తను కోరే ప్రయోజనాలు – ఈ లంపటాల సంపుటినే తప్పనిసరిగా నీవు సమర్పించుకోవాలి. దివ్యజ్యోతిని నీలో కాహ్వానించుకొని నిన్ను పరివర్తింప చేసుకోవాల్నంటే నీ మానసిక జీవితాన్నీ, జీవనవిధానాన్నంతటినీ సమర్పించుకోవాలి. ఈ విధంగా చేసినప్పుడు నీ అంతరంగికాన్నంతా దేవునికి విప్పి చూపించినట్లుగా అవుతుంది. దానికి ఎటువంటి చికిత్స చేయాలో ఆయనకు బాగా తెలుసు. నీ లక్షణాలలో మంచివేవో చెడ్డవేవో, వేటిని మార్చాలో, వేటిని సత్యానుగుణంగా మలిచి దైవప్రకటనకు యోగ్యమైన మాధ్యమంగా తయారుచేయాలో ఆయనకు బాగా తెలుసు. అందుకనే నేను నొక్కి చెబుతున్నాను – నువ్వు చేసే పనులకంటే నీ వ్యక్తిత్వాన్నంతటినీ సమర్పించుకోవటం చాలా ముఖ్యమైన విషయం. నువ్వు చేసే పనులకంటే (పనులు ముఖ్యమే నేను కాదనటల్లేదు) నీ వ్యక్తిత్వమే వెయ్యిరెట్లు ముఖ్యమైనది. ఏ పనైనా సరే ఆ పని చేసావా లేదా? ఎలా చేసావు? అనే దానికంటె ఆ పనిని ఏ చేతనస్థాయితో చేసావన్నదే ముఖ్యం....

కొంతమంది సాధకులను "నువ్వు ఏదైనా పని చెయ్యి. అదే నీకు తగిన సాధనామార్గము" అని చెప్పినప్పుడు అలా పని చేయటం ద్వారా నీ సమర్పణను మొదలుపెట్టొచ్చు. కాని "క్రమేపి నీ ప్రకృతినంతా పోగుచేసి ఆయన సమక్షమునందుంచాలి" అనియే దాని అర్థము.

*

నీ మనస్సు ఓ బందిఖానా

నీ వుండే మానసిక ప్రపంచమంతా చాలా పరిమితమైంది. అది నీకు తెలియకపోవచ్చు. ఆ హద్దులలో పరిమితమై ఉండిపోయిన నీ మనస్సును ఏదో ఒక శక్తి వచ్చి హద్దులను బద్దలుకొట్టి విడుదల చేయాలి. అంటే ఉదాహరణకు నీకు నీవుగా ఏవో కొన్ని నియమాలను, సూత్రాలను పెట్టుకొని వాటికే కట్టుబడి ఉంటావు. నీ సిద్ధాంతాలు నీకు చాలా ముఖ్యం. వాటిలోనుంచి బయటపడడం నీ కిష్టముండదు. అవి నీతిసూత్రాలు కావచ్చు, మతశాసనాలు కావచ్చు; "తల్లిదండ్రులను గౌరవించు" "జీవహింస చేయరాదు" లాంటివి. ఈ విధంగా ప్రతివారూ ఏవో కొన్నినియమాలకు కట్టుబడి ఉంటారు. అంతేకాక ఇతరుల మాదిరిగా తాము ఏదో ఒక దురభిమానానికి లోనై బాధపడటం లేదని, ఇతరులు ఆ విధమైన భావనతో ఉంటే అది తప్పనీ అనుకుంటారు. తమ భావాలు మాత్రం శతవిధాల సత్యమైనవనీ, ఇతరుల నమ్మకాల వంటివి కాదులే అని అనుకుంటారు. ఏదో ఒక నియమం పెట్టుకొని దానికి అతుక్కుపోయి ఉండటమంటే నీలో ఎక్కడో అంధత్వం మరుగై ఉందనటానికి నిదర్శనమన్న మాట.

(*CWM* Vol. 4, pp. 372-74; Vol. 3, p. 53)

అనువాదం: ఆర్.ఎల్.ఎన్.శాస్త్రి, ఆర్. లక్ష్మీప్రసాదమ్మ,
ఎ. ప్రభావతి, ఎ. వెంకటరామశాస్త్రి

True surrender enlarges you... you enter into another world, into a wideness which you could not have entered if you did not surrender.

The Mother

విధేయత – చిత్తశుద్ధి

ఒక్కొక్కప్పుడు ఒక చిన్న మాటలో అనంతమైన అర్థం ఇమిడి వుంటుంది. ఈ 'సమర్పణ' కూడ అటువంటిదే. 'నేను సమర్పించేసుకున్నానులే' అని అనుకున్నప్పటినుంచి నువ్వు అనేక పరీక్షల నెదుర్కొనవలసి వస్తుంది. ఫలితాలు వెంటనే కలగవు. మనుషులు ఎదురు తిరుగుతారు. అయినప్పటికీ నీ సమర్పణ నిజమైనదైనట్లయితే నీవేమాత్రం బాధపడవు. చిరునవ్వుతోనే అన్ని పరిస్థితులను ఎదుర్కొంటావు. ఏం జరిగినప్పట్టికీ అది దైవేచ్ఛయే కనుక నీ కానందదాయకమే అవుతుంది. ఈ విధంగా నీ సమర్పణ పరాకాష్ఠ నందుకొని నీకు సంతృప్తినిస్తుంది.

– సంపాదకుడు

ప్రశ్న: అమ్మా, శ్రీఅరవిందులను ఒక సాధకుడు "తాను భగవంతునికి అర్పణ కావాలన్న నిర్ణయం తన దైనందిన జీవితంపై ప్రభావం చూపుతోందనడానికి" సూచనలేమిటని అడిగాడు. శ్రీఅరవిందులు అట్టి సాధకుడు నిస్సంకోచంగా, బేషరతుగా ఎటువంటి ప్రశ్నలూ, ప్రతిఘటనలూ లేకుండా ఆ భగవంతుని దివ్యప్రభావానికి సంపూర్ణంగా స్పందిస్తూ, ఆ దివ్యత్వానికి భిన్నమైనదాన్ని నిరాకరిస్తాడని చెప్పారు.

సంపూర్ణ సమర్పణకు గుర్తులు

ఆ సాధకుడు తన అర్పణ పరిపూర్ణమనేటువంటి సూచన కోరుకుంటున్నాడు. దీనిలో ఆసక్త, అనాసక్త అర్పణ అన్న తేడా లేదు. అసలు అర్పణ కావాలన్న నిశ్చయమే కొన్ని ఫలితాలిస్తుంది. – ముందుగా, నిస్సంశయంగా వినయంగా ఉండటం, రెండోది – భగవదేతర ప్రభావాలని తిరస్కరించగల శక్తి గలిగి వుండటం. ఇవి గొప్ప లక్షణాలు. ఇవి వచ్చాయంటే సాధనలో ప్రగతి సాధించినట్లే.

నీ యిచ్ఛయే జరుగుగాక!

సంపూర్ణ అర్పణతో అన్నిటా ఆ పరమేశ్వరేచ్ఛ జరగాలనే

నిరంతర తపన ఉంటే, తెలియకుండానే, సహజంగానే చేయతగిన దానినే ఎంచుకోటం, తిరస్కరించవలసినది తిరస్కరించడం స్వభావ సిద్ధంగానే జరిగిపోతుంది. ఆత్మసమర్పణలో లాభమేమిటంటే జ్ఞాన సముపార్జనకంటే ముందే, సహజంగానే సరైన పద్ధతిలో అన్నీ చేయగలరు.

దైవాజ్ఞను శిరసావహించుట

శ్రీఅరవిందులు చెప్పేదేమిటంటే, సంపూర్ణ విధేయతలో ప్రశ్నలకీ వివాదాలకీ తావు లేదు. భగవాదేశ బద్ధుడై అన్నీ సరిగానే చేస్తాడు. తాను చేసింది న్యాయసమ్మతమనీ, సరైనదనీ తనకు తానుగానీ, భగవంతునికి కానీ రుజువు చేసుకోవాలని ఉండదు. మనసా, వాచా, కర్మణా దేనినీ ప్రశ్నించడం కానీ, ఎదురుతిరగడం కానీ చెయ్యకూడదు. ఇటువంటివన్నీ వదిలివేయాలి.

జ్ఞానమార్గమయినా, భక్తిమార్గమయినా – మార్గమేదయినా పరిపూర్ణత్వం కావాలంటే ఏ మార్గమయినా కష్టమే. సంపూర్ణ చిత్తశుద్ధి ఒక్కటే నాకు తెలిసిన మార్గం. తెలుసా? ఎప్పుడూ ఆత్మవంచన చేసుకోకూడదు. చేసిన తప్పుని సమర్థించుకోడం, చెయ్యాలనుకున్న దానికి సాకులు చెప్పటం, అప్రియమైన వాటిని పట్టించుకోకుండా, ఎట్టి విషయాన్నీ చులకనగా, "ఈ సారికి పరవాలేదులే వచ్చేసారి బాగా చెయ్యవచ్చులే" అనీ అనుకోకూడదు.

నిజానికి ఒక్క గంట పరిపూర్ణ చిత్తశుద్ధితో ఉండే ప్రయత్నం చేస్తే – అబ్బో! అది చాలా కష్టమని తెలుస్తుంది. ప్రతి పనీ, ప్రతి భావన, ఆలోచన, కోరిక — అన్నీ కేవలం భగవంతుడే అనుకో. "నాకు భగవంతుని వినా ఏదీ వద్దు. అతన్ని గూర్చి తప్ప వేరే ఆలోచన లేదు, అతనిని దరిచేరే పని తప్ప వేరేదీ చేయను, అతనిని తప్ప అన్యమును అభిలషించను" ఇలా గడపడం ఎంత కష్టమో తెలుసుకోడానికి – ఒక్క అరగంట ప్రయత్నించండి చాలు. నీ ప్రయత్నంలో నీ శరీరంలోనో, మనస్సులోనో ఒక్క అంశమైనా నీతో సహకరించడంలేదేమో గమనించుకో. నీవు

గమనించడానికి వీలుకాకుండా, నిశ్శబ్దంగా, ఎట్టి మార్పు లేకుండా అది దాక్కుని ఉందేమో చూసుకో. ఇలా సహాయనిరాకరణ చేసేవి ఎన్నో! నువ్వే వాటిని గమనించుకోడం ఇష్టం లేక వాటిని పట్టించుకోకపోవచ్చు లేదా అవే నీ వెనక చక్కగా దాక్కుని నీకు కనిపించకపోవచ్చు. చిత్తశుద్ధి అనే దివిటీతో నీలోని ప్రతి అణువునీ నువ్వు వెతకటం మొదలుపెడితే, నీతో సహకరించకుండా, మార్పుని వ్యతిరేకిస్తూ స్తబ్ధుగా నీలో ఉన్న ఎన్నెన్నో అంశాలు వెలుగులోకొస్తాయి. వీటిని మార్చడం తేలిక కాదు. – ఏదీ ఒక్క గంట ప్రయత్నించి చూడు!

*

ప్రశ్న: అమ్మా, ఆనందంగా అర్పణ కావడం ఎలా?

సంపూర్ణ చిత్తశుద్ధితో జరిగితే అది ఆనందంగానే ఉంటుంది. ఆనందం లోపిస్తే చిత్తశుద్ధి లోపించినట్టే.... నీలో ఇంకా ఏ మూలో ఆ సమర్పణకి వ్యతిరేకంగా తన అస్తిత్వాన్ని తనదైన వేరు ఆనందాన్ని ఆశించే అంశమేదో దాక్కుని ఉన్నదన్న మాటే. నిస్సంకోచంగా, చిత్తశుద్ధితో సంపూర్ణ ఆత్మసమర్పణ జరిగితే, సహజంగానే అనంత ఆనందానుభూతి కలుగుతుంది. ఆ ఆనందమే లోపిస్తే, నీలో పెద్దదో, చిన్నదో, ఏదో ఒక స్థాయిలో ఏదో ఒక అంశం నీ ప్రయత్నాన్ని వ్యతిరేకిస్తోందనే ఖచ్చితమైన సూచన.

*

నీ ఆకాంక్ష, నీ అర్పణ – రెండూ సంపూర్ణం అవనంతవరకు నీకు ఆనందం ఉండదు. ఏదో అసంతృప్తి, నిరాశ, ఇబ్బంది, దుఃఖం ఉంటాయి. నిన్న ఆనందంగా, అందంగా అనిపించినదే నేడు అలా లేదంటే నిన్న నీవు ఆత్మసమర్పణభావంలో ఉన్నావనీ, కానీ ఈ రోజు ఆ స్థాయిలో లేవనీ అర్థం. నీలో ఏ మూలో చిత్తశుద్ధి లోపించిందనటానికి ఇదే కొలమానం.

(CWM Vol. 6, pp. 129-33, 210-11, 215)

అనువాదం: బి. వరలక్ష్మి

ఏకైక తరుణోపాయము

ఈ ప్రపంచం అజ్ఞానంలో మునిగిపోయి వున్నది. నీ వ్యక్తిగత జీవితానికి కూడా ఈ అజ్ఞానం అడ్డుతగిలి, నిన్ను క్షోభపెడుతూనే వుంటుంది. దాన్ని నువ్వు ఎదుర్కోవాలి తప్పదు. నువ్వు నీ మనస్సులోని కదలికలను, నీ చేతలను సమర్పించుకుంటావు సరే. అంతేకాకుండా నీ ఫీలింగ్సును, నీ మానసికసామగ్రినంతా కూడ సమర్పించాల్సిందే. అపుడిక ఏం జరిగినా కూడ నువ్వు కోపం తెచ్చుకోవలసిన పనిలేదు. ఎందుకంటె వ్యక్తి లేడు. దైవమే వున్నాడు. ఇక నిన్ను ఎవరేమి చేయగలరు?

సంపాదకుడు

పాడుపడిపోయిన శిథిలాలు

ఇటు చూడు – లోకముయొక్క నడవడికను చూస్తే ప్రపంచపు స్థితిగతులు అతిక్లిష్టముగనే యున్నవి. ప్రపంచమంతా పోరులతో, సంఘర్షణలతో అతలాకుతలమౌతున్నది. ఇక్కడ సత్యాన్ని, వెలుగుని ఆవిర్భవింపజేసి, స్థిరపరచాలని కోరే శక్తులకు, వాటిని ప్రతిఘటించే శక్తులకు మధ్య పోరాటము కొనసాగుచున్నది. మార్పును ససేమిరా అని ఎదిరిస్తూ, గతమున పాతుకుపోయి కరడుకట్టిన విధానములకు ఈ ప్రతిఘటనా శక్తులు ప్రతీకలుగా నిలిచి వున్నవి. ఆటంకాలను ఎదిరిస్తూ, ఎవరికి వారుగా తమ తమ కష్టనిష్ఠూరములను పరిష్కరించుకొనవలసి యున్నది.

నీ ఉనికిని పూర్తిగా సమర్పించుకోవాలి

అయితే, ఒకే ఒక మార్గమున్నది. అది షరతులులేని సంపూర్ణశరణాగతి. అంటే, నీ చేతల్ని, పనులను, నీ కోరికలను, నీ అనుభూతులను, నీచే నిర్వహించచబడిన దానినంతను – నీ వ్యక్తిత్వాన్ని సాంతము దైవానికే సమర్పించాలి. అలా చేస్తే, నువ్వు నీ చుట్టూ నున్నవారి స్పందనలకు అతీ

తముగా నుండగలవు. అంతేకాదు, దైవకటాక్షము నీ చుట్టూ ఒక గోడవలె నిలిచి నిన్ను కాపాడుతుంది.

ఇక కోరికలను, బంధాలను ఎంతమాత్రము దరిచేరనీయక తెగతెంపులు చేసుకోవాలి. ఎదుటి వారెంతవారైనా, మానవుల మెప్పు మెహర్‌బానీలను పొందాలనెడి ఆశను విడనాడాలి. ఆ పరమేశ్వరానుగ్రహమే ఎట్టి పరిస్థితుల్లోనూ, నిన్ను ఓటమికి గురి చేయదనెడి విశ్వాసముతో నుండి, నీకు ఇతరులతోగల సంబంధబాంధవ్యాలను త్రుంచివేసిన తక్షణమే, ఎల్లవేళలా నిన్నంటియున్న ఆ అంతర్యామిని నీ హృదయములోనే దర్శించగలవు.

విషమ పరిస్థితులకు మందు

మరో మార్గము లేనే లేదు – అదొక్కటే! ప్రతి ఒక్కరికి అదే దివ్యమైన ఔషధము! దుఃఖము అసంపూర్ణతకు చిహ్నమని బాధలలోనున్న ప్రతివానికి చెప్పాలి. ఎప్పుడైనా పరిస్థితుల ప్రభావమువలన నీ గుండెల్లో "గుబులు" పుట్టగా "ఇదేం బాగులేద" నో లేక "పరిస్థితులు క్లిష్టముగా నున్నవే" అని దిగులు పడక, "నేను సంపూర్ణంగా సమర్పణ చేయలేదు" అని నీకు నీవే ఒక హెచ్చరిక చేసుకో!

అదే సరియైన దృక్పథం!

అప్పుడు దైవానుగ్రహం నీ పట్ల కలిగి, ఆ సహాయముతో ముమ్ముందుకు దూసుకుపోగలవు. ఒక రోజున అచంచలమైన శాంతిని కూడా సాధించగలవు.

మరి దైవముపట్ల ప్రగాఢవిశ్వాసాన్నే నీవు కలిగియున్నచో నీ పెదవులపై మందహాసమే తొణికిసలాడును. అది మొదలు నీకెదురు తిరిగే మనుమలను, ఉద్యమాలను, అసురులదాడులను, అపోహలను, అపార్థములను అదే చిరునగవుతో త్రిప్పికొట్టగలవు!

ఇదొక్కటే మార్గము – మరో మార్గము లేదు!

అసలు దుఃఖము, బాధలు, ఒత్తిడులు, సంఘర్షణలు ఈ ప్రపంచపు లక్షణాలు. అందులో మార్పు లేదు. మార్పు రావడానికి మరికొంత కాలము పడుతుంది. ప్రతివ్యక్తి తరించటానికి అవకా

శమున్నది – ఆ పరమేశ్వరుని దివ్యానుగ్రహముపై ఆధారప
యుండుటయే నీ ఏకైక తరుణోపాయము.
ఆ దివ్యచేతన నీలోనే అంతర్యామిగా నున్నది! నీ లోనే!
మరి దానికోసం నీవు బయట వెతుకుతావు కదా!
కాదు – లోపల చూడు.

నీ దృష్టిని బాహ్యప్రపంచమున నిలుపుటచే అంతర్యామి దర్శించ లేకున్నావు. నీవు వెలుపలి ప్రపంచమున, ఒక అండద డకై వెతుకుటకంటే, నీలో నిక్షిప్తమైయున్న ఆ దివ్యజ్ఞానము దృష్టిని మళ్లించి, అనుక్షణము ఏమి చేయవలెనో, ఎలా చేం వలెనో తెలిసేందుకు, నీవు చేసే సాధనను, మరి నీ సర్వస్వాన్ని సమర్పిస్తే, అపుడు నీకు మార్గాన్ని చూపుతూ, నీకు బాసట నిలిచి నడిపించే ఆ మహత్తరశక్తి నీతోనే నున్నదనే అనుభూతి పొందగలవు.

(CWM Vol. 15, pp. 419-21)

అనువాదం: దామెర వేంకటేశ్వరరా

వ్యక్తిగత నిర్ణయం పనికిరాదు

సృష్టి చిత్రమైనది. ఏకము అనేకమగుట, అఖండచైతన్యమ ఖండమగుట మన కర్థముకాని విషయములు. మన పుట్టుపు ర్వోత్తరములు గొప్పవే – మూలతః మనమఖండ స్వరు పులమే! కాని మన జీవితంలో ఈ అఖండత్వము కనపడద పాక్షికజ్ఞానమే మన ఖర్మ. కాని ఇప్పుడు మనం కోరుకుంటే జ్ఞానము మనకు దొరుకుతుంది. మన జీవితాన్ని చక్కబెడుతుం నువ్వే మాత్రం కలవరబడకూడదు. జరగబోవుదాన్ని గురిం భయపడుతూ ఆదిలోనే హంసపాదు పెట్టకు. నీ పనిని నిశ్చలం చేసుకుంటూపో. అప్పుడు నీకంటె అధికమైన శక్తులు నీలో ప్రవేశిస్తాయి. నీ జీవితకర్తవ్యాన్ని చక్కగా నిర్వహించి నిన్ను

దివ్యజీవనమార్గంలో నడుపుతాయి. కాబట్టి నీ ధ్యాసంతా ప్రకృతం మీదనే కేంద్రీకరించాలి. అనంతర కార్యక్రమమును దేవతలకు వదిలేసేయాలి. ఆ విధంగా నీ జీవితం దినదినగండం కాకుండా ఒక పూలబాట కాగలదు.

— సంపాదకుడు

గందరగోళానికి అసలు కారణం

ఈ గందరగోళానికి కారణం నీ మనస్సే. మనస్సుయొక్క అశక్తతనుగురించి నీకు పాఠం నేర్పేందుకే ఇలా జరుగుతుంది. అందుకని 'రేపేమౌతుందో.' అని నువ్వు ఇప్పటినుంచి ఆలోచించకూడదు. 'అయ్యో ఏం జరగబోతోందో, ఏం దారి' అని నువ్వు ముందరనుంచే చింతించకూడదు. ప్రకృతమే నీ తక్షణ కర్తవ్యము. అందుకని ప్రస్తుతం నువ్వు చేస్తున్న పని మీదనే ధ్యానమును నిలిపి దానిని చక్కగా నిర్వహించాలి. అంతేగాని "అలా చేస్తే బాగుంటుంది. ఇలా చేస్తే బాగుంటుంది" అని ముందరనుంచే ఆలోచిస్తూ కూర్చోటం చాలా ప్రమాదం.

మనస్సుయొక్క జ్ఞానం పరిమితం

అందుకని ప్రతిక్షణము నీ మనస్సును క్రేంద్రీకరించి నీ పనులను శ్రద్ధగా నిర్వర్తిస్తూ ఉండాలి. తదుపరి కర్తవ్యము నీ కంటె అధికమైన మహాచైతన్యానికి వదిలేసేయాలి. అనంతర కర్తవ్యమేమిటో ఆ విశ్వచైతన్యమే చూసుకుంటుంది. ఎందుకని? నీ దృష్టేమో పాక్షికము, నీ జ్ఞానము కేవలము అజ్ఞానమే కాబట్టి. ఒకవేళ నువ్వు ఈ అజ్ఞానాన్నే నమ్ముకుని, అటూ ఇటూ పరిగెత్తినట్లయితే ఎండమావులనే వెంబడించగలవు.

ఏకమాత్ర చైతన్యమే శ్రీరామరక్ష

ఇంత గందరగోళం, ఈ మహాసంక్షోభం సంభవించినప్పుడు నువ్వు ఒకానొక చైతన్యస్థాయి నందుకోవాలి. అక్కడనుంచి చూసినప్పుడు నీకు ఒక మహాసత్యము అనుభూతమౌతుంది. ఒకే చైతన్యము, ఒకే మహాశక్తినిగురించి నువ్వు తెలుసుకుంటావు. నీకు సంక్షోభమల్లె కనబడుతున్నదంతా కూడ

ఆ అఖండంలోనే జరుగుతుంది. నీది సంకుచితదృష్టి. మిడిమిడి జ్ఞానము, తార్కిక దృక్పథము. వీటి విలువెంత? అవి ఏ పాటివి? వీటి నధిగమించిన మహాచైతన్యం ముందర వట్టి గడ్డిపోచలే.

అఖండచైతన్యము సహస్రశకలములుగా ఎందుకు మారింది? ఈ చీలిపోయిన విభాగములన్నీ మళ్లీ మూలరూపంలో జేరి వాటి వాటి అఖండత్వాన్ని పొందాలని ఆకాంక్షిస్తాయి. తహతహ లాడుతాయి. నీ వంతు కూడ ఇటువంటి తీవ్రమైన ఆకాంక్షను పొంది తహతహ లాడటమే.

ఇదే నీవు చేయాల్సిన పని. ఇదొక్కటే విలువయినది. ఫలితాన్నిస్తుంది. మిగిలినదంతా ఒట్టి కల్ల.

అన్ని సమస్యలకు పరిష్కారము

ఈ సంగతి నువ్వు ఎప్పటికీ మరచిపోకూడదు. ఆ పరాచైతన్యము (Supreme Consciousness) తో మమేకమై అన్ని సందర్భాలలోను దాని మీదనే పూర్తిగా ఆధారపడాలి. నువ్వేదైనా పనిని చేయవలసి వచ్చినప్పుడు, చేయలేనప్పుడు; నువ్వు నడిచినప్పుడు, నడవలేనప్పుడు నువ్వే మాత్రమూ బాధపడక్కర్లేదు. ఎందుకంటే నీ మనస్సుకంటె వెయ్యిరెట్లు సమర్థవంతమైన ఆ పరాచైతన్యానిదే బాధ్యతంతా – ఇక నీ కెట్టి బాధ్యతా లేదు. నువ్వు నీ కర్తవ్యాన్ని నిర్వహించి, పర్యవసానం కోసం వేచివుండాలంతే.

ప్రతిక్షణము నీకు సూచనలు

అప్పుడు నీకు ప్రతిక్షణము "ఈ పని చేయాలి. ఈ పని చేయక్కర్లేదు" అని సూచన లందుతూ వుంటాయి. అన్ని ప్రశ్నలకు అంతే.... అదే సూచనలిస్తుంది. – నీకు ఏ పూచీ లేదు. ప్రతి ఒక్క సందర్భాన్ని అదే నిర్వహిస్తుంది. ప్రతి సమస్యకు అదే పరిష్కారము. అదొక్కటే పరిష్కారము.

And all activities, all possibilities can be made use of in a natural way – it eliminates all arbitrary personal choice. All possibilities are there, all, all all are there. All perceptions are there and all knowledge – only the personal arbitrariness has

been eliminated. And this personal arbitrariness is so childish, so childish... a stupidity, a stupidity full of ignorance....

All that is for teaching the world to turn back to the Lord in its consciousness.... Why? It is for this that there has been a creation?

(CWM Vol. 11, pp. 184-86)

అనువాదం: ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

అన్యోన్య త్యాగము

భగవంతుడు గొప్పత్యాగశీలి. తను సృష్టించిన లోకాలు పూర్తిగా అచేతనంలోకి దిగజారిపోవటం చూసాడు. మళ్లి వాటిని రక్షించేందుకై తనే ప్రత్యక్షంగా దిగివచ్చి ఆ లోకాలలో నిక్షేపించుకున్నాడు. సృష్టిలోని భూతములు కూడ ఈ విషయాన్ని గుర్తించాలి. తమను తాము దైవంకోసం యజ్ఞముగా అర్పించుకోవాల్సిందే!

— సంపాదకుడు

"యజ్ఞమనునది, సృష్ట్యాదికాలమునం దీశ్వరుడు, ఈ సృజించబడిన విశ్వమంతయూ నొక్కటేయని తెలియజేయుటకై, విశ్వమునందు ప్రతిష్ఠించిన యొక విశిష్టధర్మము. ఈ ధర్మమునకుగల యాకర్షణబలముచేతనే, అహంకారభూయిష్ఠమూ, భిన్నత్వ లక్షణోపేతమూనైన సృష్టియందలి దొసగులను సవరణ చేయుచూ క్రమముగా వాటిని నిశ్శేష మొనర్చుటకై, విశ్వములోనికి దివ్యశక్త్యవతరణము జరుగుట సంభవించుచున్నది. జడమునూ, జడశక్తినీ చైతన్యవిలసితము గావించు సంకల్పముతో పరమాత్మ ఆ జడమునకునూ జడశక్తికినీ తనకుదా నైచ్ఛికముగ వశంవదుడగుట యిది. ఈ యవతరణమే, — పరమపురుషుని యీ ఆత్మయజ్ఞమే, — అచేతనమూ అజ్ఞానభూయిష్ఠమూనైన జగత్తునకు

విమోక్షము కల్పించుటకు నిక్షిప్తమైన బీజమని చెప్పనొప్పును. 'సహాయజ్ఞైః ప్రజాస్సృష్ట్వా' – ప్రజాపతి ప్రజలను యజ్ఞముతో పాటుగ సృష్టిచేసెనని గీత చెప్పుచున్నది.

అహంకారమీ జగత్తున ఏకాకి కాదు; ప్రధానమైనదియూ గాదు. ఈ పరిచ్ఛిన్న జీవనమునందు సైతమూ అహంకారము నకు వెనుక, అహంకారమున కతీతముగ, దానికంటె మహత్త రమూ పూర్ణతరమూ నైనదొకటి యున్నది. అదియే దివ్యతరమైన సమష్టి, అహంకారమునుండి యది విధేయతనూ సేవనూ గోరు చున్నది. ఈ యజ్ఞధర్మము నామోదించుటయన, అహంకారమీ పైన చెప్పినదానికి ఒప్పుదల యగుట యని యర్థము."

ప్రశ్న: మధుమయీ, దైవానికి యజ్ఞముగా అర్పించుకోవట మనగా నేమి?

ఆదాన ప్రదానము

ఆత్మసమర్పణ. భగవద్గీతలో ఆత్మ సమర్పణని యజ్ఞమనెదరు. అయితే ఇది మానవునికి దైవానికి మధ్య జరిగే పరస్పర త్యాగము. జడ పదార్థము అచేతనామయమైపోయింది. ఈ విషయాన్ని చూసిన దైవము వెంటనే తన సింహాసనంనుండి దిగివచ్చి పదార్థములోని అణువణువులోను నిక్షేపించుకున్నాడు. అందువల్లనే తిరిగి దైవా నికి సమర్పించుకొనవలసిన బాధ్యత ఈ సృష్టిలోని సమస్తమైన వస్తుజాలమునకు వున్నది. ఇది పరస్పర త్యాగము.

భగవద్గీతలో చెప్పిన ధర్మసూక్ష్మమిదే. జడపదార్థంలో దేవుడు తనను తాను నిక్షేపించుకున్నాడు కనుక పదార్థము కూడ అప్రయత్నముగానే దైవానికి నివేదనమై వుంటుంది. అయితే ఇది ఉద్దేశపూర్వకంగా జరిగినట్లయితే అది పరమానందంగా వుంటుంది. లేనియెడల ఆనందరహితంగా ఏదో విధాయకంగా మాత్రమే వుంటుంది.

ప్రశ్న: మధుమయీ "రహస్యంగా అందరూ ఒకటే" దీని అర్థమే మిటి?

'ఏకమేవాద్వితీయం' అనగా బ్రహ్మ ఒక్కడే అయినప్పటికి అణువణువులుగా చీలిపోయాడు. విచ్ఛిన్నమైపోయిన ఏకత్వాన్ని

తిరిగి నువ్వు ఏర్పరచినప్పుడు నీలో ఆనందం పొంగిపొరలుతుంది. అది ఆ ఐక్యచైతన్యముయొక్క ధర్మము. నువ్వు గుర్తించినా గుర్తించకపోయినా ఆ ఏకత్వముండియే తీరుతుందని శ్రీఅరవిందులు అంటారు.

*

మూలతః సృష్టంతా ఒకటే

నేను మీకు ఎన్నోమార్లు ఈ విషయాన్ని గురించి చెప్పాను. మీ అందరిలోను వున్నది ఒకే ఒక పదార్థము. బాహ్యారూపములే భిన్నములు. అందుకని ఒక దానిలో జరిగిన పరిణామము మిగతా వాటన్నిటిలోనూ జరిగి తీరుతుంది. ఒకదానిలో జ్యోతిని వెలిగిస్తే మిగతా వాటిల్లో కూడ జ్యోతి వెలుగుతుంది...

Sri Aurobindo says there is a oneness in Matter, a oneness in manifestation, a oneness in substance, and that there is necessarily an interchange.

ప్రశ్న: అచేతనము (Inconscient) చైతన్యవంతం కావాలని ఆకాంక్షిస్తుందా?

ఆకాంక్షించదు. అచేతనంలోని దైవమే చైతన్యంకోసం ఆకాంక్షిస్తుంది. అక్కడ దైవమే కనుక లేకపోయినట్లయితే ఆకాంక్ష కూడ వుండదు. అచేతనంలో చైతన్యమే కనుక దాగిలేకపోయినట్లయితే అది ఎప్పటికి చైతన్యవంతం కాలేదు. *అచేతనపు అంతరంగాలలో దివ్యచైతన్యము నిక్షిప్తమైవున్న కారణంగానే నీలో ఆకాంక్ష అవశ్యము పొంగిపొరలుతూ వుంటుంది. దీని అర్థమేమిటి? అప్రయత్నంగానే, నీ ప్రమేయం లేకుండానే ఈ యజ్ఞం జరుగుతూ వుంటుంది.* అందుకనే "ఆకాంక్షించేది నువ్వు కాదు – దైవము; అభివృద్ధి పొందేది నువ్వు కాదు – దైవము చైతన్యవంతమయ్యేది నువ్వు కాదు – దైవము" అని అంటారు.

(CWM Vol. 8, pp. 74-79)

అనువాదం: కమలాకర వేంకటరావు (యోగసమన్వయం),
ఆర్.ఎల్.ఎన్.శాస్త్రి

దేవుడు తనను తానిచ్చుకొంటాడు!

మనిషి దైవాన్ని అన్వేషిస్తాడు. దేవునికోసం తహతహలాడుతాడు. తమాషా ఏమిటంటె దేవుడు కూడ మనిషికోసం అన్వేషిస్తాడు. "అతను లక్ష్యపెట్టకపోతే నేనేం చేసేది' అని వూరుకోడు. నీ వెంటపడతాడు. అనుక్షణం నువ్వేం చేస్తున్నా సరే నువ్వు అన్నం తింటున్నప్పుడు, నిద్రపోతున్నప్పుడు, వాహ్యాళికి వెళ్ళినప్పుడు, నీ ఆలోచనలలోను, చూపులోను, చేతలోను ఒకటేమిటి సమస్తమైన క్రియకలాపాలలోను ఆయన నీ వెంతనే వుండి తనుకూడ పాల్గొనేందుకు సిద్ధంగా వుంటాడు. 'నేను కూడ వున్నానయ్యా' అని నీ వెంటపడతాడు. నువ్వు పిలిచి చూడు!

— సంపాదకుడు

ప్రశ్న: మధుమయీ, దేవుడు తనను తానిచ్చుకోటమంటే ఏమిటి?

> *అనుక్షణం ఆయన నీతో వుంటాడు*

దాని అర్థమిది. నిన్ను నీవు భగవంతునికి ఎంత గాఢంగా సమర్పించుకుంటే అంత గాఢంగా ఆయన నీ అనుభవంలోకి వస్తాడు. ఇది ఊరికే మనస్సుకి అనిపించటమో లేక స్ఫురించటమో కాదు; చాలా ప్రత్యక్షమైన సాక్షాదానుభూతి. నిన్ను నీవు ఎంత ఎక్కువగా ఇచ్చుకుంటే అంత ఎక్కువగా ఆయన నీతోటి వుంటాడు. అన్ని సమయములలోను నీతోటే వుంటాడు. నీ పనులన్నిటిలోను, నీ జీవితంలో ఎటుప్రక్క చూసినా ఆయనే వుంటాడు. నీ మనసులో ఆయన నిత్యం మెసులుతూనే వుంటాడు. అందుకని నీ ప్రశ్న లన్నింటికీ వెంటనే జవాబు వస్తుంది. దేవుడు నిర్విరామంగా నీతోటే వుంటాడు. నువ్వు నడుస్తే ఆయన నీతోటే నడుస్తాడు. నువ్వు నిద్రపోతే ఆయన కూడా నీతోటి నిద్రపోతాడు. నువ్వన్నం తింటే ఆయనకూడా నీతో అన్నం తింటాడు. నువ్వు ఆలోచించే విషయాల్ని గురించి ఆయన కూడా ఆలోచిస్తాడు. నువ్వు ప్రేమించినట్లయితే ఆయన కూడా ప్రేమిస్తాడు.

కాని ఆ స్థాయికి చేరేందుకు చాలా సాధన చేయాలి. నిన్ను నీవు *సంపూర్ణంగా సమర్పించుకోవాలి. అపాదమస్తకం ఏమాత్రం వెలితిగాని, ఏ విధమైన సంకోచముగాని లేకుండా జరగాలి. నీకని దేనినీ మిగుల్చుకోరాదు. దాపరికం పనికిరాదు.*

నిశ్శేషంగా సమర్పించుకోవాలి

ఏ విషయమైనా సరే, ఎంత చిన్న విషయమైన సరే. దానిని గురించి నిర్లక్ష్యం పనికిరాదు. ఎందుకని? నీకు కావలసింది నూటికి నూరుపాళ్ల సంతోషం కనుక. నువ్వు దైవానికి సమర్పించిన విషయములన్నీ సంతోషంగా పరిణమిస్తాయి. సమర్పించని విషయములు పరిణమించవు. ఆ మేరకు సంతోషానికి అవకాశాన్ని పోగొట్టుకుంటున్నావన మాట. దేవుడు నీకు కలిగించవలసిన సంతోషాన్ని వృధాపరుస్తున్నావన మాట. ఆయన నీ చెంతకు రాబోవు మార్గంలో గోడలు కడుతున్నావన మాట. నీకు ఆయన నీవద్ద వున్నట్లు తోచదు. నీవాయనకు చెందవు. నీ అల్పమైన కోరికలు, నీకు ప్రియమైన మనుమలు నీ మనస్సులో తారాడుతున్నంత కాలం నీవు దైవానికి చెందే ప్రశ్నే లేదు. నీ ఆలోచనలు, నీ సంవేదనలు, నీ కార్యములు, ఆవేశాలు ఇవన్నీ నిన్ను నీవు దైవానికి ఇచ్చుకోకుండా అడ్డుపడతాయి. ఈ వంద లాది విషయాలను అంటిపెట్టుకున్నంత కాలంనీవు దైవ సాన్నిధ్యాన్ని పొందలేవు. ఇవన్నీ నీకు, దైవానికి మధ్య గోడలు కావా? అటులగాక *నీ వాయనకు సర్వాంగీణంగా సమర్పించుతున్నావనుకో. నీ కంటూ దేనినీ అట్టే పెట్టుకోలేదనుకో. ఇక ఆయన నిన్ను ఒక్క నిముసమైనా వదలడు. నువ్వు ఏం చేసినా, ఏం తలచినా, ఏ అనుభూతి పొందినా నిరంతరం ఆయన నీవాడే.* కాని నువ్వు ఆ స్థాయికి చేరాలంటే నిన్ను నీవు పూర్తిగా సమర్పించుకోవాలి. దాపరికం పనికి రాదు. నువ్వు దేవుని దగ్గర నించి దాచిపెట్టిన ప్రతి విషయం దైవానికి, నీకు మధ్యన ఒక రాయి పెట్టినట్లవుతుంది. ఈ రాళ్లతో ఒక గోడ ఏర్పడుతుంది. "అయ్యో దేవుడు నాకు కనపడలేదే" అని మళ్లీ నువ్వే బాధపడతావు.

దైవకృప, దివ్యప్రేమ నీకు రక్ష

నువ్వు చేయవలసిందల్లా ఒక్కటే – దైవానుగ్రహానికి వశమైపోవుట. ఎందుకంటే సృష్టి జరిగినప్పుడు ఆ లోకాలలో ఆయన అంతర్లయమైపోయినాడు. వాటిని తిరిగి పునరుద్ధరించేందుకు తనే స్వయంగా తన ప్రేమానుగ్రహాలతో ఆ లోకాలలోకి ప్రవేశించాడు. పరివర్తనము లేక రూపాంతరీకరణము (transformation) చేయగల శక్తి ఒక్క దివ్యప్రేమకే వున్నది. కేవలం ఈ లోకాలను రూపాంతరీకరించుటకే తనను తాను ఇచ్చుకొని అన్ని వస్తువులలోను ప్రవేశించాడు. ఒక్క మనిషిలోనే కాదు. జడ భూయిష్ఠమైన భౌతికపదార్థపు ప్రత్యణువులోను ప్రవేశించాడు. దీనినే మన పురాణాలలో పరమత్యాగము అని అంటారు. మానవ దృష్టికి ఇది త్యాగమువలె అనిపించవచ్చునేమో – అంటే క్రిందికి దిగిరావటమన్న మాట. కాని దైవానికి తరిగిపోవటమంటూ వుండదు.... ఎప్పుడైతే నువ్వు దివ్యప్రేమకు ఉన్మీలుడవవుతావో, నీ అంతర్ద్వారములను తెరుస్తావో అప్పుడు నీకు రూపాంతరీకరణశక్తి కూడ వస్తుంది.

(CWM Vol. 7, p. 247; Vol. 3, pp. 171-172)

అనువాదం: ఆర్.ఎల్.ఎన్.శాస్త్రి

One must have around oneself so intense an atmosphere in a total surrender to the Divine, so intensified around oneself that everything that passes through is automatically filtered.

The Mother

ఎలా మొదలుపెట్టాలి?

నీకు నిన్ను గురించి తెలిసినదెంత? నీకు తెలియకుండానే నీలో అనేక లక్షణాలు దాగివుంటాయి. బహిర్గతమై నిన్నేడిపిస్తూ వుంటాయి. నిన్ను వాటికి బానిసగా చేస్తాయి. నిన్ను అల్లరి పెట్టే ఈ విభాగాలను గురించి తెలుసుకోవాల్నంటే నిన్ను నీవు నిష్పక్షపాతంగా పరిశీలించి, వాటిని కనుక్కోవాలి. నువ్వు ఒకపెద్ద యంత్రమన్న మాట. యంత్రాన్ని విప్పినట్లుగా నిన్ను నీవు విశ్లేషించి అందలి భాగాలన్నిటిని స్పష్టంగా చూడాలి. అప్పుడే నువ్వు వాటి బానిసత్వంనుండి విముక్తిని పొందగలవు.

— సంపాదకుడు

మానవుని వ్యక్తిగత పరిణామంలో రెండు సమానాంతర చర్యలు అవసరం. మనిషి సాధారణంగా ఆ రెండుచర్యలలో ఏదో ఒకటి వదిలేసి రెండవదాని పైననే దృష్టి కేంద్రీకరిస్తాడు కాబట్టి అతని అభివృద్ధి నత్తనడకలా వుంటుందిగాని సవ్యంగా జరుగదు.

నీలోని వేర్వేరు విభాగములను ఎరుగుట

ఈ చర్యలలో ఒకటి మనిషి తన అస్తిత్వానికి ఆధారమైన తత్త్వాలన్నిటినీ ఎరిగి వుండుట. అంటే అతడు తన దేహేంద్రియ మనోబుద్ధులను గురించి ముందుగా తెలుసుకోవాలి. మనలో జీవప్రక్రియ ఎలా జరుగుతుందో మనకు అవగాహన వుండాలి. మన అలవాట్లు, స్వభావము, ఆలోచనలు, నానావిధ కర్మలను గురించి నిష్పక్షపాతంగా – అంటే అవి మంచివా, చెడువా అనే వాదన లేకుండా వాటి స్వరూపాన్ని గురించి వేరు వేరుగాగాని తోచినట్లుగాని నిశ్చయించకుండా (మన నిశ్చయాలెప్పుడూ తప్పుల తడకలుగానే వుంటాయి) వాటిలో ఏవి నిలవాలి, ఏవి నశించాలి, వేటిని మనం ప్రోత్సహించాలి, వేటిని అణిచెయ్యాలి అని స్పష్టంగా తెలుసుకోవాలి. మనకు మనల్ని గురించి నిజాయితీతో కూడిన సమగ్రమైన అవగాహన కలగాలంటే మన మెలాంటివారమో నిష్పక్షపాతంగా, ఆబ్జెక్టివ్‌గా తెలు

సుకోవాలి. మన ముందున్న ఈ ప్రపంచాన్ని అతి చిన్నఅంశం కూడా వదలకుండా క్షుణ్ణంగా అన్వేషించాలి. ప్రపంచంలో బాగా అస్పష్టంగా వున్నవీ, అతిసూక్ష్మమైనవీ సరిగ్గా తెలుసుకోవాలి. అది కూడా పరిపూర్ణమైన, వైజ్ఞానిక, అవైయక్తిక, మానసిక దృష్టితో పరిశీలించి గ్రహించాలి. కారణంచేత కార్యం నిశ్చయించటం మానుకోవాలి.

మనమేమనుకొన్నప్పటికి ఈ పరిశీలన, విశ్లేషణ, అంతర్మథనములనే మొత్తం ప్రక్రియ ఎన్నటికిని సమాప్తి చెందదు. పరిస్థితులెలావున్నా, మనం శరీరధారులమై భూమిమీద జీవిస్తున్నంత వరకు మిక్కిలి జటిలమైన మన అస్తిత్వనిర్మాణం గురించి అధ్యయనం చేస్తూనే వుండాలి. దీనివలన మనలోని తత్త్వమేదీకూడా మన అవగాహననుండిగాని, మన అదుపునుండిగాని వేరుపడదు. ఎందుకంటే మనం మనకు తెలిసిన దాని మీద మాత్రమే అజామాయిషీ, అదుపు సాధించగలం.

ఇది మనలో రెండవచర్యకు దారితీస్తుంది. అయితే ఈ రెండవది మొదటిదానితోపాటే దానికి సమానాంతరంగానే జరగాలి. దీనినే సమర్పణ అంటాం. మన అదుపులోనున్న తత్త్వాలన్నిటిని ఎల్లవేళలా ఏమాత్రం ఏమరుపాటు లేకుండా పరమ దివ్యమైన శాసనానికి సమర్పణ చేస్తూనే వుండాలి.

నీలోని దివ్య కేంద్రానికి సమర్పణ

మనలో ఎరుక సాధించిన ప్రతి తత్త్వమును, ఆశయమును, యావచ్ఛక్తిని మనం ఎట్టి అరమరికలు లేకుండా పసివానివలె సన్మాత్రలోని సారభూతమైన చిన్మాత్రమైన జగన్మాతకు (పరాశక్తికి) మన బుద్ధుల ప్రేరణార్థమై సర్వసమర్పణ చేసుకోవాలి. జగన్మాత ఈ తత్త్వాలన్నిటినీ క్రమంలో పెట్టి, తరగతులవారిగా విభజనచేసి సవ్యంగా వుపయోగిస్తుంది. ఆమె మాత్రమే ఈ తత్త్వాలను మనకు పనికివచ్చేవి, పనికిరానివిగా విభజించి వాటిలో ప్రోత్సహించదగినవేవో విసర్జించవలసినవేవో నిర్ణయిస్తుంది. అయితే ఇక్కడ ఒక విషయం జ్ఞాపకం వుంచుకోవటం అవసరం. ఆమె దృష్టికి ఈ తత్త్వాలన్నీ సమానమైన విలు

వగలవి, వుపయోగపడేవి కూడాను. ఎందుకనంటే ఆమె వాటిని మార్పుజేసి, ప్రకాశింపజేసి, వాటికి క్రొత్తరూప మివ్వగలదు. ఈ తత్త్వాలన్నీ, ఆమెను గురించిన ఎరుకగలవీ, ఆమెకు తమను తాము సమర్పణ చేసుకొనగలవీ ఐనందున వాస్తవంగా ఆమెకు చెందినవనే చెప్పాలి. కాబట్టి వీటికి మంచిచెడులను ఆపాదించటం కేవలం బాహ్యాపరమైన మానవదృష్టి మాత్రమే.

మూల మూల దాగివున్న దోషములు

ఈ రెండుచర్యలలో – రెండుప్రవృత్తులలో ఒకదానిని మాత్రమే స్వీకరించి, రెండవదానిని వదిలివేయటం, దానిని అసంపూర్ణంగా మిగల్చడమూ ఒంటెత్తు పోకడ వంటిది. మన అస్తిత్వంలో ఒక విభాగాన్ని మాత్రమే పరదేవతకు (పరాశక్తికి) సమర్పణచేయడం సరిపోదు. మనలో మన ఎరుకలో లేనివి, మన అదుపులో లేనివి ఐన తత్త్వాలు ఈ సమర్పణనుండి తప్పించుకొని విశ్వజనీయమైన శాశ్వతధర్మానికి లోబడక, వాటి వాటి ప్రత్యేకనియమాల ప్రకారం నడుచుకొంటూ అలజడులను పుట్టిస్తాయి. ఎవరిలోని తత్త్వమేదైనా ఇలాంటి తిరుగుబాటు ధోరణి ప్రకటిస్తే అతడింకా శాశ్వతధర్మానికి కట్టుబడనివాడని అర్థంచేసుకోవాలి. అయితే అతడు తన అస్తిత్వంలో తనకు తెలియని మారుమూలలను గురించి మరచిపోయాడన్న మాట. కాని వాటికి కూడా జీవించటానికి, క్రియచేయుటానికి, తమ వంతు వచ్చినప్పుడు అభివ్యక్తమవటానికి అవకాశం వున్నది. అయితే అవి పాల్గొనే క్రియ పూర్ణపురుషుని క్రియాకలాపంతో పోలిస్తే అస్తవ్యస్తంగానూ, అపసవ్యంగానూ వుండి కేంద్రీయసంకల్పానికి లోబడి వుండదు.

దైవశాసనానికి లొంగివుండుట

దీనికి విరుద్ధంగా మనలోని ప్రతి చిన్న అంశం గురించి ఎరుక కలిగివుండటం వ్యర్థమూ నిష్ప్రయోజనము, పైగా ప్రమాదకరం కూడా. కాని క్రమసాధనలో అలా చేయటం మంచిదే. ఎందుకనంటే ఈ తత్త్వాలన్నింటిని ఎట్టి అరమరికలు లేకుండా పరదేవత పర్యవేక్షణకు, మహాశాసనానికి సమర్పణ చేసినప్పుడు

ఆ జగన్మాత ఈ తత్త్వాలకు సర్వశక్తివంతమైన ప్రభువు అవుతుంది.

ఎవనిలో ఈ రెండు ప్రవృత్తులు సమంగా కలిసిపోతాయో అతడే నిజంగా పరిపూర్ణంగా తనను తాను పరమార్థ సాధకుడిగా ప్రకటించుకోగలడు.

*

నీ ప్రకృతిని విశ్లేషించి చూడు

మనలో మనకు తెలిసిన విభాగంకంటె తెలియని విభాగమే పెద్దది. మన అచేతనత్వము మన నిమ్నప్రకృతితో పీటముడిపడి మార్పుకు పరిణామానికి లొంగదు. ఈ అచేతన ద్వారానే అసురశక్తులు మనలో ప్రవేశించి వాటికి మనల్ని బానిసలను చేస్తాయి. కాబట్టి నిన్ను గురించి నీవెప్పుడు సమగ్రంగా ఎరుక కలిగి వుండాలి. నీ స్వభావము, నీ చర్యలను గురించి నీవు ఎల్లప్పుడు అప్రమత్తుడవై వుండాలి. నీవు ఏ కారణంవలన ఏ పనిని ఏవిధంగా చేస్తున్నావో, ఇంకా నీ భావాలు, ఆలోచనలు ఎలా వున్నాయో కూడా నీవు తెలిసికొని వుండాలి. నీవు చేసే కర్మలకు కారణాలు, ప్రేరణలు కూడా నీకు తెలియాలి. నిన్ను కర్మకు పురికొల్పే బాహ్యాంతరశక్తులను నీవు తెలుసుకోవాలి. ఇంకా సూటీగా చెప్పాలంటే నీ అస్తిత్వాన్ని నీ స్వరూప స్వభావాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలి.

(CWM Vol. 2, pp. 128-29; Vol. 3, p. 2)

అనువాదం: కోట వేంకటేశ్వరరావు

పూర్ణయోగంలో నీలోని, నీ జీవితములోని సూక్ష్మాతిసూక్ష్మపు అంశాన్ని కూడా పరివర్తింపజేసి దివ్యీకరింపజేయవలసినదే.

శ్రీమాత

ప్రశ్నోత్తరములు

నువ్వు యోగం ఎందుకు చెయ్యాలి? నిన్ను దైవానికి ఎందుకు సమర్పించుకోవాలి? నీకోసం కాదు. దైవం కోసం. నువ్వు దైవేచ్ఛను తెలుసుకొని అద్దానిని నీలో క్రియాశీలము చేసినప్పుడు నువ్వు దైవానికొక చక్కటి ఉపకరణము కాగలవు. ఇది కేవలం నీ మనస్సుతో అయ్యే పని కాదు. ఎందుకంటే నువ్వు పరిమితము, దేవుడనంతము. నువ్వు ఆయనతో చేతులు కలిపినప్పుడు తన అనంతమైన శక్తితో ఆయనే నిన్ను నడిపిస్తాడు. నీ ప్రకృతి ఆయన చేతిలో ముడిపదార్థము. ఆయన దాన్ని దివ్య ప్రకృతిగా మారుస్తాడు.

— సంపాదకుడు

ప్రశ్న: భగవంతునికి అర్పించుకోవటమనగా ఆయనకు వశమైపోవుటయే గదా?

నువ్వు ఒక సంగతి గుర్తుంచుకోవాలి. నీలో సంతోషం పొంగిపొరలినపుడు ఆనందంతో నీవాయనకు సమర్పించుకుంటావేమోగాని అంతమాత్రాన నీవు ఆయనకు పూర్తిగా వశమైపోయినట్లు గాదు. అది వేరే విషయము. దీని అర్థము ఏమిటో తెలుసా! ప్రతినిమిషము నీ బుద్ధిని, నీ యిచ్ఛను అది దైవేచ్ఛకంటే భిన్నము కాకూడదు అనే వుద్దేశ్యంతో పరవశమైపోవాలి. ఒక వేళ నీ సమస్తమైన వ్యాపారములు దైవదత్తం చేసినట్లయితే అది సమర్పణతోటి సమానమే. ఆర్ద్రతతో నీలో ఉత్సాహం పొంగిపొరలిన ఒకానొక సమయమందు "నేను నీవాడనే" అని అనుకొని నీ వాయనకు నివేదించుకోవచ్చును. అయితే అటువంటి ఆర్ద్రత ఎంతో సేపు నిలిచి వుండకపోవచ్చు. అటువంటప్పుడు నీ ఆకాంక్ష సడలిపోయి, నీ సాధనలో ప్రతిష్టంభన ఏర్పడుతుంది.

*

ప్రశ్న: మధుమయీ! కర్మలన్ని దైవానికే సమర్పించాలని తమరు తరచు మాకు సెలవిస్తూనే వున్నారు. కాని దీనిని ఆచరించే విధానమేమిటో తెలియడం లేదు.

నీ వ్యక్తిగత ప్రయోజనాలకోసం కాకుండా, ఏ విధమైన లాభంకోసమో, కీర్తికోసమో, పేరుప్రఖ్యాతులకోసమో కాకుండా సేవాంకితుడవై చేయాలి. నువ్వు దైవేచ్ఛ నెరిగినప్పుడే నీ చేతనాస్థాయి పెరిగి అనుక్షణం నీ ద్వారా దైవమే పనిచేస్తున్నట్లు నీ కవగాహన కావాలి. మనస్సుతో తెలిసికోగానే సరిపోదు. ఆయన శక్తే నీ ఇంద్రియముల ద్వారా ప్రకటితమవుతున్నట్లు నీ వనుభూతి జెందాలి. అనగా నీ చేతనాస్థాయి పెరిగి నీలో సజీవమైన దైవానుభూతి వెల్లి విరియాలి.

ఇది ఎలా సాధ్యము? నీలో స్వార్థప్రయోజనపు ఛాయ గూడ ఉండకూడదు. స్వార్థపూరితమైన ప్రతిక్రియలకు ఏమాత్రం అస్కారముండరాదు.

*

ప్రశ్న: మధుమయీ! మా ఫ్రెంచి తరగతిలో వ్యాసం రాసేందుకు ఈ విషయాన్నిచ్చారు:

ఈ భావాన్ని గురించి వ్యాఖ్యానించండి:

"దైవాని కంకితమైపోవడమే జీవితరహస్యం. ఆయనతో నిరంతర సాంగత్యమువలన ఆయన శక్తి మనలోకి ప్రవహిస్తూ వుంటుంది."

నా చిన్నారి తల్లీ!

ఇంతే కదా! అది చాలా తేలిక

1) దేవుని శక్తి అనంతం. వ్యక్తి మట్టుకు ఒక బేటరీ లాంటివాడు. కొంతకాలం పనిచేసిన తరువాత ఆతని శక్తి తరిగిపోతుంది. కారు బేటరీ మాదిరి దీనినికూడ ఛార్జ్ చేయాలి. దేవుని కంకితమైపోవడమే ఈ ఛార్జింగ్ అనమాట.

లేక

2) దేవుడు నిరంతరం ప్రవహించే ఒక గంగాప్రవాహము. మనిషి దాని ప్రక్కనే వుండే ఒక మడుగు మాత్రమే. కొంతసేపటికి అది

ఎండిపోతుంది. నీవు దేవునికి సమర్పించుకొన్నప్పుడు ఆ రెండింటి మధ్య ఒక కాలవ ఏర్పడి నీ మడుగు ఎండిపోకుండా వుంటుంది.

నీ కిప్పుడు అర్థమయిందా?

*

ప్రశ్న: నాకు నా హృదయ కవాటములను బార్లగా తెరచి నీ ప్రేమను పొందాలని వుంది. ఆ కవాటములు మూసుకొని వున్నప్పుడు నేను వాటిని ఎలా తెరవాలి?

నా చిన్నారి తల్లీ! నాకు తెలిసిన మార్గ మొక్కటే. నిన్ను నీవు నివేదించుకోవటమే – పూర్తిగా అంకితమైపోవాలన్న మాట. తమాషా యేమిటంటే నీ వెంత పూర్తిగా ఇచ్చుకుంటే అంత ఎక్కువగా ఆ తలుపులు తెరుచుకుంటాయి. ఎంత తెరుచుకుంటే అంత ఎక్కువగా నీలోకి దైవీశక్తులు ప్రవహిస్తాయి. ఈ విధమైన సన్నిహిత అనుబంధంలో నీ అంతరంగిక దైవాన్ని నువ్వు బాగా చూడగలవు. ఆ ఆనందాన్ని పొందగలవు.

*

నీ అనుభూతులన్ని కూడా ఒకే నైజానికి దారితీస్తున్నాయి. నీ అంతట నువ్వు అశక్తురాలివి. ఏమీ చేయలేవు. దైవమే నీ అసలైన జీవితం. నీ చేతనలోని నిజమైన చేతన, నీలోని శక్తిసామర్థ్యములు కూడా. మనలను నిశ్శేషంగా ఆయనకు అప్పచెప్పుకోవాలి. దాపరికంలేకుండా సమర్పించుకోవాలి. ఆయన విశాలదృష్టితో నిన్నే విధంగా బాగుచేయాలో చూసి అలా చేస్తాడు.

(CWM Vol. 4, p. 134; Vol. 16, pp. 269-70, 61, 98, 180)

అనువాదం: ఆర్.ఎల్.ఎన్.శాస్త్రి

The small existence will change its nature; it will put on the nature of the greater truth to which it surrenders.

The Mother

భగవచ్చేతనానుభూతి

నువ్వు దైవానికి సమర్పించుకుంటావు సరే. కాని ఆయనకే పూర్తిగా చెందాలి కదా! నువ్వు ఏ పని చేస్తున్నా సరే – చేసేది నువ్వు కాదు. ఇంకెవరో చేస్తున్నట్లు అనిపిస్తుంది. నువ్వు బరువు లెత్తుతున్నప్పుడు ఇంకెవరో ఎత్తుతున్నట్లు అనిపిస్తుంది. నీ ఆలోచనలలో కూడ నీకంటె వెయ్యిరెట్లు జ్ఞానంతో వెలిగిపోయే మరో శక్తి వచ్చి గందరగోళంగా వున్న నీ మనస్సును క్రమశిక్షణ చేసి స్థిమితపరుస్తుంది. ఆ స్థాయికి చేరాలంటె నీ ఆకాంక్ష ప్రగాఢంగా వుండాలి. అది తీవ్రమైనప్పుడు పైనుంచి ఒక శక్తి దిగివచ్చి దాని స్థానాన్ని ఆక్రమించుకుంటుంది. *– సంపాదకుడు*

మన స్వంతలాభంకోసం చేయని పనిమీద కూడా మనం ఒక ఇష్టాన్ని, ఒక అభిమానాన్ని ఏర్పరచుకుంటాం. ఇది మనం అర్థం చేసుకోవాలి. నీ జీవితాన్ని ఒక అహంకారం లేని పనికి అంకితం చేసినప్పుడు కూడా అహంకారం ఉంటూనే ఉంది. అలాంటప్పుడు నీకు ఇష్టమైన పనిని చేస్తున్నప్పుడు అది నీకే సంబంధించినపుడు నీకు దానిమీద వ్యామోహం, అది విజయవంతం కావాలనే ఒక కోరిక ఉంటుంది. ఏదో ఒక లాభం చేకూరుతుందని ఆశపడతాం. అది నీకోసం కాకపోయినప్పటికి నువ్వు చేపట్టిన కార్యం సఫలీకృతం కావాలని కోరుకుంటావు. అది స్వకార్యం కాకపోయినా, మనం చేపట్టిన కార్యంలో విజయం సాధించాలని ఒక ఆత్రం వుంటుంది. ఆ కదలిక అతిసూక్ష్మరూపంలో అంతరంగంలో లోలోపల దాగి వుంటుంది. మనకి ఏమాత్రం తెలియని చిన్న మెలిక అది. ఒక వక్రగీత. ఈ రకమైన ఆలోచన మనలో లేనపుడు మాత్రమే మనం చేస్తున్న పనిలో ఫలితం పొందలేనపుడు వెంటనే ఆ లోపాన్ని గుర్తించగలుగుతాం. అప్పుడు మనకి ఆ లోపాన్ని సవరించుకోగల స్ఫూర్తి కలుగుతుంది. ఆ పనిని స్పష్టంగా, పరిపూర్ణంగా చేయగల సమర్థత కలుగుతుంది.

ఒక పనిని నీవు చేస్తున్నపుడు రెండు విషయాలు ఎప్పుడూ నీతో వుంటాయి. అవి నీ మానసిక, ప్రాణికశక్తులు. ఆ రెండు నీ పనిలోంచి ఏదో ఒక లాభం పొందడానికి, ఒక స్వీయతృప్తి కోసం, నీ మీద నీకు సదభిప్రాయం కలగడానికి ఎదురుచూస్తూ ఉంటాయి. నిన్ను నీవు మోసపరచుకోకుండా ఉండడం కష్టం.

ప్రశ్న: మనం దైవానికే చెందివున్నామని, దైవం మనలో పని చేస్తోందని ఎలా తెలుస్తుంది?

అది నీ మెదడుకు తెలియదు (ఏదో ఒక అస్పష్టమైన భావన కలగవచ్చు). కాని అంతరంగిక స్ఫూర్తి కలుగుతుంది. మొదట మనసుతోనే కోరుకోవచ్చు, కాని ఆ తరువాత హృదయంలో ఆకాంక్ష జనిస్తుంది. (హృదయస్థానాన్ని చూపుతూ) ఆ జ్వాల నిన్ను ముందుకు నెట్టి ఆ అనుభవాన్ని కలిగిస్తుంది.

నీవు ఏ పనైనా చేస్తున్నావనుకో, ఉదాహరణకి వ్యాయామం చేస్తున్నావనుకో. అది బరువు ఎత్తటం అనుకో. నీకు తెలియకుండానే అంత బరువుని ఒక్కసారి ఎత్తటం ఎలా సాధ్యమౌతుంది? హఠాత్తుగా ఏదో ఒక శక్తి నీచేత పనిచేయిస్తున్నట్టుంటుంది. అది నీ కన్న అత్యంత శక్తివంతమైనదని తెలుస్తుంది. నిన్ను నీవు మర్చిపోతావు. అప్పుడు నీకు తెలిసేది ఆ శక్తి మాత్రమే. నీవు ఎలా చేయాలో అని ప్రశ్నించుకోకుండా ఆ కార్యాన్ని సాధించగలిగే విధానం నీలో పనిచేస్తోందని అపుడు నీవు తెలుసుకుంటావు.

అయితే ఇది మనుమల్నిబట్టి ఆధారపడి ఉంటుంది. వారి సత్తాలో ఏది అత్యంత ప్రభావం చూపుతుందో దానిపై ఆధారపడి ఉంది. ఆలోచించే సమయంలో కూడా కొందరికి ఒక్కసారిగా అనిపిస్తుంది. ఆ ఆలోచన వాళ్లది కాదని, వారిని అధిగమించిన ఒకే శక్తి, వారికన్న స్పష్టంగా చూడగలిగినది, అత్యంత ప్రకాశవంతమైనది, చైతన్యవంతమైనది వారిలో వున్న ఆ శక్తే ఆ ఆలోచనలను, పదాలను కూర్చేదిగా తెలుసుకుంటారు.

అయితే ఇది మనుమల్ని బట్టి ఆధారపడి ఉంటుంది. వారి సత్తాలో ఏది అత్యంత ప్రభావం చూపుతుందో దానిపై ఆధార

పడి ఉంది. ఆలోచించే సమయంలో కూడా కొందరికి ఒక్కసారిగా అనిపిస్తుంది. ఆ ఆలోచన వాళ్లది కాదని, వారిని అధిగమించిన ఒక శక్తి, వారికన్న స్పష్టంగా చూడగలిగినది, అత్యంత ప్రకాశవంతమైనది, చైతన్యవంతమైనది వారిలో వున్న ఆ శక్తే ఆ ఆలోచనలను, పదాలను కూర్చేదిగా తెలుసుకుంటారు. అపుడే వాళ్లు అలా వ్రాయగలుగుతారు. అది పరిపూర్ణమైన అనుభవమైన వాళ్లు ఆ వ్రాయడం కూడా, అదే శక్తి ప్రభావంచేత చేయబడి, చేయిబట్టి మరీ వ్రాయిస్తుందని తెలుసుకుంటారు. సరే! అలాంటి క్షణంలో ఈ బాహ్యమైన మనిషి ఎందుకూ కొరగాని ఒక చిన్న పనిముట్టుగా గుర్తించి, ఆ అనుభవాన్ని భంగపరచకుండా తనలో నిశ్చలతను స్థాపించుకుందుకు సాధ్యమయినంతవరకూ ప్రయత్నిస్తాడు.

అవును. ఏమైనా సరే ఆ అనుభవాన్ని భంగం కలిగించేలా చేయకూడదు. నువ్వు ఆ అనుభవాన్ని గమనించి అరె! చాలా వినూత్నంగా ఉంది అనుకుంటె చాలు. ఆ అనుభవంలోని ఏకాగ్రతకు భంగం కల్గుతుంది.

ప్రశ్న: ఆ స్థితిని ఎలా చేరుకోగలం?

దానికోసం ఆకాంక్షించాలి. దానినే కోరుకోవాలి. మరింత నిస్వార్థంగా ఉండడానికి ప్రయత్నించాలి. అది కేవలం అవతల వాళ్ల దృష్టిలో 'మంచి' అనిపించుకుందుకు కాదు. నిన్ను నీవు మర్చిపోయి వాళ్లకి ఏదో చేస్తున్న భావనతో కాదు, నీవు అందరికన్న భిన్నమైన వ్యక్తినన్న భావన, అదే ప్రత్యేకమైన వ్యక్తినన్న భావననించి బయటపడాలి. అపుడు అన్నిటిని మించిన ఒక అంతర్గతజ్వాల, ఆ ఆకాంక్ష, ఆ కాంతి కోసం ఆవశ్యకత నీలో కలగాలి. అది ఒక రకమైన... ఎలా వర్ణించగలం? ఒక చెప్పలేని ఉత్సాహం నిన్ను చుట్టుముట్టాలి. అది అవధులులేని ఆవశ్యకతగా నిన్ను కరిగించి, నీ పూర్తి సమర్పణకు తోడ్పడి, సదా ఆ దైవంలోనే వుండేటట్టు చేయగలిగే ఆకాంక్ష కావాలి. అలాంటి క్షణంలో నీకు నీ ఆకాంక్షయొక్క అనుభవం కలుగుతుంది.

అయితే ఆ క్షణం నిజాయితీతో కూడినది, సంపూర్ణమైనది కావాలి. ఇదంతా బుద్ధితో కోరుకునేది మాత్రమే కాకూడదు. నీ

శరీరంలోని అణువణువులోనూ ఆ ఆకాంక్ష జ్వలించాలి. నీ సంపూర్ణచేతనలో ఆ ఆవశ్యకత జాగృతం కావాలి. అది కొంచెం సేపు మాత్రమే ఉంటుంది. నెమ్మదిగా అది తగ్గుతూ చివరకు పూర్తిగా ఆరిపోతుంది. ఇలాంటి భావాన్ని ఎక్కువసేపు ఉంచుకోవటం సాధ్యపడదు. అయితే కొన్నాళ్ల తరువాత, మరో రోజు, మరోసారి దీనికి సంపూర్ణంగా వ్యతిరేకమైన అనుభవం కలుగుతుంది. అపుడు ఆరోహణకు బదులుగా, ఆ శక్తియొక్క అవరోహణ జవాబుగా అనుభూతమౌతుంది. అపుడు ఆ శక్తి ప్రసరణ తప్ప ఏం ఉండదు. అపుడు ఆ దివ్యప్రేరితమైన ఆలోచన, ఆ దివ్యసంకల్పం, ఆ శక్తే పనిచేస్తూ ఉంటుంది అన్న ఆ అనుభవంలో నీవు ఎంతోకాలం వుండవు. అపుడు ఆ శక్తి ప్రభావం కూడ ఉండదక్కడ.

మన ఆకాంక్షకు జవాబుగా అది వెనువెంటనే ప్రాప్తించవచ్చు. అది అరుదుగా జరిగే విషయం. కాని జరగవచ్చు. రెండూ ఒకే సమయంలో జరిగితే అది సంపూర్ణమైన స్థితి. అయితే ఆ స్థితి మారుతూ వుంటుంది. అవి రెండూ సంపూర్ణ ఏకత్వంతో కలిసిపోయేవరకూ ఒకదానివెంట ఒకటి వుంటాయి. ఆ సంపూర్ణమైన ఏకీభావం తరువాత వాటిలో భేదం వుండదు. ఒక సూఫీ తత్వవేత్త చెప్పగా విన్నాను. అతడు ఇండియన్, మంచి సంగీత విద్వాంసుడు. అతడు వారికి దైవానికి సమర్పించుకోడం, ఆ ఆరాధన, భక్తికంటె వున్నతమైన స్థాయి వుందని, అది వీటన్నింటిని అధిగమించిన స్థితి అని, అయితే అది కూడా చివరి స్థితి కాదని, నిజానికి ఈ ఆధ్యాత్మిక పురోగతిలో చివరికి తనకు, దైవానికి మధ్య ఏ రకమైన భేదం లేకపోవడమే, అభేదమైన ఆ స్థితి మాత్రమే ఉత్తమస్థితి అని చెప్పాడు. అంటె నీ సమర్పణ, ఈ ఆరాధనా భావనల నధిగమించిన ఒక అత్యంత నిరాడంబరమైన నిర్మలమైన, సహజమైన ఏ భేదాలులేని ఏకాత్మభావన. ఆ అనుభవం వాళ్లకు తెలుసు. అది వాళ్ల గ్రంథాలలో లిఖించబడింది. అది వారికి తెలిసిన సులభసాధ్యమైన అనుభవం. అక్కడ ఏ భేదములేని కలయిక సుసాధ్యం. అక్కడ దేనికో ప్రత్యేకమైన దానికి

సమర్పణ చేసుకుంటున్నామన్న ఉద్విగ్నమైన ప్రత్యేక ఆనందం కూడా ఉండదు. నీ ఆకాంక్ష, భక్తి ఫలితంగా పొందిన, నీకు అర్థంకాని అనుభవం కాదది. అది ఏమాత్రం భేదంలేని సహజ, సమగ్ర, సంపూర్ణసంగమం.

(CWM Vol. 5, pp. 55-58)

అనువాదం: డి. సత్యవాణి

మానవుని అస్తిత్వము – దైవాభివ్యక్తికి నిమిత్తము

ప్రశ్న: మధుమయీ, ఇక్కడ ఈ విధంగా రాసి వున్నది. "మనకు కలిగిన ఈ ముక్తి, పూర్ణత్వము, సిద్ధి మన సొంతంకోసమా లేక దైవంకోసమా?"

అందుకనే ఈ విషయాన్ని అంత నొక్కిచెప్పటం జరుగుతోంది. మనమీ అభివృద్ధినంతా స్వార్థప్రయోజనాల కోసం కోరకూడదు. దైవకార్యము నిమిత్తమే – మనకు కలిగిన అభివృద్ధినంతా దైవాన్ని ఇంకా అద్భుతంగా అభివ్యక్తపరచుటకే వినియోగించాలి. మన గొప్పకోసం కాకుండా దైవకార్యార్థమై మన మీ సాధనను చేయవలెను.

మన మీ దివ్యకార్యము నెందుకు చేయవలెను. మన మనుగడకోసం....

కాదు. కానే కాదు. దైవేచ్ఛ అలా వున్నది కనుక. అది దైవకార్యం కాబట్టి.

అయితే వ్యక్తిగతమైన కోరిక, స్వీయేచ్ఛ ఎప్పుడైతే అందులో కలిసినయ్యో అప్పుడది పరిశుద్ధమైన దైవేచ్ఛ కానేరదు. మనకు కావలసినది దైవమొక్కటే, ఆయన ఇచ్ఛ, ఆయన అభివ్యక్తి, ఆయన ఆవిర్భావము. నువ్విక్కడ అందుకనే వున్నావు. అందుకు తప్ప మరి ఇంకెందుకు కాదు. "నేనొకడిని వున్నాను" అనే అహంకారభావము, ఒకానొక వ్యక్తి వున్నంతకాలం నువ్వు దారి తప్పి

నట్లే. అయితే ఇది కొన్ని రోజుల్లోనో లేక నిర్ణీతవ్యవధిలోనో అయ్యే పని కాదు.

ఈ రంగంలో కూడ అంటే ఆధ్యాత్మిక వ్యవహారాలలో కూడ చాలమంది (యోగం చేద్దామని గొప్పలకు పోయే అధిక సంఖ్యాకులు) సొంతకారణాలకోసం, రకరకాల స్వార్థప్రయోజ నాలకోసం యోగంలోకి దిగుతారే కాని ఒక చిన్నపిల్లవానికిమల్లె అమాయికంగా, దైవానికి ఇచ్చుకొని, ఆయన నిన్ను తన చేతు ల్లోకి తీసుకొని, తన ఇచ్ఛవచ్చిన రీతిలో నిన్ను మలచుటకై తమను సమర్పించుకుండే వాళ్లెంతమంది? ఆ విధంగా చేసినవాళ్లు తప్పుదారి పట్టే అవకాశం చాలా తక్కువ. తిన్నగా గమ్యంవైపు పరిగెత్తిపోగలరు. మరొక ఉద్దేశంతో స్వార్థప్రయోజనాలతో కలసి వున్నట్లయితే నువ్వు తిన్నగా కాకుండా అటు ఇటు పక్కదార్లు పట్టి నీ గమ్యానికి దూరమైపోతావు. చాలా దూరమైపోతావు.

నువ్వు ఒకేదాని కోసం, ఒకే ఉద్దేశము, ఒకే లక్ష్యం కోసం ఎంత పూర్తిగా అంకితమైపోవాల్నంటే ఇక నువ్వు మానవునివో లేక దైవానివో అనే భేదము తెలియనంత ఒకటిగా, పూర్తిగా ఆయనే అని ఇక ఏ విధమైన వేరు భావము లేకుండా వుండటమే మంచిపద్ధతి. అప్పుడు నీ జీవితంలోను, సాధనలోను ఏమాత్రము అపాయము లేకుండా ఏమాత్రం భయంలేకుండా ముందుకు సాగిపోగలవు.

(CWM Vol. 7, pp. 191-92)

అనువాదం: ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి, ఆర్. లక్ష్మిప్రసాదమ్మ

...if the little human mind surrenders, it will be merged in the Divine Universal Mind.... it will receive from it its vastness and luminous clearness.

The Mother

'ప్రార్థనలు, ధ్యానములు' – శ్రీమాత దినచర్యనుండి

డిసెంబరు 3, 1912

నీ దివ్యోపదేశముపై విశ్వాసపూరితమైన శరణాగతికి చెందిన ప్రయోజనం గతరాత్రి నాకు అనుభూతికి వచ్చింది; ఏదైనా తెలిసికోవలసిన అవసరం వచ్చినప్పుడు, ప్రతి ఒక్కరికీ అది అవగతమౌతుంది. మరల మీ దివ్యతేజముపట్ల మనస్సు ఉన్మీలమై నున్నప్పుడు, అది మరింత తగినంతగా విశదంగా వ్యక్తమౌతుంది.

నీవు నాలో సంభాషించినట్లే నిన్ను విన్నాను. మరిచి పోకుండా ఉండేందుకు నీ దివ్యసందేశాన్ని వ్రాసికోవాలనుకునే దాన్ని. ఏమంటే అప్పుడు చెప్పిందిప్పుడు నేను వల్లించలేను కనుక. అప్పుడనుకున్నాను.... నీపట్ల విశ్వాసాన్ని కోల్పోయి మరల కించ పరచేందుకేనా యీ స్మరణశక్తికి శ్రద్ధ వహించవలసి వచ్చిందని; ఏమంటే నాకు కావలసిందంతా నీవు చేయగలవు కదా! నీ సర్వాంతర్యామిత్వానికి అవధుల్లేని పరిస్థితుల్లో నీవు నా లోనా బయిటా నాకు నీ పట్లగల వైఖరి పరిమితిని అందిచగలవు గదా! కచ్చితంగా నీ ఆస్తిత్వాన్ని వీలైనంత నిండుగా నిన్నన్ని క్షణాల్లో అన్నింటా నిన్నవలోకించే పద్ధతిని అవగతం చేసికొన్న వారి కోసం! ఇంకేం, భయం సున్నా! మరే కలవరపాటూ లేదు; ఇంకే విచారం లేదు. మిగిలింది సంపూర్ణ ప్రశాంతతే! సమగ్ర విశ్వాసం; ఉన్నతోన్నత అవిచలిత ప్రశాంతతే!

ఫిబ్రవరి 12, 1914

ఐహిక పరిస్థితులను పరిగణిస్తూ, చేతన నీ పరమోత్కృష్ట చైతన్యంతో సంగమిస్తున్నప్పుడు, వాటి సంపూర్ణ సంబంధ బాంధ వ్యాన్ని ప్రతి ఒక్కరూ పరికించి యిలా అనుకుంటారు – "ఇదో అదో ఏది చేయాలన్నా అది ఎంతమాత్రం అతిముఖ్యం కానే రదు; కాని ఒకానొక స్వభావం, ఒకానొక పరిజ్ఞానంయొక్క విని

యోగానికి ఒక ప్రత్యేక కార్యాచరణ విధానం ఉత్తమోత్తమమైంది. ఏది కానీయండి, కర్మలన్నీ – బాహ్యానికి పరస్పరం విరుద్ధంగా కనిపించినా – నీ శాసనానికి అవి వ్యక్తీకరణమే! అయితే, అవి ఆ దివ్యశాసన చేతనలో విలీనం కావలసినదే! సామాన్యంగా మానవచేతనలోని సూత్రాలు, లేదా నిబంధనలోనికి అనువదించుకొని ఆచరణలోనికి తెచ్చే శాసనం కాదది. మరి? ఒక వైఖరికి చెందిన శాసనం. నిరంతర నిర్విరామ చేతనకు సంబంధించిన శాసనం. సూత్రాల్లో యిమడ్చలేని వ్యక్తీకరించలేనివవి. కాని జీవింపదగినవి."

అయితే, వ్యక్తి సామాన్యచేతనలో పడ్డప్పుడు దేనినీ తేలికగా పరిగణించకూడదు; అయిష్టంగా చూడకూడదు; కనిష్ఠపరిస్థితులకు, కనీస కర్మలకు సైతం గొప్ప ప్రాముఖ్యం ఉంటుంది; వాటిని కూడ మనం తీవ్రంగా పరిగణించాలి. మనం వేసే ప్రతి అడుగూ, ప్రతి క్షణం చిరంతన చేతనతో సులభంగా ముడిపడేట్టు ప్రయత్నించాలి. ఈ తాదాత్మ్యతా చర్యలో అడ్డంకులను మెలకువతో విస్మరించాలి. అప్పుడే, సంపూర్ణ వ్యక్తిగత నిరాసక్తతకు, పూర్ణత్వ సూత్రాల పునాదికి పరిపూర్ణ విలువలు కనుగొనవచ్చు.

నా యెదలో శాంతితో, నా మదిలో కాంతితో, నా పూర్తి అస్తిత్వంలో రూఢిజనిత విశ్వాసంతో, నిన్ను పల్కరిస్తున్నాను; ఆహ్వానిస్తున్నాను ఓ ప్రభూ! ఓ దివ్యశాసన సృష్టికర్తా!

మా అస్తిత్వానికి నీవే హేతువు; మా పరమలక్షం నీవే!

(CWM Vol. 1, pp. 9, 72)

"నువ్వు దైవానికి చెందినవాడివి" అనే విషయము అడుగడుగునా, అనుక్షణం నీ అనుభవంలోకి రావాలి. నువ్వే పని చేసినా, దేన్ని గురించి ఆలోచించినా దివ్యచైతన్యమే నీ ద్వారా పని చేస్తోందని నీకు తెలియాలి.

శ్రీమాత

రాధ మొర

నా తొలిచూపులోనే నా జీవితేశునిగా నా కవగతమైన నీవు ఓ నా ప్రభూ, నా సమర్పణను స్వీకరించు.

నా తలపులన్నీ నీవే!
నా భావోద్రేకాలు నీవే!
నా యెదలోని భావపరంపరలు నీవే!
నా జీవనకదలికలు నీవే!
నా శరీరంలోని ప్రతికణం నీదే!
నాలోని ప్రతి రక్తపుబొట్టూ నీదే!
నేను పరిశుద్ధంగా నీ దాన్నే!
నిష్కపటంగా నీ దాన్నే!
నీవు నన్నేది చేసినా!
నాకది సమ్మతమే!
నన్ను బ్రతికించినా, చంపినా,
నాకు సుఖాన్నిచ్చినా, దుఃఖాన్నిచ్చినా,
మోదమిచ్చినా, ఖేదమిచ్చినా,
నీనుండి యేది లభించినా –
దాన్ని నేను స్వాగతిస్తాను!
నీవందించే ప్రతి కానుకా నాకు దివ్యవరమే!
దివ్యానందమే!

*

దైవంతో తాదాత్మ్యం చెందించే సంపూర్ణ ఆత్మార్పణకు ముప్పిధాల సూత్రాలు:

1) నిగర్విగా, సంపూర్ణ వినమ్రతతో పరమాత్ముని పాదారవిందాల మ్రోల మోకరిల్లటం;

2) ఏమీ దాచుకోకుండా, మరేమీ మిగుల్చుకోకుండా ఆపాదమస్తకాన్నీ, సర్వం దృశ్యమానమైనట్లు శరీరంలో అన్ని కేంద్రాలనూ తెరచి, ప్రభువు మ్రోల పరచటం;

3) ప్రభువు దివ్యాలింగనంలో యిమిడిపోతూ, ప్రేమపూర్వకంగా, పరిశుద్ధ విశ్వాసంతో తాదాత్మ్యం చెందటం

ఈ త్రివిధ కదలికలూ క్రింది త్రివిధ సూత్రాలతో జోడించాలి; లేదా పరిస్థితినిబట్టి వాటిలో యే ఒక్క సూత్రాన్నయినా పాటించాలి.

1) నీ వనుకున్నదే (నీ అభీష్టమే) చెల్లనీ; నాదేం కాదు.
2) నీ యిచ్ఛయే, నీ యిచ్ఛయే....
3) నేను చిరంతనంగా నీ దాన్నే

సామాన్యంగా సత్యమార్గంలో యీ మాటలు పాటిస్తే, సంపూర్ణ తాదాత్మ్యంతో అనుసరిస్తే, అదే పరమ దివ్యానందదాయకం


(CWM Vol. 15, p. 224; Vol. 14, pp. 108-109)

అనువాదం: సాహితీ కౌముది, సాహిత్యరత్న పి. మోహన్

వార్తలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహాసభలు

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీఅరవింద కేంద్రముల, శాఖల, రాష్ట్రమహాసభలు హానుమకొండలో 8, 9-2-2003 తేదీలలో జరుపబడును. వివరములకు వ్రాయవలసిన చిరునామా. శ్రీ బి. వెంకట్రామయ్య IAS (Retd) ఛైర్మన్, శ్రీఅరవిందో సొసైటి స్టేట్ కమిటీ ఫర్ ఆంధ్ర ప్రదేశ్, శ్రీఅరవిందో విద్యాలయము, NGO కాలని, K.T. రోడ్డు, తిరుపతి - 517507.



పుట్టినరోజు ప్రాముఖ్యత

అఖిల


అఖిల భారత పత్రిక మార్చి 2003

జన్మదిన శుభాకాంక్షలు

శ్రీమాత ప్రవచనములు

శ్రీఅరవిందుల ప్రవచనములు

అనుబంధం



That rapture's smile is secret everywhere;
It flows in the wind's breath, in the tree's sap,
Its hued magnificence blooms in leaves and flowers.

– Sri Aurobindo

Bonne Fête

with

blessings

J.

ఉపోద్ఘాతము

జన్మదినము సర్వజనులకు శుభసూచకము. ఆధ్యాత్మిక జీవనానికి దీనికి ఇంకా అధికమైన ప్రయోజనము కలదు. సర్వసమాన్యంగా మనిషి తన మనస్సుతో నిర్మించుకొన్న నాలుగుగోడల మధ్యలో బందీయై వుంటాడు. కాని పుట్టినరోజు నాడు అతని అంతర్ద్వార ములు తెఱచుకుంటాయి. అంతేకాదు, ఎక్కడో ఆకాశభువనాలలో వుండే దైవము ఆ రోజున ప్రత్యక్షంగా దిగివచ్చి తన ఎదుట నిల బడతాడు. తన అంతర్ద్వారములు తెఱచియుండుటవలన మనిషి దైవానుగ్రహమును పొంది తన సాధనలో గంతులువేసి సునాయా సంగా ముందుకు సాగిపోతాడు. అనేక జన్మలు పట్టేటంత అభి వృద్ధిని ఈ ఒక్క జన్మలోనే సాధించగలుగుతాడు. ఇంతటి మహ త్తరమైన అవకాశమును మనము తప్పకుండా ఉపయోగించుకొం దుము గాక!

సంపాదకుడు

జన్మదిన పరమార్థము

శ్రీమాత సాధకుల పుట్టినరోజులకు చాల ప్రాముఖ్యత ఇచ్చే వారు. ఆ మనిషిని ప్రత్యేకంగా తన వద్దకు పిలిచి దగ్గర కూర్చో పెట్టుకుని ఆశీర్వదించేవారు. అతని ఆత్మను తట్టి లేపి అనేక విధాల అతని సాధనకు తోడ్పడేవారు. ఆత్మ విస్ఫులింగములను వెలిగించేవారు. తత్ఫలితంగా జీవాత్ముడు పైలోకాలను దర్శించి తచ్ఛక్తి సంపన్నుడై, జ్యోతిరానందములతో దిగివచ్చి, ఈ భౌతికశరీరమును ప్రేరేపించగా అది పరివర్తనమునకు, దివ్యీకరణమునకు సంసిద్ధము కాగలదు! — సంపాదకుడు

రేపు నీ పుట్టిన రోజా!

సాధకుడు: అవును మదర్.

నీకెన్నేళ్లొస్తాయి?

సాధకుడు: ఇరవైయారు మదర్.

సరే, నువ్వు రేపురా, నీ కేదో యిస్తాను. మామూలుగా ఇచ్చే కార్డు మొ॥ ఇస్తానులే. కాని ఇది అటువంటిది కాదు. నిజంగా చాలా ముఖ్యమైనది. రేపు నీకే తెలుస్తుంది. ఇప్పుడు నువ్వు ఇంటికి వెళ్లి నిశ్చలంగా ఉండు. మనస్సు కుదుటపరచుకొని నేనిచ్చే కానుకను అందుకుండేందుకు తయారుగా ఉండు!

సాధకుడు: సరే మదర్.

పుట్టినరోజుకి అర్థమేమిటో నీకు తెలుసా? ఇక్కడ మనం పుట్టినరోజు శుభాకాంక్షలు ఎందుకు అందిస్తామో?

సాధకుడు: మామూలుగా తెలుసు మదర్! కాని మీరు నాకు వివరించనున్న ప్రత్యేక అర్థం తెలీదు.

అవును. నిజానికి ఇది ఒక గొప్ప ప్రత్యేకమైన రోజు. ప్రతి సంవత్సరం వచ్చే అతిముఖ్యమైన రోజు. ఆ రోజు దైవశక్తి మనలోకి దిగివచ్చే రోజు. అంటే మనం దైవంతో, ముఖాముఖి ఉండే రోజు — మన ఆత్మ ఆ అనంతశక్తితో కలిసే రోజు, మనం ఏ మాత్రం అప్రమత్తంగా ఉన్నా ఆ దైవంయొక్క ఉనికిని మనలో

అనుభూతం చేసుకోగలం. ఈ రోజు మనం ఏ కొంచెం ప్రయత్నించినా, ఏ కార్యం తలపెట్టినా అది మెరుపువేగంతో అనేక జన్మలకు సరిపడినంత కార్యాలను చేయగల శక్తిని కలిగి ఉంటాం. అందుకే నేను జన్మదినానికి అంత ప్రాముఖ్యత నిస్తాను – ఎందుకంటె ఆ ఒక్క రోజు సాధించేది అసాధారణమైంది. ఆ రోజు నువ్వు సాధించగలిగినది మరి దేనితోనూ పోల్చలేనిది. అందుకోసం నేను మీలోని చేతనాశక్తిని మరింత ఉన్మీలనం చేసేందుకు, ఆ దైవశక్తికి అభిముఖంగా నిలవడానికి తోడ్పడే పని చేస్తారు. మై చైల్డ్! – ఇది చాలా చాలా ప్రత్యేకమైన రోజు, నీ జాతకం మారిపోయే రోజు. ఈ అనంతచైతన్యంతో సాయుజ్యమయ్యే రోజు. ఎందుకంటె ప్రభువు మనల్ని ఉన్నతచేతనా శక్తులకు ఆ అనంతజ్వాలలో ఒక భాగమైన మన అంతరాత్మ సంసిద్ధతనుబట్టి చేయూత నిచ్చి మూలశక్తిని చేరే విధంగా ముందుకు నడిపించగలడు. అనంతశక్తిలో భాగమైన అంతరాత్మ ఆ శక్తిలో చేరి తాదాత్మ్యం పొందగలదు.

ఈ రోజు నిజానికి జీవితంలో ఒక గొప్ప అవకాశం. వ్యక్తి తాను ఆ దైవశక్తికి ఉన్మీలనమై దేనినైనా జీర్ణించుకోగలిగే రోజు. ఆ రోజు నేనెంతో చేయగలను. అందుకే అది ముఖ్యమైనది అన్నాను.

దైవమే తన ద్వారం తెరిచి మనని ఆ సన్నిధికి ఆహ్వానించే రోజు. ఆయన మనలోని ఆకాంక్షజ్వాలని మరింత ప్రకాశవంతం చేయడానికి, తిరిగి ఆ జ్వాలను వెలిగించడానికి సంభవమైన రోజు. ఆయన మన కొసగిన అతిముఖ్యమైన రోజుల్లో ఒకటి. అయితే మనం కూడా శ్రద్ధాసక్తులతో సంసిద్ధమై ఆ స్థితిని చేరడానికి ప్రయత్నించవచ్చు. కాని అదంత సులువైన పని కాదు. చాలా కష్టపడాలి. అయితే పుట్టినరోజు మాత్రం ప్రతి మనిషికి దైవం ఇచ్చిన ఒక గొప్ప ఛాన్సు. దైవమిచ్చిన వరం. ఆ రోజు దైవకృప నిన్ను అనుగ్రహిస్తుంది. అతిముఖ్యమైన రోజు.

*

ఇది మనకు తెలియకుండా సంభవించే ఒక మార్మిక సత్యం. ఈ రోజు మాత్రం ప్రత్యేకంగానే ఉంటుంది. ప్రతి ఏడూ వినూత్నమై

ఆవిర్భవిస్తుంది. ఆత్మ ఈ శరీరాన్ని వదలి పైకెగసి మూలశక్తితో కలసి తననుతాను తిరిగి శక్తివంతం చేసుకుని, పరిపుష్టి పొంది, ఆ అనంతశక్తితో చేరి ప్రకాశవంతమై అలరారుతుంది. అపుడు శక్తి, ప్రకాశం, ఆనందాలతో పునరుద్ధరింపబడి ఒక ఏడాదిపాటు మళ్ళీ నా నూతనతేజం వినూత్నశక్తితో సాగుతుంది. ఇలాగే ఏడాది తరువాత ఏడాది, మళ్ళీ, మళ్ళీ సాగే ప్రక్రియ. మానవజన్మలో అతి ముఖ్యమైన పండుగ పుట్టినరోజు. జీవితాన్ని అనంతశక్తి సన్నిధికి నడిపించే, ఆత్మశక్తిని ఉజ్వలింపచేసే గొప్ప రోజు.

*

జన్మదిన సందర్భంగా ఒక సాధకునికి
శ్రీమాత ఇచ్చిన సందేశం, ప్రార్థన.

"కోటివేల సిద్ధాంతాలకంటె కొంచెమైన ఆచరణే మేలు"

"ప్రభూ! ఈ రోజు నాజన్మదిన సందర్భంగా నాలో జ్ఞానాన్ని గ్రహించగలిగే శక్తిని 'నన్ను నేను పరిపూర్ణంగా రూపాంతరం చేసుకునే శక్తిగా' మార్చుకునేలా అనుగ్రహించు!"

(*Sweet Mother, Harmonies of Light*, Part 1
by Mona Sarkar, pp. 16-18)

అనువాదం: డి. సత్యవాణి

జన్మదిన సందేశం

ఈ జన్మదినం భగవంతునికి నిన్ను నీవు మరింత సంపూర్ణంగా సమర్పించుకోడానికి సహాయపడే తరుణం కావాలి. నీ సమర్పణ పరిపూర్ణంగా వుండాలి. నీ భక్తి ప్రగాఢమై ఉండాలి. నీ ఆకాంక్ష మరింత తీవ్రమవ్వాలి.
వినూత్న రోచిస్సుకు ఉన్మీలనం కావాలి నువ్వు. ఆనందంతో అడుగులు వేస్తూ ఆ మార్గంలో నడవాలి. అలా వుండాలని ఈ జన్మదినం నాడు నువ్వు తీర్మానించుకో. అప్పుడు ఆ రోజు వ్యర్థం కాదు.

ఆశీస్సులు

(*CWM* Vol. 15, pp. 213-14) *శ్రీమాత*

జన్మదిన పరమార్థము

ప్రశ్న: మానవుని జన్మదిన పరమార్థమేమిటో తెలుసుకోవాల నుంది. సెలవిస్తారా?

జవాబు: అంతరంగ ప్రకృతి దృష్ట్యా, యేటి కేడు ప్రతి పుట్టిన రోజున ఆ వ్యక్తి గ్రహణశక్తి ఉచ్చదశలో వుంటుంది. ఆ విధంగా అది నూతన ప్రగతికి దోహదపడుతుంది.

ప్రశ్న: వ్యక్తి తన జన్మదినాన్ని ఎలా జరుపుకోవాలి?

జవాబు: జీవితపరమార్థానికి మార్గాన్ని అన్వేషిస్తూ...

*

ప్రశ్న: ఈ రోజు నా పుట్టిన రోజు. ఆధ్యాత్మిక జీవితంకోసం యితోధికంగా చేసే ప్రయత్నానికిది అంకురార్పణ కావాలనుకుం టున్నాను. అందుకు నేనేం చెయ్యాలో దయచేసి చెప్పండి.

జవాబు: అది అనుకొని, ఆలోచించి, నిర్ణయించేది కాదు. చిత్త శుద్ధితో కూడిన స్థిరమైన నిరంతర ఆకాంక్షలోంచి ఎప్పుడో హఠా త్తుగా తనంతతానుగా అతిశయించే చైతన్యం.

ప్రశ్న: వ్యక్తి పుట్టినరోజు చేసుకోటమొక సాంప్రదాయమే కాని, అసలా రోజుకి ప్రత్యేకత ఏమైనా వున్నదా? దీనిని ప్రయోజనక రంగా ఎలా మలుచుకోవాలి?

జవాబు: విశ్వశక్తుల ప్రాబల్యసరళిలో ప్రతిసంవత్సరం వ్యక్తి తన పుట్టినరోజున ప్రత్యేక గ్రహణశక్తి కలిగివుంటాడు.

దీనిని అవకాశంగా తీసుకొని సమగ్రాభివృద్ధి కోసం తీర్మా నించుకొని నూతన దివ్యప్రగతి సాధించాలి.

(*CWM* Vol. 16, pp. 396-97, 413; Vol. 17, p. 172; Vol. 16, p. 310)

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

కాలచక్రము

(శ్రీమాత శ్రీఅరవిందుల 'The Synthesis of Yoga' గ్రంథంలోని సాధన చతుష్టయము అనే అధ్యాయం చదువుతూ ఒక సాధకుడు అడిగిన ప్రశ్నకు ఇచ్చిన సమాధానం

ఈ ప్రపంచంలో జరిగే అనేక వ్యవహారాలలో కాలానికి సంబంధించిన ఒకానొక లయ – నిర్ణీతకాలమునకు పునరావృతమగుట ఉదా: సూర్యోదయము, తామరపువ్వులు వికసించుట, ఋతువుల ఆగమనము మొ॥ – కనబడుతుంది. సూక్ష్మంగా పరిశీలించినట్లైతే మనిషి జీవితంలో కూడ ఇటువంటి లయ ద్యోతకమవుతుంది. జ్యోతిషశాస్త్రం ద్వారా మన కిది సుపరిచితమే. పుట్టిన రోజుకూడా ఇది వర్తిస్తుంది. నీ ఆత్మకు అనువైన పరిస్థితులవలన అది ఈ భూమిమీద జన్మ ఎత్తుతుంది. ప్రతి పుట్టినరోజు నాడు అవే పరిస్థితులు పునరావృతమగుటవలన అది ఆత్మవికాసాని కొక అద్భుతమైన అవకాశం కాగలదు.

– సంపాదకుడు

ప్రశ్న: మధుమయీ! ఇక్కడ "చివరగా కాలమొక ఉపకరణము కాగలదు. ఎందుకంటే, ఇక్కడ జరిగే ప్రతిసన్నివేశము కాలము యొక్క లయకు బద్ధమై వుంటుంది. దివ్యప్రేరణను అనుసరిస్తుంది..." ఈ దివ్యప్రేరణ అంటే ఏమిటండి?

అది ప్రతి వస్తువుకు భిన్నంగా వుంటుంది. ప్రతి చర్యకు ప్రతి సిద్ధికి, ప్రతి చలనానికి ఒక నిర్ణీతకాలముంటుంది. అది అద్దానికి ప్రత్యేకంగా ఉన్నప్పటికి మొత్తం కలగాపులగమై వుంటాయి. కాని ప్రతివస్తువు దాని లయతో క్రమబద్ధం చేయబడుతుంది.

బాహ్యాజీవన సౌలభ్యంకోసం మనిషి కాలాన్ని తన ఇచ్చవచ్చిన రీతిలో సంవత్సరాలుగా, నెలలుగా, వారాలుగా, రోజులు, గంటలు, నిమిషాలు, సెకండ్లుగా విభజించి ఒక కొలమానాన్ని తయారుజేసుకున్నాడు. అయితే కాలాన్ని మనం యథేచ్ఛగా కొలుచుకోవచ్చు. ఏ కొలమానాన్ని అవలంబించినప్పటికి కాలంలో

ఒక వాస్తవం ఉంది. అది విశ్వజనీన గతులకు సంబంధించిన విషయము. ఉదాహరణకు అందుకే మనం జన్మదినాలు జరుపుకుంటాం. ప్రతి మనిషి జీవితంలోను ఒక నిర్దిష్టమైన లయ వుంటుంది. జన్మించిన పరిస్థితులకు అనుగుణంగా క్రమపద్ధతిలో పరిస్థితుల చక్రభ్రమణాలవల్ల ఈ లయ స్థిరపడుతుంది.

అన్ని గతులలో – సంఘటనల చలనాలలో ఒక లయ కనిపిస్తుంది. అంతర్గత చైతన్యకదలికలు అవి. అవగాహన దృష్ట్యా మాత్రమే కాదు. వ్యక్తిగత ప్రతిస్పందనలు, పురోగతిలో ఎత్తుపల్లాలు, కష్టాలు, దోహదాలు క్రమపద్ధతిలో నిర్దిష్టవ్యవధిలో తిరిగి రావడం – వాటిలో పురోగతులు, ప్రతిఘటనలు వుంటాయి. కాని ప్రతి వ్యక్తి శ్రద్ధగా వుంటే తన లయ పూర్ణంగా తనదేనని గుర్తిస్తాడు. ప్రక్కవాడి లయవంటిది కాదు అది. ఋతువులకు ఒక లయ వున్నట్లే వ్యక్తిగత జీవితంలోకూడా అటువంటి ఋతువులు ఉన్నాయి. తనకుతాను శ్రద్ధగా పరిశోధించుకున్న వ్యక్తి క్రమపద్ధతిలో నిర్దిష్ట వ్యవధులలో ఒకే రకం పరిస్థితులు పునరావృతాన్ని గమనించవచ్చును. వారంలో కొన్ని రోజుల్లో, రోజులో కొన్ని గంటల్లో తాము తమ పనుల్ని తేలికగా చేయగలరని సున్నితమనస్కులు తెలుసుకుంటారు. దీనికి విరుద్ధంగా కొందరికి కొన్ని నిర్దిష్ట క్షణాలలో మరింత చక్కని ఆవేశం. ఉత్తేజం కలుగుతుంటాయి. కాని ప్రతివ్యక్తి పరిశీలన ద్వారా ఈ విషయం తెలుసుకోవచ్చును. అది నిరపేక్షం కాదు. కఠినమైనది కాదు. అతి బాధాకరమైనదైతే, దానిని తేలికగా, గట్టి సంకల్పంతో వదిలించుకోవచ్చును. సహాయపడితే దానిని మనం వాడుకోవచ్చును. ప్రతి వస్తువుకు లయవుంటే, అది చాలా సంక్లిష్టమైన లయల గజిబిజిగా తయారవుతుంది. ఇప్పుడు మనం చూస్తున్న లోకం అదే. అసలు లయ అనేది లేనట్లుగా కనిపిస్తుంది. ఎందుకంటే అది సంక్లిష్టమైనది. అత్యంత గహనమైనది.

ప్రశ్న: మనం ఈ కాల లయగతిని ఎలా ఉపయోగించుకోవాలి?

మనం యోగం గూర్చి మాట్లాడుతుంటే, నీలో పరిస్థితులు పునరావృతమవుతున్నట్లు నీవు కనుగొంటే, ఉదాహరణకు –

కొన్ని నిర్దిష్ట పరిస్థితులలో రోజులో ఒక నిర్దిష్ట సమయంలో, ఒక నిర్దిష్ట ఘడియలో నీకు సాధన చేయడం, ఏకాగ్రతను సాధించడం మరింత తేలిక అని నీవు భావిస్తే, ఆ నిర్దిష్ట సమయంలో ఆ ఘడి యను ఉపయోగించుకోవాలి. కాని, నీవు దానికి బానిస కారాదు. దానిని ఉపయోగించుకోవచ్చు కానీ అది అవసరం కారాదు. ఆ గంట గడిచిపోతే ధ్యానం చేయలేకపోవచ్చు. కాని అది మంచి సహాయకారి. ఆ సహాయం పొందవచ్చును – అంతా మన పరిశీ లనపై ఆధారపడుతుంది.

వ్యక్తిగత పరిస్థితులవల్ల కాకుండా, ప్రకృతిలో పరిస్థితు లవల్ల సంవత్సరంలో నిర్దిష్ట వ్యవధులు వస్తున్నట్లు నీ పరిశో ధనలో నీవు గుర్తిస్తావు, సాధనలో మరిన్ని కష్టాలు ఎదురవు తాయి. విజ్ఞానం, చైతన్యం వికాసం వైపు నీలో మరింత ఉత్తేజం, ఉద్వేగం పొందిన సమయాలు కొన్ని వుంటాయి. ఒకవేళ నీకు ప్రత్యేక కష్టాలు ఎదురైనా, సాధన ఆగిపోయినా విచారిస్తూ కూర్చొనడానికి బదులు – "ఎందుకలా జరిగింది? అది మామూలు సమయమే. ఈ సంవత్సరంలో నిర్దిష్ట వ్యవధిలో నేను ఉన్నాను" అని నీకు నువ్వు చెప్పుకోవాలి. ఆ సమయం గడిచిపోయే దాగా వేచివుండు సహనంతో నీవు చేయగలిగిన పని చెయ్యి. కాని నిరు త్సాహ పడవద్దు.

"నేను పురోగతి చెందలేకపోతున్నాను" అని నీలో అనుకో. సహేతుకంగా ఆలోచించడానికి ఇది తోడ్పడుతుంది. సహజంగా నువ్వు మరో అడుగు ముందుకు వెయ్యవచ్చు. బాహ్యపరిస్థితుల ప్రభావానికి సంబంధంలేని జాగ్రత్తలు (అంతర్గత జాగ్రత్తలు) తీసుకో. అయితే నువ్వు నీ సాధనలోని పూర్ణదశలో, ఒక స్థాయికి చేరుకున్నప్పుడు అందులో నైపుణ్యం సాధించినప్పుడు conscious master వైతే అప్పుడు ఈ జాగ్రత్తలు తీసుకోగల్గుతావు. ఆ దశ తరువాత వస్తుంది.

(*CWM* Vol. 7, pp. 336-38)

అనువాదం: కె. యజ్ఞన్న

అంతరంగిక నూతన జన్మకు అవకాశం

పుట్టినరోజు పండగ కేవలం బహిరాడంబరముతో మాత్రమేగాక, అంతరంగిక వికాసముతో శోభించవలెను. అది ఒక నూతన జన్మ లాంటిది. సాధారణంగా జడముగా వుండే స్థూలశరీరము పుట్టినరోజు నాడు సున్నితంగా, మృదువుగా పరిణామశీలంగా వుంటుంది. అందుకనే శ్రీమాత సాధకులకు వారి పుట్టినరోజున దర్శనమిచ్చి వారికి మేలుకొలుపు కలిగించేవారు.

– సంపాదకుడు

ప్రశ్న: సాధకుల జన్మదినాల నాడు శ్రీమాత వారికి దర్శన మివ్వడంలో ఏమైనా ప్రత్యేక విశిష్టత ఉన్నదా?

విశ్వశక్తుల ఖేలనంలో ఒక లయ (ఇటువంటి లయలు అనేకం) వుంటుంది. ఆ లయ (rhythm) సూర్యునికి, ఇతర గ్రహాలకు సంబంధించినది. లోపలి చైతన్యం మరింత మృదువుగా వున్న సమయంలో జన్మదినం నాడు ఈ లయవల్ల కొత్తశక్తులు తిరిగి సంతరించుకునే అవకాశం మెండుగా వుంటుంది. ఈ కారణంగానే శ్రీమాత సాధకులను వారి జన్మదినాలకు దర్శనమిస్తారు.

*

ప్రశ్న: జన్మదినాలలో భౌతికం మరింతగా ఉన్మీలనమై, శ్రీమాతకు ప్రతిస్పందిస్తుంది అని మీరు లోగడ ఒకసారి వ్రాశారు.

భౌతికమైన జన్మదినం అని, శరీరానికి జన్మదినం అని భావించే ప్రసక్తి కాదు. అంతర్గతంగా కొత్తజన్మ వికాసం చెందుతుండగా, జీవితంలో కొత్త సంవత్సరం ప్రారంభమైన సందర్భంగా దీనిని పరిగణనలోకి తీసుకుంటారు. శ్రీమాత దృష్టిలో జన్మదినం వెనుకగల రహస్యం ఇదే.

*

నూతన జన్మ నీ హృదయంలో అభివ్యక్తమవ్వాలి (అలా అగుగాక). ప్రశాంత, ఆనందాల కిరణాలు వెదజల్లాలి. నీ మనస్సు,

చైతన్యం, సంకల్పం, సంవేదనలు, జీవితం, శరీరం, అంతర్దృష్టి — ఈ భూమికల వికాసం, అభ్యుదయం వైపు నిన్ను నడపడానికి నూతనజన్మ తోడ్పతుతుంది. నీ జీవితంలో ప్రతి రోజు నీ జీవితం వికాసం చెందే రోజు. మరింత నిండుతనం సంతరించుకునే రోజు. చివరకి నీలోని సర్వస్వమూ జగన్మాత శిశువుగా మారుతుంది. జగన్మాత వెలుగు, శక్తి, సాన్నిధ్యం నిన్ను ఆవరించి, నిన్ను సదా రక్షించి, నీ వికాసానికి, నీ పెరుగుదలకు తోడ్పడతాయి. చివరికి యొక్క భిన్నాంగముల్లై, శాంతిశక్త్యానందములతో విరాజిల్లవలెను.

(*SABCL* Vol. 25, p. 282; 4-4-1959 సందేశం)

అనువాదం: కె. యజ్ఞన్న

శ్రీమతి ఆర్. జన్మదిన సందర్భమున

పునరుక్తంబగు తమదు సొగసైన వత్సరంబులు
        దెచ్చునవి మరల తమదు జన్మ ప్రభాతంబును.
యౌవ్వన శిఖరాగ్రంబున గనపడు తమదు జీవనంబు, —
        పైకెగిసెడి యొక కెరటంబు వోలె.

నట్టనడి శతసాగర సమూహంబున
        సమ్మర్ధంబగు సాగరంబున యొక కెరటంబు
లయ బద్ధంబున తీరంబును జేరునటులన్
        మన జీవనము యుండవలె తదనుగుణంబునన్

కదలాడెడి యావచ్ఛక్తి యంతయు సాగర ఉద్ధృత్వంబే
        అజేయమై, నిరంతరంబున, స్వేచ్ఛయై యుండునది.
ఆ తాకిడికిన్ యొప్పించునది తనదు గతినిన్
        అనివార్యంబుగన్.

ఆ అత్యాంతాద్భుత మహత్ శక్తిచే
యాతని యిచ్ఛా గమ్యంబు దిక్కునన్ తరలించు మనలను,
చేపట్టునది మనదు చుక్కానినిన్, విప్పారిన ఔదార్య తెరచాపను
నింపునతని గంభీర ఉచ్ఛ్వాస నిశ్వాసంబునున్

యౌవ్వనపు సొగసు శక్యాంశంబులన్ గాంచి ఉప్పొంగుచున్,
సాగర సుదూర గమ్యంబున యొప్పించున్;
నావికుని బలుకుల నమ్మచున్, యా గురుదేవుల కనికరంబు
మనల నాక్రమించున్.

ఆనందింపుడు, భీతిల్ల రాదు, తరంగాల అలజడికిన్,
అల్లకల్లోలంబగు తుఫాను గర్జనల, గాలి దుమారంబుల
తాకిడికిన్;
మనదు నావికుండు పదిలంబరచుకొను చుక్కానిని,
నిదురించ డాతను ఎన్నటికిని.

అత్యంత సాగర అల్లకల్లోల కెరటంబుల
కనలేరు గగనంబున వాటి జల్లులకై,
భీతిల్ల రాదు, తేజోమయాదిత్యుడున్నాడు,
వేచి యున్నాడు రేయింబగళ్లు.

విజయోత్సవ వెల్లువయందు మునిగిన వారలు,
ఎందెందు మునిగినారో? ఆతని హృదయంబునన్.
అందించు నాతండు కొందరికి మంచిని, జయంబు, ఆనందములన్,
ఇచ్చును మరికొందరికి విశ్రాంతిని.

కానీ, ఉరవడిన పొరలిపోవు తుఫాను వర్షంబుల కావల
ప్రజ్వరిల్లు దినంబుల జూడుడు,
ఆహ్లాదకరంబగు గతిని గాంచితి నేను,
తమదు రూపంబును ప్రజ్వలింప జేయుచున్.

విశ్వసింపు మాతని యనుగ్రహంబును, ప్రతీక్షింపు మాతని ఇచ్ఛను;
మార్గ మఱుగై యున్నను, మార్గదర్శి కానిండు;

గాంచు మాతని సంఘటనల సఫలీకృతంబు లందంతయు,
తమదు ఆ జన్మ కారణంబులకై.

(*SABCL* Vol. 5, p. 75)

అనువాదం: సునీతి పంతులు

ప్రచోదకశక్తి

'ఆహా! నేనెంత గొప్పవాడిని' అని విర్రవీగటం తగదు. కుమ్మరివాడు ఒక కుండను అందంగా తీర్చిదిద్దినప్పుడు ఆ నేర్పు కుండదా లేక కుమ్మరిదా? మనిషి విషయంలో కూడా అంతే. ఈ ప్రపంచంలోని సర్వభూతములు పరమేశ్వరునిచే నడిపించబడుచున్నవి. ఆయన ఎవరిచేత ఏ కర్మలు చేయించవలెనో ఆ కర్మలే చేయించును కాబట్టి నీవు ఉచ్చ నీచములకు పొంగిపోవుటగాని క్రుంగిపోవుటగాని తగదు. ఈశ్వరుని చేతిలో ఒక అస్త్రమై నిన్నే విధంగా ఉపయోగించుకోవాలి? అనే విషయము ఆయనకే వదిలేయాలి.

— సంపాదకుడు

> *నీవు విశ్వశక్తికి ఉపకరణము మాత్రమే*

ప్రతి మానవుడు తెలిసికాని, తెలియకకాని, విశ్వశక్తియొక్క ఒకానొక ఉపకరణమే. అంతరమున దివ్యసన్నిధి దీపించుట అటుంచినచో, ఒక పనికినీ ఇంకొక పనికినీ, ఒక ఉపకరణమునకునూ, ఇంకొక ఉపకరణమునకునూ మన అహంకారిక స్వాతిశయప్రవృత్తిరూపమైన అవివేకమును సమర్థనీయముగా చేయగల ముఖ్య భేదమేమియును లేదు — ఆత్మయొక్క ఒకానొక అనుగ్రహ విశేషమే జ్ఞానమునకునూ అజ్ఞానమునకునూ గల భేదము. ఈశ్వరశక్తి విశేషము ఈనాడు ఒకరియందును, రేపు ఇంకొకరియందును తన బలమును పూరించుచు పనిచేయుచుండును. కుమ్మరివాడొక కుండను వేరొకకుండకంటె బాగుగా తయారుచేసినచో ఆ తెలివి చేసినవానిదిగాని కుండది

కాదు. “ఇది నా బలము” అనిగాని, “చూడండి నాలోగల ఈశ్వర శక్తి” అనిగాని, ఈ విధమైన దృష్టి మన మనస్సునన కుండరాదు. ‘ఈ మనస్సులోనూ శరీరములోనూ ఒక విశ్వశక్తి పనిచేయుచు న్నది. సకలమానవులలో, జంతువులలో, వృక్షములలో, లోహాము లలో, సచేతనములలో, అచేతనములుగ గనిపించువానిలో – అంతటా పనిచేయుచున్నది అదియే.’ అను దృష్టి యుండవలెను.

*

మనను పరివేష్టించి వున్న మహాశక్తి

మన కర్మలకు ప్రేరకుడును, అధి నాధుడును నైనవాడు ఏకస్వరూపుడై విశ్వమయుడు, పరముడు, నిత్యుడు నైన అనంతుడు. అతడు మనకు ఊర్ధ్వమున విలసిల్లు అజ్ఞాత-అజ్ఞేయ-అవ్యక్త-అనభివ్యక్త-సర్వాతీత పరబ్రహ్మము. అంతియే కాక, అతడు సకల భూతాంతరాత్మయై, నిఖిలభువనాధీశ్వరుడై, సర్వాతిశాయి యగుచు, పరమజ్యోతి, పరమగురువు, పరమసుం దరుడు, పరమానంద స్వరూపుడునై విరాజిల్లు పరమప్రియుడు, పరమప్రేమరసైకమూర్తికూడ. మన చుట్టునూ సృష్టివిలాసమును ప్రదర్శించుచున్న యీ విశ్వశక్తియు విశ్వాత్మయును నాతడే. అతడే మనలో అంతర్యామియైగూడ వెలుగొందుచున్నాడు. ఉన్నది సమ స్తమూ ఆతడే. ఈ ఉన్నదానికంటె మించి ఉన్నవాడునూ ఆతడే. మనకు తెలిసినను తెలియకపోయినను మన మందరము గూడ అతని సత్తలోని సత్తయు, శక్తిలోని శక్తియునై, అతనినుండియే సంక్రమించిన చైతన్యస్వరూపులము. ఈ మన మర్త్యస్వరూపము గూడ అతనియందలి పదార్థమునుండి రూపొందించబడినట్టిదే. మనలోపల, అమర్త్యము, నిత్యమునై భాసించు దివ్యానంద, దివ్య జ్యోతి స్ఫులింగ మొకటి కలదు.

(*SABCL* Vol. 20, pp. 238, 231)

అనువాదం: కమలాకార వేంకటరావు (యోగసమన్వయము)

చోదకునియందు పరిపూర్ణ విశ్వాసము

యోగమనగా నీవు నీ ప్రకృతిని అధిగమించుట. నీ కర్మల కధినాధుడు నిన్ను చేయి పట్టుకొని నడిపిస్తూ వుండటం నిజమే కాని నీ అపరాపకృతి అంత తేలికగా లొంగునది కాదు. నీ సాధనలో గడ్డు పరీక్షలు రావటంవలన నీ విశ్వాసం చలించిపోతుంది. యోగంలో ప్రతిష్టంబన ఏర్పడుతుంది. నీ బుద్ధి మట్టుకు వెంటనే ఫలితాలు కావాలని గంతులేస్తూ వుంటుంది. కాని నీలోని మాలిన్యాలను శుభ్రపరచి నిన్ను శుచిర్భూతుని కావించుటకు కొంత వ్యవధి అవసరము. అంతవరకు ప్రగాఢమైన విశ్వాసమే నీ ఆధారము

— సంపాదకుడు

ప్రగాఢమైన విశ్వాసము

మన బుద్ధియందును, హృదయమునందు, సంకల్పశక్తియందు అసహనపూర్వకమగు తొందరపాటు చెలరేగుచుండు కారణమున నీ విశ్వాస, సహనములను మిట్టపల్లములుగల ఇరుకైన యోగమార్గమునందు అభ్యసించుటయు అలవరచుకొనుటయు మిగుల కష్టము. మానవుని ప్రాణమయ ప్రకృతి యెల్లప్పుడునూ తన కృషిఫలితముకొరకై వెంపరలాడుచుండును. ఆ ఫలితము తనకు నిరాకరించబడుచున్నట్లు తోచినను, అది తనకు చేకూరుటకు దీర్ఘ విలంబనము జరుగుచున్నట్లు కనిపించినను, అయ్యది తన లక్ష్యమునందును, అద్దాని నేతృత్వమునందును విశ్వాసమును కోల్పోవును. ఏలయన, అతని బుద్ధి సదా ఆయా విషయజాతపు బాహ్యలక్షణములను బట్టి మాత్రమే నిర్ణయములు గావించుచుండును. ఎక్కడలేని నమ్మికతోనూ అతడు పట్టుకొని వ్రేలాడు హేతువాదధోరణికి పట్టుపడిన తొలి అలవాటు అదియే. దీర్ఘకాలము మనము బాధలకు లోనుగావలసివచ్చినప్పుడుగాని, చీకటిలో దారిగానక తొట్రుపాటులు పడవలసి వచ్చినప్పుడుగాని, మన హృదయములో భగవంతుని నిందించుటకంటె సులభతరమైనది

మనకు వేరొకటి లేదు. మనము పెట్టుకొనిన లక్ష్యమును విడనాడుటయు అట్టి సందర్భములో కడు సులభమే.

నిరుత్సాహము వలన ప్రమాదము

ఏలయన, "ఆ పరమేశ్వరుని నేనెంతగానో నమ్ముకొనియుంటిని. కాని, బాధలు, కలుషములు, ప్రమాదములు నాకు సంప్రాప్తమైనవి. నేను వంచితుడనైనాను", అని మనమందుము. లేక "ఒక లక్ష్యసిద్ధికొరకై నేను నా జీవితమునెల్ల ఒడ్డితిని కాని, నా అనుభవమునకు వచ్చిన కఠిన సందర్భములు నా లక్ష్యమునకు విరోధులై నిరుత్సాహమును జనింపజేయుచున్నవి. ఇతరు లేరీతిని తమకుగల పరిమితులకు లోబడి తమ సాధారణానుభవపు స్థిరభూమిపై నడచుచున్నారో అట్లే నేనునూ చేసియుండిన బాగుండెడిది," – అని వక్కాణింతుము. అట్టి క్షణములందు, – ఇది ఒక్కొక్కప్పుడు కడు తరచుగా సంప్రాప్తమై దీర్ఘకాలముండుట గూడ సంభవించుచుండును, – అంతకు పూర్వము మనకు కలిగియుండిన ఘనతరానుభూతుల నన్నింటినీ మనము మరిచిపోవుచుందుము. హృదయము తనను ఆవేశించిన కలతలో తాను నిమగ్నమైపోవును. ఇట్టి చీకటి సన్నివేశములలోనే మనము శాశ్వతముగ పతనము చెందుటయు, మనము చేయు దివ్యపరిశ్రమము నుండి పూర్తిగా మరలిపోవుటయు సంభవింపగల ప్రమాదమున్నది.

దీర్ఘకాలము నిలుకడగా సాధన కొనసాగించుటను సాధకుడు నేర్చుకొనిన యెడల, అతని హృదయమందలి విశ్వాసము ఎంతటి భయంకరమైన ప్రతికూల పరిస్థితియందైననూ సడలక నిలిచియుండ గల్గును. ఒకవేళ అది తొలుత మరుగుపడుటయు, లేక అణగారిపోయినట్లు తోచుటయు జరిగినను, అచిరకాలముననే మరల ప్రకటితమగుట తథ్యము. ఏలయన, హృదయము కంటెను, బుద్ధికంటెను పరతరమైన దొకటి ఎంతటి విపరీతపు తొట్రుపాటులందైనను, ఎంతటి దీర్ఘమైన వైఫల్యస్థితియందైనను అద్దానికి తను ఊతయొసగి నిలువబెట్టును. కాని, యిట్టి తొట్రుపాటులు, మబ్బుతెరలు అనుభవశాలియగు సాధకుని పురోగతికి

గూడ అవరోధకమై పరిణమించుచుండుట కలదు. అట్టియెడ, ప్రారంభదశలోని సాధకునికవి మిక్కిలి ప్రమాదకరములే కదా; కావున సాధకుడు మొదటినుండియుగూడ ఈ మార్గములోని బహుళశ్రమను గుర్తించి, అంగీకరించి, బుద్ధికి అంధప్రాయముగా గనుపట్టినను, బుద్ధికంటె వివేకవంతమని చెప్పదగు విశ్వాసావశ్యకతను బాగుగా హృదయస్థ మొనర్చుకోవలసియున్నది.

చివరకు దివ్యదర్శనము

ఏలయన, ఈ విశ్వాసము ఊర్ధ్వమునుండి మనకు అందింపబడెడి చేయూత. బుద్ధికి, దాని ప్రమాణములకు అతీతమై వెలయు ఒకానొక నిగూఢజ్యోతియొక్క కాంతిమయచ్ఛాయావిశేషమది. బాహ్యాదృశ్యములపై ఎంత మాత్రమూ ఆధారపడని నిగూఢజ్ఞానహృదయ మీ విశ్వాసము, పట్టుదలతో విశ్వాసమును మనము వీడకయుందుమేని, అయ్యది తన ప్రయోజనమును నిరూపించుకొనుచు ఉన్నతిని పొంది, కడకు దివ్యజ్ఞాన సాక్షాత్కారములోనికి రూపాంతరము చెందును. "అనిర్విణ్ణమైన, – విషాదమున క్రుంగిపోని, – హృదయముతో యోగమును సంతతముగ నభ్యసించుచుండవలె" నను గీతాబోధను మనము సదా వీడక అనుష్ఠించుచుండుట అవసరము. "సర్వపాపముల నుండియు నీకు నేను తప్పక విమోచనము కల్పించెద" నని ఆ ప్రభువు చేసిన వాగ్దానమును సంశయాకులమగు బుద్ధికి మనము నిత్యమూ గుర్తు చేయుచుండవలెను. కట్టకడకు, విశ్వాసము చలించుట పూర్తిగా కట్టువడిపోయి, ప్రభుని సాక్షాద్దర్శనమును పొందినవారమై, అతని దివ్యసన్నిధిని సదా అనుభవించుచుండెడి స్థితికి మనము చేరుకోగలుగుదుము.

(*SABCL* Vol. 20, pp. 232-33)

అనువాదము: కమలాకర వేంకటరావు (యోగసమన్వయం)

దైవము – నీ మార్గదర్శకుడు

ఎప్పుడైతే నిన్ను నీవు దైవానికి సమర్పించుకుంటావో అప్పుడు నీ జీవనసరళి పూర్తిగా మారిపోతుంది. ఎందుకంటె ఆయనే నిన్ను చేయి పట్టుకొని అడ్డదారిలో నడిపించి లక్ష్యానికి తొందరగా చేరుస్తాడు. అయితే ఆయన నీ చేత వేయించే అడుగులు నీ కర్థం కాకపోవచ్చు. ఎందుకంటె అవి నీ తెలివితేటల కతీతం. నీది మానవనేత్రం. ఆయనదేమో జ్ఞాననేత్రం. నోరుమూసుకొని ఆయన చెప్పినట్లు వినుటయే నీ కర్తవ్యం. – సంపాదకుడు

మన కర్మల కధినాడుడైన ప్రభువు మన ప్రకృతిని ఒక వంక రూపాంతరము చెందించుచునే వేరొకవంక దానిని గౌరవించుచుండును. అతడు మన ప్రకృతిద్వారమున పనిచేయునేకాని ఏదియో నిరంకుశమైన అస్థిరధోరణిలో పనిచేయడు. దోషజుష్టమగు మన ప్రకృతియందు నిర్దుష్టతకు తోడ్పడగల మూలపదార్థములున్నవి. కాని అవి ఒక తీరుగా లేవు. క్రమవిరహితముగా, కలగాపులగముగా, అస్తవ్యస్తముగా, అపరిపక్వముగా యున్నవి. ఈ పదార్థము నంతనూ నెమ్మదిగా శుద్ధమొనర్చి, క్రమపరచి, క్రొత్తగా పోతపోసి రూపాంతరము చెందింపవలసి యున్నది. అంతియేకాని, దానిని చితుకగొట్టి, నరికి, ఛిన్నాభిన్నముచేసి, హతమార్చుటయు, బలవంతముగనూ, తుడిచి పెట్టుటయు చేయరాదు. ఈ ప్రపంచము, అందు నివసించుచున్న మనము ఆ ప్రభుని అభివ్యక్తరూపముగా అతనిచే సృజింపబడినవారము. అజ్ఞము, సంకుచితమునైన మన మనస్సు అవగాహన మొనర్చుకోజాలని పద్ధతిలో ఆతడే ప్రపంచముతోనూ, మనతోనూ వ్యవహరించును. మనస్సు మౌనముద్రాంకితయై దివ్యజ్ఞానమున కున్మీలితమైనగాని అతని పోకడలు దానికి తెలియజాలవు.

మనము చేయు తప్పులకు మూలమున నొక సత్యపదార్థము కలదు. తడుములాడుకొనుచున్న మన బుద్ధికి తన ఆంతర్యమును వెల్లడింపవలెనని అద్దాని ప్రయత్నము. తప్పులతో

పాటు సత్యమునుగూడ మానవబుద్ధి ఖండనమొనర్చి దాని స్థానమున సగము సత్యము, సగము తప్పునైన నొకదానిని నెలకొల్పుచుండును. ప్రతి తప్పు చాటుననూ నిక్షిప్తమైయున్న సత్యమును మనము తెలిసికోగలుగు పర్యంతము, దివ్యజ్ఞాన స్వరూపుడైన ఆ పరమేశ్వరుడు మన తప్పులను సహనముతో కొనసాగనిచ్చుచుండును. మనము చేయు పాపములు మనలో వెతుకులాడుచున్న ఒకానొక శక్తి తప్పుదారిలో పడి చేయు పదన్యాసములు మాత్రమే. అద్దాని లక్ష్యము పాపాచరణము కాదు. దివ్యగుణవిశేషముగ పేర్కొనదగిన ఒకానొక విశుద్ధతను సాధించుటయే అద్దాని లక్ష్యము. తరుచుగా నీ పాపము లొక గుణవిశేషమును కప్పిపుచ్చెడి మాయ ముసుగులు, వికృతమైన యీ ముసుగు నూడ్చి అద్దానిని రూపాంతరము చెందింపవలసి యున్నది. అట్లు కానిచో, నిర్దుష్టమగు భూతసృష్టివిధానమునందు ఈ పాపములను వాటిని ఉండనిచ్చుటయు, కొనసాగించుటయు జరిగియుండెడిది కాదు. మన కర్మల కధినాధుడైన ఈశ్వరుడు పొరపాట్లు చేయునట్టివాడు కాదు. కొరమాలిన యీ పాపముల నుదాసీనుడై తిలకించువాడును, భోగియై వాటితో సయ్యాట లాడువాడును గాదు. మన హేతువాదప్రజ్ఞకంటెను, మన గుణసంపద్విశేషముకంటెను అతడు వివేకశాలి.

(*SABCL* Vol. 20, pp. 233-34)

అనువాదం: కమలాకర వేంకటరావు (యోగసమన్వయము)

మన కర్మల కధినాడుడైన ప్రభువు మన ప్రకృతిని ఒకవంక రూపాంతరము చెందించుచునే వేరొకవంక దానిని గౌరవించుచుండును. అతడు మన ప్రకృతి ద్వారమున పనిచేయునేకాని ఏదియో నిరంకుశమైన అస్థిరధోరణిలో పనిచేయడు.

శ్రీఅరవిందులు

యోగములో మార్గదర్శకత్వము

"నేను అర్భకుణ్ణి, అశక్తుణ్ణి. నాకేమి దారి?" అని నువ్వు విల పించనవసరము లేదు. నీ దౌర్బల్యము కూడ దైవానికి ఒక ఆయుధమన్న మాట మరచిపోకూడదు. నీకు సహజమైన ప్రకృతి, నీ బుద్ధులు అనేవి వుంటాయి కదా. దేవుడు ఈ గుణా లనే ఉపయోగించుకొని నిన్ను నడిపిస్తాడు. అటువంటప్పుడు. "నాకు వెంటనే శాంతి, దివ్యజ్ఞానము, అనంతత్వము కావాలి" అని నువ్వు ఏమాత్రము తొందరపడకూడదు. అప్పుడే నువ్వు దైవంతో నూటికి నూరుపాళ్లు సహకరించినవాడి వవుతావు.

— సంపాదకుడు

మన మానవప్రకృతి, యిచ్ఛాశక్తి విలసనమున పొరపాట్లకు లోనగునది, జ్ఞానశక్తి విలసనమున తెలివిమాలినది మాత్రమే గాక, క్రియాశక్తి విలసనమున కడు దుర్బలము కూడ. కాని, ఈశ్వరశక్తియందు మనము విశ్వాసముంచి, మన లోపములను, సామర్థ్యములను ఈశ్వరకార్యము కొరకు వినియోగింతుమేని, మనకు చేయూత యొసగి నడిపించి తీసుకొనిపోవుటకు ఈశ్వర శక్తి సిద్ధముగనే యున్నది. మనము వెంటనే సాధింపవలెనను కొన్న లక్ష్యము నొకవేళ సాధింపలేకపోయినచో, ఆ వైఫల్యము ఈశ్వరేచ్ఛచే కలిగినదే. మన వైఫల్యము తరచుగా మనలను సరి యైనదారిలో పెట్టి, తక్షణ విజయము మనకు అందింపగలిగి యుండుదానికంటె నిక్కమైన లక్ష్యసిద్ధికి మనకు సహాయకారి యగుచుండును. మనము బాధలకు గురికావలసి వచ్చుచో, దానికి కారణము మనలో నేదియో అపురూపమైన ఒకానొక ఆనంద ప్రాప్తికి సన్నద్ధము గావింపబడవలసి యుండుటయే. దారిలో మనము తొట్రుపాట్లు పడుచున్నచో, అయ్యది తుదకు మనము సరియైన నడక నేర్చుకొగలుగుటకే.

శాంతిని, విశుద్ధిని, పూర్ణసంసిద్ధిని సంపాదించుటకు అమిత తీవ్రతతోకూడిన తొందరపాటు మనకు కూడదు. శాంతిని మనము

సాధింపవలసినదే, — కాని అది శుష్కమైనట్టియు, నిష్పచ్ఛరమైన ట్టియు, అశాంతిప్రకటన కసమర్థములుగా జేయబడిన వినష్ట సామర్థ్యములు గలిగినట్టియు శాంతి కారాదు. అటులే, విశుద్ధి సాధనయు మనకు లక్ష్యము గావలసినదే, — కాని అది శూన్యస్థితిని వెల్లడించునట్టియు, కఠినమైన ఉదాసీనతను ప్రకటించునట్టియు విశుద్ధి కారాదు. అదే విధమున, పూర్ణసంసిద్ధియు మనము పొంది తీరవలసినదే, — కాని అది సంకుచితమైన పరిమితుల లోపల బంధింపబడినట్టియు, అనంతుని అంతులేని విస్తృతికి అవధిని విధించునట్టియు సంసిద్ధి కారాదు. దివ్యప్రకృతిలోనికి పరివర్తనము చెందుట మన లక్ష్యము. కాని, యీ దివ్యప్రకృతి మానసిక స్థితియో, నైతికస్థితియో కాదు. అయ్యది ఒకానొక అధ్యాత్మిక స్థితి. దానిని సాధించుట మిక్కిలి కష్టము. మన బుద్ధిచేత దానిని ఊహించుట సైతమూ మిక్కిలి కష్టమే. మన కర్మలకు, మన యోగసాధనకు అధినాధుడగు పరమేశ్వరునకు ఏమిచేయవలెనో తెలియును. ఆ చేయవలసినదాని నాతడు తన సాధనములతో, తన పద్ధతి ప్రకారము చేయుట కవకాశ మిచ్చుటయే మనము చేయవలసిన పని.

అవిద్యయందలి మూలప్రవృత్తి అహంకార విశిష్టమై యుండును. మన అసమగ్రప్రకృతికిగల పరిచ్ఛిన్నమైన వెలుగును, శక్తిని పురస్కరించుకొని మనము కర్మప్రవృత్తుల మగుచున్నంత కాలము, అహంకారమును నిరోధించుటకంటె మనకు కష్టతరమైనది వేరొకటి లేదు. కర్మాచరణ ప్రవృత్తిని విడనాడుటద్వారా అహంకారమును కృశింపజేయుటగాని, వ్యక్తిత్వపు సకల ప్రవృత్తినీ త్రుంచివేయుటద్వారా దానిని హతమార్చుటగాని సులభమే. ఒకానొక శాంతిపారవశ్యములోనో, దివ్యప్రేమానందములోనో నిమగ్నమగునట్లు దానికి ఉన్నతి ఘటింపజేయుటయు సులభమే. కాని, మనయందు నిక్కమైన పురుషునికి విమోచనము కలిగించి, దివ్యశక్తివిలంబనమునకు నిర్దుష్టసాధనముగను, దివ్యకార్యాచరణమునకు విశుద్ధోపకరణముగను దివ్యమానవత్వసిద్ధిని సాధించు టెట్లుననదే మన మెదుర్కొనుచున్న కఠినతర సమస్య. ఇందుకు

ఒక్కొక్క అడుగే స్థిరముగ వేసికొనుచు మనము ముందుకు సాగ వలసి యున్నది. ఒక్కొక్క కష్టమును పూర్తిగా అనుభవించుచు క్రమముగా అన్నిటినీ పూర్తిగా వశీకరించుకోవలసి యున్నది. ఈ కార్యము మనకు ఒనగూడునట్లు చేయజాలినది దివ్యజ్ఞానము, దివ్యశక్తి మాత్రమే. సంపూర్ణమైన విశ్వాసముతో దానికి మనము విధేయులమై, సుస్థిర ధైర్యముతోడను, సహనముతోడను దాని కార్యగతుల ననువర్తింపుచు ఆమోదించుచుందుమేని, తప్పక అది సమస్తమూ నిర్వహింపగలదు.

ఈ సుదీర్ఘ మార్గములో మనము మొట్టమొదట చేయువల సిన పని, మన సకల కర్మలనూ మనయందును ఈ సకలప్రపం చమునందును నెలకొనియున్న పరమేశ్వరునకు యజ్ఞవిధిగా నివే దన మొనర్చుటయే బుద్ధికి, హృదయమునకు ఈ వైఖరిని అలవ డజేయగల సాధనను ఉపక్రమించుట ఏమంత కష్టము కాదుగాని, సంపూర్ణమైన అంతశ్శుద్ధితో దానిని కొనసాగించి దానికి అఖండ విస్తృతిని చేకూర్చుట మిక్కిలి కష్టము. *ఇక, దీని తరువాత జరుగవలసినది మన కర్మఫలములందు మనకుగల ఆసక్తిని పూర్తిగా విడనాడుట. ఏలయన, నిక్కమైనదీ, అనివార్యమైనదీ, అత్యంత మపేక్షణీయమైనదీ అగు యజ్ఞఫలము మనలో దివ్య చైతన్యము, దివ్యశక్తి, దివ్యసన్నిధి దీపించుటయే.* అది ఒక్కటే ముఖ్యముగా మనకు గావలసినది. అది లభించినచో ఇక తక్కిన సమస్తమూ దానంతటదియే లభింపగలదు; మన కామాత్మ, కామ ప్రకృతి, ప్రాణమయసత్త్వయందలి అహంకారిక సంకల్పమును రూపాంతరము చెందుట తథ్యము.

కాగా, ఆ తరువాత జరుగవలసిన మూడవ కార్యము 'నేను కర్త' నను అహంకారమునుగూడ విడిచి అహంకారపు గూడు లేకుండచేసికొనుట. ఇదే సకల పరివర్తనములలోనూ అత్యంత కష్టసాధ్యమైనది. మొదట చెప్పిన రెండు కార్యములూ సాధింప బడనిచో ఈ మూడవది నిర్దుష్టముగ సాధింపబడనేరదు. కాని, సాధనకు మకుటాయమానమైన ఈ మూడవది సాధింపబడనిచో మొదటి రెండునూ పూర్తికాజాలవు కూడ. అహంకార నిర్మూల

నము ద్వారా కామమూలము ఛేదింపబడుట యీ మూడవదశలో జరుగును. ప్రకృతినుండి యీ క్షుద్రాహంకారము పూర్తిగా పెకలించివేయబడినప్పుడే సాధకుడు పరమేశ్వరునిలోని ఒక అంశమూ, శక్తివిశేషమూనై ఊర్ధ్వమున విరాజిల్లుచుండెడు తన యథార్థపురుషస్వరూపమును తెలిసికొన నేర్చును. దివ్యశక్తియొక్క యిచ్ఛకు గాక ఇతరేచ్ఛల కన్నింటికీ ఆ సన్నివేశములో పూర్తిగా ఉద్వాసము చెప్పబడును.

(*SABCL* Vol. 20, 234-35)

అనువాదం: కమలాకర వేంకటరావు (యోగసమన్వయము)

మానవుని ఉజ్వల భవిష్యత్తు

"నేటి మానవజీవితము ఎంత దుర్భరమైనది? ఎంతమంది దేవుళ్లను పూజించినా ఎంతమంది గురువులు వచ్చినా దీన్ని ఎవరూ బాగు చేయలేరోయ్" అని అనుకోవటం పరిపాటి అయిపోయింది. కాని ఇది నిజం కాదు. నేటి మానవుని, మానవజీవితాన్ని దివ్యీకరింపజేయుటయే మన పరమలక్ష్యము. మనస్సుయొక్క దౌర్బల్యము బదులు జ్ఞానభానుడు, ఈ అర్భక జీవితము స్థానే మిరుమిట్లు గొలిపే దివ్యజీవనము మన జన్మహక్కు. దీని నెవ్వరూ ఆపలేరు. — *సంపాదకుడు*

దివ్యజీవనమంటే యేమిటి?

భూమ్మీద దివ్యజీవనమంటే అదేదో వేరైనదనీ మామూలు జీవితంతో సంబంధంలేని వైరాగ్యమనీ అనుకోక్కర్లేదు. అది మనిషికీ, అతని జీవితానికీ సంబంధించినదే; అది అతనిలో రూపాంతరీకరణం చేయగలిగిన భాగాలను రూపాంతరీకరించి, దైవీకృతం చేయగలిగిన మేరకు దైవీకరించి మిగిలిన భాగాలను తన ప్రభావంతో మౌలికంగా మార్చటంగాని ఉద్ధరిం

చడంగానీ చేస్తుంది. ఇంకా ఆత్మ, విశ్వాత్మల మధ్య ప్రగాఢమైన అన్యోన్యతను కలుగచేస్తుంది. ఆధ్యాత్మికసత్యంతో దానికొక ఛాయామాత్రంగా వెలుగుచున్న ఆదర్శాన్ని ఆక్రమించి అది ఉన్నతస్థితికి చేరేటట్లు ప్రోద్బలం చేస్తుంది. దివ్యకాంతిమయమైన ఆలోచనలూ, సంకల్పాలూ కలిగేటట్లు మనస్సునూ, సంపూర్ణంగా, నిజాయితీగా ఉండే రాగభావాలతో వర్ధిల్లునట్లు ప్రాణికాన్నీ సముద్ధరిస్తుంది. తనదైన బలీయశక్తివైపు, ఉత్తమ ఆదర్శాలు, ఉద్దేశాల దిశగా వాటిని నడిపిస్తుంది. తన సంపూర్ణ యథార్థతత్వంతో ఐక్యం చేయలేని వాటిని, పూర్ణత్వానికి దరిగా చేరుస్తుంది. ఆ మాత్రం పరివర్తనకు కూడా సిద్ధంగాలేని వాటికి కూడా పరిణామక్రమంలో ఒక స్థానాన్ని కల్పిస్తుంది.

దివ్య మానసమంటే యేమిటి?

ప్రస్తుతం ఉన్న మానవుని మనస్సు చాలా పరిమితం, అసంపూర్ణం; ప్రతిక్షణం అది అనేకరకాలుగా సత్యమార్గంనుంచి వైదొలగుతుంది. అనేక తప్పిదాలకు దాసోహమంటూ, పూర్తిగా అసత్యమైన ప్రలోభాలకూ, వక్రప్రవృత్తులకూ లోనౌతుంది. వివేకహీనమై గుడ్డిగా అచేతనలోకీ, అజ్ఞానంలోకీ దిగజారిపోతుంది. మేధస్సుతో జ్ఞానాన్ని పొందలేక మహోన్నత జ్ఞానాన్నికూడ అమూర్తభావంతోనూ, పరోక్షసంజ్ఞలతోనూ, వక్రభాష్యం చెప్పాలని చూస్తుంది. అంతేకాక ఉన్నతభూమికలనుంచి అంతఃప్రేరణతో కలిగిన సందేశాలను కూడా సరిగా అర్థం చేసుకోకుండా వివాదాస్పదంగా ఉంచుతుంది. అటువంటి మనస్సు స్థానంలో యథార్థమైన స్వేచ్ఛాపూరిత మనస్సు అవతరిస్తుంది. అది తనకూ తన కరణాలకూ కూడా ఏ అవరోధాలులేని అత్యంత పరిపూర్ణత్వాన్ని సాధించగలదు. అపుడిక స్వతంత్రమైన తేజోవిరాజిత మనస్సు అధీనంలోనే జీవితం సాగుతుంది. ఆ విధమైన దేహం వెలుగును గ్రహిస్తూ, విముక్తమైన మనస్సు, సంకల్పాలను చక్కగా అర్థం చేసుకొని తననుంచి ఆశించిన విధులను నెరవేరుస్తుంది.

(*SABCL* Vol. 16, pp. 47-48)

అనువాదకులు: ఎ. వెంకటరామశాస్త్రి, ఎ. ప్రభావతి

నువ్వు దేనికోసం జన్మించావో దానిని నెరవేర్చుము

శ్రీఅరవిందుల రచనలు చదువుతూంటే "ఇవి ఋషిప్రోక్తములా యేమి? శిలాశాసనములవలె గంభీరముగా నున్నవే" అనే భావము రాక తప్పదు. — *సంపాదకుడు*

This is thy work and the aim of thy being and that for which thou art here, to become the divine superman and a perfect vessel of the Godhead. All else that thou hast to do, is only a making thyself ready or a joy by the way or a fall from the purpose. But the goal is this and the purpose is this and not in the power of the way or the joy by the way but in the joy of the goal is the greatness and the delight of thy being. The joy of the way is because that which is drawing thee is also with thee on thy path and the power to climb was given thee that thou mightest mount to thy own summits.

నీ కర్తవ్యమంటూ యేదైనా వుంటే అది యిదే. నీ లక్ష్యం యేమిటని ప్రశ్నించావనుకో. దానికి జవాబు యిదే. నువ్వు ఆనందాన్ని కోరుకున్నట్లయితే యింతకు మించిన ఆనందం మరొకటి లేదు. నువ్వు ఆనందమని భ్రమిస్తున్న స్వప్నం, సుషుప్తి, ఆత్మ విస్మృతి యివన్నీ పరిమితమైనవి, విచ్ఛిన్నమయిపోయేవి. కాని యిది పరిపూర్ణానందం నీ అసలు రూపం, నీ నిజస్వరూపమేమిటో తెలుసా? దైవమే. మిగిలినదంతా విచ్ఛిన్నకరమైనది, వికృతరూపమైనది. ఈ సత్యాన్నే నీ కళ్ల ముందర ఉంచుకొని, ప్రతి విషయంలోను, ప్రతిక్షణము దానికి విధేయమైపోవలసిందే!

మేలిముసుగులో వున్న మోమును, ఆ ముసుగు తొలగించి చూడడానికి బదులుగా ఆ ముసుగే ముఖమని నమ్మబలుకుతాడొకడు; కాని నీ లక్ష్యం మాత్రం నువ్వు మారడం. స్వీయ పరివ

ర్తన మానవ స్వభావంలోనే వుంది. ఆత్మపరివర్తనే అతడి నిజమైన స్వభావం. అదే నిజమైన ఆధ్యాత్మిక లక్ష్యమైన ఆత్మోత్థానం.

ఆత్మ అంటే యేమిటి? దానిని అధిగమించడం యేమిటి? ఆత్మపరివర్తన అంటే యేమిటి? ఇక్కడే నువ్వు పొరబడి తప్పు చేయకూడదు. నిన్ను నీవు తెలుసుకోడంలో తప్పు జరిగిందంటే మాత్రం, అది నిన్ను సకలకష్టాలలోను ముంచెత్తి, సమస్త సందేహాలకు కారణమవుతుంది.

నువ్వు అధిగమించవలసినది యేదంటే, యిప్పుడు బాహ్యంగా నీకు కనిపిస్తున్న, నీవెరిగిన వ్యక్తి – పదార్థానికి, ప్రాణానికి బానిసయినవాడు. ఆ రెండూ కాకపోతే మనసుకి బానిసయిన మానస జీవిగా వుంటున్నవాడు. ఇది అతిగాఢమైన, ఘోరమైన పరాధీనత. మనస్సుకి బానిసకావడం అంటే మనకరూపాన్ని చూసి దానికి దాస్యం చేయడమే.

పరిణామం చెందవలసిన నీ ఆత్మ – పదార్థం, ప్రాణం, మనస్సు అనే తెరల వెనుక నీలోనే వున్నది. అదే ఆధ్యాత్మిక శక్తులు కలిగిన దివ్యమానవుడు, పురుషోత్తముడు. బుద్ధిజీవిస్థాయి నధిగమించి, దివ్యమానవుడు కావడం కోసమే భౌతికజీవితం మీద ఆధిపత్యం సాధించాలి. ప్రస్తుతం యే ప్రకృతి చేతిలో కీలుబొమ్మగా వున్నావో ఆ ప్రకృతిని జయించిన రాజువు కావాలి. ఏ ప్రకృతి శక్తయితే, నిన్ను తన పాదాలక్రింద తొక్కిపట్టిందో దానిని యెత్తిపడేయాలి. బానిసగాకాక స్వేచ్ఛగాను, భిన్నత్వంగాకాక ఏకత్వంగాను, మృత్యువుకి లొంగిపోయే అశాశ్వతంగాకాక అమృతత్వంగాను, అంధకారంలోకాక పరిపూర్ణ దివ్యదీప్తిగాను, దుఃఖం బాధల దోబూచులాటలోకాక సంపూర్ణ దివ్యానందంగాను, దుర్బలత్వంతో పతనం చెందడం కాక అమితశక్తివంతుడిగా ఔన్నత్యం సాధించాలి. పరిమితస్థాయి నధిగమించి అనంత జీవనం సాధించాలి. పరమాత్మగా అతడిలో ఐక్యం కావడమంటే అదే. To become thyself is to be this and all that flows from it.

Be free in thyself, and therefore free in thy mind, free in thy life and thy body. For the Spirit is freedom.

Be one with God and all beings; live in thyself and not in thy little ego. For the Spirit is unity.

Be thyself immortal, and put not thy faith in death; for death is not of thyself, but of thy body. For the Spirit is immortality,

జీవుడిలో అమృతత్వమే అనంతత్వం, జాగృతి, పరమానందం. పరమాత్మ అనంతుడు. పరిమిత జీవితాలు అనంతత్వం నుండి ఉద్భవించినదే.

సకలసృష్టిలో నీ వున్నావు. అందుచేత దానిలో యేదైనా నువ్వు కాగలవు. వాటిలో నువ్వు లేనట్లయితే, నీకు అస్తిత్వమే లేదు. నీలో యేదైతే వుందో అదే నీ జీవాత్మలో అభివ్యక్తమవుతుంది. బాహ్యంగా కనిపిస్తున్న నీ యీ రూపం, నీ నిజరూపం కాదు. బాహ్యరూపానికి బానిసగా నువ్వెందుకుండాలి?

ఇంకా యెదుగు. నిన్ను నీవు అధిగమించు. పరివర్తన సాధించు. నువ్వు మనిషివి. మనిషి సంపూర్ణస్వభావం మన ప్రస్తుత తత్వంకంటె ఉన్నతంగా పరివర్తన చెందడం. మొదట వ్యక్తి పశుప్రాయుడు. పశుప్రాయుడైన వాడు తరువాత స్థాయికి పరివర్తన చెందాడు. ఆలోచనాపరుడు, వస్తునిర్మాత, సౌందర్యాన్వేషకుడు అయ్యాడు. ఈ ఆలోచనాపరుడి స్థాయినించి జ్ఞాన సాధకుడు కావాలి. వస్తునిర్మాతస్థాయినించి సృష్టికర్తగా, తన సృష్టికి తాను అధిపతి కావాలి. సౌందర్యాన్వేషణ స్థాయినించి ఆ సౌందర్యంలో ఆనందాన్ని అనుభవించేవాడుగా, భౌతికతనుండి శాశ్వతత్వం సాధించాలి. ప్రాణికంనుండి జీవాత్మ అమృతత్వానికి, ఆ తర్వాత అనంతత్వశక్తిని సాధించాలి. మానసికమైన, పాక్షిక జ్ఞానంనించి పరిపూర్ణదీప్తి వెనుకగల దివ్యదర్శనాన్ని సాధించాలి.

ఇది సాధించిననాడు దివ్యమానవుడవుతాడు. అదే మానసికస్థితి నధిగమించిన అతిమానసానికి యెదుగుదల. దానిని దివ్యమానసమంటావో? దివ్యజ్ఞానమంటావో? అతిమానసమంటావో? ఏ పేరుతోనైనా పిలువు. కాని అదే దైవేచ్ఛయొక్క దివ్యశక్తి, దివ్యదీప్తి, దివ్యచైతన్యం. అతిమానసంచేత లోకాలలో ఆధ్యా

త్మికశక్తి తనని తాను సృష్టించుకొని చూసేడు. దాని ప్రభావం చేతనే అతడు తను సృష్టించినదానిలో జీవించి పరిపాలిస్తున్నాడు. అందుచేతనే అతడు సర్వసామ్రాట్టుగాను, స్వపరిపాలకుడుగాను అయ్యాడు.

అతిమానసమే దివ్యపురుషుడు. అందుచేత సాధారణ మానసికస్థాయిని మించిన స్థితికి యెదగాలి.

దివ్యమానవుడిగా జీవించడమే దివ్యజీవనం, దేవత కావడం. ఈ దేవతలే పరమాత్మశక్తులు. మానవజాతిలో పరమాత్మ శక్తిగా వుండు.

పరమాత్ముని హృదయంలో స్థిరనివాస మేర్పరచుకొని ఆ చైతన్యంలో ఆనందాన్ని మేళవించి ఆత్మజ్ఞానంతో సంకల్పాన్ని ముడిపెట్టే తత్వం నీకలవడాలని, అది నీతో ఆటలాడుకోవాలని, నీ ద్వారానే, అది బహిర్గత్వం కావాలనే అర్థాన్ని స్ఫురింపజేసే అతి బలసంపన్నుడి రూపమిది.

'ఘనగిరిపై' వుంటున్న నీవు యిలా రూపాంతరం చెందడానికి కారణం, నీలోని మాధవుని, కనిపెట్టాలన్న తపనే. నిన్నే చరాచరసృష్టిలో చూచుకొని నీ మర్మాన్ని బయటపెట్టాలనే భావం ఈ అన్వేషణకు మూలకారణం. ఆయనలోనే వుంటూ, ఆయన అనుగ్రహించిన వెలుగులోనే ప్రకాశిస్తూ, ఆయన అధికారంతోనే ఆయన కనుసన్నలలో మెలగుతూ, ఆయన కటాక్షంతో లభ్యమయ్యే బ్రహ్మానందంలో మునిగిపో. నీవు అగ్నిహోత్రుడై భాసించాలి. సూర్యుడై వెలుగుల్ని విరజిమ్మాలి. సాగరమై సంతోషాంతరంగుడివి కావాలి. ఆ సంతోషమంతా నీదే. ఆ గొప్పతనం కూడా నీకే దక్కాలి. ఆ సౌందర్యాన్ని కూడా నీవే కైవశం చేసుకోవాలి.

ఎప్పుడైతే, యిందులో కొంతైనా నీవు సాధించగలుగుతావో, అప్పుడే, దివ్యమానవుడు కావడానికి ప్రేరకమైన, తొలిమెట్లు నీకు లభ్యమౌతాయి.

(*SABCL* Vol. 17, pp. 74-75)

అనువాదకులు: నడిమింటి విజయలక్ష్మి, బి.యస్. రాఘవ

భగవన్ముహూర్తము

భగవంతుడు మానవుల మధ్య మెసులుతూ ఆయన ఉచ్ఛ్వాస నిశ్వాసములు మన అస్తిత్వ జలధిపై ప్రసారమయ్యే ఘడియలు కొన్ని; ఆయన వెనుతిరిగి కనుమరుగుకాగా మానవులు కేవలం వారి స్వశక్తి మీదనే ఆధారపడే ఘడియలు మరికొన్ని. మొదటి వేళలలో ఎంత చిన్నప్రయత్నం చేసినా అది కొండంత ఫలితాన్నిచ్చి తలరాతలను మార్చివేయగలదు. రెండవపక్షంలో ఎంత శ్రమించినా అల్పమైన ఫలితమే దక్కుతుంది. అయితే ఈ రెండవ ఘట్టము, మొదటి ఘట్టమును ప్రేరేపించే యజ్ఞధూమము కావచ్చును.

దివ్యముహూర్తము అరుదెంచినప్పుడు ఏ మనిషియైనా, ఏ దేశమైనా నిద్రపోతూన్నట్లైతే అది కడు శోచనీయము. అలా చెవులు మూసికొని ఆయన పిలుపును విననివాడు, దీపపువత్తిని కొడి దులిపి తాజాగా శుభ్రముచేసి భగవంతుని ఆహ్వానించుటకు సిద్ధము చేయలేదు అనమాట. కాని అన్ని విధాల సిద్ధమై వుండి కూడ ఆ దివ్యముహూర్తాన్ని లెక్కచేయక తచ్ఛక్తిని వృథా చేయు వారికి అపారమైన నష్టమూ సర్వనాశనము.

దివ్యముహూర్తము వచ్చినపుడు నీ ఆత్మను ప్రక్షాళనము కావించుకొని ఎట్టి మోసముగాని, టక్కరితనముగాని, దర్పముగాని లేక, శుచిర్భూతుడవై నీ చూపును తిన్నగా నీ ఆత్మలోకి సారించి దానినెవరు పిలుస్తున్నారో వినిపించుకొమ్ము. చిత్తశుద్ధి లేకపో వడం వలన ఒకానొక్కప్పుడు నీవు పరమాత్ముని చూపునుండి తప్పించుకోగలగితివేమో కాని ఇప్పుడది నీ రక్షణ కవచములో ఒకచిద్రము. భగవంతుని ఘాతములు తగులుటకు అది చాలును. ఒకవేళ ఈ క్షణానికి నీవు తప్పించుకోగలవేమో కాని పిదప ఆ దివ్యఘాతము నీకు తగిలి నిన్ను కూలదోయడం తథ్యం. కాని నీవు శుచిగా వున్నావు కాబట్టి భయాన్ని పక్కకు పెట్టు. ఏలన ఇది ప్రళయ ఝంఝామారుతము – ఒక జ్వాల, ఒక సుడిగాలి, ఒక పెనుతుఫాను, శివుని విలయతాండవము. ఎవరైతే గడగడ లాడిపోకుండ ఆ ధాటికి నిలబడగలరో వారు క్రింద పడిపోయి

నప్పటికి మళ్ళీ లేచి నిలబడగలరు. గాలిలో కొట్టుకుపోయినప్పటికి మళ్ళీ తిరిగి రాగలరు. లౌకికం లౌకికం అంటూ నీవు మరింత తాపత్రయపడ నవసరమూ లేదు. ఎందుకంటే మనమిప్పుడు నీ ఊహకు అతీతమైనది, అగణితమైనది, ఊహింపరానిది జరుగు వేళావిశేషము నందున్నాము. ఆ దివ్యపవనములను నీ అల్పిష్ఠి మనస్సుతో అంచనా వేసేవు జాగ్రత్త! విశ్వాసంతో ముందుకు సాగిపోమ్మ.

ముఖ్యంగా నీ ఆత్మను అహంకారపు తుఫాను నుండి రక్షించి నిర్మలంగా ఉంచుకో. అప్పుడు ఒక జ్యోతి నీ కళ్ల ఎదుటే ప్రత్యక్షమై చీకటిని పారద్రోలి తుఫానుగాలిని అరికట్టి నీకు సహాయపడగలదు. నీవు మేరుపర్వతమును అధిరోహించి విజయకేతనమును రెపరెప లాడించగలవు!

*

భయములను, ఆపదలను, విపత్తులను ప్రతిఘటించు కవచ సంరక్షణతో జీవయాత్ర నడుపుటకు రెండు విషయములు అవసరము. ఈ రెండును ఒకదానిని విడిచి మరొకటుండక జంటగా నుండును. ఒకటి దివ్యమాతయొక్క కృప. మరొకటి నీ పక్షమున భక్తి, యథార్థ అర్పణలతో తయారైన అంతరంగస్థితి....

నీ భక్తి, నిష్కపటత్వము, అర్పణములెంతెంత పరిపూర్ణముగా నుండునో యంతంత అధికముగా నీకు కృప, రక్షణలుండును. ఆ దివ్యమాతయొక్క కృప, సంరక్షణలు నీ కున్నప్పుడు నిన్ను బాధించునదేముండును? మరెవరికి నీవు భయపడవలెను? ఇట్టి కృపాసంరక్షణ లెంత స్వల్పముగ నీకున్నను అన్ని కష్టముల నుండియు దాటింపబడుదువు. ఆ కృపామయియొక్క పరిపూర్ణసాన్నిధ్యము నీకు కల్గిన, నీవు నీ మార్గమున నిర్భయముగ నడువగలవు. ఏలన, ఆ భారమామెదే. ఎట్టి బెదిరింపులను లెక్కపెట్టక ఎంత బలవద్వైరము నైనను — ఈ లోకవాసుల నుండి గాని సూక్ష్మలోకవాసుల నుండి గాని — సరకు చేయక నీ మార్గమున నడువగలవు. ఆ దివ్యసాక్షాత్కార సంరక్షణ యేకొంచెమైననూ నీకు గల్గిన యెడల కష్టపరంపరలు అవకాశములుగను,

ఓటమి విజయముగను, దౌర్బల్యము వెనుదీయని సామర్థ్యము గను మారును. దివ్యమాత యొక్క కృప పరాత్పరుని యనుమతి యగుటవలన నేడో, రేపో దాని ఫలితము తప్పనిది, విధింపబడి నది, అనివార్యమైనది, అప్రతిహతమైనది!

(*SABCL* Vol. 17, pp. 1-2; Vol. 25, pp. 9-10)

అనువాదం: ఆర్.ఎల్.ఎన్.శాస్త్రి, అనుముల లక్ష్మీనరసయ్య

అనుబంధం:

జన్మదినకార్డుల కథ

ఈ కార్డులు ఎప్పుడు మొదలు పెట్టారో నాకు సరిగ్గా జ్ఞాపకం లేదు. కాని శ్రీమాత దగ్గరకు పిల్లలు రావడం, ఆమె పువ్వు లివ్వటం జరుగుతూ వుండేది. పుట్టినరోజులయితే మరికొన్ని పుష్పములు, ఎక్కువగా గులాబీలను ఇచ్చేవారు.

ఆ పిల్లలు నాకు తెలిసినా తెలియకపోయినా శ్రీమాతకు ఉన్మీలమై ఉన్న పిల్లలయితే నా కిష్టంగా ఉండేది. వారి జన్మ దినము నాడు ప్రత్యేకముగా వారిని సంతోషపరచుటకు నా తర పున వారికి ఏమైనా ఇవ్వతలచాను. నేనిచ్చిన వస్తువును పిల్లలు పెద్దైన తరువాత వారికి విలువైనదిగా ఉండేటట్లు మరియు ఆ వస్తువు శ్రీమాతారవిందులకు సంబంధించినదై వుండాలని కోరు కున్నాను. కావున రంగురంగుల పువ్వుల చిత్రాలను వేసేవాడిని. ఆ కార్డులమీద పిల్లల పేరును, దీవెనలను వ్రాయమని శ్రీమాతను కోరాను. క్రమేణా శ్రీమాత దర్శనార్థము బైటనుంచి వచ్చే పిల్ల లకు, వారి జన్మదినము కాకపోయినప్పటికీ వారికి కూడా నేను తయారుచేసిన కార్డులను ఇవ్వడం మొదలైంది. వాటిమీదకూడా శ్రీమాత దీవెనలను వ్రాసేవారు. వచ్చిన పిల్లలు శ్రీమాత సమక్ష మున ఎక్కువ సేపు ఉండేందుకు వీలుగా పిల్లల ఎదుటే శ్రీమాత చేతికి కార్డులు ఇచ్చేవాడిని. ఆమె వాటి మీద దీవెనలను వ్రాసి ఇచ్చేవారు. అప్పుడు కొంతమంది పిల్లలు రెండు చేతులను శ్రీమాత

పాదములపై ఉంచి, వ్రాస్తున్న శ్రీమాత కళ్లల్లోకి చూస్తూ వుండే వారు. ఆ దృశ్యం బలేగా వుండేది. నేను కార్డు ఇవ్వని పక్షాన "చంపక్‌లాల్, ఈ బిడ్డకోసం నీ దగ్గర ఏమీ లేదా?" అని అడిగే వారు. అప్పుడు నేను నొచ్చుకొని ఇక పిల్లలందరికి కార్డులు చేయడం ప్రారంభించాను. అప్పుడు శ్రీమాత చాలా సంతోషిం చారు. క్రమేపీ పెద్దలకు కూడా ఇదే అలవాటయింది. అందరకు నేను వేసిన కార్డులు ఇచ్చేవారు కాదు. వాటి బదులు శ్రీమాతార విందుల చిత్రములను ఇచ్చేవారు.

దీవెనలను తెలిపే నిమిత్తం శ్రీమాత ఫోల్డర్సను (మడిచిన కాగితములను) ఇస్తున్నారని తెలిసి చాలామంది వాటిని తయా రుచేసి శ్రీమాతకు సమర్పించుకొనడం ప్రారంభించారు. శ్రీమాత వాటిని అహో! ఎంత చక్కగా, చాలా చక్కగా, శ్రేష్ఠముగా, అంద ముగా, అద్భుతముగా ఉన్నయని వ్యాఖ్యానించేవారు. కొన్ని బాగుగా లేవని, ఏమాత్రం పనికిరావని నాకు ఇచ్చేసేవారు. నేను వాటిని అందంగా మలిచి మళ్లి తిరిగి శ్రీమాతకే ఇచ్చేసేవాడిని.

కొంతమంది వ్యక్తులు శ్రీమాతకు ఉత్తరములు వ్రాసి అంద మైన కవరులలో పంపేవారు. ఆప్పుడు ఆ కవరు మీద 'శ్రీమాత' పేరును మూసివేసి ఆ కవరును మరల ఉపయోగించమని నన్ను శ్రీమాత పురమాయించేవారు. నేను మొదట్లో 'శ్రీమాత' పేరును మూసివేయుటకు సందేహించేవాడిని. కాని శ్రీమాత కోరినందు వలన నేను అలా చేసాను. చాలా అందంగానున్న కవరులను మాత్రమే తిరిగి ఉపయోగించేవారము. అయితే నా దగ్గర ఇంకా చాలా మిగిలి ఉన్నాయి.

కొంతమందికి శ్రీమాత తాను స్వయముగా పదిలపరచు కున్న ఫోల్డర్సను ఉపయోగించేవారు. లేక నేనిచ్చినదానికి తగిన చిత్రమును అతికించేవారు. శ్రీమాత అందరికి తన చిత్రమును ఇచ్చేందుకు ఇష్టపడేవారు కాదు. చదువురాని వారికి అందమైన పువ్వులు, పచ్చికబయళ్ళు, లేక పక్షులు మొ॥ ఇచ్చేవారు. అప్పు డప్పుడు కొంతమంది ముఖ్యుల కొఱకు ప్రత్యేకమైన ఫోల్డర్ లను ముందుగానే తయారుచెయ్యమని నాకు ఉత్తర్వు జారిచేసే

వారు. ఒక్కొక్కప్పుడు ఆరునెలల ముందుగానే ఈ కార్డులను తయారుచెయ్యడం జరిగేది. శ్రీమాత వాటిని చూసి ఎంతో ఆనందపడేవారు. కొటేషన్స్ కోసము నన్ను అడిగేవారు – ప్రోత్సాహకరమైన (encouraging) బలమైన (strong) ఆకాంక్షించుట (aspiring) అనిగాని, అరుదుగా ఒక క్రొత్త సందేశమును ఆమెయే వ్రాసేవారు.

ఈ కార్డుల గురించి ఒకసారి శ్రీమాత చాలా ఆశ్చర్యకరమైన విషయాన్ని చెప్పారు. కార్డులు మాట్లాడేవిట! తనెవరి దగ్గరకు వెళ్ళాలో ఆ కార్డే చెప్పేదిట!

(*Champaklal Speaks*, pp. 144-46)

అనువాదం: త్రివేణి

నిరోద్‌బరన్‌గారికి శ్రీమాత ఆశీర్వచనములు

1969 వ సంవత్సరములో నేను శ్రీమాతకు ఈ విధంగా ఒక ఉత్తరం రాసుకున్నాను. ".రేపు నా పుట్టిన రోజని బహుశః మీకు తెలియదేమో. నాకేం కావాలో అని మీరు నన్నడిగినట్లు సుధకు ఒక కల వచ్చింది. నాకు జీవితమంతా మరపురానిదేమైనా కావాలని ప్రార్థిస్తున్నాను."

ప్రణామములతో
నిరోద్

శ్రీమాత జవాబు: రేపు నీ పుట్టినరోజని నాకు తెలుసు. నిన్ను నా లిస్టులో వేసుకున్నాను కూడ. రేపు పొద్దున 9 గం|| లకు రమ్మ. చిరస్మరణీయమైన దానికోసం అడిగేవు కదా ఇదిగో

'దైవమును విశ్వసించుము'

ప్రేమ, ఆశీస్సులతో
శ్రీమాత

మర్నాటి ఉదయం ఆమె వద్దకు వెళ్లినప్పుడు ఆమె నాకొక అత్యద్భుతమైన జన్మదిన పత్రమును అందజేసేరు. అది

మన చిత్రకారుడు చంపక్‌లాల్ చేసిన కార్డు. దానిమీద ఆమె స్వదస్తూరీతో ఫ్రెంచి భాషలో ఒక సందేశాన్ని రాసేరు. దాని ఆంగ్లానువాదం:

Happy Birthday to Nirod
With my love and blessings
for a complete trust in the Divine.

(An excerpt from *"Memorable Contacts with the Mother"* by Nirodbaran)

ఓ జ్ఞాపకం

శ్రీమాత తన భౌతికశరీరాన్ని విడిచినప్పటినుంచి ఎంతోమంది ఆమె ముట్టుకున్న వస్తువు ఏదైనా ఒకటి ఇవ్వండని బతిమాలుతూ ఉండేవారు. ఒకసారి ఒకతను "దయచేసి అమ్మ స్పృశించిన దేదయినా ఇవ్వండి, అది నాకు సాధనలో సహాయపడుతుంది" అని మనస్పూర్తిగా అడిగాడు. గతంలో నాకు అతనిని అమ్మతో మేడపై చూశానని గుర్తుకొచ్చింది. భక్తులందరూ అమ్మ ఒడిలో తలపెట్టుకోవాలనుకొనేవారే కాని కొంతమంది అలా చెయ్యడానికి వెనుకాడేవారు. అటువంటి వాళ్లతో నేను "అమ్మ ఒడిలో తలపెట్టుకో" అని ప్రోత్సహించేవాడిని. ఇతనూ ఆ కోవలో వాడే. ఆ విషయము గుర్తు చేస్తే చాలా ఆనందంగా "చంపక్‌లాల్ గారూ, నేను మీకెప్పటికీ ఋణపడి ఉన్నాను. మీరు చెప్పకపోతే నా అంతట నేనుగా అమ్మ ఒడిలో తలపెట్టగలిగే వాడినే కాను. అప్పుడు అమ్మ నన్ను ఎంత లాలించింది" అన్నాడు. నేను "ఐతే నువ్వు చాలా అదృష్టవంతుడివి. కానీ నీ దగ్గర అమ్మ ముట్టుకున్నది ఏదీ లేదా?" అంటే "లేదు చంపక్‌లాల్‌గారూ అందుకే ప్రార్థిస్తున్నా" అన్నాడు. "ఐతే నీ తల సంగతేమిటి? అది అమ్మ ముట్టుకోలేదూ? అది మరి ఎప్పుడూ నీ వెంటే వున్నదే! దాన్ని నీ నించి ఎవరూ వేరు చెయ్యలేరు కదా?" అంటే "నిజమే.

మీరు నా కళ్లు తెరిపించారు. బాహ్యజీవనం కంటే మన ఆంత రంగిక జీవనం ఎంత ముఖ్యమో ఇప్పుడర్థమయింది" అన్నాడు.

ఇటువంటి సందర్భంలోనే ఇంకొకతను నాతో తన అను భవం చెబుతూ... "అమ్మ నన్ను తన రెండుచేతులతోనూ ఆశీర్వ దించింది. మొదట తన చేతిని తన హృదయంపై ఉంచి ఆ తరు వాత నా గుండెమీద పెట్టి చిన్నగా ఒక వేలితో నొక్కి 'లోప లికి చూడు. నేను అక్కడ ఉన్నాను.' అంది" అన్నాడు. ఇతనికి కూడా నేను అమ్మ స్పర్శ అతని శరీరంపై శాశ్వతంగా ముద్రించ బడిందన్న విషయం గుర్తుచేసి "ఇంతకంటే ఇంకేం కావాలి?" అంటే అతను తన అదృష్టం గ్రహించి, ఆనందాతిరేకంతో నిమీ లిత నేత్రాలతో నాకు నమస్కరించాడు.

చంపక్‌లాల్

*

ఈ భూమి, ఈ భౌతికశరీరం, భౌతికరూపంలో ఉన్న దేవుని స్పర్శ ఒక్కసారి పొందితే, ఆ మహత్తు శాశ్వతంగా ఉండిపో తుంది. భౌతికతత్త్వంలో ఆ స్పర్శ ముద్రించబడిపోతుంది. పూవు పుప్పొడిలో పరిమళం దాగినట్లు. ఓ దివ్యసుగంధంలా ఆ స్పర్శ నిలిచిపోతుంది.... పూవు ఉన్నంతకాలం.... పూవు వాడిపోయినా కూడా....

నొళినిదా

(*Champaklal's Treasures*, p. 8)

అనువాదం: బి. వరలక్ష్మి

నీ భక్తి, నిష్కపటత్వము, అర్పణములెంతెంత పరి పూర్ణముగా నుండునో యంతంత అధికముగా నీకు కృప, రక్షణ లుండును.

శ్రీమాత



ఆధ్యాత్మిక జీవనానికి మార్గము

అఖిల

అఖిల భారత పత్రిక ఏప్రిల్ 2003

ఆధ్యాత్మిక జీవనానికి మార్గము

శ్రీమాత ప్రవచనములు

ఉపోద్ఘాతము

ఆధ్యాత్మిక జీవితమంటె కేవలం హిమాలయపర్వతాలకో, మఠాలకో, ఆశ్రమాలకో పరిమితం కాకూడదు. ఆధునికసౌకర్యాలు పెరుగుతున్నకొద్ది జీవితంలో శాంతిసౌభాగ్యాలు కరువైపోతున్నాయి. ఎక్కడో ఏదో లోపం వున్నది[1]. పూర్వకాలం రాజులు రాజ్యాలేలేవారు. కాని వారు మహర్షుల ఆశీర్వచనాలు పొంది వారి ఆదేశాల మేరకు ప్రజాపాలన చేసేవారు. ఋషిపుంగవుల తపోధారలతో దేశం పునీతమై వుండేది. ఈ మధ్యకాలంలో అది అదృశ్యమైపోయింది. కాని మన రక్తనాళాలలోంచి అంతరించిపోలేదు. ఆధునిక జీవితానికి అది ఏవిధంగా పనికివస్తుందో చూద్దాం.

సంపాదకుడు

---

[1] ఆధ్యాత్మికజీవితం నేటి సమస్యలకు ఏకైక పరిష్కారమార్గం అని ఎవరైనా అంటే ముసిముసినవ్వులు నవ్వుకోనక్కరలేదు.

నీ ధోరణిని మార్చుకోవాలి

అంతా నువ్వు అనుకున్నట్లుగానే జరగాలని మొండిపట్టు ఎందుకు పట్టాలి? బహుశః మరోవిధంగా జరిగినట్లయితే నీకు మేలుకలిగి అధికమైన ప్రయోజనము కలుగవచ్చును కదా. *ఈ విధమైన సర్వోన్నతశక్తిని వల్లకాదని కేవలం నీ సంకుచితదృష్టి ప్రకారమే అంతా జరగాలని మొండిపట్టు పట్టి దానికోసం పెనగులాడటం ఏమంత మంచిపని కాదు. అలా కాకుండా నీ బుద్ధినంతా ఉపయోగించి "నీ యిచ్ఛయే జరుగు గాక! సమస్యలన్ని తీరిపోయి అజ్ఞానాంధకారములపై విజయము సాధింపబడు గాక!" అని పట్టుబడితే ఎంత బాగుంటుంది!* నువ్వెప్పుడైతే ఈ విధంగా ఆలోచిస్తావో అప్పుడు నీ మనస్సు శాంతిస్తుంది. నీ దృష్టి విశాలమౌతుంది. నీకిక ఎట్టి కలత వుండదు. నీ మనస్సులోని కలవరమంతా నశించిపోయి దాని బదులు నిరంతరమైన జ్యోతి ప్రకాశిస్తూ వుంటుంది. "నీ యిచ్ఛయే నా యిచ్ఛ" అని అనుకున్నట్లయితే ఇక నిరంతరం "నీ సాన్నిధ్యంలో నివసించటమే; ప్రమాదాలనుంచి తప్పించుకోవటమే; ఇరుకుదారులలోనుంచి తప్పించుకొని, బయటపడి స్వచ్ఛమైన గాలిని పీల్చటమే; అనవసరమైన బరువుబాధ్యతలనుండి విముక్తమై అన్నిటికంటె విలువైన దివ్య గమ్యము వైపు పరుగెత్తిపోవడమే."

(*CWM* Vol. 1, p. 105)

స్వేచ్ఛానువాదము: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

జీవితంలో ఓ నూతన దృక్పథము

ప్రాపంచిక జీవితం చాలా కష్టమైనదని ఆతురతతో కూడినదని జనాభిప్రాయము. ధ్యానము ద్వారా మనస్సులోని అలజడి అణిగిపోతుంది. మనస్సు కుదుటపడుతుంది, శాంతిస్తుంది. కాని మళ్లి కార్యరంగంలోకి దూకగానే చెదిరిపోతుంది. మామూలు జీవితంలో కూడ చెక్కుచెదరకుండా ఉండే ప్రశాంతతను ఎలా సంపాదించుకోవాలో చూద్దాం. — *సంపాదకుడు*

మనస్సుకంటె ఉన్నతమైన స్థాయి

కదలకుండా మెదలకుండా కూర్చొని మనస్సుని కుదుటపరచటం, నిష్క్రియమైన శాంతిని పొందటం ఆధ్యాత్మిక మార్గంలో మొదటిస్థాయి అనుకోవచ్చు. క్రియాగతమైనప్పుడు కూడ చెదిరిపోకుండా ఉన్నప్పుడే మనము శాశ్వతమైన శాంతిని పొందగలుగుతాము. దీనివలన మనకు ఏం తెలుస్తోంది? మనస్సుకంటె ఉన్నతమైనస్థాయి మరొకటి వున్నది. దాని పేరే చైతన్యము (Consciousness).

జీవితంలో శాంతి లేదా?

సర్వకర్మపరిత్యాగ శాంతియుత విధానాలకు ముందు ఇది ఒక సోపానము. సమస్తకార్యాలను, కర్మలను పరిత్యజించి, నిరామయ స్థావరస్థితిని, అంతర్ నిశ్శబ్ద అగాధాలలోకి ఉపసంహరించుకోవడంపై ఇవి ఆధారపడి వున్నాయి. ఈ పద్ధతులు సమస్త జీవితాన్ని పరిత్యజిస్తాయి. శాంతి లేకుండా అంతస్థిత జ్ఞానసిద్ధి ఏదీ సాధించలేమనే భావన హఠాత్తుగా కలుగుతుంది.

బాహ్యాపరిస్థితులలోను, ఆందోళనల్లోను, ఆ ఆందోళనలలోని సమస్యలు అపరిష్కృతంగా వుండిపోతాయన్న భావజాలంలో జీవించినంత కాలం శాంతి ఉండదన్న ఆలోచన ఇది. ఆ సమస్యలు పరిష్కరించే జ్ఞానం కూడా అట్టి ఆందోళన స్థితిలో వుండదని కొందరు భావిస్తుంటారు. కాని పరిష్కారమార్గ మెందుకు లేదు?

The next step is to face the problem, but with the calm and certitude of an absolute trust in the supreme Power which knows, and can make you act. And then, instead of abandoning action, one can act in a higher peace that is strong and dynamic.

This is what could be called a new aspect of the divine intervention in life, a new form of intervention of the divine forces in existence, a new aspect of spiritual realisation.

*

జీవితమంటే విసుగు

ఒకానొక అచేతనస్థితిలో మనకు కారణం తెలియకుండానే నువ్వు పనులు చేస్తుంటావు. కారణం తెలియకుండా, అప్రయత్నంగానే భావాలు కలుగుతుంటాయి. పరస్పర విరుద్ధమైన సంకల్పాలు కలుగుతుంటాయి. దేనిని గూర్చి నిశ్చయమైన అవగాహన కలుగదు. అలవాటు ప్రకారం, చర్వితచరణంగా, చర్య, ప్రతిచర్యల మధ్య జీవిస్తుంటావు. జీవితాన్ని తేలికగా తీసుకుంటావు. అటువంటి అజ్ఞాన, అచేతనస్థితిలో జీవించరాదని ఒక అప్రతిహతమైన అవసరాన్ని నువ్వు హఠాత్తుగా గుర్తిస్తావు. ఏదో ఒక రోజున అటువంటి జీవితం నీకు సంతృప్తి ఎంతమాత్రం ఇవ్వదు.

ఆ అసంతృప్తి ప్రతి ఒక్కరికి విభిన్నంగా వుంటుంది. తెలుసుకోవాలన్న, అర్థంచేసుకోవాలన్న అవసరం అది అలా చెయ్యాలి కాబట్టి, ఏది చేసితీరాలో అది అవసరం అని కొందరికి, ఈ జీవితం వెనుక, అచేతనమయమైన, నిరర్థకమైన, అర్థం పరమార్థంలేని ఈ జీవితంవెనుక జీవించతగినదేదో ఉందని, ఈ సత్యాల వెనుక, ఈ భ్రమల వెనుక ఒక వాస్తవం, ఒక సత్యం ఉన్నదనే ఒక అస్పష్టమైన భావన కొంతమందికి కలుగుతుంది.

ఆంతరంగిక వ్యధ

తను చేసే ప్రతిపనికీ, తాను చూసే ప్రతి వస్తువుకు అర్థం లేదని, ప్రయోజనం లేదని కాని అర్థవంతమైనదేదో వుందని హఠాత్తుగా ఒక భావం కల్గుతుంది. దేనికోసమో ఈ భూమిమీద జీవిస్తున్నట్లు, ఈ ఆందోళనలు, ఈ కదలికలు, శక్తియుక్తులు వృథా అయిపోవడం

— దీని వెనుక ఏదో పరమార్థం, లక్ష్యం వుందని, లోలోపల ఏదో ఒక అలజడి, ఒక తపన, దేనికోసమో అన్వేషణ, ఏదో తీరని దాహం — ఇవన్నీ మనల్ని ఎటో వినూత్న తీరాలవైపు లాక్కెళ్లి పోతాయి — అనే భావం కల్గుతుంది.

ఏదో ఒక రోజున నువ్వు నిన్ను ఇలా ప్రశ్నించుకుంటావు — "కాని అసలు ఎవరైనా ఎందుకు పుడుతున్నారు? ఎందుకు చని పోతున్నారు? ఎందుకు బాధలు పడుతున్నారు? దాని బదులు కదలకుండా కూర్చుంటే సరిపోలా?" నువ్వు యంత్రంలాగా ఇక ఎంతమాత్రం బ్రతకలేవు. అర్ధచైతన్యంతో కూడా బ్రతకలేవు. నిజంగా భావించాలని, నిజంగా కార్యోన్ముఖుడు కావాలని, నిజంగా తెలుసుకోవాలని నువ్వు కోరుకుంటావు.

ప్రశ్నలకు జవాబు

నిశితంగా అన్వేషిస్తే జవాబు వస్తుంది. ఎందుచేత! ఇక ఎంతమాత్రం మనం జీవిస్తున్న జీవితాన్ని మనం కోరుకోము కాబట్టి. ఇక ఎంత మాత్రం అజ్ఞానాన్ని, అసత్యాన్ని మనం కోరుకోం. ఎందుకంటే బాధలు, అచేతనను మనం కోరుకోము. అవ్యవస్థను, దుష్టసంక ల్పాన్ని మనం కోరుకోము. ఎందుకంటే శ్రీఅరవిందులు ఇలా చెప్పారు.

సత్యాన్ని తెలుసుకోవడానికి ప్రపంచాన్ని విసర్జించవల సిన అవసరం లేదు. ఆత్మసాక్షాత్కారంకొరకు జీవితాన్ని త్యజిం చవలసిన అవసరం లేదు. భగవంతునితో బంధం ఏర్పరచుకో డానికి ప్రపంచంనుంచి సన్యసించవలసిన అవసరం లేదు. ఏదో గుప్పెడు మనస్సు, జానెడు లోకాన్ని అనుసరించవలసిన అవ సరం లేదు. భగవంతుడు సర్వత్రా, ప్రత్యణువులోనూ భాసిస్తు న్నాడు. ఒకవేళ ఆయన కనిపించకుండా దాక్కొని వున్నాడంటే.... ఆయన్ని కనుగొనడానికి మనం ఎంతమాత్రం ప్రయత్నించడం లేదు కాబట్టి.

We can, simply by a sincere aspiration, open a sealed door in us and find... that **Something which will change the whole significance of life, reply to all our questions, solve all**

our problems and lead us to the perfection we aspire for without knowing it, to that Reality which *alone* can satisfy us and give us lasting joy, equilibrium, strength, life....

ప్రారంభదశ: ఆ సత్యాన్ని కోరుకోవాలి. నిజంగా కోరుకోవాలి. అది అవసరమని భావించాలి. తదుపరి సోపానం: అన్నింటికి మించి దానిని గూర్చే ఆలోచించాలి. మిగతా విషయాలగూర్చి ఆలోచించలేని ఒక రోజు అతి త్వరలో వస్తుంది. లెక్కలోకి తీసుకోవలసింది అదే. అప్పుడు.... నువ్వు ఒక ఆకాంక్షను తీర్చిదిద్దుకుంటావు. నీ హృదయం లోంచి నిజమైన ప్రార్థన పొంగిపొరలునట్లు చేసుకోగలవు నీవు. ఆ అవసరంలో, చిత్తశుద్ధిని ప్రతిఫలించే ప్రార్థన అది. అప్పుడు... ఏం జరుగుతుందో నువ్వు చూస్తావు.

ఏదో జరుగుతుంది. నిజంగా ఏదో జరుగుతుంది. అది ఒక్కొక్కరికి ఒకొక్క రూపం ధరిస్తుంది.

(*CWM* Vol. 9, p. 305, 373-75)

అనువాదం: కె. యజ్ఞన్న

చేతనాస్థాయిని పెంచటమెలా?

మన అరిష్టాలన్నిటికి మూలకారణం మన మనస్సే. ఈ మనస్సు కంటె గొప్పదైన చేతనాస్థాయి మరొకటి వున్నదని తెలుసుకోవాలి. మన దృష్టి దానిపై సారించాలి. దానిని ఎలా సాధించాలో అనేది మన నిరంతర వ్యాపకం కావాలి. దానికోసం తపించాలి. తహతహలాడాలి. నీ నిరంతరాకాంక్షావేదనల ఒత్తిడికి ఎట్టకేలకు నీలో అంతరంగికంగా మార్పు వస్తుంది. ఒక తలుపు తెరుచుకుంటుంది. జ్ఞానప్రవాహమొకటి పొంగిపొరలి నిన్ను ముంచెత్తి వేస్తుంది నీకు నూతన చైతన్యము అబ్బుతుంది. కాలక్రమేణ రూపాంతరీకణము కూడ జరుగుతుంది.

— *సంపాదకుడు*

దృష్టిలో విప్లవాత్మకమైన మార్పు

ఏదైనా చేపట్టడానికి ముందు పూర్తిగా అనివార్యమైన తొలిచర్య ఒకటి నిర్వర్తించాలి. అది చైతన్య పరివర్తన. పరివర్తనకు ఆకాంక్ష, దానిని సిద్ధింపజేసుకోడానికి సంకల్పం ప్రారంభదశ. అది లేకుండా ఏదీ సాధ్యం కాదు. కాని ఆకాంక్షతోబాటు, అంతరంగ ఉన్మీలనం, అనుకూలత ఉండాలి. అప్పుడు ఒకసారి పరివర్తన చెందిన చైతన్యంలో ప్రవేశించి, అక్కడే ఉండిపోవచ్చు. ఈ చైతన్యపరివర్తన హఠాత్తుగానే జరుగుతుంది. అందుకు మనం సన్నద్ధులం కావడానికి వ్యవధి పట్టినా, నెమ్మదిగా మనం సన్నద్ధమైన పరివర్తన ఆకస్మికంగా వస్తుంది. కేవలం మానసికదృక్పథంలో ఏదో ఒక చిన్న మార్పును గూర్చి నేను మాట్లాడటం లేదు. చైతన్యంలో మార్పు గూర్చే మాట్లాడుతున్నాను. మౌలికస్థితిలోనే విప్లవాత్మకమైన మార్పు, పరిపూర్ణమైన పరివర్తన.

*

చైతన్యాన్ని ఎలా మార్చాలి?

ప్రశ్న: జననీ, చైతన్యాన్ని మార్పు చేయడం ఎలా?

అనేకమైన విధానాలున్నాయి. కాని ప్రతివ్యక్తి తనకు అనుకూలమైన పద్ధతినే అనుసరించాలి. ఏదో అనుకోని అనుభవం ద్వారా సాధారణంగా ఈ సూచన వస్తుంది. ప్రతివ్యక్తికి అది విభిన్నంగా గోచరిస్తుంది.

విహంగ వీక్షణము

ఉదాహరణకు, సాధారణ చైతన్యం ఉపరితలంపై సమాంతరంగా విస్తరించడం, సృష్టిలోని అన్ని వస్తువుల ఉపరితలంలాంటి భూమికపై చైతన్యం పనిచేస్తున్నట్లు, అన్ని వస్తువులు, ప్రజలు, పరిస్థితులు బాహ్యస్వరూపంతో మాత్రమే సంబంధం వున్నట్లు భావం కలుగుతుంది. ఆకస్మికంగా ఏ కారణంగానో, వస్తువులని సమాంతరంగా వీక్షించడానికి బదులు, దృష్టి – ఔన్నత్యం వైపు తిరుగుతుంది. వస్తువులు అదే స్థాయిలో వున్నా, వాటిని నువ్వు ప్రభా

వితం చేసి, వాటికి అతీతంగా – వాటిని వేర్వేరు వస్తువులుగా చూడడానికి బదులు పైనుండి వాటి సమగ్రస్వరూపాన్ని చూస్తావు. నిన్ను ఎవరో పైకి తీసుకొని వెళ్లి, పర్వతశిఖరంమీదనుండో విమానంనుండో చూపిస్తున్నట్లు అనిపిస్తుంది. ప్రతివస్తువుకు దాని స్థాయిలో చూడడానికి బదులు సమస్తాన్ని ఒకే ఏకత్వంగా, చాలా ఎత్తునుండి నువ్వు వీక్షిస్తావు.

ఈ అనుభవం కలగడానికి చాలా మార్గాలు ఉన్నాయి. కాని ఏదో ఒక శుభదినాన యాదృచ్ఛికంగా ఆ అనుభవం వస్తుంది.

అంతరంగిక సాన్నిహిత్యము

లేకపోతే, అందుకు వ్యతిరేకమైన అనుభవం కలుగవచ్చును. కాని అదే అనుభవానికి దారితీస్తుంది. ఎవ్వరైనా లోలోతులకు వెళ్లవచ్చును. అతను చూసిన విషయాలకు దూరమైపోవచ్చును. అది దూరంగా, అప్రధానంగా కనిపించవచ్చును. విషయాల (సృష్టిరహస్యం) అంతర్గత దర్శనం, ఒక అంతర్నిశ్శబ్దంలోకి, ఒక అంతర్గత ప్రశాంతిలోకి అతను ప్రవేశించవచ్చును. ఒక ఉదాత్తభావన, పరిస్థితులపై, విషయాలపై మరింత ప్రగాఢమైన దృక్పథం కలుగవచ్చును. అప్పుడు అన్ని విలువలు మారిపోవచ్చును. ఒక ఏకత్వం, ఎంతటి విభిన్నమైన బాహ్యారూపాలు వున్నా, వాటితో ప్రగాఢమైన సాయుజ్యం అనుభవానికి వస్తుంది.

లేదా, హఠాత్తుగా సరిహద్దురేఖలు అదృశ్యమవుతాయి. శాశ్వతంగా వున్నదీ, ఇకపై ఎప్పుడూ వుండేది అయిన ఆద్యంతరహితమైన, కాలఖండంలోకి ప్రవేశించవచ్చును.

ఈ అనుభవాలు నీకు మెరుపులా, ఒక క్షణంపాటు, హఠాత్తుగా కలుగవచ్చును. ఎలాగో, ఎందుకో నీకు తెలియదు.

అగాధానుభూతులు

మరికొన్ని ఇతర మార్గాలున్నాయి. ఇతర అనుభవాలు ఉన్నాయి. అవి అసంఖ్యాకములు. వ్యక్తులనుబట్టి మారుతుంటాయి. అటువంటి అనుభవం ఒక క్షణం కలిగినా కూడ అది ఓ గాఢమైన ముద్ర వేస్తుంది. ఆ అనుభవాన్ని గుర్తు పెట్టుకోవాలి. దానిని తిరిగి స్మరిం

చాలి. ఆ అనుభవం లోలోతులకు వెళ్లడానికి ప్రయత్నించాలి. దానిని మళ్లీ మళ్లీ తెచ్చుకోవాలి. ఆకాంక్షించాలి. మనస్సును ఏకాగ్రతతో దానివైపుకు తిప్పాలి. ఇది ప్రారంభదశ, మనకు సహాయపడిన మార్గం చివరిభాగం. అదే పరిష్కారమార్గం. అంతర్గత ఆత్మను అన్వేషించేవారికి, వారి చైతన్యంలోని సత్యాన్ని కనుగొనే వారికి అటువంటి అనుభూతి జీవితంలో కనీసం ఒక్క క్షణమైనా వస్తుంది. ఒక మెరుపులాగా వస్తుంది – అది చాలు. వారిక పూర్వంలాగా ఉండబోరు. తాము నడవవలసిన మార్గాన్ని అది సూచిస్తుంది. ఈ మార్గంపై తెరుచుకున్న గవాక్షం అది. ఆ గవాక్షంగుండా నువ్వు వెళ్లాలి. సహనంతో, ఓర్మితో, మొక్కవోని పట్టుదలతో అనుభవాన్ని, నీ జీవనస్థితిని తిరిగి, పటిష్టం చేసుకోవాలి. ఆ మార్గంలో నువ్వు చేసే ప్రయాణం నిన్ను తప్పక మరింత సంపూర్ణమైన, మరింత వాస్తవమైనదాని వైపు నడుపుతుంది.

చైత్యపురుష వికాసము

ఇటువంటి అనుభవసిద్ధికి చాలా మార్గాలు ఎప్పుడూ ఉంటాయి. నువ్వు నేర్చుకున్న మార్గంగాని, పుస్తకాలలో చదివిన మార్గంగాని, ఒక గురువు నుండి విన్న మార్గంగాని, నీ అంతట నీకే స్వతస్సిద్ధంగా వచ్చే అనుభవం అంత ప్రభావితం చేయలేవు. ఏ కారణం లేకుండానే ఈ అనుభవం వస్తుంది. అది మేలుకునే ఆత్మ పూర్ణవికాసం. నీ చైత్యపురుషునితో ఒక క్షణకాలంబాటు కలిగిన స్పర్శ నీకు ఉత్తమమైన మార్గం చూపిస్తుంది. అది నీకు అందుబాటులో వున్నది. నువ్వు ఎంతో ఓర్మితో గమ్యాన్ని చేరడానికి ఆ మార్గాన్ని అనుసరించాలి. నువ్వెలా ప్రారంభించాలో ఒక్క క్షణంలో తెలిసిపోతుంది. రాత్రివేళ కలలలో కొందరికి ఈ అనుభవం వస్తుంది. తలవని తలంపుగా ఏ క్షణంలోనైనా అది కలుగుతుంది. ఈ కొత్త చైతన్యాన్ని ప్రదీప్తం చేసే దేనినో నువ్వు చూస్తావు. ఏదో నువ్వు వింటావు. ఒక అందమైన ప్రకృతిదృశ్యం, చెవుల కింపైన సంగీతం, లేదా నువ్వు చదివిన ప్రవచనాలు, ఏదైనా ఒక గాఢమైన యనుభూతి – ఏదైనా – ఆ అనుభవం పొందడానికి వేయి కారణాలున్నాయి, వేయి మార్గాలున్నాయి. ఆ

అనుభవాన్ని పొందాలని నిర్దేశితమైన ప్రతి వ్యక్తి జీవితంలో కనీసం ఒక్కసారైనా ఆ అనుభవం పొందుతాడు. అది క్షణంలో మాయం కావచ్చు. యౌవనంలో ఉన్నప్పుడు రావచ్చును. కాని జీవితంలో ఒక్కసారి నిజమైన చైతన్యమేమిటో తెలిపే అనుభవం కలుగుతుంది. మనం అనుసరించే మార్గం గూర్చి అత్యుత్తమమైన సూచన అది.

నిరంతరాన్వేషణ

నువ్వు నీలోనే అన్వేషించాలి. నువ్వు అప్రమత్తుడవై ఉండాలి. పరిశీలించాలి. ఏం జరుగుతున్నదో నువ్వు గుర్తించాలి. ఏం జరుగుతున్నదో కనిపెట్టాలి. దానిపట్ల శ్రద్ధ చూపాలి. అంతే. ఒక్కొక్కప్పుడు ఔదార్యం నిండిన సంఘటన. ఒక వ్యక్తిని చూసినప్పుడు, అరుదైనదేదో విన్నప్పుడు, వీరోచితకార్యాన్ని చూసినప్పుడు, ఆత్మ మహాత్యాన్ని చూసినప్పుడు, అందమైన, అరుదైన ప్రత్యేక ప్రతిభా వ్యుత్పత్తులను ప్రదర్శించిన వారిని చూసినప్పుడు, హఠాత్తుగా ఆ వ్యక్తిలో ఒక ప్రశంస, ఒక ఉత్సాహం, ఒక కృతజ్ఞతాభావం కలిగి, ఆత్మలో ఒక కొత్త చైతన్యంవైపు గవాక్షాన్ని తెరుస్తాయి. అతనిలో అంతకు ముందులేని ఒక వెలుగు, ఒక ఉద్రేకము, ఒక ఆనందము కలుగుతాయి. అది కూడా మనకు సహకరించే సూత్రాన్ని పట్టుకునే మార్గం. వేయి మార్గాలున్నాయి. మనం మేలుకుని, పరిశీలిస్తుండాలి.

ఈ నిరుచప్పిడి జీవితంలో నీ ప్రస్తుత పరిస్థితితో విసిగి వేసారిపోయి 'ఇది లాభం లేదు. ఇందులోంచి బయటపడాలి' అని ఎప్పుడైతే నువ్వు గట్టిగా నిర్ధారించుకుంటావో అప్పుడు నీ నిరంతర ప్రయత్నంతో ఒళ్లు జలదరించిపోయి 'బాబోయ్ ఇక నేను భరించలేను' అని అనిపించి నీ ఎదుట ఓ మార్గం ఆవిష్కారమౌతుంది. నువ్వు దానిని పట్టుకొని వదలకూడదు. పట్టువదలని విక్రమార్కుడివలె ఎప్పుడైతే నువ్వా మార్గాన్ని అనుసరిస్తావో అప్పుడు నువ్వు ఆ రాజమార్గంలో నడిచి గమ్యాన్ని తప్పకుండా చేరుకుంటావు. విజయం తథ్యం.

కాబట్టి చుక్కానిలేని బతుకు బతికే బదులు నిన్ను నీవు నిశితంగా పరిశీలించుకుంటూ సూచనలకోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తూ వుండాలి.

(*CWM* Vol. 12, p. 80; Vol. 8, pp. 402-05)

అనువాదం: కె. యజ్ఞన్న

నీలోని విభిన్న తత్త్వముల ఏకీకరణ

మానవుడు అనేక గుణముల సంపుటి. మూలతః మానవుడు దైవస్వరూపుడే. కాని ఈ దైవత్వము మనో, ప్రాణిక, దైహిక ముల వలన దిగజారిపోతుంది. వెర్రితలలు పెడుతుంది. కాని నిజానికి ఈ విభాగములన్ని కూడ దైవాభివ్యక్తికి వాహికములై పారదర్శకం కూడా కావచ్చును. మనిషిలోని విభిన్న పోకడ లన్నిటిని పరిశుద్ధ మొనర్చి దైవోన్ముఖము ఎలా చేయాలో మనం తెలుసుకుందాము. — *సంపాదకుడు*

నీలోని విభిన్న లక్షణాలన్నిటిని ఐక్యపరచుటకు ఎప్పుడైనా ప్రయత్నించావా. నిన్ను నిశితంగా పరిశీలించినట్లయితే నువ్వు ఒక్కొక్కప్పుడు ఒక్కొక్క విధంగా ప్రవర్తిస్తావు. మరొకప్పుడు ఇంకొక రకంగా ప్రవర్తిస్తావు. ఒకసారి ఒక పని చేయాలనుకుంటావు. ఇంకోసారి ఆ పని కిష్టపడవు. దీనిని బట్టి నువ్వొక విచిత్రమైన వ్యక్తివని, నీకు తెలియకుండానే నీలో కొన్ని విపరీత బుద్ధులు దాగి వున్నాయని తెలుస్తుంది.

*

దీనికి మందు — మొదట నిన్ను గురించి, నీలోని విభిన్నభాగాలను గురించి, వాటి కార్యకలాపాలను గురించి తెలుసుకోవాలి. ఒకసారి కోపతాపాలు, ఒకసారి దయాదాక్షిణ్యాలు నీలోనే దాగి వున్న మూలమూలలనుండి బహిర్గతమై నీచేత చేష్టలు చేయిస్తూ వుంటాయి. వీటన్నిటిని గురించి నువ్వు స్పష్టంగా తెలుసుకోవా

లంటె చిత్తశుద్ధితో నిన్ను నీవు నిష్పక్షపాతంగా పరిశీలించుకోవలసిందే. ఎందుకంటె మనిషి తప్పు చేసినప్పటికి తను చేసే పనులన్నిటిని సమర్థించుకుంటాడు. అలా కాకుండా తనను తను ఎంతో న్యాయంగా, ఏమాత్రం పక్షపాతం లేకుండా పరిశీలించుకున్నప్పుడుగాని తన తప్పులను తను గుర్తించుకొనలేడు. కాని నువ్వు నీ నిజస్వరూపమేమిటో తెలుసుకొని ఈ భూమ్మీద నీవు చేయవలసిన కర్తవ్యాన్ని నిర్వహించాలంటే నిన్ను నీవు చాల నిష్ఠగా పరీక్షించుకుంటూ నీలోని దుష్టత్వాన్ని, దుర్మార్గత్వాన్ని తిరస్కరించాలి. నీ సమస్తమైన వ్యక్తిత్వాన్ని నీ చైత్యకేంద్రము చుట్టూ ఏకాగ్రపరచాలి.

*

ప్రశ్న: మన ప్రకృతిని సమైక్యపరచి ఒకే భావంతో ప్రకాశించేటట్లు ఎలా చేయాలి?

నీ నిర్ణయాన్ని ఏమాత్రం సడలనివ్వకుండా అమలుపరచాలి. నీలో మొండిగా చెలరేగే చెడులక్షణాలను, అల్లరిపిల్లలని కోప్పడ్డట్టుగా కోప్పడి నోరు మూయించాలి. చాలా ఓర్పుతో అట్టి పోకడలను బాగుచేయాలి. "మీరు చేసేది తప్పు" అని వాటికి నచ్చచెప్పాలి.

నీ లోతులలో నీ చైత్యపురుషుడున్నాడు. అది నీలోని దైవాంశము. నీలోని విభిన్న ధోరణులు వ్యతిరేకమైన బుద్ధులన్ని ఈ దైవాంశముతో ఐక్యమవాలి. ఎప్పుడైతే నువ్వు నీ చైత్యపురుషుని ఎరిగి, దాని భక్తిని గురించి తెలుసుకుంటావో అప్పుడు నీ కష్టములు, సందేహాలు అన్ని మాయమయిపోతాయి. ఇది కొద్ది నెలలు కాని, మరికొంత కాలం కాని పట్టవచ్చు. కాని చివరకు విజయం నీదే. *ఒక్కసారి నువ్వు దైవాన్నెంచుకొని "నేను నీవాడినే" అని విన్నవించుకొని ఆయన సరే అన్నప్పుడు ఇక ఈ ప్రపంచమంతా కూడ నీ కడ్డుపడలేదు.* ఎప్పుడైతే నీ కేంద్రసత్త సమర్పించుకున్నదో ఇక నీ ముఖ్యమైన అవరోధము తొలగిపోయినట్లే. నీ బాహ్యవ్యక్తి ఓ ఎద్దుమొద్దు స్వరూపము. అది ఎంత మందంగా వుంటుందంటె లోని దైవాన్ని గురించి దానికి తెలి

యనే తెలియదు. ఎప్పుడైతే నీ అంతర్జీవి "ఇదిగో నేనున్నాను, నీవాడినే" అని అన్నదో అప్పుడు నీ బహిరాంతరంగముల మధ్య ఒక వారధి ఏర్పడుతుంది. వాటి మధ్య సన్నిహిత సంబంధ మేర్పడి వాటి మధ్య గోడ పల్చబడి చివరికి ఆ రెండు కలిసి పోతాయి.

(*CWM* Vol. 4, p. 80; Vol. 12, p. 3; Vol. 3, p. 7)

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

నీ చేతనని విశాలపరచుకోవడమెలా?

ఈ విశాల విశ్వంలో నువ్వెంత? సూర్యచంద్ర నక్షత్రాదులుండే ఆకాశంతో పోలిస్తే నువ్వెంత? నీ పరిమాణమెంత? నీకు దేనిని గురించైనా బాధకలిగినప్పుడు, అసంతృప్తి కలిగినప్పుడు నువ్వీ సంగతి గుర్తుంచుకోవాలి; సముద్రంతో తాదాత్మ్యము చెందాలి; అనంతకాలంలో నీ బ్రతుకు ఒక్క క్షణభంగురమే కదా అని తెలుసుకోవాలి. సముద్రంలో ఒక నీటిచుక్కకి ఇంకో నీటిచుక్కకి ఎలా అయితే భేదముండదో అలాగే వాస్తవదృష్టిలో నీకు మరో మనిషికి ఏమాత్రం తేడా లేదు. నిరంతరం ఈ భావంతో పెంపె సలారుతూ వుండు. అనంతమైన చైతన్యాన్ని ఆర్జించు.

– సంపాదకుడు

> *ఆకాశాన్ని, సముద్రాన్ని తలచుకో?*

మానసికచైతన్యం విస్తృతం కావడానికి అనేక మార్గాలున్నాయి. అన్నిటికంటె సులభతమమైనది, అపరిమిత విస్తృతి కలిగిన దేదైతే వుందో దానితో నీవు తాదాత్మ్యం చెందడం. మాటవరసకి, నువ్వు అతిసంకుచితమైన, పరిమితమైన, మానసికస్థితిలో నత్తగుల్లలో నత్తలా పూర్తిగా ముడుచుకుపోయినప్పుడు, అపరిమితము, అనంతము, అతివిశాలమైనదేదో వొకదానిని గూర్చి ఆలోచించడం మొదలుపెడితే, ఉదా: అనంత

మహాసాగర జలాలు, అవి అన్ని దిశలా దూరదూరంగా అవతలి తీరం దృష్టి కందనంత దూరంగా వ్యాపించి, యెటువైపూ అంతూ, దరీ కానరాని ఆ జలాలలో కొట్టుకుపోతూ, దానిలో భాగంగా కాక పూర్తిగా కలిసిపోయి నువ్వే ఆ మహాసాగరంగా భావించడం, ఆ స్ఫురణ చాలా సులభం. ఈ స్ఫురణ ఆ విస్తృతిలో అతిస్వల్పమైనది.

మరొక పద్ధతి ఆకాశంవైపు దృష్టి సారించినప్పుడు నక్షత్రాలు, గ్రహాలు, వాటి మధ్య అంతరాలు మొదలైన బ్రహ్మాండ విశ్వాంతరాళంలో భూమి అతిసూక్ష్మబిందువు. దాని మీద వ్యక్తి మరీ సూక్ష్మబిందువు. అటువంటి బ్రహ్మాండ విశ్వాంతరాళంలో తేలియాడుతున్న అనుభూతితో, ఆ తాదాత్మ్యతతో నువ్వే ఆ విశ్వరూపుడివి, విశ్వాత్మవు అయిపోతావు. ఇటువంటి భావనలో కొందరు విజయవంతమౌతారు.

మనస్సును విశాలపరచుట

నీ అస్తిత్వాన్ని విస్మరించి, ఈ భూమి మీద సకల వస్తుజాలంతో తాదాత్మ్యం చెందడానికి ప్రయత్నించడం మరొక పద్ధతి. ఏదో చిన్న విషయంలో సంకుచిత దృష్టితో అభిప్రాయం వచ్చి, యితరులవల్ల నీవు నొచ్చుకున్నావనుకో. అప్పుడు విజ్ఞతతో వారి ఆలోచనాసరళిలోని విశిష్టతను గుర్తించి, వారి దృక్పథంతో నీ దృక్పథం కలిపి రెండింటి సమన్వయం సాధించడం ద్వారా విభిన్నదృక్పథాల, ఆలోచనావిధానాల సమన్వయం, ఐక్యత సాధించడం యింకా మంచిది. అయితే యిది సరియైన విచక్షణతో చెయ్యకపోతే అవతలివారి అవలక్షణాలన్నీ నీకు కూడా సంక్రమించే ప్రమాదమున్నది. దానివల్ల పరిస్థితి యింకా దిగజారే ప్రమాదం కూడా ఉంది. నిజం చెప్పాలంటే యిది డొంక తిరుగుడు పద్ధతి. దీనికంటె మొదట చెప్పిన పద్ధతులే సరైనవి, శ్రేష్ఠమైనవి. వాటి వల్ల యెటువంటి హానీ వుండదు.

అనంతకాలం ముందర నువ్వు ఒక లెక్కా?

మానసిక చైతన్యవిస్తృతికి యెన్నో తెలివైన మార్గాలు నా పుస్తకాలలో వివరించాను. ఎప్పుడైనా

యిదంతా పరమబోరుగాను, విసుగ్గాను, చిరాగ్గాను అనిపించవచ్చు. అనంతకాలవాహినిలో, బ్రహ్మాండమయిన విశ్వంలో భూత, భవిష్యత్తుల మధ్యగల వర్తమానం ఒక్క క్షణం. సరిగ్గా చెప్పాలంటే రెప్పపాటుకాలం. దానిని నీవు గుర్తించే లోగానే గడిచిపోతుంది. అటువంటిది నీవు అంటే యింత బ్రహ్మాండ విశ్వవిరాడ్రూపంలో పరమాణువుకంటె చిన్నవాడివయిన నువ్వు మానసికంగా బాధ పడటమన్నది యెంత హాస్యాస్పదం?

నేనెంత మూర్ఖుణ్ణి?

ఒక వ్యక్తి జీవితంలో ఎప్పుడో ఒక సంఘటన జరిగినప్పుడు ఆ క్షణంలో అది తన కత్యంత ముఖ్యమయిన జీవితసమస్యగా భావించి ప్రవర్తిస్తాడు. కాని మరి పదేళ్లు గడిచిన తరువాత, దాదాపు దానిని పూర్తిగా మరచిపోయినా పోవచ్చు. అటువంటప్పుడు అది జ్ఞాపకం వస్తే నవ్వుకుంటాడు. దానినంత ముఖ్యమైనదానినిగా ఎలా అనుకున్నానా, అని తన తెలివితక్కువకి తనలో తానే ఆశ్చర్యపడతాడు. ఈ బ్రహ్మాండ విశ్వవిరాట్‌రూపంలో ఒక వ్యక్తి ఎన్నోవంతో, అనంతకాలవాహినిలో ఒక్క క్షణం కూడా అంతే. వ్యక్తి, వ్యక్తి జీవితం కూడా అంతే. ఇది సరిగ్గా భావించగలిగిన నాడు నీ వేదనంతా మటుమాయమౌతుంది. బాధ అంతా తుడిచిపెట్టుకుపోతుంది. ఎప్పుడైతే వ్యక్తి యీ మర్మాన్ని తెలుసుకుని ఏకాగ్రతతో ప్రయత్నిస్తాడో అప్పుడు అన్ని బంధాలనుంచి విముక్తుడై, పులు గడిగిన ముత్యంగా పరిశుద్ధుడవుతాడు. అప్పుడే అతడి అజ్ఞానం, అహంకారం పటాపంచలవుతాయి.

(*CWM* Vol. 6, pp. 344-46)

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

మనస్సులో స్థిరమైన శాంతిని నెలకొల్పటమెలా?

మనస్సులో చెలరేగే ఆలోచనా ప్రవాహాన్ని అరికట్టేందుకు ప్రయత్నించినప్పుడు నీకెంత కోపమొస్తుందో చెప్పలేము. దీనికి నివారణోపాయము లేదా? ఉన్నది. తప్పకుండా వున్నది. నిన్నెవ్వరైనా వేధిస్తున్నారనుకో, అప్పుడు వాళ్లని వినిపించుకోకుండా పో పొమ్మని తరిమికొట్టేసేయవు? ఈ ఆలోచనల విషయంలో కూడ అంతే. "శాంతి, శాంతి, శాంతి" అని నీ మనస్సంతా బహిరాంతరంగములతో సహా మారుమ్రోగేటట్లు అనుకోవాలి. పై స్తరములలో ఒకానొక ఉన్నతజ్ఞానము, ఒక వెలుగు, ఒక జ్యోతి ప్రకాశమానంగా వుంటాయి. నీ మనస్సు కలవరపడ్డప్పుడు ఏ మాత్రం చలించక ఆ జ్యోతిని నీలోకి ఆహ్వానించాలి.

– సంపాదకుడు

ప్రశ్న: మనశ్శాంతిని స్థిరంగా ఎలా నిలుపుకోగలం?

ఓం శాంతి శాంతి శాంతి

ముందు నాకిది కావాలి అనే గట్టి కోరిక ఉండాలి. తర్వాత పట్టువిడువని విక్రమార్కుడి ప్రయత్నం ఉండాలి. ఇదీ మెరుగైన పద్ధతి. ఇంకా ఇతర పద్దతులూ లేకపోలేదు. ముందు కుదురుగా కూర్చో. ఆలోచనలకి స్వస్తి చెప్పు. శాంతి! శాంతి! అని శాంతి మంత్రాన్ని మననం చేసుకో. శాంతినే ప్రగాఢంగా ఆకాంక్షించు. అప్పుడు నిన్ను ఏదో స్పృశించి నీలో ప్రవర్తిస్తున్నట్లు అనిపిస్తుంది.

శాంతి శాంతి శాంతి అని నీలో నీవే నిశ్చలంగా అనుకో. ఆలోచనలను విస్మరించు. విషయాలను పట్టించుకోకు. నీకు చికాకు కలిగించే వ్యక్తిని వదుల్చుకోవాలనుకుంటే వాని నసలు పట్టించుకోవు సరికదా, వానికి నీ ముఖం కూడా చూపవు! అలాగే నీ ఆలోచనలతో కూడా! అసలవి నీలో లేనట్లే ప్రవర్తించాలి. వాటి ఊసే నీకు అక్కర్లేదు. శాంతి మంత్ర పునశ్చరణ

మాత్రం మానకూడదు. ఇలా కొద్ది నిముషాలు చేసి చూడు. మ
కొంతసేపు ఇలాగే ప్రయత్నించి చూడు. ఉదయం నిద్ర లేవగానే
రాత్రి పరుండపోయే ముందు చేయి. తిన్న తిండి సరిగా వం
పట్టకపోతే భోజనం చేసేముందు కాస్సేపు చెయ్యి. జీర్ణశక్తికి ఇ
ఎలా సహకరిస్తుందో నీకే తెలుస్తుంది. ఇలా కొనసాగిస్తూపోతు
ఉంటే నీవిక ప్రయత్నపూర్వకంగా కూర్చోనక్కరనే లేదు.
పని చేస్తున్నా, ఏమి మాట్లాడుతూ ఉన్నా అంతా ఎడతెగని ప్రశా
తతే నిన్ను ఆవహించికొని ఉంటుంది; కొన్నేళ్లకి పరిపూర్ణమై
ప్రశాంతత నీకు సిద్ధిస్తుంది.

కాని మొదట కొద్దిపాటి సమయంలో ఇది తేలికే. జటి
మైన పరిస్థితిలో శ్రమపడాలి. శ్రమపడే సందర్భంలో ప్రశాంత
నిలుపుకోవటం కష్టం. కాని ఇక్కడ కూడా తేలికగానే ప్రశాం
తని సాధించవచ్చు. విషయాలని తేలికగా స్వీకరించాలి. పిలుస్తే
పలికే, ఒక మంచిస్నేహితుడిని పిలిచినట్లు, మైత్రీమధురంగా
'శాంతీ! శాంతీ!' అని పిలు. ప్రశాంతత నీ ముంగిట వచ్చి వా
తుంది!

ప్రశ్న: నాకు మరింతగా ప్రశాంతతను ప్రసాదించవా?

నీకు చికాకు కలిగినప్పుడు నన్ను తలుచుకుంటూ ని
బ్దంగా హృదయాంతరంగంలోనికి శాంతిని ఆవాహనం చేసుకొ
దానిని స్థిరపరుచుకో. ఫలితం నీకు సమ్మోదకరంగానే ఉంటుంది

ప్రశ్న: మానసిక ప్రతిబంధకాలనుంచి విముక్తి పొందటాని ఏమి చేయాలి?

శ్రద్ధగా మనసుని ప్రశాంతంగా నిశ్శబ్దంగా ఉంచటం నేరు
కోవాలి. మనసుని నిశ్శబ్దంగా ఉంచటం అంత తేలిక కాద
భౌతికమనస్సు నిర్విరామంగా, గొడవగానే ఉంటుంది. మన
నంటి ఉన్న విషయాల ఆవృతిని ఆపుచేయగలిగే స్విచ్ లేకపో
అంతులేకుండా అవి అలా పరిభ్రమిస్తూనే ఉంటాయి. నీ చైతన
స్తరాన్ని సామాన్య మానసికస్థాయినుంచి ఉన్నతస్థాయికి ఎదగ
యాలి. *నిశ్శబ్దపరచే దివ్యకాంతికి మనసు తెరచుకునేలా చేయా
ఇలా సాధించిన మానసిక నిశ్చలత స్థిరంగా ఉంటుంది.*

నిశ్శబ్దభూమిక నొక్కసారి నీవందుకోగలిగావో నీకిక తిరుగుండదు; బాహ్యమనసు ఎల్లప్పుడూ నిశ్చలంగానే ఉంటుంది. కావలసినదల్లా, ఉన్నత దివ్యకాంతి కొరకు ప్రగాఢమైన ఆకాంక్ష!

When you are caught in a difficulty, try this method: instead of becoming agitated, turning over all the ideas and actively seeking solutions, of worrying, fretting, running here and there inside your head – I don't mean externally, for externally you probably have enough common sense not to do that! but inside, in your head – *remain quiet.* And according to your nature, with ardour or peace, with intensity or widening or with all these together, implore the Light and wait for it to come.

(*CWM* Vol. 6, pp. 313-14; Vol. 16, p. 150; Vol. 4, p. 182; Vol. 9, pp. 423-24)

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

'ఆంతరంగిక శాంతి' అభ్యసించటం ఎలా?

మీలో చాలామంది మీ ఉనికికి ఉపరితలంపై జీవిస్తూంటారు
బాహ్యప్రభావాల స్పర్శకు గురి అవుతుంటారు.
రమారమి మీరు 'బాహ్యం' లో జీవిస్తుంటారు.
అంటే, మీ శరీరానికి ఆవల జీవిస్తుంటారు.
మరల అటువంటి బాహ్యజీవనులను కలిసినపుడు కలవరపడతారు. ఘర్షణ చెందుతారు.
మీరు మీ అంతరంగంలోకి వెనుకంజ వేయటంలో అలవాటుపడకపోవడంవలననే అలా జరుగుతుంది.
మీరెల్లప్పుడూ మీ ఆత్మలోనికి వెనుకంజ వెయ్యాలి.
అందలి గహనమైన లోతులను తాకాలని గ్రహించాలి.
అలా లోనికి అడుగిడారో అది మీకు క్షేమకరం.
బాహ్యప్రపంచంలో తిరిగే పైపై శక్తులకు మీరు అమ్ముడుపోరాదు.

మీరేమైనా చేద్దామనే ఉరుకులో ఉన్నా సరే, ఒకింత లోపలికి వెళ్లండి.

ఆశ్చర్యం! మీకే తెలుస్తుంది మీరెంత తొందరగా గొప్పగా విజయలక్ష్మిని చేపట్టగలరో! మీకెంత వేగిరంగా పని నెరవేరుతుందో!

ఎవరైనా మీపై విరుచుకుపడ్డారనుకోండి. వారి వా (వే) డి ప్రకంపనాల్లో మీరు యిరుక్కోకండి; కాని ఒకింత వెనుకంజ వెయ్యండి.

ఆగండి. మిన్నకుండండి.

ఫలితం – ఏమీ స్పందించకపోవటం వలన, చలించకపోవటం వలన వారి కోపం 'హుష్ కాకి' అయిపోతుంది.

నిరంతరం మీలో ఆంతరంగిక ప్రశాంతతను నిలదొక్కుకోండి.

మీకొచ్చే ఆవేశానికి అడ్డుకట్ట వెయ్యండి.

అంతరంగ సంప్రదింపు లేకుండా, ఎన్నడూ ఏ నిర్ణయమూ తీసుకోకండి. అనవసరంగా పెదవి విప్పకండి.

పునరాలోచన లేకుండా ఏ చర్యకూ పూనుకోకండి

ఈ లౌకికప్రపంచానికి సంబంధించిన ప్రతిదీ అశాశ్వతమూ, అస్థిరమూను.

కాబట్టి దాన్ని గూర్చి కలవరపాటు చెందటం మూర్ఖత్వం.

ఏదైతే చిరంతనమో, శాశ్వతమో, అమృతమో, అనంతమో – దాన్ని మనం నిజానికి పొందాలనుకోవాలి; జయించాలి; పదిలపఱచుకోవాలి.

అదేంటో తెలుసా! – దివ్యజ్యోతి; దివ్యప్రేమ; దివ్యజీవనం

అదే పరమోత్కృష్టమైన ప్రశాంతి; పరిపూర్ణానందం.

ఈ విశ్వంభరపై సర్వసత్తాధిపత్యంగల మకుటాయమానమైన సంపూర్ణ సాక్షాత్కారం!

విషయ సంబంధాలను మీరు పసికట్టినప్పుడు, మీకేం జరిగినా ఒకింత అంతరంగికమవండి.

పరికించండి; మౌనం వహించండి, దివ్యశక్తిని మొరపెట్టుకోండి, జవాబుకోసం నిరీక్షించండి.

అప్పుడే మీకు స్ఫురిస్తుంది – కచ్చితంగా ఏం చెయ్యాలో....
కాబట్టి గుర్తుంచుకోండి; మీలో ఆంతరంగిక ప్రశాంతత లేనంత వఱకూ మీకు జవాబు దొరకటం 'నేతి బీరకాయే'!
ఆంతరంగిక ప్రశాంతత కోసం అభ్యసించండి.
చిన్నగానైనా కనీసం అందుకోసం శ్రీకారం చుట్టండి.
అది అసంకల్పితంగా మీదైనంతవఱకూ నిరంతరాయంగా మీరు దాని నపేక్షించాల్సిందే!

*

ఒకసారి యీ సుడిగుండాల నుండి విడివడి, ప్రశాంత వాతావరణం లోనికి వెనుకంజ వేసారో, అప్పుడు మీ కవగతమౌతుంది – వారెంత భ్రమలో జీవిస్తున్నారో!
అప్పుడు మీకు మానవాళి ఎట్లా అగుపిస్తారో తెల్సా –
దూచుకుపోతున్న అంధప్రాణికోటిలా!
అవేం చేస్తున్నాయో, ఎందుకు చేస్తున్నాయో తెలియని ఏ లక్ష్యమూ లేని ప్రాణికోటిలా!
రాపులాట, తోపులాటలతో గిరికీలు కొట్టున్నట్టుగా!
దీన్నే వారు కార్యము, జీవితం అంటూ పొరబడుతున్నారు!
కాని అదంతా శూన్యం! ఒట్టి కలకలం.
ప్రయోజనమూ కాదు – నిజ జీవితమూ కానేరదు.
ఉపయుక్తంగా పదినిమిషాలు ప్రసంగించాలంటే, మీరు పది రోజులపాటు మౌనం పాటించాలని నేనొకప్పుడు నుడివాను.
దానికి జోడిస్తూ, మీరు ఒక పూర్తి దినం పనిచెయ్యాలంటే ఉపయుక్తంగా, దానికి మీరు ఓ ఏడాదిపాటు మౌనం పాటించాలి!
అలానని, బాహ్యాజీవితానికి కావలసిన సామాన్యచర్యలపట్ల కాదు.
మరి, విశ్వశ్రేయస్సుకు సంబంధించిన చర్యలు చేపట్టే విషయంలో మాత్రమే!
నేనంటున్న 'మౌనం' యిక్కడ ఏమిటంటే – ఆంతరంగికప్రశాంతత!
తమ సొంత కదలికల రూపంలో, శబ్దంతో, అంధంగా, బధిరంగా క్రమంగా బాహ్యాకర్మల్లో తాదాత్మ్యం చెందేవారి గూర్చి నేను మాట్లాడలేదు.

మీ కర్మకు ఎడంగా వెనుకంజలో నించోండి.
ఈ క్షణిక కదలికల కతీతంగా ఎదగండి.
నిశ్రేయసానంద సామ్రాజ్యంలో ప్రవేశించండి.
అప్పుడే మీకు నిజమైన కర్మస్వరూపం అవగతమౌతుంది.

*

ప్రతి దృక్పథంలో, అంటే ఆధ్యాత్మిక దృష్టికోణంలోంచే కాకుండా, నిజజీవితంలో కొన్ని నిమిషాలుపాటు మౌనం పాటించడం రోజుకు రెండుసార్లైనా అలవఱచుకోవడం ఎల్లప్పుడూ మంచిదే. కాని అది నిజమైన మౌనం కావాలి. అంటే కేవలం మాట్లాడకుండా ఉండి పోవటం కాదు, అంతరంగిక మౌనం.

(CWM Vol. 3, pp. 160, 67-68, 196)

అనువాదం: 'సాహితి కౌముది' పి. మోహన్

ఏకాగ్రత

ద్రోణాచార్యులు వారి శిష్యులకు ఒక పరీక్ష పెట్టారు. ఒక పక్షి కన్నును బాణంతో కొట్టాలి. "నీకేం కనపడుతోంది" అని ఒక్కొక్కరిని అడిగారు. పక్షి కన్ను కనపడుతోందని ఒకరు "ఇంకేం కనపడుతోంది" అనగా పక్షి రెక్కలు, ఆకులు, కొమ్మలు కనపడుతున్నాయని చెప్పారు. కాని అర్జునుడు మట్టుకు తనకు కన్ను ఒక్కటే కనపడుతోందని, ఇంకేమి కనపడుటలేదని చెప్పాడు. ఏకాగ్రత అంటే అది. కాని సాధారణంగా అదే సమయంలో ఏవేవో కోరికలు చెలరేగి మనస్సును అటుఇటు పీకుతూ వుంటాయి కదా! కాబట్టి నీ బుద్ధి వృత్తులన్నిటిని, మేధాశక్తి నంతటిని ఒకే విషయంమీద కేంద్రీకరించినప్పుడుగాని నీకు ఫలితం దక్కదు. శరీరవిన్యాసాలకుకూడ ఇదే మంత్రం పనిచేస్తుంది.

— సంపాదకుడు

నువ్వు జీవితంలో ఏది సాధించాలనుకున్నా ధ్యానమంతా దాని మీదనే నిలపాలి. అంతేగాని వెయ్యిరకాల ఆలోచనలు నీలో కదులుతూండగా ఒక పని చేయాలంటే నువ్వు దానిని ఎలా చేయగలుగుతావు? అలా కాకుండా నీ మేధాశక్తినంతా ఒకే పనిమీద కేంద్రీకరించినట్లయితే ఎంత కష్టమైన కార్యమునైనా చక్కగా చేయగలవు. మామూలుగా చేసే శారీరక పనులే కానివ్వండి. కష్టమైన ఆధ్యాత్మిక విజయాలే కానివ్వండి. నిశితమైన ఏకాగ్రతతో ఎంతటి క్లిష్టమైన కార్యమునైనా నిర్వర్తించవచ్చును. కాబట్టి నువ్వే పనిచేసినా దాని మీదనే ధ్యానమంతా నిలపటం నేర్చుకోవాలి.

*

నువ్వే పనిచేస్తున్నప్పటికి నీ మనస్సునెప్పుడు పరిపరివిధాల పరిగెత్తకుండా స్థిమితంగా వుంచాలి. ఇంకా చెప్పాలంటే నీ ఇచ్ఛాశక్తినంతను, నీ ఆకాంక్షనంతను, నీ ఆశయాన్నంతను ఒకే ఒక లక్ష్యం మీద నిలపాలి, అంతే.

*

ఒక పాఠం నేర్చుకోవాలన్నా, చిక్కుముడిని విడదీయాలన్నా నీ దృష్టినంతా దాని మీదనే నిలపాలి. అనగా ఇది కేవలం నీ తెలివితేటలకు సంబంధించిన విషయం. అయితే శారీరక విషయాలకి కూడ ఈ మంత్రమే వర్తిస్తుంది. ఉదా: బలహీనమైన నరాలని అదుపులో పెట్టాలంటే దాని మీదనే ధ్యానాన్ని నిలిపినట్లయితే వెంటనే ఫలితం దక్కుతుంది. ఈ విధంగా చేయాలంటే నువ్వు నీలోని శక్తులను నియంత్రించటం నేర్చుకోవాలి.

బాహ్యాశక్తులు బయటినుంచి నీలోకి ప్రవేశించటాన్ని గురించి వాటిని ఖర్చు చేయటాన్ని గురించి నువ్వు నేర్చుకోవాలి.

మనుషులకి వాళ్ల శక్తిని ఖర్చుచేయటం, విచ్చలవిడిగా వృథాచేయటం బాగా తెలుసు. నిజానికి మనం శక్తిని వెలుపల నుండి గ్రహిస్తాము. ఖర్చుపెడతాము. చిన్నపిల్లలు అమాయకంగా వుంటారు కదా, అందుకని ఈ శక్తిని గురించిన లెక్కలన్ని వాళ్లకి తెలియవు. ఆటపాటలలో శక్తిని ఖర్చు పెట్టనూ పెడతారు, ఆ శక్తిని మళ్లీ గ్రహించగలుగుతారు. కాని పెద్దవాళ్ల విషయం వేరు.

వాళ్లు లోభులు, శక్తిని పేరపెట్టుకుంటారేగాని, ఖర్చు చేసేందుకు వెనకాడుతారు. తత్కారణంగా ఆ శక్తి వాళ్లలో శిథిలమైపోవలసిందే.

ఇదొక విద్య – బయటనుంచి శక్తిని గ్రహించటం, అది నీలోకి ప్రసారమై తిరిగి క్రియాశీలమవటం – దీన్ని గురించి ఎంత మందికి తెలుసు? నూటికి తొంభైమందికి తెలియనే తెలియదు. వాళ్లల్లోకి ఒక ప్రయోజనార్థమై శక్తి దిగినప్పుడు వాళ్లు అనుకున్న ప్రయోజనానికి కాకుండా ఇష్టమొచ్చినట్లుగా అరిచి, గంతులువేసి ఆ శక్తినంతా వృథా చేస్తారు. అలా కాకుండా ఆ శక్తినంతా లక్ష్యం మీదనే కేంద్రీకరిస్తే ఎంత బాగుంటుంది?

'నేను ఒట్టి అర్భకుడిని, నాకేం చేతకాదు' అని ఎవ్వరైనా అనుకున్నట్లయితే అది చాల పొరపాటు. పరి పరివిధాల పరిగెత్తే మనస్సును ఎవ్వరైనా తగిన ప్రయత్నము చేసి ఏకాగ్రపరచి అనుకున్న లక్ష్యాన్ని సాధించగలరు. ఇది నిజం.

*

నువ్వేదైనా ఓ కష్టమైన పని చేయాలనుకో. అదే పనిగా నీ దృష్టినంతా దాని మీదనే కేంద్రీకరించు. అవసరమైనంత దీర్ఘకాలం అలా ధ్యానించినట్లయితే నీలో ఓ గవాక్షం తెరుచుకుంటుంది. లోతైన జ్ఞానం, మిరుమిట్లుగొలిపే వెలుగు, నీవు ఓ నూతనానుభూతిని పొందుతావు. ఆ ద్వారానికి అవతలివైపుకి వెళ్లిపోతావు. అదొక దర్శనమే!

*

ప్రశ్న: చిత్తశుద్ధితో నా మనస్సునంతటిని శ్రీఅరవిందులకు అర్పించుకోవాలని వున్నది. కాని ఎలా చేయాలో తెలియదు. దయచేసి సెలవివ్వండి.

ప్రతిరోజు ఒక సమయాన్ని పెట్టుకొని శ్రీఅరవిందుల పుస్తకాన్ని ఒకదాన్ని తీసుకొని దాంట్లో కొన్ని వాక్యాలు చదువు. మౌనంవహించి ఆ వాక్యాలలోని లోతైన జ్ఞానము ఆవిష్కారమయ్యేంతవరకు వేచివుండు.

*

ఒక విద్యార్థి వేసిన ప్రశ్న: ఒక కష్టమైన లెక్కను చేసేటప్పుడు ఒక్కొక్కసారి జవాబు వెంటనే వస్తుంది. ఒక్కొక్కసారి చాలా సేపు పడుతుంది.

అవును నిజమే. అది నీ ఏకాగ్రత మీద ఆధారపడి వుంటుంది. నిన్ను నీవు జాగ్రత్తగా పరిశీలించుకున్నట్లయితే దీనికి కారణం తెలిసిపోతుంది. మనస్సు నిర్మలంగా లేకుండా పొగ మంచు కమ్మేసి స్వప్నమువలె మబ్బు మబ్బుగా వుంటుందనుకో – నువ్వందులో వెతుక్కుంటూపోతే, ఏం కనపడుతుంది. ఒక గది నిండా దూది ఎగురుతూ వుంటే, ఆ గదిలో నీకేమైనా కనపడు తుందా. నువ్వెంత ప్రయత్నించినా ఏం లాభముంటుంది?

ఏకాగ్రత (concentration) అనగా ఈ మబ్బు తెరను తొల గించటమే. నీ బుద్ధి వృత్తులన్నిటిని ఒకే విషయంమీద కేంద్రీక రించాలి. నీ మనస్సుతో పోరాడవద్దు. నీ సమస్య ఒక్కటే కంటికి కనపడాలి. కేవలం దాని ఉపరితలమే కాకుండా, దాని లోతుపా తులను కూడా చూడాలి. ఈ విధంగా నీ దృష్టినంతటిని, బుద్ధి నంతటిని ఒక గండశిలలో రంధ్రము చేసి, దాని రహస్యాలను కనుక్కునేటంత గాఢంగా ఏకాగ్రపరచాలి. నీకు వెంటనే జవాబు వస్తుంది. ఇదొక్కటే పద్ధతి, ఏకైక మార్గము. ఒకవేళ అటులకాక, అలా చేద్దాం, ఇలా చేద్దాం అని తటపటాయించావో నీ తల ఎంత బద్దలుకొట్టుకున్నా లాభం లేదు. నీ బుద్ధినంతా, యావచ్ఛక్తిని ఉపయోగించి మాటలను ఛేదించి వాటి వెనుకనున్న భావాన్ని ఆవిష్కరించాలి.

(CWM Vol. 9, p. 360; Vol. 16, p. 180; Vol. 4, pp. 4-5; Vol. 12, p. 400; Vol. 9, p. 383; Vol. 4, pp. 8-9; Vol. 5, p. 400; Vol. 12, pp. 207-08; Vol. 5, p. 126)

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్ శాస్త్రి

మన తీర్మానాలను శ్రద్ధగా పాటించటమెలా?

నీ మనస్సును దాటి, సాధారణ ప్రకృతిని జయించి అంతకంటె అతీతమైన మరో ఉన్నతస్థాయిని పొంది దాని ననుభవించుటయే యోగము. కాని అది అంత తేలికగా జరిగే విషయము కాదు. నువ్వు సదుద్దేశంతోనే గట్టి తీర్మానం చేసుకుంటావు. కాని మరుక్షణమే అది విఫలమైపోతుంది. ఎందుకని? నీ మనస్సుకు అట్టి శక్తి లేదు గనుక. అది ఇంద్రియాలను నియమించలేదు. ప్రకృతిని శాసించలేదు. నువ్వు, నీ మనస్సుతో యోగం చెయ్యలేవు. ఎట్టి ప్రయోజనమును సాధించలేవు. నీ హృదయ గుహాలో నివసించే ఆత్మచేతనకే అట్టి సామర్థ్యమున్నది. అది శక్తిమంతము, కార్యశీలి. మనస్సుకంటె భిన్నము. సంకల్పవికల్పముల కతీతము. నీ తీర్మానములను ఏమాత్రం పొర్లుపోకుండా అమలుచేయగల దిట్ట. — *సంపాదకుడు*

ప్రశ్న: శ్రీమాతా మా తీర్మానాలను పొర్లుపోకుండా ఆచరించాలంటే ఏం చేయాలి?

పొర్లుపోకుండా ఆచరించాలని కోరుకోవటమే (నవ్వు). నేనూరికే నవ్వులాటకు అంటున్నానని అనుకుంటున్నావేమో, అదేం కాదు. ఇది పచ్చి నిజం. ముందర ఎంత నిజాయితీగా అనుకున్నా సరే, ఎక్కడో ఒక లోపం వుంటుంది. నిన్ను నీవు చిత్తశుద్ధితో పరిశీలించుకున్నట్లయితే నీలో కొన్ని విషయాలు దాగివున్నట్లు తెలుసుకుంటావు. అంటే నువ్వు చేసుకున్న తీర్మానానికి ఒప్పుకోని విభాగము ఒకటి వున్నది. ఎప్పుడు అవకాశం దొరుకుతుందా అని ఎదురుచూస్తూ వుంటుంది. సందు దొరకగానే 'అహాహా' అంటూ నిన్ను ధిక్కరించేసి బయటపడుతుంది. దీనికి చిత్తశుద్ధి ఒక్కటే మందు. అదృశ్యంగా ఏ మూలో నక్కివుండి నువ్వు ఏమరుపాటుగా వున్న సమయంలో బయటకు వచ్చేసిన దొంగని వెతికి పట్టుకోవలసిందే!

నువ్వు నిజంగా ఏదైనా చేయాలని గట్టిగా నిర్ధారించుకున్నట్లయితే ప్రపంచకంలో ఎవ్వరు నిన్ను ఆపలేరు. కాని అంత గట్టిగా నిర్ధారించుకునే శక్తి ఎవరికి వుండదనే చెప్పాలి. సాధారణంగా నీ మనస్సులో భిన్నస్వరాలుంటాయి. ఒకవేళ ఆ భిన్న స్వరాలే కనక లేనట్లయితే ప్రపంచకంలో ఎవరు కూడ నీ నిర్ణయాన్ని మార్చలేరు.

'కాని అంత ఖచ్చితంగా నిర్ధారించుకునే శక్తి ఎవరికైనా వుంటుందా' అనేదే ప్రశ్న: కొంత వెనకాడే స్వభావం ప్రతివారిలోను వుంటుంది. ఉదా: "ఇలా చేస్తే బాగుంటుంది.... అలా చేస్తే ఇంకా బాగుంటుంది..... ఇలా ఎందుకు చేయకూడదు". కాని ఈ విధమైన తటపటాయింపు నీ ఆత్మవాక్కు కాదు. కానే కాదు. నీ మనస్సులో ఒక మూల ఎక్కడో దాక్కొని "అలా ఎందుకు చేయాలి. నాకిది ఇష్టం లేదు. దీనికి వ్యతిరేకమే చేస్తాను" అని అంటుంది. ఇదీ వరస, నువ్వు అనుకున్న ముఖ్యమైన పని తప్ప మిగతా పనులు చేసేందుకు అనేకమైన కారణాలు పొడచూపుతూ వుంటాయి.

But if one *wills,* if one really *knows* that *this* is the thing, and truly wants this, and if one is *oneself* entirely concentrated in the will, I say that there is *nothing* in the world that can prevent one from doing it, from doing it or being obliged to do it. It depends on what it is.

One wants, Yes, one wants, like this (*gestures*). One wants: "Yes, yes, it would be better if it were like that. Yes, it would be finer also, more elegant."... But, eh, eh, after all one is a weak creature, isn't that so? And then one can always put the blame upon something else: "It is the influence coming from outside, it is all kinds of circumstances."

The breath has passed, you see. You don't know... something.... a moment of unconsciousness... "Oh, I was not

conscious." You are not conscious because you do not accept... And all this because one doesn't know how to will.

సమైక్యపరచుకొనుట

సంకల్పం అనేది చాలా ముఖ్యమైన విషయం. నిజమైన సంకల్పం కోసం నిన్ను నీవు పూర్తిగా సమైక్యపరచుకోవాలి. నిజానికి వ్యక్తిగా ఉండాలంటే ముందు తనను తాను సమైక్యపరచుకోవాలి. శుద్ధ వ్యతిరేక ధోరణులకు ఆకర్షింపబడుతూ. తనను తాను తెలుసుకోకుండానే వ్యక్తి మూడొంతులు జీవితాన్ని గడిపేస్తాడు. మరి అలా ఎందుకు చేస్తాడు? అతడు బాహ్యాప్రభావాల పుట్ట. అంతేకాదు అతని నడవడి, శక్తులు, చర్యలు, ప్రతిచర్యలు ఏవియు అతని స్వంతములు కావు. కాబట్టి విడిగా వ్యక్తి లేడు. తనకు ఆత్మబలం వుందని, సంకల్పబలం వుందని తెలుసుకోవడం ప్రారంభించినప్పుడు వ్యక్తిగా కావడం ప్రారంభమౌతుంది. అయితే అతడు సమైక్యంగా మమైక్యం చెందనిదే అతనికి ఆత్మబలం సిద్ధించదు.

నీ యిచ్ఛయే జరుగుగాక

ఆత్మబలం సిద్ధించిందా, ఇక అప్పుడు "నీకు కావలసినదే నాకు కావాలి" అని దైవంతో అనగలవు. అంతకుముందు మాత్రం అలా అనలేవు. ఎందుకంటె – దైవం వాంఛించేది నువ్వు వాంఛించాలంటే – నీకు ఆత్మబలం – సంకల్పం వుండాలి. అవి లేకపోతే నువ్వు దేన్నీ సంకల్పించలేవు. సంకల్పం రావాలంటే – ముందు దాన్ని ఇష్టపడాలి. దాన్ని మరీ ఎక్కువగా ఇష్టపడాలి. దైవం ఏమి చేయాలని వాంఛిస్తున్నాడో దానిపై నీకు ఎక్కువ మక్కువ ఉండాలి. దేవునికి సమర్పించి ఆయనకు అంకితం చేసే ఆత్మబలం నీకు లేదు.

Something like that, gelatinous, like jelly-fish... there... a mass of good wills – and I am considering the better side of things and forgetting the bad wills – a mass of good wills, half-conscious and fluctuating....

Ah, that's all, my children. That's enough for today. There we are.

Only, put this into practice; just a little of what I have said, not all, eh, just a very little.

*

Will: power of consciousness turned towards effectuation.

*

ప్రస్తుతం నీ ప్రకృతిలో లేని కొంగ్రొత్త లక్షణాలను ఆర్జించుకోవాలన్నా, నీకింతవరకు తెలియని కొత్తవిషయాలని గురించి తెలుసుకోవాలన్నా, నువ్వింత వరకు చేయలేని కొత్తపనులను చేయాలన్నా నీలో ఆకాంక్ష నిరంతరం జ్వలిస్తూ వుండాలి.

నీలో కోరికలు పూర్తిగా నశించినప్పుడుగాని నువ్వు శాంతి, వెలుగు సీమలలో ముందుగు సాగిపోలేవు.

*

వంద తీర్మానాలు వృథాగా చేసే బదులు చిత్తశుద్ధితో గట్టిగా ఒక్కదాన్నైనా ఆచరణలో పెడితే అదే పదివేలు.

(CWM Vol. 6, pp. 346-48; Vol. 14, p. 167; Vol. 16, p. 274)

అనువాదం: ఆర్.ఎల్.ఎన్.శాస్త్రి, పున్నమరాజు నాగేశ్వరరావు

నువ్వు నీ సమస్యల కతీతమైన ఓ కొత్త జీవితాన్ని మొదలు పెట్టాలంటే ఏం చేయాలో తెలుసా! దానికి జవాబు నీ అంతరంగంలోనే దొరుకుతుంది. దాన్ని నువ్వు బుద్ధిపూర్వకంగా కోరుకోవాలి. ఆకాంక్షించాలి. దానికోసం తపించాలి. అప్పుడు నీలో ఇప్పటివరకు మూతపడివున్న ఒక తలుపు తెరుచుకుంటుంది. అందులోనుంచి ఒక చైతన్యజ్యోతి బహిర్గతమై నీ జీవితముయొక్క స్వరూపమునే పూర్తిగా మార్చివేస్తుంది. నీ ప్రశ్నలన్నిటికి జవాబిస్తుంది. నీ సమస్యల్నిటిని పరిష్కరిస్తుంది. నువ్వు కోరుకున్న ఆదర్శజీవితమునకు, సత్యమునకు దారి చూపిస్తుంది, నీకు నిరంతరానందమును, శక్తిని, నూతన జీవితాన్ని ప్రసాదించి నిన్ను పూర్తిగా సంతృప్తి పరుస్తుంది.

— శ్రీమాత

ఉద్రేకాలను నిగ్రహించటమెలా?

మనకున్న గట్టి ఆయుధము ఈ మనస్సే. దాని సహాయంతో గొప్ప గొప్ప ప్రణాళికలను తయారుచేయవచ్చు. ప్రయత్నించి వాటిని సాధించనూవచ్చు. కానీ ఒక విషయంలో మట్టుకు అది అశక్తురాలు. ఉద్రేకాలను, ముఖ్యంగా క్రిందిస్తరములలోనుంచి ఎగసివచ్చే ప్రలోభాలను నిగ్రహించలేదు. వాటి ముందర కుప్ప కూలిపోతుంది. తన బలమంతా ఏమవుతుందో తెలియదు! కావాలంటే వీటిని మనం నిగ్రహించగలము. ఏదైన అధమ ఉద్రేకము (వ్యసనం లాంటిది) నీ మీదికి దండెత్తివచ్చినప్పుడు నువ్వు దానిని నిర్దాక్షిణ్యంగా నిరాకరించాలి. ఈ విధంగా కొన్ని మాట్లు జరిగిన తర్వాత నీ మీద వాటి ప్రభావము క్షీణించి పోతుంది. ఇక నువ్వు వాటివలన చలించిపోవు.

– సంపాదకుడు

మనస్సుకు నిరోధించే శక్తి లేదు

ఉద్రేకాలను నిగ్రహించే శక్తి మనస్సుకు వుండనే వుండదు. ఎందుకంటె మనస్సుకు కుతూహలం చాలా ఎక్కువ. ఏ విషయాన్నైనా అన్నివైపులనుంచి పరిశీలించే స్వభావం దానిది. అందుకని ఎవరైనా నిన్ను 'ఈ పని చేయకూడదు' అని శాసిస్తే "చేస్తే ఏమౌతుంది? ఎందుకు చేయకూడదు....." అని నీలో నువ్వే వాదించుకుంటూ వుంటావు.

ఈ సందర్భంలో నేను చెప్పినట్లు[2] ఎంతో ప్రశంసనీయములైన వాదనలలోను, వాటిని సమర్థించడంలోను మనస్సు గట్టి దిట్ట.

---

[2] సాధారణంగా యీ భౌతిక మనసు అనేది నిమ్నతరప్రాణిక చేతనతోనూ, దానికదలికలతోనూ ఒక విధమైన బంధుత్వాన్ని ఏర్పరుచుకుంటుంది. ఆ నిమ్నప్రాణికము వాస్తవానికి కోర్కెలను, ఉద్రేకములను ఎప్పుడైతే అభివ్యక్తపరుస్తుంటుందో, అప్పుడీ భౌతికమనసు దానికి సహాయము నందించడానికి ముందుకు వస్తుంటుంది. ఈ కామనలన్నీ ఎంతో యుక్తమైనవే అన్న అర్థం వచ్చేటట్లుగా, సహేతుకంగా వాటిని సమర్థిస్తూ, ఆదరిస్తుంది.

చైత్య పురుషునికే అట్టి సామర్థ్యమున్నది

కేవలం చైత్యసత్తకు మాత్రమే యీ విషయంలో ఏదయినా చెయ్య గల శక్తి వుంది. నీ మనసు చైత్య సత్తతో సంపర్కం స్థాపించుకొనగలిగితే, చైత్యసత్త ప్రభావమును కనక అందుకొనగలిగితే, అప్పుడు కావలసినంత దృఢత్వాన్ని సంఘటితపరచుకుంటుంది. అప్పుడు ఏది సత్యమైనదో, ఏది మిథ్యయో తెలుసుకొనగలుగుతుంది. మరియు సత్యవిషయములను తెలుసుకున్న తర్వాత అప్పుడు తప్పక అది నిమ్న శక్తులతో యుద్ధం చేసి విజయం సాధిస్తుంది. కానీ దానికి ఒకే ఒక నిబంధన, దానికి చైత్యసత్తతో సంపర్కం స్థాపించుకొనడం తప్పనిసరి.

వ్యక్తి తనను తాను సమర్థించుకొనుట

ఎంత చక్కని సిద్ధాంతాలనయినా, మానసికస్థాయిలో ఎన్నో విషయాలు తెలిసినా, మరియు, ప్రశంసనీయమైన నీతిసూత్రాలను ఒడిసిపట్టుకున్నా, అవి ఒక కోరికను, లేక ఉద్రిక్తతను ప్రతిరోధించ లేవు. ఒక్కొక్కసారి నీవు దృఢసంకల్పం కలిగి వుంటావు. ఈ విషయం ఇలాగే వుంటుంది అనే నిర్ణయానికి వచ్చేస్తావు. అది ఇక నీవు చెయ్యను అని స్థిరీకరించుకుంటావు. కానీ అది ఎలా హఠాత్తుగా (ఎలా, ఎందుకు, ఏమి జరిగింది, ఏమీ నీవు తెలుసుకోలేవు) నిజానికి యీ విషయంలో ముందుగా నీవేమీ నిర్ణయం తీసుకున్నట్లు నీ కనిపించదు. ఆ తరువాత నీ లోలోపలినుండి ఆ పనిని చెయ్యడం కోసం వెంటనే ఒక అద్భుతమైన కారణం చూడగలుగుతావు. "మంచిది. ఇప్పుడు నేనీ పనిని యీ ఒక్కసారే చేస్తాను. అయితే, యీ పని చాలా చెడ్డది అని నేను నమ్ముతాను. ఇక ఎప్పుడూ చెయ్యను. ఇదే చివరిసారి" ఎల్లప్పుడూ యీ గొప్ప మన్నింపు ధోరణిని నీలో నీవే ఏర్పరుచుకుంటావు. "చిట్టచివరిసారిగా నేనీ పనిని చేస్తున్నాను. ఇది పూర్తిగా చెడ్డపనే. ఇది చెయ్యవలసిన పని కాదు. నేను ఇక మీదట చెయ్యదల్చుకోలేదు. ఈ విషయం పూర్తిగా తెలుసుకోవాలన్న ఉద్దేశ్యంతోనే నేనీ పని చేస్తున్నాను.

ఇదే చివరిసారి" ప్రతీసారీ ఇదే చివరిసారి అనుకుంటావు. కానీ మరల అదే పనిచేయడానికి పూనుకుంటావు!

ఈ ఒక్కసారికేం ఫరవాలేదు

పోతే, కొంతమంది ఉంటారు, వారిలో స్పష్టమైన భావాలంటూ ఏవీ ఉండవు. అలాటివారు తమలో తాము ఇలా అనుకుంటారు. "నేను ఇలా ఎందుకు చేయకూడదు? ఇవన్నీ కేవలం సిద్ధాంతాలు మాత్రమే. కేవలం నీతిసూత్రాలు మాత్రమే. ఎంతమాత్రం నిజాలు కాకపోవచ్చు. ఒకవేళ నాలో యీ ఉద్రేకం కలిగితే, అది ఆ సిద్ధాంతాలకన్నా గొప్పది కావచ్చు గదా." ఇటువంటి వ్యక్తుల విషయంలో మట్టుకు అది ఎంతమాత్రం చివరి సారి కాదు. వాళ్లకది అలవాటైపోతుంది.

ఈ రెండురకాల ప్రకృతుల మధ్య అనేక శ్రేణులకు జెందిన వారుంటారు. కానీ అన్నిటికన్నా ప్రమాదకరమైనది, "మంచిది, దీనిని నేను యీ ఒక్కసారే చెయ్యబోతున్నాను. దానివలన నేను పునీతమౌతాను. ఇంకెప్పుడూ చెయ్యను" అయితే దాని వలన అతను నిజంగా పునీతమౌతాడా యేమిటి?

ఏమైనా సరే నేను నిగ్రహించుకొంటాను

స్వచ్ఛత నీకు కలిగేది ఎప్పుడంటే, నీలో నీవు యీ విధంగా నిర్ణయించుకోవాలి. "నేను దీనిని ఇక చెయ్యదల్చుకోలేదు. నేనిది చెయ్యను కూడా. దానికోసం నేను నాలోనున్న సర్వశక్తులతోను నిగ్రహించి అసలు చెయ్యనుగాక చెయ్యను" తద్వారా నీకు కించిత్ సఫలత లభించినా, అది చాలా ఎక్కువగానే భావించాలి. నిజానికి ఇది పెద్ద విజయం కాదు. చిన్నవిజయమే. చాలా పాక్షికమైన విజయం. నీవు ఏది చెయ్యాలని మిక్కిలి ఆశపడ్డావో, దానిని ఆచరించకుండా ఉండగలిగావు. కానీ ఆ ఆశ, ఆ కోరిక, ఆ మనోవికారములు నీలో అలాగే ఉంటాయి. అవి నీలో సుడులను సృష్టిస్తూంటాయి. కానీ పైకి మాత్రం నీవు ప్రతిఘటిస్తావు. "నేను ఇది చెయ్యను. నేను చలించను. దీనికోసం నా కాళ్ళు, చేతులూ కట్టిపడెయ్యవలసి వచ్చినా సరే, నేనిది చెయ్యను" ఇది పాక్షిక విజయం – కానీ ఇదొక ఘనవిజయం

అని కూడ చెప్పొచ్చు. కారణం, దీనివలన నీవు మరొకసారి మరికొంత ఎక్కువ సాధించవచ్చు. చెప్పేదేమంటే, తీవ్రమైన ఉద్రేకములను, కోర్కెలను నీలో నీవు పట్టి ఉంచటంకన్నా, వాటిని నీవు కొద్ది కొద్దిగా శాంతపర్చడానికి ప్రయత్నించు. మొదటిసారి ఎంతో కష్టంతో, నెమ్మదిగా నీవు వాటిని శాంతపర్చగలవు. అయినా అవి చాలాకాలం నీలో నిలిచే ఉంటాయి. పదే పదే వెనక్కి తిరిగి వస్తుంటాయి. బాధపెడతాయి. చికాకు పెడతాయి. నీలో తీవ్రమైన విరక్తిని కలుగజేస్తాయి. ఏది ఏమైనా సరే, నీవు వాటిని బాగా ప్రతిఘటిస్తూ ఇలా అనుకోవాలి. "లేదు, నేనేమీ చెయ్యను. దానికోసం నేను ఏ మూల్యం చెల్లించవలసి వచ్చినా సరే, నేను చెయ్యను. నేను ఒక రాయిలాగ అచంచలంగా ఉంటాను" అప్పుడు కొద్ది కొద్దిగా అది క్షీణిస్తూ, క్షీణిస్తూపోతుంది. ఆ తరువాత నీవు మరొక వైఖరిని అలవర్చుకొనడం నేర్చుకుంటావు.

"ఇప్పుడు నేను నా చేతన అన్నిటికన్నా ఊర్ధ్వంగా ఉండాలని వాంఛిస్తున్నాను. దాని కొరకు నేను ఇంకా ఎన్నో యుద్ధాలు చెయ్యవలసి ఉంది. కానీ నా చేతన వీటన్నిటికీ ఊర్ధ్వంగా ఉండగలిగితే మట్టుకు, కొద్దిగా కొద్దిగా ఒకానొక సమయం ఆసన్నం అవుతుంది. ఇక అప్పుడు అవి తిరిగి వచ్చే ప్రసక్తి లేదు." ఆ తరువాత ఎటువంటి సమయం వస్తుందంటే, నీలో నీవు వీటన్నిటినుండి పరిపూర్ణ విముక్తిని పొందిన అనుభూతిని పొందగలుగుతావు. నీవు ఎప్పుడైతే యీ అనుభవాలకి అతీతమైపోతావో, ఆ తరువాత చెప్పేదేముంది. అంతే. ఆ సమయం రావడానికి చాలాకాలం పట్టవచ్చు. త్వరగా కూడా రావచ్చు. అది నీ స్వభావముమీద ఆధారపడి వుంటుంది. నిష్కపటమైన నీ అభీప్సపై ఆధారపడి వుంటుంది. ఎవరిలో అతిస్వల్పమైన నిష్ఠ, హృదయపూర్వకత ఉందో, వారు కూడా యీ ప్రక్రియను స్వీకరించగలిగితే, తప్పక సఫలత పొందుతారు. దానికి కొంతసమయం పడుతుంది. వారు మొదటి విషయంలో, అంటే వాటన్నిటినీ వెల్లడి చెయ్యకుండా ఉండడంలో సఫలత పొందగలరు. *ఈ జగత్తులోని శక్తులన్నీ తమని తాము అభివ్యక్తపర్చుకోవాలని ప్రయత్నిస్తూ*

వుంటాయి. ఎవరి ద్వారా చేద్దామా అని వెతుక్కుంటూ వుంటయి. కానీ నీవు ఆ అభివ్యక్తిని ఆపాలని ప్రయత్నిస్తే, కొద్దికాలం అవి ఆ ప్రతిబంధకాలను ఛేదించాలని ప్రయత్నిస్తాయి. కానీ చివరకి తోక ముడుచుకొనిపోతాయి. ఆఖరికి అవి విరమించుకొని వెను తిరిగిపోతాయి. ఇక అవి నిన్ను విసిగించవు. నీకు శాంతి మిగులుతుంది.

అందుకని నువ్వు "మొదట నా మనస్సును నమ్మిస్తాను. తర్వాత శరీరాన్ని పునీతము గావిస్తాను. పిదప ప్రాణికాన్ని పరిశుద్ధపరచుకుంటాను" అని అనుకోవటం పొరపాటు. అలా చేస్తే ఫలితం సున్న. మాములుగా అందరూ ఈ విధంగా ముందర మనస్సుతో మొదలుపెట్టి చేయాలనుకుంటారు గాని అది తప్పు. నీ మనస్సుతో యుద్ధం చేసేబదులు ముందర ఆ చెడ్డపని చేయటం మానేస్తేనే మంచిది. నిన్నేదైతే పీకుతోందో దాన్ని పూర్తిగా బహిష్కరించేసేయాలి. తరువాత దాని మీద మోజు తగ్గుతుంది. ఆ తరువాత అది నీ దరిదాపులకు కూడా రాదు. నీ ద్వారాలు దానికి పూర్తిగా మూతబడి వుంటాయి. ఇకనుంచి అవి నిన్ను అంటనే అంటవు. ఎదురుగా వున్నా కూడ అవి నిన్నేమి చేయలేవు. ఇదీ నువ్వు చేయాల్సిన పని. ఇక నీకు అదంటే ఇష్టమే వుండదు. అది నీ చేతనాకాశంలో నుంచి మాయమైపోతుంది.

*

ప్రశ్న: శ్రీమాతా! కొన్ని తప్పులు జరుగుతూ వుంటాయి. అవి తప్పులని తెలుసు. అయినప్పటికి ఆ తప్పులను చేయకుండా వుండలేకపోతున్నాము? ఎవరో మమ్మల్ని బలవంతపెట్టినట్లుగా ఉంటుంది.

నిన్ను బలవంతపెట్టేది ఇంకెవరు – నీ నిమ్నప్రకృతే! నీ అవచేతనలోనుంచి వచ్చే ప్రేరణలు నిన్ను శాసించి నీ చేత తప్పుడు పనులన్నీ చేయిస్తూ వుంటాయి. వాటికి లొంగిపోవటమో లేక గట్టిపట్టుదలతో నీ స్వశక్తి మీదనే నిలబడివుండటమో నీ చేతులలోనే వున్నది. అంతా నీ నిర్ణయము మీదనే ఆధారపడి వుంటుంది.

ఆఖరికి ఒక జబ్బుకి లొంగిపోవటమా లేదా అనే నిర్ణయం కూడ నీ చేతుల్లోనే వుంటుంది! ఇంకా చెప్పాలంటె, అసలు నువ్వు బ్రతికివుండాలో మరణించాలో అనేది కూడా నీ చేతుల్లోనే వుంటుంది. దానిని నిర్ణయించే క్షణం ఒకటి వస్తుంది. అయితే అలా జరిగేందుకు నువ్వు అతిజాగ్రుతమైన చైతన్యస్థితిలో వుండాలి. అటో ఇటో తేల్చుకుండేందుకు ఒక్క క్షణం వ్యవధి వుంటుం దంతే – సెకండులో నూరోవంతనుకోండి. అంతకు ముందర నీ వేమీ చేయలేవు. ఆ తరవాతనూ చేయలేవు. నీ నిర్ణయానికి ఒక్క క్షణం వ్యవధి వుంటుందంతే. అప్పుడు కనక నువ్వు పూర్తి జ్ఞానంతో వున్నట్లయితే ఆ నిర్ణయాన్ని వెంటనే తీసుకోగలవు.

కాని సాధారణ విషయాలలో మరీ అంత క్షణిక వ్యవధే కాకుండా నువ్వు నిర్ణయం తీసుకుండేందుకు కావలసినంత సమయముంటుంది. *విధి లేక లొంగిపోవుటయో లేక ఒక గట్టి నిశ్చయానికి కట్టుబడి వుండటమో నీ చేతుల్లోనే వుంటుంది. నీ మనస్సును దిట్టం చేసుకొని సత్యానుగుణంగానే ప్రవర్తించదలచుకున్నట్లయితే, క్షుద్రప్రేరణలను తిరస్కరించి తిప్పికొట్టే శక్తి నీకుంటుంది.* అలా కాకుండా "నన్నది బలవంతం చేసింది నేనేమి చేయలేకపోయాను" అనుకుంటే అది నీ బలహీనతకు సంజాయిషీ చెప్పుకోటం తప్ప మరేం కాదు. నువ్వు సత్యాన్ని ఎంచుకోలేదన్న మాట అంతే. ఎందుకంటే దాని నాదరించటమా తిరస్కరించటమా అనేది నీ చేతుల్లోనే వుంటుంది. కాని సర్వసాధారణంగా జరిగేదేమిటంటే "అది నాకంటె బలంగా నన్నాకర్షించింది" అని సర్ది చెప్పుకుంటావు. అది బలంగా వుండటం దాని తప్పా? ఈ క్షుద్రవ్యాపారాలు నీకు చెందినది కానే కావు! *నువ్వొక చైత్యపురుషుడివి, నీకు ఆత్మ వుంది. ఆ ఆత్మయొక్క ఉపకరణము నీవు. నువ్వు దాని పాలనలో వుండాలిగాని ఆ క్షుద్రశక్తులకు దాసోహము కాకూడదు.*

(*CWM* Vol. 5, pp. 212-15; Vol. 6, pp. 343-44)

అనువాదం: అరోధృతి, ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

ఆలోచనల నియంత్రణ

ఆలోచనలను పూర్తిగా ఆపివేయటం అంత తేలిక కాదు. కానీ సాధన ద్వారా కొంతవరకు నియంత్రించవచ్చు. ఇది కూడ పాక్షిక విజయమే అని చెప్పాలి. నీ మనస్సు ఆలోచనలతో మరీ అంత సతమతం కాకుండా కాస్త నిశ్శబ్దంగానే వుంటుంది; అయితే ఒక పుస్తకం తెరవగానే తెల్ల కాగితంవలె ఖాళీగా వుండటం ఇంకా గొప్ప అనుభూతి. — *సంపాదకుడు*

ప్రశ్న: మన ఆలోచనలని స్వాధీనంలో ఎలా ఉంచుకోగలము?

దీనికి కొన్ని నియమాలు/సూత్రాలు పాటించాలి.

మొదటి షరతు: మన మానసిక ప్రవృత్తి మీద మనకి సంయమం లేకపోతే, మనకి వచ్చే ఆలోచనలన్నీ బాహ్యాప్రపంచ ప్రభావం వల్లనూ ఇంద్రియాల ప్రలోభాలవల్లనూ కలిగే ప్రతిస్పందనలే. ఇటు వంటప్పుడు మనమీద మనకి నియంత్రణ లేనట్లే. మన ఆలోచనలు మన అధీనంలో లేనంతవరకూ మన ప్రవర్తనకీ, వ్యక్తిత్వానికీ మనం బాధ్యులం కాము. మనం చేసే ప్రతి పనీ మన ఆలోచనల అభివ్యక్తీకరణే. దీని ప్రాముఖ్యతని అర్థం చేసుకొని, మనని మనం గమనించుకుంటూ ఉండాలి.

రెండవ షరతు: మన మానసిక వ్యాపారాలన్నిటిని ఏకదిశాత్మకంగా నియంత్రించాలి.

మూడవ షరతు: మన ఆలోచనలని గమనించుకుని వాటితో సుపరిచితులమవాలి. అప్పుడు వాటి సహజధోరణి ఏమిటో గమనించి, వాటిలో మన మానసిక స్థితికీ, స్వభావానికీ, శారీరక స్పందనలకీ, గుణాలకీ ఏవి ఎక్కువ అనుకూలంగా ఉన్నాయో చూసుకోవాలి.

నాలుగవ షరతు: మన ఆలోచనలలో అన్నిటికన్నా ఉత్తమమూ, ఉన్నతమూ, పవిత్రమూ, నిస్వార్థమూ అయిన దానిని ఎంచుకోవాలి. అంతకంటె అందమైన, ఉన్నతమైన ఆలోచనలు వచ్చేవరకూ, దీనినే మన ఆలోచనల కేంద్రంగా ఏర్పరచుకోవాలి. ఈ అత్యు

త్తమ ఆలోచనని కొలమానంగా ఇతర ఆలోచనలన్నిటినీ పరిశీలించుకుని, వాటిని ఆమోదించడమో లేక తిరస్కరించడమో చేయాలి.

ఐదవ షరతు: మనసుని రోజూ ఒక నియమానుసారం, క్రమశిక్షణలో ఉంచుకోవాలి. మనసుని స్వాధీనపరుచుకుండే విద్యలన్నింటినీ జాగ్రత్తగా పరిశీలించుకుని ఎక్కువగా ఫలదాయకంగా ఉండే పద్ధతిని నిర్ణయించుకుని, దానిని శ్రద్ధగా, దీక్షతో, ఉత్సాహంతో అనుసరించాలి.

కొన్ని ముఖ్య సూచనలు: మనసుకి తగినంత విశ్రాంతి ఎలా ఇవ్వాలో తెలుసుకోవాలి. మన శక్తిని ఎరిగి, శక్తికి మించిన పనులు చెయ్యకూడదు. మన కృషికి ఫలితం కోసం చూసేటప్పుడు, ఎంత కాలం పడుతుందో చూసుకొని ఓర్పుతో వేచి ఉండాలి.

ఇంకో ముఖ్యసూచన: మనం చేయగలిగినదంతా శాయశక్తులా చేస్తూనే, ఒక పసిపిల్లవాడిలా సర్వవ్యాప ఆదిశక్తి, దైవశక్తి మీద సంపూర్ణభారం వదలడం నేర్చుకోవాలి.

*

చాలామందికి వారి ఆలోచనలపై స్వాధీనం ఉండదు సరికదా వారి ఆలోచనలే వారిపై స్వారీ చేస్తాయి! చాలామంది తమ ఆలోచనల వలలో నిస్సహాయంగా చిక్కుకుని, ఎంత తన్నుకున్నా తప్పించుకోలేరు. ఈ ఆలోచనా ప్రవాహాన్ని ఎలా ఆపాలో వారికి తెలీదు. వారి ఆలోచనలే వారి మీద అధికారం చెలాయిస్తాయి. ఎన్నో సార్లు, చాలామంది 'అబ్బా! దీని దుంపతెగ అదే నన్ను వేధిస్తూంటుంది. దాన్ని ఎలా వదిలించుకోవాలో తెలీదు' అనడం వింటుంటాం! వీటివలన ముఖ్యంగా భయం, ఆందోళన, దుష్ట సంకల్పాలన్నీ కలుగుతూంటాయి. భయం రేకెత్తించే ఆలోచనలని అదుపులో పెట్టడం చాలా కష్టం – వాటిని బయటికి తోలే ప్రయత్నం చేసేకొద్దీ, అవి రెట్టింపు శక్తితో వదిలిన రబ్బరు బేండులా మళ్లీ వెనక్కే వస్తాయి.

ఆలోచనలని పూర్తిగా ఆపుకోలేకపోయినా, కొంతవరకు ఆపగలగడం కూడా గొప్పే. నీ మస్తిష్కంలో ఈ మాత్రం సాధిస్తే,

చిత్తం నిశ్చలంగా ఉంటుంది. ఒక పుస్తకంలో ఖాళీ పేజి తెరిస్తే ఎలా వుంటుందో, అంత నిశ్చలంగా, ఖాళీగా ఉంటుంది. ఎప్పుడన్నా తీరికగా ఇంట్లో ఉన్నప్పుడు, ఇలా చేసి చూడండి. మీకే తెలుస్తుంది.

(*CWM* Vol. 2, pp. 61-62; Vol. 9, pp. 253-54)

అనువాదం: బి. వరలక్ష్మి

మంచి నిద్ర పోవటమెలా?

నిద్రపోవటం కూడ ఒక విద్యే. అన్ని విద్యలు నేర్చుకున్నట్లు గానే దీన్ని కూడ నేర్చుకోవాలి. మనస్సును పూర్తిగా పడుకో పెట్టాలి. ఆలోచనల రాకపోకలను తగ్గించాలి. పగలు జరిగిన వ్యవహారాలన్నిటిని మరిచిపోవాలి. అవి మనస్సులో కదులుతూ వుండకూడదు. అప్పుడు నీ ఆత్మలోనుంచి ఒక చిన్నదీపం వెలిగి దాని కాంతిని నీలో వెదజల్లుతుంది. అప్పుడు నువ్వు పై స్తరములను స్పర్శించి, వాటి చైతన్యమును పొంది, ఆ స్థితిలో విశ్రాంతిని పొందుతావు. అప్పుడది మొద్దునిద్ర కాకుండా ఒక జ్ఞానముద్ర అవుతుంది. — *సంపాదకుడు*

మంచి నిద్రపోవాలంటే నిద్రించవలసిన పద్ధతిని గురించి తెలుసుకోవాలి.

మనస్సును నిర్మలం చేసుకోవాలి

బాగా అలసి ఉన్నప్పుడు వెంటనే నిద్రించడం ఎవరికీ మంచిది కాదు. అలా నిద్రపోయినప్పుడు నిశ్చేతనా స్థితిలోకి జారిపోతారు. బాగా డస్సిపోయి ఉంటే కాళ్ళు చేతులు ఝాడించి పక్కమీద పడుకొని విశ్రాంతి పొందాలి; ఒక్కొక్కటిగా నరాలన్నిటినీ సడలించి చివరికి ఒక పాతరుమాలు మాదిరిగా శరీరం భారరహితమైపోవాలి. శరీరంలో ఎముకలుగానీ, కండరాలుగానూ లేనట్లు భావించాలి. ఆ తర్వాత మనసును గూడా

అదే విధంగా ఆలోచనారహితం చేసుకోవాలి. అంటే మనసు ఏ విషయంలోనూ లయంకాకుండా, ఏ విధమైన సమస్యాపరిష్కారాల గురించి ఆలోచించకుండా, రోజంతా జరిగిన విషయాలను, మనోవికారాలను పదే పదే నెమరేసుకోకుండా రిక్తమనసుతో ఉండాలి. *ఆ విధంగా మనసు ప్రశాంతంగా తేలికపడినప్పుడు నీలో నిరంతరం ప్రకాశించే ఒక చిరుజ్యోతిని దర్శించగలుగుతావు. అలా దర్శించిన జ్యోతి ఉన్నట్లుండి ఒక చిరుజ్వాలగా పైకెగయనారంభిస్తుంది. అదే నీ ఆకాంక్ష. దివ్యజీవనంకోసం, దివ్యచైతన్యంకోసం,* దైవంతో తాదాత్మ్యంకోసం నీ ఆకాంక్ష జ్వాలారూపంలో క్రమక్రమంగా పైపైకి ఉద్గమిస్తుంది. అలా నీ చైతన్యమంతా కేంద్రీకృతమైనప్పుడు నీవు నిద్రలోకి జారుకుంటే ఇదివరలో ఎన్నడూ అనుభవించనంత మంచి నిద్రపడుతుంది. ఆ నిద్ర అయోమయంగా చీకటికూపంలో పడిపోయినట్లు కాకుండా కాంతిమయంగా ఉంటుంది. మర్నాడుదయం నిద్రలేస్తే నీకెంతో నిర్మలంగా, ఉల్లాసంగా, తృప్తిగా రోజంతా పనిచేయడానికి తగిన ఉత్సాహం కూడినట్లుగా ఉంటుంది.

*

అచేతనలోకి మునిగిపోకూడదు

నిద్రనేది మైకంలో పడిపోయినట్లుండకూడదు. అలాంటి నిద్ర శరీరానికి నూతనోత్సాహం కల్గించే బదులు ఇంకాస్త భారం కలగచేస్తుంది. పరిమితాహారం తీసుకుంటూ ఎందులోనూ మితిమీరకుండా ఉన్నప్పుడు ఎక్కువ గంటలు నిద్రించాల్సిన అవసరం ఉండదు. లక్షణమైన నిద్ర ముఖ్యంగానీ ఎంతసేపు నిద్రపోయావనేది ముఖ్యం కాదు. సుఖమయమైన నిద్రలో విశ్రాంతి పొందాలనుకుంటే పడుకునే ముందర పాలు, పళ్ళరసం వంటి పానీయమేదైనా తగుమాత్రం తీసుకోవడం మంచిది. మితాహారం ప్రశాంతమైన నిద్రను కల్పిస్తుంది. సుష్టుగా భోజనం చేసినప్పుడు నిద్రంతా గాబరాగా ఉండి పీడకలలతో కలతగా ఉంటుంది. లేదా మొద్దునిద్ర పట్టి ఒళ్ళంతా భారంగా తయారవుతుంది. అందువల్ల తిండివిషయంలో తగినంత జాగ్రత్త

పాటించాలి. అంతకంటే ముఖ్యంగా ఉద్రేకాలను శాంతింపచేసి, ఉబికివచ్చే కోరికలపొంగును చల్లార్చి వాటిపైనుండి మనసును మరల్చి నిర్మలంగా చేసుకోవాలి. పడుకునే ముందు ఎక్కువగా మాట్లాడినా, చర్చల్లో పాల్గొన్నా, ఉత్సుకత్వంగా ఉన్న పుస్తకం చదివినా వెంటనే నిద్రకుపక్రమించకుండా కొంతసేపు ప్రశాంతంగా విశ్రాంతి తీసుకోవాలి. ఆ విధంగా మనసును ప్రశాంతపరిస్తే శరీరం గాఢనిద్రలో మునిగినప్పుడు మెదడు అక్కర్లేని ఆలోచనల్లోకి దిగకుండా ఉంటుంది. ధ్యానం చేసే అలవాటున్నవారైతే విస్తృతమైన ఉన్నతచైతన్యం కోసం ఆకాంక్షతో ఉదాత్తమైన ఒక విషయం మీద మనసును నిమగ్నంచేసి నిద్రించాలి. అలా చేస్తే అది నిద్రకు ఎంతో ఉపకరించడమే కాక నిద్రలో అచేతనావస్థలోకి దిగజారిపోకుండా కాపాడుతుంది.

*

శవాసనం వేసి పడుకోవాలి

పక్కమీద వెల్లకిలా పడుకుని నరాలను, కండరాల బిగువునూ పూర్తిగా సడలించుకోవాలి. అది నేర్చుకోడం సులభమే. శరీరంలో ఏమీ లేనట్లు గుడ్డపీలికలాగా అయిపోవడం గురించి చదివాం కదా! మనస్సును కూడా ఆ విధంగా నిరామయంగా చేసేస్తే నిద్రపోయినా పోనట్లు తోపింపచేసే చెత్తకలలనుంచి తప్పించుకోవచ్చు. మెదడు కణాల చురుకుదనం నిద్రలో కూడా నిరాటంకంగా కొనసాగితే ఎవ్వరైనా అలసిపోతారు. అందువల్ల ఏ మాత్రం బిగువు లేకుండా ఆరాటాలన్నిటినీ అదుపుచేసి ప్రశాంతతతో పూర్ణమైన విశ్రాంతి పొందాలి. ఇది మొదటి మెట్టు.

సమాధి స్థితిని పొందాలి

ఇలా చేసిన తర్వాత బాహ్యాంతరాలతో సహా ఆపాదమస్తకం పరిపూర్ణంగా నిన్ను నీవు సమర్పించుకోవాలి. ఇంకా అహంకారం కల్పించే అడ్డుగోడలన్నిటినీ పూర్తిగా నిర్మూలించాలి. ఆ తర్వాత నీ మంత్రాన్ని పునశ్చరణ చేసుకోవడం ప్రారంభించాలి. అదొక మంత్రం కావచ్చు. నీకు శక్తినిచ్చే ఒక మహావాక్యం కావచ్చు. లేదా నీ ఆకాంక్షనంతటినీ ప్రోదిచేసి నీ గుండెలోతుల్లోంచి వెలు

వడిన ప్రార్థన కావచ్చు. అలా దాన్ని జపించుకుంటూపోయిన ప్పుడు ఒక రకమైన సమాధిస్థితిలోకి వెడతావు. ఆ స్థితినుండి సహజంగా నిద్రలోకి వెడతావు.

మంత్రాన్ని కూడ వర్జించవచ్చు

ఎన్నడూ ఎటువంటి సమాధిస్థితి ఎరుగనివారు కూడా నిద్రించే ముందు ఏదో ఒక మంత్రంగానీ, ప్రవచనంగానీ, ప్రార్థనగానీ పునశ్చరించుకోవడం చాలా మంచిది. అయితే అది అర్థవంతంగా ఉండటం ముఖ్యం. అర్థప్రదానం కాకపోయినా ప్రభావితం చేసే గుంభన కలిగి ఉండాలి. శరీరంపై అది పని చేసే తీరు అద్భుతంగా ఉంటుంది. అటువంటి మంత్రాన్ని పునశ్చరిస్తూంటే దాని ప్రభావం అంతకంతకు అధికమై శరీరం జోగిపోయి నిద్రలోకి జారుకుంటావు. అది తామసాన్ని పోగొట్టుకోడానికి చక్కని చికిత్స.

అవచేతనలోకి జారిపోకూడదు

పరిహరించవలసినవి ముఖ్యంగా రెండున్నాయి. నిశ్చేతనం కలిగించే మైకంలో మునిగిపోకుండా ఉండటం ఒకటి. అలా నిద్రలో ఉన్నప్పుడు నీ అవచేతన (subconscient), అచేతన (inconscient) లలో దాగి ఉండే అంశాలన్నీ పైకివచ్చి నిన్ను ఆక్రమించేస్తాయి. ఇంకా ప్రాణికంగా, మానసికంగా జరుగుతున్న ఉత్తేజిత చర్యలపట్ల నీ నిద్రాసమయమంతా కీచులాటలతో సరిపోతుంది. అవి నిజంగా భీకరపోరాటాలేనని చెప్పవచ్చు. వీటిని నివారించకుండా నిద్రిస్తే రాత్రంతా దెబ్బలు తినవలసిందే. ఒళ్ళునొప్పులతో దెబ్బలు తగిలిన బాధలతో నిద్ర లేస్తారు. అందువల్లనే నిద్రించే పద్ధతిని మార్చుచేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

*

సంపూర్ణమైన నిద్రపోవాలనేది మన ధ్యేయం కావాలి. నిద్రకు సంపూర్ణత అంటే దేహం చలనం లేకుండా స్థాణువుగా ఉండిపోయి ప్రాణికంలో పరిపూర్ణ ప్రశాంతత ఏర్పడి, మనస్సు నిశ్శబ్దమైపోయి, చైతన్యం హాయిగా సచ్చిదానందస్థితిని పొందడమే.

ఇలా నిద్రపోగలిగితే ఉదయం లేచినప్పుడు అనూహ్యమైన శక్తి సంపన్నులై పరిపూర్ణానంద స్వరూపులై ఉంటారు. అలాటి నిద్ర అంత సులభం కాకపోయినా పయత్నం చేసి సాధించవచ్చు. అదే ఆశయం కావాలి.

*

నిద్రపోవడానికని పడుకోంగానే శరీరాన్ని సడలించడం ప్రారంభించు. దాన్నే గుడ్డపీలికలాగా అయిపోవడమని చెప్తాను. ఆ తర్వాత మనస్ఫూర్తిగా విధేయుడవై నిన్ను పూర్తిగా ఆ దైవానికి సమర్పించేసి, నిన్ను నీవు వదిలేసుకో. అలా చేయగలిగే వరకూ ప్రయత్నిస్తూండు. అప్పుడు నీకే తెలుస్తుంది.

నా ఆశీస్సులు

(*CWM* Vol. 4, pp. 352- 53; Vol. 12, p. 52; Vol. 15, p. 399-401; Vol. 2, p. 35; Vol. 7, p. 125; Vol. 15, p. 143)

అనువాదం: ఎ. ప్రభావతి, ఎ వెంకటరామశాస్త్రి

పగలు నువ్వు సాధన చేసి సంపాదించుకున్న ప్రయోజనములు రాత్రి నిద్రలో మాయమైపోవచ్చు. ఎందుకంటె నీ మనోప్రాణికములు నిద్రలోకూడ పనిచేస్తూనే వుంటాయి. క్రిందటి రోజున సాధించి గెలుచుకున్న విషయాలనే మళ్లీ సాధించవలసి వుంటుంది. అనగా ఈ విజయములు కేవలం నీ బాహ్యమనస్సుకు, ఇతర విభాగములకు చెందినవి మాత్రమే. కాని అంతరంగికంగా దాగివున్న అజ్ఞానాంధకారాలు మట్టుకు అలాగే వున్నాయన్న మాట. నిద్రలో నువ్వు ఈ అచేతన సీమలలో (unconscious) కి ప్రవేశింటుం వలన ఇంతకు ముందర నువ్వు కష్టపడి ఆర్జించిన లాభములు మాయమైపోతాయి.

Be Conscious! Be Conscious of the night as well as of the day.

(*CWM* Vol. 3, p. 15)

సమాచార పత్రం

21 ఫిబ్రవరి 2003 నాడు శ్రీమాత 125 వ జన్మదిన మహోత్స వము జరుపబడినది. భక్తి, కృతజ్ఞతల సంభరితమైన వాతావర ణము ఆశ్రమములో నెలకొన్నది. శ్రీమాతారవిందుల పవిత్రమం దిరముల దర్శనము తెల్లవారుఝామున మొదలై రాత్రివరకు కొన సాగినది. ఆశ్రమ క్రీడాంగణంలో సాయంకాలం కవాతు ప్రదర్శ నము, ఆశ్రమబాండు వాయిద్యము, ధ్యానములతో నాటి వేడుకలు ముగిసినవి. ఆ రోజున శ్రీమాత వర్ణచిత్రముతో కూడిన సందేశ పత్రములు పంచిపెట్టిరి.

I give you the blessings given to all my children wherever they are in the world and tell you, "Prepare yourself, my help will always be with you." – The Mother

What one has to do is to put oneself in the Mother's hands and open oneself to her by service, by bhakti, by aspiration; then the Mother by her light and force works in him so that the sadhana is done. – Sri Aurobindo

నా శిష్యులు ప్రపంచకంలో ఎక్కడున్నా సరే వాళ్లందరికీ నా ఆశీర్వాదములు. "మీరు తయారు అవండి. నా సహాయము ఎల్లప్పుడు మీతోటే ఉంటుంది." – శ్రీమాత

నువ్వు చెయ్యవలసిందల్లా ఒక్కటే. నిన్ను శ్రీమాత కప్పచెప్పు కొని ఆమెను సేవించటం ద్వారా, భక్తి ద్వారా, ఆకాంక్షద్వారా ఆమె శక్తికి నీ ద్వారములు తెరచిపెట్టాలి. అప్పుడామెయే తన వెలుగుతోను శక్తితోను నీలో సాధన చేస్తుంది. – శ్రీఅరవిందులు

మన రాష్ట్రపతి డా॥ A.P.J అబ్దుల్ కలామ్‌గారు ఆశ్రమమును సందర్శించి సమాధికి పుష్పగుచ్ఛము లర్పించిరి. శ్రీమాతారవిం దుల పవిత్రమందిరములు దర్శించి, కొంతమంది విద్యార్థులతో

12/5/2003



మనస్సును విశాలపరచటమెలా?

అఖిల

అఖిల భారత పత్రిక మే 2003

మనస్సును విశాలపరచటమెలా?

శ్రీమాత ప్రవచనములు

శ్రీఅరవిందుల ప్రవచనములు

అక్టోబరు 25, 1914 ఒక ప్రార్థన

శ్రీమాత

నేను నీ కోసం తపించిపోతున్నాను. ఆ తపన (aspiration) తీవ్రమై ఓ సుగంధ సుమధుర గులాబీ పుష్పముగ రూపురేఖలను దిద్దుకున్నది. ఆ పుష్పమును హృదయపూర్వకముగా నీ కర్పించి నిన్నిటుల వేడుకొనెదను. నా అవగాహన సంకుచితమైనచో దానిని విస్తృతమొనర్చుము. నా జ్ఞానము అస్పష్టమైనచో దానిని ప్రదీప్తమొనర్చుము. నా హృదయంబు తీక్షణత లేక శూన్యమైయున్నచో నద్దానిని రగుల్చుము; నాదు ప్రేమాభిమానము అనర్థమైనచో, నద్దానిని తీవ్రత నొందించుము; నా భావనలు అజ్ఞానంబై, అహంకార పూరితములైనచో వాటిని సత్యచైతన్యములు గావించుము. మిమ్ముల ను అడిగెడి ఈ 'నేను' కేవలం ఒక వ్యక్తే కాదు – పృథ్వి యావత్తు మిమ్ము పరిపూర్ణ మనఃపూర్వకతతో కాక్షించెడిది. నాదు పరిపూర్ణ ప్రశాంత ధ్యానమ్మున సర్వమును అనంతమునకు విస్తరించుకొనును. ఆ ప్రశాంతత యందు నీవు దేదీప్యమానంబగు తేజస్సుతో సాక్షాత్కరించెదవు.

(*CWM* Vol. 1, p. 264)

అనువాదం: సునీతి పంతులు

మనమెందుకు అర్థం చేసుకోలేము?

శ్రీమాత

ఇది మనిషికి మనిషికిగల భేదానికి గురించిన విషయము. ఒక్కొక్కరిది ఒక్కొక్క లోకం. ప్రతివ్యక్తి తన ఆలోచనలకు బందీ అయిపోయివుంటాడు. కాని విశాలచేతస్కుడు ప్రపంచాన్నంతా అర్థం చేసుకోగలడు. ఈ ప్రపంచంలో ఎప్పుడూ కొత్తదనం వుంటుంది. ఎందుకంటె అది ముందుకు సాగిపోతూ వుంటుంది. దాన్ని గురించి మనం తెలుసుకోవాలి, — సంపాదకుడు

ఒక్కొక్క మనిషిది ఒక్కొక్క తత్త్వము. అతని ఆలోచనా సరళి వేరు. ప్రతి మనిషీ మాటలలోను, భావాభివ్యక్తిలోను, ఫీలింగ్స్‌లోను, అర్థం చేసుకోటంలోను ఈ భేదము, ఈ ప్రత్యేకత కనపడుతుంది. ఈ విభిన్న లక్షణాల సంపుటే మనిషి. ప్రతి వ్యక్తీ తన దృక్పథం ప్రకారమే అర్థం చేసుకుంటాడు. నువ్వు నీ ప్రత్యేకతలో మూసుకుపోయి వున్నంతవరకు బాహ్యాప్రపంచాన్ని తదనుగుణంగానే అర్థం చేసుకోగలుగుతావు. అది నీ చేతనాస్థాయినిబట్టి గూడ వుంటుంది. నీ చేతనలోవున్న విషయాలు మాత్రమే నీకు తెలుస్తాయి. అది చిన్నదిగా, సంకుచితంగా వుంటే నీ అవగాహనాశక్తి కూడ అలాగే వుంటుంది. నీ చైతన్యం విశాలమై, విశ్వమంతా ఆవరిస్తే, ఈ ప్రపంచాన్నే అర్థం చేసుకోగలవు. కొందరి మెదడు, చైతన్యం అక్రూటుకాయ కన్నా చిన్న పరిణామంలో ఉంటుంది. ఈ అక్రూటుకాయలోని పప్పు, మెదడును పోలి ఉంటుంది. ఇటువంటివారు చూస్తారుగాని గ్రహించలేరు. వారి జ్ఞానేంద్రియాలకు ప్రత్యక్షానుభూతి కలిగితే తప్ప వారు దేనినీ అర్థం చేసుకోలేరు. తాము రుచి చూచినది, కన్నది, విన్నది, స్మరించినది మాత్రమే వారికి వాస్తవము. మిగిలినవాటిని వారు నమ్మరు. పైపెచ్చు, మనం చిత్రంగా మాట్లాడుతున్నామంటారు!

నిజం చెప్పాలంటే కొంతకాలం తర్వాత నీకు, 'నాకేమి తెలియదు' అని అనిపిస్తుంది. ఈ ప్రపంచంలో ఎప్పుడు ఏదో కొత్త

దనం కనపడుతూ వుంటుంది. ఎందుకంటే అది నిరంతరం అభి వృద్ధి చెందుతూ వుంటుంది. నువ్వు నేర్చుకోవలసింది, తెలుసు కోవలసింది చాల వుంటుంది.

(*CWM* Vol. 5, pp. 29-30)

అనువాదకులు: ఆర్.ఎల్.ఎన్.శాస్త్రి, ఎ. ప్రభావతి,
ఎ. వెంకటరామశాస్త్రి

మనస్సుయొక్క భ్రమలోనుంచి బయటపడుట

శ్రీమాత

భారతీయ చింతన ప్రకారం జ్ఞానమనగా ఇంద్రియగ్రాహ్యమైన విషయము కాదు – పరోక్షము కాదు. ఒక వస్తువుతో తాదాత్మ్యముజెంది తెలుసుకున్న జ్ఞానమే నిజమైన జ్ఞానము – అది ప్రత్యక్షము. ఒక చెట్టును గురించి నిన్ను చెప్పమంటే దాని ఆకులు, కాయలు మొ॥ వాటిని గురించి మాత్రమే చెప్పగలవు. అదంతా దాని బాహ్యావర్ణన మాత్రమే. దాని ఆత్మను గురించి తెలుసుకోవాలంటే దాని ఆత్మతో నువ్వు సంపర్కము జెందాలి. అది ఇంద్రియాలకు కాని, మనస్సుకు కాని, భాషకు గాని లొంగునది కాదు. ప్రత్యక్షానుభూతి ద్వారా పొందవలసినదే!

– సంపాదకుడు

మనిషి చర్మచక్షువులకు కనపడేదే నిజమని నమ్ముతాడు. అతని తార్కికబుద్ధి కూడ దానినే ధృవపరుస్తుంది. కాని తెర మరుగున వున్న అసలు సత్యము జ్ఞాననేత్రానికిగాని కనపడదు. మామూలు హేతువాదము భేదప్రతిష్ఠితము. అది వస్తువులను వేర్వేరుగా చూస్తుంది. కాని జ్ఞాననేత్రము సర్వ వస్తుజాలమును ఒకే సమగ్ర దృష్టితో చూస్తుంది.

('తలపులు, మెఱుపులు' – శ్రీఅరవిందులు)

శ్రీఅరవిందులు హేతువు, తర్కము, జ్ఞానము మొ॥ విషయాలను గురించి ఇంత వివరంగా రాసేందుకు కారణాలున్నాయి. మనిషిని సర్వసాధారణమైన ఆలోచనల ఊబిలోనుంచి వెలికితీసి ఈ దృశ్యమాన ప్రపంచం వెనుక వుండే సత్యాన్ని ఎత్తి చూపించేందుకే అలా చేసేరు.

మానవుని జ్ఞానము పరిమితము

మనుషులు సర్వసాధారణంగా (ఏ ఒక్కళ్లో ఇద్దరో తప్ప) బాహ్యారంగంలో జరిగే విషయాలను, ఒక్కొక్కప్పుడు అంతరంగంలో జరిగే విషయాలను కూడ స్పష్టంగా చూసి, పరిశీలించి ఏది సత్యమో ఏదసత్యమో తార్కికదృష్టితో నిర్ణయించుకుంటారు. దీనినే వారు జ్ఞానమని అనుకుంటారు. కాని వారు చూసిన విషయములు, స్పర్శించి అనుభవించినదంతా కేవలం పాక్షికము. అది భ్రమయే గాని పూర్ణదృష్టిగాని, సత్యముగాని కాదని వారికి తెలియదు.

"కాని నేను దాన్ని చూస్తున్నాను, ముట్టుకున్నాను, అనుభవించాను కాబట్టి అది తప్పకుండా నిజమే" అని అందరూ అనుకుంటారు.

"కాని నేను దాన్ని చూసేను, ముట్టుకున్నాను, అనుభవించాను కనుకనే అది నిజం కాదు" అని వాళ్లు అనుకోవాలి. ఈ రెండు విభిన్న దృక్పథాలకి పొత్తు ఎలా కుదురుతుంది?

జ్ఞానముయొక్క నిజస్వరూపము

"తాదాత్మ్యమువలన పొందిన అనుభూతే నిజమైన జ్ఞానము. అట్టి జ్ఞానము కలిగినవారిని మాత్రమే జ్ఞాని అనాలి" అని శ్రీఅరవిందులు అంటారు. బాహ్యాచ్ఛాదముల వెనుక దాగి వున్న సత్యమునే మనము జ్ఞానము అనాలి. బాహ్యాజ్ఞానము ద్వారా నిర్ణయించినదంతా భేదప్రతిష్ఠితము. అందువల్లనే దానిని మనం చర్మచక్షువులతో చూచినా, పంచేంద్రియముల ద్వారా స్పర్శించినా, అనుభవించినా దాన్ని గురించి పూర్తిగా తెలుసుకోలేము.

హేతువు భేదములను మాత్రమే చూస్తుంది

హేతువు పనిచేసే విధానమిట్లా వుంటుంది. రెండు వస్తువుల మధ్య భేదమును గుర్తించి దాని ప్రకారం ప్రవర్తిస్తుంది. స్పష్టంగా పరిశీలించి ఆలోచించగలిగే మనుమలు రెండు వస్తువుల మధ్య భిన్నత్వమును స్పష్టంగా చూడగలరు. హేతువు భిన్నప్రతిష్ఠితము. వస్తువుల మధ్యగాని ఘటనలు, సన్ని వేశాల మధ్యగాని భేదములను చూసి తత్ప్రకారంగా తను నిర్ణయించుకుంటుంది.

సర్వమును సమగ్ర పరచునది జ్ఞానము

కాని నిజమైన జ్ఞానము తాదాత్మ్యముల వలన మాత్రమే లభిస్తుంది. ఆ దృష్టికి రెండువస్తువులు వేరైనప్పటికి భేదము లేకుండ పరస్పర పూరకములైన ఒకే వస్తువుగా కనబడుతాయి. అందువలన మన దృష్టి పూర్తిగా మారిపోతుంది. పర్యవసానము కూడ వేరొక విధంగా వుంటుంది.

"Appearances are false – బాహ్యదృష్టికి కనబడేదంతా అసత్యము" అని అనుకున్నంత మాత్రాన అంతా నీకు తెలిసినట్టు కాదు కదా! శ్రీఅరవిందులు చెప్పారు కనుక నీకు నిజంగా అర్థం కానప్పటికి నీ వట్లా అనుకుంటున్నావు అంతే.

కాని నిజంగా నీవు ఒక విషయాన్ని అర్థము చేసుకోవాలంటే దాన్ని చూసి పరిశీలించి ముట్టుకొని రుచిచూచి అనుభవిస్తేగాని సాధ్యము కాదని అనుకుంటావు. కాని నిజానికి నీవు "reversal of consciousness" అంటే ఏమిటో అనుభూతి ద్వారా తెలిసికొంటేగాని నీకసలు విషయం అర్థం కాదు. నీకు ఆ అనుభూతి జరగనంతవరకు నీవు శ్రీఅరవిందుల Aphorisms ని ఎన్నిమార్లైనా చదవవచ్చు. వాటిని నమ్మవచ్చు. అంతమాత్రాన నీవు వాటిని ఎఱిగినట్లు కాదు. బాహ్యప్రపంచాన్ని గురించి తెలిసికొనేందుకు నీకు తెలిసిన ఒకే ఒక విధానము ఈ బాహ్యదృష్టి. నువ్వు చాలా తెలివైనవాడవే కావచ్చు. సూక్ష్మబుద్ధి, జ్ఞానము, సంస్కారవంతుడవే కావచ్చును. నీవు నేర్చుకొన్నదంతా చక్కగ జ్ఞాపకం పెట్టుకొని కూడ వుండవచ్చును.

నిజం చెప్పాలంటే నీవు ఎంతో కష్టపడి విజ్ఞానశాస్త్రం ద్వారా ఎన్నో విజయాలు సాధించవచ్చు. కాని ఏం లాభము? దీని వలన నీ చేతనాస్థాయిలో మాత్రము ఏ మాత్రం మార్పు రాదు. "ఇంతేనా, ఇంత చేసినా కూడ నాలో మార్పు ఎందుకని రాదు? నేను ఈ విధంగా జన్మించాను, పెరిగి పెద్దవాడనైనాను. మంచిశీలాన్ని సంపాదించుకొన్నాను. జీవితాన్ని బాగానే గడుపు కుంటున్నాను. కాని మూలతః నాలో మార్పేమీ రావటల్లేదు. *నేనొక వలయంలో చిక్కుకోపోయి బానిసగా అయిపోయినట్లుగా అనిపిస్తోంది. పరిస్థితులకు లొంగిపోయి అజ్ఞాతశక్తుల చేతిలో ఒక కీలుబొమ్మగా వుండవలసి వస్తోంది"* ఎంత గొప్పవాళ్లైనప్ప టికి ఈ విధమైన బానిసత్వాన్ని తప్పించుకోలేరు. నీవు తెర వెను కకుపోయి అక్కడవున్న సత్యాన్ని చూసి నీవు నీ అసలు స్వరూ పాన్ని కనిపెట్టినప్పుడుగాని నీ జీవితాన్ని పరివర్తింప చేసుకో లేవు.

మనం చదవటంలో ఏమీ లోటు చేయము. అలాగే అర్థం కూడా చేసుకుంటాము. వర్ణించగలము. తెలిసికొనేందుకు ప్రయ త్నిస్తాము. కాని *"ఒక్క క్షణమైనా నిజమైన అనుభూతి"* కలిగితే కోటిపుస్తకభాండారాల ద్వారా పొందలేని జ్ఞానాన్ని పొందగలము.

"మరి ఈ అనుభూతి పొందడం ఎలా?" అనేదే ప్రశ్న.

నీవు నీ అంతరంగంలోకి ప్రవేశించటం మొదటి మెట్టు

ఒకసారి ఎప్పుడైతే నీ అంతరంగంలోకి ప్రవేశించావో అప్పుడు లోతులను స్పృశించి ఆ చైతన్యాన్ని పొంది క్రమక్ర మంగా విస్తృతమై విశాలపరచుకొని ఈ విశ్వమంత పరిమాణాన్ని పొంది, అన్ని అవధులను దాటిపోవాలి.

ఈ రెండు ప్రక్రియల ద్వారా నీకు కొంత అవసరమైన శిక్షణ లభిస్తుంది.

And these two things must be done in the greatest possible calm, peace and tranquillity. This peace, this tranquillity brings about silence in the mind and stillness in the vital.

ఈ ప్రయత్నాన్ని నిరంతరాయంగా కొనసాగించవలసిందే. ఈ ప్రక్రియలు మళ్ళీ మళ్ళీ చెయ్యాలి. కొంతకాలం తర్వాత బాహ్య దృష్టికి గోచరించే సత్యముకంటె భిన్నమైన మరొక సత్యము అనుభవములోకి వస్తుంది. ఇది కొంచెం కాలమైనా లేక ఎక్కువ కాలమైనా పట్టవచ్చు.

కాని ఒకవేళ అదృష్టవశాత్తు దైవానుగ్రహంకలిగి, అంత రంగంలోని తెర తొలగి, పరమసత్యము అనుభూతి కావచ్చును. కాని అలా జరిగినా కూడ నువ్వు నిరంతరం అంతరంగికంగా గ్రహణసామర్థ్యమును కలిగే వుండాలి. అందులకు నువ్వు ప్రతి రోజు కొంతసేపు అంతరంగంలోకి తప్పకుండా ప్రవేశించాలి.

*

జీవితంలో అటువంటి ఉన్నతజ్ఞానము కలిగేంతవరకు నువ్వు నీ బుద్ధి ననుసరించియే మామూలు జీవితం గడపాలి. అలా చేయని యెడల నువ్వు ఉన్నతజ్ఞానము కలిగే బదులు ప్రాపంచిక జీవి తానికి కూడ అనర్హుడవు అవుతావు. కాని నీ బుద్ధిని వుపయో గించి నీ అధోవృత్తులను (క్షుద్రవ్యాపారములు) నియమించవల సిందే. నువ్వా స్థాయిని దాటదలుచుకుంటె, సాధారణమైన బాహ్య దృష్టిని దాటిపోవాలనుకున్నప్పుడు, నీ మామూలు వివేకాన్ని రద్దుపరచకూడదు. దాన్ని ఒక సోపానముగా వుపయోగించి ఉన్నత జ్ఞానంవైపు పయనించాలి. ఉన్నతమైన మహోన్నతమైన దివ్యజ్ఞానమునుండి దిగివచ్చే సత్యములను నీ ఉన్నత జ్ఞానంతో గ్రహించాలి.

(*CWM* Vol. 10, pp. 17-20, 15)

అనువాదం: ఆర్.ఎల్.ఎన్.శాస్త్రి, లక్ష్మీప్రసాదమ్మ

సృష్టి రహస్యాలు ఎలా తెలుస్తాయి?

శ్రీమాత

సృష్టిరహస్యాలు మానసిక శోధనకు దొరికే విషయములు కావు. ఎవరో అన్నట్లు 'అటునుంచి నరుక్కోరావాలి'. ఈ మనస్సును పక్కన బెట్టి హృదయంతో, 'అభీప్స' తో పైకెగసి అక్కడ వుండే కప్పులో తూట్లు పొడవాలి. నీకు జ్ఞానం కలిగేంతవరకు ఈ ప్రక్రియను పట్టుదలతో కొనసాగించాలి. అప్పుడే నీ చేతన విశాలమై నీ అవగాహన పెరుగుతుంది.

– *సంపాదకుడు*

నీ మానసిక, నైతిక వీక్షణంతో పరికించి సృష్టి ఆవిర్భావాన్ని గురించి తెలుసుకోవాలనుకుంటే అది నీకు ఎన్నటికీ సాధ్యపడదు; ఏ దృక్పథంతో చూసినప్పటికీ అది మంచీ, చెడు మొదలైన నీ భావాల కతీతంగా ఉంటుంది కాబట్టి దాని స్వరూపాన్ని నీవు విశదీకరించలేవు. ఈ విషయంలో మనం పూర్తిగా అవిద్యాకూపంలో ఉన్నట్లే. అది అలా ఎందుకుంది అని ప్రశ్నించుకుంటే అది ఎప్పుడూ అలానే ఉందని సరిబెట్టుకోవాలి తప్ప ఎవరూ దాన్ని విడమర్చి చెప్పలేరు. ఎవ్వరైనా వివరించినప్పటికీ అది అవిద్యాంధకారంలోనుంచి చెప్పినదే కాబట్టి దానివల్ల ఏమీ విశదం కాదు.

నీ మనస్సు ఒక దాన్ని గురించి వివరించాలనుకుంటే దాన్ని ఇంకొక విషయంతోనూ, దాన్ని వివరించాలంటే వేరొక దాంతోనూ వివరిస్తూపోతే జగత్తంతా చుట్టి బయల్దేరినచోటుకు తిరిగి రావటం తప్ప ఏ విధమైన వివరణ జరగదు. అందువల్ల ఈ అవిద్యావరణలో ఒక రంధ్రం చేసుకొని దాన్లోనుండి బయట పడి ఇంకొక విధంగా పరికించాలి.

అది ఎలా చేయాలి?

ఎలా చేయాలా? దానికి ఆకాంక్ష ఒక్కటే మార్గం. యథార్థం తెలుసుకోవాలనీ, అవగాహనచేసుకోవాలనీ మనస్ఫూర్తిగా నీలో

ఒక తపన కలగాలి. ఆ తపన సంధించిన బాణంలాగా పైకి సూటిగా ఎగసి వెళ్లి అక్కడి కప్పును ఢీకొట్టుకుంటుంది. విజ్ఞానాన్ని మూసివుంచుతున్న ఆ కప్పు చాలా గట్టిగా, మందంగా అభేద్యంగా ఉంటుంది. అది దేన్నీ చొరనీయదు. అందువల్ల నీవు నిస్పృహతో "ఎంత ఆకాంక్షించి ఏం ప్రయోజనం? అది చొరరాని కఠిన మార్గం కదా!" అంటావు. అయితే బండరాయి మీద ఎడతెగకుండా నీటిబొట్లు పడిన వైనాన్ని నీవు వినే వుంటావు. అది కొంతకాలానికి ఆ రాతిని ఛేదించివేసినట్లుగా నీ ఆకాంక్ష కూడా ఆ పైకప్పుని ఛేదించగలదు. నీ ఆకాంక్ష అనే జలబిందువు మాత్రం కిందవైపు రాలటం కాక పైకెగసిపోతుంది. అలా పైకి ఎగసి కప్పును పొడుస్తూంటే ఒక కన్నం ఏర్పడుతుంది. ఆ తాకిడికి అలా కన్నం ఏర్పడగానే అందులోనుంచి దూరి అప్రతిమానమైన వెలుగులోకి చొచ్చుకొనిపోతుంది.

ఈ విధంగా తెలుసుకోవాలనుకున్నప్పుడు పట్టుదల ఉండాలి. ఇటూ అటూ చెదిరి విషయాసక్తితో పాకులాడకుండా సూటిగా పైకెగసిపోయే ఆకాంక్షను ఏర్పరచుకోవాలి. తెలుసుకోవాలనీ, అస్తిత్వం పొందాలని మాత్రం అనుకోవాలి.

ఉన్నతదశకు చేరుకున్నప్పుడు అంతా కాంతిమయమే. వేరే అర్థం చేసుకునేది ఏమీ ఉండదు. అంతా తానుగానే అయిపోయి తెలుసుకునేదంతా తెలుసుకుంటారు.

తల్లీ, అలా తెలుసుకునేది మనలో ఏమై యుంటుంది?

సారూప్యాన్ని బట్టే అది పోల్చుకుంటుంది. నీలో అంతర్గతమైయున్నదాన్నే నీవు సాక్షాత్కరించుకుంటావు. అయితే ఇప్పుడు నేను ఒక అలంకారం చెప్పినట్లు నీకు తెలిసింది కదా! సరిపోయినట్లున్నప్పటికీ అది మాత్రం ఉపమాలంకారమే. అది మనలోనూ, మనకంటే పైనా ఉండటంవల్ల మనకు తెలిసిన భౌతికసూత్రాలతో దాని పరిమాణాన్ని అంచనా వేయాలనుకుంటాము. కానీ తెలుసుకున్నప్పుడు అది పూర్తిగా భౌతికపరిమాణాలకు అతీతమైన పరిమాణంలో ఉంటుంది. ఈ అతీతమైన పరిమాణక్రమం భూమ్యాకాశాలకు అన్వయించదు.

అయితే నువ్వేదైనా అర్థం చేసుకొని దాన్ని చవిచూడా లనుకున్నప్పుడు అది కొద్దిగానో గొప్పగానో నీలో స్థితమై యుండాలి. లేక నీవే దానిలో ఉండాలి. నీకు సూటిగా చెపు తాను. భగవంతుడు నీలో, నీ చైతన్యంలో భాగంగా లేనప్పుడు నీవు ఆయన ఉనికిని గుర్తించలేవు. అది అసాధ్యము. ఎప్పుడైతే పరమాత్మ నీలో ఉన్నట్లూ, నీవు పరమాత్మలో ఉన్నట్లూ అను భూతి పొందుతావో అప్పటికే ఆత్మసిద్ధికి ద్వారం కొంచెం తెరుచు కున్నట్లే. అలా కొద్ది ఓరగానున్న ద్వారం నీలో ఆకాంక్ష రగిలి తత్వజ్ఞానం కోసం ప్రజ్వరిల్లినప్పుడు పూర్తిగా తెరుచుకొని నీకు ప్రవేశం కలిగిస్తుంది. అలా ప్రవేశించగానే 'తత్వమసి' నీ ఉనికి నీకు తెలుస్తుంది. ఇన్నాళ్లూ సత్, చిత్, ఆనందాల నుంచి విడిపో వటంవల్ల కలిగిన విస్మరణ నశిస్తుంది.

ఆ విస్మరణ వల్లనే ప్రతివారూ తమ ఉనికిని గుర్తించ కుండా ఏదో ఒకటిగా అనేసుకుంటారని శ్రీఅరవిందులు చెప్పారు. లోపల ఉన్న పరమాత్మగా కాక ఒక అబ్బాయిగా, అమ్మాయిగా, స్త్రీగా, పురుషునిగా, గుర్రంగా, రాయిగా, రప్పగా, సూర్యునిగా, చంద్రునిగా అనేసుకుంటున్నారు. అలా కాక లోనున్న దైవంగా అనుకుంటే ఈ విశ్వమే ఉండేది కాదు! నేను చెప్పాలనుకున్నది ఇదే.

ఈ సత్, చిత్, ఆనందాల నుంచి వియోగమనే విషయమే ఈ విశ్వానికి కారణభూతమైంది. లేకపోతే ఏమీ ఉండేది కాదు. అయితే ఈ బహుళ విస్తరణవల్ల ప్రయోజనాలనేకంగా పొంది మలుపులన్నీ తిరిగి మళ్ళీ ఆ తత్వంతోనే ఐక్యమయినప్పుడు ఆ ఐక్యత అత్యుత్తమమైనది. దానికి తనంటే ఏమిటో తెలిసింది. అంతా ఏకవస్తువుగా ఉన్నప్పుడు తెలుసుకునేదీ, తెలుసుకోవల సిందీ ఏమీ ఉండదు. అంతా సంపూర్ణమైన ఏకత్వమే అయితే ఏకత్వాన్ని తెలుసుకునేదెవరు? అది కాని వస్తువుగా వేరే ఉన్న ప్పుడే గదా అసలు వస్తువేమిటో అవగాహన అవుతుంది. ఇదే సృష్టి రహస్యం. దైవం తనంటే ఏమిటో తెలుసుకోవాలనుకున్న ప్పుడు అదే సృష్టికి నాంది. తనను తాను విస్తృతం చేసుకున్నాడు.

ఇప్పుడు తనే పరమతత్వమనే జ్ఞానంతో తానుగా ఉండి వినోదిం చాలనుకుంటున్నాడు. అదే ఆయన లీల.

(*CWM* Vol. 7, pp. 238-241)

స్వేచ్ఛానువాదం: ఎ. ప్రభావతి, ఎ వెంకటరామశాస్త్రి

మనస్సును విశాలపరచుట

శ్రీమాత

మానవదృష్టి వేరు. దైవదృష్టి వేరు. మానవజీవితం దేశకాలము లకు బద్ధమై వుంటుంది. కాని దేవుడు దేశకాలముల కతీతుడు. హేతువు, తర్కము మానవ కల్పితములు. భూతభవిష్యద్వర్త మానములు, మంచిచెడులు, తప్పొప్పులు, సంభవాసంభవములు మానవుని ప్రాపంచిక జీవితమునకు చెందిన విషయములు. కాని దైవదృష్టికి అన్ని సంభవములే. అంతా న్యాయమే. అన్ని సమానమే. ఇవన్నీ మానవమాత్రులమైన మన కెలా అర్థమౌ తాయి? ఈ వ్యాసం చదివి చూడండి. – సంపాదకుడు

దైవానికి అసాధ్యమనేదేది ఉండదు కదా అందుకని నువ్వు ఇది సత్యము. ఇది అసత్యము అనే వివక్షత చూపించటం హాస్యాస్పదమే అవుతుంది.

(శ్రీఅరవిందులు, Thoughts and Aphorisms)

అవును ఒకప్పుడు నిజము అనిపించిన విషయము మరొ కప్పుడు నిజం కాకపోవచ్చును. అందుకని నీకు ఇప్పుడు తప్పుగా అనిపించేది ఒకప్పుడు ఒప్పే అయివుంటుంది.

ఒక సాధకుడు: బహుశః 'తప్పు' అనేది వుండదని ఆయన వుద్దేశము.

అవును అంతే. అదే విషయాన్ని మరోవిధంగా చెప్పటమన్న మాట. దానర్థమిది – మనకి తప్పు అనిపించేది కూడ ఒకప్పుడు సత్యమే.

Error is a concept in time.

కొన్ని విషయాలు నిజంగా 'తప్పు' అని అనిపించవచ్చు. అది ఆ క్షణానికి మాత్రమే. నిదానంగా ఆలోచించి చూసినట్లయితే సత్యాసత్యాలను గురించి మనకుండే భావన క్షణికమైనది మాత్రమే.

ఒకసారి ఒకరకంగా వుంటుంది. మరుక్షణంలో అలా వుండదు. మనం వాటిని ఒకదాని తరువాత ఒకటి చూస్తాము కనుక అలా అనిపిస్తుంది. కాని దేవుడు కాలాతీతుడు. *ఆయనకు ఇదంతా తనలోనే ఏకకాలంలో జరుగుతూ వుంటుంది.*

నువ్వే దేవుడివైతే ఎలా వుంటుందో ఊహించుకో. సర్వస్వము నీలోనే వుంటుంది. నీ ఇచ్ఛవచ్చిన క్రమములో వాటిని నువ్వు ఆవిష్కరిస్తావు. భూతభవిష్యద్వర్తమానాలనే భావన వుండనే వుండదు. కాని నీ చైతన్యానికి సమస్తము ఒకేసారి గోచరమౌతూ వుంటుంది. అన్నిటికి సమానమైన వునికి వుంటుంది. ఆయన వీటిని ఏ వరసలోనైనా ఆవిష్కరించవచ్చును. ఇది ఆయనకో వినోదము. అనగా ముందర జరగాల్సింది తరువాత, తర్వాత జరగాల్సిన దానిని ముందర చేస్తాడు. కాని ఈ మానవమాత్రులకు అది అర్థం కాదు కదా! అరెరే ఇదేమి వైపరీత్యము అని అనుకుంటారు. నిజానికి అది విపరీతము కానే కాదు. తన సంకుచిత దృష్టి వలన అలా అనిపిస్తుంది అంతే.

ఇప్పుడు నీకు స్పష్టమైనదని తలుస్తాను. దీన్ని అర్థం చేసుకోవటం ఎంత సులభమో చూసారా. తప్పు, విపరీతము, అసంభవము అనే భావములు దేశకాలములకు చెందినవి.

ఏదైనా ఒకదానిని చూపిస్తూ దానిని ఒకేసారి వున్నది, లేదు అని ఎలా అనగలము? దానర్థమేమిటి?

అవును. మనకు ఒక వస్తువు వుండటం, లేకపోవటం; ఒక సన్నివేశము జరగటం జరగకపోవటం; అవును, కాదు అనేవి ఒకే సమయంలో అసంభవములు. కాని దేవునికి కాలభేదమంటూ లేదు కదా. అందుకని ఆయనకి ఈ అవును కాదులన్నీ ఏకకాలికములు.

చోటు, లేక ఆవరణను గురించి కూడ మనకలాగే అని పిస్తుంది కదా "ఇక్కడ నేను వున్నాను కనుక ఇదే చోటులో నువ్వు లేవు కాని నిజానికి ఇదే చోటులో నేనున్నాను, నువ్వూ వున్నావు, సమస్తమూ వున్నది! (మదర్ నవ్వు) నీకున్న దేశ కాల భావములను ప్రక్కన పెడితేగాని ఇది మనకర్థం కాదు.

ఇది చాల కచ్చితమైన అనుభూతి. కాని నీ చర్మచక్షువు లకు అలా అనిపించదు.

ఒక విషయాన్ని మీకు గుర్తు చేయాలి. ఈ మహావాక్యా లన్నీ కూడ ఏ దృష్టితో రాసారో తెలుసా from the point where the higher mind suddenly emerges into the Supermind. అనగా మామూలు దృష్టి ఇంకా వున్నప్పుడే విజ్ఞానదృష్టి కూడ కలి గింది. అందుకనే ఈ విధమైన అనుభూతి మనకు విపరీతమని పిస్తుంది. పాతదృష్టిని ఇంకా మరచిపోలేదు కాని కొత్తరకం దృష్టి కలిగింది.

(చాలాసేపు నిశ్శబ్దం)

భగవంతుని లీల

కాని నిశితంగా పరిశీలించినట్లయితే ఇదంతా దేవుడు తన కోసమే తను ఆడే నాటకమే అనిపిస్తుంది! ఈ అభివ్యక్తంతా కూడ తను తనతోనే ఆడుకుండే ఆట అని తెలిసిపోతుంది.

ఒక ప్రేక్షకునివలె తనను తానే చూసుకుంటూ వుంటాడు. తనను తాను చూసుకుండేందుకై ఈ దేశకాలములను తాలుస్తాడు. లేనియెడల అది అసాధ్యము. దాని ఫలితమే ఇక్కడ జరిగే ఈ కామెడి. ఇవి ఒక కామెడియే తప్ప మరేమి కాదు.

కాని మనకిదంతా అర్థం కాదు కదా. మనం వట్టి కీలు బొమ్మలం. కీలుబొమ్మలల్లె ప్రవర్తించడం మానేస్తే ఇదంతా ఒక కామెడీయే అని స్పష్టంగా తెలిసిపోతుంది.

కాని కొంతమందికిది విషాదం (real tragedy) అనిపి స్తుంది. అవును ఈ దుఃఖానికి మనమే కారణం. ఈ జీవితాన్ని దుఃఖమయం చేసేది మనమే.

నేనీ విషయాన్ని ఈ మధ్య జాగ్రత్తగా పరిశీలించాను. మనుషులకు జరిగే సంఘటనలు జంతువులకు కూడ జరుగుతే ఏమౌతుంది? చాలా ఆశ్చర్యకరమైన విషయం నాకు తెలిసింది. మనకు దుఃఖాన్ని కలిగించే విషయాలు జంతువులకు ఏమాత్రం దుఃఖాన్ని కలిగించవు! మనుషులతో సంపర్కము చెందిన జంతువులకు మాత్రమే అలా అనిపిస్తుంది. మానవసంపర్కమువలన అవి వాటి సహజలక్షణాలను కోల్పోతాయి. అవి జంతువులకి, మానవులకి మధ్యంతరజీవులన్న మాట. అవి మొదట మానవులలోని దోషాలనే నేర్చుకుంటాయి. దోషాలే తేలిగ్గా అబ్బుతాయి. నిష్కారణంగా అవి కూడ దుఃఖానికి గురౌతాయి.

ఇలా చెప్పుకుంటూ పోతే అనేక విషయాలు విదితమౌతాయి. మృత్యువు సంగతే తీసుకుందాము. దీన్ని కూడ మానవుడు చాల ఘోరమైన విషాదంగా భావిస్తాడు. ఈ మధ్యన నాకీ సంగతి స్పష్టంగా తెలిసింది. నిన్న రాత్రియో మొన్న రాత్రియో సూక్ష్మభౌతిక (subtle physical) లోకంలో గడిపాను. అక్కడ బతికివున్నవాళ్లకి చనిపోయినవాళ్లకి తేడా ఏం లేదు. ఏమాత్రం వ్యత్యాసము లేదు. బతుకున్న వాళ్లూ మనం 'చచ్చిపోయారు' అని అనుకున్నవాళ్లు కలిసివున్నారు. రెండురకాల వాళ్లు కలిసి తిరిగారు, భోజనం చేసారు, ఆడుకున్నారు. ఇదంతా ఒక ఆట మాదిరి చక్కగా సంతోషంగా ఎంతో బాగుంది. అప్పుడు నేను అనుకున్నాను "ఇదిగో వాడు బ్రతికున్నాడు, వాడు చచ్చిపోయాడు" అనే భేదము మానవదృష్టికి అనిపించేది మాత్రమే. తమాషా ఏమిటంటే చనిపోయినవారిని మనం చైతన్యహీనులల్లే చూస్తాము. నిజం చెప్పాలంటే వారి శరీరం చైతన్యవంతంగానే వుంటుంది.

(నిశ్శబ్దం)

Where, where is Error? Where is Error?

అంటే ఏమిటి? ఇందులో అసంభవమైనదేమున్నది? 'భగవంతునికి సమస్తము సంభవమే' అనే విషయము మనకు తెలియదు కాబట్టి మనకలా అనిపిస్తుంది. ఆయన తన కిష్టమొచ్చింది

చేస్తాడు. తన కిష్టమొచ్చిన విధంగా చేస్తాడు. ఇది మన చిన్ని బుర్రలోకి ఎక్కదు. 'ఇది సంభవము, ఇది అసంభవము' అని మనం ఎప్పుడు అనుకుంటూ వుంటాము కాని అది నిజం కాదు. మన బేలదృష్టికి అది సమంజస మనిపించదు. నిజానికి సర్వము, సమస్తము సంభవమే.

(నిశ్శబ్దం)

జీవితమంతా నిరంతర వైభోగమే.

కాని ఈ నాటకాన్నంతా పైనుంచి చూస్తున్న ఆయన ఏం బాధపడడు. ఏం జరగబోతోందో ఆయనకు ముందరే తెలుసు కదా! ఆయనకు తెలియనిదంటూ ఏం లేదు. జరిగినదంతా తెలుసు. వర్తమానకాలంలో జరుగుతున్నది తెలుసు. జరగబోయేది కూడ తెలుసు. ఇదంతా ఆయనలోనే ప్రత్యక్షంగా కళ్లకు కట్టినట్లుగా వుంటుంది. *మనమే పిచ్చివాళ్లం. మనమాడే పాత్ర కూడ మనకు తెలియదు.*

వాళ్లకి తెలియకుండానే ఏవేవో చెయ్యవలసి వస్తుంది. "మనమందరము ఒక నాటకమాడుతున్నాము; కాని దాని మూల మేమిటో, గమ్యమేమిటో, దాని ఉద్దేశమేమిటో మన కసలు తెలియనే తెలియదు" అనే విషయము నాకు బాగా అర్థమౌతోంది. అందుకనే మనం బాధపడతాము. *మనకి ఆ క్షణంలో చేయాల్సిన విషయమొక్కటే తెలుస్తుంది. మనది పాక్షికజ్ఞానము. మన దుఃఖానికి కారణమిదే.* ఒక వేళ నీకంతా తెలుసునే అనుకో, ఇక నీకు దుఃఖమెక్కడిది. అంతా చూసి "ఓహో అదా సంగతి" అని నవ్వుకుంటావు అంతే. అంతా ఒక తమాషా అన్న మాట. ఈ తమాషాని చూసి ఆనందించే శక్తి మనం కోరుకుంటే పొందగలం. కాని మనం అంత కష్టపడలేము.

అదేమంత తేలిక కాదు.

నిజంగా అది అంత తేలిక అయినట్లయితే విసుగుపుడుతుంది కూడ.

ఒక్కొక్కప్పుడు ఈ జీవితమెందుకని ఇంత దుఃఖమయం, అని అనిపిస్తుంది. ఒకవేళ అంతా సంతోషమే అయినా ప్రమాదమే.

ఎందుకంటే అందులో కొత్తదనమేం వుండదు. మనుషులు కష్టాలులేని జీవితాన్ని ఇష్టపడకపోవచ్చు.

బహుశః భూలోకస్వర్గమంటే (earthly Paradise[1]) ఇదేనేమో ఒకానొకప్పుడు మనుషులకు కూడ జంతువులను పోలిన స్వాభావిక జ్ఞానం మాత్రమే వుండేది. అప్పటికి మనస్సు ఇంకా ఏర్పడలేదు. తత్కారణంగా వాళ్లు బుర్ర వేడి చేసుకోకుండా, ఎగురుతూ, గెంతుతూ, ఆడుకుంటూ జంతువుల వలెనే సంతోషంగా జీవిస్తూ వుండేవారు. కాని కొంతకాలం తర్వాత 'ఎక్కడ, ఎందుకు, ఏం చేయాలి, మన గమ్యమేమిటి' అనే ప్రశ్నలు వుదయించినవి.

అంతే! వాళ్ల అమాయిక జీవితాలు, అమాయకమైన సంతోషం అంతమైపోయినై.

(*CWM* Vol. 10, pp. 147-151)

అనువాదం: ఆర్.ఎల్.ఎన్.శాస్త్రి

అన్ని సమస్యలకు పరిష్కారము

శ్రీమాత

యోగసాధనలో నీ చేతనాస్థాయి పెరుగుతుంది. ఇక నీ కెట్టి సమస్య లొచ్చినా నువ్వు ఏ మాత్రం విచారించవలసిన పని లేదు. ఈ అంతరంగంలో నుంచి ఒక శక్తి వచ్చి నీ మనస్సును నిశ్శబ్దపరుస్తుంది. నీ చేత ఏం చేయించాలో అది చేయించి నీ సమస్యను పరిష్కరిస్తుంది. — *సంపాదకుడు*

నీ కెటువంటి సమస్య వచ్చినా సరే నువ్వే మాత్రం కలత చెందకూడదు. నువ్వేమీ చెయ్యనవసరము లేదు. అంతా ఆయనే (Lord) చేసి పెడతాడు. నువ్వాయనను చెయ్యనివ్వాలి అంతే. అంటె

---

[1] ఇది పాశ్చాత్య సాంప్రదాయము

నువ్వాలోచించ నవసరము లేదు. ఎందుకంటే అంతా ఆయనే చేసిపెడతాడు. మనకు నిజంగా చాలా ఆశ్చర్యమయ్యేవిధంగా ఆయన నీ సమస్యలను తీరుస్తాడు!

నీ మనస్సును పక్కన పెట్టి "నిశ్శబ్దంగా వుండు. కదలకు. నన్ను వేధించకు. నాకు నీ అవసరము లేదు" అని గట్టిగా చెప్పాలి. ఇదంతా ఎలా చేయాలో ఆయనే నీకు నేర్పుతాడు. అప్పుడు ఒక తలుపు తెరుచుకుంటుంది. దానిని నువ్వు తెరవక్కర్లేదు. అది బార్లగా తెరచే వుంటుంది! నిన్నెవరో వచ్చి ఆవలి పక్కకు తీసుకొని వెడతారు. ఇదంతా ఇంకెవరో చేస్తారు. నువ్వు చెయ్యనక్కర్లేదు. ఇక నుంచి నువ్వు నీ మనస్సుతో కుస్తీ పట్టవలసిన అవసరముండదు!

అమ్మయ్య! ఇక నుంచి నువ్వు చదివి అర్థం చేసుకోవాలని గాని, బాధపడి తలనొప్పి తెచ్చుకోటమనేదిగాని వుండదు! ...It is absolutely useless, absolutely useless, no use at all, it merely increases the confusion.

అనువాదం: ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

ఆంగ్లమూలం:

There can be no doubt that if you sincerely want to get out of it, it is not so difficult after all: you have nothing to do, you only have to allow the Lord to do everything. And He does everything. He does everything. It is so wonderful, so wonderful!

He takes anything, even what we call a very ordinary intelligence and he simply teaches you to put this intelligence aside, to rest: "There, be quiet, don't stir, don't bother me, I don't need you." Then a door opens – you don't even feel that you have to open it; It is wide open, you are taken over to the other side. All that is done by Someone else, not you. And then the other way becomes impossible.

All this... oh, this tremendous labour of the mind striving to understand, toiling and giving itself headaches !... It is

absolutely useless, absolutely useless, no use at all, it merely increases the confusion.

You are faced with a so-called problem: what should you say, what should you do, how should you act? There is nothing to do, nothing, you only have to say to the Lord, "There, You see, it is like that" – that's all. And then you stay very quiet. And then quite spontaneously, without thinking about it, without reflection, without calculation, nothing, nothing, without the slightest effort – you do what has to be done. That is to say, the Lord does it, it is no longer you. He does it, He arranges the circumustances, He arranges the people, He puts the words into your mouth or your pen – He does everything, everything, everything, everything; you have nothing more to do but to allow yourself to live blissfully.

(*CWM* Vol. 10, pp. 152-153)

శ్రీఅరవిందుల రచనలనెలా అర్థము చేసుకోవాలి?

శ్రీమాత

ఈ పారాయణ కార్యక్రమముల వలనగాని, లేక శ్రీఅరవిందుల విస్తారమైన ఏ ఇతర రచనలనుండిగాని లాభమును పొందవలెనని నీవు అవలంబించవలసిన పద్ధతి: నీ చైతన్యమునంతను ఏకము గావించి, పఠనాంశమునందు లగ్నము చేసుకొని, సావధానచిత్తుడవై యుండుము. మనస్సులో చెలరేగు ఆలోచనలను కొంచెమైన అదుపులో పెట్టుము – పూర్తిగా మౌనము గావించిన మరీ మంచిది – మనస్సును నిశ్చలము గావింపుము. మెదడులో యెట్టి స్పందనలు లేకుండా జేయుము. బుద్ధిని స్థిరపరుచుము. అప్పుడు చిత్తమంతయు సుస్థిరమయి, అద్దమువలె, లేదా నిస్తరంగ

తటాకోపరితలము పగిది అచంచలమగును. *ఈ స్థితిలో నీ వింక ఏమి చేసినా సరే, చదివినా సరే, అది మనస్సువలన మరుగున బడక తిన్నగా ఈ అంతరాళములలోనికి ప్రవేశించును.* చాలా కాలం తరువాత, ఆ లోతులనుండి, తిరిగి పైకుబికి తేటతెల్లముగా విదితమగును. ఈ జ్ఞానము, మామూలుగా చదివి తెలుసుకొను దానివలె గాక, లోనుండి విదితమగు జ్ఞానజ్యోతివలె ప్రకాశించును.

ఇటుల చదివినయెడల, గ్రహణశక్తి అత్యుత్తమస్థాయి నందుకొనును. అటులగాక మామూలు పద్ధతిలో – మనస్సు ఒక ప్రక్కన ఆలోచనలతో ఉక్కిరిబిక్కిరవుతూ – చదివినయెడల, ఆ చదివిన విషయము నప్పటికప్పుడే అర్థము గావించుకొన యత్నించును. అప్పుడు వాటిలో నిక్షిప్తమైన శక్తి, జ్ఞానము, ఆ పరమ సత్యమంతయూ నాలుగింట మూడువంతులు వృధా యగును. మరొక విషయము. *నీలో వికసించిన ఈ జ్ఞానజ్యోతి, నీ ఉనికి నంతటను వ్యాపించి దానిని తేజోమయము గావించును.* అంత వరకు ఓపిక బట్టుము. ప్రశ్నలు వేయకుము. అప్పుడు నీవు చదివిన దంతయు చక్కగా బోధపడును. ఎక్కువ సందేహములుండవు.

(*CWM* Vol. 10, p. 7)

అనువాదము: ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

ఒక మాట వ్రాయుట యథార్థముగ అంత కష్టము గాదు. నీవు నా చెంత వున్నను, లేకున్నను నిశ్చయమైన నా సహాయము నిశ్శబ్దముగనే ఇవ్వబడుచున్నది. ప్రజలు దానిని గ్రహించినను, గ్రహించకున్నను లేదా దానికి కృతజ్ఞులై వున్నను, లేకున్నను దాని ప్రభావము ఫలప్రదమైనదిగనే యుండును.

శ్రీమాత

మనస్సును పునీతము గావించుట

శ్రీఅరవిందులు

లౌకికవిషయములందు లగ్నమైవున్న మనస్సును తద్విషయములనుండి మళ్లించి యోగజ్ఞానమును గ్రహించుటకు సమర్థము గావించుట ఈ వ్యాసమునకు విషయము. శ్రీఅరవిందుల 'యోగసమన్వయము' లోని The Purified Understanding అనే అధ్యాయము నుండి ఎంపికజేసిన కొన్ని భాగము లిందున్నవి.

– సంపాదకుడు

నీ సత్తలోని భాగాలను అన్నిటిని పునీతం చేయటం, ప్రత్యేకించి, జ్ఞానమార్గానికై బుద్ధిని విశుద్ధము కావించటం అవసరం. ఈ సంశుద్ధి, తప్పక సత్యద్వారాన్ని తెరిచే కుంజిక (key). కాని, అన్య భాగాలను విశుద్ధము చేయకుండా, బుద్ధిని పరిశుద్ధం చేయటం అసంభవం. అపరిశుద్ధ హృదయం, అసంస్కృతమైన యింద్రియాలు, పరిశుద్ధం కాని ప్రాణం, బుద్ధిని గందరగోళంలో పడవేస్తాయి. దీని సామగ్రిని అస్తవ్యస్తం చేస్తాయి. దీని నిర్ణయాలను వికృతాలుగా చేస్తాయి. దీని దృష్టిని తమస్సుచేత ఆవృతం చేస్తాయి. దీని జ్ఞానాన్ని దుష్టంగా ఉపయోగిస్తాయి. పరిశుద్ధ దేహము ఈ బుద్ధి క్రియను నిరోధిస్తుంది, ప్రతిబంధిస్తుంది. కనుకనే, సర్వాంగీణమైన పరిశుద్ధి ఆవశ్యకం. ఇక్కడ గూడ, పరస్పరం ఆధారపడి ఉండటం చూస్తాం. ఎందుకంటే మన సత్తలోని ప్రతి భాగంయొక్క సంశుద్ధి, ప్రతి అన్యభాగపరిశుద్ధతతో సంబంధించి ఉంటుంది. ఉదాహరణకు, భావుక హృదయం అధికాధికంగా ప్రశాంతమయ్యేకొద్దీ, అది బుద్ధిని సంశుద్ధం చేయటంలో సహాయకమవుతూ ఉంటుంది. అటు, విశుద్ధీకరింపబడిన బుద్ధి ఆ విధంగానే, అప్పటికే, హృదయగతభావాల మలిన, తమసోచ్ఛన్న వ్యాపారాలలో శాంతి, ప్రకాశాలను స్థాపిస్తుంది. మన సత్తలోని ప్రతి భాగంయొక్క సంశుద్ధికి దాని విశిష్ట నియమాలు ఉన్నప్పటికీ, పరిశుద్ధమైన బుద్ధే, మానవుని అన్య భాగాలను సముచితమైన కర్మ

చేయటానికి ఎక్కువ అధికారిక పద్ధతితో వివశం చేస్తుందని గూడ, మనం చెప్పవచ్చును.

జ్ఞానం చరమ, పవిత్ర, వస్తువు అని గీత చెపుతుంది. అజ్ఞానాంధకారం మన పతనానికి మూలమైనట్లు, ప్రకాశం నైర్మల్యం, సామరస్యాల కన్నింటికీ మూల స్రోతస్సు. ఉదాహరణకు, ప్రేమ హృదయాన్ని శుద్ధి చేస్తుంది. మన భావాలను అన్నింటిని దివ్యప్రేమయొక్క ప్రతిరూపాలుగా పరిణమింపజేయటంతో, మన హృదయం పూర్ణమవుతుంది, కృతార్థం అవుతుంది. అయినా, ప్రేమను దివ్యజ్ఞానంతో పవిత్రీకరించవలసిన అవసరం ఉంటుంది. హార్దికమైన భగవత్ప్రేమ అంధం, సంకీర్ణం, అజ్ఞానాయుక్తం కావచ్చు. అది ధర్మాంధత్వం, అంధకారప్రియత్వం వైపుకి తీసుకొనిపోవచ్చు. చివరికి, మరొక రీతిగా పరిశుద్ధమైనప్పటికీ, అది భగవంతుణ్ణి సీమిత వ్యక్తిత్వంలో తప్ప, మరొకచోట చూడటానికి అంగీకరించక, సత్యమైన, అనంతమైన దివ్యదర్శనం నుంచి వెనుకకు తొలగి, మన పూర్ణత్వాన్ని సీమితం చేయవచ్చు. ఈ విధంగానే, హార్దికమైన మానవప్రేమ కూడ, భావ, కర్మ, జ్ఞానాల వికృతుల వైపుకీ, అతిశయోక్తుల వైపుకీ తీసుకొనిపోవచ్చును. కనుకనే, వీటిని, బుద్ధియొక్క సంశుద్ధి ద్వారా సంస్కరించవలసి ఉంటుంది, నిరోధించవలసి ఉంటుంది.

అయినా, బుద్ధి (understanding) అంటే, అది చేసే సంశోధన (purification) మంటే మన అభిప్రాయమేమిటో, లోతుగా, స్పష్టంగా మనం ఆలోచించవలసి ఉంటుంది. (understanding) శబ్దాన్ని మనం సంస్కృత భాషలోని దార్శనిక శబ్దమైన 'బుద్ధి' అనే పదానికి ఆంగ్లభాషలో లభించే చాలా తగ్గరి పర్యాయవాచకంగా (nearest equivalent) ఉపయోగిస్తున్నాం. కనుకనే, మనం దీనినుంచి ఇంద్రియ-మానస (sense-mind) వ్యాపారాన్ని బహిష్కరిస్తాం. ఆ యింద్రియ-మానస వ్యాపారం ఎలాంటిదంటే, అది అన్ని రకాలైన దృష్టులను (ప్రత్యక్షాలను) భేదమేమీ లేకుండా, అవి సరైనవైనా, కాకపోయినా, వాస్తవ దృగ్విషయాలైనా, లేక వేటినైనా, తన లోపల ముద్రితం (recording) చేసుకొంటుంది.

జ్ఞానాల అనువాదం మాత్రమే అయిన, వీటివలెనే, నిర్ణయానికి, వివేకానికి సంబంధించిన ఉచ్చతర తత్త్వశూన్యమైన విశృంఖల కల్పనల సమూహాన్ని గూడ, బహిష్కరిస్తాం. ఆలోచన లేని సగటు మనిషి మనసులో బుద్ధికి సంబంధించిన పని చేసే, అభ్యాసంగా వచ్చిన, పరవళ్లు త్రొక్కే ఆలోచనల ప్రవాహాన్ని గూడ మనం దీనిలో అంతర్గతం చేయజాలం. కాని, కేవలం అభ్యస్త (అలవాటైన) సంస్కారాలు, కామనలు, పక్షపాతాలు, పూర్వనిర్ణయాలు, అన్యలాభాలు, లేక పరంపరాప్రాప్తాలైన అభిరుచుల అనవరత ఆవృత్తి మాత్రమవుతుంది. అది నూతన నిధితో తనను నిరంతరం సమృద్ధమైందిగా చేసికొనినా సరే, పరిసరం వలన మనలో ప్రవహించే భావనలయొక్క, అధికారపూర్ణమైన, వివేకశీలమైన బుద్ధియొక్క ఆక్షేపం లేకుండా ప్రవేశించటానికి అనుమతిస్తాం.

పశువునుంచి మనిషి వికసించటంలో మిక్కిలి ఉపయోగకరమైనది బుద్ధి అని చెప్పటానికి ఏమీ సందేహం లేదు. కాని, ఇది పశుమనస్సు కంటే ఒక అడుగు మాత్రమే పైన ఉంది. ఇది అర్ధపాశవిక బుద్ధి. ఇది అలవాట్లకు, కామనలకు, ఇంద్రియాలకు దాసి. వైజ్ఞానికమైన, దార్శనికమైన, ఆధ్యాత్మికమైన యే జ్ఞానాన్నైనా అన్వేషించటానికి ఇది యెందుకూ పనికిరాదు. మనం దీనికి అతీతంగా వెళ్లవలసి ఉంది. దీనిని పూర్తిగా పదచ్యుతం (dismissing) చేయుటం, లేక శాంతపరచటం, అథవా, బుద్ధిలోకి రూపాంతరితం చేయుటం ద్వారానే దీనిని సంశోధితం చేయగలం.

బుద్ధి అంటే, ఒక్కసారిగా అవలోకనం, నిర్ణయం, వివేచనం చేసే బుద్ధి అని మన అభిప్రాయం. అనగా, ఇంద్రియజాలం, కామనకు సంబంధించిన, లేక అలవాటుకు చెందిన అంధశక్తిలో లేని అధికారం కోసం, జ్ఞానం కోసం స్వీయ అధికారంతోనే పనిచేసే మానవప్రాణియొక్క వాస్తవమైన బుద్ధి అని తాత్పర్యం. నిస్సంశయంగా, మనిషి నేడు ఉన్నట్లు, అతని బుద్ధి సర్వోత్తమ స్థితిలో గూడ, పూర్తిగా ఈ స్వతంత్రపద్ధతితో, అధికారంగల పద్ధతితో పని చేయదు. కాని, ఇది సఫలం కాకపోవటానికి కారణం ఏమంటే, ఇది యిప్పటికిగూడ, నిమ్నతరమైన అర్ధ-

పాశవిక స్థితితో మిశ్రితం, అపరిశుద్ధము అయి ఉంది. అది తన విశిష్ట క్రియవలన నిరోధింపబడుతుంది. క్రిందికి లాగబడుతుంది. తన పరిశుద్ధస్థితిలో ఇది, ఈ నిమ్నతరగతులలో చిక్కుకొని ఉండ రాదు. ప్రత్యేకించి, తన విషయంనుంచి వెనుకకు తొలగి ఉండాలి. పక్షపాతం లేని భావంతో దానిని పరిశీలించి, ఇతరమైనవాటితో గల సామ్యం, భేదమూలకమైన సాదృశ్యం (analogy), ఉపమానం యొక్క బలంపైన, సమిష్టిలో దానిని సముచితమైన స్థానంలో దానిని ఉంచాలి. చక్కగా పరిశీలింపబడిన తన సామగ్రి ఆధా రంగా, నిగమనం (deduction), వ్యాప్తి (induction), అనుమానం (inference), ద్వారా తర్కవితర్కం చేయాలి. తాను సాధించిన వాటిని జ్ఞప్తిలో ఉంచుకొని, ఒక పరిశోధిత, సునిర్దేశిత (rightly guided) కల్పన ద్వారా వాటిని పరిపూర్ణమైన వాటినిగా చేసి, సమస్తాన్ని ప్రశిక్షితమైన, అనుశాసితమైన నిర్ణయ ప్రకాశంలో చూడాలి. ఇదే బౌద్ధికప్రజ్ఞ. పరిశీలనలు, నిర్ణయాలు, పక్షపాతం లేని తర్కాలు, దాని (బౌద్ధిక ప్రజ్ఞయొక్క) నియమాలు, విశేషతా సూచకమైన (charactersing) క్రియలు అవుతాయి.

కాని, 'బుద్ధి' అనే శబ్దం మరొక గంభీరార్థంలో గూడ ప్రయోగింపబడుతుంది. బౌద్ధిక ప్రజ్ఞ కేవలం నిమ్నతరమైన బుద్ధి, మరొక ఉచ్చతర బుద్ధి కూడ ఉంది. అది ప్రజ్ఞ కాదుగాని, దృష్టి (vision), క్రింద ఉండటం కాదు. జ్ఞానంలో పైన ఉండటం. ఆ దృష్టి[2], పరిశీలింపబడిన సామగ్రి అధీనంలో ఉండి జ్ఞానాన్వేషణ చేయదు. జ్ఞానప్రాప్తిని సాధించదు. సత్యాన్ని మొదటినుంచే తనలో ధరిస్తుంది. ఈశ్వరప్రేరిత (revelatory) అంతఃస్ఫురితమైన (intuitional) ఆలోచనా రూపాలలో దానిని వ్యక్తం చేస్తుంది.

(*SABCL* Vol. 20, pp. 295-97)

అనువాదం: జనస్వామి సుబ్రహ్మణ్య శాస్త్రి (యోగసమన్వయం)

---

[2] భాగవతపురుషుడు (Divine being) అధ్యక్షుడని వర్ణింపబడినాడు. అధ్య క్షుడు అనగా అన్నిటికి పైన పరమాకాశంలో విరాజిల్లుతూ ఉండి వస్తువు లను అధీక్షణం చేసే పురుషుడు. వాటిని పైనుంచి చూస్తూ నియంత్రితం చేసే పురుషుడు.

మనస్సులోని మాలిన్యాలకు కారణాలు, నివారణోపాయాలు

శ్రీఅరవిందుల ప్రవచనములు

బుద్ధియొక్క మాలిన్యానికి ప్రథమ కారణము

బుద్ధిలోని మాలిన్యాలకు మూల కారణం మన ఆలోచనాసరళిని కలుషితపరచే కాంక్షలు లేక కామనలు. మానవుని అహం (నేను అనే భావన) ప్రాణమయ కోశంమీద, మనోమయకోశంమీద అధికారం చేస్తూ ఉంటుంది. ప్రాణిక ఉద్వేగాత్మక కామ్యాలు జ్ఞానసముపార్జనకు అడ్డువస్తే ఆలోచనా ప్రక్రియ వాటికి బానిస అవుతుంది; తగని గమ్యాల వెంటపడుతుంది; అవగాహన కుంటుపడుతుంది; వివేక భ్రష్టత కలుగుతుంది. అవగాహన కోరికలకు, భావోద్వేగాలకు అతీతంగా ఉండాలి. దానికి వాంఛలనుండి సంపూర్ణమైన రక్షణ కలగాలంటే ఇంద్రియనిగ్రహము, మనోనైర్మల్యము సాధించాలి.

మాలిన్యానికి రెండవ కారణము

బుద్ధిలోని మాలిన్యానికి రెండవ కారణము ఇంద్రియాలు కల్పించే భ్రమ, ఆలోచనాప్రక్రియలో ఇంద్రియమానసము కల్పించే విఘ్నాలు. ఇంద్రియజ్ఞానము నిజమైన జ్ఞానము కానేరదు. దాని స్వరూపము నిరంతరం మార్పుచెందుతూ ఉంటుంది. అది ఎప్పటికి సమగ్రమైనది కాదు. కనుక దానిని ఎప్పుడూ యథాతథందా నమ్మటానికి వీలులేదు. దానిని ఎల్లప్పుడూ విశ్లేషిస్తూ దిద్దుకుంటూ ఉండాలి. ఇంద్రియ గోచరమైన సత్యాలకు మూలమైన ప్రకృతిశక్తులను పరిశీలించటముతో విజ్ఞాన శాస్త్రం ప్రారంభమయింది. భ్రమపూరితమైన ఇంద్రియజ్ఞానానికి అందని మూలసూత్రాలను పరిశీలించటముతో దర్శనశాస్త్రాలు ప్రారంభమైనవి. అసమగ్రమైన ఇంద్రియజ్ఞానాన్ని తిరస్కరిస్తూ, దృశ్యమానజగత్తు యావత్తూ ఆ సత్పదార్థముయొక్క లీలా విశే

షంగా భావించటంతోనే ఆధ్యాత్మిక అన్వేషణ ప్రారంభం అవుతుంది.

ఇంద్రియ మానసమును నిశ్చలము చేసి, ఆలోచనా ప్రక్రియను వివేకవంతమైన బుద్ధికి అప్పగించటమే ఆధ్యాత్మిక సాధనలోని మొదటి సోపానం.

మాలిన్యానికి మూడవ కారణము

బుద్ధిలోని మాలిన్యానికి మూడవ కారణం బుద్ధిలోనే ఉత్పన్నమౌతుంది. అంతా ఒక్కసారే తెలుసుకోవాలన్న ఆత్రుత సదవగాహనకు అడ్డుపడుతుంది. అంతే కాకుండా, పక్షపాతం, వ్యామోహము సరియైన అవగాహనను కుంటుపరుస్తవి. పక్షపాత ధోరణితో కొన్ని భావనలనే స్వీకరించి తద్విరుద్ధ భావనలను ఉపేక్షించటము కూడా జరుగుతుంది. మూర్ఖమైన పట్టుదలతో ఒక భావననే గ్రహించి ఇతర భావనలలో ఉన్న సత్యాన్ని గ్రహించకుండా తిరస్కరించే తత్వం. సత్యాన్వేషణలో కొన్ని అంశాలకే ప్రాధాన్యతనిస్తూ, మిగిలిన అంశాలను అంగీకరించటానికి వెనుకాడే స్వభావం, తనకు ఇష్టమైన సిద్ధాంతాలను మాత్రమే పట్టుకొని, ఇతరమైన సిద్ధాంతాలను తిరస్కరించటం, తన అనుభవానికి రాని సత్యాలను పరిశీలించకుండా వదలివేయటం మొదలైనవి అవగాహనాలోపానికి కారణాలవుతూ ఉంటవి. సమదృష్టి, సామరస్యభావన ఇటువంటి లోపానికి తగిన ఔషదం. ఆలోచనాసరళిని రాగద్వేషాలకు అతీతంగా సాగించాలి. పైన చెప్పిన మూడు విధాలైన దోషాలను పరిహరించి, నిర్వికారమైన బుద్ధితో సత్యాన్వేషణను సాగించాలి. పరిశుద్ధమైన అవగాహన వ్యామోహాలకు అతీతం. ఏ ఒక్క సిద్ధాంతానికి అనవసరమైన ప్రాధాన్యతను ఇవ్వకుండా, నిష్పక్షపాతంగా అన్ని భావాలను, అన్ని కోణాలనుంచీ పరిశీలిస్తుంది. అటుల కానియెడల సత్యాన్వేషణలో సమతౌల్యం లోపించి, సంపూర్ణజ్ఞానం లభించదు.

(*SABCL* Vol. 20, pp. 298-300)

అనువాదం: ఎ.యస్.ఆర్. కృష్ణమూర్తి

మానసికజ్ఞానమునుండి అతిమానసవిజ్ఞానమునకు పరివర్తనము

శ్రీఅరవిందుల ప్రవచనములు

ఆత్మజ్ఞానం సిద్ధించాలంటే మనస్సు పూర్తిగా నిస్తరంగం కావాలి. మనస్సుయొక్క నిశ్శబ్దనిశ్చలస్థితి ఒక అద్భుతమైన ఆధ్యాత్మిక స్థితి. దానినుండే జ్ఞానభాస్కరుడు ఉదయిస్తాడు.

— అనువాదకుడు

ఆలోచనారహితమైన మనస్సు

నిర్మలంగా తీర్చబడిన బుద్ధి, చక్కగా ఎటుపడితే అటు మలచటానికి అనుగుణంగానున్న సమగ్రమైన, లోపరహితమైన ఉపకరణంగా, తత్త్వవిచారానికి ఉపయోగపడుతుంది. అధోప్రకృతినుండి ఉద్భవించే విఘ్నాలకు, వికృతాలకు అతీతంగా ఉంటూ, బుద్ధిచేత తెలుసుకోగలిగినంతవరకు సృష్టిరహస్యాల్ని తెలుసుకోగలుగుతుంది. సత్యమైన జ్ఞానం బుద్ధినైశిత్యంచేతగాని, మేధాశక్తిచేతగాని లభించేది కాదు. అది మనోబుద్ధ్యంహాకృతులకు అతీతమైన ఆత్మానుభవము. దానికి మరియొక విధమైన సాధన అవసరం. మన మేధాశక్తి సత్యమైన జ్ఞానానుభూతికి ఆటంకం కాగూడదంటే, చురుకైన మేధ కలిగిన బుద్ధిజీవికి రుచించనటువంటి, అతని ప్రకృతికి విరుద్ధమైనట్టి మనోనిశ్చలత, ఆలోచనారహితమైన ఉదాసీనత (passivity) అలవరచుకోవాలి. అది రెండువిధాలుగా ఉంటుంది.

అతీతజ్ఞాన స్ఫురణ

మనం మొదట భౌద్ధికమైన ఆలోచన చాలదనీ, అదే అత్యున్నత భావనాస్థాయి కాదనీ తెలుసుకొన్నాము. అది తర్కనిరపేక్షమైన సహజస్ఫురణము (intuition) నుండి – అతీతమానసిక స్థాయినుండీ ఉద్భవిస్తుంది. క్రిందిస్థాయిలోని తార్కికబుద్ధికి మనము లోబడి ఉన్నంతవరకూ, మనకు అతీతమానసముయొక్క సహజవాణి

వినబడదు. ఒకవేళ కొద్దిగా వినబడినా, పూర్తిగా వికృతిచెంది ప్రయోజనకారి కాజాలదు. అతీతజ్ఞాన స్ఫురణము కలగాలంటే, మనము ఏ విధంగా, ఇంద్రియజ్ఞానముమీద ఆధారపడి, సంకల్ప వికల్పాలతోను, భావోద్వేగాలతోను కూడిన మనస్సును వివేచ నాత్మకమైన బుద్ధినుండి విడదీశామో, అదే విధంగా సహజస్ఫుర ణమునుండి తార్కికబుద్ధిని విడదీయాలి. ఇది సులభసాధ్యమైన విషయము కాదు. ఎందువల్లనంటే ఆ అంతఃస్ఫురణము సాధార ణంగా తర్కసిద్ధమైన ఆలోచనారూపంలోను లేక భావోద్వేగ రూపంలోను మారువేషం ధరించి మనకి సాక్షాత్కరిస్తుంది. అందు చేత దానిని మనము గుర్తించటము కష్టసాధ్యము. దీనికి విరు గుడు ఏమిటంటే, ముందుగా మనం మన బుద్ధికి అంతఃస్ఫుర ణాన్ని గుర్తించే విధంగా శిక్షణ ఇవ్వాలి. మనం తార్కికంగా ఒక నిర్ణయానికి వచ్చిన తర్వాత, ఆ నిర్ణయాన్ని ప్రక్కన పెట్టి, అతీత జ్ఞాన స్ఫురణ కొరకు నిశ్శబ్దంగా ఎదురుచూడాలి. ఈ విధంగా మనం తార్కికమైన బుద్ధితో చేసే నిర్ణయాలను అతిమానసికమైన అంతఃస్ఫురణతో, దివ్యజ్ఞానంతో మలచుకొనవచ్చును. ఆదర్శం గానయితే ప్రతి నిర్ణయము దివ్యస్ఫురణముగానే ఉండాలి. అది సర్వత్రా సాధ్యపడకపోయినా, చాలావరకు అలా ఉండేటట్లు చూడవచ్చును. మన మనోబుద్ధులకు పైన విలసిల్లే ఆ దివ్యతేజ స్సునుండి వచ్చే ఆదేశాల ప్రక్రారం మన జీవితవిధానాన్ని నడు పుకోవాలి.

మనోబుద్ధుల నిశ్శబ్ద నిశ్చలస్థితి

ఆత్మజ్ఞానం సిద్ధించాలంటే మనస్సు పూర్తిగా నిస్తరంగం (ఆలోచనలను, తర్కవితర్కాలను పూర్తిగా త్యజించటం) కావాలి. మనోబుద్ధులు పూర్తి నిశ్శబ్ద, నిశ్చలస్థితిని పొంది నప్పుడే ఆత్మ ప్రకాశిస్తుంది. ఆలోచనలన్నింటినీ ఆపివేయటం అనేది పాశ్చాత్య విద్వాంసులకు అర్థమయ్యే విషయం కాదు. భగవద్గీతకూడా ఈ ఆలోచనారాహిత్య శక్తిని గురించి చెప్పింది.

ఆత్మసాక్షాత్కారం

మనస్సు ఆలోచించకుండా ఉండే ఉదాసీనతను (passivity) దాని బల

హీనతగా భావించరాదు. అదే దాని శక్తి. మనస్సును స్వాధీనం చేసుకొన్నవాడే మనీషి. మనస్సుయొక్క నిశ్శబ్ద, నిశ్చలస్థితి ఒక అద్భుతమైన ఆధ్యాత్మికస్థితి. దానినుండే జ్ఞానభాస్కరుడు ఉదయిస్తాడు. మనస్సు పూర్తిగా నిశ్చలమై, అలల కదలికలేని స్వచ్ఛమైన నౌసారంవలె, సంపూర్ణమైన శాంతస్థితిలో ఉన్నప్పుడే ఆత్మసాక్షాత్కారం లభిస్తుంది. అట్టి నిశ్చల నిశ్శబ్దస్థితినుండే సమస్తజాలము ఉత్పన్నమౌతుంది. సంపూర్ణమైన నిశ్శబ్దంలోనే 'నీరవం' అనుభూతమౌతుంది. **In a complete silence only is the Silence heard;** ఇదే అపరోక్షానుభూతి, పరమశాంతి, ఉపనిషత్తులు చెప్పిన *తత్* శబ్దంయొక్క అర్థం, నిశ్శబ్దం, శాంతి – పరిపూర్ణశాంతి అని మనకు తెలుస్తుంది.

(*SABCL* Vol. 20, pp. 301-02)

అనువాదం: ఎ.యస్.ఆర్.కృష్ణమూర్తి

చిన్ని అహంత

శ్రీఅరవిందులు

విశ్వమాత కల్పించు నొక చిన్ని అహంత,
ప్రకృతి చేతల యీ చిన్నారి లాభకారి,
విశ్వసించె నామె యాతని వమ్మను, మోసపోయెనామె,
తనదని వారించె నామె, తప్పించుకొనియె నతండు ఋణము దీర్చక.

అహంత నింపుకొనియె మనదు జీవన చేష్టలను;
ఒక్కొక్క నూలుపోగున ప్రాణిక అల్లికలు కలిపినేయంగ,
మనదు స్వార్థరాహిత్యమ్మను ప్రజ్ఞలు బలుకంగ
అపహరించునది మనదు నిమ్నస్థితిని; వదలదది శూన్యస్థితిన్,

మనదు అంతఃకరణాత్మా దేహ మానసమ్ముల,
తమకివ్వదగిన బాట యొకటున్నది,
విశ్వాతీతమునందు నిలుచునొకరీతిని తనదు జీవనకై,
అంత, వెలుగులో మరుగాయె, తుచ్ఛమంత్రంబును వివర్ణపఱచున్.

ప్రకృతి నివృత్తి జెందు తనదు తిరుగుబాటునన్,
అంత జీవాత్మ అనంత ప్రసన్నతన విరామమొందు.

(*SABCL* Vol. 5, p. 146)

అనువాదము: సునీతి పంతులు

సమాచార పత్రం

'సావిత్రి' అధ్యయన శిబిరం ఫిబ్రవరి 23 నుండి మార్చి 5 వరకు సొసైటీ బీచ్చాఫీస్‌లో జరిగింది. డా॥ నడ్కర్ణిగారు Book 12 (ఉప సంహారమును) చదివి వివరించారు. తరువాత మొత్తం సావిత్రి నంతను సమీక్షించారు. వారి తదుపరి కార్యక్రమములు:

(1) 26-11-2003 నుంచి 4-12-2003 వరకు: గీతావ్యాసములు

(2) 23-2-2004 నుంచి 5-3-2004 వరకు: సావిత్రి Book 1

ఆంధ్రప్రదేశ్ 8 వ రాష్ట్రమహాసభలు 8, 9 ఫిబ్రవరి తేదీలలో వరంగల్‌లో జరుపబడినవి. 250 కంటె ఎక్కువగా ఈ సభలలో పాల్గొనిరి. శ్రీయుతులు బి. వెంకట్రామయ్యగారు, డా॥ మంగేష్ నడ్కర్ణి, కిట్టురెడ్డి, ఆర్.వై. దేష్‌పాండే, డా॥ శ్రీమతి పేమానంద్‌కుమార్, ప్రదీప్ నరంగ్‌గార్లు ఉపన్యాసముల నిచ్చిరి. ఈ సభలలో చర్చించిన ముఖ్యవిషయములు సమగ్రవిద్య, స్త్రీలు, యువత. భువనేశ్వర్‌లో గోపాల్ భట్టాచార్జీగారు ఫిబ్రవరి 1 వ తారీఖున 'శ్రీమాత అవతరణకు కారణము' అనే విషయముపై ప్రసంగించారు. ఒరిస్సాలోని ఇతర ప్రాంతములను కూడ వారు దర్శించారు. చెన్నైలో శ్రీమతి విజయ శంకర్ నారాణన్‌గారు స్త్రీల విభాగమును నడిపి

స్తున్నారు. మదుర (తమిళ్‌నాడు), రాయపూర్ (ఛత్తీస్‌గడ్) లలో నూతన కేంద్రములు స్థాపించబడినవి.

NEXT FUTURE – A new monthly Magazine of the Society:


ఫిబ్రవరి 2003 నుంచి శ్రీఅరవిందో సొసైటీ "Next Future" అనే ఒక కొత్త e – పత్రిక ప్రారంభించారు. "Next Future" అనే పేరు 1971 లో శ్రీమాత పెట్టినదే; ఇది శ్రీమాత 125 వ జన్మ వార్షికం కావటం కూడ విశేషం.

"Next Future" consciously seeks to express the best, the highest, the widest and the deepest in human nature; the beauty, harmony, strength and courage of the spirit. It will contain articles on a variety of topics and themes. But more than a journal it will be a movement and a vehicle to bring together all those who are aspiring for and would like to participate in the building of a new, happier and better world. Therefore your enthusiasm, your ideas and suggestions, your participation in every way will be of the utmost importance. The website address of Next Future is:

http://nextfuture.sriaurobindosociety.org.in

Cease inwardly from thought and word, be motionless within you, look upward into the light and outward into the vast cosmic consciousness that is around you. Be more and more one with the brightness and the vastness. Then will Truth dawn on you from above and flow in you from all around you.

Sri Aurobindo



శ్రీఅరవిందుల ప్రవచనములు

జ్యోతిషము

ప్రేమ, కామము

ఋషి బంకించంద్రుడు

ప్రజాస్వామ్యము

అఖిల

అఖిల భారత పత్రిక జూన్ 2003

విషయసూచిక

7/6/2003

ప్రశ్నోత్తరములు

వందేమాతరం

Spirituality is India's only politics, the fulfilment of the Sanatana Dharma its only Swaraj. I have no doubt we shall have to go through our Parliamentary period in order to get rid of the notion of Western democracy by seeing in practice how helpless it is to make nations blessed.

Sri Aurobindo

జ్యోతిషము, విధి, కర్మ

జ్యోతిషము నిజమౌనా కాదా? ముందర చెప్పిన విషయాలు కొన్ని చెప్పినవి చెప్పినట్లుగానే జరుగుతాయి. దీనినే విధి, తల రాత అని అంటారు. కాని నక్షత్రాలే మన జీవితాన్ని నిర్ణయి స్తాయి అనే భావము సత్యము కాదు. నిజానికి ఒక కార్యము నెరవేర్చుటకై దైవము ఒక శక్తిని పంపిస్తాడు. తత్ఫలితంగా కొన్ని పరిస్థితులు ఏర్పడతాయి. నక్షత్రాలు ఈ పరిస్థితియొక్క సూచనలనిస్తాయి అంతే. కాని మనిషి ఆ పరిస్థితులను మార్చ గలడు. అందుకనే జ్యోతిషము ఎప్పుడు నూటికి నూరుపాళ్లు నిజం కాదు. ఆధ్యాత్మికప్రక్రియలవలన యోగశక్తి వచ్చి మనిషి తలరాతను కూడ మార్చివేయగలదు. — *సంపాదకుడు*

భవిష్యత్ సంఘటనలను గూర్చి ముందుగా చెప్పడం సాధ్య మేనా? జీవితం ముందరే నిర్ణయింపబడి ఉంటుందా? [1]

మానవజీవితంలో ముందుగా చెప్పతగిన అంశాలు వివరంగా కొన్ని, స్థూలంగా మరికొన్ని ఉంటాయన్నది సుస్పష్టం. కాని జీవితమంతా ముందరే నిర్ణయింపబడి వుంటుందని, అంతా నీ తలవ్రాతేనని అనుకోవడం నిజం కాదు.

ప్రఖ్యాత జ్యోతిష్కుడు కీరో (Cheiro) చెప్పిన సంఘటనలు చాలావరకు నిజమైనవి. ఇదెలా సాధ్యమైంది?

కీరో భావాలమీద, భవిష్యత్ జ్ఞానం పైన విశ్వాసం పెట్టుకో వడం తప్పు. ఆయన చెప్పినవి కొన్ని నిజమైనాయి కాని చాలా వరకు జరగలేదు. నిజానికి నిజంకాని సంఘటనల సంఖ్యే అధి కము. అందువల్ల కీరో చూపిన ఆధారాలనుబట్టి, సర్వమూ ముందు

---

[1] ఇందులోను, తరవాత నాలుగు వ్యాసాలలోను, కొన్ని ప్రశ్నలను కిశోర్ గాంధీగారు తయారుచేసి, జవాబులను శ్రీఅరవిందుల రచనలనుండి సేకరిం చారు. ప్రచురించడానికి ముందు పరిశీలించి, ఆమోదించడానికి వాటిని శ్రీఅరవిందులకు సమర్పించగా (1949-50) వారు కొన్ని సవరణలు చేశారు.
— సంపాదకుడు

గానే నిర్ణీతమైనదనిగాని, ప్రతి ఒక్కరి జీవితము, సన్నివేశము నక్ష త్రాలచే ముందుగానే కచ్చితంగా నిర్ణయింపబడి ఉంటాయనిగాని నిర్ధారించుకోలేము.

జ్యోతిశ్శాస్త్రవేత్తలు ముందుగా చెప్పిన అనేక సంఘటనలు నిజమైనవన్నది జగద్విదితమే. దీనినిబట్టి చూస్తే నక్షత్రాలు మన భవితవ్యాన్ని శాసిస్తున్నట్లు ఋజువుకావడం లేదా?

భవిష్యత్ సంఘటనలపై జ్యోతిష్కులు చేసిన మొత్తం ప్రకటనల నన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే, వాటిలో చాలావరకు నిజ మయ్యాయని ఒప్పుకోక తప్పదు. కాని దాని అర్థం నక్షత్రాలే మన భవితవ్యాన్ని నిర్దేశిస్తాయని కాదు. అంతకు ముందే రూపొం దిన భవితవ్యాన్ని నక్షత్రాలు కేవలం నమోదుచేస్తాయి అంతే. వాటిని ఒక ప్రతీకగా మాత్రమే భావించాలి. వాటికి శాసించే శక్తి లేదు. లేదా ఒకవేళ వాటికీ శక్తి వున్నదని అనిపించినా, ఆ శక్తి వాటికి చెందినది కాదు. అవి వేరొకశక్తికి వాహికములు మాత్రమే. ఒకవేళ భవితవ్యాన్ని నిర్దేశించే శక్తి ఏదో ఉన్నదనుకున్నా నక్ష త్రాలు దానికి సూచికలు మాత్రమే.

కొందరు వ్యక్తుల విషయంలో ఒక వయస్సువరకు మాత్రమే జ్యోతిష్కుల అంచనాలు నిజమవుతాయి; తరువాత కావు. ఎందుచేత? భవిష్యత్సంఘటనలపై ప్రవక్తలు ముందుగా చెప్పిన వాటిలో కొన్ని మాత్రమే అక్షరాలా నిజమవుతాయి. మరికొన్ని పాక్షికంగానో పూర్తిగానో విఫలమవుతాయి. దీనికి కారణం?

ఔను, తరచు అలాగే జరుగుతుంది. కాని, అంతమాత్రంచేత భవి ష్యత్ జ్ఞానం అబద్ధం కాదు. అంతా యాదృచ్ఛికమనో, కాకతాళీ యమనో కొట్టిపారేయలేము. భవిష్యత్ సంఘటనల నిజనిజాలు జ్యోతిష్కుని అంతఃశక్తిపై ఆధారపడి వుంటాయి. అది అతనిలో ఒక్కొక్కసారి పనిచేస్తుంది. ఒక్కొక్కసారి విఫలమవుతుంది. మొత్తానికి భవిష్యత్ సంఘటనలు కొన్ని మాత్రమే ముందుగా చెప్పడం జరుగుతుంది. ఒక ప్రవక్తకు ఒక నిర్దిష్టభూమికతో సంబంధం వున్నంత కాలం అతను చెప్పినవి నిజమవుతాయి. ఆ

సంబంధం లేకపోతే కావు. All the same, one may say, there must be, if things are predictable at all, some power or plane through which or on which all is foreseeable; if there is a divine Omniscience and Omnipotence, it must be so.

Is human will entirely helpless before Fate or destiny?

దైవ, పురుషకార శక్తులు (fate and individual energy) అని రెండుశక్తులున్నట్లు జ్యోతిషవిద్వాంసులే ఒప్పుకుంటారు. పురుష కారశక్తి విధిని (fate అనే పదానికి దైవం, దైవికం అని శ్రీఅర విందుల అనువాదం) మార్చివేసి, నిర్వీర్యం చేయవచ్చునని వారు చెబుతారు. విధి నిర్ణయించినదానిని మార్చుకోవచ్చును. అసాధా రణశక్తుల ఖేలనంలో ఇది ఒక భాగం. ఈ ఖేలనంలో నియమా లను మార్పుచేయలేని కఠినత్వం ఏదీ ఉండదు. అటువంటి శక్తు లలో వ్యక్తి సంకల్పం లేదా వ్యక్తిప్రయత్నం ఒకటి. "మీరెందుకు విధిని నమ్ముతారు? అయినా మీరు వ్యూహాలు వేసుకుని కార్య క్షేత్రంలోకి దిగుతుంటారు ఎందుకు?" అని నెపోలియన్ చక్రవర్తిని అడిగినప్పుడు –

"నేను వ్యూహాలు రచించి, కార్యరంగంలోకి అడుగుపెట్టా లని విధి నిర్ణయించింది కాబట్టి" అని ఆయన సమాధానం చెప్పాడు! మరోలా చెప్పాలంటే, ఆయన వ్యూహాలు, కర్తృత్వం విధిలోని భాగాలు, ఫలితాలను కూడా విధి ముందుగానే నిశ్చయి స్తుంది.

విధి (fate) అంటే వివరణ ఇస్తారా?

విధి అంటే భారతీయుల దృష్టిలో కర్మ (karma) అని అర్థం. మన కర్మల (actions) ద్వారా మనమే మన జీవితాన్ని నిర్ణయిం చుకుంటాము. మన కర్మ మనల్ని బంధిస్తుంది. మనం చేసే కర్మ ఫలితాలను ఈ జన్మలోనో, మరో జన్మలోనో అనుభవించి తీరాలి.

మన గతజన్మల కర్మలు ఏమైనప్పటికీ వర్తమాన జీవితంలో దానిని మార్చుకోలేమా?

ఎందుకు మార్చుకోలేము? పూర్వజన్మలకు సంబంధించిన కర్మలను ఈ జన్మలో అనుభవిస్తూనే, మన భవిష్యబాటను

రూపొందించుకోగలము. కర్మయనగా మానవుని ఒక యినప చట్రంలో బిగించునది కాదు. ఈ కర్మసిద్ధాంతము ఐరోపా తాత్త్వికులకు అర్థంకాని విషయము

గత కర్మ ఫలితాలను మనం అనుభవించి తీరవలసిందేనా?

వాటి దుష్పరిణామాలను నివారించలేమా?

వర్తమానంలో మన సంకల్పంద్వారా, మన చర్యలద్వారా గతకాలపు కర్మ (karma) ను రద్దు చేయడం, మార్చడం అసంభవం కాదు. ఉత్కట కర్మవంటి కొన్ని అతిబలీయమైన కర్మ ఫలాలు మార్పుకు లొంగవు. ఉదా॥ ఆధ్యాత్మిక చైతన్యం గత జన్మల కర్మను రద్దు చేయగలదు. అప్పుడు మనం విశ్వజనీన, విశ్వాతీత భగవత్ సంకల్పంతో సాయుజ్యం చెందుతాం. సృష్టించినదానిని రద్దు చేసే శక్తి దానికి వుంటుంది. కర్మ (karma) యొక్క సంకుచితమైన నిర్ణీత చట్రాలను అది పటాపంచలు చేస్తుంది. కాని కర్మకానీ, జ్యోతిషంకానీ కఠోరమైన, అప్రతిహతమైన విధి వుందని చెప్పడం లేదు.

(*Lights on Life Problems* by Kishore Gandhi, 1987 ed. pp. 3-5)

అనువాదం: కె. యజ్ఞన్న

*

O man, the events that meet thee on thy road,
Though they smite thy body and soul with joy and grief,
Are not thy fate, – they touch thee awhile and pass;
Even death can cut not short thy spirit's walk:
Thy goal, the road thou choosest are thy fate.

(*Savitri*, p. 458)

సుఖము కొరకై ప్రాకులాట

సుఖమే మానవుల ఏకైక లక్ష్యమా? ఇందుకు భిన్నమైన ఉదాహరణలు మనం చూస్తూనే వుంటాము. ఎందుకని? ఏమాత్రం అవరోధములేని నిరంతర సుఖం మనుషులకు రుచించదు; కొంచెం దుఃఖము శోకము అనే నాటకీయత కావాలి. మరికొంతమంది దేశభక్తి కోసమో మరియొక ప్రయోజన మాశించియో కష్టాలు, బాధలు అనుభవించేందుకు ఏమాత్రం వెనకాడరు. చిరునవ్వుతో ఉరికంబం ఎక్కేవాళ్లు ఎంతమంది లేరు?

— సంపాదకుడు

మానవులు చేపట్టే ప్రతి పని వెనుక ఉండే ప్రేరణ, సంతోషము కొరకేనని అంటారు గదా, ఇది నిజమా?

అది సర్వసాధారణముగా మనం చేసే మానసిక ప్రతిపాదన మాత్రమే. వాస్తవాలను విస్మరిస్తే అది 'అంతే' ననిపిస్తుంది. ప్రోత్సాహశక్తిగా తెరవెనుక నిలచేది 'ఆనందమే' అయితే మరి 'లక్ష్యము' అది కాకపోతే, నీవన్నదే కావచ్చు. అది వేదాంతమే గాని మనోవైజ్ఞానిక ప్రతిపాదన అనబడదు. మాటకు, ఒక కమ్యూనిస్టు నాజీ శిబిరాల్లో బందీయై చిత్రహింసకు గురికాబడి నపుడు, అది ఆనందాన్నో సంతోషాన్నో అనుభవించాలని కాదు గదా! మరియొక ప్రయోజనాన్ని ఆశించి అందువలన కలిగే కష్టనష్టాలను ఎదుర్కొనాలనే సంకల్పమువలన కావచ్చు.

కాని చాలమంది సుఖసంతోషాలకై ప్రాకులాడుతూ, సంతోషమే వారి జీవితలక్ష్యముగా అనుకుంటారు గదా?

ఒడిదుడుకులులేని సంతోషస్థితియే మానవుని ధ్యేయము అంటే మాత్రము అది చెల్లదు. అది మానవుని కాంక్ష కావచ్చు. ఒక్క సంతోషమే తమ జీవితలక్ష్యము కానివారు చాలామంది ఉన్నారని గుర్తుంచుకోండి! మానవుని భౌతికచేతన మాత్రమే సంతోషాన్ని కాంక్షిస్తుంది. కాని దుఃఖం పాలు లేని కేవల సంతోషం మానవప్రాణికానికి గిట్టదు! మరి తనకు ఒకవేళ అట్టి సంతోషము కలిగినను కొంతకాలము గడిచేటప్పటికి ఆ స్థితిని సొంతము

ప్రక్కకు నెట్టి, వ్యయప్రయాసలతో కూడిన ఒక సాహసకృత్యము ద్వారా వచ్చే సంతోషము వైపు ప్రాణికము మళ్లుతుంది. అయితే, ప్రతిష్ఠ, వాంఛలు, పదవీ వ్యామోహం మొ॥ కోరికలను తృప్తిపర చటానికిగాను, సంతోషాన్ని త్యాగము చేయటానికి ఉన్నతప్రాణి కము ఎప్పుడూ సిద్ధమే! పేరుప్రతిష్ఠలవలన కలిగే సంతోషము కొరకు కొందరు ఆ విధంగా చేస్తారనుట కూడ నిజము కాదు. వాస్తవానికి అధికారం, సంతోషాన్ని తప్ప తక్కినవాటిని అందిం చగలదు. అధికారం గురించి చెప్పవలసివస్తే, దాన్ని సంపాదిం చటం, నిలబెట్టుకోవటం, సవ్యముగా వినియోగించటం వ్యయప్ర యాసలతో కూడిన విషయం.

ఇంకా ఒక వ్యక్తి తనకు తన జీవితకాలమున పేరుప్రతి ష్ఠలు రావని తెలిసినా, ఏమో ఎప్పుడైనా కలసిరావచ్చును గదా లేక మరణానంతర కీర్తినైనా సంపాదించవచ్చునని అతిగానే ప్రయాసపడతారు. తన వాంఛలను తృప్తిపెట్టునపుడు దానివలన బాధలు, హింస, వినాశనము కలుగుతాయని తెలిసినాకూడా, తన యిచ్ఛనే అనుసరించును. మనస్సు, బృహత్ప్రాణికములకు సంతోషాన్వేషణయే ముఖ్యం కాదు. అది పరమసత్యాన్నో, ఇతర లక్ష్యాన్నో అన్వేషించవచ్చు. అంచేత అన్నింటిని కలగూరగంప చేసి ఒకే మూసలో పెట్టి చూచుట సరి కాదు. ప్రకృతిగాని, జీవ రాసులలో వ్యాపించియున్న విశ్వాత్మగాని, అంత సంకుచిత లక్ష్యా న్ననుసరించవు

దుష్టులు, నేరస్థులు ఎందుకు పాపాలు చేస్తారంటే, ఆ పాప కృత్యముల ద్వారా సుఖసంతోషాలను పొందటానికేనని కొందరంటారు, ఇది నిజమా?

ఇది నేరగాంండ్ర మనస్తత్వమునకు దుష్టవ్యాఖ్యానము. ఒక పారిస్ నగరపు వంచకుడో, ఒక దుష్టుడో సంతోషము కొరకు దొంగత నము, మోసము, హత్యలు చేస్తాడనే మాట కొంత ఆశ్చర్యమును కలిగించును. కాని ఇతర కారణములవల్లనే ఆతడట్లు చేయును. ఒక వైద్యుడు వైద్యవృత్తిని చేపట్టినట్లు నేరస్థుడు కూడ నేరాన్ని

ఒక వృత్తిగా చేసుకుంటాడు. తనకు సంతోషము కలిగించున నియే డాక్టరు వైద్యము చేయుచున్నాడని మనం అనగలమా?

దుఃఖాన్ని, బాధలను అధిగమించటం అంత కష్టము ఎందుకని?

మానవప్రాణికము దుఃఖాన్ని అంటిపెట్టుకొని వుంటుంది. జీవితం నాటకీయంగా ఉండాలంటే దుఃఖము కూడా కొంత అవ సరమే! కాని మనము లోలోతులకు పోయి చూస్తే ప్రాణికమున ఒక భాగము బాధలను కోరుతూ, ఈ నాటకము కొనసాగుట కొరకు దుఃఖము నంటిపెట్టుకునే ఉంటుంది; మనము దానిని గుర్తించి అంతరంగికంగా నిరాకరిస్తేగాని వదలదు. మానవుని భౌతికము మరియు మనస్సు కష్టముల నెంత మాత్రము యిష్ట పడవు, యిష్టపడితే అవి బాధ లనబడవు గదా! జీవితముపట్ల రక్తి నిలచుటకే, ప్రాణికతలము ఆ స్థితిని కోరును. అందువలన, మనస్సు బయటపడి దీనికి దూరముగా నుండదలచినా, తిరిగి మరిగి తన జీవితమున నిరుత్సాహము, డీలాపడుట జరుగుచుం డును. ప్రాణికము మాత్రము స్పందించి, దానినే అభిలషిస్తూ ఒక గ్రామఫోన్‌రికార్డు మాదిరి తిరిగి తిరిగి పునరావృతము చేయును. నిజానికి అట్టి స్థితి ప్రాణికము చూపే కారణములవలన ఏర్ప డదు. అతిచౌకబారు స్వభావము కలిగియుండును. కాగా అది చూపే సాకులు, నిరుత్సాహము పడవలసినంత బలమైన కారణ ములు కూడా కావు. అయితే ఈ స్థితినుండి వైదొలగాలనే తీవ్ర సంకల్పము, ఆకాంక్ష కలిగినప్పుడే చికాకులు కలిగించే ఈ ప్రమాదభరితమైన దుస్థితి నుండి మానవస్వభావమును గట్టెక్కిం చవచ్చును. ఈ ప్రాణిక సుఖాంత నాటకము గురించి ప్రస్తావించు నపుడు, బాహ్యాస్వరూపమును మాత్రమే స్పృశించి ముగించుట గాక, లోలోన జరిగే ప్రచలనములను గమనించి, ఆ మానసిక విజ్ఞాన పరిధినుండే యీ విషయమును ముచ్చటించుట జరుగు చున్నది; కేవలము బాహ్యాదృష్టితో ఈ సమస్యలు తీరవు!

(*Lights on Life Problems* by Kishore Gandhi, 1987 ed., pp. 6-8)

అనువాదం: దామెర వెంకటేశ్వరరావు

నిజమైన ప్రేమ అంటే ఏమిటి?

మనిషి తన ప్రేమను గురించి ఎన్నో ప్రగల్భాలు పలుకుతాడు. కాని లోతుగా పరిశీలించినట్లయితే అది చాల స్వార్థమైనదని తెలిసిపోతుంది. అసలైన ప్రేమ దివ్యము, అమోఘము. యోగుల ముఖాలమీద ఎప్పుడు చిరునవ్వు తాండవిస్తూ వుంటుంది. అట్టివారు అందరిని సమంగా ప్రేమిస్తారు. నిజమైన ప్రేమ నిస్వార్థము. హృదయాంతరాళాలలో నుంచి ప్రజ్వరిల్లుతుంది. అది చైత్యసంపర్కము (psychic) గలది. మనుషులనుబట్టి వుండదు. దానికి ఇష్టాయిష్టాల ప్రమేయము లేదు. — *సంపాదకుడు*

> *"మనిషి నిజంగా ప్రేమించడం తప్పు కాదు. కాని ప్రేమతో పాటు ఇంద్రియలోలత్వం, ద్వేషం, స్వార్థం, కోపం పుట్టుకొస్తాయి. స్వార్థపరులైన మనుషుల మధ్య సహజమైన ప్రేమ వుంటుందా?" అనేదే అనటోల్ ఫ్రాన్స్ (Anatole France) సందేహం.*

మానవప్రేమ అహంకారపూరితము

తప్పకుండా వుంటుంది. కాని మానవప్రేమ సాధారణంగా స్వార్థం ఆధారంగాగాని, స్వార్థంతో బాగా కలిసిపోయిగాని వుంటుంది. అందుచేత అది స్వచ్ఛమైనది కాలేకపోతున్నది. *ఉపనిషత్తుల్లో చెప్పినట్లు వ్యక్తి, భార్యని భార్యకోసంగాక తనకోసం ప్రేమిస్తాడు.* ఈ ప్రేమ ప్రతిఫలాపేక్ష సహితమైనది. తను ఆశించిన మానసిక, ప్రాణిక ప్రయోజనం, ఆనందం మొదలైనవాటిని కోరుతుంది. ఆ ప్రయోజనాలు లేకపోయినా, దొరకవని తెలిసినా అది నశిస్తుంది. లేదా ద్వేషంగానో, క్రోధంగానో, ప్రతీకారంగానో పరిణమిస్తుంది. మానవప్రేమలోని ప్రాణికం స్వార్థం, వాంఛాపూరితమైనది. కేవలం తన వాంఛా తృప్తి మీద ఆధారపడి వుంటుంది. తను ఆశించినది, ఆశించిన విధంగా జరగకపోవడం, లేదా జరగలేదని భావించడంవల్ల ఆపోహాలు, అసూయలు, అపార్థాలు, వక్రీకరణలు పుట్టుకొచ్చి వొక్క

సారి దిగులు, మనసు గాయపడటంలాంటి అన్ని రకాల రుగ్మత లతో అస్తవ్యస్తమయిపోతుంది. చివరికి వియోగం తప్పదు. ఈ రకమైన ప్రేమ క్షణభంగురమైనది, నమ్మలేనిది. బాధ, వ్యథ, నిరాశ, నిస్పృహ, వియోగం దాని లక్షణాలు.

మానవప్రేమ ఎప్పుడూ యింతేనా. అది స్వచ్ఛము, వుదాత్తము కాలేదా?

చైత్యప్రేమ పరిశుద్ధమైనది

సాధారణంగా మానవప్రేమ అజ్ఞానం, ఆవేశం, వాంఛాదులతో కూడుకొని వుంటుంది. కాని (psychic) చైత్యప్రేమ అలా కాదు. అది నిస్వార్థమైనది, వుదాత్తమైనది, స్వచ్ఛమైనది. ఈ విధమైన ప్రేమ హృదయాంతరాళాలలోనుంచి వస్తుంది. అది ఆత్మసంబంధమైనది; అంతరంగికంగా ఐక్యత, ఆత్మసమర్పణ లేదా కనీసం దానికోసం తహతహ. ఆ ప్రేమ ప్రేమకోసమే తప్ప మరే విధమైన మానసిక, ప్రాణిక, భౌతిక ఆనందం, తృప్తుల కోసం కాదు. కాని సాధారణంగా మానవప్రేమలో చైత్యలక్షణం సమర్ప ణలోకూడా స్వచ్ఛముగా మిగలడం లేదు. అది యితర లక్షణాలచే కప్పబడడంవలన, వాటితో మిశ్రమంవలన దాని సహజస్వభావ మయిన స్వచ్ఛత, పరిపూర్ణతలను సాధించడంగాని, సాధించే అవకాశంగాని, తక్కువయిపోతున్నది.

చైత్యప్రేమ, ప్రాణికప్రేమకంటే స్వచ్ఛమయినది కావచ్చు కాని అది మైమరపించలేదు కదా?

చైత్యప్రేమ కూడ ఆర్ద్రమైనదే

ప్రాణికప్రేమలో మాత్రమే సుఖాను భూతి వుంటుందనియు, చైత్యప్రేమ ఎటువంటి అనుభూతిలేని జడమ నియు అనుకోవడం చాలా పొరపాటు. చైత్యప్రేమ ప్రాణికప్రేమను మించిన ప్రగాఢ పవిత్రజ్వాల. తనని పెనవేసుకొనివున్న యింధ నాలని స్వాహా చేసేదిగాని, తన అహాన్ని, కోరికని తృప్తిపరచ డంమీద ఆధారపడ్డదిగాని కాదు. సత్యగుణప్రధానమైన పవిత్ర స్నిగ్ధతేజస్సు. రజోగుణ ప్రధానమైన అరుణజ్వాల కాదు. ఈ స్నిగ్ధతేజస్సు, ఆ అరుణజ్వాలని మించినదే గాని తీసిపోయేది

కాదు. మానవసంబంధాలను, స్వభావాన్ని చైత్యప్రేమ పూర్తిగా ప్రభావితం చెయ్యడం లేదన్నది నిజం. దైవం వైపు మళ్ళించినపుడే అతిసులభంగా దాని జ్వాజ్వలమానమైన సంపూర్ణత్వం ప్రకటితమవుతుంది. మానవసంబంధాలలో, వున్నట్లుండి వొక్కొక్కసారి మెరుపు మెరిసినట్లు మెరిసి మళ్లీ మరుగునపడుతూ వుంటుంది. అది పూర్తిగా ఆర్ద్రంగా ప్రకటితమయే అవకాశాలు చాలా అరుదు. మిగిలిన సమయంలో అది చూచాయగా వుంటుంది. మానవప్రేమ ప్రాథమికంగా ప్రాణికమే అయినా, మాధుర్యము, సుకుమారత్వము, నమ్రత, ఆత్మార్పణ, ఆత్మత్యాగం, పరస్పర హృదయస్పందనవంటి ఆదర్శవంతమైన విశుద్ధ గుణాలు, తనని తాను అధిగమిచే గుణం, చైత్యప్రేమనుండి సంతరింపబడ్డాయి. ఇతర గుణాల్ని అంటే మానసిక, ప్రాణిక, భౌతికతలకి సంబంధించిన గుణాలపై ఆధిపత్యం సాధించి, శాసించగలిగితే మానవ ప్రేమ సత్యస్వరూప ప్రతిబింబంగాని, ప్రయత్నంగాని అవుతుంది. ద్వంద్వజీవితంలో ఆత్మ, దాని పరికరాల సమగ్ర సమ్మేళనమవుతుంది.

ప్రాణికప్రేమలో చైత్యప్రేమ సదృశమైన లక్షణాలు లేనే లేవా? అదంతా స్వార్థము, కోరికల మయమేనా?

ప్రాణికప్రేమలో రెండు రకాలు

ప్రాణికప్రేమలో కూడా రెండు రకాలున్నవి. మొదటిది పరిపూర్ణానందం, విశ్వాసం, వుదాత్తము, వ్యాపారధోరణికి, విద్వేషానికి చోటివ్వని, స్వచ్ఛమైన అంకితభావంగల ప్రేమ. ఇది చైత్యప్రేమ సదృశమైనది. రెండవది, అహంభావము, కోరిక, బాధ, ఆపద్ధర్మంవలన కలిగేది. ఇది నిలిచేది కాదు. సంతృప్తికరమైనది కాదు.

భౌతికప్రేమ అంత నిలకడ లేనిది ఎందుకని?

అది కేవలం దైహికవాంఛ కనుక. తాత్కాలిక ప్రయోజనంకోసం ప్రకృతిచే నిర్దేశించబడినది. ఆ ప్రయోజనంవరకే దాని వునికి. తరువాత అవసరం లేదు కనుక రూపుమాసిపోతుంది. భావావేశం, సౌందర్యోపాసన, తాపం, మైమరపులతో మొదట

సమ్మోహనపరుస్తుంది. కాని యివన్నీ క్షణికాలు. శాశ్వతంగా వుండవు. ఎందుచేతనంటే యివన్నీ ఎరువు నగలు. ప్రాణికం మాధ్యమంగా యేదో తనదికాని వస్తుప్రతిబింబాన్ని పట్టుకొని వుపయోగించుకొనే నిమిత్తం కల్పించబడింది. అందుచేత అది మనస్సులోకాని, దేహంలోగాని శాశ్వతంగా నిలవదు. వీటన్నిటి వెనుక ఆత్మ, దివ్యశక్తి వున్నవి. ఈ ప్రేమమూలాలు అక్కడివి. మరియు ఈ మనోప్రాణికాలను నమ్మేందుకు వీలులేదు. ఎందుకంటే అవి అస్తవ్యస్తములు. మనసులో జరిగే ఆలోచనలు, ప్రాణికచేష్టలు చాలా చంచలమైనవి. వాటికి నిలకడెక్కడిది? ఆత్మ ఒక్కటే నిశ్చలమైనది. Therefore love can last or satisfy only if it bases itself on the soul and spirit.

దౌర్భాగ్యమైన ఈ ప్రాణికప్రేమ నుండి విముక్తి పొంది ప్రేమయొక్క నిజరూపాన్ని పొందటమెలా?

మనోభౌతికములవలెనే ప్రాణికముకూడ ఆత్మయొక్క ఉపకరణము. స్వప్రయోజనాల నాశించినట్లయితే ఫలితం ఘోరంగా వుంటుంది, but if it can be made into a conscious instrument of the psychic and the spirit, then it gets its own divine fulfilment; that is the idea contained in what is called transformation in Yoga.

ప్రేమయొక్క మూలస్వరూపమేమిటి?

ప్రేమ స్వయం సిద్ధము – లక్ష్యము మీద ఆధారపడని ఒక స్వతంత్రమైన దివ్యశక్తి. అటుల కానియెడల అది మానవ సంబంధాల కతీతంగా ఎలా వుండగలదు? అందుకనే మనం దానిని transcendent love అని అంటున్నాము. ఇది సర్వవ్యాప్తము. సర్వమానవులను ఆవహించి ఆ ఆనందంలో అందరిని సమైక్యపరుస్తుంది. దివ్యప్రేమగా మారుతుంది. *ప్రతి ఒక్కరిలోను కోటిప్రభలతో ప్రకాశిస్తూ జీవాత్మను పరమాత్మతో ఐక్యము చేస్తుంది. ప్రపంచంలో దివ్యప్రేమను ప్రకటించేందుకు మనిషిని ఒక కేంద్రముగా చేస్తుంది.* కాని దురదృష్టవశాత్తు మానవుని మనోప్రాణికదైహికముల కుటిలవిన్యాసములు ఇంతటి దివ్య

ప్రేమను కూడ వంచించి వికృతపరుస్తాయి. ఈ విషాద మంద్ర రాగాలాపనలో ఆ పవిత్రజ్యోతి కొడిగట్టి మరుగున పడిపోతుంది. లేక నశించిపోతుంది.

(*Lights on Life Problems* by Kishore Gandhi, 1987 ed., pp. 9-12)

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

ప్రేమ, కామము

ఈ సృష్టిలో కొన్ని మహాశక్తులు ప్రవహిస్తూ వుంటాయి. ఆ మహాప్రవాహంలోనుంచి నీలోకి కొంత శక్తి ప్రవహించినప్పుడు అది 'నీది' అవుతుంది. నీ ద్వారా సృష్టి తన ప్రయోజనాలను నెరవేర్చుకుంటుంది. నువ్వు 'ప్రేమ' లో పడ్డావని అనుకుంటావు కాని నిజానికి అది ప్రకృతియొక్క యంత్రాంగం మాత్రమే. నీ మనస్సు, దాని ఆలోచనలు, కోపము మొ॥ ఉద్రేకాల విషయంలో కూడ అంతే. అవన్నీ నువ్వు నీ స్వంతమే అనుకుంటావు కాని నిజానికి అవన్నీ కూడ బైటనుండి నీలోకి ప్రవేశించి ఒక ప్రత్యేక రూపాన్ని పొందుతాయి అంతే. — *సంపాదకుడు*

ప్రఖ్యాత జర్మను శాస్త్రవేత్త షోపెన్‌హోయర్ దృష్టిలో ప్రేమ ఒక భ్రాంతి. కామమోహితులైన జంటలు పరస్పర పరిష్వంగంలో వివశులైపోయి హాయిని పొందుతున్నామని భావిస్తారు. అది వాస్తవం కాదు సరికదా ఆత్మవంచన. ప్రకృతి నియమానుసారంగా జాతికి పునరుత్పత్తి సాగుతూ ఉండాలనే అవ్యక్త ప్రయోజనం ఉంటుంది. ఈ ప్రకృతి నియమానికి లోబడి ప్రేమికులు చేస్తున్న అసంకల్పిత త్యాగం పేరే ప్రేమ అని షోపెన్‌హోయర్ అభిప్రాయం. ఈ వాదన ఎంతవరకు నిజం?

విశ్వ మహాశక్తుల విన్యాసములు

ఇది పూర్తి సత్యం. మానవ కార్యకలాపాలన్నింటికీ ఇది వర్తిస్తుంది. సృష్టిలోని పునరుత్పత్తి కార్యక్రమాలన్నీ విశ్వశక్తులకి లోబడి సాగుతున్నవే. బలీయమైన విశ్వశక్తి ప్రేరణల ఒత్తిడి చేత వ్యక్తి ప్రచోదింపబడతాడు. ఈ శక్తి తన స్వంతమే అని భ్రమపడతాడు. సాధారణంగా ఈ ప్రక్రియ అందరిలోను ఇలానే కొనసాగుతుంది. సెక్సు విషయంలో కూడా ఇంతే. శారీరకంగా లేదా ప్రాణికస్థాయిలో తానొక స్త్రీని ప్రేమిస్తున్నాననుకుంటాడు. అంటే ప్రకృతి యంత్రాంగంలో తానొక ఉపకరణంగా వ్యవహరిస్తున్నాడే కాని స్వతంత్రంగా కాదు. కామక్రోధాదుల విషయాలలో కూడ ఇంతే.

మనిషిలో ప్రత్యేక రూపము తాల్చుట

ఒక అవ్యక్త కార్యనిర్వహణ విశ్వశక్తి మనను శాసిస్తుంది. ఆ విశ్వచైతన్యశక్తులే వ్యక్తిలో ఒక ప్రత్యేక రూపాన్ని తాలుస్తాయి. స్వభావాలు, మనఃప్రవృత్తులు, పరిసరాలు కూడ తదనుగుణమైన రూపాలను పొందుతాయి. అలానే మన కర్మలు, కర్మఫలాలు కూడా. నిజానికి మనం స్వచ్ఛందంగా ఆలోచించడంగాని ఇచ్ఛగించడంగాని జరుగదు. మనస్సులో ఓ ఆలోచన తడుతుంది. అలాగే కామన, ప్రేరణ, క్రియ – ఇవన్నీ పైనుంచి వచ్చి నీలో ప్రవేశించేవేగాని నీలో ఉద్భవించవు.

Truly, we do not think, will or act but thought occurs in us, will occurs in us, impulse and act occur in us; our ego-sense gathers around itself, refers to itself all this flow of natural activities. It is Cosmic Force, it is Nature that forms the thought, imposes the will, imparts the impulse. ఈ ప్రకృతిసిద్ధమైన కార్యకలాప ప్రవాహాలు 'నేను' అనుకునే నిన్ను ముట్టడిస్తాయి. ఇదంతా విశ్వశక్తి ప్రభావమే. ఈ దివ్యశక్తియే నీ ఆలోచనలకి, కామనలకి, ప్రేరణలకి ఒక ఆకృతినిస్తుంది. నీ 'అహం', శరీరం, మనసు ఆ దివ్యసాగరంనుంచి ఉద్భవించిన బిందువులు మాత్రమే. అసలు నిన్ను నిర్దేశించేది ఆ విశ్వచైతన్యశక్తియే.

What purpose does Cosmic Nature work out through the action of the universal sex-energy in the individual?

ఐహిక కామకలాపాలను ప్రకృతి పునరావృత్తి కోసం వాడుకుంటుంది. కామం మౌలికంగా శారీరక జీవశక్తి. భౌతిక సృష్టి సంవిధానంలో మైథునశక్తి గొప్పది. ప్రత్యేక ప్రయోజనంతో కూడిన సాధనం. ఇందులో రెండు అంశాలు ఉన్నవి. మొదటిది శారీరకస్థాయిలో సంతానోత్పత్తి. రెండోది శారీరక, ప్రాణిక, మాన సికశక్తులతోబాటు శారీరక ఆధ్యాత్మికశక్తులను కూడా సంతృప్తి పరచడం. ఈ శక్తులన్నిటికీ ఆలంబన బలీయమైన కామప్రవృత్తి sex-energy. దీనిని దుర్వినియోగం చేస్తే జీవశక్తులన్నీ నిర్వీర్యమై అల్లకల్లోలం సృష్టింపబడుతుంది.

కామప్రవృత్తి మానవప్రకృతిపై అంతటి గట్టి పట్టు ఉండ టానికి కారణం ఏమిటి? ఏవగింపు కలిగినా ఆ పట్టు సడ లదెందుకని?

కామము ఆనందము యొక్క వికృతరూపము

కారణం – ప్రాణికస్థాయిలో కామప్రేరణకుండే అమితమైన శక్తి. ఆ జలదరింపు వట్టి మోసము. నిజమైన దివ్యానందపు వికృతరూపము. ప్రాణికాన్ని ప్రలోభపెట్టి లోబర్చుకుంటుంది. కామకేళీ అనుభవాలతో విసు గెత్తి జుగుప్సతో అసహ్యించుకునే వాళ్లు చాలమంది ఉంటారు. కాని వాళ్లు కూడా కాలక్రమేణా అంతా మరిచి తిరిగి కామ మోహితు లౌతూనే వుంటారు.

పురుషులలో కామోద్రేకం స్త్రీలలోకంటే ఎక్కువ అంటారు. ఇది ఎంతవరకు నిజం?

అలాటి సార్వత్రికమైన నిబంధన ఏమీ లేదు. ఉభయు లకీ కామప్రవృత్తి సమానమే. కాకపోతే స్త్రీలు సాధారణంగా కామప్రవృత్తికి విముఖంగా ఉంటారు. పురుషసంపర్కంలేని కన్యాత్వభావం (virginity) స్త్రీ కల్పన. ఈ భావం పురుషులకు నచ్చదు. చాలమంది స్త్రీలలో కామోద్రేకం పురుషుల ప్రేరణతో కాని మేల్కొంచదు. పురుషులలో ఇలా కాదు. ఈ విషయానికి

మరో పార్శ్వం ఉంది. స్త్రీలు, బహుశః పురుషులకంటె తక్కువ వాంఛ కలిగి ఉంటారేమో? మరి ప్రాణికస్థాయిలో తాము పురుషాధీనంలో ఉండాలని, తమ అధీనంలోనే పురుషుడు మెలగాలనుకునేవారి సహజప్రవృత్తి సంగతేమిటి?

భౌతికప్రేమకి ప్రాణికప్రేమకి వ్యత్యాసం ఏమిటి?

రెండూ ఒకటి కాదు. ఆడంబరం, అధికారవాంఛ వెంటతరిమే వేటగాడి ప్రవృత్తి – ఈ సహజలక్షణాలతో పురుషుడు ప్రాణికస్థాయిలో స్త్రీని కోరుకునే అవకాశం ఉంది. స్త్రీలలోనూ ప్రాణికప్రవృత్తులతో కూడిన ప్రేరణలు ఉంటాయి. 'ప్రేమ' అనిఅనుకున్నా ఇది ప్రాణికస్థాయిలో కామన – లేదా – కామోద్రేకం (lust). హృదయావేశాలు పొంగినప్పుడది ప్రాణికప్రేమగా మారుతుంది. శారీరకప్రేమ వేరు. ఇది సౌందర్యానికి ఆకర్షితమై హృదయావేగంతో ప్రతిస్పందించేది. హృదయస్పందన లేకపోతే అది వట్టి సంభోగవాంఛ. అది లేకపోయినా భౌతికప్రేమ ఉండొచ్చు.

ప్రేమ హృదయసంబంధి కదా – మరి మానసిక ప్రేమకి అవకాశం ఎక్కడుంది?

ఎందుకు లేదు? మనసు ఆలోచనలకి, గ్రహణశక్తికి కేంద్రం. హృదయం ప్రాణిక కామన (ప్రేమ) కి ఆలవాలం. అయినా ఇది మానసికప్రేమకి ప్రతిబంధకం కాదు. హృదయగత భావోద్రేకాలు మనసుని ఎలా ముట్టడిస్తాయో, అలాగే హృదయం కూడా మనసుకి అధీనమై మానసికశక్తులను ఉపచరిస్తుంది. ఆ విధంగా మానసికప్రేమ జనిస్తుంది. నీ ఆశయాలు వేరొకరిలో గమనించినపుడు తీవ్రమైన మానసిక ఆవేశంలో ప్రశంసాపూర్వకంగా ఆశ్చర్యం కలిగినపుడు, నీలోని కొరత తీర్చి, నీకు సఫలత చేకూర్చి మనసు మెప్పించిన సహకారి, మార్గదర్శి నీకు తారసపడినపుడు – ఇంకా ఇలాటి ఎన్నో మానసికప్రేరణలవల్ల – మానసికప్రేమ జనిస్తుంది. ఇది జీవితాన్నే త్యాగం చేయగలిగేటంతటి గాఢంగాను, బలీయంగాను ఉంటుంది. దీనికి హృదయావేశ స్పందనలు కూడా తోడైతే ఇక చెప్పనే అక్కర లేదు.

అయినా మొత్తానికి మూలం మనసే ఔతుంది. సాధారణంగా మనోహృదయాలు కలుస్తాయి.

చాలమంది ఆధునిక మనస్తత్వశాస్త్రజ్ఞులు స్త్రీపురుషుల మధ్య కామరహితమైన ప్రేమ ఉండదని అభిప్రాయపడతారు. వారి దృష్టిలో ప్రేమ అంటే వాంఛ తప్ప మరొకటి కాదు. వాంఛ లేని ప్రేమకు ఆస్కారం లేదా?

మొత్తం అంతా సంభోగేచ్ఛతతో ముడిపెట్టడం అజ్ఞాన మనస్తత్వం. ప్రేమకి అది తప్పనిసరి కాదు. ఇంతకు ముందు అనుకున్నట్లు చాలమంది స్త్రీలు గాఢమైన ప్రేమ ఉండికూడ పురుషుని స్పర్శకే ముడుచుకుపోతారు. కామక్రియా కలాపాలన సహ్యించుకుంటారు. ఒత్తిడికి లొంగుతారేమోగాని వారికది ఇష్టంగా ఉండదు. పశుప్రవృత్తికి దిగజారినట్లుగా భావిస్తారు. వారికి ఇలా టివి సరిపడవు. పురుషులకిది నమ్మశక్యం కాకపోయినా ముమ్మాటికీ నిజం.

ఆహారనిద్రామైథునాలు మనిషికి సహజాతాలు అని మైథున చింత అసలే లేకపోవటం అసహజమనీ ఆధునిక మనస్తత్వజ్ఞుల అభిప్రాయము. ఇది ఏపాటి నిజం?

చౌకబారుకాని విలువైన విషయాలు ఎప్పుడూ అసాధరణాలే. ఉదా॥ ప్రతిభ (genius), ఆధ్యాత్మికత, ఉన్నతాదర్శాలతో బ్రతకాలనుకోవటం అసాధారణంగానే కనిపిస్తాయి. స్త్రీలో కన్యత్వం మరీ అంత అసాధారణమేం కాదు. కొంతమంది ఉన్నతవర్గానికి చెందిన స్త్రీలలో ఇది మామూలే.

(*Lights on Life Problems* by Kishore Gandhi, 1987, pp. 13-16)

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

కామముయొక్క రూపాంతరీకరణము

స్త్రీపురుషుల పరస్పర వాంఛా ప్రవృత్తి మానవులకు ఎంత సహజధర్మమైనప్పటికి కొంతమంది అసాధారణ వ్యక్తులలో ఉదా: గొప్పగొప్ప కవులు, సంగీత విద్వాంసులు, కళాకారులు మొ॥ వారిలో ఇది కనపడదు. ఆ శక్తి వారిలో సృజనశీలియై మరో రూపంలో అభివ్యక్తమౌతుంది. కామము మరో ఉన్నత రూపాన్ని తాలుస్తుంది. 'రేతస్సు' ను 'ఓజస్సు' గా పరివర్తింప జేయుటమనే భారతీయ సిద్ధాంతం కూడ దీనికి తార్కాణము.

– సంపాదకుడు

ఉన్నత మానసిక కార్యకలాపములకు ఇంద్రియలోలత్వమనేది సమ్మెటపోటులాంటిదని ప్రఖ్యాత ఫ్రెంచి నవలాకారుడు Balzac అభిప్రాయం. The man of genius is frigid అంటాడాయన. ఎప్పుడైతే అతను రెండువిధములైన జీవితములను, అంటే అటు మేధస్సుకి, ఇటు ప్రేమకి సంబంధించిన జీవితములు గడపాలని ప్రయత్నిస్తాడో అప్పుడతని మేధాశక్తి దెబ్బతింటుంది. Raphael, Lord Byron ల విషయంలో అదే జరిగింది. ప్రఖ్యాత సెక్సుశాస్త్రజ్ఞుడు Havelock Ellis కళాకౌశలాన్ని మేధాశక్తిని పెంపొందించాల్నంటే, సెక్సును అదుపులో వుంచాలి అంటాడు. మెదడు, జననేంద్రియములు" అంటూ ఇలా చెప్పుకొచ్చాడు. "శారీరకమైన శక్తిని వినియోగించుకొనడంలో ఇవి రెండూ ఎప్పుడూ పోటీ పడుతుంటాయి. విపరీతమైన మేధాశక్తి, కామప్రవృత్తి – యీ రెండింటి నడుమ పరస్పర విరోధం ఉంటుంది. అయినప్పటికీ ఒక్కొక్కసారి ఆ రెండూ విభిన్న సమయములలో ఒకే వ్యక్తిలో కనిపించవచ్చు". కళలకు గురువులైన Beethoven, Mozart ల జీవితాలే దీనికి నిదర్శనం. సాధారణవ్యక్తి జీవితంలోకన్నా వీరి జీవితంలో ఇంద్రియలోలత్వమనేది అతి చిన్న అంశంగా మాత్రమే కనబడుతుంది. ఉన్నతమేధస్సును పెంపొందించుటకు, రసాత్మక జీవితములను గడుపుటకు

కామాన్ని నియంత్రించాలన్నదే దీని భావం అన్నట్లు కనిపిస్తుంది. ఈ వాదన ఎంతవరకు న్యాయమైనది?

కామమును నియంత్రించుట

అది నిజమే. కామోద్రేకాన్ని నిగ్రహించి, ఆ శక్తిని రసాత్మక, కళాత్మక సృష్టికి, ఇంకా మేధాది శక్తులను వృద్ధిపరుచుకొనుటకు కూడా ఉపయోగించవచ్చు; పూర్తిగా నిగ్రహించి, ఆధ్యాత్మికశక్తిగా పరివర్తింప జేయవచ్చును. దీనినే బ్రహ్మచర్యము ద్వారా రేతస్సును ఓజస్సుగా మార్చడమని భారతదేశంలో మన పూర్వీకులు పేర్కొన్నారు. రేతస్సు అనబడే యీ కామశక్తి యందు రెండు ప్రధానమైన విభాగములున్నవి. ఒకటి సంతానోత్పత్తికి ఉపయోగపడుతుంది. రెండవది సాధారణ ప్రాణిక, ఆధ్యాత్మిక కృత్యాలకు ఆధారంగా నిలుస్తుంది. కామోద్రేకములకు లొంగిపోకుండా ఉన్న యెడల రేతస్సు వృథాకాకుండా ఓజస్సుగా మారుతుంది. యోగుల బ్రహ్మచర్య సిద్ధాంతము దీనిపైనే ఆధారపడి వుంది. యూరపుదేశ వైజ్ఞానికులు మొదట్లో యీ భావమును అవహేళన చేసినా, ఇప్పుడిప్పుడే ఇందులోనున్న సత్యమును కనుగొనుట మొదలుపెట్టారు.

రేతస్సును ఓజస్సుగా మార్చడమెలా?

వ్యక్తిలోనున్న తేజస్సు, అనగా తాపము, ప్రకాశము, మరియు విద్యుచ్ఛక్తులన్నీ రేతస్సులో అంతర్నిహితమై వున్నాయి. రేతస్సు నందలి యీ శక్తిని నష్టపరచుకోనూవచ్చు, లేదా పదిలపరచుకోనూవచ్చు. అన్నిరకముల ఉద్రేకాలు, కామము, కోర్కెలు, యీ శక్తిని వృథా చేస్తాయి. ఇంద్రియనిగ్రహము రేతస్సులోని శక్తులను పదిలపరుస్తుంది. అలా భద్రపరచబడినదంతా ఎల్లప్పుడూ వృద్ధి చెందుతూనే వుంటుంది. శరీరానికి అవసరమైన శక్తి చాలా పరిమితం. కనుక దానికి కావలసినది అది స్వీకరించగా మిగిలిపోయిన శక్తితో ఇంకేమైనా కార్యము సాధించవచ్చును.

రేతస్సు తేజస్సుగా మారుట

ప్రాచీన సిద్ధాంతము ప్రకారము రేతస్సు జలము – అనగా తేజస్సు, ఉష్ణము, తాపము విద్యుత్తు. దుర్వినియోగము

చేయనపుడు యీ రేతస్సు ఎక్కువై, తాపము లేక తపస్సుగా మారుతుంది; మనిషిలోని అణువణువును ప్రజ్వరిల్ల జేస్తుంది. ఆ కారణమువలననే అన్ని విధములైన మనోనిగ్రహములు, కఠోర నియమములు తాపము లేక తపస్సు అని చెప్పబడుతుంటాయి. ఇవి తాపమును ఉత్పత్తి చేయడమో, లేక ప్రోత్సహించడమో జరుపుతూ, శక్తివంతమైన కార్యమును ఆచరించుటకు, విజయ ప్రాప్తికి మూలమవుతుంటాయి. రెండవది: క్రమేపి తేజస్సుగా మారుతుంది. అది ప్రకాశము, శక్తి, అన్ని జ్ఞానములకు మూలము. ఇక మూడవది: విద్యుత్తుగా మార్పు చెందుతుంది. భౌతికంగా, బుద్ధిపరంగా జరిగే అన్ని శక్తివంతమైన కార్యకలాపములకు ఇది పునాది. ఈ విద్యుత్తును ఓజస్సు లేక ప్రాణశక్తి అల్లుకొని ఉంటుంది. ఇది అంతరిక్షము (Ether) నుండి బయల్వెడలిన ఆది శక్తి (Primal energy). రేతస్సు జలమునుండి తపస్సుగా శుద్ధము గావింపబడుతుంది. తేజస్సు, విద్యుత్తు మరియు విద్యుత్తునుండి ఓజస్సు ఇలా యీ క్రమపద్ధతిని భౌతికశక్తితోనూ, బలముతోనూ, మేధాశక్తితోనూ నింపుతూ వీటి తుదిరూపమైన ఓజస్సు మేధస్సు లోనికి మేల్కొని, భౌతికపదార్థములో అతిశుద్ధమైన రూపము గలిగి, ఆత్మకు అత్యంత చేరువగా నుండే ఆదిశక్తి (Primal energy) తో సంకేతములను పంపుతుంది. ఓజస్సు ఆధ్యాత్మికశక్తి లేక వీర్యమును సృష్టిస్తుంది. దాని ద్వారానే మానవుడు ఆధ్యాత్మిక పరిజ్ఞానమును, ఆధ్యాత్మిక ప్రేమను, విశ్వాసమును, ఆధ్యాత్మికబలమును పొందగలుగుతున్నాడు. ఎక్కువగా మనం బ్రహ్మచర్యం పాటించుటవలననే తపస్సు, తేజస్సు, విద్యుత్తు నిలవలను పెంచుకోగలుగుతాము; శారీరక, మానసిక, ఆధ్యాత్మిక కార్యములను అధికాధికంగా నిర్వహించగలుగుతాము.

చాలమంది ప్రసిద్ధ శాస్త్రవేత్తలు, వైద్యులు, తత్త్వవేత్తలు మైథునాన్ని పూర్తిగా నిలిపివేయడం ప్రమాదకరమని, అందు వలన నరముల వ్యాధులు, మానసిక సమస్యలు కలగవచ్చునంటారు. Rene Guyon ఇలా అన్నాడు: "ఎప్పుడైతే కామము అణచివేయబడుతుందో, ఎప్పుడైతే ఆ ఉద్వేగము

అణగద్రొక్కబడుతుందో, అప్పుడది బయటకు పోవడానికి ప్రయత్నిస్తుంది. అది హానికరం, వినాశకారి" – ఇదెంతవరకు నిజం?

నిజానికి కామకలాపాలను బాహ్యంగా అణగద్రొక్కి, ఇతర మార్గాలలో అనుభవించినప్పుడు శరీరాగ్యము, మెదడు దెబ్బతిన వచ్చు. ఆధునిక వైద్యసిద్ధాంతము కూడా ఇదే. బాహ్యంగా వర్జించినప్పటికి మనసులో స్మరించుచు వికారములకు లోనైనప్పుడు విపరీత ఫలితములు ఎదురవుతాయి. కామప్రవృత్తులను నివారించడంలో నిజమైన ఆధిపత్యం సంపాదించి దానిని పూర్తిగా వర్జించిన యెడల ఏవిధమైన హాని జరుగదు. ఇప్పుడు యూరపులోని ఎందరో వైజ్ఞానికులు కూడా ఈ సిద్ధాంతాన్ని సమర్థిస్తున్నారు. అప్పుడది ఎంతో ప్రయోజనకారి కాగలదు.

మనస్తత్వ విశ్లేషణ విషయంలో ఫ్రాయిడ్ సిద్ధాంతం ప్రకారం కామకలాపాలను అణచివేయడం అనేక రకములైన మానసిక, శారీరక, వ్యాధులకు కారణభూతమవుతున్నదని చెప్పబడుతోంది. ఈ సిద్ధాంతము ఎంతవరకు నిజం?

ఆధునిక మనోవిజ్ఞానం ఓ చీకటిశాస్త్రం

ఫ్రాయిడ్ చెప్పిన మనస్తత్వవిశ్లేషణ ప్రకృతిలోని అంధకారబంధురమైన, విపత్కరమైన, రోగభూయిష్టమైన కొన్ని అంశములను మాత్రమే తీసుకుంది. నిమ్నప్రాణికముయొక్క అవచేతన పొరలలోని వికృతాలే అన్నింటికి మూలకారణమంటుంది. ఆధునిక మనోవిజ్ఞాశాస్త్రము ఇంకా శైశవదశలోనే వుంది. ఫ్రాయిడ్ సిద్ధాంతము ఎక్కువగా అణగద్రొక్కబడిన కామప్రవృత్తుల ప్రాముఖ్యమును గోరంతలు కొండంతలుగా చేసి చూపడం సత్యానికి దూరం.

(*Lights on Life Problems* by Kishore Gandhi, 1987, pp. 17-19)

అనువాదం: అరోధృతి

పూర్ణయోగ ప్రాథమిక నియమములు

చందూలాల్‌కి రాసిన లేఖ:

1. నఖశిఖపర్యంతము నిన్ను నీవు సమర్పించుకోవాలి. కపటము, దాపరికము, ఏమాత్రం పనికిరావు. దివ్యజీవనము, నిమ్నప్రకృతిని ఉన్నతమైన దివ్యతత్వముగా పరివర్తింపజేయుట మాత్రమే నీ జీవితలక్ష్యములు కావాలి. ఏవిధమైన బంధాలుగాని, వ్యామోహములుగాని వుండకూడదు. నీ మనస్సు యొక్కయు, హృదయముయొక్కయు, ప్రాణిక, భౌతికదేహముల అలవాట్లకుగాని, కోరికలకుగాని, ఆకర్షణలకుగాని బానిసవు కాకూడదు. నీ ఆకాంక్షకు, లక్ష్యానికి ఇవన్నీ అడ్డుతగుల్తూ వుంటాయి.
   One must be ready to renounce all these completely as soon as the demand comes from above and from the divine Shakti.
2. నీ మనస్సు, హృదయము కుదుటపడాలి; పరిశుద్ధము, ప్రశాంతము అవాలి.

నీలో ఈ లక్షణాలు ఏర్పడేందుకే నువ్వు ధ్యానం చెయ్యాలి. ఈ ఆకాంక్షతో నిన్ను నీవు నిరంతరం పరిశీలించుకుంటూ, నిన్ను బాధపెట్టే తికమకపెట్టే మలినపరచే విషయాలను తిరస్కరించుకుంటూ పోవాలి. *"నాకిది కావాలి, నిజంగా కావాలి" అని ఎప్పుడైతే నువ్వు నీ ప్రాణమంతా పెట్టి ప్రాధేయపడతావో అప్పుడు పైనుంచి ఒక దివ్యశక్తి వచ్చి, నీకు సహాయపడి నీ ఆకాంక్షను తీరుస్తుంది.*

ఇక నీ కుటుంబము మొ॥ తదితర విషయాల సంగతి:

1 వీటన్నిటిని నీ అంతరంగిక జీవికి చెందినవి కావని తెలుసుకోని, వాటిని కేవలం బాహ్యవిషయాలుగా చూడాలి. బరువు బాధ్యతలు నీ భుజస్కందాలపై వున్నంతవరకు వాటిని నిష్కామబుద్ధితో తీర్చాలి.

2. నీ పనులన్నింటిని నిరహంకారంగా యజ్ఞభావంతో చెయ్యాలి.

3. నీ అంతరంగికాన్ని ప్రశాంతపరచాలి. లోతైన ప్రశాంతతను ప్రతిష్ఠించాలి. ఈ విధంగా చేసినట్లయితే మిగిలిన పరిస్థితు లన్నీ నీకు బాహ్యముగా అనిపించి నిన్ను నిర్బంధించవు. వాటిమీద వ్యామోహం కూడ తగ్గిపోతుంది.

ఆవేశాలను, అనుబంధాలను వదిలించుకుండేందుకు కూడ ఇదే మంత్రం. వాటిని నీనుండి వేరుచేయాలి. అంతరంగికంగా శాంతిస్థైర్యములను ప్రతిష్ఠించినయెడల, ఒకవేళ నీలో ఉద్రేకాలు చెలరేగినప్పటికి అవి కేవలం పైపొరల్లోనే వుండి నీకు దూరంగా వుంటాయి. అవసరమైతే దైవాన్ని సహాయపడమని కోరి వాటిని వదిలించుకోవటం ఏమంత కష్టమనిపించదు. నీ మనస్సు నిశ్చల మైతేగాని ఈ ఆవేశాలకు మూలమైన ప్రాణికాన్ని నువ్వు సమా ధానపరచలేవు.

(*Champaklal's Treasures,* 1976 p. 206)

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి, ఆర్. లక్ష్మీప్రసాదమ్మ

ఋషి బంకించంద్రుడు

చాలామంది మన దేశపు గతవైభవాన్ని కీర్తిస్తూ, ఆ కాలంనాటి ద్రష్టలు, స్రష్టలు, ఋషులలాంటి మహాపురుషులు నేటి మన దుఃఖభరిత, నీతిరహిత సంఘంలో అవతరించటమసంభవమని వాపోతారు. కానీ అది ముమ్మాటికీ తప్పు. అనాది, అనంతమైన ఈ పుణ్యభూమి, దీని ప్రజలు, మతము – కొన్నాళ్లపాటు వీటి బలము, ఔన్నత్యము, పవిత్రత తెరమరుగునపడవచ్చు కానీ – ఎప్పటికీ పూర్తిగా నశించవు. పుణ్యపురుషులు, ఋషులు, మునులు ఈ పుణ్యభూమి సహజసంపద – వీరు లేని తరం లేనేలేదు. ఆధునిక ఋషులలో భారతదేశానికి నూతనోత్సాహాన్నిచ్చి, పున ర్నిర్మాణానికి 'వందేమాతరం' మంత్రాన్ని అందించిన ఆ మహ నీయుడిని చేర్చాలి.

ఋషికీ, పుణ్యపురుషుడికీ తేడా వుంది. ఋషిలో చెప్పుకో దగిన ఉన్నతి, లేకపోవచ్చు. ఋషికి గుర్తింపు అతని వ్యక్తిత్వం కంటే అతను వ్యక్తంచేసిన దానినిబట్టి వుంటుంది. ఒక జాతిని కానీ, మానవాళినికానీ ఒక సందేశంతో జాగృతం చేయాలంటే, భగవంతుడు ఆ సందేశానికి మాటల రూపం ఇవ్వడానికి ఒక ఋషి వాక్కుని ఎన్నుకొంటాడు. అలాగే, ఒక దివ్యదృశ్యాన్ని లోకానికి చూపాలన్నా, భగవంతుడు మొట్టమొదట దానిని ఒక ఋషి కంటికే చూపిస్తాడు. అప్పుడు ఆ ఋషి తాను అందుకున్న సందేశాన్ని, దర్శించిన సత్యాన్ని తనలోని శక్తినంతటినీ ధారపోసి లోకానికి చాటిచెపుతాడు. మానవుల అంతఃకరణాన్ని చైతన్య వంతం చేయడానికి, మనోవికాసానికి, వారి హృదయాన్ని ఆకట్టు కుని, సాధారణస్థితిలో అసంభవమైన ఉన్నతకార్యాలకి ప్రేరేపించ డానికి – దివ్యప్రేరణతో నిండిన, స్ఫూర్తినిచ్చే ఈ పదాలని ఉచ్చ రిస్తే చాలు. ఆ మంత్రాన్ని లోకానికి తెలియచేయడమే ఆ ఋషి జననకారణం. ఆ మంత్రానికి అతనే ద్రష్ట.

మనం బంకిం పేరుని నేడు ఎందుకు అభిమానిస్తున్నాం? మనకి అతని సందేశం ఏమిటి? తాను చూచిన ఏ దివ్యదృశ్యాన్ని మనం కూడా చూడగలిగేలా చేశాడు? ఆయన గొప్పకవి. అంద మైన శైలిలో, ఊహాసంపత్తితో కాల్పనిక జగత్తు సృష్టించగలడు. కానీ ఈనాడు బెంగాల్ ఆయన్ని కవిగానో, నవలా రచయిత గానో, గౌరవించడం లేదు. భవిష్యత్తులో కావ్యవిమర్శకులు 'కపాలకుండల' 'విషవృక్షం' 'కృష్ణకాంతుని వీలునామా' లని కళాఖండాలుగా గుర్తించవచ్చు. అలాగే 'దేవి చౌదరాణి' 'ఆనంద మఠం' 'కృష్ణచరితం' 'ధర్మతత్వం' లని మెచ్చుకోవచ్చు. ఈ తదుపరి రచనల మూలంగానే బంకింని నవీన భారత నిర్మాత లలో ఒకనిగా పరిగణిస్తాము. మొదటి రచనలలో అతను కేవలం ఒక కవి, శైలిసంపన్నుడు మాత్రమే; కాని తదుపరి వాటిలో ద్రష్ట, జాతినిర్మాత.

కవిగా, రచయితగా కూడా బంకిం జాతికి ఎంతో సేవ చేశాడు. యావత్‌భారతదేశానికీ ప్రత్యక్షంగా సేవ చెయ్యకపోయినా,

జాతీయాభివృద్ధిలో ముందుండి నడిపించడానికి నిర్ణయించబడ్డ బెంగాల్‌కి ప్రత్యక్షంగా సేవచేసి పరోక్షంగా మొత్తం జాతికి సేవ చేశాడు. ఏ జాతియు తన కొత్త ఒరవడినీ, వినూత్న భావాల ఉద్వేగాన్ని వ్యక్తం చేయడానికి, అందరికీ అందించి శాశ్వతంగా స్పందించడానికి తగిన మాధ్యమం లేకపోతే ప్రగతి సాధించ లేదు. జాతీయాభివృద్ధికి నాయకత్వం వహించే బెంగాల్‌కి చక్కని, సంతృప్తికరమైన భాష నందించి బంకిం భారతదేశానికి ఎంతో సేవ చేశాడు. బెంగాలీ భాష స్వచ్ఛతని కలుషితం చేశాడని నిందించారు కానీ, అది స్వచ్ఛమైన బెంగాలీ సాంప్రదాయబద్ధ మైన ప్రాచీన కవుల ఘనీభవించిన ఆలోచనలకే తగును. ప్రగతి చెంది, మారి, విశాలభావాలు సంతరించుకుంటున్న బెంగాల్‌జాతికి ఈ మార్పులని వ్యక్తం చేసే సామర్థ్యంకల భాష నిచ్చాడు. గ్రాంథికమైన పండితుల శైలికి బదులుగా పూర్తి గ్రాంథికమూ కాక, పూర్తి గ్రామ్యమూ కాని వాడుకభాషని ప్రవేశపెట్టి పరి చయం చేసినందుకు బంకింను నిందించారు కానీ నిజానికి నియ మబద్ధమైన గ్రాంథికం వినూత్న వైవిధ్యంతో చిగురించి జాగృత మయ్యే బెంగాలీ మేధస్సుని చక్కగా వ్యక్తం చేసుకునే అవకాశం ఇచ్చేదే కాదు. గంభీరమైన సూక్తులకీ పాండిత్యప్రదర్శనలకే పరి మితం కాకుండా సంస్కృతంలోని బలము, గాంభీర్యము, మృదు త్వంతో గ్రామ్యంలోని వేగము, శక్తి మేళవించి, పూర్తి ఉత్తేజక రంగా ఉంటూ కూడా సుమధుర గంభీరంగా ఉండగల భాష లేమిని బంకిం గుర్తించి, బెంగాల్ తన ఆత్మని వ్యక్తం చేసుకుం దుకు అవసరమైన భాషని సృష్టించాడు.

తన జాతికి భాషాపరంగా భవిష్యత్తులో ఏది అవసరమో చూడగలిగినట్టే, తన జాతి రాజకీయ అవసరాలని కూడా పసి గట్టాడు. మన గొప్ప రచయితలలో రచనలద్వారా ప్రజలలో చైత న్యాన్ని మేల్కొలిపిన వారిలో బంకించంద్రుడు ఆద్యుడు. సమకా లీన సమాజంలో కొనసాగే రాజకీయ ఆందోళన విధానంయొక్క నిష్ప్రయోజకత్వము, కుత్సితాన్ని గ్రహించి 'లోకరక్ష' 'కమల కాంత ఆఫీసు' రచనలలో వాటిని నిర్మొహమాటంగా, వ్యంగ్యంగా

బయటపెట్టాడు. కానీ బంకిం ఇటువంటి destructive విమర్శతో తృప్తిచెందలేదు. జాతివిమోచనానికి అవసరమైన దాన్ని గురించి అతనికి నిర్మాణాత్మక దృక్పథం ఉంది. పాలకవర్గంనుంచి వచ్చే క్రూరత్వాన్ని తగినట్టు ఎదుర్కొనే జాతీయశక్తి అవసరమని గుర్తించి మాటలు కట్టిపెట్టి, చేతల్లోకి, విప్లవంలోకి దిగమన్నాడు. గ్రామసింహాలు నిజసింహాలు కావాలన్నాడు. అతనికి దర్శనమిచ్చిన భారతమాత భిక్షాపాత్ర చేపట్టిన యోగిని కాదు; డెబ్బైవేల జతల చేతులలోనూ, ఖడ్గాలు ధరించిన తేజస్విని. 'ఆనందమఠ్' 'దేవి చౌదరాణి' లలో ప్రత్యక్షంగానూ, పరోక్షంగాకూడా నిర్భయత్వాన్ని, శక్తిసామర్థ్యాలనే బోధించాడు. బాహ్యంగా వ్యక్తమయ్యే ఈ శక్తి వెన్నంటి ఉండే నైతికశక్తి గూర్చి కూడా బంకింకు కచ్చితంగా తెలుసు. ఈ నైతికశక్తి మొదటి సూత్రం త్యాగం – దేశం కోసం పూర్తి ఆత్మత్యాగం, విమోచన కోసం సంపూర్ణ తత్పరత. దేశమాత సేవలో అతను చిత్రించిన యోధులూ, శ్రామికులంతా రాజకీయ బైరాగులే. వీరికి దేశమాతపట్ల సేవాభావము, విధి నిర్వహణ తప్ప వేరు ఆలోచన లేదు. అంతటి ప్రియమైనది, అమూల్యమైనదీ ఇంకేదీ లేదు. కనుక ఈ విధి నెరవేరితే తప్ప అన్యమేదీ వీరికి తోచదు. ఎవరయితే దేశమాతకంటే తమ జీవితాన్నీ, భార్యాబిడ్డలనీ, ఆస్తులనీ ఎక్కువగా ప్రేమిస్తారో వారు సంపూర్ణ దేశభక్తులు కాలేరు. వారివల్ల ఎటువంటి గొప్ప కార్యమూ జరగదు. నైతికశక్తిలో రెండో అంశం ఆత్మసంయమము, నిర్వహణశక్తి. దేవీచౌదరాణి తన కార్యానికి సన్నద్ధమవడంలోనూ, 'ఆనందమఠ్' లోని సంఘంలోని కచ్చితమైన నియమాలలోనూ ఇదే సత్యాన్ని వివరించాడు. నైతికశక్తికి మూడో అంశం దేశప్రేమతో భక్తిని జోడించడం. బంకిం రచనలలోని స్ఫూర్తిదాయకమైన ఆలోచనే దేశభక్తి అనే 'మతం'. 'దేవీ చౌదరాణి' లో కూడా దీని ఛాయలున్నాయి. 'ధర్మతత్వ' 'కృష్ణచరిత' లలో సంపూర్ణ కర్మయోగాన్నే చిత్రీకరించాడు. దీని అంతిమలక్ష్యం తన జాతికీ, దేశానికీ సేవయే. 'ఆనందమఠ్' లో ఇదే భావం మొత్తం పుస్తకానికి మూలమంత్రంగా నిలిచి, సమైక్యభారతదేశ జాతీయగీతమైన

పాటలో సులలితంగా అభివ్యక్తమయింది. ఇది బంకిం జాతికి చేసిన రెండవ సేవ – విమోచనమార్గం సూచించి దేశభక్తి అనే మతాన్ని అందించాడు. జాతిని జాగృతం చేసి, స్వతంత్రం వైపు నడిపిస్తున్న నూతనశక్తికి అతనే ప్రేరణ, రాజకీయ గురువు.

బంకించంద్రుడు తన జాతికి అందించిన మూడో సేవ మహోన్నత సేవ – మన జనని దర్శనం మన కందించాడు. కేవలం 'మాతృభూమి' అనే ఆలోచన పెద్దగా ప్రేరణ కలిగించి ముందుకు నడిపించలేదు. స్వతంత్రం వాంఛనీయమని తెలిస్తే చాలదు. ఏ రాజకీయ సిద్ధాంతానికి చెందినా, దేశానికి తాము ఋణపడి ఉన్నామనీ, పూర్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు హర్షదాయకమనీ ఒప్పుకుంటారు. కానీ ఎక్కువమంది దేశంపట్ల బాధ్యతకీ ఇతర బాధ్యతలకీ పోటీవచ్చినప్పుడు దేశసేవని ఎన్నుకోరు. దేశం స్వాతంత్రం కావాలనే కోరిక ఉన్నా, దాన్ని సాధించే స్థిర చిత్తం లేదు. స్వతంత్ర పోరాటంవల్లనో స్వతంత్ర సాధనవల్లనో మనకి ఎక్కువ ప్రియమైన సంపదలకు ప్రమాదం వస్తుందేమోనని మన భయం. *దేశమంటే మట్టి కాదు, మనుషులూ కాదు, అపారప్రేమమయి మాతృమూర్తి అనే సుందరదృశ్యం నీ మనసులో నిండి నీ హృదయాన్ని చూరగొన్నప్పుడే ఈ అర్థరహిత ఆందోళనలూ, అల్ప ఆలోచనలూ చెల్లాచెదరై దేశభక్తి అనే నవ చైతన్యం మేల్కొని పతనమైన జాతిని రక్షించగలదు.* అటువంటి దివ్యదర్శనాన్ని పొంది దాన్ని ఇతరులకు వివరించే భాగ్యం కొంతమందికి కలుగుతుంది. 32 సంవత్సరాల క్రితం బంకిం 'వందేమాతరం' రచించినప్పుడు ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. కానీ హఠాత్తుగా బెంగాల్ జాతి అజ్ఞానపు భ్రాంతినుంచి మేల్కొని సత్యాన్వేషణ చేస్తుంటే ఒక సుముహూర్తంలో ఎవరో వందేమాతరం పాడారు. అంతే మంత్రోపదేశమయినట్లు ఒక్క రోజులో జాతి మొత్తం దేశభక్తులుగా మారారు. ఆ జనని వీరికి దర్శనమిచ్చింది. ఒక్కసారి ఆ దర్శనమయాక, ఆమెకి మందిర నిర్మాణమయి, విగ్రహప్రతిష్ఠ, ఆత్మప్రదానము జరిగేదాక ఎవ్వరికీ నిద్రా

పోరాలుండవు. ఆ దివ్యదర్శనం కలిగిన జాతి తిరిగి ఎవరికీ బానిసగా అవటమనే ప్రశ్నే లేదు.

(*SABCL* Vol. 17, pp. 344-47)

అనువాదం: బి. వరలక్ష్మి

ప్రజాస్వామ్యము

13 జూలై 1911 నాడు పార్థసారథికి రాసిన లేఖ

మనది సనాతనధర్మము. మన రాజకీయములు కూడ ఈ సనాతనధర్మముతో ముడిబడి వుంటాయి. మన దేశ స్వరాజ్యముకూడా అంతే. అందుకనే నిన్ను ఈ కుటిలరాజకీయాలకు దూరంగా వుండమని హెచ్చరిస్తున్నాను. కాని మనం కూడా ఈ పార్లమెంటరీ రాజ్యాంగవిధానాన్ని అవలంబించి దానియొక్క లోటుపాట్లను గుర్తించటం తప్పనిసరి. అప్పుడుగాని దేశపరిపాలనకి అది ఎంత నిష్ప్రయోజనమో మనకి తెలియదు. ప్రస్తుతం ఈ దేశము ఒక సమిష్టి యోగపు తొలిదశలో ఉన్నది. 1905 సంవత్సరములో పైనుంచి దిగివచ్చిన మహాశక్తుల ఫలితమే అది. ఆ శక్తులు దేశాన్ని తామసికదశనుండి తట్టి లేపినై. కాని దాని పర్యవసానంగా పాత సంస్కారాలు పైకి వచ్చినయి. దేశంలో పాతుకుని వున్న కీడంతా 'నేను కూడా వున్నాను. నా సంగతి ఏమిటి?' అని విజృంభించి ఆ దివ్యశక్తులను దుర్వినియోగము చేసినయి. దేశంలో నేడు జరుగుతున్న విప్లవాత్మకమైన సంఘటనలు, మనుషులను రెచ్చకొట్టే ఉపన్యాసాలు, సభలు, ఊరేగింపులు, passive resistance, తుపాకులు, బాంబులు, హింసాకాండ మొ|| అల్లకల్లోలమంతా వాటి ప్రతాపమే. దీనిని అణచివేసేందుకు పాలకులు చట్టాలను, క్రూరమైన శాసనాలను అమలుచేసారు. ఈ దమనకాండ అంతా అపరిశుద్ధమైన రాజసికప్రవృత్తి. ఈ విధంగా నిరాశచెందిన రాజసమునకు పర్యవసానముగా తామసికము బహిర్గ

తమైనది – ఆంగ్లేయుల స్వేచ్ఛావాదమునుండి మితవాదము పుట్టింది. ఆసియా ఐరోపాల సంకరజాతి బిడ్డ జాతీయవాదము జన్మించినది. విఫలమైన 'బాకునిన్' 'మాజిని' ప్రభృతులనుండి ఉగ్రవాదము చెలరేగింది. అయితే భగవంతుడు ఈ ఉద్యమాల నన్నిటిని కొట్టిపారేశాడు. ఉగ్రవాదము ఇంకా కొనసాగుతూనే ఉంది గాని, ఇది దాని అంతిమదశ. ప్రస్తుతం అదే మన శత్రువు. ఎందుకంటే బ్రిటిష్‌పాలకుల దమనకాండ మనకు విరోధమని నేను అనుకోను. అది మనకు సహాయకారియే కాగలదు. ప్రస్తుతం చెలరేగుతున్న హింసాకాండ, ప్రజలను రెచ్చకొట్టే కరపత్రాలు, మారణహోమము, దేశభక్తి పేరుతో జరుగుతున్న 'ఫెరింగీ కో మారో' అనే నినాదాలు, పన్నాగాలు, ఆధునిక సైన్యాన్ని లాఠీల తోటి, నాలుగు తుపాకులతోటి ఓడించాలనే మూర్ఖత్వము – ఇదంతా రజోగుణముయొక్క విలయతాండవమే. ఈ మూర్ఖత్వము పోయినప్పుడుగాని సత్యము ఆవిర్భవించేందుకు అవకాశముండదు. అప్పుడు ఈ జాతిలో సాత్వికమనస్సు ఆవిష్కారము కావాలి. భారతదేశము పునర్జన్మ నొందుటకు నాందిగా ఆధ్యాత్మికోద్యమము బలాన్ని పుంజుకోవాలి. కాని మార్గంలో కష్టాలు రాక తప్పవు. వాటి నెదుర్కోవాలి. ఈ సంఘటనల ద్వారా దేవుడు మనకి మార్గాన్ని చూపిస్తున్నాడు. అనువైన అనుభవముల నిచ్చి సరియైన పరిస్థితులను కల్పిస్తున్నాడు. అనంతరము మనము సన్మార్గముపై పయనించగలము.

13 జూలై, 1911

నవంబరు 1922 లో సి.ఆర్. దాస్‌కు రాసిన విషయములు

మానవుడు తన జీవితాన్ని ఒక నూతన ప్రాతిపదిక మీద నిలబెట్టి ఉన్నతస్థాయికి ఎదిగేంతవరకు ఈ వృథాప్రయాస తప్పదు. ప్రపంచం కోసం ఈ ప్రయత్నాన్ని చేసి విజయం సాధించుటయే భారతదేశపు కర్తవ్యమని నేను నమ్ముతున్నాను.

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

జీవిత ఉత్తరార్థంలో శ్రీఅరవిందుల అభిప్రాయములు

శ్రీఅరవిందులకు 1938 నవంబరులో తొడ ఎముక విరిగినప్పుడు కొంతమంది శిష్యులు వారిని సేవించుకునేవారు. ఆ రోజుల్లో శ్రీఅరవిందులకు వారి శిష్యులకు మధ్య వివిధ అంశాలపై ఇష్టా గోష్ఠిగా సంభాషణలు జరిగేవి. ఇవి సాధారణంగా సాయం సమయాల్లో జరిగేవి. నిరోద్‌బరన్, ఎ.బి.పురాణి వీరిద్దరు ఆ సంభాషణలను జ్ఞాపకం ఉంచుకొని అక్షరబద్ధం చేశారు. ఆ తరువాత వాటిని పుస్తకరూపంలో నిక్షిప్తం చేశారు. అటువంటి వాటిలో కొన్నిటిని పొందుపరుస్తున్నాము.

1938 డిసెంబరు 27

ప్రాచీన భారతీయ విధానం సూటిగా జీవితంలోంచి ప్రాదుర్భవించింది. కనుకనే అందులో సకల విషయాలకు, సమస్త ప్రయోజనాలకు తావు ఉంది. దీనిలో రాజుల పాలన ఉంది. ఉన్నతవర్గాలకు స్థానం ఉంది. ప్రజాస్వామ్యం ఉంది. ప్రతీ ఒక్క వర్గానికి ప్రభుత్వంలో ప్రాతినిధ్యం ఉంది.

ఐరోపాలో అయితే, అక్కడి పాశ్చాత్యవిధానం మేధాప్రతిష్ఠితం. కాబట్టి అక్కడ ప్రతిదాన్నీ హేతువాదమే నడిపిస్తుంది. స్వేచ్ఛకుగాని, వైవిధ్యానికి గాని అవకాశమే లేకుండా ప్రతీదీ ఖచ్చితంగాను, కర్కశంగాను జరగాలని వాంఛిస్తారు. అది ప్రజాస్వామ్యమే అయితే కేవలం ప్రజాస్వామ్యమే – మరి దేనికీ స్థానం లేదు. బహుముఖంగా స్పందించే కౌశలం ఉండదు.

భారతదేశం ఇప్పుడు ఆ పాశ్చాత్య విధానాన్ని అనుకరించాలని ప్రయత్నిస్తోంది. పార్లమెంటరీ విధానం భారతదేశానికి అసలు పడదు. అయినా సరే. పాశ్చాత్య నమూనాల నవలంబించటం మనకు మామూలే కదా!

ప్రశ్న: భారతదేశానికి ఆదర్శప్రభుత్వ విషయంలో మీ అభి ప్రాయం ఏమిటి?

నా ఉద్దేశం అంటే? ఒకసారి రవీంద్రుడు రాసిన దాని లాంటిదే. అగ్రస్థానంలో రాష్ట్రపతి ఉండాలి. పాలనావిధానాలు కొనసాగేలా చూస్తూ వాటిని పరిరక్షించడానికి అవసరమైనన్ని అధికారాలు ఆయనకు ఉండాలి. జాతికి ప్రాతినిధ్యము వహించే ఓ అసెంబ్లీ ఉండాలి. ఉన్నతస్థాయిలో రాష్ట్రాలు అన్నీ సమాఖ్యంగా సమైక్యం కావాలి. అయితే స్థానికసమస్యలకు అనుగుణంగా శాసనాలు చేసుకోవడానికి తగినంత అవకాశం స్థానిక సంస్థలకు ఉండాలి.

1939, జనవరి 18

నేను ఒక ఆధ్యాత్మిక పరిష్కారాన్ని ప్రతిపాదించాను. అది మానవుని ప్రాతిపదికనే మార్చడానికి ఉద్దేశించింది. ఇది ఏదో ఒక ఉద్యమాన్ని లేవదీయడం కాదు. ఏ కొన్ని సంవత్సరాలకో పరిమితమైందీ కాదు. జీవితానికి పీఠికగా ఆధ్యాత్మికతను సంస్థాపితం చేసుకుంటేతప్ప నిజమైన పరిష్కారం లేదు.

మానవస్వభావాన్ని మార్చటం – అతని తత్త్వములో మౌలికమైన పరివర్తనము గావించటము మనస్సుకు మించిన విషయం. అందుకని మానవప్రయత్నాలు, ప్రణాళికలు విఫలము గాక తప్పవు.

1939, జనవరి 29

(సి.ఆర్) దాసు ఓసారి నేరస్తులను గురించి ఏమన్నారో తెలుసా! "నా మొత్తం న్యాయవాద జీవితంలో పరమనీచమైన తరహాకి చెందిన నేరస్తులు రాజకీయాలలో తప్ప మరెక్కడా తగల్లేదు".

*

1939, ఫిబ్రవరి 2

ప్రజలు ఈ రోజుల్లో పార్లమెంటరీ తరహా ప్రభుత్వమనే ఆధునిక ప్రజాస్వామ్యాన్ని కోరుతున్నారు – పార్లమెంటరీ విధానానికి కాలం తీరిపోయింది. ఐరోపాను ప్రస్తుత నికృష్టస్థితికి తీసుకొచ్చింది ఇదే.

(భారతదేశంలో) మనం పాత పంచాయితీపద్ధతిని గ్రామాల్లో ప్రారంభించి అక్కణ్ణుంచి ఉన్నతస్థాయివరకు అమలుచేయడానికి కృషిచేసుకుంటూ రావాలి. పంచాయితీ విధానం, వృత్తిసంఘాలు ఎక్కువగా ప్రజాప్రాతినిధ్యంతో ఉంటాయి. అవి ప్రజల అభిప్రాయాలు కలిగి ఉంటాయి. పార్లమెంటరీ విధానం దీనికి పూర్తిగా విరుద్ధం. ఈ విధానంలో స్థానికసంస్థల కౌన్సిళ్ళు సరిగా పని చేయలేవు. ఈ కౌన్సిళ్ళకు ప్రజలతో సజీవమైన సంబంధం ఉండదు. కౌన్సిలర్లు కేవలం వేదికప్రసంగాలే చేస్తారు. వారి పదవీ కాలంలో ఏం చేస్తారో ఎవరికీ తెలీదు. పదవీకాలంలో డబ్బుచేసుకోవటమే వాళ్ల పని. ఆ గడువు అయిపోయిన తరువాత ఏమీ మార్పు ఉండదు. మళ్లీ యథాప్రకార సిద్ధిరస్తు!

అనువాదం: పున్నమరాజు నాగేశ్వరరావు

Real happiness is of divine origin; it is pure and *unconditioned*. Ordinary happiness is of vital origin; it is impure and depends on circumstances.

Sri Aurobindo

మృతుల సంభాషణ

శివాజీ – జైసింగ్

జైసింగ్: మనిద్దరి సంకల్పాలూ నెరవేరలేదు. మూఢవశక్తి మన శ్రమఫలితాన్ని తన్నుకుపోయింది నేను పడిన శ్రమ అంతా వృథా అయిపోయింది. నేనారాధించిన ఆదర్శం మట్టికొట్టుకు పోయింది.

శివాజీ: నేను నా స్వలాభం కోసం పనిచేయలేదు. పరాజయం నన్ను దిగ్భ్రమపరచనూ లేదు, నిరుత్సాహపరచనూ లేదు.

జైసింగ్: నేనూ నా వ్యక్తిగతలాభం కోసం శ్రమించలేదు. నా శ్రమంతా రాజుపుత్రుల ఆదర్శాన్ని నిలబెట్టేందుకే. గౌరవ ప్రదమైన యుద్ధంలో మొక్కవోని ధైర్యం, మిత్రునిపట్ల శత్రువుపట్ల శరణాగతరక్షణ (chivalry) మన మెన్నుకున్న ప్రభువుపట్ల గౌరవప్రదమైన విశ్వాసం – ఇవే నాకు నిజమైన భారతీయసంప్రదాయ లక్షణాలనిపించాయి.

ఇవే నాకు హిందూజాతుల ఆధిక్యత, ఐక్యతలకన్న మించినవి అనిపించింది. కాబట్టే నేను నీతో చేతులు కలపలేదు. నీకు మట్టుకు నా సంప్రదాయాన్ని అంగీక రించేందుకు అవకాశాన్నిచ్చాను. నువ్వు, నేను వంచింప బడినప్పుడు, నీవు తప్పించుకొనుటకు సహకరించి, నా గౌరవాన్ని కాపాడుకున్నాను.

శివాజీ: భగవంతుడు నాకు రక్షణ కల్పించాడు. ఒక స్త్రీమూర్తి హృదయాన్ని కదిలించి, ఆమె నాకు తన సహకారాన్ని, ప్రేమనూ అందించేటట్లు చేశాడు. సంప్రదాయాలు మారి పోతూంటాయి సుమా! రాజపుత్ర ఆదర్శానికి భవిష్యత్ ఉంది. ఆ ఆదర్శంలో, తాత్కాలికమైన దానిని తొలగిం చేందుకు, మూసను బ్రద్దలుకొట్టవలసి వచ్చింది. నేనె న్నుకున్న ప్రభువుపట్ల విశ్వాసముంచటం మంచిదే. కాని జాతి కోరుకున్న ప్రభువుపట్ల విశ్వాసము మరింత మంచిది. భగవంతుని శక్తి రాజుద్వారా ప్రకటితమవటం

వలన, రాజే దేవుడనమాట. కాని అదలా ఎందుకు ప్రకటితమయిందంటే, ఆ రాజు ప్రజల వ్యక్తి కాబట్టి. జాతిలోని దైవానికి సేవకుడే **రాజు**. మహారాష్ట్రుల ఆరాధ్య దేవత విఠోబా, భారతమాతగా అవతరించిన భవాని మాతల బలంతో నేను జయించాను.

జైసింగ్: నీ రాజకీయాదర్శం గొప్పదే. కాని దానిని సాధించటానికి, నీవు ఎన్నుకున్న మార్గాలు అత్యంత జుగుప్సాకరమైనవి. ఎత్తులు, ద్రోహం, దోపిడి, హత్యలకు కూడ నువ్వు వెనకాడలేదు!

శివాజీ: నేను నాకోసం పోరాడలా, నాకోసం నేను పాలించలా, మహారాష్ట్రధర్మం కోసం, సమర్థ రామదాసు ప్రవచించిన హిందూజాతీయ ధర్మం కోసం నేనివన్నీ చేశాను. నేను నా శిరస్సును భవానీమాత కర్పించాను. జాతి మంచి కోసం, నేనో ప్రణాళిక, తంత్రాన్ని నడిపేందుకని, ఆ తల్లి నా శిరస్సు నుంచుకోమంది. నేను నా రాజ్యాన్నే రామదాసు కర్పించాను. కాని వారే నన్ను దానిని తిరిగి, మహారాష్ట్రులు మరియు భగవంతుని కానుకగా స్వీకరింపచేశారు. ఆ ఇద్దరి ఆజ్ఞలను నేను శిరసావహించాను. భగవంతుడు ఆదేశించినప్పుడు సంహరించాను. నేను నీకిస్తున్న ధనం ఈ రూపేణా అని భగవంతుడన్నప్పుడే, నేను దోపిడీ చేశాను. ఎవరికీ ద్రోహం చేయలేదు. ధనం, సైనికబలాల కొరతలను నా ఎత్తులు, తంత్రాల ద్వారా అధిగమించాను. శత్రుసైనికబలాన్ని కేవలం నా తెలివి తేటలతో జయించాను. ప్రపంచం రాజకీయాలలోను, యుద్ధంలోను కుట్రలు, మోసము న్యాయమే అంది. కాని శరణాగతుల రక్షణలో రాజపుత్రులకున్న విశాలబుద్ధి ఐరోపా, యితర ఆసియాదేశస్థులకు లేదు.

జైసింగ్: నేను ధర్మాన్ని అత్యుత్తమమైనదానిగా (Supreme) భావించాను. దేవుడు కూడా నన్ను ఆ ధర్మాన్ని వదిలేటట్లు చేయలేకపోయాడు.

శివాజీ: నేను 'నాది' అన్నదాన్నంతా అయనకే అర్పించాను. ధర్మాన్ని కూడా ఉంచుకోలా. ఆయన సంకల్పమే నా ధర్మం, భగవంతుడు నా నాయకుడు, నేనాయన సైనికుణ్ణి మాత్రమే. ఆయనయందే నా విశ్వాసం. ఔరంగజేబుకు, నైతికసూత్రాలకూ కాదు. నన్నుపంపిన ఆ భగవంతునికి మాత్రమే.

జైసింగ్: భగవంతుడే మనందరినీ పంపాడు. కాని వివిధ కార్యాల కోసం పంపాడు. ఏ కార్యంకోసం ఎవరు పంపబడ్డారో, దాని ప్రకారం అతని ఆదర్శం, అతని వ్యక్తిగతశీలం భగవంతునిచే మలచబడుతుంది. మొగలులు పతనమయ్యారని నే బాధపడటంలేదు. అతనికి సార్వభౌమత్వాన్ని నిలుపుకొనే అర్హత కలిగివుంటే, అతను దానిని కోల్పోయేవాడు కాదు. దాని కతను అనర్హుడైనా, నేను నా విశ్వాసాన్ని, నా సేవనూ, నా విశ్వాసపాత్రతనూ అలాగే ఉంచాను. నా ప్రభువు పరిపాలనను విమర్శించటం నా పని కాదు. అతనిని నియమించిన భగవంతుడే అతనిని విచారిస్తాడు.

శివాజీ: ఆ భగవంతుడే అన్యాయానికి, అక్రమపరిపాలనకు ఎదురుతిరగమని తిరుగుబాటుదారుని కూడా నియమిస్తాడు, భగవంతుడు ఎప్పుడూ అధికారపక్షం వహించడు. కొన్ని సమయాల్లో, తానే విముక్తిదాతగా ఆవతరిస్తాడు.

జైసింగ్: అయితే తానిచ్చిన మాట ప్రకారం, ఆ భగవంతుణ్ణే స్వయంగా దిగిరమ్మను. అప్పుడే విప్లవం న్యాయమనిపించుకుంటుంది.

శివాజీ: *ఆయనిక్కడే మన హృదయాల్లో ఉన్నప్పుడు ఎక్కణ్ణుంచో దిగిరావడమేమిటి? ఆయన్ని నా హృదయంలోనే చూడబట్టే, నా కార్యాన్ని నెరవేర్చేందుకు సమర్థుడనయ్యాను.*

జైసింగ్: నీది దైవకార్యమే అని భగవంతుని ఆమోదముద్ర ఎక్కడుంది?

శివాజీ: నేనొక మహాసామ్రాజ్యాన్ని నిర్వీర్యం చేశాను. అది మళ్లీ కోలుకోలేదు. నేనొక జాతిని నిర్మించా, అదింకా సజీవంగా ఉన్నది.

అనువాదం: కాకుమాని తారానాథ్

సమాచార పత్రం

29 మార్చి 1914 నాడు శ్రీమాత మొట్టమొదటిసారి శ్రీఅరవిందులను కలుసుకొనిరి. ఆ పవిత్రదినము యొక్క వార్షికోత్సవము ఆశ్రమంలో జరుపబడినది. శ్రీఅరవిందులు 4 ఏప్రిల్ 1910 లో పాండిచ్చేరికి వచ్చి స్థిరపడిన శుభదిన వార్షికోత్సవము ఆశ్రమానికి నూతనసంవత్సరాదిగా పరిగణింపబడినది.

24 ఏప్రిల్ 1920 లో శ్రీమాత పాండిచ్చేరికి వచ్చి స్థిరపడిరి. “అది దుష్టశక్తులమీద విజయమునకు తార్కాణము” అని శ్రీమాత నుడివిరి. ఆ దర్శనదినమునాడు పంచిపెట్టిన సందేశామృతము.

You will await your joys and pleasures from the Divine alone. In him alone will you seek and find help and support. He will comfort you in all your sorrows, guide you on the path, lift you up if you stumble, and if there are moments of failure and exhaustion, he will take you up in his strong arms of love and enfold you in his soothing sweetness.

సుఖసంతోషాదులు దైవమొక్కడే నీకు సమకూర్చగలడు. కాబట్టి నువ్వు ఆయననే సహాయము కోరుకొని నీ కండదండగా ఉండమని వేడుకొనవలెను. ఆయనే నిన్ను దుఃఖమునుండి నివారించి నీకు సన్మార్గమును చూపించగలడు. ఒకవేళ కష్టాలొచ్చినా, నువ్వు అలసటుచెందినా ఆయనే నిన్ను లేపి తన దృఢమైన హస్తములతో గుండెకు హత్తుకొని ప్రేమతో ఆలింగనము చేసుకొనును.



రోగము – నివారణ

అఖిల

అఖిల భారత పత్రిక

జూలై 2003


రోగము – నివారణ

7/7/2003.

శ్రీమాత ప్రవచనములు

To be cured is good,
but to avoid being ill is better.

– The Mother



THE MOTHER

At the Ayurvedic Section of the Ashram
on its first anniversary: 22.2.1958

1

భూలోకచరిత్రలో మన మిపుడొక మంచిముహూర్తంలో, ఒక యుగసంధిలో వున్నాము. అనంతకాలవాహినిలో ఇది ఒక్క క్షణమే కావచ్చుకాని మానవజీవితంతో పోల్చి చూచినట్లైతే ఎక్కువే. ఒక నూతనసృష్టి రాబోతోంది. ఈ నూతనసృష్టి కోసం భౌతిక పదార్థం మారుతోంది. కాని మానవశరీరం తన జడత్వమువలన ఈ మార్పును తట్టుకోలేక దానిని ప్రతిఘటిస్తోంది. తత్కారణంగా ఇంతవరకు కనివిని ఎరుగని కొత్త కొత్త రోగాలు పుట్టుకొస్తున్నాయి. అవి వైద్యులకు కూడ లొంగుటలేదు.

దీనికి పరిష్కారమేమిటో కనుక్కోవాలి. సృష్టిని పరిణమింపజేస్తున్న ఆ దివ్యశక్తులతో మనం సహకరించాలి. *ఎంతో నిశ్చలంగా, ప్రశాంతంగా, విశ్వాసపూర్వకంగా ఆ శక్తులను మనలోకి ఆహ్వానించాలి!*

(*CWM* Vol. 16, p. 421)

Good health is the exterior expression of an inner harmony.

భయమే మూలకారణం

వ్యాధికి భయమే మూలకారణమట. వైద్యులు వ్యాధులకు ఏవేవో కారణాలు చెప్పవచ్చు. కాని నిజమైన కారణం నీ అవచేతనలో (subconscient fear) దాగివుంటుంది. నీకు జబ్బు నయం కావాలంటే నీ జబ్బును గురించి అదేపనిగా ఆలోచించకూడదు. దైవానుగ్రహము వున్నది కనుక నీకింక భయమెందుకు? నీ సంరక్షణ అంతా ఆ దైవానికే వదిలేసేయాలి. – సంపాదకుడు

2

నీ బాధ లన్నిటికీ మూలకారణం భయమే – అందుకని నువ్వసలు భయపడకూడదు. నిజానికి నూటికి తొంభైపాళ్లు రోగాలన్ని శరీరంలో దాగివున్న భయంనుంచే ఉత్పన్నమౌతాయి. శరీరానికి ఎంత చిన్నబాధ కలిగినా "అయ్యో ఏమైపోతుందో బాబోయ్" అని శరీరగత చైతన్యము ఆదుర్దాపడుతూ వుంటుంది. నీకు దైవానుగ్రహంలో నమ్మకం లేదనీ, నీ సమర్పణ ఇంకా అపరిపూర్ణంగా ఉన్నదని చెప్పేందుకు ఇదే తార్కాణం! ఇక ఏమి జరుగనున్నదోనని దానికొకటే భయం. ఈ భయాందోళనల నేమాత్రం రానివ్వకూడదు.

నీ సుప్తచైతన్యంలోని భయం (subconscient fear) పైకి వచ్చినప్పుడు అది జబ్బుగా పరిణమిస్తుంది. అయితే నువ్వా భయాన్ని జయించగలవు. దైవానుగ్రహమనేది ఒకటి నిన్ను కాపాడుతోందనే విషయము నీ మనస్సుకు తెలుసు. అయితే అది నీ శరీరానికి కూడ తెలియాలి. నీ మనస్సుతో దానికి నచ్చచెప్పాలి. ఆ దైవానుగ్రహము నీలోను, నాలోను మనందరిలోను పనిచేసి మనని ఓ అద్భుతమైనస్థాయికి తీసుకుపోతుందనే విశ్వాసం నీ శరీరానికి కూడ కలగాలి. అది దైవేచ్ఛకు అధీనమైపోవాలి.

> రోగాలకు మూలకారణం భయమే. భయాన్ని పోగొట్టుకుంటే రోగం మాయమైపోతుంది.

ఈ పాంచభౌతిక దేహాన్ని అచేతననుండి తప్పించి చైతన్య వంతం చేయాలి. మూలములో తను దైవమే అని, దైవము తన యందు చేయు ప్రక్రియకు అడ్డుతగలకుండా వున్నయెడల తన కేమియు హాని జరగదనే నమ్మకం దానికి కలిగించాలి; భయం పూర్తిగా పోయేంతవరకు మళ్లీ మళ్లీ ఈ ప్రక్రియను కొనసాగించాలి. అప్పుడు ఒక వేళ జబ్బుచేసినా కూడ అది ప్రాథమిక స్థాయిలోనే ఉండి, వెంటనే తగ్గిపోతుంది.

(*CWM* Vol. 15, pp. 151,152)

3

నీకు జబ్బు చేసినప్పుడు ఏమాత్రము భయపడకుండా, నదురు బెదురు లేకుండా దానిని ధైర్యంగా ఎదుర్కోవాలి. వ్యాధి అనేది ఒట్టి falsehood అని, ఇది శరీరముయొక్క నిజస్వరూపమేం కాదనీ తెలుసుకోవాలి. "దైవానుగ్రహం నా యందుండి నన్ను రక్షిస్తున్నప్పుడు అది నన్నేం చేయగలదు?" అనే గాఢమైన నమ్మకంతో ప్రశాంతంగా వుండాలి. అప్పుడు నీ అంతరంగంలో నిక్షిప్తమైన దైవానుగ్రహము నీ అగాధాలలోకి కూడా చొరబడి నీ రక్తకణములను ఉద్దీపింప చేస్తుంది. అప్పుడా కణములు కూడా నిత్య సత్యానందముల ననుభవించగలవు.

*

వ్యాధి నయమగుటకు రెండే రెండు నిబంధనలున్నవి. ఒకటి నిర్భయత్వము ... భయం ఛాయలు కూడా నీ మీద పడేందుకు వీలు లేదు. దైవసంరక్షణలో సంపూర్ణవిశ్వాసము రెండవది. ఈ రెండు నిబంధనలు తప్పనిసరి.

(*CWM* Vol. 15, p. 152; Vol. 14, p. 93)

*

దైవానుగ్రహమునందు అచంచలమైన విశ్వాసము కలిగియుండుటకన్న మిన్నయైన మార్గము లేదు.

4

నీవే మాత్రము విచారించరాదు. దానిని గురించి అసలు ఆలోచించనే ఆలోచించకూడదు. ఒకవేళ ఆలోచించావో, దాన్ని నీవు ఆకర్షిస్తున్నావన్న మాట! ముఖ్యంగా నువ్వు భయపడినట్లయితే వ్యాధి ముదిరిపోయే అవకాశ మెక్కువవుతుంది.

అలా కాకుండా నీవు పూర్తిగా జబ్బును గురించి మర్చిపోయి మరో పనిలో నిమగ్నమైనట్లయితే నీ జబ్బు నయమయ్యే అవకాశం ఎక్కువవుతుంది.

*

నీకు జబ్బు చేసినపుడు అందరి కళ్ళు నీమీద, నీ జబ్బుమీద ఉంటయి. అందరు నిన్నెంతో శ్రద్ధగా చూస్తున్నప్పుడు నువ్వు నిన్ను నయంచేయగల అసలైన వైద్యుణ్ణి మరచిపోతావు. దేవుని సహాయం కోరాలని నీకు తట్టనే తట్టదు. “అందరూ నా మీద ఎంత శ్రద్ధాభిమానాలు ఒలకపోస్తున్నారో చూసావా! ఈ రోగం రావటం కూడ ఒకందుకు మంచిదేలే” అనే ఘోరమైన యిరకాటంలో పడిపోతావు!

*

ఈ అల్పాల్పవిషయాలతో నువ్వు సతమతమైపోకూడదు. అవి అంత ముఖ్యమైనవేమీ కావు. వాటి పనల్లా నీలో మారుమూల దాగియున్న చీకటి ప్రదేశాలను ఎత్తి చూపటమే. నువ్వు ఆ చీకటిని చూసి, వెలుగును చూపించి ఆ అజ్ఞానాంధకారాలను పారద్రోలేందుకే అలా జరుగుతుంది.

(*CWM* Vol. 15, pp. 154, 155, 148, 154)

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్, శాస్త్రి, ఆర్ లక్ష్మీప్రసాదమ్మ

ఆరోగ్యం: నువ్వు దానిని గురించి ఏమాత్రం పట్టించుకోకుండా ఆ విషయాన్ని దైవానికే వదిలేసేయాలి.

జబ్బులను గురించి తలుచుకోకూడదు

మనది పాంచభౌతికశరీరము. బాధలకు తట్టుకోలేదు. తీవ్రమైన దాడులకు అసలే తట్టుకోలేదు. మనిషిలో భయమేర్పడుతుంది. భయంవలన నువ్వే 'బాధ' అనే ఒక formation ను సృష్టిస్తావు. అది నిన్ను వేధిస్తూ వుంటుంది – కారణంవున్నా సరే, లేక పోయినా సరే. అలా కాకుండ నీ చేతనను ఎప్పుడూ అత్యుత్త మస్థాయిలో ఊర్ధ్వోన్ముఖముగా ఉంచిన యెడల నిన్నే జబ్బులు అంటవు, నీకే బాధా రాదు. – *సంపాదకుడు*

5

కొన్ని శారీరకమైన బాధలు భరించటం చాలా కష్టమని మనం తరచు వింటూనే వుంటాము. అందుకని ముందరే మనకి భయం వేస్తుంది. అంతటితో ఆగదు. ఆ భయం ఒక సూక్ష్మరూపాన్ని సృష్టిస్తుంది. ఏమాత్రం అవకాశమున్నా అది బైటికి వచ్చి నిజంగా ఏ కారణం లేకపోయినా కూడ నిన్ను బాధపెడుతుంది.

సరే, నిజంగా బాధ కలిగిందనే అనుకుందాం. అప్పుడు నీ చైతన్యాన్ని ఊర్ధ్వదిశగా అనగా భగవంతుని వైపుకి మరలించిన ట్లైతే, ఆ బాధ మాయమవుతుంది. అధోదిశగా అనగా అజ్ఞానం వైపుకి మరలిస్తే, బాధ కలగటమే కాదు, అది ఎక్కువవుతుంది కూడా. ఈ ఊర్ధ్వ, అధోముఖ ప్రయోగాలవలన నీకొక విషయం స్పష్టంగా తెలిసిపోతుంది. బాధకు శారీరక రుగ్మతతో ఎలాంటి ప్రమేయం లేదని, శారీరక పరిస్థితి ఏవిధమైన మార్పుచెందక నిల కడగా ఉన్నప్పటికీ, శరీరానికి కలిగే బాధ తీవ్రతరం కావచ్చు లేదా అసలు బాధ అనేదే లేకపోవచ్చు. అంతా నీ చేతనాస్థాయిని బట్టి ఉంటుంది. *చేతనను దైవోన్ముఖం* చెయ్యటం అన్నిటికంటె మంచి పద్ధతి. అది వీలుకానియెడల నీ ఆలోచనలను బాధవైపు గాక, మరో పనిమీదగాని, నీకు ప్రియమైన వేరే విషయంపైకి గాని మరల్చినట్లయితే ఆ బాధ ఉపశమిస్తుందని చెప్పవచ్చు.

మనస్సును బాధనుండి దైవంవైపుకి మరల్చినప్పుడు ఆ బాధ తగ్గడమే కాకుండా, శరీరావయవాల్లోని ఏ లోపమయినా సులభంగా సరిచేయబడుతుంది. ఇదియే దైవత్వంలో ఉండే 'సత్' స్వభావం – ఈ విశ్వానికి ఆవల, పైన, వెనుక, అంతటా ఆవృతమైవున్న స్వచ్ఛమైన పరతత్త్వం. దానితో సంబంధం పెట్టుకున్నట్లయితే, మనం అన్ని దైహికబాధలను అధిగమించవచ్చు.

(CWM Vol. 15, pp. 156-157, 158)

అనువాదం: ఎ. కైలాసవతి

6

బిడ్డా! ఇది నీ విశ్వాసానికి పరీక్షా సమయము. ఎన్ని కష్టాలు వచ్చినప్పటికి అది చెక్కుచెదరకూడదు. "నాకు జబ్బు తప్పకుండా తగ్గిపోతుంది" అనే గట్టి నమ్మకం కనక ఉన్నట్లయితే నీ జబ్బు నిజంగా మాయమైపోతుంది.

*

జబ్బు తగ్గవలెనంటే శాంతిసహనాలు చాలా అవసరం. జబ్బు తప్పకుండా తగ్గిపోతుందనే గట్టి విశ్వాసంతో ప్రశాంతంగా వుండాలి.

*

To keep quiet and to concentrate, leaving the Force from above to do its work, is the surest way to be cured of anything and everything. There is no illness that can resist that if it is done properly, in time and long enough, with a steady faith and a strong will.

(*CWM* Vol. 15, pp. 161, 160, 172)

అనారోగ్యాన్ని ఆదరించకు. అప్పుడే అది నిన్ను వదులుతుంది.

7

ఎవరైతే దైవానికి సంపూర్ణంగా చిత్తశుద్ధితో అర్పించుకొని దైవా నుగ్రహం మీద అచంచల విశ్వాసం కలిగి ఉంటారో అటువం టివారి విషయంలో జబ్బు చాలా ఆశ్చర్యకరమైన రీతిలో తగ్గిపో వచ్చు. కాని ఆమెలో ఆ లక్షణాలేమీ లేవు. ఆమె పూర్తిగా భయం, కోరికలు, కోరుకున్నది జరిగితీరాలనే పట్టుదలతో ఉంది. ఆమె నిరంతర ధ్యాస బాహ్యశరీరం మీదనే. పైగా అవి తన అవస రాలే అని దబాయిస్తుంది. ఇది చిత్తశుద్ధితో కూడిన అర్పణ కాదు గదా, దానికి పూర్తిగ విరుద్ధమైన విషయం.

*

ప్రపంచంలోని భౌతికవాదం, వాస్తవికతా దృక్పథావాదాలన్ని కూడ ప్రజలు దైవానుగ్రహాన్ని విస్మరించటం మూలాన ఏర్పడ్డవే. వారి వ్యాధి నయం అయితే "నన్ను నేనే నయం చేసుకున్నాన" ని అనుకుంటారు. ఏదయినా పురోభివృద్ధి జరిగితే, ఏదయినా ప్రణా ళికను రూపొందిస్తే ఘంటాపథంగా 'నేనే దానిని చేసాన' ని విర్రవీగుతారు. అలాగే చాలామంది మరేదైనా చేసినా కూడ అంతే. వారు కనుక అంతరంగంలోకి దృష్టి సారిస్తే అప్పుడు వారికి, వారేమీ చేయలేదని, అంతా దైవశక్తే చేస్తున్నదని తెలుస్తుంది.

*

My dear child, వైద్యులను, మందులను మించిన మహాశక్తి ఒకటి ఉందనే మాట నిజమే. నీవు దాని మీద ప్రగాఢమైన విశ్వాసం ఉంచుతున్నందుకు నాకెంతో సంతోషంగా ఉంది. ఆ శక్తే ఎన్ని కష్టాలొచ్చినా, ప్రమాదాలెదురైనా నిన్ను తప్పకుండా రక్షిస్తుంది. నీ విశ్వాసాన్ని పదిలంగా ఉంచుకో. అంతా సవ్యంగా జరిగిపో తుంది.

(*CWM* Vol. 15, p. 165; Vol. 4, p. 279; Vol. 15, pp. 169, 164)

ఎంత మొండిజబ్బైనా సరే దైవానుగ్రహంతో అది నయమైపోవలసిందే!

8

జయించి తీరాలనే ఇచ్ఛను నీలో జాగృతం కావాలి. కేవలం మనస్సులోనే కాకుండా నీ శరీరంలోని ప్రతి కణంలోను అది భాసించాలి. అది లేకుండా నీవు ఏమీ చేయలేవు. శారీరకమైన రుగ్మతను జయించాలనే ఇచ్ఛ నీలో వుంటే తప్ప ఎన్ని మందులు వేసు కున్నా అవి నిన్ను నయం చేయలేవు.

నిన్ను ఆవహించిన దుష్టశక్తి (adverse force) ని నేను నాశనం చేయగలను. వెయ్యిమార్లు చెయ్యగలను. కాని ప్రతిసారి నీలో ఒక ఖాళీ ఏర్పడుతుంది. అనేక శక్తులు లోపలికి తోసుకు వచ్చేందుకు కాచుకొని వుంటాయి. ఏదో ఒకటి నీలోకి ప్రవేశి స్తుంది. అందుకని నేను చెప్పేదేమంటే జయించితీరాలనే ఇచ్ఛను జాగృతం చేసుకో.

*

నేను అతనికి చేయగలిగినదంతా చేస్తున్నాను. కాని అతను అదే పనిగా తాను జబ్బుపడ్డట్టుగా అనుకుంటున్నాడు. అతనెప్పుడూ ఆ ఆలోచనలతో సతమతమవుతూ, తన చుట్టూ ఒక బలమైన (strong formation of illness) రూపాన్ని కల్పన చేసుకున్నాడు. ఈ విధమైన రూపకల్పనవల్ల అతను నానుంచి సహాయం అందుకో లేకపోతున్నాడు. దాన్ని కనక అతను వదిలివేస్తే జబ్బు సగం తగ్గినట్లే. అప్పుడు అతన్ని నయం చేయడం తేలికవుతుంది.

(*CWM* Vol 15, pp. 158, 166, 159)

అనువాదం: డా॥ టి. ప్రసన్నకృష్ణ

The body is cured if it has decided to be cured

శాంతియే పరమౌషధము

శాంతినైశ్చల్యములు నీ మనస్సుకే కాదు, శరీరానికి కూడ వుండాలి. అప్పుడు నీ మనస్సే కాకుండ శరీరం కూడ కుదుటపడి దైవానుగ్రహమును గ్రహించగలుగుతుంది. ఇక రోగములు దాని నంటవు. తలనొప్పికి, కడుపులో నొప్పికి కూడ ఇదే మందు. నీ శరీరబాధ్యతను పూర్తిగ దైవానికి అప్పచెప్పుటయే పరమోత్తమమైన మార్గము. — సంపాదకుడు

9

వ్యాధులనుగురించి నేను చెప్పే ఏకైకహితవు – 'శాంతి' ని నీలోకి ఆహ్వానించాలి – అంతే. ఎలాగైనా సరే, మనస్సును దైహిక చింతన నుండి దూరం చెయ్యాలి. శ్రీఅరవిందులవారి గ్రంథములు చదువు లేక ధ్యానము చేయి. అప్పుడే దైవకృప చక్కగ పని చేయగలదు. మందులు శరీరమునకు నమ్మికను మాత్రమే యివ్వగలవు.

*

అంతరంగంలోని ప్రశాంతతను పట్టుకొని దానిని శరీరకణాలలోకి కూడా చొప్పించాలి. అప్పుడు శరీరము శాంతిస్తుంది. ఆరోగ్యము చేకూరుతుంది.

*

(కడుపునొప్పి, ప్రేగుల జబ్బుతో బాధపడుతున్న ఓ సాధకునికి)
It is due to restlessness and agitation. What is the matter? Bring down peace, the *Divine Peace*, in your stomach and it will be all right.

*

తలనొప్పి, తలతిరుగుడు – ఇలాంటి వాటిని నివారించటమంత కష్టమేం కాదు. ఆ బాధ ఎంత భరించలేనిదైనప్పటికీ పైనుండి ఒక జ్యోతిని ఆహ్వానించండి. ఆ వెలుగు పైనుండి నీ శిరస్సులోనికి చొచ్చుకొనివచ్చి నిన్ను శాంతపరచగలదు. గట్టి పట్టుద

లతో చేసినయెడల, ఈ తలనొప్పి, తలతిరుగుడు లాంటివన్ని చిటి కలో మాయమైపోతాయి!
(*CWM* Vol. 15, pp. 161, 163, 176)

10

It [an illness or an accident] has nothing to do with *punishment;* it is the natural and normal consequence of an error, shortcoming or fault which necessarily has consequences. Actually, everything in the world is a question of equilibrium or disequilibrium, of harmony or disorder. **Vibrations of harmony attract and encourage harmonius events; vibrations of disequilibrium create, as it were, a disequilibrium in circumstances [illnesses, accidents, etc.]. This may be collective or individual, but the principle is the same** – and so is the remedy; to cultivate in oneself order and harmony, peace and equilibrium by surrendering **unreservedly** to the Divine Will.

*

నీ మనస్సును కష్టాలబారినుండి పూర్తిగా ఆవలకు మళ్ళించు. పైనుంచి వచ్చేటటువంటి ఆ జ్యోతిపై, ఆ శక్తిపై మాత్రమే నీ ధ్యానము నుంచుము. నీ శరీరమును ఆ దైవానికి, ఆయన ఇచ్ఛకు వదలివేయుము. నీ శారీరక బాధ్యతనంతా ఆ దైవానికే అర్పించు కొనుము.

This is the cure .

(*CWM* Vol. 16, pp. 323-24; Vol. 15, pp. 162, 147)

శాంతినైశ్చల్యములు రోగనివారణకు భేషైన ఔష ధములు.

11

మనిషి అంతరంగపరిస్థితులే శరీరంలో disorder, disharmony అనారోగ్యానికి కారణాలు. ఆ దోషములను పరిహరించి పరిస్థితులను బాగుచేసినప్పుడు కాని వ్యాధి పూర్తిగా, శాశ్వతంగా నిర్మూలం కాదు.

*

మనిషిలోని ఏదో ఒక అంగముయొక్క wrong attitude వలననే శరీరంలో ఆ విభాగం దెబ్బతింటుంది.

*

మనకి సమత నేర్పేందుకే శారీరకబాధలు కలుగుతూ వుంటాయి. ఆ బాధలకు లొంగిపోకుండ మనలో ఇంకా పరిశుద్ధంగా భాసిస్తున్న విభాగాలను మనకి ఎత్తిచూపించేందుకే ఇలా జరుగతుంది. సమతయే అనారోగ్యానికి మందు.

ముఖ్యమైన సూచన – సమత యనగా జడత్వము కాదు.

*

ఈ తికమకలు, గందరగోళం బదులు దివ్యసత్యమును, సామరస్యమును ఆహ్వానించుటయే మేలైన మార్గము.

*

Truth is supreme harmony and supreme delight. All disorder, all suffering is falsehood.

(*CWM* Vol. 15, pp. 149, 167, 176, 172)

అనువాదం: సునీతి పంతులు

TRUTH CURES

కోరికలవలన ముప్పు

కాన్సర్ ఎందుకని వస్తుంది? దీనికి అసలు కారణం యేమిటి? లోభత్వమే దీనికి అసలు కారణము. ఇది న్యాయమే కదా! నీది వున్నదాంతో తృప్తిపడే స్వభావం కాదు. ఇంకా ఇంకా కూడ బెట్టుకోవాలని, భోగభాగ్యములు పెంచుకోవాలని ఉంటుంది. కాని అది నీ శరీరములో కొన్ని భాగముల పరిమాణమును పెంచి వ్యాధిగా పరిణమిస్తుంది. అయితే ఈ కోరికలను ఎలా జయించాలి – అనేదే ప్రశ్న. "నీకు చేతకాకపోతే నన్ను పిలు" అని శ్రీమాత ప్రవచనము. మనిషి ఆరోగ్యానికి సౌమ్యంగా ఉండటము చాలా ముఖ్యము. అలాకాక ఇతరులను విమర్శిస్తూ వాళ్లతో ఘర్షణ చెందుతూవుంటే నీ జీర్ణకోశం దెబ్బతిని, ఆరోగ్యం చెడిపోతుంది. — *సంపాదకుడు*

12

నీకు జబ్బు తగ్గాలంటే దురలవాట్లను, దుష్ప్రవర్తనను మానేసే యాలి. ముష్టికోరికలను నీలోనుంచి పూర్తిగా బహిష్కరించాలి. ఎందుకని? *కోరికలు నీ అవయవాలను రెచ్చకొట్టి వాటిని సరిగ్గా పనిచేయనీయవు కనుక. నీకు ఆరోగ్యం కావాలంటే ఇటువంటి పిచ్చివేషాలన్నింటినీ మానేసి నీ అంతరంగాన్ని పూర్తిగ ప్రక్షాళనము గావించాలి!* ఒకవేళ నువ్వు ఆ పని చేయ లేకపోతే నన్ను పిలు. నేను వెంటనే వచ్చి నీకు సహాయపడ గలను. నా సహాయముతో జయించలేనిది ఏమీ లేదని నీవు చెప్పి నమాట ముమ్మాటికీ నిజం. అయితే నువ్వు నా సహాయమును చిత్తశుద్ధితో కోరి నేను నీలో చేయు క్రియలను అన్ని పరిస్థితుల లోనూ ఆమోదించాలి.

*

నీలో ఏదో దోషముండబట్టే tumours – మాంసపుగడ్డలు పెరుగ తాయి. కొన్నికణములు ఇతరకణములతో పొత్తు కుదరక స్వతం త్రించి విపరీతంగా పెరిగిపోతాయి. మనిషిలో లోభత్వాన్ని సూచిం

చేందుకు ఇంతకంటే తార్కాణం ఏమి కావాలి? అధికారం కోసం ప్రాకులాట, లౌకికసంపదల కోసం ఆశ, లేక సూక్ష్మమైన కోరికలు ఇవన్నీ కూడా మనిషిలో లోభత్వాన్ని సూచిస్తాయి.
(*CWM* Vol. 15, pp. 159, 176, 160)

13

ఆధునిక వైద్యశాస్త్రం చాలా విచిత్రమైనది. నిన్నటి ఔషధము నేడు విషము. అటులనే నేటి ఔషధములు భవిష్యత్తులో విషములు కావని గ్యారంటీ ఏమున్నది? నేనొక ఫ్రెంచి డాక్టరుని సుమారు 40, 50 ఏళ్ల క్రింద కలిసాను. ఆయన రోగులకు "Take a remedy while it is in fashion, for then it will cure you" అని సలహా ఇచ్చేవాడు.
(*CWM* Vol. 8, Vol. 8, pp. 363-64; Vol. 15, p. 156)

14

'ధమ్మపద' లో ఒక మంచి సూక్తి ఉన్నది. *నీవెప్పుడూ దయగా సౌమ్యంగా ఉన్నట్లైతే నీకేవిధమైన బాధ కలగదు. నవ్వుతూ, సంతోషంగా ఉన్నట్లైతే నీ సంతోషాన్ని నలుగురికీ వెదజల్లు తావు కూడ.*

ఈ సందర్భంలో నేనొక విషయం నీకు గుర్తు చేస్తాను. నీ జీర్ణశక్తి నీ మనస్సులోని ఆలోచనల మీద ఆధారపడి వుంటుంది. కోపంతో చిందులుతొక్కుతూ, ఎవరితోటీ ఏకీభవించకుండా ఎప్పుడూ కీడే ఎంచేవాళ్ళు కొంతమంది వుంటారు. అట్టివారి జీర్ణ కోశం దెబ్బతింటుంది. తిండి వంటపట్టదు. అప్పుడేమవుతుంది? ఏముందీ, ఏం అవాలో అదే అవుతుంది జీర్ణశక్తి చెడిపోవటంవలన వాళ్ళింకా కోపంగా ఇంకా క్రూరంగా తయారవుతారు. మరి దీనికి పరిష్కారమో? ఒకటే మార్గం. నిన్ను నీవు పూర్తిగా నియంత్రించుకోవాలి. నిరంతరం నిన్ను నీవు గమనించుకుంటూ, by constant self control సర్వస్వమైన సౌహార్ద, సౌభ్రాత్ర సర్వస్వ

ములు నీలో వెల్లివిరుస్తూ వున్నట్లైతే నీ జీర్ణశక్తి బాగుపడు తుంది. దాంతోపాటు నీ ఆరోగ్యము కూడా కుదుటపడుతుంది.

(*CWM* Vol. 3, p. 292, Vol. 15, p. 175)

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

దుష్టశక్తులు పొంచివుంటాయి జాగ్రత్త!

తమాషా ఏమిటంటే నీ ఊహలే నీకు జరిగే ప్రమాదాలకు, బాధలకు కారణాలు. నీ ఊహలూరికే పోవు. అవి ఒక ప్రతిరూపాన్ని సృష్టిస్తాయి. కొన్నాళ్లకి ఆ ప్రతిరూపమే నిజరూపమౌతుంది. నిన్ను పీక్కో తింటుంది. మంచివిషయాలను గురించి ఆలోచించినప్పుడు మంచి పర్యవసానమే కలుగుతుంది. నీ శరీరానికి కూడ తనదైన చైతన్యమొకటి వుంటుంది. దానిని నీవు ప్రేరేపించి సన్మార్గంలో పెట్టాలి. నీ మనస్సుతో దానిని ఏడిపించకూడదు.

— సంపాదకుడు

15

అస్వస్థతకు కారణాలు

అస్వస్థతను కలిగించే కారణాల్లో రెండు ముఖ్యమైన వాటిని గుర్తించాలి – అంతర్గతమైనవి, బాహ్యమైనవి. అంతరంగంలో ఒకచోట ప్రతిఘటించే స్వభావం ఉన్నా లేక ఒక భాగం దైవ రక్షణకు స్పందించకపోయినా కలిగే స్థితి ఒకటి. ఏదో ఒక అంశం ఏరి కోరి దుష్టశక్తులను ఆహ్వానించినా అస్వస్థత కలుగుతుంది. ఈ విధమైన పోకడలు ఏ కొద్దిగా ఉన్నా కూడా దుష్టశక్తులు నీ మీద పడి అనారోగ్యాన్ని కలుగచేస్తాయి.

నీలోనూ, నీ పరిసరాల్లోనూ వ్యాధికారక అంశాలు ఎప్పుడూ ఉంటూనే ఉంటాయి. ఇంకా అన్ని వ్యాధులనూ కలిగించగల సూక్ష్మజీవులు నీతోబాటుగా ఉంటూనే ఉంటాయి. కాని వ్యాధులు అకస్మాత్తుగా వచ్చిపడటానికి కారణం ఏమిటో తెలియదు? దానికి

ప్రాణశక్తి నీరసించిందిలే అని నువ్వు సమాధానం చెప్పుకుటావు. ఆ నీరసం ఎక్కడనుంచి వచ్చిందిట? అసలైన కారణం వ్యక్తిలోని అసామరస్యం, దివ్యశక్తులను గ్రహించలేకపోవడమని నేను చెపుతాను. నీ జీవాధారమైన ఓజస్సునూ, తేజస్సునూ ప్రతిఘటించి వాటితో సంబంధాన్ని తెంపేసుకుంటే అలా జరుగతుంది. దీన్ని వైద్యపరిభాషలో నిరోధకశక్తి లోపించడమంటారు. అది ప్రతికూలశక్తులకు అనుకూలమవుతుంది. ఈ విధంగా ఓజశ్శక్తినీ, తేజస్సునూ తెంపేసుకోవడం ఎందుకు జరుగుతుందంటే నీలో అనుమానం, వ్యాకులత, ఆత్మవిశ్వాసలోపం, స్వార్థపరత్వం పెరగటంవల్లనే అని చెప్పాలి. ఇవన్నీ అస్వస్థత కలిగించే బాహ్య కారణాలు. అంతేకాని సూక్ష్మక్రిములు వ్యాధులకు కారణంకావు.
(*CWM* Vol. 3, pp. 55-56; Vol. 15, p. 239)

16

ఊహించడమంటే మనసుతో సృష్టిచేయడమే కాబట్టి ఊహాకల్పనలను అవాస్తవాలని కొట్టిపారేయకూడదు. ప్రతి ఒక్క కల్పనా కూడా మానసికస్థాయిలో వాస్తవమే! ఉదాహరణకు ఒక నవల ఇతివృత్తం తీసుకుంటే అది భౌతికపరిధితో సంబంధం లేకపోయినా మానసికస్థాయిలో ఒక ఉనికిని పొందింది కదా. మనందరం కూడా కొద్దిగానో, గొప్పగానో కల్పన చేయగల కథకులమే. నిజం చెప్పాలంటే మన జీవితం చాలావరకు మన ఊహలకు భౌతికంలో ప్రత్యక్షరూపాల్నిస్తూటుంది. ఎప్పుడైనా మనసు చిక్కబట్టలేక భయాందోళనలకు లోనై వాటికి రూపమిచ్చి ఆపదలనూ, ప్రమాదాలనూ ఊహిస్తే నీ భవిష్యత్తును నువ్వే పాడు చేసుకుంటున్నావన్న మాట. అలా కాకుండా మంచిగా ఆలోచిస్తూ, మంగళకరమైన ఊహాలు చేస్తే నీ ఆశయసిద్ధికి అవకాశాలు మెరుగుపడతాయి. ఈ సత్యాన్ని బాగా అర్థం చేసుకున్న 'కూయే' (Coué) మహాశయుడు రోగులలో ఆశాజనకమైన ఊహాశక్తిని పెంపొందించడం ద్వారానే రోగనివృత్తి చేసేవాడు. ఆయన దగ్గరకు ఒక వనిత వచ్చి వెంట్రుకలు రాలిపోతున్నాయని గోల

పెడితే ఆ విధంగానే సలహా ఇచ్చాడు. ఆ సలహా మేరకు ఆమె ప్రతి రోజూ తను బాగుపడుతున్నట్లు, తన శిరోజాలు చక్కగా పొడుగ్గా పెరుగుతున్నట్లు ఊహించుకోవడం మొదలుపెట్టింది. అలా రోజంతా తనకు తాను నమ్మచెప్పుకుంటూంటే ఆమె జుట్టు చక్కగా ఆశ్చర్యం కలిగేటట్లు పెరిగింది. అదంతా (auto-suggestion) స్వయంబోధనా మహాత్యమే.

(*CWM* Vol. 3, p.156; Vol. 14, p. 186)

17

శరీరం వ్యాధిగ్రస్తమైనప్పుడు మందులు వాడవచ్చు. ఆ మందులు తగుపరిమాణంలో ఉండి అదనంగా లోనికి విషపదార్థాలు చేరనంతవరకూ దేహానికి విశ్వాసం కలిగించటానికి సహాయపడతాయి అంతే. కాని రోగనివారణ చేసేది మందులు కావు. శరీరమే తన వ్యాధిని నివారించుకుంటుంది. అది బాగుపడాలనుకున్నప్పుడు దానంతటదే వ్యాధినివారణ జరుగుతుంది. ఈ విషయాన్ని ఆధునికవైద్యులు కూడా ఇప్పుడు గుర్తిస్తున్నారు: "మా మందులు కొంతవరకూ పనిచేస్తాయి కానీ వ్యాధి నివారణ కావాలని నిశ్చయించేది మాత్రం శరీరమే". మందు వాడేటప్పుడు అది "ఇక నాకు బాగైపోతుంది" అనుకుంటుంది. అంతే! నివారణ జరుగుతుంది.

మందులు పని చేయవని కాదు. కానీ మితిమీరి వాడినప్పుడు అవి వికటించి మనిషిని పూర్తిగా నీరసింపచేస్తాయి. ఒకటి తగ్గితే దానికంటే ప్రమాదమైంది ఇంకోటి వస్తుంది. ఏది వచ్చినప్పటికీ కొంతప్రయోజనం ఉంటుంది. దేహానికి కొంత విశ్వాసం కల్గిస్తాయి: "ఇవి వాడాను కాబట్టి ఇక ఏమీ పర్వా లేదు" అనే నమ్మకం ఏర్పడి బాగుపడటానికి నిశ్చయించుకుంటుంది. బాగవుతుంది.

*

ఔషధానికి నివారించే గుణాన్ని కల్పించేది రోగి నమ్మకమే.

భగవంతుని కరుణాకటాక్షాలకు గల స్వస్థతాశక్తియందు మానవులకు సంపూర్ణవిశ్వాసముంటే అది ఎన్నో వ్యాధులను అరికట్టగలదు.
(*CWM* Vol. 9, p. 123; Vol. 10, p. 325; Vol. 5, p. 383)

18

"నేను చేయగలిగిందంతా చేశాను. అయినా ఆ జబ్బు అలాగే ఉంది. అందుకే అన్నీ మానేశాను" అని నువ్వెప్పుడైతే చెపుతావో అప్పుడు నీవు చేయగలిగినదంతా చేయలేదని ఒప్పుకుంటున్నట్లే. అన్నీ చేస్తున్నప్పటికీ దోషం మిగిలి ఉందంటే నీలో ఇంతకాలం అణిగి లోపలున్నది పైకుబికి నీ పీకల మీదికి వచ్చిందన్నమాట. అప్పుడిక చేయవలసిందల్లా నీ అంతరంగంలోకి చూసి అక్కడున్న చీకటికోణాలన్నిటినీ వెతికి వాటిపైన ఒకింత ఆర్ద్రత, వెలుగు ప్రసరింపచేయి. దానితో అవి సడలిపోయి, నిన్ను విడిచి పెట్టేస్తాయి. నీవు అసాధ్యమనుకున్నప్పటికీ అదే ఆచరణసాధ్యమనీ, ఆచరించవలసినదీ అని తెలుసుకో. అలా వాటిని వదిలేస్తే ఎంతోకాలం నిన్ను పట్టి పీడించగల రోగాన్ని ఒక్క నిమిషంలో వదిలించుకోగలవు. అలా అని నేను మాట ఇవ్వగలను. కానీ ఇది నీ నిజాయితీ మీద, విశ్వాసం మీదా ఆధారపడి ఉంటుంది. దాన్ని వదిలించుకోవాలని నిజంగా మనస్ఫూర్తిగా అనుకుంటేనే జరుగుతుంది. అదే అన్నిటికీ వర్తిస్తుంది. చిన్న చిన్న శరీరబాధలు మొదలు తీవ్రమైన మానసికరుగ్మతలదాకా ఇదే మార్గాన్ని అనుసరించి దూరం చేసుకోవచ్చు. సాధారణంగా నీ చైతన్యంలో కొంతభాగం "నాకీ బాధలు వద్దు" అనుకున్నప్పటికీ లోపలున్న అనేక భాగాలు మాత్రం అలా స్పందించక నిర్లిప్తంగా ఉండిపోతాయి. పైగా జరిగేదేదో జరగనిమ్మని ఊరుకుంటాయి. అదంతా అజ్ఞానమే. స్వస్థతపొందవలసిన అవసరం ఉందని అవి అనుకోవు. లోకంలో జరిగేదంతా మంచే అని వాటి నమ్మకం.

(*CWM* Vol. 4, pp. 74, 108-09)

నీ శరీరానికే ఒక విధమైన అభిలాష ఏర్పడవచ్చు. తన వివిధ భాగాలూ సమస్థితిలో చక్కగా ఉండి, ఒక రకమైన సమత ఏర్ప డాలని కాంక్షించవచ్చు. ఆ విధంగా ఉండి వ్యాధిని దరిచేరకుండా చూసుకోవచ్చునీ, ఒకవేళ నీ కన్నుగప్పి ఏదైన లోనికి ప్రవేశిం చినా వెంటనే దాన్ని నిరోధించి శరీరం స్వస్థతగా సామరస్యంగా విధులు నిర్వహించేటట్లు చేసుకోవచ్చని అనుకోటమే దైహిక ఆకాంక్ష.

మనసు ఆలోచించినంతసేపూ శరీరానికి తనకంటూ ఒక చైతన్యం లేకుండా మూడువంతులు జడమయంగానే ఉండిపో తుంది. కానీ శరీరానికి తనదైన చైతన్యం ఒకటుంది. అది మన సుతో సంబంధం లేకనే తనను గురించిన ఎరుక కలిగి, ఆకాం క్షతో నిండి ఉంటుంది. మన శరీరాన్ని గురించి మనం ఆలోచి స్తూంటే ఆ సమయంలో దైహిక చైతన్యంలో లేనట్లే. తను పని చేసే తీరుతెన్నులు దేహానికి బాగా తెలుసు. తన సమతాస్థితి ఎప్పుడుంటుందో ఎప్పుడు అసమతౌల్యం కలుగుతుందో దానికి తెలుసు. దేహంలో ఏ భాగంలోనైనా రుగ్మత కలిగితే ఏ చిహ్నాలూ లేకపోయినా ఆ సంస్పర్శ ద్వారా అది అనుభవించి తెలుసుకుం టుంది. శరీరప్రక్రియలన్నీ సామరస్యపూరితంగా, సమతులంగా, జరగవలసిన రీతిలో జరిగిపోవటం దాని ఎరుకలో ఉంటుంది. అటువంటప్పుడు అది నిండుతనం, సంపూర్ణత పొందుతుంది. జీవించడంలోని ఆనందమేనన్నట్లు నల్లేరుమీద బండి సాగిపోతు న్నట్లు, నిలకడగానూ, నిండుగా శక్తివంతంగా జరిగిపోతుంది.

(*CWM* Vol. 5, pp. 293-94, 168)

> శరీరానికి భయం పోగొట్టాలంటే కఠినమైన క్రమ శిక్షణ ఉండాలి. లేకపోతే దేహకణాలు వణికిపోతాయి. క్రమశిక్షణ ద్వారానూ, యోగంవలనా భయాన్ని పోగొ ట్టుకోవాలి.

20

సాధారణమైన పరిసరాల్లో సాదాగా పెరుగుతూ, డంభదర్పాదులకు తావులేకుండానూ, మనసును క్రుంగతీసే చదువులు లేకుండా పెరిగినప్పుడు నీకు జీవితంపై సంపూర్ణవిశ్వాసముంటుంది. చిన్నతనంలోనే కాకుండా కొంచెం పెద్దై ముప్ఫయి ఏళ్లు వచ్చేదాకా కూడా ఆ విధమైన విశ్వాసం నీకుంటుంది. ఇంకా నీ చుట్టూ గాబరా కల్గించే మనుషులూ, ఏ కాస్త జలుబు చేసినా హడావుడి పడి డాక్టర్లు, మందులు అని పరిగెత్తే వాళ్ళు లేనప్పుడు, సాధారణ పరిస్థితుల్లో నీకేదైనా సుస్తీ చేసినా, ప్రమాదం జరిగినా కూడా నీకేమీ కాదు. నీ శరీరమంటే నీకు మంచి విశ్వాసముండటంవల్ల అదే పోతుందిలే అని అనుకుంటావు. అలాగే పోతుంది కూడా. అది ఏదైనా తగ్గిపోతుంది. ఆ విధమైన విశ్వాసం కొంతమంది చాలాకాలం నిలుపుకుంటారు. శరీరానికి సహజమైనస్థితి అదే. జీవితమంటే సంపూర్ణమైన విశ్వాసముంటే నూటికి తొంభై తొమ్మిది సార్లు ఏం వచ్చినా నివారణ జరిగిపోతుంది. ఏదైనా కొంచెం వచ్చినప్పటికీ అది ముదిరిపోదు.

అనారోగ్య వాతావరణంలో ఉన్నప్పుడు అంటే నీ దగ్గరున్న వాళ్ళంతా దుర్ఘటనలను, ఆపదలను గురించి ఎక్కువగా మాట్లాడుతూంటే వాతావరణమంతా కలుషితమైపోతుంది. అప్పుడు సహజంగా నీ ఆలోచనలు కూడా పెడత్రోవపడతాయి. ఆ ఆలోచనల ప్రభావం శరీరంపై పడుతుంది. అంతే తప్ప మామూలుగా నలభై యాభై ఏళ్ళు వచ్చేదాకా కూడా శరీరానికి మంచి ఆత్మవిశ్వాసముంటుంది. కొంతమందికి ఇంకా ఎక్కువ కాలమే ఉండొచ్చు. వారికి సాధారణంగానే జీవితం సమతౌల్యంగా గడపటం తెలిసి ఉంటుంది. నిజానికి శరీరానికి తన జీవితంపై మంచి నమ్మకం ఉంటుంది. దాన్ని చెడగొట్టేది ఆలోచనలు, ఆలోచనల మూలంగానే అనారోగ్యం, జబ్బులు అనే భావనలు ప్రవేశించి అంతా పాడైపోతుంది.

దానికి నిరపేక్షమైన విశ్వాసం అవసరం.

చైతన్యవంతమైన విశ్వాసం వేరు. భగవత్కటాక్షంలో విశ్వా సముండటమే చైతన్యవంతమైన విశ్వాసం. భగవంతుడు సర్వకాల సర్వావస్థల్లోనూ తమను కాపాడతాడని విశ్వాసమున్న వారూ, ఆ విశ్వాసాన్ని ప్రతి నిమిషం మరవకుండా మననం చేసుకునే వారూ అపాయాలు వచ్చినా సురక్షితంగా బయటపడతారు. ఎన్ని కష్టాలు వచ్చినా చెక్కుచెదరకుండా ఉంటారు.
(*CWM* Vol. 5, 297-98, Vol. 6, 340)

చేతనాస్థాయిలో మార్పు

నీ ఆరోగ్యం నీ చేతులలోనే వున్నది. ముందర నీ అంతరంగంలో ఆరోగ్యానికి సంబంధించిన చైతన్యమును పొందాలి. దానిని బాహ్యశరీరంలోకి చొప్పించాలి. కాని ఈ మనస్సు ఎంత చెడ్డదంటే అదెప్పుడూ కీడునే తలపెడుతూ వుంటుంది. ఒకసారి ఒక సాధకుడు శ్రీఅరవిందులకు ఈ విషయాన్నే విన్నవించుకున్నాడు. అప్పుడాయన తన సూక్ష్మహస్తముతో అతని తలలోనుంచి దానిని తీసిపారవేయడం జరిగింది! – సంపాదకుడు

21

ప్రశ్న: ఎవ్వరైనా తన శారీరకలోపాలను సరిచేసుకోవాలనిగానీ, దేహపరిస్థితిని బాగు చేసుకోవాలనిగానీ, వ్యాధినివారణ పొందాలనిగానీ అనుకున్నప్పుడు ఏం చేయాలి.? తను ఆశించిన ఫలితంపై ఏకాగ్రత వహించి తన సంకల్పబలాన్నంతా వినియోగించాలా లేక దైవశక్తిని నమ్ముకొని ఎప్పుడో ఒకప్పుడు ఆ దైవమే తన పద్ధతిలో నెరవేరుస్తాడులే అనే విశ్వాసంతో ఉండాలా?

లక్ష్యం ఒకటే కాబట్టి సందర్భానుసారంగా వివిధ మార్గాల్లో ఫలితం సాధించవచ్చు. అన్నిట్లోకి ఫలప్రదమయినది ఏదీ అంటే అది నీ చేతనాస్థాయినిబట్టి, నీ సామర్థ్యంపైనా ఆధారపడి ఉంటుంది. పూర్తిగా నయమైపోయినప్పటి చైతన్యంగానీ, మారి

పోయినప్పటి చైతన్యంగానీ నీలో ఉండవచ్చు. అప్పుడు నీలో ఉత్పన్నమైన శక్తి ద్వారా బాహ్యశరీరంలో కూడా మార్పుతీసుకొనిరావచ్చు లేక ఈ విధమైన మార్పులు చేయగలశక్తిని గురించిన అవగాహన, దాన్ని ఉపయోగించగల నేర్పు నీకుంటే, దాన్ని కావలసిన చోట వినియోగించి మార్పు తీసుకొనిరావచ్చు. ఇది ఒక పద్ధతి. ఇది కాకపోతే నీ కష్టాన్ని దైవానికి విన్నవించుకొని ఆయన శక్తిపై విశ్వాసముంచుకొని నిన్ను బాగుచేసే బాధ్యతను ఆయనకే అప్పగించవచ్చు.

అయితే ఏం చేసినప్పటికీ ఏ పద్ధతి నవలంబించినప్పటికీ, అందులో నీకెంత నైపుణ్యం ఉన్నప్పటికీ ఫలితాన్ని మాత్రం దైవానికే వదిలెయ్యాలి. నీ ప్రయత్నం నీవు చేయవచ్చు కానీ అది ఫలించటం, ఫలించకపోవడం మాత్రము దైవనిర్ణయమే. నీ కర్తవ్యం అంతవరకే. ఫలితం కనిపిస్తే అది కేవలం దైవశక్తే గానీ నీ ప్రయత్నం ఎంతమాత్రం కాదు. ఇటువంటి విషయాలన్నీ భగవంతుణ్ణి కోరవచ్చా కోరకూడదా అనే కదా నీ అనుమానం? శరీరగత లోపాలను తొలిగింపచేయమని వేడుకోవటంలో ఔచిత్యమున్నది కదా. ఏమి కోరినప్పటికీ, ఏ ప్రయత్నాలు చేసినప్పటికీ నీ శక్తియుక్తులన్నీ ఉపయోగించి చేస్తున్నప్పటికీ ఫలితం దైవకృపవల్లనే లభిస్తుందని తెలుసుకో. యోగమార్గాన్ని అనుసరించాలని నిశ్చయించుకున్న తర్వాత ఏం చేస్తున్నప్పటికీ అంతా సమర్పణభావంతోనే చెయ్యాలి.

"ఇదే నా ఆకాంక్ష ప్రభూ! నాలోని లోపాలు తొలిగించుకోవాలని నా శ్రాయశక్తులా ప్రయత్నం చేస్తాను. ఫలితాన్ని నీకే వదిలేస్తున్నాను, అంతా నీ దయే తండ్రి" అని అనుకోవాలి.

ప్రశ్న: "ఫలితముంటుందనే నా నమ్మకం. నాకు కావలసినదాన్ని నా దైవం తప్పక ప్రసాదిస్తాడు" అని అనుకోవటం మంచిదేనా?

అలాగే అనుకో. ప్రగాఢమైన నీ విశ్వాసాన్నిబట్టి నీవు తలచిన కార్యంపై భగవంతుని ఆమోదముద్ర పడిందని తెలుస్తుంది. అచం

చలమైన విశ్వాసమెక్కడుందో అక్కడే దైవసంకల్పమున్నట్లు అనుకోవచ్చు.

ప్రశ్న: "పూర్తిగా స్వస్థత చెందినప్పటి చైతన్యం" అంటే ఏమిటి?

అంటే సంపూర్ణ స్వస్థత పొందినప్పటి స్థితికి అనురూపంగా ఉండే స్థితి అన్న మాట. విడమర్చి చెప్పాలంటే పూర్తి స్వస్థత చెందటానికి ఏమి అవసరమని నీ ఊహ ప్రకారం మనసులో స్థిరరూపం ఏర్పడి ఉంటుందో దాని స్వరూపమన్న మాట. అదే సంపూర్ణ స్వస్థత చెందినప్పటి చైతన్యం. అంతేకానీ ఒకానొక చైతన్యస్థితిని పొందితే స్వస్థత లభిస్తుందని మాత్రం కాదు.
(CWM Vol. 3, pp. 96-97; Vol. 5, p. 292)

22

సాధారణంగా విధి విరామం లేకుండా మనసులో ఆలోచనలు చెలరేగుతూ ఉంటాయి. వాటిని వదిలించుకోలేక మనుషులు పిచ్చెత్తిపోతుంటారు. ఒకాయన తల్లోనుంచి ఆ ఆలోచనలను శ్రీఅరవిందులు తొలగించడం నేను స్వయంగా చూశాను. అతను ఆలోచనలు తనను బాధపెడ్తున్నాయని శ్రీఅరవిందులతో చెపుతూండేవాడు. ఒకరోజు శ్రీఅరవిందులు తన చెయ్యి చాచి అతని తలలో ఆడుతున్న ఆ అంశాన్ని పురుగుని తీసినట్లు తీసిపారేశారు. ఇక అంతటా ప్రశాంతత, వెలుగు. ఆయన ఏం మాట్లాడకుండా అలా చేయటం స్పష్టంగా కనిపించింది. అలాగే మరొకసారి విపరీతమైన బాధతో ఒక సాధకుడు వస్తే అలాగే శ్రీఅరవిందులు తన సూక్ష్మహస్తంతో గందరగోళం సృష్టిస్తున్న ఆ రాక్షసిని తీసేశారు. (శ్రీమాత అభినయించి చూపుతారు)

*

వ్యాధి నివారణకు రెండు ఆధ్యాత్మిక మార్గాలున్నాయి. సత్యచైతన్యముల శక్తిని వ్యాధి సోకిన భాగంపై ప్రసరింపచేయడం ఒకటి. ఇలా చేసినప్పుడు ఫలితం వ్యక్తియొక్క గ్రహణశీలతపై ఆధారపడి ఉంటుంది శరీరానికి గ్రహించగలస్థితి ఏమాత్రం లోపిం



Sri Aurobindo

చినా అనారోగ్యపరిస్థితి కల్పించిన మానసికాంశాన్ని కనుక్కొని దానిమీద పనిచేయాలి. ఇంకా కారణాంశంపైనా, కార్యంపైనా ఒకేసారి పనిచేయగలిగితే, ఆ కారణాంశం కనక గ్రహణశీలకంగా ఉంటే రోగి సంపూర్ణంగా, శాశ్వతంగా స్వస్థత పొందుతాడు.

(*CWM* Vol. 9, 254; Vol. 4, pp. 264-65)

స్వేచ్ఛానువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ వెంకటరామశాస్త్రి

23

మంత్రములు మహిమాన్వితములు

"మంత్రాలకు చింతకాయలు రాలుతాయా" మొదలైన సామెతలను మనము మరీ అంత తేలికగా కొట్టిపారేయకూడదు. ఈ విషయాలు అనుభవరీత్యా తెలుసుకోవలసినదే. నువ్వు కదలకుండా కూర్చుని ధ్యానం చేసినప్పుడు నీ అంతరంగంలో నుంచి కొన్ని శబ్దములు వినపడవచ్చు. నీ మనస్సులో ఆలోచనలు తగ్గిపోయి, సందడి సద్దుమణిగినప్పుడు నీ ఆత్మకు నోరు విప్పే అవకాశం వస్తుంది. నీకేదో వినపడుతుంది. అది నీ ఆత్మ పలికే భాష – నీ మంత్రం, నిన్ను రక్షించి కాపాడే తంత్రం. నువ్వు సచేతనుడవైనప్పుడు నీకు ఏ ఆపద వచ్చినా నీలోంచి ఓ మంత్రం పెల్లుబికి వచ్చి నిన్ను రక్షిస్తుంది. – సంపాదకుడు

ఆపత్సమయంలో మంత్రోచ్చారణ అలవాటు చేసుకుంటే అద్భుతమైన ఫలితం కనిపిస్తుంది. ఏ మంత్రం వల్లించాలో నీకే తెలుస్తుంది; కష్టసమయంలో నీలోకి పెల్లుబికివచ్చి ఏమీ తోచని, ఏమీ చేయని నిస్సహాయస్థితిలో ఉన్నప్పుడు అకస్మాత్తుగా నీకు స్ఫురిస్తుంది. కాని గుర్తుపెట్టుకొని కష్టాన్ని ఎదుర్కొనవలసి వచ్చినప్పుడల్లా వల్లించుకున్నట్లైతే అది అలవాటైపోతుంది. ఉదా: నీ వొంట్లో నలతగా ఉన్నట్లనిపించిందనుకో – ఏం జరగబోతోందో, ఏం జరగబోతోందో అని ఆదుర్దా పడుతూ వుంటావు. అటు

వంటి సందర్భాలలో అది అయాచితంగా నిన్ను ఆదుకుంటుంది. అది రెండు మూడు శబ్దముల కూర్పు కావచ్చును. అది నీ ఆత్మ స్వరూపము, నీ లోపలనుంచి పెల్లుబికివచ్చే మంత్రం. ఆ మంత్రం వల్లించినప్పుడల్లా నీలో ఒక పవిత్రమైన వాతావరణం ఏర్పడు తుంది. అప్పుడు నిన్నెవరూ ఏమీ చేయలేరు. ఎంతటి ప్రమాదం వచ్చినా, ఒకవేళ నిన్నెవ్వరైనా చంపేందుకు వచ్చినా కూడా నీకేం కాదు. అయితే ఏమాత్రం భయపడకుండా వుండాలి. గజగజా వణికిపోకూడదు. నీకే విధమైన (మానసిక, ప్రాణిక, భౌతిక, సాంవేదిక) కష్టమొచ్చినా ఆ మంత్రశబ్దం నీలోంచి పెల్లుబికి వస్తుంది. నువ్వీ విధమైన ప్రక్రియను అలవరుచుకున్నట్లైతే ఇక మీదట అది అప్రయత్నముగానే జరుగుతుంది. అప్పుడు నువ్వే చూస్తావు. నీకు ప్రమాదం ఎదురైనప్పుడల్ల నీ జిహ్వాపై ఆ మంత్రం దానంతటదే తారాడుతుంది. Then you will see that the results are wonderful.

*

నువ్వు హాయిగా నిద్రపోవాలంటే వెల్లకిలా పడుకోని నీ నరాల్ని, కండరాల్ని ఏమాత్రం బిగువు లేకుండా సడలించాలి. ఓ మెత్తని గుడ్డపీలికలా శరీరం తేలికగా వున్నట్లు అనిపించాలి. అదుపు లేని ఆలోచనలతో నిరంతరం పనిచేసే మెదడులోని కణజాలం వల్ల వ్యక్తి అలసిపోవడం కద్దు. కనుక ఏ విధమైన స్పందనలు గాని, యే వత్తిడిలేని పరిపూర్ణ ప్రశాంతతతో కూడిన విశ్రాంతి అవసరం. ఇది కేవలం ప్రారంభం మాత్రమే.

తరువాత శిరస్సు మొదలు సిరిపాదం వరకు బాహ్యాభ్యం తరభాగా లన్నింటినీ నిర్మలం చేసుకుని, నిరహంకార నిరామయ స్థితిలో సంపూర్ణ ఆత్మసమర్పణ చేసుకుని మంత్రం జపించడం మొదలుపెట్టాలి. ఆ మంత్రమే నీ హృదయంనుండి పెల్లుబికి ఒక ప్రార్థనగా వస్తుంది. కొంతసేపటికి మగతగా అనిపించి ఆ తర వాత ప్రశాంతంగా నిద్రపోతావు.

(*CWM* Vol. 4, pp. 389-90; Vol. 15, p. 399)

సూక్ష్మదేహాన్ని ఛేదించి వ్యాధి ప్రవేశించుట

24

దైహికకారణాలవల్లనో, మానసికకారణాలవల్లనో, బాహ్యాంతరంగ కారణాలవల్లనో అస్వస్థత కలిగిందనుకో. అది పైకివచ్చే ముందర లోపలిపొరల్లోనే రక్షాకవచమై రక్షిస్తున్న ఒక పొరను తాకుతుంది. ఈ పలుచని పొరని etheric body, nervous envelope అని వేరు వేరు పేర్లతో పిలుస్తూ వుంటారు. అది వేడివస్తువుల చుట్టూవుండే ఉష్ణతరంగాలవలె కనపడీ కనపడకుండా వుంటుంది. బాహ్యజగత్తుతోడి సంపర్కమంతా దీని ద్వారానే జరగాలి. ఏ ఆపద వచ్చినా కూడా అది ముందర ఈ పొరను ఛేదించి నీలోకి ప్రవేశించాలి. ఈ కవచం ఉన్నంత వరకూ కలరా, ప్లేగు, మశూచి వంటి ఎంత భయంకరవ్యాధులున్న ప్రాంతాలకైనా నీవు నిర్భయంగా వెళ్ళవచ్చు. ఎటువంటి వ్యాధినైనా ఎదుర్కొని అది నీకు రక్షణ నిస్తుంది. అయితే ఈ విద్యను కొంచెం ప్రయత్నం చేసి నీవు నేర్చుకోవాలి. నీకా పొరను గురించి తెలిసినపుడు, దాని అభిజ్ఞతిని పొందినపుడు బైటనుంచి ఏదైనా ఒక స్పందన వచ్చి ఆ పొరను తాకినట్లైతే నీకు వెంటనే తెలిసిపోతుంది. ఒక వార్నింగు వస్తుందనమాట. అది నిన్ను వ్యాధులనించి, ప్రమాదాలనించి రక్షిస్తుంది. అందుచేత దీనిచే పూర్తిగా ఆచ్ఛాదించబడి వున్నట్లైతే శరీరం అన్ని రుగ్మతలనించి కాపాడబడుతుంది. కాని విసుగు, అసంతృప్తిలాంటివి యే కొంచెమైనా చాలు, దీనిని గాటు పెట్టడానికి. ఏ చిన్నగాటు పడినా, వ్యాధి శరీరంలోకి ప్రవేశించవచ్చు. సరియైన ప్రాణికసమతుల్యత వల్లనే వ్యాధినిరోధకశక్తి పెంపొంది యెటువంటి వ్యాధులు దరిజేరవని వైద్యశాస్త్రం సహితం చెపుతున్నది. చాలా సాధారణ జీవితం గడుపుతున్నవారిలో కూడా చాలామందికి ఎంత తినాలి? ఎంతసేపు నిద్రపోవాలి? అన్న అవగాహన వుంటే వారికి నాడీకవచం (nervous envelope) సుదృఢంగా వున్నదనుకోవాలి. అందుచేతనే వారు యెటువంటి వ్యాధి బారిన పడకుండా వుంటారు. ఈ రక్షా

కవచంలో బలహీనమైన కేంద్రాన్ని గమనించి జాగ్రత్తపడి, కొద్ది సేపు ధ్యానంచేసి ఆ శక్తిని ఆవాహన చేసినట్లయిన పరిస్థితి చక్కబడుతుంది. అంతర ప్రశాంతత చాలు దానిని నిరోధించడానికి.

(*CWM* Vol. 3, p. 89; Vol. 4, p. 63; Vol. 3, p. 88)

అనువాదం నడిమింటి విజయలక్ష్మి

25

ప్రశ్న: వ్యాధులు సూక్ష్మశరీరం ద్వారా మనలోకి ప్రవేశిస్తాయి. వాటిని నిరోధించటమెలా?

సుతిమెత్తని ఇంద్రియజ్ఞానంవలన వ్యాధి సూక్ష్మశరీరాన్ని తాకి లోనికి ప్రవేశించే ప్రయత్నం అనుభావ్యమౌతుంది. స్పష్టంగా స్పృశించినట్లు తెలియకపోయినా ఏదో ఒక అవ్యక్తభావన కలుగుతుంది, నిరాకరించగలిగే శక్తి అప్పటికి ఇంకా నీలో ఉంటుంది. ఆ సమయంలో తిరస్కరిస్తే జబ్బు తిరుగుమొహం పెడుతుంది. ఇందుకు కావాల్సినది సునిశిత ఇంద్రియజ్ఞానం. ఒక పద్ధతి ప్రకారం దృఢసంకల్పంతో ఈ ఇంద్రియజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు. ముందు నీ సూక్ష్మశరీరావరణాన్ని నీ యెరుకలోనికి రాబట్టుకోగలగాలి. ఆ చైతన్యాన్ని తగిన రీతిలో అభివృద్ధిపరచుకోగలిగితే వ్యాధి స్పర్శజ్ఞానం నీకు సులభంగా లభిస్తుంది.

ఏదో ఒక చిన్న చికాకు కలుగుతుంది. అది ఎలా ఎక్కడి నుంచి వస్తుందో తెలియదు. అలా అని బలవంతంగా నెత్తిన పడినట్లుగానూ ఉండదు. దానిని నీవు తెలుసుకోగలిగి బలంగా త్రోసిపుచ్చగలుగుతే ఇకేమీ ఉండదు. అలా కాక నిశ్చైతన్యుడవుగా ఉంటే మాత్రం వెంటనే కాకుంటే మరికాస్సేపటిలో ఏదో ఒక సంకటం — ఏ నడుం నొప్పిలాంటిదో వస్తుంది. శరీరంలో అంతకు ముందున్న పొందిక, సామరస్యం సడలినట్లు, ఏదో తేడా వచ్చినట్లు అవగతమౌతుంది. ఆ సమయంలో సడలని విశ్వాసంతో, నన్నేదీ స్పృశించలేదనే బలమైన నమ్మకం కలిగి ఉండాలి. ఏ

మాత్రం జాప్యం లేకుండా ఇది వెనువెంటనే జరగాలి. అస్వస్థతను ఆలస్యంగా పసికట్టినప్పుడు నిశ్చలంగా కూర్చుని దివ్యశక్తిని ఆవాహనం చేసుకొని కలత చెందిన శరీరభాగంపై దృష్టిని సారించాలి. ఈ జాగ్రత్తలేవీ తీసుకోనకుండా మిన్నకుండిపోతే మాత్రం అస్వస్థత నీలో గూడుకట్టుకొని స్థిరపడటం ఖాయం. శారీరకస్థాయిలో ఏ అసౌకర్యం కలిగినా ఒక పద్ధతి ప్రకారం దానినుంచి విముక్తిపొందే ప్రయత్నం చేయాలి. సకాలంలో పద్ధతి ప్రకారం రోగనివారణ విధానాన్ని పాటించాలి. వైద్యవిధాన ప్రకారమే కాకుండ ఆధ్యాత్మికశక్తి సహాయంతో కూడా రోగనివారణను వేగిరపర్చవచ్చు. దీనికో కార్యాచరణ విధానము ఉన్నది. ఇది నాలుగు దశలలో సాగుతుంది. తక్షణమే చర్య తీసుకోవటం మొదటిది. కొన్ని నిముషాలనంతరం తీసుకునే చర్య రెండవది. కొన్ని గంటల తర్వాత అయితే అది మూడవ దశ. కొన్ని రోజులనంతరమైతే నాల్గవదశ. స్థిరపడిన సంకట నివారణ – శరీర గ్రహణశక్తికి, వ్యాధిగ్రస్త అంగము యొక్క ఇచ్ఛాశక్తికి లోబడి ఉంటుంది. వ్యాధి మనకి తెలియకుండానే లోనికి ప్రవేశించగలిగినదంటే, వ్యాధిగ్రస్తమైన శరీరభాగం, వ్యాధితో లాలూచీ పడినట్లు భావించాలి.

(*CWM* Vol. 4, pp. 267-70; Vol. 3, p. 88)

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

For your ill-health, do not forget to try to bring down the Divine Peace. Because no illness can resist the Peace of the Lord, and even to remember and to try will give you some relief.

The Mother

26

బాధానివారణ – I

శారీరక అస్వస్థతను రెండు రకాలుగా నిరోధించగలం. ఒక పద్ధతిలో వ్యాధివల్ల కలిగే బాధానుభవానికి అతీతంగా ఉండటం. ఇక్కడ వ్యాధి తాలూకు మూలకారణం నిర్మూలనం కాకపోవటంవల్ల బాధ మళ్లీ మళ్లీ అనుభవమయ్యే అవకాశం ఉంది. బాధని అదుపులో ఉంచి వ్యాధిని నిరోధించే మార్గం – బాహ్యాంతర పరిణామము ఇది. వ్యాధి మూలకారణం తెలుసుకొని నిర్మూలించటం శాశ్వత పరిష్కారం. ఇది అంతర పరిష్కారం. ఈ అవకాశం లేనప్పుడు మొదటిదే ప్రయోజనకరం. నిజానికది కూడా సార్థక పరిష్కారమే

ఉదా: కొంతమంది పంటినొప్పితో బాధపడుతూ ఉంటారు. భరించలేని బాధ. “అమ్మో! నా వల్ల కాదు! ఈ బాధ భరించలేను!” అని గగ్గోలు పెడతారు. ఇలా చేసినందువల్ల ఏమీ ప్రయోజనం లేదు. నాకీ బాధ వద్దు మొర్రో అంటే బాధపోతుందా? ఇక్కడ ఒక పరిష్కారమేమంటే – కదలక మెదలక బాధపట్ల నిర్లిప్తంగా వ్యవహరించడం. ఆ నిర్లిప్తత ఓ మత్తుమందల్లే పని చేస్తుంది. ఫలితంగా మెదడుకి, ఆ శరీరావయవానికి మధ్య లంకె తెగిపోతుంది. ఇలా కొంతసేపు ఉండగలుగుతే బాధే మాయమైపోతుంది. ఇది తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలి. ఇందుకు జీవితంలో తరుచు ఎన్నో సందర్భాలలో అవకాశాలు తటస్థపడుతూ ఉంటాయి. ఇలా కాకుండా బాధ మీదే దృష్టినంతా కేంద్రీకరించినట్లయితే, అది మరింత రెచ్చిపోతుంది. కొంతమంది అన్యమనస్కంగా ఉన్నట్లు ఉంటారు. కాని మనసు ఎంతోసేపు నిలువదు. వెంటనే అనుకోకుండా బాధకి లోబడుతుంది. సంబంధిత నరం బాధను మెదడుకి చేరవేయటం ద్వారా బాధ తెలుస్తుంది. ఆ నరాన్ని నిశ్చలం చేసి స్పందించకుండా నియంత్రిస్తే బాధ టక్కున ఆగిపోతుంది. బాధాతప్తమైన నరం నిద్రావస్థలో ఉన్న భావన కలుగుతుంది. ముందు చెప్పినట్లు మత్తుమందులా

పనిచేస్తుంది. ఇందుకు అంతరంగ ప్రశాంతత, భగవద్విశ్వాసము జతపరుస్తే బాధ ఖాయంగా నయమౌతుంది.

పంటినొప్పి మెదడుకి చేరువగా ఉంటుంది కాబట్టి యోగానికిది జటిలమైన సమస్య. చెడిన దంతం బాగుపడకపోవచ్చు గాని బాధను నివారించుకోవచ్చు. సాధారణంగా దంతక్షయం అక్కడి నరంపై దెబ్బ కొడుతుంది. బాధ కలిగించే నరాన్ని అదుపుచేసి అక్కడ స్పందనను నిరోధిస్తే, ఈ ప్రక్రియను నీవు నిరంతరంగా పట్టుదలతో సాగిస్తే దోషభూయిష్ఠమైన నరం వైదొలగిపోతుంది. బాధ మాయమౌతుంది.

*

బంధాన్ని తెంచి బాధను తుంచివేయటం అత్యావశ్యకం. బంధం వల్లనే కదా బాధ!

ఉదాహరణకి – నువ్వు వేలు కోసుకుంటావు. అక్కడి నరం దెబ్బతింటుంది. వెంటనే ఆ నరం మెదడుకి ఇక్కడేదో జరగకూడనిది జరిగిందనే సమాచారం చేరవేస్తుంది. ఏమైందేమైందని నీవు గాబరా పడతావు. బాధ తెలుస్తుంది. ఉపశమనం చేస్తావు. బాధ మరీ భరించలేనిదిగా ఉంటే బంధాన్ని తెంచివేయి. "నీవు చేయవల్సిన పని నీవు చేశావు; నీ పని అయింది; ఇక నీవు శెలవు తీసుకో!" అని నరానికి నచ్చచెప్పు. ఇది నీవెంత చాకచక్యంగా చేయగలిగితే అంత సులువుగా బాధ పూర్తిగా మాయమైపోతుంది. ఇది అత్యుత్తమ పద్ధతి. అయ్యో బాధగా ఉందే అని వాపోయే దానికంటె ఇది నయమే కదా!

(*CWM* Vol. 6, pp. 406-08; Vol. 7, p. 149)

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

The particular place in the body affected by an illness is an index to the nature of the inner dis-harmony that has taken place.

27

సూక్ష్మదేహము వద్ద నిఘా

అసలు వ్యాధి రాకుండా నిరోధించడం ఎలా? ఒకవేళ వ్యాధి వచ్చినా దానిని నివారించటమెలా?

మామూలు వైద్యంద్వారా చికిత్స చేయవచ్చు. ఒక్కొక్కసారి అది ఫలిస్తుంది. ఏ పరిస్థితులలో అంతా సవ్యంగా ఉంటుందో, ఆ పరిస్థితులు తనకు ఇవ్వబడ్డాయని దేహం నమ్మినప్పుడు సాధారణంగా ఆ చికిత్స ఫలిస్తుంది. అంతా సవ్యంగా ఉంటుందని శరీరం నిర్ణయం తీసుకుంటే, ఆ వ్యాధి నయమవుతుంది. అయితే, తనకు నయం కావాలన్న సంకల్పం శరీరానికి లేనప్పుడు, ఎన్ని ప్రయత్నాలు చేసినా వ్యాధి నయం కాదు. అనుభవం ద్వారా ఈ విషయం నాకు తెలిసింది. ఎంతటి ప్రమాదకరమైన వ్యాధి అయినప్పటికీ, అయిదు నిమిషాలలో నయం అయిన సందర్భాలు నాకు తెలుసు. ప్రాణాంతకమైన పరిస్థితి ఏమీ లేకపోయినా, అది ఉందనుకుని పదే పదే భావించడంవల్ల నిజంగానే ఆ వ్యాధి ప్రాణాంతకమైన సందర్భాలూ నాకు తెలుసు. అట్టి వ్యక్తుల విషయంలో వ్యాధి నయం అయ్యేటట్లు శరీరాన్ని ఒప్పించడం చాలా కష్టం.

ఇటువంటి సందర్భాలలో చాలా అప్రమత్తంగా. విచక్షణతో శరీరాన్ని శోధించాలి. శరీరంలో ఒక భాగం వ్యాధిగ్రస్తం కావడంతో ఏదో ఆనందం పొందుతుందన్న విషయాన్ని గుర్తించాలి. దీనికి అనేక కారణాలున్నాయి. ఈర్ష్యవల్ల వ్యాధి వచ్చినవారు ఉన్నారు. ద్వేషంవల్ల రోగగ్రస్తులవుతారు. నిరాశవల్ల జబ్బు వస్తుంది. ఇవి బలమైన కారణాలు కావు. చైతన్యంలో ఓ చిన్న కదలిక అంతే. ఎప్పుడైనా, విసుగుచెంది – "ఏం జరుగుతుందో నీకు తెలుస్తుంది. నాకు ఇలా చేసినందుకు ఫలితం ఏమిటో తెలుస్తుంది. వస్తే రానీ. నాకు వ్యాధి వస్తుంది" అంటుంటారు. ఎవరూ బాహాటంగా తమకు తాము అలా అనుకోరు. కాని తమలో తాము

తిట్టుకొంటారు. కాని లోపల ఎక్కడో ఏదో ఆ విధంగా ఆలోచిస్తుంది.

శరీరంలో చిన్నదో, పెద్దదో ఒక అపశ్రుతి, ఒక అవ్యవస్థ ఏర్పడినట్లు కనుగొన్నప్పుడు రెండు పనులు చేయాలి. ఈ అపశ్రుతి ఒక ప్రకంపనాన్ని కల్గిస్తుంది. శరీరంలో, భౌతికచేతనలో అశాంతిని కల్గిస్తుంది. అది ఒక జ్వరం లాంటిది. జ్వరం కాకపోయినా, జ్వరంగా భావించి ఒక మూల పడుకోవడం వంటిది. కొంతమందికి మనస్సంతా అశాంతి. మొదట చేయవలసింది తనకు తాను ప్రశాంతపరచుకోవడం. ఈ చిన్న మూలలో (మొత్తం శరీరంలో కాకపోవచ్చును) పూర్తి ఎరుకతో మనస్సుకు శాంతి, విశ్రాంతి తెచ్చుకోవడం. తరువాత శరీరంలో కలిగిన రుగ్మతకు కారణం తెలుస్తుంది. చాలా కారణాలుండవచ్చును. కాని ఈ రుగ్మతకు అసలు కారణం తెలుసుకోడానికి యత్నించాలి. వెలుగు, విజ్ఞానం వత్తిడి ద్వారా, ఆధ్యాత్మికశక్తి ద్వారా శరీరంలో సామరస్యాన్ని తిరిగి నెలకొల్పాలి. ఒకవేళ రుగ్మతకు లోనైన భాగం ప్రతిస్పందిస్తే, మొండిగా ప్రతిఘటించకపోతే, కొద్ది సెకండ్లలో వ్యాధిని నయం చేయవచ్చును.

ఎప్పుడూ అలా జరగదు. ఒక్కొక్కసారి నేను చెప్పినట్లు దుష్టసంకల్పం వుంటుంది. శరీరం సమ్మె చేస్తుంది. వ్యాధి ఫలితాలు చవి చూడాలని కోరిక కలుగుతుంది. దానికి మరికొంత కాలం పడుతుంది. ఒకవేళ దుష్టసంకల్పం ఏదీ లేకపోతే, కొంత కాలానికి ఆధ్యాత్మికశక్తి పనిచేస్తుంది. కొద్దినిమిషాల పిమ్మట, లేదా కొన్ని గంటల పిమ్మట, లేదా కొద్ది రోజుల పిమ్మట వ్యాధి నెమ్మదిస్తుంది.

ప్రతికూలశక్తుల (adverse forces) ప్రత్యేక దాడుల విషయంలో, శరీరంలోని అపస్వరం, అవ్యవస్థ మరింత క్లిష్టమవుతుంది. శరీరసంకల్పంతోనేగాక ఇంకా అనేక ఇతర అంశాలతో సంబంధం వుంటుంది. వాటిని దృష్టిలో పెట్టుకోవాలి. "నా మట్టుకు నాకు దుష్టసంకల్పం లేదని" ఎవరైనా అంటే ఆ వాదాన్ని నేను ఒప్పుకోను. చైతన్యం ఎప్పుడూ కూడా వ్యాధిగ్రస్తం కాకూడదని కోరు

కుంటుంది. 'నాకు జబ్బు కావాలని' ఉన్మాదులు కోరుకుంటారు. వ్యాధి రావాలని చైతన్యం కోరుకోదు. శరీరంలో ఒక భాగం, లేదా ప్రాణికంలోని ఒక శకలం తప్పుదారి తొక్కి జబ్బు రావాలని కోరుకుంటుంది. ఎంతో శ్రద్ధతో పరిశీలిస్తే తప్ప ఈ విషయం తెలియదు. విజంగా హాని చేయాలని కోరే అసురశక్తుల వత్తిడి, దాడి దీని వెనుక వుంటే, పరిస్థితి (ఆరోగ్యం) సంక్లిష్టమవుతుంది. ఆధ్యాత్మిక తప్పిదం ద్వారా, హింస, ద్వేషం, క్రోధం, వ్యర్థపటాటోపం ద్వారా అసురశక్తులకు ద్వారం తెరువబడుతుంది. వచ్చేపోయే కదలికల ద్వారా కూడా ద్వారం తెరుచుకుంటుంది. ఎప్పుడూ గమనిస్తూ అవకాశం కోసం ఎదురుచూసే దుష్టశక్తులు ఎప్పుడూ వుంటాయి. అందువల్ల చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. అయితే ఏదో ఒక కారణంగా ఒక దుష్ప్రభావం రక్షణకవచాన్ని చీల్చివేస్తుంది. వ్యాధిని తీవ్రతరం చేస్తుంది. అధ్వాన్నస్థితికి తీసుకుని వెళ్తుంది. అటువంటి సందర్భంలో ప్రథమ సాధనాలు చాలవు. అప్పుడు నువ్వు చేయవలసింది మరొకటి వుంది. ఆధ్యాత్మిక ప్రక్షాళన చేసే శక్తిని చేర్చాలి. అది పరిపూర్ణమైన నిర్మాణాత్మకశక్తి. వినాశనాత్మకమైనది ఏదీ కూడా దానిముందు నిలబడలేదు. నీకీ శక్తి వుంటే, లేదా దానిని అడిగి సంపాదిస్తే, ఆ శక్తిని నీవు ఆ ప్రదేశంపై కేంద్రీకరిస్తే దుష్టశక్తి వెంటనే మటుమాయం అవుతుంది. ఈ శక్తి వలయం మధ్య అది వుంటే, అది అదృశ్యమైపోతుంది. ఈ శక్తి సమీపంలో ఏ విచ్ఛిన్నకర దుష్టశక్తి మనజాలదు. అందువల్ల నీ అనారోగ్యం మాయమైపోతుంది. దానితోపాటు దుష్టశక్తీ మాయమైపోతుంది. దానిని నిర్మాణాత్మక శక్తిగా మార్చవచ్చును. అది సాధ్యమే. లేదా దానిని అదృశ్యం చేయవచ్చును. శూన్యంగా మిగల్చవచ్చు. ఆ శక్తితో వ్యాధిని నయం చేయవచ్చును. ఇక తిరిగి ఆ వ్యాధి వచ్చే అవకాశాలు పూర్తిగా తొలగిపోతాయి. జీవితంలో అది తిరిగి రాకుండా వ్యాధి పూర్తిగా నయం అవుతుంది.

(*CWM* Vol. 5, pp. 185-88; Vol. 15, p. 147)

అనువాదం: కె. యజ్ఞన్న

28, 29

శరీరావయవాలను సడలించుట

ప్రశ్న: స్వీకరణ సామర్థ్యాన్ని పెంచటమెలా?

సడలింపు చర్యలు

మొదటి షరతు: సాధ్యమైనంత నిశ్శబ్దంగా ఉండటం. నీ అస్తిత్వములోని వేరు వేరు భాగాలలోకి ఏదైనా ఒక శక్తి వచ్చి దాన్ని నీవు స్వీకరించలేకపోతే అవి ముడుచుకుపోతున్నట్లు గమనిస్తావు. ప్రాణిక స్థితిలో మనస్సులో లేదా శరీరములో కఠినం అయ్యేది ఏదో ఒకటి ఉంది. ఒక బిరుసుతనం ఉంది. అది దెబ్బ తీస్తుంది. అప్పుడు మానసిక, ప్రాణిక లేదా శారీరక బాధ అనుభవం అవుతుంది కనుక మొట్టమొదట చేయవలసింది నీ ఇచ్ఛను ప్రయోగించి ఈ ముడుచుకుపోవటాన్ని సడలించాలి. విశ్రాంతుడవు కావటం ఎలాగో, అస్తిత్వంలో ఏ భాగంలోనైనా ఏర్పడే ఈ బిగువును సడలించడం ఎలాగో నీవు నేర్చుకోవాలి.

విస్తరణకు మార్గములు

ఈ సంకోచాన్ని సడలించే పద్ధతి మనస్సులోను, ప్రాణిక స్థితిలోను శరీరంలోను వేరు వేరుగా ఉంటుంది. కాని దాని మూల స్వరూపమొకటే. ఒకసారి ఒత్తిడిని సడలించిన తర్వాత నీకు నొప్పి తగ్గిపోయిందో లేదో అని మొదట చూస్తావు. అది ఒక చిన్న క్షణిక నిరోధకమని ఋజువవుతుంది. కాని బాధ కొనసాగినట్లైతే నీకు సహాయపడేదాన్ని తప్పక స్వీకరించవలసిన దాన్ని స్వీకరించటం కోసం సామర్థ్యాన్ని అధికం చేయటం అవసరం అయినట్లైతే, ఈ సంకోచాన్ని సడలించిన తర్వాత నిన్ను నీవు విశాలం చేసుకోటానికి ప్రయత్నించటం ఆరంభించు – నిన్ను నీవు విశాలం చేసుకుంటున్న అనుభూతి కలుగుతుంది. వీపు క్రింద ఒకచెక్క పెట్టుకొని నీటి మీద తేలిపోతున్నట్లు ఊహించటం కొంతమందికి ఉపయోగకరంగా కనిపిస్తుంది. అప్పుడు వారు తమను తాము విశాలం చేసుకొంటారు. విస్తార జలరాశితో ఒకటి అయ్యేదాకా విశాలం అవుతారు. మరికొందరు ఆకాశంలో

నక్షత్రాలతో ఏకమవాలని పయత్నిస్తారు. కనుక అధికాధికంగా ఆకాశంతో తాము ఒకటి అయిపోయి విశాలం అవుతారు.

చేతనా పర్యాప్తి

ఇంకా కొందరికి ఈ మానసిక చిత్రాలతో అవసరం ఉండదు. వారి చైతన్యాన్ని గురించి వారు తెలుసుకోగలరు. అది అపారం అయ్యేవరకూ దాన్ని మరీ మరీ విస్తారం చేస్తారు. భూమి అంత, విశ్వమంత పెద్దది అయ్యేటట్లు చేయగలరు. ఆ విధంగా చేస్తే ఎవరైనా నిజంగా స్వీకరణ సామర్ధ్యంకల వారవుతారు. నేను చెప్పినట్లు ఇది శిక్షణకు సంబంధించిన విషయము. ఏది ఏమైనా తక్షణదృష్టిలో, ఏదైనా వచ్చినప్పుడు అది చాలా బలంగా ఉందనిపించి తలనొప్పి కలగచేసినపుడు, దాన్ని సహించలేనప్పుడు పద్ధతి అదే – ఆ బిగువును సడలించాలి. ఆలోచన ద్వారా కూడా చేయవచ్చు. శాంతిని, నిశ్చలత్వాన్ని పిలవవచ్చు. (శాంతి అనుభూతి చాలవరకు ఇబ్బందిని తొలగిస్తుంది) "శాంతి, శాంతి, శాంతి, నిశ్చలత్వం స్థిరప్రశాంతి" అంటూ అనేక అసౌకర్యాలు, నాభీకేంద్ర సంకోచం వంటి ఎంతో అనిష్టమై, కొన్నిసార్లు వికారాన్ని కలిగించి ఉక్కిరిబిక్కిరి అయినట్లు తిరిగి శ్వాసించలేనట్లు అనిపించిన భౌతిక అసౌకర్యములు కూడా, ఆ విధంగా మాయమైపోతాయి. ప్రభావానికి లోనయింది నాడీకేంద్రం అన్న మాట! సులభంగా అది ప్రభావితం అవుతుంది. నాభీకేంద్రానికి ఏదైనా జరిగిన వెంటనే "స్థిరప్రశాంతి, స్థిరప్రశాంతి, స్థిరప్రశాంతి" అని నీవు అనాలి. ఒత్తిడి తగ్గేంతవరకూ నీవు అధికాధికంగా స్థిర ప్రశాంతుడవు కావాలి.

(*CWM* Vol. 4, pp. 265-66; Vol. 10, p. 323)

అనువాదం: తెన్నేటి పూర్ణచంద్రరావు

ఏ కష్టమొచ్చినాసరే, 'ఓం' 'ఓం' అని జపిస్తే, చాలు – అది మాయమైపోతుంది.

30

మనస్సు చేసే అభాసు

మానవజాతి తన మానసిక అపభ్రంశములను నిర్మూలన చేసిన పుడు మాత్రమే, అతిమానస చేతనను అభివ్యక్తము చేయగలదు. అటు పిమ్మటనే మనస్సు నష్టపరచిన సహజమైన ఆరోగ్యాన్ని తిరిగి పొందగలదు.

*

మనస్సుయొక్క నిరంకుశత్వమే మానవజాతిని ఔషధములకు వైద్యులకు బానిసగా చేసినది. తత్కారణముగా భయంకర రోగ ములు అమితముగా పెరుగుచున్నవి

అందుకు, మానవునకు మిగిలిన ఏకైక తరుణోపాయ మేమనగా, తాను తన మానసిక ఏలుబడి నుండి తప్పించుకొని, దైవప్రభావమునకు ఉన్మీలమగుటయే. పూర్ణశరణాగతిని పొందుట ద్వారా ఆ స్థితి చేజిక్కును.

(*CWM* Vol. 10, pp. 326-27, 323)

31

దృష్టిని శరీరమునందు కేంద్రీకరించరాదు

నేననేక పర్యాయములు దీనిని గమనించితిని..... వాస్తవానికి వ్యక్తి తనకు తానుగనే అస్వస్థతకు గురిచేసుకొనును. అదే చేతన కుంచించుకుపోవుట లేక విచ్ఛిన్నమైపోవుట... and it is because of this imbecility that all goes wrong – it is strange! The ego-centric imbecility, it is that which Sri Aurobindo calls “the old man”. అటులగాక ఎల్లెడల చేతనానుగ్రహములే వెల్లివిరిసినయెడల అంతా ఆరోగ్యమే... అంతా మహాభాగ్యమే.

...as I have said, for all the actions of life, even the most ordinary, it is demonstrated that if the presence of the ego is suffered (surely to make you understand what it is), it can really

lead to an imbalance of health, and that the only remedy is the disappearance of the ego – and at the same time the disappearance of all illness.

(*CWM* Vol. 11, pp. 207, 219; Vol. 14, p. 278)

అనువాదం: దామెర వేంకటేశ్వరరావు

32

బాధలు నేర్పే పాఠాలు

బాధ మనకి ఏదో పాఠం నేర్పడానికే వస్తుంది. మనం ఎంత త్వరగా ఆ పాఠం నేర్చుకుంటే దాని అవసరం అంత త్వరగా తీరిపోతుంది. మనకి బాధ ఎందుకు వస్తోందో అనే రహస్యం తెలిసిపోతే, ఆ తరువాత బాధపడటం అసంభవం, ఎందుకంటే మనకి బాధకి కారణం, మూలం, దానిని అధిగమించే మార్గం కూడా తెలిసిపోతాయి.

అహం అనే బంధిఖానాలోంచి బయటపడి భగవంతునితో ఏకమై ఇంక ఎట్టి పరిస్థితులలో కూడా ఆయన నుంచి వేరుకాకుండ ఉండటమే బాధని అధిగమించే రహస్యం. ఇది తెలుసుకుంటే ఇంక బాధకి అస్తిత్వం ఉండదు కనుక అది మాయమైపోతుంది. అంతరాంతరాల్లో, ఆత్మలో, ఆధ్యాత్మిక జాగృతిలోనే కాదు, ఈ జ్ఞానం మన దైనందిన జీవితంలోను, బాహ్యాశరీరంలో కూడా సర్వదుఃఖహారిణి.

ఈ రహస్యం తెలుసుకుని ఆచరిస్తే దానివలన తొలగని వ్యాధి కానీ, సంకటం కానీ ఉండదు. జీవియొక్క సూక్ష్మభాగాలలోనే కాక స్థూలశరీరంలోని కణాలు కూడా బాధనుంచి విముక్తి పొందుతాయి!

మనలోని ప్రతి కణానికీ దాని దివ్యత్వమును, దాని అస్తిత్వం వెనక ఉన్న పూర్ణసత్యమును గురించి తెలియజేయగలిగితే, ప్రతి కణమూ ఈ విశాలవిశ్వమంతటితో సామరస్యము జెందినట్లయితే అన్ని వ్యాధులు తొలగిపోయినట్టే.

ఇది సాధించాలంటే భయము, పిరికితనము ఉండకూడదు. శరీర అస్వస్థతకి ఏమాత్రం భయపడకూడదు, పారిపోకూడదు, దానిని స్థిమితంతో, నిబ్బరంతో, ధైర్యంతో ఈ అస్వస్థత ఒక భ్రమ, మిథ్య, అసత్యము. అనే నమ్మకంతో ఉండాలి. ఎప్పుడైతే మనం పూర్తి విశ్వాసంతో, స్థిరచిత్తంతో భగవదనుగ్రహానికి లోబడతామో, అప్పుడు ఈ భావన మన అంతస్సులో స్థిరపడ్డట్టే. అణువణువునా స్థిరపడి ప్రతి అణువు నీ ప్రతి కణాన్ని అనంత ఆనందంలో పాలు పంచుకోనిస్తుంది.

... everything depends simply on how it is linked with the Divine – upon the state of its receptive surrender.... The same thing which is the cause of a – more than a discomfort – a suffering, an almost unbearable ailment, with just a change in the receptivity of the body towards the Divine, disappears all of a sudden – and can even move to a blissful state. I have had the experience several times. **For me it is only a question of sincerity become intense – in the consciousness that everything is the action of the Divine and that his action moves towards the quickest possible realisation, in the given conditions.**

I might say: the cells of the body must learn to seek their support only in the Divine, until the moment when they are able to feel that they are the expression of the Divine.

(*CWM* Vol. 9, pp. 41, 42: Vol. 11, pp. 273, 272)

అనువాదం: బి. వరలక్ష్మి

On Vijaya Dashami: 29 Sept. 1971

(Durga Puja: Victory Day)

Victory, it is Harmony; Victory, it is the Divine; and for the body, Victory is good health. Each and every ailment, each and every illness is a falsehood.

I know, O God, the day shall dawn at last
When man shall rise from playing with the mud
And taking in his hands the sun and stars
Remould appearance, law and process old.
Then, pain and discord vanished from the world,
Shall the dead wilderness accept the rose
And the hushed desert babble of its rills;
Man once more seem the image true of God.

Sri Aurobindo

(*SABCL* Vol. 5, p. 89)

సమాచార పత్రం

శ్రీఅరబిందో సొసైటీ వార్షిక సమావేశములు ఆగష్టు 12, 13, 14, 2003 తేదీలలో పాండిచ్చేరిలో జరుపబడును. ధార్ (మ. ప్ర)లో శ్రీఅరవిందుల పవిత్ర అవశేషములు ఏప్రిల్ 11 వ తేదీన ప్రతిష్ఠించబడినవి. చండీగర్ లో 21 ఫిబ్రవరి 2003 నాడు శ్రీమాత 125 వ జన్మదినమహోత్సవములు జరుపబడినవి. జెనరల్ J.F.R. Jacob పంజాబ్ గవర్నరుగారు శ్రీఅరవిందుల సమాధి నుంచి తీయబడిన మట్టితో నూతనభవనమునకు శంఖుస్థాపన గావించిరి. సూరత్ (గుజరాతు) వారు 4-6 ఏప్రిల్ 2003 తేదీలలో యువజన సమావేశములు జరుపుకొనిరి. ఉజ్జయిని (మ.ప్ర) కేంద్రములో ధార్‌కు తీసికునిపోబడుతున్న శ్రీఅరవిందుల పవిత్ర అవశేషములు 9 ఏప్రిల్ నాడు భక్తుల దర్శనార్థమై కొంతసేపు ఉంచబడినవి. తిరుపతిలో గోపాల్ భట్టాచార్జీగారు వార్షికోత్సవ సందర్భములో 'పూర్ణయోగమును అభ్యసించటమెలా' అనే అంశముపై ప్రసంగించిరి. ముంబైలో శ్రీ ప్రదీప్‌నరంగ్ గారు 'The Significance of Manifestation of Sri Aurobindo' అనే విషయముపై 10 ఏప్రిలు 2003 నాడు ప్రసంగించిరి. చెన్నై పాత వాషర్‌మెన్ పేటలో ఒక స్టడీ సర్కిల్, కడ్డలూరులో ఒక కేంద్రము ప్రారంభించబడి

నవి, చెంగల్‌పట్టు కేంద్రమువారు 20 ఏప్రిల్ 2003 నాడు వార్షికోత్సవమును జరుపుకొనిరి.

చివరిమాట

పూర్వకాలము అనేక సమస్యలతో సతమతమౌతున్న ఒక రాజు ఆస్థానవిద్వాంసుల నందరిని సమావేశపరచి కష్టసమయాలలో పనికివచ్చే ఓ చిన్నసూక్తిని కనిపెట్టమన్నాడు. ఆ సూక్తి తన ఉంగరం మీద చెక్కబడేందుకు వీలుగా ఉండాలి. మంచిరోజుల్లోను, కష్టసమయాలలోను అన్ని పరిస్థితులకు సరిపోయేటట్లు వుండాలి. మానవజీవితంలో సర్వకాల సర్వావస్థలయందు ఏం జరిగినా కూడా అది మార్గదర్శకంగా వుండాలి.

ఆ మేధావులందరు ఆలోచించి ఆలోచించి ఆఖరుకి ఆ magic words మంత్రవాక్కులతో రాజుగారి దగ్గరకు వెళ్లారు. ఆ మాటలు చాలా అద్భుతమైనవని, అన్ని పరిస్థితులలోను పనికి వస్తాయని చెప్పారు:

words for every change or chance of fortune, declared the wise men... words to fit every situation, good or bad... words to ease the heart and mind in every circumstance. And the words they gave the king to engrave on his ring were:

This, too, shall pass away.

అనామకుడు

Finally it is faith that cures.



పూర్ణయోగసాధనలోని రెండు ముఖ్యాంశములు

శ్రీఅరవిందుల ప్రవచనములు

అఖిల

అఖిల భారత పత్రిక

ఆగస్టు 2003

అమ్మా! నేనెవరిని?

ప్రశ్న! నేనెవరిని?
సమాధానం: భగవంతుని అనేక మారువేషాలలో ఒకటి.

*

ప్రశ్న: మాతా నేనేమిటి? (What am I?)
సమాధానం: నీ బాహ్యరూపము ఉన్నతోన్నతచేతనకోసం ప్రాకులాడే అచేతనాలేశము. లోని రూపము దేహధారణ ద్వారా అభివ్యక్తమవుతున్న నిత్యాత్మ.

*

ప్రశ్న: జననీ! మీరు దైవమా?
సమాధానం: ఈ ప్రశ్న ఎవరినైనా అడగవచ్చు. ఎవరి విషయంలోనైనా మూలతః అది నిజమే అనొచ్చు. ఈ సత్యాన్ని నిరూ పించటమే ప్రతి ఒక్కరి కర్తవ్యం.

(*CWM* Vol. 14, p. 18, *Breath of Grace*, 2002, p. 217)

అనువాదం: బి. నరసింహయ్య

పూర్ణయోగ లక్ష్యము

మన లక్ష్యము ఇతరయోగముల దానికంటె భిన్నము. దాని ఆశయం ఈ ప్రపంచపు అజ్ఞానమునుండి పైకెగసి దివ్యచైతన్యమును పొందటం – కాని అంతటితో సరిపోదు. ఆ దివ్యచైతన్యమును, దాని అతిమానసశక్తిని, క్రిందనున్న ఈ మనోప్రాణిక దైహిక భూమికలలోనికి కూడ అవతరింపచేయుట, వాటిని రూపాంతరీకరించడం ద్వారా, ఈ పృథ్విపై దైవాన్ని ఆవిర్భవింపచేసి జడమున దివ్యచేతనను ప్రతిష్ఠించుట.

*

ఈ యోగముయొక్క ప్రథమలక్ష్యం వ్యక్తియొక్క ఖండచైతన్యాన్ని దివ్యచేతనలో విలీనం చేయుట, తద్వారా దివ్యచేతనలోనికి ప్రవేశించుట. అలా చేయడంవలన తాను పరిమితమైన, వ్యర్థమైన, స్వార్థమానవ అహంకారంగాక, దైవాంశమైన నిజవ్యక్తిత్వాన్ని కనుగొనగలుగుతాడు. రెండవ ఆశయం మనోప్రాణికదైహికముల రూపాంతరీకరణం కొరకై అతిమానసచేతనను భువిపైకి అవతరింపచేయుట.

*

జంతువనే సజీవ పరిశోధనాలయంనుండి ప్రకృతి మానవుని తయారుచేసిందంటారు. అదేవిధంగా మనిషి కూడా ఆలోచనాశీలమైన ఓ సజీవ పరిశోధనాలయం కావచ్చు కదా. అతని సహకారంతో ప్రకృతి అతిమానవుని, అనగా దివ్యమానవుని తయారుచేస్తుంది – లేక దైవాన్ని ఆవిర్భవింపజేస్తుందని అందాము.

దివ్యచైతన్యం జడమున అంతర్లీనమైన దనుటయు, ఈ ప్రకృతి కూడా రహస్యముగా దైవమే అనుటయు నిజమే అయినట్లయితే, దైవమును తనయందు ఆవిర్భవింపజేసికొనుటయు, బాహ్యాభ్యంతరాలలో దైవసంసిద్ధిని పొందుటయు కూడ భూలోక జీవితంలో మానవుడు ఆశించతగిన పరమలక్ష్యములే.

(*SABCL* Vol. 23, pp. 505, 503; Vol. 18, pp. 3-4)

అనువాదం: బి. నరసింహయ్య



Without him, I exist not; without me, he is unmanifest.

The Mother

శ్రీమాత

పరమాత్మకు రెండు ముఖములు – నిష్క్రియము, సక్రియము. మొదటిది నీరవము, సువిశాలము, ప్రశాంతమునైన నిష్క్రియాత్మక బ్రహ్మము. రెండవది విశ్వాత్మ – అందులో మనం శ్రీమాతతో ఐక్యానుభూతిని పొందవచ్చును.

*

ఆత్మ నిష్క్రియమైనప్పుడు, సమస్తమైన సృష్టికి సాక్షి రూపంలో ఆధారభూతమై వెల్లివెరయును. గతిశీలమైనప్పుడు దైవము ఆత్మ ద్వారా పనిచేయును. దానివెనుక శ్రీమాత వున్నది.

*

దివ్యచైతన్యము, దివ్యశక్తియే శ్రీమాత – సర్వభూతములకు తల్లి.

*

ప్రాపంచిక జీవితమక్కర్లేదనుకునే వారు దైవంయొక్క నిర్గుణ రూపాన్నే (impersonal) కోరుకుంటారు. అట్టివారు తమ స్వయం కృషితో ప్రయత్నిస్తారే గాని పరాశక్తికి ఉన్మీలము కారు. ఆత్మ సమర్పణము గావించరు. కాని నిర్గుణదైవం నీకే మార్గమును చూపించలేదు. సహాయం చేయలేదు. అట్టివారు స్వశక్తితో తమ సామర్థ్యముతో దైవసిద్ధిని పొందవలసినదే. అటులగాక శ్రీమాతకు ఉన్మీలమై ఆమెకు ఆత్మసమర్పణం చేసికొన్నవారు ఒక్క నిర్గుణరూపాన్నేగాక, సత్యంయొక్క సర్వరూపములను పొందగలరు.

(*SABCL* Vol. 25, pp. 70, 69, 65, 132)

అనువాదం: బి. నరసింహయ్య

పూర్ణయోగసాధన – శ్రీమాతను శరణుజొచ్చుట

1

పాతలాంతర్లకు కొత్త లాంతర్లిస్తామనే అల్లాడిన్ కథ మీరం దరూ వినే వుంటారు. నీ మనస్సే పాతలాంతరు. ఈ గుడ్డి దీపాన్నిచ్చేస్తే నీకు కొత్తదీపాన్ని ఇస్తానంటోంది శ్రీమాత. ఒక్క మనస్సునే కాదు. నీ పాత అలవాట్లని, పాతజీవితాన్ని మదర్‌కు ఇచ్చేసి కొత్తరూపాలను తిరిగిపుచ్చుకో. ఈ విషయం తెలియని వాళ్లనైతే చూసి జాలిపడవచ్చు. కాని నీకు తెలుసు కదా! మరి జాప్యమెందుకు? – సంపాదకుడు

నువ్వొక యోగివో, సన్యాసివో లేక తపస్వివో కావాలనేది మన లక్ష్యం కాదు. మనది అతిమానసయోగము. దాని లక్ష్యము రూపాంతరీకరణము. *నీకంటె వెయ్యిరెట్లు అధికమైన శక్తివల్లనే,* నిన్ను నీవు శ్రీమాత చేతుల్లోకి తిన్నగా అర్పించుకోవటమువలన మాత్రమే అది సాధ్యము. శ్రీమాత చేతులలో అమాయకంగా ఏమి తెలియని ఓ పసిపిల్లవానివలె అయిపోవాలి.

*

అర్పణ అంతరంగంలోనుంచి పొంగాలి. నీ మనస్సును విప్పి శ్రీమాతకు అప్పజెప్పుకోవాలి. అలాగే నీ ప్రాణిక భౌతికము లనూ – వీటన్నటిని *శ్రీమాత తనవిగా అనుకుండేంత క్షుణ్ణంగా* ఆమెకు అప్పచెప్పుకోవాలి. అప్పుడామె వాటన్నిటిని వాటి వాటి దివ్యరూపములుగా పునర్నిర్మిస్తుంది.

ఆంగ్లమూలం:

Surrender is from within, opening and giving the mind, vital, physical, all to the Mother for her to take them as her own and re-create them in their true being which is a portion of the Divine...

*

నీ పరిమిత వ్యక్తిత్వాన్నధిగమించి ఉన్నతోన్నతంగా ఎదగటానికి ఉన్ముఖుడవై సహనంతో ప్రయత్నించడమే యోగం. నీ ప్రయత్నమంతా ఆ ఉన్నతస్థితిని సాధించుటకే. వ్యక్తి విశ్వశక్తిచే నడిపించబడినప్పటికీ, అంతా తన ప్రజ్ఞయే అని అహంకరిస్తాడు.

ఆంగ్లమూలం:

Well, that is the idea in yoga – that **by a right passivity one opens oneself to something greater than one's limited self,** and effort is only useful for getting that condition. Even in the ordinary life the individual is only an instrument in the hands of a universal Ene-rgy, though his ego takes the credit of all he does.

(*SABCL* Vol. 25, pp. 129, 273; Vol. 23, p. 697)

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

2

సమర్పణో సమర్పణో అని మమ్మల్ని హోరెత్తించేస్తున్నారు కాని అసలేం చేయాలో చెప్పండి అంటారేమో. నువ్వు సంతోషంగా వుండాలి. సమస్యలు సమస్యలంటూ నిరంతరం ఏదో ఒక సాకుతో బుర్ర వేడిచేసుకోకుండా ఉన్నప్పుడే నీ అంతర ద్వారములు తెరవబడటం, శ్రీమాత శక్తులు నీలోకి చొరబడి, నీ సాధనా బాధ్యతను పూర్తిగా వహించటం జరుగుతుంది.

– సంపాదకుడు

శ్రీమాతకు ఉన్ముఖుడవై (open) ఉన్న చైతన్యస్థాయిలో మరియే ఇతర ప్రేరణలు ఉండవు. సర్వమూ దైవానుగ్రహంగా స్వీకరించ గలిగే స్థితి అది.

*

నీవెంతగా శ్రీమాతకి ఉన్ముఖుడవై ఉంటే అంత నిరాటంకంగా దివ్యశక్తి నీలో పనిచేస్తుంది. దివ్య సత్యజ్ఞానాలకు ఆటంకం కలుగచేసే ఆలోచనలతో మనసు మూసుకొని ఉన్నా, కోరికల

ఉచ్చులో చిక్కుకొని శ్రీమాత అనుగ్రహప్రచోదనలకి, ప్రేరణ లకి ప్రతిబంధకంగా ప్రాణికం ఉన్నా, దివ్యకాంతులు దరిచేరనీ యని కామనలతో, జడత్వంతో శరీరము ఉన్నా నీవు శ్రీమాతకు ఉన్ముఖుడవు కాలేదని గ్రహించాలి. ఒకేమారు పూర్ణంగా అమ్మకి ఉన్ముఖుడవై ఉండలేకపోవచ్చు. శరీర ప్రధానకేంద్రాలన్నిటినీ అమ్మ ఆవహించేలా తెరచి ఉంచు. ప్రబలమైన ఆకాంక్షతో అంత ర్కవాటాలను తెరచి ఉంచు, ఆమె క్రియాకలాపాలు సాఫీగా కొనసాగేందుకు. ఇక తరువాయి కార్యక్రమం క్రమేపీ దానికదే కొనసాగింపబడుతుంది.

ఆంగ్లమూలం: To be open is simply to be so turned to the Mother that her Force can work in you without anything refusing or obstructing her action. If the mind is shut up in its own ideas and refuses to allow her to bring in the Light and the Truth, if the vital clings to its desires and does not admit the true initiative and impulsions that the Mother's power brings, if the physical is shut up in its desires, habits and inertia and does not allow the Light and Force to enter in it and work, then one is not open.

*

శ్రీమాతకు నీవు ఉన్ముఖుడవై ఉండటానికి నీలో ప్రశాంతత, నమ్మకం, ఉత్సాహం ఉండాలి. అలజడి, ఆందోళన, నిర్వేదాలతో ఉన్నప్పుడు అమ్మ నీలో ప్రవర్తించదు. దివ్యజ్ఞానానంద శాంతి సహకారాలు అందవు. ఆమెకు ఉన్ముఖుడవు కాలేకపోతే కనీసం నిర్విరామంగా నిశ్చలంగా, ప్రగాఢంగా ఆమెను ఆకాంక్షించు.

*

సతతము ఆమె చింతనలో ఉంటే నీలోని ద్వారములు వాటంత టవే తెరచుకుంటవి.

(*SABCL* Vol. 23, p. 604; Vol. 25, pp. 123, 124, 127)

ఏకాగ్రత, ఆకాంక్ష, అభీప్స అనే పెద్ద పెద్ద మాటలతో మమ్మల్ని తికమక పెట్టేస్తున్నారేగాని అసలు విషయం చెప్పటల్లేదు అంటారేమో. ఏకాగ్రత ఏమిటో తెలియాలంటే ఆలోచనలు సమసిపోవాలి. నీలో భక్తి, ఆరాధన పొంగిపొరలినప్పుడు నీ లోంచి అభీప్స కూడ ఒక ఫౌంటెన్ లేచినట్లు పైకి ఎగజిమ్ము తుంది. — *సంపాదకుడు*

శ్రీమాత ప్రభావాన్ని స్వీకరించటానికి నీవెంత నిష్కపటంగా ఉన్నావనే అంశమే ముఖ్యం. ఎన్ని ఆటంకాలెదురైనా కూడా, ఉన్నత చైతన్యస్థాయి నందుకోవాలనే చిత్తశుద్ధితో కూడిన ఆకాంక్ష, దృఢచిత్తము నీలో ఉన్నప్పుడు అమ్మను పిలుస్తే ఆమె తప్పనిసరిగా పలుకుతుంది. అంతా నీ సంసిద్ధతపైనే ఆధారపడి ఉంటుంది. శరీరము, మనసు, హృదయము ఆకాంక్షించాలి. మొదట్లో ఓరిమి నశించి ఇబ్బందిగా ఉండవచ్చు. తొందరపడ కుండా నిరీక్షించాలి. ఏకాగ్రతతో హృదయాంతరాళంలో శ్రీమాతను, ఆమె దివ్యశక్తిని ఆహ్వానించటం వినా గత్యంతరం లేదు. ఈ యోగంలో నీ సత్వము, చైతన్యము రూపాంతరం చెందాలి. భ్రుకుటి మధ్య లేక మనసులో ఏకాగ్రతతో ఉండి కూడా ఆమె నాహ్వానించుకోవచ్చును. కాని ఇది అందరికీ సాధ్యం కాదు. *మనసు నిశ్చలమై ఏకాగ్రత దృఢమై ఆకాంక్ష తీవ్రమైతే దివ్యా నుభూతి ప్రారంభమౌతుంది.* విశ్వాసమెంత ప్రగాఢమైతే ఫలితము అంత వేగిరపడుతుంది. ఇక మిగిలిన విజయసాధన దివ్యసంస ర్గంలో దివ్యమాతనుంచి నీవు పొందగలిగే దివ్యశక్తిపై ఆధార పడి ఉంటుంది.

(*SABCL* Vol. 23, p. 605)

4

శ్రీమాత నీ దగ్గరే, నీలోనే ఉన్న అనుభూతిని పొంది, కేవలం నీవామె ఉపకరణంగా భావించడమే సాధన.

*

శ్రీమాతయే నీ పరమలక్ష్యము సర్వస్వము; పొందగలిగినదీ ఆమెను మాత్రమే. ఆమె దివ్యచైతన్యంలో నీ కెరుకరానిదేది ఉండదు.

*

ముందు శ్రీమాతను నీ అంతరంగంలో గుర్తించగలుగుతే ఆమె సర్వవ్యాపకత్వము నిరంతరమూ నీకు అనుభవైకవేద్యమౌతుంది.

*

బాహ్యాంతరాలలో శ్రీమాతను దర్శించే స్థితిని పొందగలిగేందుకు ప్రయత్నించు. నీ కూపస్థమండూక స్థితి సడలిపోతుంది.

*

శ్రీమాత ఎప్పుడూ నీలోనే ఉంటుంది. నీ భౌతికయవనిక చాటుగా ఆమె దివ్యశక్తి పనిచేస్తూనే ఉంది. తుదకు ఆమె దివ్యకాంతితో ఆ తెర పారదర్శకమౌతుంది.

(*Letters of Sri Aurobindo Translated from the original in Bengali,* 1961, pp. 17, 45, 50, 13, 47)

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

శ్రీమాతయే నీ గమ్యము. నువ్వామె చేతనను స్ఫురించుకున్నట్లయితే యోగఫలితములన్నీ ఆవిష్కారమగును.

5

పూర్వకాలం తపస్సనగా అడవులకు వెళ్ళి కఠినమైన ఉపాస నలు చేయవలసి వచ్చేది. ఇప్పుడదేమీ లేదు. అంతా made easy అయిపోయింది. నువ్వెక్కడున్నా సరే పిలిస్తే చాలు మదర్ పలుకుతుంది. ధ్యానము తేలికగా చేసుకోవచ్చు.– సంపాదకుడు

సుఖాసీనుడవై మనస్సును నిశ్చలం చేసుకో. మదర్‌ని తలుచుకో. ఆమె రాకకై నీ ద్వారములను తెరచిపెట్టు. ధ్యానమునకు ఇదే రాజమార్గము.

*

శ్రీమాత ఉన్నతోన్నత చైతన్యము కావాలంటే నువ్వు నిరంతరం ప్రశాంతంగా వుండాలి. అప్పుడే ఆమె చైతన్యము నీలోకి దిగి వచ్చి నీ బాహ్యచైతన్యాన్ని కూడా పరివర్తింపజేస్తుంది.

*

ప్రతిక్షణం శ్రీమాతతో తాదాత్మ్యము చెంది ఎలా వుండాలి అనేది అందరికీ ఉండే సమస్యే. ఇదంత తేలిక కాదు. నిరంతరాధ్యా త్మిక సాధనవల్లనే అది సిద్ధిస్తుంది.

*

ఆధ్యాత్మికము అనగా పెద్ద అట్టహాసంగా చేసే విషయం కాదు. నిశ్శబ్దంగా వుండి నిశ్చలంగా, నిర్భయంగా శ్రీమాత విజయము తథ్యము అనే భావనతో సాధనను కొనసాగించాలి.

*

When the whole being is filled with the Mother's presence, then you will remember her automatically, and you can by no means forget her.

(*Letters of Sri Aurobindo Translated from the original in Bengali*, 1961, pp. 59, 49, 11, 47, 16)

6

నీ మనస్సు చేసే రణగొణధ్వని అంతా ఇంతా కాదు. ఈ పరిస్థితిలో దివ్యచైతన్యం దిగివచ్చినా కూడ నీవు దానిని గుర్తించలేవు. అందుకనే మొదట నీలోకి శాంతి దిగివచ్చి నీ సమస్త శరీరాన్ని ఆవహిస్తుంది. అప్పుడు నీవు శ్రీమాత మహా చైతన్యాన్ని పొందగలుగుతావు. — సంపాదకుడు

మొదట నీలోకి శాంతి దిగివచ్చి శరీరాన్నంతా ఆవహిస్తుంది. శాంతి నీలో స్థిరపడినప్పుడు శ్రీమాత అనంతచైతన్యము నీలోకి దిగివస్తుంది. నీవిక అనంతవాయువీధులలో విహరించగలవు. ఇక *నీ అహంకారము తలదాచుకొనేందుకు ఎక్కడా చోటు వుండదు.* దాని జాడలు కూడ లేకుండ మాయమైపోతుంది. ఇక అంతా అనంతమే! అంతా శ్రీమాత విశాలచైతన్యమే! ఆమె దేవతాస్వరూపమే!

*

నీ చైతన్యము విశాలమై, విశ్వవ్యాప్తమైనప్పుడు సూర్యచంద్రనక్షత్రాదు లందెల్లడల నీవు శ్రీమాతనే చూడగలవు. అహంకారం రాలిపోతుంది. *శ్రీమాత శిశువు, ఆమెలోని భాగము అయిన నీ నిజ రూపము అభివ్యక్తమై శ్రీమాత ఒడిలో విశ్రమిస్తుంది.*

*

నీ నిమ్నప్రకృతి ఇరుకుదారుల్లోంచి విముక్తమై శ్రీమాత అనంత చైతన్యములోకి ప్రవేశించినపుడు సమూలంగా రూపాంతరీకరణము చెందుతుంది.

(*Letters of Sri Aurobindo Translated from the original in Bengali*, 1961, pp. 32, 65, 39)

7

కంప్యూటర్ కుబేరుడు బిల్‌గేట్సు గురించి ఒక కథ వున్నది. ఆయన నడుస్తున్నప్పుడు ఒక వందడాలర్ల నోటు క్రింద పడి పోయినా ఆయన దానిని తీసుకోడు. ఎందుకంటె, ఆయన నిమి షానికి కొన్నివేల డాలర్లు సంపాదిస్తాడు. ఒక్క నిముషం ఆగినా నష్టమే. యోగంలో కూడ అంతే. ఒక్క క్షణం కూడా ఏమరు పాటు పనికిరాదు. ఆగినా, వెనక్కు తిరిగి చూసినా ప్రమాదమే.

— సంపాదకుడు

"ఇంకెంత దూరం, ఇంకెంత దూరం" అని మథన పడుతుండటం వృథా. మదర్ నీకు చోదకురాలు. ఆమెను పట్టుకొనివుంటే చాలు. ఆమెయే నిన్ను నీ గమ్యానికి చేరుస్తుంది.

*

అందరూ సాధకులే. అందరూ శ్రీమాత బిడ్డలే. అందరిలోనూ లోపాలుంటాయి. వాటిని నీవు తిరస్కరించుకుంటూపోవాలి. *వాటిని వదిలించమని శ్రీమాతను ఆర్ద్రతతో ప్రార్థించాలి.* నీ సమర్పణాభావము, ఆమెయందు విశ్వాసము ఏమాత్రము క్షీణించ రాదు. ఎప్పటిలాగే నీవు శ్రీమాత మీద ఆధారపడవలసినదే. *కాలక్రమేణ ఆమె నీలోని లోపాలను సరిదిద్దుతుంది. కాబట్టి నీవే మాత్రము విచారించవలసిన పనిలేదు.*

*

మన యోగములో restlessness కి తావు లేనట్లుగానే విచారానికీ తావు లేదు. నిర్వేదంగా ఆనందోత్సాహములతో ముందుకు సాగి పోవాలి. నీవు శ్రీమాతను నమ్ముకున్నప్పుడు దుఃఖానికి తావు లేదు. ఆమె ఎక్కడో దూరంగా వుంటుందనుకుంటున్నావేమో — నీ దగ్గరే వున్నది. నిరంతరం నీవీ స్ఫూర్తిని పొందుతూ వుండాలి.

(*Letters of Sri Aurobindo Translated from the original in Bengali*, 1961, pp. 45, 49, 51)

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి, లక్ష్మీప్రసాదమ్మ

8

యోగములో కొన్ని విచిత్రమైన అనుభూతులు కలుగుతుంటాయి. ఒక్కొక్కప్పుడు మాంద్యము ఆవహిస్తుంది. ఒళ్ళంతా జడమైపో తుంది. అటువంటప్పుడు అంతరంగికంగా మదర్‌ని స్మరిస్తూ ఆమె వాతావరణంలోనే వుండాలి. — సంపాదకుడు

నీలో భౌతికచైతన్యం అనేది ఒకటుంటుంది. అదో ఎద్దుమొద్దు స్వరూపం. అది మేల్కొన్నప్పుడు నీలోని మిగతా విభాగాలన్నిటిని కూడ కప్పివేస్తుంది. అప్పుడు అంతా జడంగా, అయోమయంగా, జ్ఞానప్రకాశరహితంగా, శక్తివిహీనంగా తయారవుతుంది. అటువంటి పరిస్థితి కనుక వస్తే శ్రీమాతను ప్రార్థించి నీ దైహిక చైతన్యంలోకి ఆమె శక్తినీ, కాంతినీ ప్రవేశపెట్టి అంతా జ్యోతిర్మయంగా, శక్తివంతంగా చేయమని వేడుకో.

*

నీ అవచేతనలోని కష్టాలను తప్పించుకోవాలంటే మొదటవాటిని గుర్తించాలి, తర్వాత వాటిని తిరస్కరించాలి, ఆ తర్వాత శ్రీమాత దివ్యశాంతిని తెచ్చుకొని దాంతో నీ దైహికచైతన్యాన్ని పూరించుకోవాలి. ఆ విధంగా చేస్తే అవచేతన తెచ్చిపెట్టే అనర్థాలు తొలగిపోయి ఆ స్థానంలో జ్ఞానచైతన్యవీచికలు స్థిరపడతాయి. ఇదంత తేలిక కాకపోయినా, శ్రీమాతపై అచంచల విశ్వాసంతో ఓరిమితో చేసి సాధించవచ్చు. అంతర్ముఖులై అంతర్గతావలోకనం చేస్తూ, అంతఃచైతన్యంలో ఉంటే ఎక్కువ ఇబ్బందులు, బాధ లేకుండా తప్పించుకోవచ్చు గానీ అన్ని వేళలా ఇది సాధ్యం కాదు కాబట్టి ఓర్పు, విశ్వాసం చాలా అవసరం.

(*Letters of Sri Aurobindo Translated from the original in Bengali*, 1961, p. 20)

ఆత్మవికాసము కలిగినప్పటికి నీ మనస్సుకు నమ్మకం కుదరదు. కాని నీలో వున్న చైత్యపురుషునికి మనస్సుతోటి పని లేదు. అదెప్పటికీ దైవములోని భాగమే. కాబట్టి నీ ధ్యానమంతా దాని మీదనే నిలపాలి. ఏమైనా సరే దాని స్ఫూర్తిని పొందవలసినదే.

— సంపాదకుడు

శ్రీమాత కేవలం అతిమానసంలోనే కాదు – అన్ని స్థాయిలలోనూ వున్నది. ప్రతివారి హృదయాంతర్గతంలోని చైత్యవిభాగం (psychic) లో నెలకొని ఉంటారు. అది వికసించినప్పుడు ఆమె సాన్నిధ్యాన్ని పొందుతారు.

*

It is by faith and surrender and the joy of pure self-giving – the psychic attitude – that one grows into the Truth and becomes united with the Divine.

*

మనస్సు ద్వారా, దాని ఆదర్శాలు, మెప్పుల ద్వారానూ, ప్రాణికం ద్వారా, దాని ఉత్కృష్టానందాలు, ఆకాంక్షలద్వారానూ, నీ జీవాత్మ ఇప్పటివరకూ తనను తాను వ్యక్తం చేసుకుంటూ వచ్చింది. అయితే దైహికమైన కష్టాన్ని అధిగమించి పదార్థాన్ని భాస్వంతం చేసి పరివర్తన చేయాలంటే అది సరిపోదు. నీ జీవాత్మ, నీ చైత్యపురుషుడు పూర్తిగా జాగృతం కావాలి, మౌలికమైన మార్పు తీసుకొని రావాలి. మనసు చేసే భావనలుగానీ, బాహ్యంగా ఏ విధమైన మద్దతుగానీ చెత్యపురుషునికి అవసరం లేదు. తనంతట తనే నీకు దైవభావనను, నిరంతర సన్నిహితత్వాన్ని కలుగచేసి అంతర్గతంగా బాసటగా నిలుస్తుంది. ఇక శ్రీమాత ఎక్కడో ఉన్నారన్న బెంగ నీకుండదు.

*

ఈ యోగసాధనలో ముఖ్యమైన రహస్యమొకటున్నది. చైత్యపరంగా నువ్వు శ్రీమాతకు ఉన్ముఖుడవైన యెడల నీ పనికిగానీ, సాధన కుగానీ అవసరమైనవన్నీ క్రమేపి సమకూరుతాయి.

(*SABCL* Vol. 25, pp. 174, 175, 174, 121)

10

ప్రశ్న: నాకు చిత్తైకాగ్రత సమంగా కుదరకపోతే పైనున్న పవిత్ర తను (purity) దిగిరమ్మని ఆహ్వానించాను. వెంటనే నా శరీర మంతా ప్రశాంతతతో, పవిత్రతతో నిండిపోయింది. ఇక ఏ రక మైన ఇబ్బందీ లేకుండా నా హృదయంలో శ్రీమాత నెలకొన్న అనుభూతి కలిగింది. నా హృదయంలో నుంచీ, కిందినుంచీ, ఇంకా అన్నివైపుల నుంచీ ప్రగాఢమైన ఒక ఆకాంక్ష వెలువడింది. శ్రీమాతపట్ల ఆరాధనాభావము హృదయమంతా నిండిపోయింది. ఒక భక్తిభావం, ఒక అవ్యాజ సమర్పణాభావం, శ్రీమాతతో ఐక్యం చెందిన ప్రగాఢానుభూతి మనసంతా నిండిపోయింది. పవి త్రతకోసమై తీవ్రమైన ఆకాంక్ష ఏర్పడింది. ఇదంతా చైత్యవికా సమే (psychic opening) అంటారా?

ఆహా! అచ్చగా అదే. అది చైత్యవికాసమే. ముఖ్యంగా దానికి కార ణమని చెప్పిన మహోన్నత పవిత్రతకు వివృతం కావటం చాలా మంచిది. శ్రీమాతతో అంతర్గతంగా సంబంధం పెట్టుకొనేందుకు చైత్యవికాసం పొందటానికీ అది చాలా ముఖ్యము.

*

There is no such necessary precedence as that first one must feel the Presence and then only can one feel oneself the Mother's; it is more often the increase of the feeling that brings the Presence. For the feeling comes from the psychic consciousness and it is the growth of the psychic consciousness that makes the constant Presence at last possible. The feeling comes

from the psychic and is true of the inner being – its not being yet fulfilled in the whole does not make it an imagination; on the contrary, the more it grows the more is the likelihood of the whole being fulfilling this truth; **the inner *bhava* takes more and more possession of the outer consciousness and remoulds it so as to make it a truth there also.**

(*SABCL* Vol. 25, pp. 175, 115)


11

శ్రీమాత తన ప్రేమలో నిన్ను ముంచేస్తుంది. కేవలం నీ మనస్సులోనే కాకుండ నీ ప్రాణిక, దైహికములను ప్రదీప్తమొన రించి, వాటిని దివ్యరూపములుగ మారుస్తుంది. నీకింత కంటె ఇంకేమి కావాలి? – సంపాదకుడు

ఏ విధమైన ఫలాపేక్ష లేకుండా తనను తాను అర్పించుకోవడమే దైవంపైగల ప్రేమకు నిదర్శనము. హక్కుభుక్తాల అధికారాలనూ, లాభనష్టాల బేరీజులనూ చూసుకోని అవ్యాజ ప్రేమ అది. అసూయతో అంకపొంకాలు, కోపతాపాలు మొదలైనవాటి కిందులో తావు లేదు. అలా ఉన్నప్పుడు శ్రీమాత కూడా నీలో ప్రత్యక్షంగా భాసిస్తుంది. నీ మనసులో, నీ ప్రాణికంలో, నీ దైహికచైతన్యంలో ఆమె ఉనికే ప్రతిఫలిస్తుంది. నిన్ను దివ్యప్రకృతిలోకి నడిపిస్తూ, నీ చలనాలన్నిటినీ పరిపూర్ణమయేటట్లు నడిపిస్తూ సఫలీకృతం చేస్తూ, నిన్ను పూర్తిగా తన దివ్యప్రేమావరణతో దైవంవైపు జాగ్రత్తగా నడిపిస్తుంది. దీని కోసమే నీవు ఆకాంక్షించి, తపించి అణువణువునా నింపుకోనాలని కోరుకోవాలి. దీనికి కాలంతో నిమిత్తం లేదు.

*

ఎల్లప్పుడూ నీవు శ్రీమాత సన్నిధిలోనూ ఆమె నీకు సమీపం గానూ ఉంటారు. "శ్రీమాత నన్ను ప్రేమిస్తుంది, నేను ఆమెకే



The Mother

చెందుతాను" అనేది నీ జీవితానికి మూలాధారంగా చేసుకున్నట్ల యితే మధ్యనున్న అడ్డుతెర మటుమాయమవుతుంది.

*

శ్రీమాతకు నిజమైన బిడ్డగా ఉండటానికి ప్రయత్నించు. అది నీ అంతరంగంలో ఉన్నప్పటికీ నీ మనస్సు మట్టుకు చిట్టిపొట్టి విషయాలతో సతమతమైపోతూ అనవసరంగా గోరంతరలు కొండంతలు చేస్తుంది.

(*SABCL* Vol. 25, pp. 181-182, 194, 176)

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకటరామ శాస్త్రి

12

"ఈ యోగమంటే నాకు తెలీదు బాబు, ఇది నావల్ల కాదు" అని అనుకుంటావేమో. కాని సృష్టికర్త తన 'శక్తి' ని మన దగ్గరకి పంపించాడు కదా. ఆమెయే నీలోకి ప్రవేశించి నీకు సాధన చేసి పెడుతుంది. అప్పుడు నీ సామర్థ్యం పెరుగుతుంది. నువ్వే చూస్తావుగా.

— సంపాదకుడు

ప్రపంచంలో జరిగే ప్రతికార్యమూ ఈశ్వరుడు తన 'శక్తి' ద్వారా నడిపిస్తున్నాడు. కాని అతడు తన యోగమాయచే మరుగుపడి జీవుని అహంకారము ద్వారా నిమ్నప్రకృతిలో పనిచేస్తున్నాడు.

యోగములో కూడా సాధకుడూ సాధనా ఈశ్వరుడే. ఈశ్వరుని శక్తే 'ఆధారము' (అన్నము, ప్రాణము, మనస్సు, విజ్ఞానము, ఆనందము అని ఆధారములు ఐదు) పైని పనిచేస్తూ అది (ఆధారము) వికసితముకాగానే తేజస్సు, సత్త్వము, జ్ఞానము, చైతన్యము, ఆనందము అనే ఆమె (ఈశ్వరశక్తి) యొక్క దివ్యశక్తులతో ఆధారములోనికి ప్రవహించి సాధన సాధ్యమయ్యేటట్లు చేస్తున్నది. కాని నిమ్నప్రకృతి రాణిస్తూన్నంతవరకు సాధకుని ప్రయత్నము (personal effort) అవసరము.

ఆత్మార్పణమున్నూ, ఆత్మనివేదనమున్నూ అధికమైన కొద్దీ, దివ్యస్వభావముయొక్క స్వేచ్ఛనూ సంపూర్ణత్వమునూ అతనిలో ఈశ్వరశక్తి స్థాపించును. అంతకంతకూ హెచ్చుగా ఈశ్వరశక్తి ప్రవహిస్తూ ఉండడమువలన తనలో ఈ శక్తి సాధనచేస్తూ ఉన్నట్లు సాధకుడు గుర్తించును. స్వప్రయత్నమునకు బదులుగా ఇట్టి కార్యము ఎంత జరుగుతూ ఉంటే అంత త్వరగాను, నిశ్చయముగాను అతడు వృద్ధిజెందును. కాని ఆత్మార్పణము, ఆత్మనివేదనమూ, ఆమూలాగ్రముగా పరిశుద్ధమున్నూ, సంపూర్ణమున్నూ అయ్యేవరకూ పురుషప్రయత్నము అవశ్యము. దీనికి బదులది పూర్తిగా పనిచెయ్యలేదు.

సాధకుడు తనకేమీ శ్రమా కష్టమూ లేకుండా సర్వమూ భగవంతుణ్ణే చేయమని కోరుతూ ఉండే తామసికార్పణము, ఆత్మవంచన అగును. దానివల్ల సంపూర్ణత్వమూ సిద్ధి కలుగవని గ్రహించుము.

(*SABCL* Vol. 25, pp. 6-8)

13

నిజం చెప్పాలంటె మన మనస్సు చాల చిన్నది. అది నాలుగు గోడలు కట్టి 'ఇక్కడే పడి వుండు' అని మనల్ని క్రూరంగా శాసిస్తుంది. అయితే మనం ఈ శాసనాన్ని ఉల్లంఘించవచ్చు. అది ఎలా సాధ్యమంటారా? మీరే ప్రత్యక్షంగా తెలుసుకోండి. ఇది వేదాంతం కాదు. జీవితంలో మనం పాలించదగిన నైజం.

— సంపాదకుడు

ఇట్టి పురుషప్రయత్నము (personal effort) మూడు విధములగు పరిశ్రమలతో కూడుకొని ఉన్నది. ఆకాంక్ష, నిరాకరణము, అర్పణము.

ఆకాంక్ష: ఆకాంక్ష మెలకువతో గూడినదై స్థిరమై ఎడతెగకుండా ఉండవలెను. మనోమయపురుషుని ఇచ్ఛ, హృదయాన్వేషణము, ప్రాణమయపురుషుని ఆమోదము, అన్నమయ పురుషుని చైతన్య

మునూ, స్వభావమునూ వికసింపజేసి మృదువుగా చెయ్యవలెననే ఇచ్ఛ. ఇది ఆకాంక్ష.

నిరాకరణము: నిమ్నప్రకృతియొక్క వ్యాపారములను నిరాకరించడము అనగా మనోమయపురుషుని భావములు, ఆలోచనలు, ఇష్టానిష్టములు, అలవాట్లు, అభిప్రాయములు వీటిని నిరాకరించవలెను. అప్పుడు ప్రశాంతమగు మనోమయకోశమున యథార్థమగు జ్ఞానము స్వేచ్ఛగా కాపురముండును.

ప్రాణమయపురుషుని ప్రకృతికి సంబంధించిన ఆశలు, పట్టుదలలు, తృష్ణలు, ఇంద్రియవేదనలు, రాగద్వేషములు, స్వార్థపరత్వము, గర్వము, దురహంకారము, కామము, లోభము, మత్సరము, అసూయ, సత్యములపై విరోధభావము – వీటిని నిరాకరించవలెను. అప్పుడు శాంతము, విశాలము, దృఢము, పవిత్రము అగు ప్రాణమయకోశములోనికి నిజమైన శక్తి, ఆనందము పైనుండి ప్రవహించును.

అన్నమయపురుషుని ప్రకృతికి సంబంధించిన మాంద్యము, సంశయము, అపనమ్మకము, అజ్ఞానము, మొండితనము, అల్పత్వము, సోమరితనము, మార్పు అంటే యిష్టములేకపోవుట, తామసము వీటిని నిరాకరించవలెను. అప్పుడు నిరంతరము దివ్యభావమును పొందుచున్న అన్నమయకోశము నందు జ్ఞానము, శక్తి, ఆనందముల యొక్క స్థిరత్వము ఏర్పడవచ్చును.

అర్పణము: తన్నూ, తానైన సర్వమున్నూ, తనకున్న సర్వమున్నూ, తన చైతన్యభూమికలన్నింటినీ తన వ్యాపారములన్నింటినీ ఈశ్వరునికిన్నీ, శక్తికిన్నీ అర్పించవలెను.

(*SABCL* Vol. 25, pp. 6-7)

అనువాదం: స్వామి శుద్ధానంద భారతి, చింతాదీక్షితులు
('జగన్మాత' నుండి)

14

జీవితాంతం తపస్సు చేస్తేగాని జ్ఞానోదయము కలుగదు. కాని నేడు మన అదృష్టం పండి మనం శ్రీమాత సాన్నిధ్యంలో వున్నాము. ఆమెను స్మరిస్తే చాలు, పిలిస్తే చాలు. ఆమెయే నీ చెంతనుండి నీ సాధన చేస్తుంది. — *సంపాదకుడు*

అవును, శ్రీమాతయే అందరిలోను సాధన చేస్తారు. కాని అది వారి వారి ఔత్సుకత, స్వీకరణశక్తిని బట్టి వుంటుంది.

*

దైవానుగ్రహం, దైవశక్తి, సర్వమును నిర్వర్తించగలవు. కాని సాధకుని సంపూర్ణ సమ్మతితోనే అది సాధ్యపడగలదు. ఆ సంపూర్ణ సమ్మతిని ఇచ్చుకొనుటయే సాధనయొక్క పరమార్థం.

*

సాధన గురించి మీరు చెప్పునది సత్యమే. సాధన ఎంతో అవసరం; దివ్యశక్తి వట్టి శూన్యంలో పనిచేయలేదు గదా. కాని ప్రతి ఒక్కరిలో శ్రీమాత పనిచేయుచూ, సర్వమూ తానే నిర్వర్తించుచున్నదనే భావన కలిగే స్థాయికి వారి వారి స్వభావానుసారంగా చేరుస్తుంది. అంతవరకు శ్రీమాతయొక్క నిర్వహణకు సాధకుని ఆకాంక్ష, ఆత్మసమర్పణ, సమ్మతి సహకారములు చాల అవసరం. అలాగే ఈ మార్గంలో అడ్డంకులుగా నిలిచే ప్రతిదానిని తిరస్కరించుట కూడ అనివార్యం.

*

ప్రతిఒక్కరు చేయవలసినదేమనగా, తమను తాము శ్రీమాత హస్తగతం గావించుకోవాలి. సేవాతత్పరత, భక్తి, ఆకాంక్షల ద్వారా తమను తాము శ్రీమాతకై తెరచి ఉంచుకోవాలి. అప్పుడు శ్రీమాతయే తన వెలుగు ద్వారా, శక్తి ద్వారా వారిలో పనిచేసి సాధన జరిపిస్తుంది.

(*SABCL* Vol. 25, p. 219; Vol. 23, p. 583; Vol. 25, pp. 134-35, 130)

15

నీవు ప్రకృతి బిడ్డవు. నిమ్న ప్రకృతికి బద్ధుడవు. కాని ఇప్పుడు దీనిని అధిగమించి దివ్య ప్రకృతిని దాల్చుటకు అవకాశము వచ్చింది. ఈ సువర్ణావకాశాన్ని పురస్కరించుకొని మన జీవితమును సువర్ణమయము జేసికొందుము గాక — సంపాదకుడు

సమస్తాన్ని జరిపించేది విశ్వచైతన్యమనియు, ఆ చైతన్యానికి ప్రతీక అగు 'విరాట్‌పురుషుడు', ఆమె చర్య లన్నింటికి ఆలంబనముగ ఉంటాడు అనేది పరమసత్యం. విశ్వచైతన్యమనేది ఒక శక్తి. అజ్ఞానదశలో నిమ్నప్రకృతిగ తయారై, అట్టి నిమ్నస్థాయిలో తప్పుడు పనులు చేయిస్తుంది. మానవుడు తనకు తానుగ మంచి మార్పును కోరుకొనేటంతవరకు దైవము ఈ నిమ్నశక్తుల ఆటలను కొనసాగనిస్తాడు. కాని, నీవు సాధకుడవు అయితే, ఈ నిమ్నఖేలనానికి లోనుగాక, దివ్యమాత వైపుకు మరలి, నిమ్నప్రకృతి ద్వారాగాక, స్వయంగా నీ ద్వారానే ఆమె పనిచేయాలని అర్థిస్తావు. నీలోని ప్రతి అణువును సంపూర్ణంగా దివ్యమాతకు అర్పించి, ఆమెకు తప్ప మరెవ్వరికి సమర్పణ చేయనప్పుడే, దైవము సమస్తాన్ని నీ ద్వారా నిర్వహిస్తాడు.

*

'అహం బ్రహ్మాస్మి' అనే దృక్పథం పూర్ణయోగానికి అవసరం కాదా.?

సమస్తమైన ప్రకృతిని పరివర్తింపజేయుటకు అది చాలదు; సరిపోయినట్లయితే శ్రీమాత అవతరణ అవసరమయ్యేదే గాదు. మామూలుగ ఎవరికి వారు 'అహం బ్రహ్మాస్మి' అనుకుంటే సరిపోతుంది. శ్రీమాత ఉనికిగాని, శ్రీమాత చైతన్యంగాని అవసరమయ్యేవి కావు.

(SABCL Vol. 25, pp. 68, 57)

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, చేకూరు జానకి

16

మన యోగములో కొన్ని విచిత్రమైన అనుభూతులు కలుగుతుంటాయి. శ్రీమాతయే నీ ద్వారా పనిచేస్తున్నట్లు అనుభూతమవుతుంది. నీ నిమ్నప్రకృతి, నిమ్నచైతన్యము పరివర్తనము జెంది దివ్యప్రకృతిగా, దివ్యచైతన్యముగా మారుతాయి.

– సంపాదకుడు

నీ సమస్త కార్యములు దైవమునుండే వచ్చుచున్నవని, అవి శ్రీమాత కార్యములేనని నీకు కలిగిన అనుభూతి చాల గొప్పది. కాని ఎంత గొప్పదైనప్పటికి, అది చాలదు. ఇంకను అది నీ ప్రకృతి ద్వారానే మదర్ చేయిస్తున్నది. అంతకంటె గొప్పదైనది దివ్యప్రకృతి అనేది మరొకటి వున్నది. నీ ప్రకృతిని ఆ విధంగా పరివర్తింపజేసినపుడు, దివ్యస్ఫూర్తి కలిగినపుడు నీవు శ్రీమాతకు ఒక అద్భుతమైన ఉపకరణము కాగలవు. కాని ఇదంతా ఒక్క రోజులో జరిగేపని కాదు. నీవు ఊరికే గొడవపడిపోకూడదు.

అత్యంత జాగరూకుడవై అప్రమత్తంగా వ్యవహరించాలి. సదా శ్రీమాతను స్మరించుకుంటూ సాధనా ప్రవాహంలో సాగిపోవాలి. సాధనను ఎదిరించే పాత అలవాట్లను, సమస్తమైన వ్యవహారాలను నిశ్చయంగా తిరస్కరించాలి.

(*SABCL* Vol. 25, pp. 201-02)

శ్రీమాత ఎక్కడో దూరంగా వుండదు. నిరంతరం నీ దగ్గిరే వుంటుంది. నువ్వీ విషయాన్ని విశ్వసించాలి. తెలుసుకోవాలి.

శ్రీఅరవిందులు

17

మన లక్ష్యము కేవలమంతరంగిక దర్శనమే కాదు. బాహ్యా మానవుడు కూడ మారాలి. మన సాధన కేవలం అంతరంగికం లోనే వుంటే చాలదు. అది ఏకపక్షమౌతుంది. బాహ్యాభ్యంతర ముల రెండింటిని కూడ నీవు సమర్పణభావంతో ఉద్దీపింప చేయాలి. — *సంపాదకుడు*

సాధన చేసేందుకు నీవెక్కడికో పోనవసరం లేదు. ఇంట్లో నీ నిత్యకృత్యాలు చేసుకుంటూ కూడ చేయవచ్చు. మొదట్లో నీవు శ్రీమాతను జ్ఞాపకం పెట్టుకుంటే చాలు. హృత్కేంద్రములో ఆమె మీద ధ్యానమును నిలిపి ఆమె స్ఫూర్తికోసం వేడుకుంటూ ఆమె నీకు మార్గమును చూపించి కాపాడమని ప్రార్థించాలి. ఇది ప్రాథ మిక దశ, చాలా కాలము పట్టవచ్చును. అయితే నీ మనస్సులో శ్రీమాత పనిచేస్తున్నట్లు తెలుస్తుంది. నీ ప్రకృతి కూడ మారుతూ నీ ద్వారములు అనంతమైన శక్తికోసం తెరవబడతాయి.

దైవానుభూతి కోసం పూర్తిగా అంతరంగికంలోనే స్థిర పడిపోవటం మంచిది కాదు. అది ఏకపక్షమై సమతౌల్యాన్ని భంగపరుస్తుంది. మనది పూర్ణయోగం కదా! అలాగని కేవలం ఇంద్రియపరాయణుడవై బాహ్యాజీవితంలో ప్రవర్తించటమూ మంచిది కాదు. *అంతరంగికంలోను, బాహ్యాకార్యములలోను రెండింటిలోను కూడ శ్రీమాత వెలుగును పూరించి, ఆమె చైత న్యంతో వర్ధిల్లాలి.*

(*SABCL* Vol. 25, pp. 161, 199)

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్ శాస్త్రి

18

మనిషికి మనస్సున్నదిగాని, దాని పరిధి పరిమితము. దానిని అధిగమించేందుకు నీ తెలివితేటలు ఎందుకు పనికిరావు. నీకు దివ్యశక్తి మీద ఆధారపడటం తప్ప వేరే గత్యంతరం లేదు. అది నీ మనస్సును కుదుటపరచి మనస్సు కతీతమైన మరొక శక్తిని నీకివ్వగలదు. — *సంపాదకుడు*

ప్రశ్న: మన యోగంలో ఒక్కొక్కప్పుడు కదలకుండా ఉదాసీనంగాను (passivity) మరొకప్పుడు కార్యకారిగాను (activity) వుండాలంటారు. దానిని వివరించి చెప్పండి.

నీలో మాతృశక్తి సంచారము జరుగుతున్నప్పుడు నువ్వు కదలకుండా, మెదలకుండా ఉదాసీనంగా వుండాలి; ఇతర సమయాలలో ఆకాంక్షించాలి, తపస్సు చేయాలి, దుష్టశక్తులను తిప్పికొట్టాలి — అనగా activity అన మాట.

*

నీ జ్ఞాపకాలలోనుండి అనేక ఆలోచనలు సంస్కారాలు నీ అనుమతి లేకుండానే పెల్లుబికి వస్తున్నప్పుడు వాటి నేమాత్రం ఆదరించకుండా ఉదాసీనంగా వుండాలి. ఆ ఉదాసీనత నీ మనస్సును పాతసంస్కారాలనుండి చెడ్డధోరణుల బారినుండి రక్షిస్తుంది. అప్పుడు నువ్వు వాటి బెడద లేకుండా నీ ఇచ్ఛవచ్చిన రీతిలోనే ప్రవర్తించవచ్చును.

*

ఒక్క ఉన్నతోన్నత చైతన్యమునకు మాత్రమే నువ్వు నీ కవాటములను తెరచిపెట్టి, అవసరమైనయెడల ఉదాసీనముగా వుండవలెనేగాని ఇతరమైన శక్తులకుగాదు.

కాబట్టి ఉదాసీనతలోకూడ నువ్వు అప్రమత్తంగా వుండాలి. లేనియెడల అవాంఛితమైన సంఘటనలు కలగవచ్చును. జడత్వము ఆవహించవచ్చును.

*

ఈ విధంగా మనము ఉదాసీనమై వున్నప్పుడు మన ఖండ జ్ఞానము పోయి అఖండమైన, అనంతమైన జ్ఞానము మనని వరిస్తుంది. మన సర్వసత్త్వముతో మానవాతీత సీమలను దర్శించినప్పుడు (we open ourselves to what is beyond) మనకో విషయము తెలియవస్తుంది. *మనకంటె గొప్పదైన, విశ్వగతమైన లేక విశ్వాతీతమైన ఒక మహాశక్తి మనయందు ప్రవేశించి మన ద్వారా ఒక మహాకార్యమును సాధిస్తుంది.* దివ్యజ్ఞానము, దివ్య శక్తి, సచ్చిదానందములు వాటి వాటి కార్యములను నిర్వహించుటకు మనము కేవలం వాహికములు మాత్రమే.

(*SABCL* Vol. 17, p. 219; Vol. 23, p. 607; Vol. 18, p. 572)

19

ఆధ్యాత్మికజీవిత మనగా గురువులవద్ద దీక్షపొంది ఏవేవో తంతులు జరపటమని మనకు తెలుసు. అయితే గురువు అదృశ్యరూపంలో కూడ నీకు దీక్ష నివ్వగలడు. నీలోకి ప్రవేశించి నీ సాధనను చేసిపెట్టగలడు. నీ దోషములను పరిహరించి నిన్ను సన్మార్గంలో పెట్టగలడు. — సంపాదకుడు

ఈ యోగమును ఒక ఉపదేశము ద్వారా నేర్చుకోలేవు. *ఆకాంక్ష వలన, శ్రీమాతను గురించి ధ్యానము చేయుటవలన* నీ కవాటములను తెరచినపుడు శ్రీమాత శక్తి సామర్థ్యములను గ్రహించి నీలో ఆమె ప్రక్రియలను కార్యకలాపములను జరిపించుకొనినపుడే అది సాధ్యము.

*

వెలుగుబాట, శోకమార్గము అనే రెండు బాటలున్నాయి. ఏమాత్రం భయము లేకుండా, ఏమయినా కూడ విచారించకుండా పూర్తిగా శ్రీమాతనే నమ్ముకొని ముందుకు సాగిపోవటమంత ఉత్తమం మరొకటి లేదు. *ఆకాంక్ష అవసరమే — అయితే వెలుగును వెదజల్లే, విశ్వాసమైన సంతోషపూర్వకమైన ఆకాంక్ష వుంటే మరీ*

మంచిది. ఒకవేళ కష్టాలొచ్చినా కూడ వాటిని చిరునవ్వుతోనే ఎదుర్కొనవచ్చు!

*

పని చేస్తున్నప్పుడు శ్రీమాత సాన్నిధ్యాన్ని పొందటం కష్టమే – నువ్వే పనిచేస్తున్నటుల భావిస్తూ అందులో నిమగ్నమైనప్పుడు నీ మనస్సును దానినుండి వేరుచేసి ఉదాసీనంగా వుండలేవు.

*

1. *నిన్ను వీవు అధికాధికంగా సమర్పించుకుంటూ పోవాలి.* నీ చేతనను, అందులో జరిగే సమస్తమైన కదలికలను, కర్మలను, చర్యలను సమర్పించాలి.
2. నీలో దోషములు, బలహీనతలు ఉన్నట్లైతే వాటన్నిటిని దైవానికి ఎత్తిచూపిస్తే ఆయన వాటిని పోగొట్టగలడు.
3. నేను చెప్పినట్లు చేయి. హృదయమందిరంలో శ్రీమాత దర్శనమయ్యేంతవరకు నీ దృష్టిని అక్కడ కేంద్రీకరించు.

(*SABCL* Vol. 25, p. 121; Vol. 24, pp. 1358-59; Vol. 25, p. 114; Vol. 23, p. 607)

20

నువ్వు సాధన మొదలుపెట్టి వుండవచ్చు. నీ బాహ్యజీవితం ఎప్పటిలాగే కొనసాగుతుంది. కాని అంతరంగిక జీవితంలో గొప్ప మార్పు వస్తుంది. బాహ్యసన్నివేశాలను బాహ్యపరిస్థితులను అంతరంగికదృష్టితో చూసినప్పుడు వాటి రంగే మారిపోతుంది. అన్ని పరిస్థితులు యోగానికి పనికివస్తాయి. అవి నీకు సహకరిస్తాయి. – *సంపాదకుడు*

ఆకాంక్ష, నిరాకరణ, సమర్పణ – ఈ మూడు సాధకుడు చేయవలసిన ప్రక్రియలు. వీటిని చేసినయెడల మిగిలినవన్నీ శ్రీమాత కృపాకటాక్షములవలన, ఆమె నీయందు నిర్వర్తించు క్రియావిశేషములవలన వాటంతటవే జరిగిపోవును. అన్నిటికంటె సమర్ప

ణాభావము – *విశ్వాసము, కష్టాలొచ్చినప్పుడు ఓర్పు* చాలా ముఖ్యము.

*

సాధకుడు గుర్తుంచుకోవలసిన మరో విషయము అంతరంగిక నిబ్బరము – దైవానుగ్రహమునందు అకుంఠితమైన విశ్వాసమున్నయెడల నీ విశ్వాసమే నీ చేత ఎప్పుడు ఏ పని చేయిస్తే మంచిదో ఆ పనిని చేయిస్తుంది. అయితే అలా జరుగుటకు నీలో నమ్మకం చాలా లోతుగా వెల్లివిరియాలి. దీనికి వ్యతిరేకమైన భావము నీలో ఏమాత్రము ఉండరాదు.

*

బాహ్యాసన్నివేశములు ఎలా వున్నప్పటికి వీటి వెనక శ్రీమాత హస్తమున్నదనే గట్టి నమ్మకముంటే చాలు. అదే నిన్ను అన్ని పరిస్థితులలోను రక్షిస్తూంటుంది.

*

అంతా శ్రీమాతకే ఒదిలేసి పూర్తిగా ఆమెను నమ్ముకొని ఉండటమే, ఆమెయే నిన్ను గమ్యంవైపు నడిపిస్తుందనే నమ్మకంతో వుండటమే, మంచిది.

*

మన ప్రయాణం సుదీర్ఘమైనది. కాని ఆత్మసమర్పణవలన అది దగ్గిర అవుతుంది. ప్రయాణం కష్టమైనది కాని మన విశ్వాసము దానిని సులభం చేస్తుంది.

(*SABCL* Vol. 25, p. 135; Vol. 24, pp. 1696-97; Vol. 25, pp. 325-26; Vol. 25, p. 326; Vol. 17, p. 178)

నీ యందెల్లడలా శ్రీమాతయే వ్యాపించి వున్నప్పుడు నువ్వింక ఆమెను మరవలేవు.

శ్రీఅరవిందులు

21

ఈ సాధనను నీ అంతట నువ్వు చేయలేవు. నీకట్టి జ్ఞానము, శక్తిసామర్థ్యములు లేవు. శ్రీమాత సర్వజ్ఞురాలు, సర్వశక్తిమంతురాలు (సర్వజ్ఞాయై, సర్వశక్త్యై). ఆమె అండదండలుంటే నీకింకేం కావాలి! — *సంపాదకుడు*

నీ శక్తిసామర్థ్యముల కాధారము దివ్యశక్తియే అనే గట్టినమ్మకం నీకుండాలి. ఆమె సాక్షాత్కరించినప్పుడు ఆ నమ్మకం పెరిగి సంపూర్ణమవుతుంది. అనంతాకాశంలోంచి దిగివచ్చిన సృజనశీలియైన చిత్‌శక్తి – ఆ విశ్వదేవతకు చేతకానిదంటూ ఏమి లేదు. **All knowledge, all strengths, all triumph and victory, all skill and works are in her hands and they are full of the treasures of the Spirit and of all perfections and siddhis....** ఇక నీలో ఎక్కడ చూసినా ఆమె సాన్నిధ్యమే, ఆమె శక్తులు నీలో రాణిస్తుంటాయి, ఆమె నీలో క్రియలు చేస్తూ నీలో ప్రవర్తిస్తూ ఉండటమే నీ విశ్వా సము పరిపూర్ణమైనదనుటకు తార్కాణము.

ఆమె వెనుక ఈశ్వరుడున్నాడని తెలుసుకొని, ఆయన యందు పరిపూర్ణమైన విశ్వాసము కలిగియుండుటయే పూర్ణ యోగంలోని ప్రధానమైన విషయము. ఇక మన పరిసరములన్ని ఆ పరమజ్ఞానమువలన ఏర్పడినవే అని తెలియవస్తుంది. మనకు జరిగే విషయములుగాని, మన చుట్టుప్రక్కల జరిగే ఘటనలుగాని వ్యర్థములు కావు సరిగదా, ఏది ఎక్కడ ఎలా జరగాలో అలా జరుగుతుంది. ఇంతవరకు జరిగింది, ఇక ముందర జరగబోయేదంతా కూడా ఆయన జ్ఞాననేత్రముతో చూసి, మన యోగమును పరిపక్వము గావించి, జీవితాన్ని సార్థకము చేయు కార్యక్రమమే.

(*SABCL* Vol. 21, pp. 752-53)

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

22

నీకు దివ్యజీవనం కావాలి. కాని అది ఎక్కడి నుంచి వస్తుంది? ఎక్కడినుంచో రానక్కర్లేదు – నీలోనే దాగివున్నది. దానిని వికసింపజేయాలి. అదికూడ నువ్వు చేయనక్కరలేదు. శ్రీమాత తనే చేసిపెడతానంటోంది. Hitch your wagon to a star. నువ్వామెను పట్టుకుంటె చాలు. ఆమే నీకు అనంతమైన శక్తిని ప్రసాదిస్తుంది.

– సంపాదకుడు

తన శక్తిసామర్థ్యములన్నిటినీ పరమేశ్వరుని పాదపద్మములకు అర్పించుటకే మానవునికి తనలో తనకుగల విశ్వాసమివ్వబడినది. అయితే *నాయం ఆత్మా బలహీనేన లభ్యః* బలహీనులు ఆత్మ దర్శనమును పొందలేరు. 'అయ్యో నేను ఒట్టి సోమరుణ్ణి. నేనేం చెయ్యగలను' అని అనుకోటం చాలా తప్పు. నీకు దైవమే సహాయపడుతున్నప్పుడు అలా అనుకోడం మూర్ఖత్వమే అవుతుంది. నీలో ప్రస్తుతం ఉన్న అసమర్థత నీ విశ్వాసానికి ఓ సవాలు మాత్రమే. ఎందుకని? యోగము ద్వారా నువ్వు పొందవలసిన సమస్తమైన సిద్ధులు, అనుభూతులు నీలో ఇంతకు ముందరే నిక్షిప్తమై ఉన్నాయి కనుక. మానవునిలో దివ్యజీవితము బీజరూపంలో దాగివుంటుంది. నీ శక్తిసామర్థ్యములు నీవి కావని, అవి విశ్వదైవ శక్తి సంబంధితములని గ్రహించాలి. నువ్వు కేవలం ఒక పరికరము మాత్రమే.

*

ప్రాణికి తన కర్మల్లో ఆత్మవిశ్వాసం ఏదో రూపంలో తప్పనిసరి. అది లేకపోతే మానవుడు జీవితంలో ఒక్కడుగు కూడ వేయలేడు. 'గీత' యీ విషయాన్నే బలపరచింది – 'శ్రద్ధ' తప్పనిసరి అని, శ్రద్ధను బట్టే మానవుడుంటాడని, "యో యచ్ఛ్రద్ధః స ఏవ సః".

(*SABCL* Vol. 21, pp. 751-52, 743)

అనువాదం: సాహితీకౌముది పి. మోహన్,

యోగమువలన నువ్వు నీ మనస్సుని దాటి అధికమైన జ్ఞానాన్ని సంపాదించుకుంటావు సరే. తరువాత సంగతి ఏమిటి? రూపాంతరీకరణము, అనగా నీ జాంతవిక శరీరం బదులు దివ్యశరీరం కావాలి. నీ ప్రాణిక దైహికములను, నీ రక్తకణములను సహితము ఉద్దీపింపజేసి ఈ రక్తమాంసాలను కూడ దివ్యపదార్థంగా మార్చాలి. *– సంపాదకుడు*

మూడు అవసరమైన లక్షణాలు

నిన్ను నీవు రూపాంతరీకరింప చేసుకోవాల్నంటే నిస్సంకోచంగా నిశ్శేషంగా నిన్ను శ్రీమాత చేతులలో వుంచుకోవాలి. ఆమెను నీలో పనిచేయనియ్యాలి. *తప్పనిసరిగా మూడులక్షణాలు – చైతన్యము, వెన్నపూసలాంటి మెత్తదనము సంపూర్ణసమర్పణ ఉండాలి.* ఆమె నీలో పనిచేస్తున్నట్లు నీ మనస్సుకు తెలియాలి. హృదయంలో వేదన కలగాలి. ఆత్మకు స్ఫురించాలి. జీవకణాలలో కూడ ఆమె ఉనికిని పొందాలి. ఆమెయే పనిచేస్తున్నట్లు తెలియాలి. తెర వెనకాల నిల్చొని నీకు తెలియకుండానే ఆమె పనిచేయగలదు అనుకో. కాని జాగ్రుతమై ఆమెతో సజీవమైన సంబంధము కలిగి వున్నప్పటి సంగతి వేరు. నీ *ప్రకృతి అంతా ఆమె చేతిలో వెన్నపూసై పోవాలి. దీని అర్థమేమిటి? మనస్సుయొక్క ప్రమేయం పనికిరాదు.*

ఈ మనస్సుయొక్క సంగతి నీకు తెలియదు. అది అయోమయం. అంధకారబంధురం. దానిది చీకటిబ్రతుకు. దానికి ఎవరైనా హితవు చెప్పినా కూడ అది ఒప్పుకోదు. మార్పు నెదిరిస్తుంది. తనకి తానే శత్రువు. కాని రూపాంతరీకరణానికి ఈ సాకులు ఏవి పనికిరావు.

ప్రాణిక భౌతికాలు పాల్గొనుట

మనిషియొక్క ప్రాణికము మరో మొండిఘటము. అది దాని ఇష్టమొచ్చినట్లు ప్రవర్తిస్తుందే తప్ప దైవప్రేర

ణకి లొంగదు. తన మొండికోరికలు, దుర్బుద్ధులు తనవి. ఈ విధమైన జడత్వము, తమస్సు మానవుని భౌతికచైతన్యమువలె తన చిన్న చిన్న కోరికలవలయంలో చిక్కుకొని, చీకటిలో గిల గిలా కొట్టుకొంటూ, ఎవరైనా తనకి హితవు చెప్పి, వెలుగును చూపించి తన జడత్వాన్ని పొగొట్టి నిద్రలేపినా కూడ ఒప్పు కోదు. బహిరాంతరంగములలో సమర్పణ ప్రక్రియ నిశ్శేషంగా జరిగినప్పుడు ప్రకృతి కూడ కాఠిన్యము తీరి వెన్నపూసవలె మృదువుగా వుంటుంది. పైనుంచి గంగాప్రవాహమువలె దిగి వస్తున్న జ్ఞానము వెలుగు, శక్తి, సామరస్య సౌందర్యములను నువ్వు గ్రహించుటవలన నీలోని అన్ని విభాగములలోను చేతన మేలుకొంటుంది. ఆఖరికి శరీరం కూడ మేలుకొని తన భౌతిక త్వాన్ని జ్ఞానవంతము చేస్తుంది. *పైనుంచీ, క్రిందినుంచీ అన్ని వైపులనుంచీ కొడుతున్న అతిమానసచైతన్యాన్ని పొంది, అది శరీరంలోకి చొచ్చుకొనిపోగా నువ్వు దివ్యప్రేమానందములతో జలదరించిపోయెదవు.*

(*SABCL* Vol. 25, pp. 36-38)

(ఫిబ్రవరి 2002 'అఖిల' నుండి పుటలు 9-10)

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

24

శ్రీమాతను నువ్వు చర్మచక్షువులతో దర్శించలేవు. నీయందు ఆమె చేయు ప్రక్రియలను అసలే అర్థం చేసుకోలేవు. నీ చైత్య నేత్రము తెరచి చైత్యదృష్టి కలిగినప్పుడే ఆమె కార్యకలపాల లోని అంతరార్థాన్ని చూడగలవు. – సంపాదకుడు

చర్మచక్షువులది మసకదృష్టి. మానవ మనస్సునకు పాక్షికజ్ఞానమే తప్ప పూర్ణజ్ఞానము లేదు. కాని పరాశక్తి (Divine Shakti) అటుల గాదు. *ఆమె అన్ని పరిస్థితులను చక్కగా గమనించి ఎక్కడ ఏది చేయాలో అది చేస్తుంది. అయితే ఇది మనస్సుకు అర్థంకాని విష*

యము. ఆమె ఎప్పుడు ఏ దారి తొక్కుతుందో తెలియదు. ఆ పరాశక్తిది బహుదేవతాముఖత్వము. ఏ దేవతచే ఎప్పుడు ఏ పని చేయిస్తుందో, ఎప్పుడు నిలిపివేస్తుందో, ఎప్పుడు మెరుపు మెరిసినట్లుగా మిరుమిట్లుగొలుపుతూ పని చేస్తుందో, ఎప్పుడు నిశ్చలంగా ఉంటుందో, ఎప్పుడు ఏ సమస్యను ఏ విధంగా పరిష్కరిస్తుందో నీ కర్థం కాదులే. పైనుంచి ఒక వెలుగు క్రిందికి దిగివచ్చి ఒక్క తృటిలో అనేక కార్యములను ఎటుల నిర్వహించునో అనే విషయము మానవమేధకు అతీతము. ***అందుకని నీ ఆత్మద్వారములను తెరచిపెట్టు. ఆత్మదృష్టితో ఆమెను గమనించు. చైత్యస్ఫూర్తితో ఆమె పనులను గుర్తించు.*** చైత్యనేత్రము మాత్రమే వాటిని గుర్తించగలదు... *కాని నీకొక హెచ్చరిక. కేవలం నీ మనస్సు మీద ఆధారపడ్డావో శ్రీమాత నీ యెదట సాక్షాత్కరించినా కూడ నువ్వు కనుక్కోలేవు. నువ్వు నీ ఆత్మనేత్రంతో చూడాలి. అది మనస్సువలె మోసపోదు. సత్యమును వెంటనే గుర్తిస్తుంది. నువ్వు దివ్యశక్తిని నమ్ముకోవాలి.* నీలో కొన్ని దివ్యాంశములు నీకు తెలియకుండానే లోపల దాగి ఉంటాయి. నువ్వు చేతులు కట్టుకొని నిన్ను శ్రీమాతకు అప్పచెప్పుకున్నప్పుడు ఆమెయే నీలోని దివ్యగుణములను వెలికితీస్తుంది. అప్పుడు నీకు సరియైన దైవస్ఫూర్తి కలిగి నీ మానవప్రకృతి మారి దివ్యప్రకృతిగా పరిణమిస్తుంది. నీలో దివ్యలక్షణాలు ప్రవృద్ధమై నీవు దివ్యమానవునిగా పరిణమించెదవు.

(*SABCL* Vol. 25, pp. 38-40)

(నవంబరు 2000 'అఖిల' నుండి పుటలు 25-27)

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

నీలోని సకల విభాగములు శ్రీమాతకు ఉన్ముఖమైనప్పుడు ఆమె నీలో నిరాటంకంగా పనిచేయగలదు.

శ్రీఅరవిందులు.

దివ్యజీవనం కొరకు ఆకాంక్ష

1

మన జీవితానికి పరమార్ధమేమిటి? భోగభాగ్యములు కానేరవు. అవి మన నిజస్వరూపమును ఆవిష్కరించలేవు. శాశ్వతానంద మును సమకూర్చలేవు. అసలు విషయం 'తత్త్వమసి' మొ॥ మహావాక్యాలలో ఎక్కడో దాగివున్నది. మన బాహ్యజీవితము ఎంత జాంతవికమైనప్పటికి అంతరంగికంగా మనం దివ్యస్వరూ పములమే. దాని నిక్కడ ఆవిష్కరింపజేయాలి.

— సంపాదకుడు

ఒక నైతికవిజయమో లేక భోగభాగ్యములో మానవ జీవిత పర మావధి కానేరవు. మన నిజమైన అస్తిత్వంలోకి, పరమాత్మ అస్తి త్వంలోకి, సర్వోత్కృష్టమైన, విశ్వజనీన అస్తిత్వంలోకి, చైతన్యం లోకి, ఆనందంలోకి, సత్-చిత్-ఆనందశిఖరాల వరకు ఎదగడమే మన లక్ష్యం కావాలి.

మన జీవితం ఆ 'అస్తిత్వం' పై ఆధారపడి వుంది. మనలో క్రమానుగతంగా పరిణమిస్తున్నది అదే. ఆ 'అస్తిత్వం' నుండి ప్రభవించిన అస్తిత్వం మనం. ఆ 'చైతన్యం' నుండి ఆవిర్భవించిన చైతన్యం మనం. ఆ చిత్‌శక్తినుండి వచ్చిన శక్తి మనం – చైత న్యపు ఆనందప్రజ్వలిత సంకల్పం (will-to-delight), చైతన్యపు ఆనందప్రవాహం, ఆ 'ఆనందం' నుండి ప్రభవించిన శక్తిమయ ఆనందం. మన అస్తిత్వానికి మూలతత్త్వం అదే. ఈ సృష్టిలో మన ఉపరితల స్వరూపం అది గాదు. అజ్ఞానసమాహారంగా మారిన తప్పు అనువాదం అది. భగవత్ అస్తిత్వం వైపు తిరిగి "అదే నేను" (That am I) అని పలికే ఆధ్యాత్మిక అస్తిత్వం మన లోని "నేను" కాదు. మన మనస్తత్వం ఆ ఆధ్యాత్మిక చేతన కాదు. మన బుద్ధి ఆ చైతన్యశక్తి కాదు. మన సుఖదుఃఖాలు, మన అత్యున్నత సంభోగాలు, హర్షాతిరేకాలు ఆ చైతన్యపు ఆనందం కాదు. మన ఉపరితలంపై మనం ఆత్మగా చెలామణి అవుతున్న

అహం. జ్ఞానంగా మారే అజ్ఞానం. నిజమైన శక్తివైపు శ్రమించే బుద్ధి. అస్తిత్వపు ఆనందాన్ని అన్వేషించే కోరిక. అహాన్ని అధిగమించి, మన నిజమైన ఆత్మగా మారడం, మన అసలు అస్తిత్వం విషయంలో ఎరుకతో వుండడం, మన అస్తిత్వంలోని నిజమైన ఆనందాన్ని పొందడం – అదే ఈ పృథ్విపై మన జీవిత అంతిమ పరమార్థం. మన వ్యక్తిగత, ప్రాపంచిక అస్తిత్వం వెనుక నిక్షిప్తమైన నిగూఢ పారమార్థిక ప్రాభవం అదే.

(*SABCL* Vol. 19, pp. 685-86)

2

పరిణామక్రమంలో మానవుడు నేడు మకుటస్థానంలో వున్నాడు. కాబట్టి తదుపరి స్థాయిని గురించి విచారించవలసి వున్నది. ఈ సృష్టి గమనాన్ని ఎరిగి దానితో సహకరించటం అతని విధి. అప్పుడతను దివ్యమానవుని ఆవిర్భావమునకు దోహదము చేసినవాడవుతాడు. మనము కూడ ఈ పిలుపుని వినిపించుకొని తగనుగుణంగా స్పందించెదము గాక!

– సంపాదకుడు

ఒక మహాసత్యచైతన్యం వున్నదని వేదం ప్రవచించింది. దానికే నేను అతిమనస్సు (supermind) అని పేరు పెట్టాను. ఇది జ్ఞానాన్ని (విద్య) కలిగి వుంటుంది. దానిని వేరే అన్వేషించనవసరము లేదు. ఆ జ్ఞానాన్ని నిరంతరం పోగొట్టుకోవలసిన అవసరం లేదు. మనోమయపురుషునికి అతీతంగా విజ్ఞానమయపురుషుడున్నట్లు ఒక ఉపనిషత్తులో చెప్పబడింది. ఆ విజ్ఞానమయపురుషుని లోనికి ఆత్మ అధిరోహించి తద్వారా ఆధ్యాత్మిక అస్తిత్వపు పరిపూర్ణ ఆనందాన్ని సిద్ధింపచేసుకోవలసి యున్నది. ప్రకృతిలో తదుపరి పరిణామసోపానంగా దానిని సాధించినట్లయితే, అప్పుడు ప్రకృతి సఫలీకృతం చెందుతుంది[1]. ఈ భూమి మీదనే (ఇహైవ) ఈ

---

[1] God found in Nature, Nature fufilled in God. – *Savitri*

శరీరంలోనే లేదా పరిపూర్ణత్వం చెందిన ఈ శరీరంలోనే పరిపూర్ణ ఆధ్యాత్మిక జీవితం సిద్ధిస్తుంది. భూమిపై దివ్యజీవనం సాధ్యమేనని మనం చెప్పవచ్చును. పరిపూర్ణత్వం గూర్చి మానవాళి కన్న కలలు సిద్ధిస్తాయి. అదే సమయంలో, అనేక మతాలు, క్రాంతిదర్శులు, ద్రష్టలు, మేధావులు కన్న కలలు నెరవేరుతాయి.

పరమోన్నత పరమాత్మ వైపు మానవాత్మ అధిరోహణం ఆత్మయొక్క అత్యున్నత లక్ష్యం, ఆవశ్యకత. ఎందుకంటే అదే పరమోత్కృష్ట సత్యం, యథార్థం. అయితే పరమాత్మ, ఆయన శక్తులు ప్రపంచంలోకి అవరోహించడం కూడా సాధ్యమే. ఈ భౌతికప్రపంచ అస్తిత్వానికి కూడా ఓ పరమార్థం వుందని ఆ అవరోహణ నిరూపిస్తున్నది. ఈ సృష్టికి ఒక దివ్యప్రయోజనం అది ప్రసాదిస్తుంది. ఈ సృష్టి చిక్కుప్రశ్నను పరిష్కరిస్తుంది. అత్యున్నతమైన, అతివిశాలమైన ఆదర్శం అన్వేషణలో ప్రాక్, పశ్చిమాల మధ్య అనుసంధానం సాధించవచ్చును. పరమాత్మ జడపదార్థాన్ని తన పరిష్వంగంలోకి తీసుకుంటుంది. జడపదార్థం కూడా సర్వవస్తురాశిలోని తనదైన నిజమైన వాస్తవాన్ని, అంతర్నిగూఢ వాస్తవాన్ని పరమాత్మలో దర్శిస్తుంది.

(*SABCL* Vol. 26, pp. 415-16)

3

దివ్యజీవనమనగా మానవజీవితాన్ని నిరసించటమనే అపోహ కొందరిలో వున్నది. వానరము కంటె నరుడు తీసిపోడు గదా! అలాగే రేపటి మానవుడు నేటి మానవుని కంటె తీసిపోడు సరికదా దివ్యమానవునిగా అలరారుతాడు. దివ్యమానసముతో దివ్యదేహముతో భాసిస్తాడు. – సంపాదకుడు

దివ్యీకరణమనగా మానవలక్షణాల విధ్వంసం కాదు; వాటిని కూడా తనలో కలుపుకుని, వాటి పరిపూర్ణత్వానికి దారి చూపడం, వాటి సంపూర్ణశక్తి, ఆనందాలవైపు పూర్ణత్వం, ప్రక్షాళన ద్వారా

ఉద్ధరించడం. మొత్తం పృథ్వీ జీవనాన్ని దాని పూర్తి శక్తి, ఆనం దాల వైపు సముద్ధరించడం అన్న మాట. జీవన దివ్యీకరణ అంటే నిజానికి మరింత మహనీయమైన జీవనకళ. అహంకారం, అజ్ఞానంతో కూడిన ఇప్పటి జీవనకళ క్షుద్రమైనది. అపరిపూర్ణమై నది, నికృష్టమైనది. (క్రింది స్థాయిలోని కళ, సంగీతం, సాహిత్య రూపాలవంటివి. అదే సామాన్య మానవమనస్సుకు, ప్రాణికానికి ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తాయి). ఆధ్యాత్మిక, చైత్యపురుష వికాసం ద్వారా, ఉన్మీలనం ద్వారా అది తన నిజమైన పరిపూ ర్ణత్వం అందుకోగలదు. *భగవత్ మహత్ జ్యోతిర్ని వహంలో, అగ్నిజ్వాలలో దానిని ముంచెత్తడంవల్లనే అది సాధ్యపడుతుంది.* అప్పుడే దాని చుట్టూ ఆవరించిన దట్టమైన చట్రము కరిగిపోయి, నిజమైన కాంతివంతమైన స్వర్ణలోహంగా మారుతుంది.

దురదృష్టవశాత్తూ ఇందుకు కనరాని, కఠినమైన ప్రతిఘ టన ఎదురవుతుంది.

ఇదే యోగసాధనలో వ్యతిరేక అంశం. దారికి అడ్డుగా నిలిచే వాటిని తిరస్కరించాలి. ఈ క్షుద్రమైన, నిరుపయోగమైన రూపాలు అదృశ్యమయ్యేలా వత్తిడి తేవాలి. ఉపయోగకరమైన, కాని అపరిపూర్ణమైన, వైకల్యం చెందిన రూపాలపై తిరిగి సక్రమ మార్గంలో ప్రవేశపెట్టడానికి వత్తిడి తేవాలి. ఈ పూర్ణయోగ ప్రక్రియ జీవితాన్ని త్రోసిపుచ్చడం కాదు. భగవంతునికి, సాధకులకు మధ్య సాన్నిహిత్యాన్ని త్రోసిపుచ్చడమూ కాదు. భౌతికభూమికలలోను, ఇతరభూమికలలోను భగవంతునితో అత్యంతప్రగాఢమైన సాన్ని హిత్యాన్ని, సాయుజ్యాన్ని కలిగియుండడమే ఈ పూర్ణయోగ లక్ష్యం. జీవితంలో ఆనందాన్ని, నిండుతనాన్ని, భగవత్ విశాల జీవనవికాసం పొందడమే ఈ యోగపు పరమావధి.

(*SABCL* Vol. 25, pp. 125-26)

4

నేటివరకు జరిగిన పరిణామ కార్యక్రమము యుగయుగాల పర్యంతము ప్రకృతి జరిపే నత్తనడకన సాగింది. కాని ఇప్పుడు మానవుడు ఆవిర్భవించాడు కనుక అది వేగం పుంజుకుంటుంది. అతనిని ప్రేరేపించి అతని సహకారంతో ఎగురుతూ, గెంతుతూ ముందుకు సాగిపోతుంది. — సంపాదకుడు

మనిషిలో ఆధ్యాత్మిక ఆకాంక్ష అంతర్గతంగా, సహజసిద్ధంగా వుంది. మృగానికి లేని లక్షణం అతనిలో వుంది. తనలోని అపరిపూర్ణత్వం, పరిమితుల గూర్చి ఎరుక అతనిలో వుంది. ప్రస్తుతం తను వున్న స్థితికి అతీతంగా దేనినో సాధించాలన్న వేదన అతనిలో వుంది. మనిషిలోని ఎరుకతో కూడిన ఆకాంక్ష, ఉద్దేశ్యం, సంకల్పం, అన్వేషణ ద్వారా కాకుండా, అవచేతన, అంతస్థలీయం (subconscious, subliminal) ద్వారా ప్రకృతి స్వయంచలిత ప్రక్రియ ద్వారా — భౌతికపదార్థ జగత్తులో ఆలోచించే మనస్సు అవతరణ వరకు పరిణామం సంభవించింది. దీనికి కారణం అచేతన నుండి పరిణామం ప్రారంభమైంది. జీవిలోని ఎరుకతో కూడిన, ప్రకృతి కార్యకలాపాలలో పాల్గొనగల వ్యష్టి సంకల్పం ద్వారా పనిచేసే రహస్యచేతన అచేతననుండి వెలువడలేదు. కాని మనిషిలో అవసరమైన మార్పు చేయబడింది. మనిషి మేల్కొని, తానెవరో ఎరుక వహించి వున్నాడు. అభివృద్ధి చెందడానికి, జ్ఞానంతో వికాసం పొందడానికి, ఆంతరంగిక జీవనాన్ని ప్రగాఢతరం చేసుకోడానికి, బాహ్యజీవనాన్ని విస్తరింపచేసుకోడానికి, తన ప్రకృతిలోని శక్తులను పెంపొందించుకోడానికి తగిన సంకల్పం మనోమయభూమికలో అభివ్యక్తం అయింది. తనకు మించిన ఉన్నత శ్రేణిలోని చైతన్యం ఉండవచ్చునని అతను గ్రహించాడు. అతని మనస్సు, జీవితం పొరలలో ఎక్కడో పరిణామగతమైన తీవ్ర ఆకాంక్ష, తృష్ణ (oestrus) తనను అధిగమించిపోవాలన్న అభీప్స అతనిలో బలీయంగా పాదుకుంది; అతనిలో విస్పష్టంగా అభివ్య

క్తమయింది. తనలో ఆత్మ వుందనే స్ఫృహ అతనికి గట్టిగా కలిగింది. పరమాత్మను కనుగొన్నాడు. తనలోని ఆత్మ విశ్వమంతటా పరివ్యాప్తమైనదని గ్రహించాడు. అవచేతనాత్మక పరిణామం కాకుండా చైతన్య ప్రదీప్తమైన పరిణామం అతనిలో కొనసాగే భావన రూఢి అయి, ఆచరణయోగ్యం అయింది. అతనిలోని ఈ ఆకాంక్షను, అనుస్యూతంగా చేస్తున్న ప్రయత్నాన్ని తిలకిస్తే జీవనసాఫల్యానికి మరింత ఉన్నత సోపానం నిర్మించవచ్చు. మరింత ఉన్నత శ్రేణికి చెందిన చైతన్యం ఆవిర్భవించవచ్చునన్న ప్రకృతి సంకల్పం నెరవేరే సూచనలు కానవస్తున్నాయి.

(*SABCL* Vol. 19, p. 843)

అనువాదం: యజ్ఞన్న

చంపక్‌లాల్‌కి శ్రీఅరవిందులు ఇచ్చిన మంత్రము

ఓం శ్రీఅరవింద మీరా

నా మనస్సును, హృదయమును జీవిత కవాటములను తెరిపించి నీ వెలుగు, ప్రేమ, శక్తులను నాలోనికి ప్రసరింపజేయుము. సమస్త వస్తుజాలమునందు నేను దైవమునే చూచునట్లు అనుగ్రహింపుము.

శ్రీఅరవిందుల వివరణ: ఇదిగో పేర్లతో సమకూర్చిన ఓ మంత్రాన్ని నీకు రాసిపెట్టాను. దీనితో నీ కష్టాలను అధిగమించి అంతరంగికంగా దిట్టమైన పునాది వేసుకోవగలవని నమ్ముతాను.

(*SABCL* Vol. 26, p. 512)

అనుబంధం:

1

ఆశ్రమవాసి ఉదార్ పింటో శ్రీమాతను అడిగి తెలుసుకున్న సాధనావిశేషాలు.

నేను 1937 లో శ్రీఅరవిందుల ఆశ్రమంలో చేరాను. అప్పట్నుంచి యోగం మీద శ్రీఅరవిందులు వ్రాసిన అద్భుతమైన పుస్తకములు చదివి వారి యోగాన్ని చేయడానికి సాధ్యమైనంత ప్రయత్నం చేసాను. కానీ 25 సంవత్సరముల తర్వాత గూడ యోగంలో నెనెక్కడున్నానో నాకు రూఢిగా తెలియలేదు. తర్వాత ఒక రోజు "నేను యోగం సరిగా చేస్తున్నానా?" అని మన స్వీట్ మదర్‌ని అడిగాను. నేను చేస్తున్నదంతా తప్పని ఆమె చెప్పినప్పుడు నేనాశ్చర్యబోయాను. కలవరపడ్డాను. నేనేం చేయాలి? అని ఆమెను వేడుకున్నాను. చిరునవ్వుతో ఆమె "యోగాన్ని నువ్వే చెయ్యాలని ఎందుకనుకుంటున్నావు? అదే నీ పొరపాటు" "మరి నేను ఏం చేయాలి?" అని అడిగినదానికి జవాబుగా ఆమె "నీ కోసం నేను యోగం చేస్తాను. నీ కోసం నన్ను యోగం చెయ్యనీ. నీ పని సులభతరం చేయుటకే నేను ఈ భూమి మీదకు వచ్చాను. నీవు ఎందుకు ప్రయత్నం చేయడం, అది చేయడానికి నేను ఇక్కడ ఉన్నప్పుడు?" అయితే నా పాత్ర ఏమిటని అడిగిన దానికి జవాబుగా ఆమె "నిన్ను నాకు సమర్పించుకో, అప్పుడు అంతా నేనే నీకు చేసిపెడ్తాను. నా కోసం నీవు చేస్తూవున్న పనిని కొనసాగించటమే నీ వంతు. నీ సాధనను నన్ను చేసిపెట్టనివ్వు. అంతే."

కాని శ్రీమాతకు సమర్పించుకోవటము మాటలలో చెప్పేటంత సులువైన విషయం కాదని మెల్ల మెల్లగా అర్థమైంది నాకు. అది కష్టతరమైనదని తెల్సింది. మళ్లీ ఆమెనే అడిగాను, ఎలా చేయాలి సమర్పణ? అని. "ప్రొద్దున నీవు లేచిన తర్వాత ఏమి చేస్తావు?" అని ఆమె అడిగారు. అందరూ చేసే కార్యక్రమాల్నే

నేనూ చేస్తాను అని అన్నాను. కాని ఆమె నన్ను వివరంగా చెప్పమని కోరారు. పళ్లు తోముకుంటాను అని చెప్పాను. అయితే ఆమె అడిగారు: నీ పళ్లను శుభ్రపరుస్తున్నప్పుడు ఏమైనా ఆలోచిస్తావా లేక కలలు కంటావా? అని. ఇది చాలా మామూలు విషయం. ఈ విషయమై ఆలోచించనవసరం లేదు. కలలు కననవసరము లేదు అని అన్నాను. అప్పుడు ఆమె ఇలా అన్నారు. నాతో కలిసి నీవు నీ పళ్లను శుభ్రపరుచుకో, ఆ క్షణంలో నేను నీ ఎదుటనే ఉన్నాననే మనోభావనతో, మన ఇద్దరం కలిసి పళ్ళను శుభ్రపరుద్దాం. నీతో నా ఉనికిని నీవు అనుభవించు. నీవు చేస్తున్న పనులను నీతో కలిసి నన్ను కూడా చేయనీ. నాతో మాట్లాడు. నీవు చేసే పనులను ఇంకా బాగా చేయుటకు నాతో చర్చించు. నీవు భోజనం చేసేటప్పుడు తింటున్నదానిని మనిద్దరం కలిసి దాని అద్భుతమైన రుచిని ఆస్వాదిద్దాం. ఒక రొట్టముక్కనైనా సరే నాతో కలిసి తిన్నట్లైతే అదెంత రుచిగా వుంటుందో చూడు.

ముఖ్యంగా ఆమె చెప్పేదిది – చిన్నవిషయమైనా సరే, పెద్దవిషయమైనా సరే ఆమెతో సంబంధం తెగిపోయే పని ఏదీ చెయ్యకూడదు. నిరంతరం ఆమెకు సమర్పించుకుంటూ ఆమె రాకకు మన కవాటములు తెరచి వుంచాలి.

శ్రీమాత విస్ఫులింగము మనందరిలోను వున్నది – మన మామెకు సమర్పించుకుండేందుకు ఎక్కువ దూరం పోనక్కర్లేదు.

(జూలై 1995 *AIM* నుండి, pp. 33-34)

అనువాదం: త్రివేణి

నీలోని అణువణువూ ప్రశాంతమైనప్పుడు శ్రీమాత అనంతచైతన్యము నీకు తెలియవస్తుంది.

శ్రీఅరవిందులు

2

ఆశ్రమవాసి జనీనా స్ట్రోకా తన స్నేహితురాలికి 1957-58 ప్రాంతంలో రాసిన ఉత్తరాలలోని కొన్ని విషయములు.

"నేటి ఉదయము ఆమె నా హృదయములో ఉన్నట్లు గుర్తించితిని. ఎంతో వైభవంగా ఆమె ఉన్నది. సందేహము లేదు. తన ఇంట్లో వున్నట్లుగానే ఆమె నాలో వుండి మందస్మితయై నాలో పనిచేస్తున్నది. నేనేం చేయాలి అని ఆమె నడిగాను. ఏమి చేయనక్కర్లేదు. మనస్సులో ఆమెకు సాష్టాంగపడి, నాలో ఆమె చేయు ప్రక్రియలను ఊరికే చూస్తూ కూర్చోటమే నా పని. ఇక నుంచి నా ప్రవర్తనలో ఎంతో మార్పు – ఏ పని చేసినా కూడ అందులో ఒక విశిష్టత ఒకానొక సౌకుమార్యత. ఎందుకంటే ఆమెయే ఈ శరీరంలో నివసిస్తోంది. *ఈ శరీరవాసి అయిన ఆమెను ఎంతో ప్రేమతో ఎంతో జాగ్రత్తగా చూడాలి.*

"నేనీ ఇంట్లోంచి నిష్క్రమించవలసిన సమయమాసన్నమై నట్లు ఆమె నాకు చెప్పింది. ఈ దేహము తన సొంతమే అను కుండే ఈ మనిషిని (నన్ను) ఇన్నాళ్లు ఆమె భరించింది. నేనెంత మూర్ఖంగా ప్రవర్తించినా ఏమి అనలేదు. కాని ఇక చాలు అని ఆమె నాకు గట్టిగా చెప్పింది. తనకి నేను ఎలా అడ్డుతగుల్తు న్నానో చూపించింది. నేను చేసే ప్రతి పనిని నా ప్రమేయంతో ఎలా పాడుచేస్తున్నానో చూపించింది. వ్యాయామము, రోడ్డు మీద నడవటం, ఇతరులతో ప్రవర్తన, పనులు, చిత్రలేఖనం... ఒకటేమిటి సమస్తమైన విషయాలను గురించి ఒక టీచరువలె ముద్దుగా నన్ను దగ్గరకు తీసుకొని ఎంతో ప్రేమతో, ఓపికగా పాఠాలు నేర్పింది. నా కివాళ మరో విషయం తెలిసింది. నేనా మెకు సాష్టాంగదండప్రణామము లాచరిస్తున్నట్లు నా నిరంతరా నుభూతి అయిపోయింది.

"పొద్దున లేచినప్పటినుంచి రాత్రి పడుకుండేంతవరకు నాతో మాట్లాడుతూ నన్ను గాఢంగా ప్రేమించే ఒక నేస్తము,

ఒక ఉపాధ్యాయిని వున్నప్పుడు నా కంతకంటే ఏం కావాలి? నా జీవితమంతా మారిపోయి ఎంతో పవిత్రము, సత్యము, సరళము అవుతోంది. నా ఆలోచనలు మాయమయిపోయినాయి. అంతా ఒక పవిత్రమైన ప్రశాంతత".

"మన మనస్సు ఎంత ఘోరమైన బరువుమోతో ఇప్పుడు నా కర్థమౌతోంది. నన్ను ఆ బాధనుండి తప్పించమని నిరంతరం ఆమెను వేడుకొంటున్నాను.

"నా జీవితమంతా ఎన్ని పనికిరాని ఆలోచనలు వచ్చి నా ప్రాణం తీసినయ్యో! 'ఇప్పుడేం చెయ్యాలి' 'ఆ తరువాత ఏం జరగబోతోంది'. ఎన్ని వ్యర్థమైన ఆలోచనలు కలుగుతాయో నా కిప్పుడు అర్థమౌతోంది. 'నిన్ను నీవు వృథా చేసుకోవద్దు, విచ్చలవిడిగా ప్రవర్తించవద్దు' అని ఆమె ఎందుకు చెప్పేదో నాకిప్పుడు తెలుస్తోంది. ఆలోచనల వలయంలో పడి గిలగిలా తన్నుకుండే బదులు ఆవిడ వైపు తిరిగి నిన్ను నీ వ్యవహారాన్ని సర్వ సమర్పణ కావించుకోవాలి.

"ఇక నేను నా యోగాన్ని గురించిగాని, అభివృద్ధిని గురించిగాని ఆలోచించటం మానేసాను. ఆమె నాయందు చేసే ప్రక్రియలను నేను తెలుసుకోవాలని నా ఏకైక ఆకాంక్ష. ప్రతి చిన్న విషయాన్ని ఆమె కర్పించటం మరచిపోకూడదు. నే నామెతో ఏకమైపోవాలి. నేనామెకు వశమైపోయెదను.

"ఆమెకు ఇవ్వవలసినది నాలో చాలా వున్నది. ఇప్పుడు ఇది, ఆ తర్వాత అది. ఈ విధంగా ఇచ్చుకుంటూపోయాక ఇక నాలో కొంచెమే మిగిలివున్నది. దాన్ని కూడ ఇచ్చేస్తే ఇక మరీ కొంచెమే మిగిలివుంటుంది. ఆఖరు కింక నాలో ఏమి మిగలదు. ఎందుకంటె అంతా ఆమె తీసేసుకొని వుంటుంది. 'Supreme Love which knows everything, can do everything' అని ఆమె అన్నారు. అటువంటప్పుడు ఇంకా 'నేను, నాది' అనుకోటము అపరాధము, మూర్ఖత్వమూను".

"Now in everyday life I have to practise: It is Thou who wilt speak, who wilt walk, who wilt think, who wilt draw... who will do everything."

అనువాదం: ఆర్. లక్ష్మీప్రసాదమ్మ

సమాచార పత్రం

15 ఆగస్టు శ్రీఅరవిందుల 131 జన్మదినోత్సవము.

"To the hill-tops of silence from over the infinite sea,
Golden he came,
Armed with the flame,
Looked on the world that his greatness and passion must free"

(*Collected Poems of Sri Aurobindo*, p. 615)

డెహ్రాడూన్ (ఉత్తరాంచల్) శాఖవారు 'The role of youth in the Resurgence of Indian Ethos in the Modern Times' అనే విషయముపై 2 మే 2003 నాడు ఒక సదస్సును నిర్వహించిరి.

మధుర కేంద్రములో కుమారి లక్ష్మీప్రియ బాలక్రిష్ణన్‌గారు Creative meditation session through art అనే ఒక కార్యక్రమమును 10 మే నాడు నిర్వహించిరి. 18 మే నాడు స్త్రీలకు, పురుషులకు వ్యాయామ తరగతులు నిర్వహించబడినవి.

కరీంపూర్ (పశ్చిమ బెంగాలు) కేంద్రమువారు 30 మార్చి 2003 నాడు నిర్వహించిన ఒక కార్యక్రమములో 200 మంది పాల్గొనిరి. భక్తులు 'మాతృ ప్రణామ్' అనే సాంస్కృతిక కార్యక్రమాన్ని ప్రదర్శించిరి.



శ్రీఅరవిందుల రచనలలో

స్వామి వివేకానంద, శ్రీ రామకృష్ణుల ప్రసక్తి

అఖిల

అఖిల భారత పత్రిక

సెప్టెంబరు 2003

శ్రీఅరవిందుల రచనలలో
స్వామి వివేకానంద, శ్రీ రామకృష్ణుల ప్రసక్తి

4/9/20..

షికాగో విశ్వమత మహాసభలలో 11 సెప్టెంబరు 1893 న
స్వామి వివేకానందుని విజయ శంఖారావము
110 వ వార్షికోత్సవము

జైలులో ఏకాంత ధ్యానంలో నిమగ్నమై ఉన్నప్పుడు 15 రోజుల పాటు నాకు వివేకానందుని వాణి వినిపిస్తూ ఉండేది. ఆయన నా చెంతనే ఉండి ఒక అతిముఖ్యమైన ఆధ్యాత్మికానుభూతిని గూర్చి మాట్లాడారు. ఆ విషయం గురించి చెప్పవలసినదంతా చెప్పి ఆ వాణి ఆగిపోయింది.

రెండు పక్షుల కథ

[ఇది ఉపనిషత్తులలోని హితోపదేశకథ. స్వామి వివేకానందుడు ఈ కథను ఆధ్యాత్మికపరంగా అనేక సందర్భాలలో ప్రస్తావించారు. శ్రీఅరవిందులు ఈ కథను భారతీయుల్లో జాతీయస్ఫూర్తి రగల్చ టానికి మొదట బరిపూరులో (పశ్చిమబెంగాల్) 12-4-1908 న స్వదేశీ సమావేశంలో ఉదహరించారు. తరువాత వందేమాతరం పత్రికలో కూడా ప్రస్తావించటం జరిగింది.]

ఒక పెద్ద చెట్టు వుంది. ఆకులతో, కాయలతో కళకళలాడుతూ కన్నుల పండువుగా ఉండేది. ఆ చెట్ల కాయలు కొన్ని తీయగాను, కొన్ని చేదుగాను ఉండేవి. ఆ చెట్టుమీద రెండుపక్షులు ఉండేవి. ఒకటి ఎగువభాగంలోను, రెండవది దిగువభాగంలోను ఉండేవి.

క్రిందిస్థాయిలో ఉన్న పక్షి నిరంతరం పైస్థాయిలో ఉన్న పక్షిని పరిశీలిస్తూ ఉండేది. దాని అందచందాలు చూచి మురిసి పోతుండేది. ఔన్నత్యానికి అబ్బురపడేది. అదే తన ఉన్నతాత్మ, పవిత్రాత్మ, పరమాత్మ అని భావించేది. తానూ ఆ స్థాయికి ఎద గాలని, అంతటి ఔన్నత్యం పొందాలని ఆశించేది. ఆరాటపడేది.

అయితే ఆ చెట్టుకున్న తీపిపళ్లు తినగానే తీయదనం మైకంలో, మాయలో పడిపోయి మార్గదర్శకుణ్ణి మరిచిపోయేది. తాను – తన లోకంగా వ్యవహరించి, వాస్తవస్థితికి దూరమయ్యేది. మళ్లీ చేదుపళ్లు తినగానే మాధుర్యపు మాయాజాలం దిగిపోయి మామూలు స్థితికి వచ్చేది. తానెవరో, తన పరిస్థితేమిటో తెలుసు కొని పశ్చాత్తాపపడేది. కథ మళ్లీ మొదటికి వచ్చేది. ఉన్నతాత్మ వైపు దృష్టి సారించి, ఉత్తమాశయాలతో ముందుకు సాగేది.

ఈ కథ జీవాత్మ, పరమాత్మలకు కూడా అన్వయించ వచ్చు. క్రిందిస్థాయిపక్షి జీవాత్మ, పైస్థాయిపక్షి పరమాత్మ. వృక్షం ప్రకృతిమాత. తీపిపళ్లు సుఖభోగాలు. చేదుపళ్లు కష్టనష్టాలు. సుఖ భోగాల మాయలో పడిన జీవులు పరమాత్మను కాదని, తాముగా వ్యవహరించి, అంతా తమ ప్రమేయమే – తమ ప్రతాపమేననే అహంకారంతో సుఖశాంతులకు దూరమై, కష్టనష్టాలు కొనితెచ్చు

కొంటూ వుంటారు. కథ అడ్డం తిరిగిన తర్వాత, కళ్లు తెరచి మాయాజాలంలోనుంచి బయటపడి – వివేకంతో వ్యవహరిస్తారు. నిత్యము – సత్యమైన పరమాత్మ స్పృహలోకి వస్తారు.

ఈ కథ మన జాతీయవిముక్తి ఉద్యమానికి కూడా వర్తిస్తుంది. ఎరకు ఆశపడి, వేటగాని వలలో చిక్కిన పక్షుల్లా మన భారతజాతి ఇంగ్లీషువారి మాయామర్మాలకు లొంగిపోయి, లోభపడి అధోగతి పాలయింది. అన్ని విధాలా దిగజారిపోయింది. ఏకులా వచ్చిన ఇంగ్లీషువారు మేకులా బిగిసిపోయారు. వ్యాపారంకోసం వచ్చి వ్యవహారాల్లో తలదూర్చారు. ప్రార్థించే స్థితినుంచి పాలించే స్థితికి ఎదిగారు. ఈ అవకాశాలన్నీ మనమే వారికి పూవుల్లోపెట్టి సమర్పించాము!

వారి కనుసన్నలలో మెదిలాము. వారితో కలిసి చదువుకొన్నాము. వారేమి నేర్పితే అది నేర్చుకొన్నాము. వారి కళ్లతో చూచాము. వారి చెవులతో విన్నాము. వారి మనసుతో ఆలోచించాము. వారేది చెపితే అది చేసే స్థితికి వచ్చాము. వారేదంటే అది మెచ్చే మైకంలో పడిపోయాము. తరాలుగా ప్రపంచానికి వెలుగు చూపుతూ వచ్చిన భారతీయ జీవనవిధానాన్ని కాదని బానిస సంస్కృతికి అలవాటు పడ్డాము. శారీరకంగా, మానసికంగా, నైతికంగా కూడా పతనమయ్యాము. పరిపాలన మనకు చేతకాదని, రాజకీయాలకు పనికిరామని – ఆంగ్లేయులే అన్నిటికి సమర్థులని, వారే మనకు రక్షకులు, మార్గదర్శకులని నమ్మి నానబోసుకొన్నాము. చివరకు పుచ్చి బుర్రలైనాము.

పాశ్చాత్య విద్యావిధానం ఒక ఎత్తుగడ. వ్యాపారసరళి మరొక మాయ. ఇక పరిపాలనా యంత్రాంగం సరేసరి. ఇలా ముడిపై ముడి బిగించి మనకు బంగారు సంకెళ్లు తగిలిస్తుంటే మురిసిపోయాము. సంకెళ్లు బంగారంతో చేయబడ్డాయని, విలువైనవని ఆశపడ్డామేగాని, సంకెళ్లు సంకెళ్లే! అవి మన స్వేచ్ఛను హరిస్తాయనే వాస్తవాన్ని గుర్తించలేకపోయాము. పాశ్చాత్యనాగరికతా వ్యామోహపు మాయలోపడి వ్యక్తిగతలాభాలకు లోభపడి జాతికి, దేశానికి కూడా తీరని ద్రోహం చేసుకున్నాము.

పాశ్చాత్యులు మనకు రక్షకులు కారు – కేవలం భక్షకులని గ్రహించే లోపల జరుగవలసిన అనర్థం జరిగిపోయింది. మనం వారి వంటింటి కుందేళ్లుగా, పెంపుడుజంతువులుగా మారిపోయాము. వారిచ్చే ఉద్యోగాలకు, నెలసరి వేతనాలకు ఆశపడి మనవారు వారిని ఉన్నతాసనాల మీద కూర్చుండబెట్టి అడుగులకు మడుగులొత్తటం ఆరంభించారు.

ఇది స్వయంకృతాపరాధము. పాలించటానికి, బోధించటానికి, పోషించటానికి, చివరకు తిండిగుడ్డ తిరిపెం పెట్టటానికి కూడ వారే దిక్కని దీనంగా, హీనంగా వారివైపు చూస్తున్నాము. పంజరంలో పడ్డ పక్షులమైపోయాం మనం.

ఈ విదేశీ మాయామోహంనుండి బయటపడి, స్వయం సమృద్ధి సాధించటానికి, పూర్వవైభవం పొందటానికి చాలాకాలం పడుతుంది. ఎంతో శ్రమ పడాల్సి ఉంటుంది. ఎన్నో సమస్యలు కూడా ఎదుర్కోవాల్సి వస్తుంది. అయితే కర్జను ప్రభువు గావించిన బెంగాలు విభజన మన భారతసోదరులకు చేదు అనుభవం చవిచూపింది. మనవారు కట్టుకొన్న గాలిమేడలను నేల కూల్చింది. కనువిప్పుకలిగి కర్తవ్యోన్ముఖులయేలా చేసింది. ఇది మన వెన్ను తట్టి కన్నుతెరిపించిన శుభపరిణామం.

నిద్రనుంచి మేల్కొన్నాము. మత్తు వదలి మార్గంలోకి వచ్చాము. మాయనుండి వాస్తవంలోకి వచ్చి నిలిచాము. మళ్లీ మార్గదర్శకుని వైపు దృష్టి సారించాము. ఉన్నతశాఖలపై ఉన్న ఉత్తమవిహంగం ఎవరో కాదు. మనమే, మన ఉన్నతాత్మే – పరమాత్మే అని అర్థం చేసుకొన్నాము. ఆ స్థాయి అందుకొనటానికి మానసికోద్యమం సాగించాము. ఆత్మస్వాతంత్రం సాధించాము. ఆ పైన దేశస్వాతంత్ర్యం, జాతిస్వాతంత్ర్యం సాధించటానికి నిరంతరకృషి సాగిస్తున్నాము. పురోగమిస్తున్నాము.

(*SABCL* Vol. 1, pp. 855-57)

స్వేచ్ఛానువాదం: దయానిధి

1

వివేకానంద స్వామి

వివేకానందుడు అనంత ఆత్మశక్తి సమన్వితుడు. పురుషసింహం. ఇప్పటికీ ఆయన ప్రాబల్యం బ్రహ్మాండంగా పనిచేస్తుండడం మనం గ్రహించవచ్చు. ఎలా? ఎక్కడ? అని మనం చెప్పలేకపోవచ్చు కాని, యేదో సింహంలా పరాక్రమోపేతమైనది, వైభవోపేతమైనది, అంతర్జ్ఞాన స్ఫోరకమైన మహాశక్తి ఏదో భారతాత్మలో ప్రవేశించింది.

అహో! వివేకానందుడు నేటికీ తన జనని భారతమాత ఆత్మలోను, ఆమె బిడ్డల ఆత్మలలోను సజీవంగా మనుగడ సాగిస్తున్నాడు.

(*SABCL* Vol. 17, p. 332)

2

HIS MISSION

ప్రపంచమానవాళిని ఆధ్యాత్మికమార్గం వైపు మళ్ళించుటకై ఉద్భవించిన ఒక మహాపురుషనిగా స్వామి వివేకానందుని గూర్చి శ్రీరామకృష్ణ పరమహంస భావించాడు. అది గురువునుండి శిష్యునికి సంక్రమించిన ప్రేరణే అని మనం భావించవచ్చు.

(*SABCL* Vol. 22, p. 150)

3

ధీరోదాత్తుడు

స్వామి వివేకానందుడు ప్రపంచాన్ని తన రెండు చేతులలోకి తీసికొని దానిని పరివర్తింప చేయగల ధీరోదాత్త మహామనీషి అని ఆయన గురువర్యులు నిర్ధారించారు. భారతదేశం మేల్కొంచినది కేవలం తన కోసమే కాదు, ప్రపంచాన్ని ఉద్ధరించేందుకు కూడ అనేందుకు తార్కాణం వివేకానందుని విదేశయాత్ర.

(*SABCL* Vol. 2, p. 37)

4

శ్రీ రామకృష్ణ పరమహంస

శ్రీరామకృష్ణ పరమహంస జీవితం బ్రహ్మాండమైన ఆధ్యాత్మిక శక్తికి ఆలవాలం. కఠోరతపస్సు ద్వారా ఆయన నేరుగా దైవ సాక్షాత్కారాన్ని పొందాడు. దైవసామ్రాజ్యాన్ని జయించాడు. ఆ తర్వాత ఒక్కొక్క యోగపద్ధతిని అనుసరిస్తూ వాటి సారాంశాన్ని అద్భుతరీతిలో అమితవేగంగా సంతరించుకోగలిగాడు. సర్వ మతసారాన్ని గ్రహించుటకై వారలా కృషి సలిపారు. దైవసాక్షాత్కార ఉపలబ్ధులు, పలురకాల ఆధ్యాత్మిక అనుభూతులు, సహజ స్ఫురిత జ్ఞానలీలలు – ఇవే కదా సకల ఆధ్యాత్మిక సాధనల ఫలితాలు.

శ్రీరామకృష్ణ పరమహంస తపస్సుయొక్క గమ్యం – వేరైపోయిన విభిన్నజాతులు, విభిన్నమతాలు, అన్నీ కూడ, ఒకే సమగ్ర సత్యముయొక్క రూపాలనీ, వీటన్నింటి విభిన్న అభ్యాస ఫలితాలు చివరకు ఏకైక పరమోన్నత ఆధ్యాత్మిక అనుభూతికి చేర్చేవేనన్న పరమసత్యాన్ని సజీవదృష్టాంతం ద్వారా మానవాళికి బోధించుటయే కదా!

(*SABCL* Vol. 20, p. 36)

అనువాదం బి. నరసింహయ్య

Sri Ramakrishna gave to India the final message of Hinduism to the world. A new era dates from his birth, an era in which the peoples of the earth will be lifted for a while into communion with God and spirituality become the dominant note of humam life.

Sri Aurobindo



5

జైలులో వినిపించిన వివేకానంద వాణి

నా యోగాన్ని 1904 లో ఏ గురువూ లేకుండానే ప్రారంభించాను. ఒక మహారాష్ట్ర యోగి నుండి 1908 లో లభించిన ముఖ్యమైన సహాయంతో నా సాధన ప్రారంభమైంది. అప్పటినుండి శ్రీమాత భారతదేశం వచ్చేంతవరకు నేను ఎవ్వరి నుండి ఆధ్యాత్మిక సహాయం పొందలేదు. అంతకు ముందరగాని, ఆ తరువాతగాని నేనెప్పుడు పుస్తకాలమీద ఆధారపడలేదు. అంతరాలనుండి నన్ను చుట్టుముట్టిన స్వానుభవాలనే నమ్ముకున్నాను. జైలులో ఉన్న ప్పుడు గీత, ఉపనిషత్తులు నా వద్ద ఉండినవి. నేను గీతా యోగాన్ని అభ్యసించాను. ఉపనిషత్తుల ఆధారంగా ధ్యానం చేశాను. ఈ గ్రంథాలు మాత్రమే నాకు ఉపకరించినవి. చాలా కాలం తరువాత పాండిచ్చేరిలో నేను వేదాధ్యయనం ప్రారంభించి నప్పుడు ఆ వేదాలు నా యోగానుభూతులను ధృవపరచినవేగాని, నాకెట్టి మార్గదర్శకాలు కాలేదు. కొన్ని సందర్భాలలో ఎట్టి సమస్య వచ్చినా, ఏ ప్రశ్నకు సమాధానం కావాలన్నా నేను గీతను ఆశ్రయించేవాడిని. అందులో నాకు అవసరమైన సహాయం గాని, సమాధానంగాని లభించేది. జైలులో నేను ఏకాంత ధ్యానంలో నిమగ్నమై ఉన్నప్పుడు 15 రోజులపాటు వివేకానందుని వాణి వినిపిస్తూ ఉండేది. ఆయన నా దగ్గరే ఉండి ఒక అతిముఖ్యమైన ఆధ్యాత్మికానుభూతిని గూర్చి మాట్లాడేవారు – అంతే, ఆ విషయం గురించి చెప్పవలసినదంతా చెప్పి ఆ వాణి ఆగిపోయేది.

(*SABCL* Vol. 26, p. 68)

Our ideal is not the spirituality that withdraws from life but the conquest of life by the power of the Spirit.

Sri Aurobindo

6

జీవితపు తొలిదశలో మేధస్సు ప్రభావము

భారతీయ తత్వచింతన గురించి నేను ఏమి చదవలేదు. కాని వేదాంతతత్వం గురించి సామాన్య అవగాహన మాత్రం ఉండేది. మేక్స్ ముల్లర్ రచనలనుండి, ఇతర గ్రంథములనుండి తెలుసుకు న్నది తప్ప, వేదాంతాన్ని గురించి నాకు ఎక్కువ తెలియదు. ఆత్మను గురించిన భావన నాకు నేను ఇంగ్లాండులో ఉన్నప్పుడే కలిగింది. ఆత్మ అనగా ఏమిటో అవగాహన చేసుకోవటానికి ప్రయత్నం చేశాను. నన్ను ఆకట్టుకున్న మొట్టమొదటి భారతీయ రచనలు ఉపనిషత్తులు. అవి నాలో గాఢమైన ఆసక్తిని రేకెత్తించి నవి. తరువాతి కాలంలో వాటిలో కొన్నింటిని తర్జుమా చేయు టకు ప్రయత్నించితిని. భారతదేశంలో గడిపిన జీవిత తొలిదశలో, నా ఆలోచనాపరంపరను బలంగా ప్రభావితం చేసినవి శ్రీరామ కృష్ణుల ప్రవచనాలు, వివేకానందుల రచనలు, ప్రసంగాలు. కాని వీటివలన నాకు భారతీయ ఆధ్యాత్మిక చింతనను గురించిన తొలి పరిచయం కలిగిందే గాని, భారతీయ తత్వచింతనను గురించిన కాదు. అవి నాకు యోగాభ్యాసాన్ని నేర్పలేదు. మనస్సును మాత్రమే ప్రభావితం చేశాయి.

(*Sri Aurobindo Archives and Research, Dec 1983, p. 164*)

The traditions of the past are very great in their own place, in the past, but I do not see why we should merely repeat them and not go farther. In the spiritual development of the consciousness upon earth the great past ought to be followed by a greater future.

Sri Aurobindo

7

రామకృష్ణ పరమహంస ఇచ్చిన మూడు సందేశములు

డిసెంబరు 5, 1912 నాడు వ్రాసినవి

18 అక్టోబరు – శ్రీరామకృష్ణుల నుండి వచ్చిన మూడవ ఆఖరి సందేశం ఇదే. బరోడాలో అందిన తొలిసందేశం: "అరబిందో! మందిర్ కరో, మందిర్ కరో", మరియు ప్రవృత్తి అనే పాము తనను తానే కబళించే వృత్తాంతము. రెండవ సందేశం పాండిచ్చేరి వచ్చిన కొత్తల్లో శంకరచెట్టి యింటిలో వచ్చింది. ఈ సందేశం యొక్క వాక్యాలు మరుగైపోయినవిగాని, వాటి భావము "నిమ్నజీవిలో ఉన్నతవ్యక్తి ఆవిర్భావం జరగాలి." సాధన పరిసమాప్తం అయ్యే సమయానికి మరొక మారు మాట్లాడతానని కూడ చెప్పారు. మూడవ సందేశం యిది (18 Oct 1912):

"Make complete sannyasa of Karma.
Make complete sannyasa of thought.
Make complete sannyasa of feeling.
This is my last utterance."

(*Sri Aurobindo Archives and Research, April 1987, pp. 11-12*)

అనువాదం: ఎ. కైలాసవతి

Ramakrishna (spoke) constantly from a swift and luminous spiritual intuition.

Sri Aurobindo



8

వివేకానందుని విజయ శంఖారావం

భారతీయులలో కొంతమంది ఆధునికులు అన్ని రంగాలలో ఇంకా యూరోపియన్ సంస్కృతిచే ఎందుకు వ్యామోహితులవుతున్నారు? సమస్తమైన ప్రజ్ఞలు సృజనాత్మకత, కార్యశీలతలు యూరపులోనే వున్నాయట. భారతదేశంలో వారికి కనిపించేది తనను తాను రక్షించుకోలేని అసమర్థత, నిస్తబ్ధత, నిర్వీర్యత. కాని ఎక్కడైతే భారతీయ ఆత్మ ప్రతిస్పందించి, శక్తివంతమైన దాడి జరిపి, అద్భుత విజయపరంపరలతో నవసృష్టి సాగించిందో, ఆయా రంగాలలో యూరప్ యొక్క సమ్మోహనశక్తి తక్షణమే అణగారిపో వడం ప్రారంభమైంది. శక్తివంతంగా యూరప్‌నుండి విరుచుకుపడిన మతపరమైన దాడుల ప్రభావానికి ఇప్పుడెవరూ లోనుకావడం లేదు. ఎందుకంటే హిందూమత పునరుద్ధరణకై చేపట్టిన సృజనాత్మక కార్యకలాపాలు భారతీయమతాన్ని సజీవమైన, పరిణామశీలమైన, సుభద్రమైన, విజయవంతమైన, స్వీయరక్షిత మహాశక్తిగా తీర్చిదిద్దాయి. రెండుసంఘటనలతో దీనికి అంకురార్పణ జరిగింది. అవి దివ్యజ్ఞాన ఉద్యమం (Theosophical movement), షికాగోలో స్వామి వివేకానందుని శంఖారావం. భారతదేశపు అసలు ఆధ్యాత్మిక ఆదర్శాలేమిటో ఈ రెండు సంఘటనలు ఆవిష్కరించాయి. భారతదేశం తనకు తాను సమర్థించుకోవడమే కాకుండ, పాశ్చాత్యదేశాల భౌతికవాదంపై మహోగ్రంగా దాడి జరపడం విశేషం.

(*SABCL* Vol. 14, p. 8)

9

ప్రాచీన విలువల పరిరక్షణ, పునర్నిర్మాణం

ఈ ఉద్యమాల వెల్లువతో బాటు వీటికి వ్యతిరేకంగా భారతీయ మైనది ప్రతిదానినీ న్యాయమే అని సమర్థించే మరో ఉద్యమం మహాశక్తివంతంగా మహోధృతంగా ప్రవహించ నారంభించింది. దీని తరంగాలు మన జీవితాలలో ఇప్పటికీ ప్రతిఫలిస్తున్నాయి. ఆ ప్రభావం ఇంకా కొనసాగుతున్నది. ఈ పని ఇంకా పూర్తి కాలేదు. నిజానికి ఈ ప్రతిక్రియ మరింత సూక్ష్మ అవగాహనకు, సమన్వయానికి నాంది మాత్రమే. ఈ విధంగా ప్రాచీన విలువలు న్యాయసమ్మతమేనని భావించడం, పాత మనస్తత్వాన్ని సంతృప్తి పరచటంతో బాటు సరికొత్త, సంప్రదాయబద్ధమైన విమర్శనాత్మక వైఖరిని కూడా సంతృప్తిపరచగలదు. దీనివల్ల ప్రతిఫలం లేకపోయినా, తెలిసో తెలియకో ప్రాచీనవిలువల పునః ప్రవచనం వేగవంతమవుతుంది. దీనితో ప్రాచీన సంస్కృతీ ప్రాభవం తెలుసుకోవడానికి ప్రయత్నాలు జరిగాయి. సంస్కృతి రూపాలను గౌరవిస్తూ, పునర్వికాసానికి వీలుగా వాటిని సంరక్షిస్తూ, కాల దోషం పట్టిన రూపాలను తిరస్కరించడానికి, తిరిగి వాటిని రూపుదిద్దడానికి వెనుకాడలేదు. పాత ఆధ్యాత్మికసంపద జీర్ణం చేసుకోగల కొంగ్రొత్త భావాలను తీసుకొని తన పరిధిని విస్తృతం చేసుకోవడం జరిగింది.

పాతకొత్తల మేలు కలయికను మరింత స్వేచ్ఛగా సాధించడంలో, పునర్నిర్మాణం ద్వారా పరిరక్షణను సాధించడంలో స్వామి వివేకానందుడు ఆదర్శంగా నిలిచాడు. దానినే ఆయన ప్రపంచానికి అత్యంత శక్తివంతంగా చాటి చెప్పాడు.

(*SABCL* Vol. 14, p. 415)

10 (a)

భారతీయమతంలో అనంత వైవిధ్యం

భారతీయ తత్వశాస్త్రం, మతంలోని అంతులేని వైవిధ్యం యూరోపియన్ మనస్సుకు అంతుపొంతులేని, దిగ్భ్రాంతికరమైన విసుగు జనించే, నిరర్థకమైన వైవిధ్యంగా కనిపిస్తుంది. సుసంపన్నమైన ఆకుపచ్చని చెట్లు చేమలతో నిండిన వనాన్ని అది చూడలేదు. వివిధ రూపాలతో భాసించే ఆధ్యాత్మిక జీవన ప్రాభవం దానికి తెలియదు. అనంత వైవిధ్యం, వివేకానందుడు అన్నట్లు ఒక ఉత్కృష్టమైన మత సంస్కృతికి చిహ్నం. పరాత్పరుడు (Supreme) అనంతుడని భారతీయులకు తెలుసు. ప్రకృతిలోని ఆత్మకు ఆ అనంతం నిరంతరం శతకోటి రూపాలలో సాక్షాత్కరిస్తుందని వేదయుగం ప్రారంభంనుండి భారతీయ ద్రష్టలందరికీ తెలుసు.

మానవాళికంతా ఒకే మతం ఉండాలన్న విపరీత భావమొకటి పాశ్చాత్యమేధావులకు కల్గింది. కాని ఒకే విధమైన ఆచారాలు, మూఢనమ్మకాలు, తంత్రాలు, మతభావాలు, పూజలు పునస్కారాలు, నియమాలు, నిషేధాలు, ఒకే మతశాసనంతో విశ్వజనీనమతం సంకుచితమై తీరుతుంది. ఇటువంటి సంకుచితమైన, అసంబద్ధమైన మతం నిజమైన మతం ఎలా అవుతుంది? మత గురువులు చిత్రహింసలు పెడతారన్న భయంతోనో, లేక పైలోకాలలో భగవంతుడు తమని త్రోసిపుచ్చి, భయంకరమైన శిక్షలు విధిస్తాడన్న భయంతో వణికిపోతూనో దానిని అంతా ఆమోదించితీరాలని భావించడం హాస్యాస్పదం.

(*SABCL* Vol. 14, p. 129)

అనువాదం: కె. యజ్ఞన్న

10 (b)

సనాతనమతము – అనంత వైవిధ్యము

ఈ మతంలో అనంతవైవిధ్యముంది. ఇది పాశ్చాత్యులకు కొరుకుపడనిది. మ్రింగుడుపడనిది. కనుక వారి దృష్టిలో ఇదొక అద్భుతాంశం. అడవిదారిలాగా అంతుచిక్కనిది, అర్థరహితమైనది. మహారణ్యంలో ఎంతో వైవిధ్యం మహాశ్చర్యకరంగా తోస్తుంది ఏమాత్రం మనసు పెట్టినా. ఎంతో ఎత్తైన చెట్లు – రకరకాల వృక్షాలు అలాగే మన మతంలోనూ వివిధరూపాలున్నా అన్నిటినీ కలిపే సూత్రాత్మ వున్నది. ఇది పరిపక్వదశకు చేరిన మతమహాలక్షణంగా స్వామి వివేకానంద అభివర్ణించారు. భారతీయదర్శనంలో పరమాత్మ అనంతమన్న అంశం వేదకాలఋషులనుండి గ్రహించినదే. *ప్రకృతి ఎప్పుడూ వైవిధ్యంతో శోభిస్తుంది. అది దాని స్వభావం. కానీ అంతరాత్మ ఏకమే. ఈ అనేకత్వం దాని అభివ్యక్తి. అంతేకాని లోకంలో మనుజులందరకూ ఒకే నామం – రూపం – మతము వుండవు.* ఉండాలనుకోవటం నియంతృత్వ ధోరణి – పాశ్చాత్యుల విపరీత బుద్ధి. అదెంత అస్వాభావికమో అంత అతర్కితోప సంపన్నం. అది తర్క సహం కాని క్రూర భావన. తాను మునిగిందే గంగ కాదు. అందరకూ ఒకే అభిప్రాయం – ఒకే పద్ధతి – ఒకే భావం ఉండాలనుకోవటంలోనే సంకుచిత దృష్టి వుంది. కనుక ఒకే మతం – విశ్వాసం – క్రతువిధానం, ఒకే విధి నిషేధాలక్రమం – ఒకే మతానుశాసనం అసహజవిషయాలు. ఇక్కడ మానవులంతా ఆధ్యాత్మిక హింసను, అక్కడ పరలోకంలో శాశ్వత శిక్షను అంతా అంగీకరించాలనీ, అందరికిదే మార్గమని అనటంకంటె మూర్ఖత్వమేముంటుంది? ఇంతకంటె సంకుచితమైన, అపహాస్యమైన విషయం సృష్టిలో ఉండదు.

(*SABCL* Vol. 14, p. 129)

అనువాదం: తుమ్మపూడి కోటీశ్వరరావు

11

ఒక్కొక్కరిది ఒక్కొక్క మతము

మన యోగలక్ష్యము దైవసాక్షాత్కారమును పొందుటతో సరికాదు. ఆ దైవమును మన జీవితములో కూడ ఆవిష్కరింప జేసుకోవలెను. ఒక్కొక్క మనిషిలోను ఆ ఆవిష్కరణము యథేచ్ఛగా జరుగవలెను. మూసలో పోసినట్లుగాక ఒక్కొక్క మనిషి ప్రజ్ఞాపాటవమును, స్వభావమునుబట్టి ఒక్కొక్క ప్రత్యేకరీతిలో ఆవిష్కారము కావలెను. విశ్వగత, విశ్వాతీతశక్తుల అభివ్యక్తిలోని అనంతవైవిధ్యమే మానవుని ఆధ్యాత్మిక జీవనానికి పరాకాష్ఠ. మతముల ఐక్యత అంటే ఏమిటి? వివేకానందుడు చెప్పినట్లు సకల మతములు అనంతవైవిధ్య వైభవములతో భాసిల్లినప్పుడే అది సాధ్యమౌతుంది. ఇంకా చెప్పాలంటే ప్రతి మనిషికి తనదైన స్వంత మతము – అనగా ఛాందసమైన ఆచారవ్యవహారాలకి కట్టుబడకుండా తన ప్రకృతిని యథేచ్ఛగా మలచి దైవముతోడి తన సంబంధమును సుసంపన్నము చేసికొనుట.

(*SABCL* Vol. 20, p. 51)

అనువాదం: డా॥ ఆర్. ఎల్. ఎన్. శాస్త్రి

12

భారతదేశ సందేశ కిరణపుంజం

వేలమంది సాధుపురుషులు – మహాత్ములు తమ మౌనజీవిత సాధనల ద్వారా మనకు చేసిన బోధ ఏమిటి? భగవాన్ శ్రీరామకృష్ణుల అనంతసాధనల నుండి ఉన్మీలతములైన సందేశ ప్రభాప్రసరణ లేమిటి? సింహసదృశమైన గుండెతో ప్రపంచాన్ని తన వాగ్గంగా ప్రవాహధాటితో ముంచెత్తిన వివేకానందుడు బోధించినదేమిటి? ఆ సన్యాసచక్రవర్తి ప్రసరించిన బోధాకాంతులేమిటి? దాని సారాంశమిది: సింహాసనాసీనుడైన మహారాజునుండి – కూలీనాలీ చేసుకొని బ్రతికే సాధారణ వ్యక్తిదాకా, తన జపతపా

దుల్లో మునిగిపోయిన బ్రాహ్మణుని నుండి – పొలంలో దున్ను కొని జీవించే అమాయక వ్యవసాయదారుని దాకా – అందరి లోను నిమ్నోన్నతములు లేక ఒకే పరమాత్మ తత్త్వం స్పందిస్తున్నది. అందరూ తదాత్మ స్వరూపులే. అంతా సృష్టికర్తలే. ఎందుకంటే మహాచైతన్యశక్తి మనలోనే వున్నది. జీవితమంతా సృష్టే. *సృష్టి – స్థితి – లయలన్నీ సృష్టే. మనంత మనం తోలు బొమ్మలై మాయా కర్మజాలంలో చిక్కుకొనకపోతే మహాచైతన్య స్వరూపులమే. అది చెక్కిన విగ్రహాలమే. సజీవ మూర్తులమే.* (*SABCL* Vol. 1, p. 66)

13

భారతదేశం పునర్జాగృతం కావటం భవిష్య ప్రపంచ వాంఛితం

భారతదేశం నశించదు. మనజాతి రూపుమాసిపోదు. ఎందుకంటె సర్వప్రపంచంలోనూ భారతదేశమే – ఈ సనాతన ఖండమే – దివ్యధ్యేయమై ఊర్పుగా బ్రతుకుతున్నది. భవిష్య మానవజాతి కిదే గుండెకాయ. భారతదేశమే ప్రపంచానికి కావలసిన మత ప్రభాతగీతాన్ని విన్పించేది. అదే సనాతన మతం – సర్వమతాలకు సమన్వయసూత్రం. శాస్త్రాలకు, వేదాంతాలకు అదే ఏకైకాత్మద్రవ్యం. *మ్లేచ్ఛభావక్షాళనం చేసి మానవజాతిని ఆర్యజాతిగా శిల్పించగల మహాశిల్పి భారతదేశమే.* దీని కోసం మొదట తాను పునః ఆర్యత్వంలో జాగృతం కావాలి.

ఇదిగో ఈ మహాకార్యం కోసమే భగవాన్ రామకృష్ణులు అవతరించింది – స్వామి వివేకానంద ప్రపంచం చుట్టివచ్చిందీ. ఈ సుప్రభాతగీతాన్ని మనం వినలేదంటే – మేల్కోలేదంటే మన కింకా చీకటితెరలు విచ్చిపోలేదన్న మాట. అజ్ఞాన తమస్సు చెదరిపోలేదన్న మాట. భయాందోళనలు, సంశయాలు, ఉపేక్ష, బద్ధకం అన్న చీకటి దుప్పటి ముసుగుతీయ లేదన్న మాట. మనలో కొందరు భక్తిమార్గంలోను, మరికొందరు జ్ఞానమార్గం

లోను ప్రయాణిస్తున్నా మనలోని శక్తిహైన్యంవలన మన భక్తి చైతన్యవంతం కావటం లేదు.
(*SABCL* Vol. 1, pp. 66-67)

అనువాదం: తుమ్మపూడి కోటీశ్వరరావు

14

ప్రపంచంలో భారతదేశ ఆధ్యాత్మిక ప్రభావం

ప్రపంచంలో తొలిమహాశక్తిగా భారతదేశం అగ్రపీఠం ఎందుకు అలంకరించకూడదు? ప్రపంచమంతటా ఆధ్యాత్మిక ప్రభావాన్ని ప్రసరించడంలో వివాదాస్పదంకాని హక్కు మరే దేశానికి ఉన్నది? ఇదే స్వామి వివేకానందుని ప్రచారప్రణాలిక. దేశాలను జయించే ఆధ్యాత్మిక సంపద భారతదేశం సొత్తు. ఈ ప్రాభవం తనకు ఉన్నదన్న ఎరుక కల్గిస్తూ మరొకసారి భారతదేశాన్ని చైతన్యప్రదీప్తం చేయాలి. ఈ ఆధ్యాత్మికత సమస్త దేశభక్తికి మూలం. ఆత్మన్యూనతను ఇదొక్కటే పోగొట్టగలదు. తను పోగొట్టుకున్న స్థానాన్ని తిరిగి పొందడానికి ఇదొక్కటే మార్గం.
(*SABCL* Vol. 1, pp. 427-48)

15


రామకృష్ణుని జీవితం – హిందూమత సందేశం

భగద్భావన తరిగిపోయింది. సందేహాలు పెరిగిపోయాయి. ఇటువంటి తరుణంలో ఆధ్యాత్మికత ఎంతో అవసరం. ఆత్మయొక్క అభివ్యక్తరూపమే ఈ ప్రపంచం అనీ, ఇంద్రియాలు చేసే గందరగోళం వెనుక అసలు రహస్యం ఇదే అని, మనిషి అంతరాంతరాలలో దివ్యవికాసానికి అవకాశాలు ఉన్నాయనీ, భగవంతుని ఆనందం మనిషి పొందవచ్చుననీ, ఇదే ప్రపంచంలోని అసలు సత్యం అనీ ఆధ్యాత్మికత చాటిచెప్పే సమయం వచ్చింది. అందు

లకే రామకృష్ణుడు అవతరించాడు. బుద్ధుడు అవతరించిన తరువాత రెండువేల సంవత్సరాలు పాడుపడిన ఆధ్యాత్మిక పురోగమనమంతా రామకృష్ణుని దివ్యప్రబోధానికి నాంది.

భారతదేశపు దీర్ఘనిశ అంతము కానున్నది. తూర్పులో ఒక మహాత్కాంతి ఉదయిస్తున్నది. ఆ కాంతి వెదజల్లిన తొలి వైతాళిక విద్యుల్లతలు లోగడే దిఙ్మండలంపై కానవచ్చినవి. ఒక కొత్తరోజు వస్తోంది. అది ఎంత ఉజ్వలమైనదంటే పైనుంచి దిగివచ్చిన అంతిమ అవతారం కూడ ఆ కాంతికి అర్థం వివరించలేకపోయింది. అయితే ఆ అవతారం లేకుండా ఆ రోజు రాదు. భారతీయ ఆధ్యాత్మికత పరిపూర్ణంగా వ్యక్తమవుతున్నది. ప్రాగ్దేశాల పునర్వికాసానికి అదే అసలు నాంది.

వివిధ రకాల ఆలోచనలు, నైతికసూత్రాలు, భౌతిక వికాసంపై విచిత్రస్వప్నాలు, ఆశలు, అసంభవమైన ధార్మిక, ఆనందమయ జీవితాలను గురించి మానవాళి ఎప్పటినుండో ప్రయోగాలు చేస్తూ వచ్చింది. కాని జీవితంలో చిట్టచివరి రహస్యాన్ని ఆవిష్కరించడంలో విఫలమైంది. ఎక్కడా తృప్తిలేదు. దారిద్ర్యం, ఆవేదనలు, అసంతృప్తి, సంఘర్షణలనుండి బయటపడేందుకు రాజకీయ, సామాజిక విధానాలు ఏవీ సహాయపడ లేకపోయాయి. ఐహికమైన విధానాలన్నీ విఫలమవుతున్నాయి. ప్రాగ్దేశాలలోనే సత్యం, జ్ఞానం వున్నాయి. ప్రాగ్దేశాలే పశ్చిమదేశాలకు దివ్యప్రబోధం అందివ్వగలవు. ప్రాగ్జ్యోతి మాత్రమే ప్రపంచాన్ని రక్షించగలదు. యుగయుగాలుగా ఆసియాఖండం తనలో నిక్షిప్తమైన కాంతి కోసం అన్వేషిస్తోంది. తాను దర్శించిన ఆ కాంతిపుంజాలే భౌద్ధ మతంగా, క్రైస్తవమతంగా, మహమ్మదీయ మతంగా పరిఢవిల్లాయి. భారతదేశమే అద్భుతమైన ఆధ్యాత్మిక ప్రయోగకేంద్రం. ఆత్మపరిశోధనాగారం. ప్రతి యుగంలోను వేలాది మహనీయులు అవతరించారు. ఆత్మలో శాంతిసౌమనస్యం దర్శించారు. దివ్యజ్ఞానాన్ని అందించారు. మతమార్పిడులకోసం, పేరుకోసం వారు తాపత్రయపడలేదు. కొద్దిమంది శిష్యులకు తమ ప్రయోగఫలితాలు అందించి వెళ్లారు. వారు తమ అనుభవాల అద్భుతధారలు వెద



జల్లి, వచ్చిన చోటుకే తిరిగి వెళ్లిపోయారు. అవతారాల జననం మూలంగా అనంతమైన ఆధ్యాత్మికశక్తి లభించింది. వారు తమకు లభించిన ఆనందాన్ని, ప్రపంచ మానవాళిపై ప్రవహింపచేశారు. మతాలను మార్పిడి చేయడం వారి ఉద్దేశ్యం కానే కాదు. భగవత్ సాక్షాత్కారం ఆనందపారవశ్యాన్ని నలుగురికి అందివ్వాలని వారు తపన చెందారు. అటువంటి వారిలో శ్రీరామకృష్ణుడు చివరివాడు. అందరిలోనూ మహనీయుడు. చాలామంది భగవంతుని పరిమిత మైన ఒకే రూపంగా దర్శిస్తే ఆయన అనంతమైన ఏకత్వంగా దర్శించాడు. *ఆయనలో గతకాలపు వేలాది మహాద్రష్టల ఆధ్యాత్మిక అనుభవాలు కలసిపోయి ఒకే ప్రవాహంగా ప్రవహించాయి.* హిందూమతంలోని చిట్టచివరి సందేశాన్ని ఆయన ప్రపంచానికి అందించాడు. ఆయనతో ఒక కొత్తయుగం ప్రారంభమైనది. భూలోకవాసులు భగవంతునితో తాదాత్మ్యం చెందడానికి ఒక్కసారి ఉద్ధరించబడ్డారు. క్రైస్తవమతం ఏది సాధించలేక విఫలమైందో, అపరిపక్వమైన కాలగతిలో మహమ్మదీయమతం ఏది సాధించ డానికి యత్నించిందో, కొద్దికాలంపాటు బౌద్ధమతం పాక్షికంగా యత్నించిందో రామకృష్ణుని జీవితం ద్వారా హిందూమతం ప్రపంచంకోసం ప్రయత్నించవలసి వుంది. భారతదేశపు పునర్వికాసానికి ఇదే కారణం. భగవంతుడు తిరిగి *ఈ వేదభూమికి ఊపిరి పోశాడు. ఎందరో మహితాత్ములు భారతదేశ విముక్తికి పోరాడడం అందుకే.* భరతపుత్రులలో హఠాత్తు మార్పు రావడం అందుకే. రాజకీయంగా ప్రారంభమైన ఈ ఉద్యమం ఆధ్యాత్మిక ప్రాభవంతో ముగుస్తుంది.

(*SABCL* Vol. 1, pp. 799-801)

But why should not India then be the first power in the world? Who else has the undisputed right to extend spiritual sway over the world? This was Swami Vivekananda's plan of campaign.

Sri Aurobindo

16

మానవునిలో దివ్యప్రభంజనము

హేతువు మనకు మార్గదర్శి కాదంటే కొందరు ఒప్పుకోరు. ముఖ్యంగా మేధావులు దిగ్భ్రాంతి చెందుతారు. హేతువు కాదని, ఏదో కనిపించని అదృశ్య దైవశక్తి ప్రభావానికి లోబడడం అటు వంటి వారికి ఆశ్చర్యం కల్గిస్తుంది. ఈ సందేహాలు వెలిబుచ్చే వారంతా భౌతికవాదప్రభావ వలయంలో చిక్కుకున్న మహాను భావులే. మనిషిని భౌతికరూపంగానే పరిగణించి, అతడు భగ వంతుడునుండి రాలేదని, అతనికి ఒక దివ్యభవితవ్యం లేదని వారు వాదిస్తుంటారు. మనిషిలో దాగివున్న భగవంతుడే అసలు దర్శనం, మతముయొక్క అసలు అర్థం. శంకరుడు, రామాను జుడు, మధ్వాచార్యులు, శ్రీరామకృష్ణుల దివ్యప్రబోధాలను భారత దేశం జ్ఞప్తికి తెచ్చుకుంటే ఆమె ప్రబుద్ధమవుతుంది. *ఆమె జీవితం అంతా వేదాంతమే.*

తాము *మేధావులం మాత్రమే అని ఎవరైనా భావిస్తే వారు హిందువులు కారు. మేధావులంటే భగవంతుని చూడని వారు.* భగవంతుడు తన గొప్పతనాన్ని, మహిమను చాటాలని భారతదేశాన్ని ఆదేశించాడు. వేలాది సంవత్సరాలుగా భగవం తుని గూర్చి భారతదేశం పలికిన మంత్రవాక్కులు నలుదెసలా మారుమ్రోగాయి. యూరోపియన్ విద్య మనకు అందినప్పుడు మనం సైన్సువల్ల అపమార్గం పట్టాము. ఒక చిన్నగదిలోని వెలుగు లాంటిది సైన్సు. ప్రపంచాన్ని వెలుగులతో నింపే సూర్యుడు కాదు. అపరవిద్య అన్నది సైన్సు కాదు. దానికి మించిన విద్య ఉంది. లోకం నిమ్నస్థాయి జ్ఞానంతో, మన మేధస్సే చాలా గొప్పదని, సర్వశక్తిమంతమని భావిస్తుంది. కాని అది వట్టి భ్రమ, మాయ మాత్రమే. దేవుని మహిమను తెలుసుకున్న వ్యక్తి *మేధస్సు గొప్పదని ఎప్పటికీ విశ్వసించడు. ఉన్నతమైన మంత్ర ధ్వని ఒకటుంది. భగవంతుడు గుండెలోనే నివసిస్తుంటాడు. మెదడు ద్వారా పనిచేస్తాడు. మెదడు అతని ఉపకరణాలలో ఒకటి.*

మెదడు ఏది ఆలోచించినా అది ముందు హృదయానికి తెలుస్తుంది, మెదడును దాటి హృదయంలోకి ప్రవేశించ గలిగినవాడు పరమాత్మ వాణి వినగలడు.
(*SABCL* Vol. 1, pp. 714-15)

అనువాదం: కె. యజ్ఞన్న

17

అంతర్జ్యోతి – భవిష్యద్దీప్తి

"నా ఇచ్ఛనే నెరవేర్చుము. నిన్ను నీవు తెలుసుకొనుము. మాలిన్యములను వదిలించుకొని పునీతుడవు కమ్ము. నీ ఇచ్ఛ వచ్చిన రీతిలో ప్రవర్తించరాదు. కోరికల వెనకాల పరిగెత్త వద్దు. Abandon that you may possess" అని దివ్యాచార్యుడు క్రిందటి ఒకటిన్నర సంవత్సరాలుగా జరుగుతున్న సంఘటనల ద్వారా మనని హెచ్చరిస్తూనే వున్నాడు. అది వినిపించుకునే వాళ్లకైతే వినపడుతుంది. నీకు జ్ఞానమెలా కలుగుతుంది. సాధనామార్గమును గురించి తెలుసుకున్నంత మాత్రాన కలగదు కదా. ఆత్మ సంసర్గమువలన, లోపలనుంచి వచ్చిన వెలుగువలన కలుగుతుంది. అపరజ్ఞానంతో ఏది చేసినా ఫలితము సున్న. జ్ఞానము నిన్ను పూర్తిగా ఆవహించి నరనరాలకి పట్టినప్పుడే ఫలితము దక్కుతుంది.

దక్షిణేశ్వరంలో ప్రారంభించిన ప్రణాళికింకా పూర్తి కాలేదు – అసలు దాని నెవ్వరైనా అర్థం చేసుకుంటే కదా. వివేకానందుని ఉద్యమము ఇంకా కార్యరూపమే దాల్చలేదు!
(SABCL Vol. 2, p. 412)

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

18

సమయమాసన్నమైనది

రాజకీయ, ఆర్థిక విషయాలపై దృష్టిని కేంద్రీకరిస్తున్న భారత జాతికి తన దృష్టిని విశాలపరచుకోవలసిన సమయమాసన్నమైనది – ముఖ్యంగా నేటి బెంగాలు విషయంలో ఇది తప్పనిసరి.

బెంగాలీలు ఎప్పుడూ భారతీయుల్ని ఒక వున్నతాదర్శం వైపు నడిపిస్తూ వుంటారు. కొత్తతరం ఔన్నత్యం సాధించడానికి అత్యవసరమయిన సాధనసంపత్తి వారి వద్ద వుంది. మానవజాతి ఒక గొప్ప ముందడుగు వేసి కదలవలసి వచ్చినప్పుడు, బలంగా హృదయాన్ని కదిలించే ఆలోచనలతో, గొప్ప స్ఫూర్తినిచ్చే వూహాలు, వుద్రేకాలు వారి సొత్తు. హృదయంతో ఆలోచించే అమూల్యవరం పొందిన వారు. అంతేకాదు భావనలోని సున్నితమైన విషయాలను, వివిధ కోణాలలో, రూపాలలో వుండే అర్థ ఛాయల్ని, వాటి పరిధులలోనే పట్టుకోగలిగిన సూక్ష్మబుద్ధి కలిగిన వారు. వీటన్నిటికీ పైగా, యితర జాతులు యీ ప్రత్యక్ష జ్ఞానసామర్థ్యం అభివృద్ధి చేసుకోక పూర్వమే అందులో గొప్ప స్థాయిని సాధించినవారు. హేతువాదానికి, కాల్పనికతకి అతీతంగా మానవత్వంలో వుండే గోప్యత యిప్పుడు బహిర్గతం కావలసి వున్నది. ఆ నైపుణ్యం, జాతియొక్క అత్యున్నత స్వభావం, శ్రీరామకృష్ణునిలో ప్రస్ఫుటమయాయి. అతడు తలచుకున్నట్టయితే ఏ జ్ఞానాన్నయినా అతిసులభంగా ఆధ్యాత్మికంగా శాసించగలడు. ఏదైనా సరిదిద్దగల విద్య అతని వద్దే వుంది. వ్యక్తి యొక్క, జాతియొక్క పాతసంపర్కాలు, సంస్కారాలతో నిండిన జ్ఞాపకాలు, పరిమితమైన హేతువాదం, అర్థంకాని, అయోమయమైన వూహాల అనవసర జోక్యంతో ప్రస్తుతం సాధారణ జనం యొక్క జ్ఞానం పెడదారిన పయనిస్తున్నది. ప్రాచీన భారతీయ ఋషులు యోగశాస్త్ర జ్ఞానంతో రూపొందించిన క్రమశిక్షణలో నిష్ణాతుడైనవాడే జాతికి సరియైన ప్రాతినిధ్యం వహించగలడు.

కాని కొన్ని జాతులు యీ వికాసం యిప్పటికే సాధించాయి. కొన్ని సాధించడానికి సంసిద్ధంగా వున్నాయి. ఆ జాతులే శక్త్యారాధన ద్వారా భవిష్యద్వికాసాన్ని, దానితోపాటు బలమైన సంకల్పసిద్ధిని, శక్తిని పొందగలవు. ఇతర సమస్త మానవాళిని జ్ఞానపథంలో నడిపించగలవు.

(*SABCL* Vol. 3, p. 327)

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

20[1]

వివేకానందుని యతి పథము

లండన్ మహానగరంలో కాంగ్రెస్సు తలపెట్టిన మహాసభలపై మా అభిప్రాయం వ్యక్తం చేశాము. కాంగ్రెస్సు ముఖతః వెలువడిన ఈ స్పందనకు మాకు రెండు కారణాలు గోచరిస్తున్నాయి. వీరి లక్ష్యం ఇంగ్లాడ్‌లో మనకు ప్రతికూల వాతావరణం నివారించటమొకటి కాగా, యావత్ప్రపంచ మేధావుల సానుభూతి పొందటం రెండవది. ఆ సదస్సులోని ప్రముఖుల ఉపన్యాసాలుగాని, ఇతర నాయకుల వాక్చాతుర్యంగాని ఆ దేశస్థులను ఆకర్షింపవు. బ్రిటన్ దేశస్థుల ప్రయోజనాలకు దోహదపడని ప్రతిపాదనలను వారెన్నటికీ ఆమోదింపబోరు. మన లక్ష్యసాధనకు దీర్ఘకాల ఉద్యమమొక్కటే శరణ్యం. *ప్రతి నిత్యము, ఏడాది పొడవునా, ఈ ఉద్యమం విరామం లేకుండా సాగిపోవాలి. లక్ష్యసాధనకు కొన్ని సంవత్సరాలే పట్టవచ్చును.* ఉద్యమంవల్ల ఆశించిన ఫలితాలు లభించకపోయినా, ఆశ్చర్యపడనక్కర లేదు. ఏతావాతా, ఫలితాలు లభించినా మనకు అక్కరకు రాకపోవచ్చును.

ఈ వ్యవహారమంతా భారతప్రభుత్వానికీ, దేశప్రజలకు సంబంధించిన రాజ్యాంగాంశంగా పరిగణించాలి. అంతేగాని విదేశ ప్రజానీకానీకానికి గాని, వారి సానుభూతికిగాని తావు లేదు. ఈ

---

[1] 19 వ నెంబరు వ్యాసము '.రెండు పక్షుల కథ' పత్రిక మొదటి వ్యాసంగా ఇవ్వబడింది.

పెద్దల ఆమోదం మన లక్ష్యసాధనకు ఏమాత్రం సహాకరింపదు. వారి సానుభూతి కేవలం నోటిమాట మాత్రమే కాగలదు. ఏ కారణంగానైనా, మనకు అనుకూలంగా స్పందించినా, దాని ప్రభావం లేశ లేశ మాత్రమే.

ఈ తరుణంలో స్వామి వివేకానందుల ఆమెరికా యాత్రను స్మరించుకోవటం అవసరం. వారి యాత్రానంతరం, వారి శిష్యుల అపూర్వ కృషివల్ల మన దేశానికి జరిగిన మేలు అమోఘం. ఈ శతాధిక కాంగ్రెస్సు సదస్సులవలన కలిగిన ప్రయోజనాల కతీతం. ఆ స్ఫూర్తితో మనము యావత్ప్రపంచానికీ, మన జాతి గతవైభవం, ప్రాచీననాగరికత వైశిష్ట్యం, ఎలుగెత్తి చాటాలి. వీటి వారసత్వం జాతిరక్తంలో కరడుగట్టి యున్నదని, ప్రపంచానికి మేలుచేయగల శక్తి యుక్తి సంపన్నులమని ఘోషిస్తూ, స్వతంత్ర ప్రతిపత్తిపై అర్హులమని గర్జించాలి.

ఈ పురుషాకారమే మన లక్ష్యసాధనకు సుగమమైన మార్గము. భిక్షాన్నప్రవృత్తి ఎన్నటికీ కాజాలదు.
(SABCL Vol. 2, pp. 170-71)

అనువాదం: శ్రీ శరణ్

21

పాతక్రొత్తల సమన్వయము – ఒక పరిశీలన

వేదాంతమనే పదానికి, జనశ్రుతిలో అద్వైత సిద్ధాంతమని, అది శంకరప్రతిపాదిత మాయావాదమని పరిగణించటం పరిపాటి. ఉపనిషద్వివరణలో, ఆ పాఠమే ప్రమాణంగాని, భాష్యాలెన్నటికీ కానేరవు. శంకరభాష్యం బహుదొడ్డదే. అయితే శంకరభాష్యము ఏకపక్షమన్న వాదనను త్రోసిపుచ్చలేము. తరువాత కాలంలో ఉపనిషత్తులపై అసంఖ్యాకంగా వచ్చిన భాష్యాలు, వాటి పై వచ్చిన వివృతులు మొ॥ జిజ్ఞాసువులను అత్యంత ప్రభావితం చేసినవి. ముమ్ముందు కూడ బహుముఖవ్యాఖ్యలు అనేకం ఆశించవచ్చును.

ఈ బహోవ్న్ముఖత్వమును సాధకుని నిత్యజీవితంతో సమన్వయపరచటమే శ్రీరామకృష్ణ, వివేకానందుల బోధల లక్ష్యమని తెలుస్తున్నది.

నడుస్తున్న చరిత్రను, ఒకమారు సమీక్షించుకొంటే, గత చరిత్రంతా పునరావృతమవుతున్నదని గ్రహించవచ్చును. గతంలో కూడ ఈనాటి వలెనే ఒక మహాపురుషుడు – అవతారపురుషుడో, విభూతియో, మానవస్వరూపంలో అవతరించిన, ఒకానొక అపురూపమైన దివ్యస్వరూపమో పృథ్విపై కాలిడి, జనజీవనం మధ్య తిరుగాడి, తన దివ్యశక్తితో వారిని అత్యంత ప్రభావితం చేయగల్గింది. ఆ మహనీయుడు గౌతమబుద్ధుడు. ఆ మహామనీషి తన సిద్ధాంతాన్ని, సదాచార సంపత్తిని ఆనాటి ఆర్యజాతులకు ప్రబోధించాడు. అయితే ఒక విచిత్రమేమంటే, బౌద్ధమతము, వేదాంత తత్త్వాన్ని అంగీకరించినప్పటికీ, ఒకానొక మౌలికసత్యాన్ని జీర్ణించుకోలేక, పుట్టినిల్లైన భారతదేశం నుంచి బహిష్కృతమైనది. కాని నేడు షోడశకళలతో మూర్తీభవించిన ఒకానొక దివ్యస్వరూపము మన మధ్య దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నది. అందువల్ల, గతచరిత్రలో ఆనాటి పరిణామములు భారతదేశాన్ని గురుస్థానంలో నిలిపి, యావత్ప్రపంచానికీ మార్గదర్శకమై, ఈనాటికిన్నీ జీవకళతో ఉట్టిపడుతున్న భావసారూప్యత, రూపకల్పనలకు కర్తృత్వం వహింపచేసిన తీరంతా ఈనాడు పునరావృతం కాగలదు.

(*SABCL* Vol.2, p. 344)

అనువాదం: శ్రీ శరణ్

...a mighty spirit... came down among men and brought into their daily life and practice the force and impulse of utter spirituality.

Sri Aurobindo

22

హిందూ మతం – కురూపము, స్వరూపము

హిందూయిజము రెండురకాలు. ఒకటి వంటగది మీదనే ఆధారపడి వుంటుంది. అది దేహాన్ని శుభ్రం చేయడంతోనే స్వర్గప్రాప్తికి ప్రయత్నిస్తుంది. ఇక రెండవది వంటపాత్రను శుభ్రం చేయుట మీద కేవలం సాంఘికాచారవ్యవహారాల మీద ఆధారపడకుండా ఆత్మను పరిశుద్ధం చేసుకొనుట ద్వారా దైవాన్ని అన్వేషిస్తుంది. ఇది మొదటిదానికంటె ప్రాచీనమైనది, నశించనిది. భీష్మాచార్యులు, శ్రీకృష్ణుడు, శంకరుడు, చైతన్యమహాప్రభు – వీరందరిదీ యీ హిందూయిజమే! ఇది మిక్కిలి పురాతనమైనది. శాశ్వతమైనది. యుగయుగాలుగా అభివృద్ధిచెందుతూ వచ్చింది. దీని లక్ష్యం క్రియ గాదు – కర్మ; ఆచారం కాదు – భక్తి; శాస్త్రం కాదు – జ్ఞానం Yet it accepts *kriya, sastra* and *acara,* not as ends to be followed for their own sake, but as means to perfect *karma, jnana* and *bhakti....* కాస్త ఉన్నతశ్రేణిలో అవాస్తవం కాని రెండు హిందూత్వాలు ఉన్నవి. సైద్ధాంతికపరమైనది ఒకటి కాగా ఏ సిద్ధాంతానికి ఒదగనిది వేరొకటి. వేర్పాటుధోరణి కలదిగా ఒకటైతే, సంయోజనకారియై సర్వేశ్వరత్వాన్ని అన్వేషించేది వేరొకటి. మొదటిది ఒకే ఆదర్శానికి, అనుభవానికి, కొన్ని విశ్వాసాలకి, ఎన్నుకున్న గురువుకి, అవతారానికి, నిబద్ధంగా కట్టుబడినది, రజోగుణ ప్రధానమైనది, సహనం లోపించినది, అపరిపక్వత వలన గర్వం, తిరస్కారభావం కలిగినది. ఈ వర్గం వారికి స్వీయ అల్పత్వంవలన తమకంటే వేరైనవారంతా కుసంస్కారులు, మూఢులు అనిపిస్తారు. తాము నమ్మిన గురువే గురువు, కొలిచే దైవమే దేముడు. భావాలు, అనుభవాలు, విశ్వాసాలు, గురువు, దైవం తమకు ప్రత్యేకమైనా, క్రమేపీ ఆత్మవికసనంతో పరిణతిపొంది, ఇతరుల మనోభావాలను సహించి *"సర్వదేవ నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి"* అని భావించగలిగే ఔదార్యం వీరికి కలుగుతుంది. పరిపూర్ణ జ్ఞానోదయంతో విశ్వ చైతన్యాను

భవం కలిగి దివ్యత్వం సిద్ధించి అంతా సర్వేశ్వర సంభూతంగా అనుభావ్యమౌతుంది. ఉన్నతుడు, అధముడు అనే తేడా లేకుండా అద్వితీయుడైన ప్రేమైకమూర్తి అందరినీ అక్కున చేర్చుకోగల డనే సమ్యగ్భావన కలిగి భిన్నత్వాలన్నీ పటాపంచలై 'ఏకంసత్' అన్న ఉపనిషత్సత్యం రుజువు కాబడుతుంది. తమ దివ్యజీవన సాధనానుభవంలో శ్రీరామకృష్ణ పరమహంస మనకు తెలియ చేసిన సత్యమిదియే. ఈ యుగ అవతారపురుషులు వారు. అయితే వారికీ ఒక సిద్ధాంతాన్ని అంటగట్టి వారి ప్రతిమని చేసి, ఆలయా నికి బందీచేసి యాంత్రికమైన పూజాపురస్కారాలకు పరిమితం చేయడం గర్హించాలి. ఆలయాలు, అర్చనలు ప్రధానం కావు. కావలసినది సర్వేశ్వరోపాసన.

దాస్యశృంఖలాలను త్రెంచి, భావదాస్యాన్ని తుదముట్టించి స్వేచ్ఛని పొందాలి. ఇదీ అవశ్యకర్తవ్యం. ఈ ముక్తిని ప్రసాదిం చేందుకే శ్రీరామకృష్ణ పరమహంస అవతరించారు. శ్రీ వివేకానం దులు వారి దూతగా వారి సందేశామృతాన్ని అందరికీ పంచేం దుకు అవతరించారు. లోకంలో సర్వత్రా స్వేచ్ఛా సమీరాలు ప్రసారం చేశారు. హిందూత్వపుటాత్మ బండరాతిగుడికి బందీయై కృశిస్తోందని, ఆత్మ జీవనానికి కృత్రిమ భౌతిక భవబంధాలు అడ్డు కారాదని, గ్రుడ్డినమ్మకాలకు స్వస్తి పలికి, దేహదేవాల యాన్ని పరిశుద్ధం చేసి పునరుజ్జీవింపజేసి, స్వజాతీయ యోగ సాధనతో విముక్తం చేసి ఆత్మోన్నతితో దివ్యజీవన వికాసం పొందమని హితవు పలికారు. గ్రుడ్డిగా అనుసరించే, విజాతీయ విగ్రహారాధన వైఖరిని గర్హించారు.

(*SABCL* Vol. 2, pp. 461-63)

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు, కె. కూర్మారావు

23

రెండు సూక్తులు

అవతారమూర్తి శ్రీరామకృష్ణులు, దేవదూత వివేకానందులు చెప్పక చెప్పిన హితోక్తు లెన్నెన్నో! అన్నీ ఎలా తెలుసుకోవటం? భగవంతుడు వ్యక్తి ఆలోచనకి, మాటకి అందుతాడా! ఆయన అవాఙ్మానసగోచరుడు కదా!

*

ఎవరీ రామకృష్ణులు? "దైవం మానుషరూపేణ" ఈ నేలపై నడయాడిన విశ్వేశ్వరుడు. మరి వివేకానందులో? ముక్కంటి తేజోమయవిలాసం. త్రిమూర్త్యాత్మకంగా రూపుదాల్చిన ప్రణవనాదం. (*SABCL* Vol. 17, p. 98)

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

24

నిబంధనలేగాని బంధనలు కావు

తాత్త్విక భావనా లేక మతవ్యవస్థా అనేవి మన స్థాయి ననుసరించి భగవంతుడు మనచేత దర్శింపచేయ తలచిన విశ్వం యొక్క స్థితిగతులను గురించిన ప్రకటన మాత్రమే. మాయాస్వరూపమైన ప్రకృతిలో మనం వర్తించేటప్పుడు, మన మనసు విభ్రమం చెందకుండా స్థిరంగా వుండేందుకు మన కిది ప్రసాదింపబడింది. మనం చేసిన విశ్వవ్యూహనిర్మాణ దర్శనం సరిగ్గా ఇతరుల దర్శనమే అయి వుండవలసిన అవసరం లేదు. మన మానసిక ప్రవృత్తీ ఆలోచనా విధానమూ మరొకరికి వుండాలని ఎక్కడా నియమం లేదు. ఆలోచనాధోరణుల పట్ల మనకు మూఢనమ్మకంకాని విశ్వాసము, బలహీనతకాని సహనమూ ఉండాలి. మన మేధాశక్తిని బట్టి మన దృక్పథ మేర్పడాలి. నీ భావన ఆ శాస్త్రాన్ననుసరించి లేదు, ఈ మహనీయుడి ప్రమాణాన్ననుసరించి లేదు, ఆ తత్త్వవేత్త అభిప్రాయానికి భిన్నంగా

వుంది, ఈ అవతారమూర్తి ప్రబోధానికి భిన్నంగా వుంది అన్న విషయానికి ప్రాధాన్యం లేదు. మనదైన అనుభూతీ, సాక్షాత్కారమూ మనకు ప్రధానమని గుర్తుంచుకోవాలి. ప్రపంచంయొక్క స్వభావాన్ని గురించి శంకరభగవత్పాదు లేమి శెలవిచ్చారో, తన మేధాశక్తితో వివేకానందులేమి వూహించారో, అనేకానేక రీతుల్లో రామకృష్ణ పరమహంస వివిధ అనుభూతుల నెలా పొందారో – ఇవన్నీ కూడ భగవంతుడు మనకు కలిగించిన అనుభూతితో పోల్చి చూచుకోడానికీ, ఆ అనుభవాన్ని పునరావృతం చేసుకోడానికేనని గుర్తుంచుకోవాలి. తత్త్వవేత్తల, సాధుపుంగవుల, అవతారమూర్తుల అభిప్రాయాల్ని మనలను బంధించే సంకెళ్లలాగా కాక, మన సాధనకు సూచనలగానే స్వీకరించాలి. నీ యోగ ప్రస్థానంలో నీ గురువు ద్వారా నీవేమి దర్శించావో – సగుణ మూర్తిగానో, నిర్గుణమూర్తిగానో, సర్వంలో వసించే వాసుదేవుడిగానో లేక ఒక గురుస్వరూపంగానో, మార్గదర్శిగానో ఆ అనుభవమే నీకు సంబంధించినది.

(*SABCL* Vol. 17, pp. 67-68)

భావానువాదం: ధారా రాధాకృష్ణమూర్తి

25

సన్యాస వైరాగ్యములు

క్షుద్రమైన విషయముల కొరకుగాక ఉదాత్త ధ్యేయాన్ని సాధించడానికే మనకు సన్యాసవైరాగ్యములని ఋషులు తాము భావించిన ఆంతర్యాన్ని విప్పిచెప్పారు. క్షుద్రమైన ధ్యేయాలపట్ల దౌర్బల్యాల విషయంలో తస్మాత్ జాగ్రత్త!

'క్లైబ్యమ్ మాస్మగమః పార్థ నైతత్ త్వయ్యుపపద్యతే' ఇటువంటి క్షుద్రమైన దౌర్బల్యం సృష్టి స్థితి లయ స్వరూపమైన సాక్షాత్ పరబ్రహ్మస్వరూపమైన నిత్యుడికి తగదు. ఇంకో విధంగా చూస్తే దుఃఖమూ, ఆశాభంగమూ వల్ల కలిగే వైరాగ్యం నిజమైనది కాకపోలేదు. కొన్ని సమయాల్లో, కొందరు అజ్ఞానబద్ధులై

క్షుద్రమైన విషయాలకోసం ప్రయత్నించి విఫలమయ్యారు. దానికి కారణం వారి బలహీనత కాదు. క్షుద్రస్వభావం వారికి సహజమైనది కాకపోవటమే. అది వారి ఔన్నత్యానికీ, ఉత్తమ భవితవ్యానికీ తగినది కాకపోవటమే

దుఃఖము, ఆశాభంగము వాళ్ల కళ్లను తెరిపించి తమ నిజ స్వరూపాన్ని తెలుసుకునేటట్లు చేస్తాయి. అటువంటి పరిస్థితుల్లో వారు ఏకాంతాన్నీ, ధ్యానాన్నీ, సమాధిస్థితినీ వాంఛిస్తారు. ఆరని దుఃఖాగ్నినీ, తీరని కోరికలనీ మత్తుపానీయాలతో ఆర్పే ప్రయత్నం చేయరు. ఎందుకంటే క్షుద్రమైన విషయాలను కాంక్షించరు గనుక. భగవంతుని ప్రేమనో, నిత్యుడైన పరాత్పరుని గూర్చిన జ్ఞానాన్నో వారు అభిలషిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో వారిని నూతన భావ్యావేశం ఆవహిస్తుంది. ఎందుకంటే ఏకాంతమైన పరంధాముని సన్నిధి మాత్రమే వారి బ్రహ్మతేజాన్ని వృద్ధి చేస్తుంది.

ఆ స్థితిని సాధించిన తరువాత దివ్యమైన, బ్రహ్మజ్ఞానం లేక భావ్యమైన పరమప్రేమ వారి హృదయం నుంచి ప్రవహిస్తూ ప్రపంచాన్ని ముంచెత్తుతుంది. అటువంటి మహనీయ మూర్తులే శంకరాచార్య, రామకృష్ణ పరమహంసలు. కొన్ని సందర్భాల్లో తాము పొందే సుఖసౌఖ్యాలూ, తమ చుట్టూ వున్న ప్రపంచంలో కనిపించే దుఃఖమూ, దైన్యమూ బుద్ధుణ్ణీ, క్రీస్తునీ అజ్ఞానాంధకారంలో మునిగియున్న అభాగ్యులకు వెలుగు చూపించి, ఆదుకోవాలని వారి అంతరాల లోతులనుంచి ప్రయత్నించేట్టు చేస్తాయి. తమలో అపారమైన శుద్ధసత్త్వాన్నీ, శక్తినీ నింపుకున్న ఉత్తములైన సన్యాసులే ఉత్తమ సేవాతత్పరులై భగవంతుని కార్యాల్ని నిర్వహించే మహనీయులవుతారు.

వారి వైరాగ్య స్వరూప స్వభావాలెట్టివైనా, వారు దానిని పొందడానికి ప్రత్యక్షప్రేరణ మేదైనా, వారి వైరాగ్యంలో తీవ్రమైన దైవజిజ్ఞాస మిళితమైతే, అది నిజమైనదై, మోక్షోన్ముఖమైన కారణంగా పరిణమిస్తుంది. ఎప్పటికైనా పరమాత్మను చేరాలంటే నీవు ఈ స్థితిని అధిగమించాలి. దృశ్యమానజగత్తుపట్ల నీవు

వైరాగ్యం పొందటం అవసరం. ఎందుకంటే దృశ్యమానజగత్తు నీ దృష్టిని అధోముఖం చేస్తుంది, నీవు ఊర్ధ్వంగా చూడలేవు, బహిర్ముఖుడవుతావుగాని అంతర్ముఖత్వం పొందలేవు. కాబట్టి మొదట వైరాగ్యప్రవాహాన్ని నీలోకి ఆహ్వానించాలి. అయితే అది ఆధ్యాత్మిక ప్రస్థానంలో ప్రాథమికదశేగాని నీ అంతిమ ధ్యేయం కాదు. ప్రపంచంపట్ల కలిగిన జుగుప్సాభావంవల్ల భాస్కరానందులు సన్యాసం స్వీకరించాడు. అయితే ముక్తుడయిన తరువాత ఆయనెంతగా మారిపోయాడంటే, ఒకవేళ భార్య బ్రతికివుంటే ఆమెతో గార్హస్థ్యజీవితం గడిపి వుండేవాడు. అటువంటి అభిప్రాయం జీవన్ముక్తుడికి సహజమైనా చాంధసవాదులైన పండితులకు గొంతులో పచ్చివెలక్కాయే అవుతుంది.

అద్వైతస్థితి లభించిన శ్రీరామకృష్ణ పరమహంస గృహస్థుడిగా ప్రపంచంలోకి అడుగుపెట్టడానికిగానీ, ఐహికజీవితం గడపడానికిగానీ అంగీకరించలేదు. ఆయన పరమభక్తిభావానికి ప్రతిరూపమైనా, దృశ్యమానజగతిలో మానవుడిగా వ్యక్తమైన సగుణబ్రహ్మం అనుభూతి కలిగించినట్లే, సమాధ్యవస్థలో ప్రసన్నమైన నిర్గుణపరబ్రహ్మం కూడా ఆనందం కలిగించింది.

కర్మయోగి వైరాగ్యస్థితిని అధిగమించాలేగాని దాంట్లోనే వుండిపోకూడదు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే యోగులు ఆధ్యాత్మికత నంటిపెట్టుకొని భౌతికతను విడిచిపెట్టాలి. వైరాగ్యానికి సంబంధించిన ఆధ్యాత్మికాంశ మేదంటే భౌతికజగత్తులోని వ్యామోహాల, స్వార్థపరమైన కార్యకలాపాల పట్ల విముఖత్వం వహించాలి. ఇక్కడ భౌతికాంశ మేదంటే అటువంటి వ్యామోహాలకు లొంగుతాననే భయమూ, వాటినుంచి తప్పించుకోవాలనే ప్రయత్నమూ. యోగులు జాగ్రత్తగా ఆధ్యాత్మికాంశను నిలుపుకోవాలి. శారీరక పవిత్రతకూ, సాధుత్వానికీ చిహ్నాలైన భౌతికాంశాల్ని అంటిపెట్టుకొనటం మోక్షం పొందటానికి అత్యవసరం కాదు.

(*Sri Aurobindo Archives and Research* Dec. 1977, pp. 63-64)

భావానువాదం: ధారా రాధాకృష్ణమూర్తి

26

ఆధ్యాత్మిక ఐక్యత

వ్యక్తి ఎంత వికాసము నొందునో, అంత ఆధ్యాత్మిక స్వతంత్రదిశగా పయనించును. కాని ఈ స్వతంత్రత సర్వ సత్తనుండి సర్వథా వేఱుపడియుండునది గాదు. సర్వసత్తయు ఆత్మయే – అది ఆ సత్తతో సమైక్యమును గల్గియుండును. అతడు ఆధ్యాత్మిక స్వతంత్రత దిశగా పురోగమించుకొలది ఆధ్యాత్మిక ఏకతాదిశగా గూడ పురోగమించును. దీనిని సమర్థించుచు, గీత మనకిట్లు నుడువును: ఆధ్యాత్మికతను సాధించిన విముక్తమానవుడు సర్వభూతముల హితమునందు రతుడై యుండును; ఈ సమైక్యమే బుద్ధుని, తాను నిర్వాణమార్గమును కనుగొనిన పిమ్మట, ఏ మానవులింకను తమ సత్య సత్తు లేక అసత్తు నుండు గాక, తమ కృత్రిమ, సంరచనశీల సత్తుయొక్క భ్రమకులోనై యున్నారో వారికి ఆ నిర్వాణమార్గమును తెలిచి యుంచుటకు మఱల ప్రపంచము వైపునకు మళ్లించెను. అటులే వివేకానందుడు నిరపేక్ష బ్రహ్మముచేత ఆకృష్టుడయ్యు, మానవజాతియందు మాఱువేషమున నున్న భగవంతుని పిలుపును, అత్యధికముగా పతితులు, దుఃఖితుల పిలుపును, తన ఆత్మకు వచ్చు విశ్వముయొక్క అంధకారమయ శరీరము నందలి పిలుపును గూడ ఆకర్ణించుచున్నాడు.

(*SABCL* Vol. 19, p. 1050)

అనువాదం: చెలసాని నాగేశ్వరరావు ('దివ్యజీవనము' నుండి)

Yoga, as Swami Vivekananda has said, may be regarded as a means of compressing one's evolution into a single life or a few years or even a few months of bodily existence.

Sri Aurobindo

27

నిజమైన విముక్తి

ఈ వైయక్తిక మోక్షేక్ష మరొక యాకర్షణచే జయింపబడుట తర చుగా చూచుచుందుము. అదికూడ ఉన్నతస్థాయిలో మన ప్రకృతి గైకొను నొక మలుపునకు సంబంధించినదే. ముక్తాత్మ అనుసరిం చవలసిన కార్యపద్ధతి ముఖ్యలక్షణ మెట్లుండవలెనో అయ్యది సూచించును. అమితాభబుద్ధుడు యాత్మనిర్వాణద్వారము చెంతకు చేరినప్పుడు, అతడద్దానినుండి మరలిపోయి, ప్రపంచములో ఒక్క జీవి దుఃఖియై, అజ్ఞానియై మిగిలియున్నంత వరకు తానా ద్వారము దాటిపోనని శపథము గైకొన్న మహత్తరగాథయందు గర్భితమైనది ఇదియే. "అష్టసిద్ధులతో గూడిన పరమస్థితినిగాని, జన్మరాహిత్యమునుగాని నేను కోరను. దుఃఖితులైన సకలజీవుల దుఃఖమునూ నేను పొంది వారిని దుఃఖవిముక్తులుగ జేయుటకై వారియందు ప్రవేశింతును గాక" – అను భాగవత పురాణము లోని మహోదాత్త శ్లోకమున నీ యర్థమే ఇమిడియున్నది.

వివేకానంద స్వామిచేత ఒక లేఖలో నీ క్రింది విశిష్ట భావోపేతవాక్యముల నుల్లేఖింపజేసిన దిదియే. ఆ మహావేదాంతి ఇట్లు వ్రాసినాడు: "నా మోక్షమునకై కోరికయెల్ల నాలో పూర్తిగ నశించిపోయినది. మరల మరల జన్మలు ఎత్తి దుఃఖపరంపరల ననుభవింపవలెనని కోరుచున్నాను. ఎందుకు? ఉన్న ఒకే ఒక భగవంతుని – సకలజీవాత్మల సమిష్టిరూపుడైన భగవంతుని – అంతేకాదు – దుష్టుల రూపములోనున్న నా భగవంతుని – దుఃఖితుల రూపములోనున్న నా భగవంతుని – సకలజాతుల లోనూ, దీనులరూపములలోనున్న నా భగవంతుని అర్చించుకొ నుటకు. నేను ప్రత్యేకముగా అర్చించునది అతని నొక్కనినే. ఉన్న *తుడు పతితుడు, పుణ్యాత్ముడు పాపాత్ముడు, దేవతారూపుడు క్రిమిరూపుడు అయిన ఆ ప్రత్యక్షస్వరూపుని ఆ జ్ఞేయస్వరూ పుని, ఆ వాస్తవికస్వరూపుని, ఆ నిఖిలస్వరూపుని అర్చించుచు, ఇతర విగ్రహములనెల్ల పగులగొట్టివేయండి. ఎవనికి పూర్వ*

జన్మము, ఉత్తరజన్మము లేదో, ఎవనికి మరణము, గమనాగమ నములు లేవో, ఎవనిలో మన మింతకుముందు ఎల్లప్పుడునూ ఉండి ఇకముందుగూడ ఎప్పుడునూ ఉండగలమో అట్టి వానిని అర్పించుచు ఇతర విగ్రహములనెల్ల పగులగొట్టివేయండి."

ఉన్న విషయమంతయు కడపడి రెండు వాక్యములలోనే యున్నది. కుటుంబమును, సమాజమును బాహ్యముగ వదిలి వేయుట మాత్రమున నది నిక్కమైన సన్యాసమెట్లు కాదో, అట్లే ఇహజీవనమును త్రోసిపుచ్చుటయు, ఆధ్యాత్మిక విలయనమును జీవుడు పొందుటయు జన్మబంధమునుండి నిక్కమైన విమోచ నము కానేరదు. ఎవనియందు పూర్వజన్మము, ఉత్తరజన్మము అనెడి విభాగము లేదో, జన్మలు లేని నిత్యమైన ఆత్మసంస్థితి మాత్రమే ఎవనియందు కలదో, అట్టి ఈశ్వరునితో అంతరమున ఏకత్వమును పొందుటయే నిక్కమైన విమోచనము. అంతరమున విముక్తుడైనవాడు కర్మలు చేయుచుండియు చేయనివాడేయని గీత నుడువుచున్నది. ఏలయన, ప్రకృతి కధినాథుడైన పరమే శ్వరుని యాజ్ఞకు లోబడి అతనిలో పనిచేయునది ప్రకృతి. అటు లనే, వందపర్యాయములు దేహధారణ మొనర్చినను అతడు జన్మ బంధమునుండియు, సంసారచక్రమునుండియు విముక్తుడే.

ఏలయన, అతడు నివసించునది జననమరణములు లేని ఆత్మయందు, – శారీరకజీవితమునందు కాదు. కావున, పునర్జన్మ మునుండి తప్పించుకొనుటయందాసక్తిని ఇతరులెవరు వదలకు న్నను, పూర్ణయోగసాధకుడు పగులగొట్టి పారవేయవలసిన విగ్ర హములలో నిది యొకటి. ఏలయన, అతని యోగము విశ్వాతీ తుని సాక్షాత్కారమును వ్యష్టాత్మ పొందుట మాత్రముతో పరి మితమగునది కాదు. సకల జీవాత్మల సమష్టిరూపమైన విశ్వాత్మ సాక్షాత్కారము సైతము దానియందంతర్భూతమై యున్నది. కావున నీ యోగము వైయక్తిక మోక్షేచ్ఛా ప్రవృత్తి పూర్వకముగా జగ చ్చక్రమునుండి తప్పించుకొనిపోవుటకు పరిమితమై పోనేరదు. విశ్వపరిమితుల నధికరించిన అతీతానుభవస్థితియందు కూడ అతడు పరమేశ్వరునియందు ఎల్లరితోడను ఏకమై యున్నాడు.

కావున విశ్వములో అతడు కొనసాగించవలసిన ఈశ్వరకార్య మింకనూ మిగిలియే యుండును.

దీనిని గురించి శ్రీఅరవిందులు ఒక సాధకునికి రాసిన వివరణ

వివేకానందుని ఉదాహరణలో నాకు తట్టిన అర్థం మానవసేవా నిష్ఠ కాదు. వివేకానందుని లేఖనుండి ఉదహరించిన పేజీలోని చివరి వాక్యాలనే నేను ఎత్తిచూపానుగానీ, దరిద్రనారాయణుడిని గురించి, పాపి, హంతకనారాయణులను గురించిన మాటలను గాదని నీవు నా 'యోగసమన్వయం' లో చూడగలవు. అచ్చటి ముఖ్యాంశమేమంటే, (మానవుడియందే కాక) ప్రపంచమంతటను న్న భగవంతుడు, సర్వమూ అయిన భగవంతుడు, గీత చెప్పే 'సర్వభూతాలు'. భగవంతుడు కేవలం మానవజాతి మాత్రమే కాదు, అంతకుముందే కేవలం దరిద్రులు, క్రూరులు మాత్రమే కాదు; నిశ్చయంగా ధనికులు, సాధుజనులు సైతం భగవంతు నిలో భాగమే. అలాగే ఎవరు మంచి లేక చెడువారు కారో, భాగ్యవంతులు లేక పేదలు కారో, వారూ ఆ భగవంతుడే. అలాగే (నా వ్యాఖ్యలలో) దయతో చేసే మానవసేవా ప్రసక్తి కూడలేదు. ఒకప్పుడు నాకు వ్యక్తిగత మానవసేవా దృష్టి లేకపోయినా, మానవజాతి దృష్టి ఉంది. ఆ వాసన 'ఆర్య' లోని నా వాక్యా లకు కొంత అంటి ఉండవచ్చు. కాని, 'మన యోగం మానవ జాతి కోసం' అనే దృష్టినుంచి, 'మన యోగం భగవంతుని కోసం' అనే దృష్టికి అప్పటికే మార్పు జరిగిపోయింది. (మరొక దృక్కోణం నుంచి) భగవంతుడు విశ్వాతీతమనే కాక, విశ్వ మును, వ్యక్తిని గూడ – నిర్వాణమును లేక అతీతమును మాత్రమే కాక, జీవనమును, సర్వమును – తనలో ఇముడ్చుకుం టాడు. దీనినే నేను సర్వత్రా వక్కాణించుతున్నాను.

(*SABCL* Vol. 20, pp. 257-58; Vol. 22, p. 149)

అనువాదం: కమలాకర వేంకటరావు ('యోగసమన్వయం' నుండి);చెలసాని నాగేశ్వరరావు ('యోగంపై లేఖలు నుండి')

28

అవతార తత్త్వం

పరిణామంతో ముడివడి ఉండకపోతే, అవతారత్వానికి (avatar-hood) ప్రాయః ఏ అర్థమూ ఉండదు. హిందూమత మందలి దశావతార పరంపర స్వయంగా ఒక పరిణామ దృష్టాంతమైనట్లు మనకు గన్పించుతుంది. చూడండి: మొదట చేప అవతారం; తర్వాత నీటిలోను, నేలయందు చరించే ఉభయచర కూర్మం (తాబేలు); పిమ్మట భూమిచర వరాహం; అనంతరం పశుమాన వుల నడుమ వారధిగా పనిచేసే నర-సింహం; అటు పిమ్మట వామన (పొట్టి). ఈ పొట్టిమనిషిలోనే ప్రపంచాన్నంతటిని ఆక్ర మించగల దేవభావ (godhead) ముంది; అటు తర్వాత ఈ భౌతికమానవుని ప్రాణిక రాజసిక మానవుని దశలోనికి నడిపిన రాజసిక పరశురామ అవతారం; తదనంతరం ఇతనిని సాత్త్విక-మానసిక మానవుని దశలోనికి నడిపిన సాత్త్విక రామావతారం. వీరందరికీ పైన నిర్గుణ (గుణాతీత) కృష్ణావతారం. ఇతడు మాన సిక మానవుని అధిమానసిక, అతిమానవునిదశలోనికి లేవనెత్తు తాడు. కృష్ణుడు, బుద్ధుడు, కల్కి, – ఈ మూడు అవతారాలు పరిణామంలోని చివరి మూడుదశలు – ఆధ్యాత్మిక ప్రగతికి, ప్రకాశానికి క్షేత్రములు. కృష్ణుడు అధిమనస్సుకు ద్వారం తెరు స్తాడు. బుద్ధుడు విశ్వానికావల ప్రాప్తించే పరమ విముక్తిలోనికి దూసుకుపోవడానికి ప్రయత్నించుతాడు. కాని ఈ విముక్తి ఇంకా నకారాత్మకమే (negative, నిషేధాత్మకం) – ఏలన అది తిరిగి పృథ్విలోకి దిగి, ఇచ్చటి పరిణామాన్ని సకారాత్మకంగా సంపూర్ణం గావించదు. కాగా కల్కి – అవతారం ప్రతిఘటించే అసురశక్తు లను నాశనమొనరించి, దైవరాజ్యమును గొనిరావడం ద్వారా ఆ లోపాన్ని సవరించవలసి ఉంది. పరిణామమందు అవతారాల ఈ పురోగమనం అతిస్పష్టం, ఇచ్చట సంశయానికి అవకాశమే లేదు.

అవతార జన్మలకు నడుమ ఉండే భగవంతుని జన్మలకు వస్తే, గతంలో తనకు కొన్ని పరమజన్మలే గాక, ఇతర జన్మలు

కూడ గడచిపోయాయని కృష్ణుడు గీతలో చెప్పడం మనం జ్ఞాపకం తెచ్చుకోవాలి. అంతేగాక తనను భగవంతునిగా చెప్పు కుంటూనే, ఒక శ్లోకంలో తనను ఒక విభూతిగా వర్ణించుకు న్నాడు – "*వృష్ణీనాం వాసుదేవః*" (గీత; 10-37). అందుచేత తన పూర్ణతర దివ్యచేతనను మరుగుపరచుకుని, అనేకజన్మల్లో ఆయన విభూతిగా అభివ్యక్తమయ్యాడని మనం అనుకోవచ్చు. పరిణా మాన్ని ముందుకు నడపడమే అవతారక్రియకు ఉద్దేశ్యమని మనం అంగీకరించితే అపుడు ఇలా అనుకోవడం సముచితమే. పెద్ద పెద్ద సంక్రమణాత్మక దశలందు అవతారంగాను, చిన్న చిన్న సంక్రమణాలకు సాయపడేందుకు విభూతిగాను భగవంతు డావి ర్భవిస్తాడు.

విభూతి అంటే?

సామాన్య భావాన్నిబట్టి, విభూతి భగవంతుని ఒక శక్తికి మూర్తీ భావం. ఈ శక్తిచేత విభూతి ప్రపంచమందు పెద్దబలంతో వ్యవ హరించగలదు – విభూతిగా పరిగణించబడడానికి అవసరమైన దంతా అట్టి వ్యవహారమే. విభూతి శక్తి ఎంత పెద్దదయినా, అతని చేతన అంతర్గత లేక అంతఃస్థిత భగవంతుని గురించిన చేతన కాదు. ఈ విషయమునందు గీతే మనకు ప్రధాన ప్రమాణం, కాగా ఈ గీతను బట్టే మనం పై అవతార విభూతి వివేచనను సంగ్రహించుకున్నాం. ఈ వివేచన ననుసరించితే, రామకృష్ణ లను గురించి మనకు తెలిసిన దాన్నిబట్టి, వీరుభయులు అవ తారాలని మనం అంగీకరించవచ్చు. ఇక బుద్ధునికి తన లోపలి శక్తి ఎక్కువగా నిర్వ్యక్తిక రూపానే అనుభూతమయింది. అయినా ఆయన కూడ అవతారంగానే కన్పించుతాడు. పోతే, ఎవడు రాముడో, ఎవడు కృష్ణుడో, వాడు తనలోపల ఉన్నాడని చెప్పి నపుడు, రామకృష్ణుడు గూడ భగవచ్చేతన గురించే పలికాడు. కాని చైతన్యుని విషయం విలక్షణం. ఆయన తననొక కృష్ణ భక్తునిగానే తెలుసుకొని, ఆ మాటనే ప్రకటించుకున్నాడు. అంతకెక్కువేమీ కాదని చెప్పుకున్నాడు. కాని కొన్ని సమున్నత

సమయాలందు ఆయన కృష్ణుని అభివ్యక్తం గావించాడు. మనః శరీరాల్లో ప్రకాశమయుడయ్యాడు. కృష్ణునిగానే ఉన్నాడు. ప్రభువుగానే భాషించాడు, వ్యవహరించాడు. ఆయన సమకాలికులు ఆయనలో కృష్ణావతారాన్ని, దివ్యప్రేమ అభివ్యక్తిని దర్శించారు.

శంకర, వివేకానందులు నిశ్చయంగా విభూతులు, విభూతులుగా వారు ఎంత గొప్పవారైనప్పటికీ, వారిని అంతకుమించిన వారినిగా లెక్కించలేము.

(*SABCL* Vol. 22, pp. 401-02; 406-07)

అనువాదం: చెలసాని నాగేశ్వరరావు ('యోగంపై లేఖలు' నుండి)

29

అద్భుతమైన గతము – అత్యద్భుతమైన భవితము

రామకృష్ణుడు స్వయంగా రూపాంతరీకరణం (transformation) గురించి ఎప్పుడూ తలంచలేదు, అందు నిమిత్తం ప్రయత్నించలేదు. ఆయన కోరినదంతా అమ్మయందు భక్తినే, ఇక ఆ భక్తితో బాటు ఆమె ఏ జ్ఞానం ప్రసాదించితే, దానిని స్వీకరించాడు, ఆమె దేనిని చేయించితే దానిని చేశాడు. ఆయన తన చేతనయందు ఆదినుంచీ, అంతఃస్ఫూర్తికం, అంతరాత్మకం. ఆయన ముందుకు సాగినకొలదీ మరింత అలా అయ్యాడు. మెట్లను ఎక్కడమే కాక, దిగి కూడా రాగల దివ్యమానవుని (ఈశ్వరకోటిని) గురించి ఆయన ప్రవచించినప్పటికీ, నూతన చేతన గురించీ, నూతన జాతిని గురించీ, పృథివీ ప్రకృతియందు దివ్య అభివ్యక్తిని గురించి ఆయన కెలాంటి ఊహా లేదు.

రామకృష్ణుని యోగం అంతర భగవంతుని అంతర ఉపలబ్ధి వైపుకే తిరిగింది – అది అంతకు తక్కువ కాదు గాని, అంతకు ఏమాత్రం ఎక్కువ కూడ కాదు, ఎవడు భగవంతునికి తన సర్వస్వం ఆహుతి గావించాడో, అతనికి భగవంతునిపై అధి

కారముంది అని రామకృష్ణుడు చెప్పిన మాట భౌతికముగా దేహం ధరించిన భగవంతునిపైన కంటె ఆంతర భగవంతుని పైనే; బాహ్యా అధికారాన్ని గాక, ఆంతర అధికారాన్నే వక్కా ణించుతోందని నా నమ్మకం. అది సంపూర్ణ ఆధ్యాత్మిక సంయో గము నపేక్షించే అధికారం – *ఇచ్చట భగవదనురక్తుడు భగవం తుని అన్వేషించుతూ ఉండగా, భగవంతుడుగూడ స్వయముగా తనను దానర్పించుకుని, ఆ భగవదనురక్తుని కలుసుకుంటాడు.* దీని కెలాంటి ఆక్షేపణ ఉండజాలదు. భగవదుపాసకులందరు అట్టి అధికారం కలిగి ఉంటారు. కాని ఈ దివ్యమిలనానికిగల లక్షణాలేమిటో, ఇది మనకంతగా తెలియజేయదు. ఆ లక్షణాలే మైనా, భౌతికభూమికయందు ఉపలబ్ధే నా ఉద్దేశ్యం. కావున రామకృష్ణుడు చేసిందే తిరిగి చేయడానికి నేను సమ్మతించజా లను. చాలాకాలమాయన అంతర్ముఖుడై ఉండిపోయాడు. ఆయన తన జీవితమంతా శిష్యులతో గడపలేదు అని కూడ నాకు కొంత గుర్తు ఉంది. ఆయనకు ముందు తన సిద్ధి ఏకాంతమున ప్రాప్తిం చింది. ఇక ఆయన బహిర్ముఖుడై అందరికి దర్శన మిచ్చినపుడు, ఔను, కొద్ది సంవత్సరాల్లోనే అది ఆయన శరీరాన్ని జీర్ణంచేసి వేసింది. అందుకాయన చింతించలేదని నేననుకుంటాను. ఏలన కేశవచంద్రుడు చనిపోతూ ఉన్నప్పుడు, ఆధ్యాత్మికానుభవం శరీ రాన్ని జీర్ణం చేయడం ఉచితమే – అనే సిద్ధాంతాన్ని సైతం ప్రతి పాదించాడు. కాని అదే సమయాన, మీకు గొంతుకలో ఎందుకు పుండు పుట్టింది? అని ఆయన నడిగినపుడు, శిష్యులు తమ పాపాలను నా మీదకు త్రోసివేశారు, వాటిని నేను మింగవలసి వచ్చింది, అని ఆయన జవాబు చెప్పాడు. ఆంతరవిమోచనచేత మాత్రమే నేను తృప్తిపడను – నిజానికి, ఆయనా తృప్తిపడలేదు. కావున నేనీ భావాలను లేక ఫలితాలను అంగీకరించను. పైగా ఆంతరజీవనానికి అదెంత సఫలసంయోగమే అయినా, భౌతిక భూమికయందు అది జీవేశ్వరుల సఫలసంయోగమైనట్లు నాకని పించడం లేదు. పోతే కృష్ణుడు మహత్తరకార్యాలు గావించాడు. కావున ఆయన అతిస్పష్టంగానే ఒక భగవదభివ్యక్తి. కాని నాకు

మహాభారతంలో ఒక ఘట్టం గుర్తు ఉంది. అక్కడాయన ఈ విధంగా వాపోయాడు: నా అనుయాయులు, ఆరాధకులు నా జీవితాన్ని అస్థిరపరుస్తున్నారు, వారి సంతత అభ్యర్థనలు, నిందలతో నేను విసిగిపోయాను, తమ అసంస్కృత ప్రాణికప్రకృతిని నా మీదికి నెట్టివేస్తున్నారు – అని, ఇక గీతయందు ఆయన ఈ మానవలోకమొక అనిత్య, అసుఖ వ్యాపారమని చెప్పుతున్నాడు. అంతేకాదు, దివ్యకర్మ సిద్ధాంతం ఒక వైపున ప్రతిపాదించుతూనే, చివరకు ఈ లోకాన్ని విడిచివేయడమే ఉత్తమ పరిష్కారమని చెప్పుచున్నాడా అనిపించుతుంది. గతకాల సంప్రదాయాలు తమ స్వీయస్థానమందు గతకాలమున మిక్కిలి గొప్పవే. కాని మనం కూడ అలాగే ఎందుకు చేయాలో, ఎందుకు ముందుకు పోగూడదో, నా కర్థం గావడం లేదు. పృథివిపై చేతనయొక్క ఆధ్యాత్మికాభివృద్ధియందు గత మహావైభవం తర్వాత భావిమహత్తర వైభవం రావాలి.

(SABCL Vol. 22, pp. 94, 87-88)

అనువాదం: చెలసాని నాగేశ్వరరావు ('యోగంపై లేఖలు' నుండి)

30

శ్రీరామకృష్ణులు – అవతారమూర్తి

సగుణబ్రహ్మ (ఇష్టదైవ) దర్శనమనియు నిర్గుణ పరబ్రహ్మైక్యమనియు చెప్పబడు రెండు విధములగు బ్రహ్మసాక్షాత్కారమును మనము పొందగలము.

ఈ వాగ్దానము పూర్వకాలములో సద్గురువుల దగ్గిర దీక్ష తీసికొనిన కొద్దిమంది ఉత్తమశిష్యుల విషయములోనే నెరవేరెడిది. కాని ఇది నేటికాలములో కూడ ఫలించగలదని మరొకసారి ఋజువు చేయబడినది. ఇటీవల కాలంలో ఒక మారుమూల ప్రదేశములో నివసించిన భగవంతుని అవతారమూర్తియు, ఆయన దివ్యప్రకాశమునకు ప్రతీకయునైన దక్షిణేశ్వర రామకృష్ణ పరమ

హంస జీవితమే ఇందుకు మహత్తర నిదర్శనము. ఆయన తన ఆధ్యాత్మిక బోధనలవలనగాని, నిస్సంగజీవన విధానమువలన గాని, నైతికప్రబోధముచేతగాని, దుఃఖోపశమనమునకు సూచించిన మతపరమైన కర్మకాండరూప ఔషధముచేతగాని ప్రపంచములో సంచలనము సృష్టించలేదు. తన అసమాన పరిపూర్ణత, ఔదార్యములతో మరొకసారి వేదాంతమార్గము ద్వారా భగవదనుభూతిని, ఆంతరికజిజ్ఞాస ప్రకటనను ఎట్లు సాధించవచ్చునో ప్రపంచమునకు ఋజువు చేసెను.

నిరక్షరాస్యుడు, పేదవాడునైన ఈ వంగదేశ గ్రామీణుడు తన జీవితాంతమువరకును తన గ్రామీణ యాసతోనే మాట్లాడేవాడు. తన హావభావములను మొరటుగానే వ్యక్తపరచేవాడు. ఆయనకు సంస్కృత పరిజ్ఞానం శూన్యం. తత్త్వశాస్త్రంతోగాని, విజ్ఞానశాస్త్రంతోగాని పరిచయం లేదు. తనకు తెలిసిన వంగ భాషను కూడా ప్రాంతీయ నుడికారంతోనే మాట్లాడగలడు. ఆయనకు ప్రపంచం పోకడ అసలే తెలియదు. అయినా సనాతన ఆధ్యాత్మిక జ్ఞానమును సంపూర్ణముగ తనలో ఆవిష్కరింప జేసుకున్నాడు!

ఆయన తన దివ్యసూక్తుల ద్వారా గంభీరము, జటిలమునైన ఆధ్యాత్మిక విషయములపై వెలుగును ప్రసరింపజేసెను. మేధావంతులకు, పండితులకు సైతము అంతుపట్టని తాత్త్విక ప్రశ్నలకు తన సహజ సరళరీతిలో సమాధానములు చెప్పి, శ్రోతలను సంభ్రమాశ్చర్యములకు గురిచేయుట ద్వారా, తన ఆధిక్యతను నిరూపించుకొనెను. ఆయన ఏ పద్ధతి నవలంబించి ఇట్టి జ్ఞానభాండాగారమును తనలో నింపుకొనగలిగెనో చెప్పజాలము. అయితే అది బుద్ధి కుశలతవలనగాని, తార్కికసామర్థ్యమువలన గాని కాదని మాత్రము స్పష్టంగా చెప్పగలము. బుద్ధితో వివేచన చేయవలసిన అతిచిన్న విషయములలో కూడా ఆయన బాలునివలె ప్రవర్తించేవాడు. అజ్ఞానియైన తన సాటి పల్లెటూరి రైతు కంటె ఇంకా అమాయకంగా ఉండేవాడు. *సునిశితమైన తన జ్ఞాననేత్రంతో – మానసికశక్తితో కాదు సుమా – జనుల*

హృదయములను, వారి ఆశయములను పరికించేవాడు. ఆధునికకాలంలో – ఇంకా నిజం చెప్పాలంటే మానవజాతికి విచక్షణాజ్ఞానం ప్రాప్తించిన తరువాత యథార్థజ్ఞాన సముపార్జనకు ఈ విధంగా మేధాశక్తిని పూర్తిగా విస్మరించినవారు అరుదుగా కనిపిస్తారు. ఆయన ఇట్లు సఫలీకృతుడగుటకు కారణం ఆయన నైతికజీవనవిధానము, పారమార్థికదృష్టి ఏకం కావటమే. అయితే చాలామంది వివేచన ద్వారానే తమ ఆలోచనలను, సున్నితభావములుగా మలచుకుంటూరు. ఉద్రేకాలను ఆలోచనలతో మేళవించి అనుభవిస్తారు. *అయితే రామకృష్ణులు తన హృదయాంతర్గత అంతరదృష్టితో – వివేచనాశక్తితో కాదు – బాహ్యావ్యక్తులను, వస్తువులను పరిశీలించి చూసి, ఆ వెలుగునే తన అనుభవంగా తీర్చిదిద్దుకొనేవాడు.*

ఈ గ్రాహకశక్తిని వినియోగించుకొనే సామర్థ్యాన్ని ఆధునిక మానవుడు పోగొట్టుకొని చాలా కాలమైంది. ఈ విధంగా ఆయన తమ సమగ్ర మానసిక, భౌతికానుభవములకు మూలకారణం సాధించటంవలన ఆయన బుద్ధి అత్యధికంగా వాస్తవజ్ఞానంతో నిండి అది సదాత్మ వైపు తిరిగి సమస్త వస్తువులలోని సత్యాన్ని దర్శించగలిగింది. *చివరకు ఏ వస్తువు కూడా తన ఆంతరిక రహస్యమును ఆయన నుండి దాచలేకపోయింది.* ఏ శిఖరము ఆయన ఆరోహించుటకు అవరోధం కలిగించలేదు. ఆయన మొదటిసారి స్పష్టంగా, సమగ్రంగా ఎట్టి అరమరికలు లేకుండా సద్రూపి (being) స్థానము మనస్సుకు పైన వున్నదని చూపెను.

రామకృష్ణులు ఆ సద్రూపి సృష్టి విజ్ఞాన మంతటిని తనలో నిలుపుకొనగలిగిన మహత్తత్త్వము లేక మహాబుద్ధి అనీ అదే మానవునిలో కేంద్రస్థానమున నుండుననీ తేల్చిచెప్పెను. కనుకనే ఆయన శతాబ్దాలుగా మనల్ని బంధించి వుంచిన సంకెళ్ళను ఛేదించగలిగెను. ఇంకను ఆయన వివిధ యోగమార్గముల భేదములను గ్రహించగలిగెను. ఒక్కొక్క మార్గము ద్వారా ఆయన తన సాధనను చివరదశవరకు కొనసాగించి సమస్త సాధనలకు

పరమావధియగు నిర్వికల్ప సమాధిని మూడురోజులలోనే చేరు కొనగలిగెను. ఈ సిద్ధి కలుగుటకు తీవ్రసాధనచేయు యోగులకు కొన్ని దశాబ్దములుగాని, లేక కొన్ని జన్మలుగాని పట్టవచ్చును. ఆయన మతభేదములను పూర్తిగా తొలగించివేసెను. క్రైస్తవ, సూఫీ సంప్రదాయ సాధనల నభ్యసించి వాటి ఫలము ననుభవించి, అది తన హిందూశాక్తేయ సాధనల మహాఫలమునకు భిన్నము కాదని గ్రహించి, అయినను తన సంప్రదాయముననే స్థిరపడెను. అతడు గురుపరంపరలోని లోటుపాట్లను ఖండించెను. తన బాహ్యపూజావిధానమునకును, యోగశిక్షణమునకు మాత్రమే మానవ గురువులను స్వీకరించి తన ప్రథమ, పరమ దీక్షలను జగన్మాత నుండియే తీసికొనెను. అతనికి అనుభవేకవైద్యమైన యథార్థజ్ఞానమంతయును జగద్గురువైన దివ్యమాత నుండి లభించినదే.

ఆయన వేదాంతశాఖల తార్కికవాదములను ఖండించి వేదోపనిషత్తులలో ప్రతిపాదింపడినట్లు ద్వైతాద్వైత సాధనలవలన ప్రాప్తించగల పరమానందానుభవ మొక్కటేనని నిరూపించి చూపెను. *ఆనాటి ఆధ్యాత్మిక జీవనమును నియంత్రించు జ్ఞాన భాండాగారమంతటిని తన హృదయములోనికి స్వీకరించుటే గాక, దానిని తన మానసిక, భౌతికానుభవములకు ఆధారముగా తీర్చిదిద్దుకొనెను.* తన అఖండ, అగాధ వ్యక్తిత్వములో ఆనాటి ఆధ్యాత్మిక జీవనవిధానములోని దోషములను, అపూర్ణతలను జీర్ణింపజేసుకొని, ఆ ముసుగులు, రూపముల ద్వారానే పరిపూర్ణము, పరమోత్కృష్టమునైన దైవమును ప్రకాశింపజేసెను. ఈ విధముగా అతడు ఉత్తమ జ్ఞానప్రాప్తికి అనుభవము, అంతర బోధలే పరమసాధనములని నిరూపించెను. కావుననే ఆయన జీవితము మానవజాతి పురోగతికి బీజప్రాయముగా నిలిచిపోయెను. ఆ బీజములో మానవుని తార్కిక మనోబంధములను తెంచుకోగల సామర్థ్యముతోపాటు మానవజీవయాత్ర హేతుబద్ధత యనెడు చుట్టూ తిరిగే బండ్ల దారినగాక ఆంతరికజ్ఞానమనే

బహు దగ్గిరదైన కాలిబాటన ఆధ్యాత్మిక శిఖరాగ్రమున ఎట్లో సమాప్తి చెందగలదో సూచితమై యున్నది.

(Sri Aurobindo Archives and Research, April 1981, pp. 25-26)

అనువాదం: డా॥ కోట వేంకటేశ్వర రావు

31

క్రాంతి పథము – శీఘ్రమైన మార్గము

ప్రాచీనయోగులు, అన్వేషకులు మొదట శాంతినే కోరుకుండేవారు. ఇక ఏది సర్వదా శాంతిని గొనివస్తుందో, ఆ నిశ్చల, నీరవ మనస్సే భగవదుపలబ్ధికి సర్వోత్తమ నిబంధనయని వారు ప్రకటించారు. ఒక ప్రఫుల్ల మరియు ప్రకాశమయ హృదయం ఆనందానికి తగిన పాత్ర కాగా ఆనందం లేక దానికి దారితీసే మార్గం భగవంతునితో సంయోగానికి అవరోధమని ఎవరు చెపుతారు? విషాదాన్ని మోసుకునిపోవడం నిశ్చయంగా ఒక భయంకర భారం. 'యాత్రికుని ప్రగతి' (Pilgrim's Progress) అనే పుస్తకమందు క్రైస్తవుడు విషాదం బురదలోనుంచే, దాని ద్వారానే ముందుకు పోవాలి – అని చెప్పబడింది. కొన్ని సమయాల్లో అలా చేయవలసి రావచ్చు. కాని దానినే తిరిగి తిరిగి వక్కాణించడం ఒక అవరోధం మాత్రమే అవుతుందిగాని మరేమీ కాదు.

విశేషించి గీత ఇలా చెపుతుంది, "విషాదానికి లోనుగాని హృదయంతో యోగాన్ని ఆచరించు" (గీత: 6-23) బాధ, దుఃఖం, సంఘర్షం, నిరాశాప్రవేశం యోగమార్గాన సహజమేనని నాకు బాగుగా, పూర్తిగా తెలుసు. కాని అవి అనివార్యం కావు. ఇక అవి సహజ మెందుచేతనంటే, అవి యోగానికి సాయపడడంచేత కాదు. దేనినుంచి కష్టముతో పెనుగులాడి మనం వెలుగులో అడుగిడవలసి ఉంటుందో, మన ప్రకృతియొక్క అట్టి అంధకారంచేత అవి ఆరోపించబడుతూ ఉన్నాయి గనుక. నీవు ఏ ఘటనలను సూచించుతున్నావో, ఇతరులు వాటిని అనుసరించాలన్న భావనతో రామకృష్ణుడుగాని వివేకానందుడుగాని వాటిని ప్రస్తావించా

రని నేననుకోను. విశ్వాసం, సహిష్ణుత, పట్టుదల – ఇవే ఎక్కువ మంచిమార్గమని నిశ్చయంగా వారు చెప్పి ఉంటారు. వారి జీవితంలో నీవు సూచించిన ఘటన లెట్టివైనా, చివరికి వారీ మార్గాన్నే అంటిపెట్టుకుని ముందుకు సాగిపోయారు. నారదుడు తపస్వి, యోగి, వైష్ణవభక్తుడు – వీరితో గూడిన కథను, దానిలోని నీతిని ఆమోదించే రామకృష్ణుడు చెప్పాడనేది చివరికి తేలే విషయం. ఆ కథాసారాన్ని నేనిపుడు నా మాటల్లో చెపుతాను.

నారదుడు వైకుంఠానికి వెళుతూ, కొండల్లో కఠిన తపస్సు గావించుతూ ఉన్న ఒక యోగిని కలుసుకున్నాడు. అపుడా యోగి కోపంతో ఇలా అరిచాడు – "ఓ నారదా! నీవు వైకుంఠానికి వెళుతున్నావు. అక్కడ విష్ణువును చూస్తావు. నా జీవితం పొడవునా మహోగ్ర తపస్సును గావించుతూ వచ్చాను. అయినా ఇప్పటికి గూడా నేను విష్ణువును పొందలేదు. నేనెపుడు ఆయనను చేరుకుంటానో, కనీసం నాకోసం తెలుసుకో". పిమ్మట నారదుడు విష్ణువును గురించి పాటలు పాడుతూ, ఆ పాటలను బట్టి నృత్యం చేస్తూ ఉన్న ఒక వైష్ణవభక్తుని కలిశాడు. అతడు గూడా ఇలా అర్థించాడు బిగ్గరగా – "నీవు నా ప్రభువు, విష్ణువును చూడబోతున్నావు. నే నెప్పుడు నా ప్రభువు ముఖపద్మాన్ని దర్శించగలనో, అడిగి తెలుసుకో". నారదుడు తన తిరుగు ప్రయాణంలో ముందు యోగి దగ్గరకు వచ్చి ఇలా చెప్పాడు – "నీ వాయనను ఇంకా ఆరుజన్మల తర్వాత పొందుతావు". అపుడా యోగి ఎలుగెత్తి విలపించాడు – "నే నెంతటి తపస్సు గావించాను. ఎంత బ్రహ్మాండముగా ప్రయత్నించాను! విష్ణుమూర్తికి నా పట్ల ఎంత కాఠిన్యం!" తర్వాత భక్తుని గూడ తిరిగి కలుసుకుని చెప్పాడు: "నేను నీకే శుభవార్తను మోసుకురాలేదు. నీవు లక్ష జన్మల పిమ్మట మాత్రమే ప్రభువును దర్శించుతావు". కాని ఆ భక్తుడు పారవశ్యంతో గూడిన పెద్ద కేకతో ఎగిరి గంతువేశాడు – "ఓ, నేను నా హరిని చూస్తాను, ఒక లక్ష జన్మల తర్వాత చూస్తాను! భగవదనుగ్రహం ఎంత గొప్పది!" అని పలికి, నూతన హర్షపారవశ్యంతో పాడాడు, ఆడాడు. అపుడు నారదుడు నిజం

చెప్పాడు – "నీవు చేరుకున్నావు నీ ప్రభువును, నేడే ఆయనను దర్శించుతావు". దీనిని విని నీవిలా అనవచ్చు – "బాగుంది, కాని ఇది ఎంత అతిశయంతో కూడిన కథ, మానవప్రకృతికి ఎంత విరుద్ధం!" కాని నీవు తలంచినంతగా ఇది మానవప్రకృతికి విరుద్ధం కాదు. ఈ మాట ఎలా ఉన్నా ఈ కథలో శిబిచక్రవర్తి, హరిశ్చంద్రుల కథలలోకంటె ఎక్కువ అతిశయోక్తి లేదు. అయినా నేనా భక్తుని ఆదర్శంగా చూపను. *ఏలన ఆరుజన్మల్లోనో, లక్షజన్మల్లోనోగాక, ఈ జన్మలోనే భగవదుపలబ్ధిని పొందాలని పట్టుబడతాను.* కాని ఈ కథలోని ముఖ్యాంశం అని చెప్పదలంచిన నీతిలో ఉంది. రామకృష్ణుడు ఆ కథను చెప్పినపుడు, యోగసిద్ధికి ఒక పూలబాట ఉందని ఆయనకు తెలియక పోలేదు. అంతేకాక, అదెంత మంచిమార్గమో, అంత శీఘ్రమార్గం కూడ – అని ఆయన చెప్పినట్లు కన్పించుతుంది.
(*SABCL* Vol. 23, pp. 789-90)

అనువాదం: చెలసాని నాగేశ్వరరావు ('యోగంపై లేఖలు' నుండి)

32

శ్రీరామకృష్ణుడు చెప్పిన 'వకాల్తా'

కొందరు దైవంనుండి ఆదేశం కోసం నిరీక్షిస్తూ అది లభించే వరకు ఏమీ చేయకూడదని నిశ్చయించుకొని కూర్చొంటారు. వారి ఆశ తప్పకుండా నిరాశే అవుతుంది. మరి కొందరు తాము ఆంతరంగిక ఏకాంతతను పాటిస్తూ నిజంగా దైవముఖాన్ని పరికిస్తూ ఒంటరిగా పనిచేస్తారు. భౌతిక ఏకాంతత, ధ్యాన నిమగ్నత అవసరమే కాని అవి కేవలం అనుషంగికాలు. సాధనా రూపంగా దైవసమర్పణ భావంతో తొలుత ఫలితాలను పరిగణించకుండా, పిదప కర్మలతో అనుబంధం లేకుండ వ్యవహరించడమన్నది తప్పనిసరి నిబంధన. శ్రద్ధతోను, విశ్వాసంతోను ఏ పని చేసినా అది దైవనిమిత్తమనే వారు, దైవదత్తమని కూడా భావిం

చాలి. అందు దోషాలు ఉండవచ్చు. పొరపాట్లు దొర్లవచ్చు. కాని మనం భయపడవలసిన అవసరం ఎంతమాత్రం లేదు. అది వీర మార్గం – వీరులు అనుసరించిన మార్గం.

మనం మన స్వశక్తి మీద మాత్రమే ఆధారపడినంత వరకు తప్పులు జరుగుతూనే ఉంటాయి. అదే ఆయన దగ్గర నుంచి వస్తే ఆ లోపాలను సవరించుకోవాడానికి తగిన బలం సమకూరుతుంది. రామకృష్ణుడు ఎప్పుడూ చెబుతూ వచ్చిన వకాల్తా యిదే!

ఒక జాతి కూడా అలాగే తప్పులు చేస్తూ, పొరపాట్లు సవరించుకొంటూ, పాపాలను పరిత్యజిస్తూ ముందుకు సాగిపోతుంది. పనిలోని తప్పులూ, పాపాలు, విపత్తులు, అపజయాలు దుష్కర్మ అవశేషాలే! ఒకసారి ఆమె పేరు తన పెదాలపై పడిందా యిక దివ్యమాత పరిత్యజించదు. అనవసరంగానైనా, వ్యతిరేకంగానైనా, అనుకోకుండానైనా ఆ పేరును గ్రహిస్తే చాలు ఆమె రక్షణ లభిస్తుంది. హృదయపూర్వకమైన సాధనకు పునాది పడితే మాత్రం మరింత ప్రయోజనం సమకూరుతుంది.

(*SABCL* Vol. 2, pp. 431-32)

అనువాదం: డా॥ అల్లూరి వేంకట నరసింహారాజు

The going forth of Vivekananda, marked out by the Master as the heroic soul destined to take the world between his two hands and change it, was the first visible sign to the world that India was awake not only to survive but to conquer.

Sri Aurobindo

32

మార్జాల కిశోర న్యాయము

నువ్వు నిజంగా దేవుడు కావాలనుకుంటే ఆయనే అంత బాధ్య తను వహించి నీ హృదయాన్ని పరిశుద్ధము గావిస్తాడు, నీ సాధ నను వేగిరపరచి అవసరమైన అనుభూతుల నిస్తాడు. దేవుణ్ణి నమ్ముకొని ఆయనకు నిన్ను నీవు సమర్పించుకోవటము వల ననే అది సాధ్యమౌతుంది. కాని అలా జరగాలంటే నీవు కేవలం నీ స్వశక్తిమీద ఆధారపడకూడదు. పూర్తిగా దేవుడి మీదనే ఆధారపడి ఆయనను నమ్ముకుంటూ అధికాధికంగా సమర్పణను కొనసాగించాలి. నేనవలంబించిన పద్ధతి కూడ అదే. నా దృష్టిలో యోగానికి ఇదే ముఖ్యమైన పద్ధతి. పిల్లికూనను తల్లి ఎలా పట్టు కొని మోస్తుందో, పూర్తిగా తల్లిమీదనే ఎలా ఆధారపడుతుందో సాధకుడుకూడ పూర్తిగా దేవుని మీదనే ఆధారపడాలని రామ కృష్ణుడు చెప్పిన కథలోని భావమిదే అనుకుంటాను. కాని అందరూ అలా చేయలేరు. *ఆ స్థాయికి చేరేందుకు కొంతకాలం పడుతుంది. మనోప్రాణికములు చేసే గోల సద్దుమణిగి అవి కుదుటపడ్డప్పుడుగాని అది సాధ్యపడదు.*

మనోప్రాణికములను అంతరంగికంగా సమర్పించుకొనుట – దీనినే నేను సమర్పణ అంటాను.

అంతరంగిక సమర్పణలోని ముఖ్యాంశము దైవమును విశ్వ సించి ఆయనను నమ్ముకొనుటయే – The core of the inner surrender is trust and confidence in the Divine.

(*SABCL* Vol. 23, pp. 586-87)

అనువాదం: డా॥ ఆర్. ఎల్. ఎన్. శాస్త్రి

34

ఆత్మవిశ్వాసం తప్ప అహంకారం కాదు

(సాధన – శోధన)

సాధకుని చేతన విస్తరించి అతనికి దివ్యానుభూతులు కలిగినప్పుడు, అతడు సహజంగానే సాధుశీలి, వినయసంపన్నుడు అవుతాడు. అప్పుడు ఒక విధమైన 'ఇగో' – ఆధిక్యతాభావం ఏర్పడక తప్పదు. శ్రీరామకృష్ణ పరమహంస శిష్యుల్లో నాగమహాశయునివంటి వారి విషయంలో ఆధ్యాత్మికానుభూతి వినయశీలాన్ని మరింతగా పెంపొందించింది. వివేకానందునివంటి ఇతరుల విషయంలో అది మనోధైర్యాన్ని, ఆధిక్యతాభావననీ కలిగించింది. అందుకే ఆయన పాశ్చాత్యులనుంచి తీవ్రవిమర్శలకు గురయ్యాడు. ఆధ్యాత్మికానుభూతివల్ల నాటికాలంలో ఆధిక్యతాభావం, దైవవిధేయతా స్థిరపడిన సాధకులు ఎందరో ఉన్నారు. ఈ స్థితులన్నింటిలో దేని విలువ దానికే వుంటుంది. వివేకానందుని విషయమే తీసుకొంటే ఆయన ఒక మద్రాసు పండితునకు చెప్పిన సమాధానం ఎంతో ప్రసిద్ధమైనది. ఒకసారి స్వామి వివేకానంద మాట్లాడుతుంటే ఒక పండితుడు అడ్డుపడి "శంకర భగవత్పాదులవారు అలా చెప్పలేదే?" అన్నాడు. వెంటనే స్వామి సందేహించకుండా "శంకరులు చెప్పకపోవచ్చు – నేను – వివేకానందను చెబుతున్నా" అన్నాడు. ఆ పండితుడు అంతటితో అవాక్కయ్యాడు. సామాన్యదృష్టికి స్వామి చెప్పిన "నేను, వివేకానందను" అన్న మాటలు హిమాలయమంతటి ఆత్మవిశ్వాసపు అహంకారంగా అనిపించవచ్చు. కాని, వివేకానందుని ఆధ్యాత్మిక సాధనలో దోషంకాని, కాపట్యంకాని ఎంతమాత్రమూ లేవు. అసలు చెప్పాల్సివస్తే అది అహంకారమే కాదు. ఒక మహత్తర వారసత్వానికి ప్రతినిధిగ, ఎవ్వరైనా తనను కించపరచినా, అవమానించినా సహించలేని ఒక విధమైన సమర్పణభావంతో కూడిన న్యాయమే ఆయన మాటల్లో కనిపిస్తుంది. అయితే అహంకారరాహిత్యం, ఆధ్యాత్మిక వినయం అనవసరమని కాదు. ఏది ఆత్మవిశ్వాసమో, ఏది అహం

కారమో తేల్చిచెప్పడం పైకి అనుకొన్నంత సులువు కాదని నా భావన. ఉదాహరణకు - నేను నా ఆధ్యాత్మిక అనుభూతులు వ్యక్తపరచవలసివస్తే, నేనా పనిని ఎంతో ఆర్జవంతో చేయాల్సి వుంటుంది. నేను వాటిని రాసుకోవాలి. వాటి భావం, ఆలోచనలు, అనుభూతులు, వాటిని అనుసరించి సాగే చేతనావిస్తరణలను గురించి కూడా వివరించాల్సి వుంటుంది. సమస్త విశ్వాన్ని లోపల దర్శించే అనుభూతితోగాని, అంతరాలతో ప్రవహించే దివ్యశక్తితోగాని, సంశయాత్మకులకు అతీతంగా వుండే నిశ్చయాత్మ విశ్వాసంతోగాని, దైవత్వంతో సిద్ధించే అద్వైతానుభూతితోగాని పోల్చినప్పుడు కనిపించే మానవమేధ, మానవజీవితము ఏపాటివి? అయినా వాటిని (ఆ దివ్యానుభూతులను) వివరించేటప్పుడు 'నేను' అనే పదము వాడకతప్పదు గదా! నేను మాయావాదిని కాను గానీ, 'నేను' అనే పదానికి 'ఈ శరీరం' అనో, 'ఈ అవతారం' అనో చెప్పి తప్పించుకోనూ లేను. కాబట్టి నా రాతల్లో నేను ఇతరులు నాకు గర్వమనీ, అహంకారమని భావించకుండా తప్పించుకోగలుగుతానా? అది ఎంతో కష్టమనే నాకు అనిపిస్తోంది.
(SABCL Vol. 24, pp. 1388-89)

అనువాదం: డా॥ ద్వా. నా. శాస్త్రి

35

యోగము - పరిణామ వాదము

జీవితము, యోగము, ఈ రెంటినీ సమ్యగ్దృష్టితో పరిశీలింతుమేని, లక్షితముగానో అలక్షితముగానో జీవితమంతయూ యోగమే అని చెప్పవలసియుండును. ఏలయన, మానవసత్త యందలి గర్భిత శక్తుల నభివ్యక్తమొనర్చి, మానవునియందునూ, విశ్వమందునూ పాక్షికముగా అభివ్యక్తమైయున్న సర్వగత, సర్వాతీత తత్వముతో మానవవ్యక్తిని ఐక్యము కూర్చుటద్వారా ఆత్మసంసిద్ధికై క్రమ నిబద్ధమైన పద్ధతి ప్రకారము జరుపబడు ప్రయత్నమునే కదా మనము యోగమని పేర్కొనుచున్నాము. కాని, జీవితమును దాని

బాహ్యారూపముల నతిక్రమించి లోతుగా పరిశీలించి చూతుమేని, జీవితమంతయూ ప్రకృతి కొనసాగించు నొక మహాయోగమే యని చెప్పవలసియుండును. తన గర్భితశక్తుల నంతకంత కధికాధిక ముగా అభివ్యక్త మొనర్చుకొనుటద్వారా ఆత్మసంసిద్ధి గాంచి, తన నిజతత్వమైన దివ్యత్వముతో తానైక్యము పొందుటకై ప్రకృతి కొనసాగించుచున్న ప్రయత్నమిది.

మానవుడామె మంత. అతని యందామె యీ పృథ్వీపై తొలుదొల్తగా నీ మహనీయ ప్రయోజన మధికతర జవసత్వము లతో నెరవేరుటకై ఎరుకతో సంకల్పపూర్వకముగా జరుగదగు కృషికి సాధనసంపత్తిని సమకూర్చుకొన్నది. వివేకానందస్వామి నుడివినట్లు, *స్వపరిణామమును ఒకే జీవితకాలములోగాని, ఒకే జీవితకాలపు కొలది సంవత్సరములలోనో, నెలలలోనో గాని కుదింపజేయుట కనువైన సాధనమే యోగమని చెప్పనొప్పును.* (*SABCL* Vol. 20, p. 2)

అనువాదం: కమలాకర వేంకటరావు ('యోగసమన్వయను' నుండి)

ముత్యపు చిప్పలు

మనిషి ముత్యపు చిప్పలా ఉండాలి. భారతదేశంలో ఒక చక్కటి పిట్టకథ ఉంది. స్వాతి నక్షత్రం వెలిసిన సమయంలో వర్షం కురిసి ఒక చినుకు ఆలిచిప్పలో పడినట్లయితే ఆ చినుకు ముత్యమవు తుందిట. ఆలిచిప్పలకు ఈ విషయం తెలుసు కాబట్టి స్వాతి నక్షత్రం వెలిసేనాటికి అవి సముద్రం పైకి వచ్చి ఆ అమూల్యా మైన వర్షపు చినుకుకై వేచి ఉంటాయి. చినుకు వాటిలో పడిన వెంటనే చిప్పలను మూసుకొని సముద్రపు అట్టడుగుకు వెళ్లిపో తాయి. అక్కడ నిదానంగా ఆ చినుకును పొదిగి ముత్యంగా రూపొందిస్తాయి. మనిషి కూడ అలాగే ఉండాలి. ఏ విషయా న్నైనా సరే, ముందు వినాలి. తరువాత అర్థం చేసుకోవాలి, అటు పిమ్మట మనస్సును ఎట్టి బాహ్యప్రభావాలకు లోను కానివ్వక,

దాని మీదనే లగ్నం జేసి, అంతరంగంలో ఉన్న సత్యాన్ని ఆవిష్కరింప జేయడానికి కంకణం కట్టాలి. కాని యిందులో ఓ ప్రమాదమున్నది. ఇప్పుడు ఇది, అప్పుడు అది అంటూ కేవలం కొత్తదనానికి ఆకర్షితుడవై, దీనికన్న వినూత్నమైన వేరొక విషయం తటస్థపడితే, దాని కోసం వెంపరలాడటం – ఇలా చేస్తూపోతే నీ శక్తిసామర్థ్యాలను వృథాపరచడమే అవుతుంది. ఏదైనా ఒక పనిని చేపట్టినప్పుడు దాని అంతుచూడాలి. మధ్యలో ఆగిపోకూడదు. ఎవరయితే ఒక ఆశయంపట్ల ఉన్మాదభరిత ఆసక్తితో అంకితం అవుతారో వారే వెలుగు చూడగలుగుతారు. ఇక్కడో పని, అక్కడో పని చేపట్టి, అన్నింటిని అర్ధంతరంగా వదలివేసేవారు దేనినీ సాధించలేరు. క్షణికంగా ఉత్తేజితులవడంతోనే వారి ఉద్వేగం అంతమవుతుంది. ప్రకృతి చేతిలో కీలుబొమ్మలవడం తప్ప, ఆలోచనలను అధిగమించి ముందుకు సాగలేరు.

ఎవ్వరైతే యోగులు కావాలని మనసారా కోరుకుంటారో, వారు ఇట్టి కప్పగంతుల తంతుకు స్వస్తి చెప్పాలి. *ఒక ఆశయాన్ని చేపడితే, ఆ ఆశయమే వారి జీవితపరమావధి కావాలి. దానిని గురించే ఆలోచించాలి. కలలు గనాలి, జీవించాలి. మెదడు, కండరాలు, నరాలు, ఒకటేమిటి, శరీరంలోని ప్రత్యణువు ఆ ఆశయంతోనే నిండిపోవాలి.* ఇతరమైన ఆలోచనల నన్నింటిని పూర్తిగ వదలివేయాలి. విజయసాధనకు ఇదియే మార్గము.

మూలం: స్వామి వివేకానంద

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, చేకూరు జానకి

అనుబంధము:

నూటపది ఏళ్లనాటి కథ

షికాగోలో 11, 15, 19, 20, 26, 27 సెప్టెంబరు 1893 తేదీలలో జరిగిన విశ్వమత మహాసభలలో శ్రీ వివేకానందుడు చేసిన ఉపన్యాసముల నుండి:

మొదటిరోజు వారు చేసిన మహోపన్యాసము

అమెరికా సోదర సోదరీమణులారా,

మాకు మీ రొసగిన మనఃపూర్వకమైన స్వాగతమును పురస్కరించుకొని యీ సమయమున మీతో ముచ్చటించుట నాకు బ్రహ్మానందదాయకము. ప్రపంచమందలి అత్యంత ప్రాచీన యతి సంప్రదాయము పేర మీకు నా యభివందనములు. సమస్త మతములకును, సమస్తధర్మములకును దల్లి యనదగు సనాతన ధర్మము పేర మీకు నా యభివందనములు. నానాజాతులతో, నానాసంప్రదాయములతో గూడిన భారత జనసహస్రముల పేర మీకు నా యభివందనములు.

సహనభావమును వివిధ దేశీయులకు దెలిపిన ఘనతయు, గౌరవమును నతిదూర దేశీయులగు ప్రాచ్యులకు జెల్లునను టెంతయు సమంజసమని తత్ప్రతినిధులను గూర్చి ఈ సభావేదిక నుండి మీకు దెలిపిన వక్తలకును నా యభివందనములు. సహనమును సర్వమతసత్యత్వమును లోకమునకు బోధించిన సనాతన ధర్మము నా ధర్మమని గర్వించుచున్నాను. సర్వమతసహనమునే గాక, సర్వమతములును సత్యములని మేము నమ్మెదము. సమస్తమత సమస్త దేశముల నుండియు పరిపీడితులై, శరణాగతులై వచ్చిన వారలకు శరణ్యమైన దేశము నా దేశమని గర్వించుచున్నాను. రోమక క్రౌర్యమునకు గుఱియై తమ దేవాలయము తుత్తునియలైన యేటనే దక్షిణభారతదేశమునకు వచ్చి, శరణుపొందిన యూదులను – నిజమైన యూదులనదగు వారిలో శేషించిన వారిని – మా కౌగిట జేర్చుకొంటిమని తెలుప గర్వించుచున్నాను.

మహాజొరాస్టరీయ సంఘమున శేషించిన వారలకు శరణొసంగి, నేటికిని వారల నాదరించుచున్న (సనాతన) ధర్మము నా ధర్మమని గర్వించుచున్నాను. సోదరులారా, అతిబాల్యము నుండియూ పారాయణమొనర్చుచుంటినని నాకు జ్ఞప్తిలోనున్న యొక స్తోత్రమునుండి – ప్రతిదినము కోట్లకొలది మానవులచే పారాయణమొనర్పబడు నొక స్తోత్రమునుండి – కొన్ని చరణములను క్రోడీకరింతును:

"వివిధ ప్రదేశములలో బుట్టిన నదులు, సముద్రమున సంగమించునట్లే వివిధారాధన మార్గములు వక్రములై గన్పట్టినను అవక్రములై గన్పట్టినను సర్వేశ్వరా, నిన్నే ప్రాపింపజేయుచున్నవి."

"ఎవరు ఏ రూపమున నన్ను గ్రహింతురో నేను వారినట్లే యనుగ్రహించుచున్నాను. ఎల్లవారును సమస్త మార్గములచేతను తుదకు నన్నే ప్రాప్తించుచున్నారు."

అని గీతలో తెలుపబడిన యద్భుత సిద్ధాంతమును ప్రపచమున నింతవరకు జరిగిన మహోత్కృష్ట సమావేశములలో నొకటగు ఈ మతమహాసభయే సమర్థించుచు, ముక్తకంఠమున లోకమునకు జాటుచున్నదని చెప్పనొప్పును. శాఖాభిమానము, స్వమత దురభిమానము తజ్జన్యమగు మూర్ఖాభినివేశనమును సుందరమైన యీ వసుంధరను చిరకాలము నుండియు నాక్రమించియున్నవి. భూమిని అయ్యవి దౌర్జన్యమయ మొనర్చి, యనేక పర్యాయములు మానవరక్తసిక్తము గావించినవి. నాగరికతను నాశనమొనర్చి, సంఘములను నిరాశపాలు చేసినవి. ఈ ఘోర రాక్షసులు చెలరేగియుండనిచో మానవసమాజము నేటికంటె విశేషాభివృద్ధి నొందియుండెడిది. కాని వాని యవసాన సమయమాసన్నమైనది. ఈ మహాసభా గౌరవార్థము నేటి యుదయము మ్రోగింపబడిన గంట సర్వవిధములైన స్వమత దురభిమానమునకు పరమతద్వేషమునకును – కత్తిచే గానిండు, కలముచే గానిండు సాగింపబడు – సర్వవిధములైన హింసకును మాత్రమే గాక, ఒకే గమ్యమును బ్రాపింపబోవు జనుల కొండొరులయం

దలి నిష్ఠుర ద్వేషభావములకును శాంతిపాఠము కాగలదని మనః పూర్వకముగా ఆశించుచున్నాను.

అంతిమ సమావేశము నందలి యుపన్యాసము

విత్తనము నేలలో నాటబడినది; మన్ను, గాలి, నీరును దానిని చుట్టువారి యున్నవి. ఆ విత్తనము మన్నగునా! గాలి యగునా, లేక నీరగునా! ఏదియు గాదు. అది మొక్కయగును – ఆత్మ వికాసనియమము ననుసరించి యభివృద్ధి నొందుచు. గాలి, మన్నును, నీటిని జీర్ణించుకొని వానిని వృక్షతత్త్వముగా మార్చుచు, మొక్కగా పరిణమించును.

మతవిషయము – ధర్మవిషయము – కూడ నిట్టిదే. క్రైస్తవుడు హిందువుడుగాని, బౌద్ధుడుగాని కానక్కర లేదు. మఱియు హిందువుడుగాని, బౌద్ధుడుగాని క్రైస్తవుడు గానక్కర లేదు. కాని ప్రతివ్యక్తియు ఇతరుల భావములను – ఇతర మతసారమును – గ్రహించుచుండియు స్వీయవ్యక్తిత్వమును నిలుపుకొని, స్వీయ వికాస నియమానుసారము అభివృద్ధి నొందవలయును.

మతమహాసభ లోకమునకేమైన జాటినచో అది యిది: పూజ్యత, పవిత్రత, త్యాగము – ఇవి ప్రపంచమున ఏ మతసంస్థకును ప్రత్యేకమగు 'హక్కులు' గావనియు ప్రతిమతమును లోకోత్తర చరిత్రులగు పురుషులను స్త్రీల నుద్భవింప జేసినదనియు జాటినది. ఇట్లు విస్పష్టమై యుండ, నెవ్వరైనను తమ మత మొక్కటియే సుస్థిరముగా నిలిచి, యితర మతములన్నియు నశింపవలయునని భావించునెడల, అట్టి మందబుద్ధుల యవివేకమునకు నా హృదయాంతర్గత పరితాపమును దెలుపుచు, వారెంత ప్రతిఘటించినను, "వలయునది కలహము కాదు, సహకారము"; "అన్యమత ధ్వంసము కాదు, తదాశయగ్రహణము"; "శత్రుత్వము కాదు, శాంతియుత సమన్వయము" అని మతపతాకలపై వ్రాయబడు దినము శీఘ్రకాలముననే వచ్చితీరునని తెల్పెదను.

అనువాదం: చిరంతనానంద స్వామి

(శ్రీరామకృష్ణ మఠము, చెన్నై వారి సౌజన్యముతో)

And his call went right into the hearts of those who listened to him. People had been stirred to their depths. There was general applause and hundreds flocked round him for light and knowledge.

The message spread from country to country – the message of hope and light amidst the encircling gloom, the message of love and compassion pledged to defeat hatred, intolerance and narrowness, the message that bore the imprint of eternal life.

సమాచార పత్రం

శ్రీఅరవింద సొసైటి Annual General Meeting కలకత్తాలోని రిజిస్టర్డు ఆఫీసులో 18 అక్టోబరు 2003 న జరుపబడును. దీని నోటిసు 63 పేజీలో చూడండి.

నవంబరు, డిసెంబరు 2003 మాసములలో ఆశ్రమం, సొసైటి కార్యక్రమముల వివరాలు

17 నవంబరు: శ్రీమాత మహాసమాధి రోజు. శ్రీమాత మందిర దర్శనము ఆశ్రమము వారిచే నిర్వహించబడును.


20 నవంబరు: శ్రీమాత భౌతికకాయము సమాధిచేసిన రోజు.

21-23 నవంబరు: శ్రీఅరవింద సొసైటీ స్త్రీల విభాగము వారు బీచ్చాఫీసులో "Integral Progress" అనే విషయంపై ఒక సదస్సును నిర్వహించెదరు. దీనికందరు ఆహ్వానితులే.

24 నవంబరు: సిద్ధి దినము వార్షికోత్సవము – ఆశ్రమంలోని నాలుగు దర్శనదినములలో ఒకటి.

26 నవంబరు – 4 డిసెంబరు: డా॥ మంగేష్ నడ్కర్ణిగారు శ్రీఅరవిందుల 'గీతా వ్యాసములు' పై ఉపన్యాసములు ఇచ్చెదరు. దీనికందరు ఆహ్వానితులే.

9/10/2003.



ఈ సంచికలో

అఖిల

అఖిల భారత పత్రిక అక్టోబరు 2003

విషయసూచిక

9/10/2003

నిత్యజీవితంలో మనమవలంబించవలసిన వైఖరి

శ్రీమాత వాద్యసంగీతం

వందేమాతరం

సాధన

వస్తువులు మన బంధువులు

రాయి రప్ప, కొండ కోనలన్నిట్లోను చైతన్యముంటుంది. కుర్చీ, బల్ల మొ॥ వాటన్నిట్లోను జీవం కళకళలాడుతూ వుంటుంది. అందుకని మనం వాడుకుండే వస్తువు లన్నిటిని ఎంతో శ్రద్ధగా చూడాలి. వాటిని పరామర్శిస్తూండాలి. వాటితో మనం ముచ్చ టించవచ్చు. అప్పుడవి కూడ అనుకూలంగా స్పందిస్తాయి. మనతో సహకరిస్తాయి. — సంపాదకుడు

నువ్వు చెప్పిన మాట నిజమే. వస్తువులకు నీలాంటి తెలివితేటలు లేకపోవచ్చు. కాని వాటికి కూడ చైతన్యముంటుంది (consciousness). అవి సజీవములు. వాటి చైతన్యము జంతువులకు, మనుమ లకు వుండేలాంటిది కాకపోవచ్చు — అది నిగూఢము, సత్యము. అందుకనే మనము వస్తువులపట్ల మర్యాదగా వ్యవహరించాలి. వాటిని ఇష్టమొచ్చినట్లు విసిరివేయకూడదు. సున్నితంగా వుప యోగించాలి. నీ భౌతికచైతన్యాన్ని విశాలపరచి సర్వభూతముల లోను నివసిస్తున్న ఏకమాత్రసత్తను (సర్వభూతాత్మకే) దర్శించి నప్పుడు నీకది తేటతెల్లమవుతుంది.

*

రాయిరప్పాలాంటి జడవస్తువులు అచేతనములు కావు. నువ్వు వాటితో ముచ్చటించవచ్చు. కారు, ఇల్లు, కుర్చీలు, బల్లలు మొ॥ వాటన్నిటికి మనుషులవలెనే ఒక ప్రత్యేకమైన వ్యక్తిత్వముం టుంది. ప్రతి వస్తువులోను ఒక 'మూర్తి' దాగివుంటుందని మన పూర్వీకులు కనిపెట్టారు.

*

సరుకులను వృథా చేయటం, వస్తువులను ధ్వంసం చేయటము, దుబారా ఖర్చు పనికి రావు. అది తామసిక మూర్ఖత్వము. అటు వంటి బుద్ధులుంటే ధనశక్తి నిలవదు — పారిపోతుంది!

*

భౌతికవస్తువులపట్ల చిన్నచూపు పనికిరాదు. మన శరీరము పంచభూతాత్మకమే కదా – భౌతికపదార్థం లేనిదే సృష్టి లేదు!

(*SABCL* Vol. 23, pp. 716-17)

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

సామూహిక కర్మల నిర్వహణ

పదిమంది కలిసి పనిచేస్తున్నప్పుడు ఎవరికి వారు 'నేను గొప్పంటే నేను గొప్ప' అని అనుకుంటే కుదరదు. ఇది నీ స్వంతవ్యవహారం కాదు. దైవకార్యం. ఇతరులు నీతో ఏకీభవించకపోవచ్చు. నువ్వు వాళ్ల దృక్పథాన్ని కూడ చూసి అర్థం చేసుకున్నట్లయితే పని నిర్విఘ్నంగా సాగిపోతుంది.

– సంపాదకుడు

నీ మాటకి ఎవరైనా అడ్డుతగిలినా, ఏమాత్రం హెచ్చుతగ్గైనా నువ్వు భరించలేవు. ఎందుకని? అది నీ స్వభావము, ప్రాణిక ప్రకృతి. The difficulty arises from a certain sensitiveness in the vital nature. అది సామూహిక కార్యమన్న సంగతి మరచిపోయి, వ్యక్తిగతంగా నీకెవరో అడ్డు తగుల్తున్నారని అనుకోకూడదు. ఒక వేళ అవతలి వాళ్లు కూడా అలాగే అనుకున్నారనుకో. అప్పుడేమవుతుంది. పరుషవాక్యాలు, పరస్పర నిందారోపణలు, ఘర్షణ. అందుకని నువ్వు వ్యక్తి ప్రసక్తి లేకుండా ఇతరుల దృక్కోణములతోను, విశాలదృష్టితోను, యోగచైతన్యంతోను చూడాలి. అప్పుడు ఇతరులతో ఘర్షణపడే అవకాశముండదు. ఒక వేళ వున్నా అది వాళ్ల తప్పే కనక దాని పర్యవసానమునకు వాళ్లే బాధ్యులవుతారు, అనుభవిస్తారు. ఇటువంటి సందర్భాలలోనే చేతనలో మార్పు రావలసిన అవసరం కనబడుతుంది. విశ్వాసము, విధేయత, సామర్థ్యము, బుద్ధి, నిష్ఠ ఇంకా పనిలో వుండవలసిన ముఖ్యలక్షణాలు నీలో మెండుగా వున్నాయి. పూర్తి ప్రశాంతత, సమత్వం అంతరంగంలో వుండాలి. అవి నీలో అది వరకే

వున్నా, వాటిని నీ బాహ్యశరీరంలో, నరనరాలలో కూడా పూర్తిగా పొందగలగాలి.

*

వైరానికి దారితీసే లోపాలు ఎప్పుడూ ఇద్దరిలోను వుంటాయి. నీ సంగతే తీసుకుందాం. *ఇతరులను గురించి చాలా నిష్కర్షగా తప్పొప్పుల న్యాయనిర్ణయం చేసే తత్వం, ఇతరుల దోషాలను, లోపాలను, బలహీనతలను చూడటంలోను, పెద్దగా ఎత్తి చూపటంలోను ఉత్సుకత, అంతేకాక వారిలోని ఏమాత్రపు మంచిని చూడలేనితనం కనపడుతుంది.* ఇది ఉండవలసిన దయాదృష్టిని అడ్డగించడమేకాక, కర్కశుడు, నిష్కర్షగా అభిప్రాయాలు వెలిబుచ్చేవాడనే అభిప్రాయాన్ని కలుగజేస్తుంది. అది ఇతరులలో వ్యతిరేకత, తిరుగుబాటును సృష్టిస్తుంది. వారి మనస్సులలో లేకపోయినా, అది వారి అవచేతన ద్వారా పనిచేసి, వారిలో ఇటువంటి వైషమ్యాన్ని కల్గిస్తుంది. ఇతరులలోని మంచితనాన్ని అదనుగా తీసుకుని, ఎప్పుడూ దాని మీదనే దృష్టి నిలిపి, వారి తప్పులతో, దోషాలతో, లోపాలతో చాకచక్యంగా మెలగడమే మంచిమార్గం. దీనివలన దృఢత్వాన్ని కోల్పోవలసిరావడం, నియమావళిని త్రోసిరాజనడం జరగనక్కరలేదు. కఠోరంగా వుండవలసిన చోట కఠోరంగా వుండవలసిందే. కాని కఠోరంగా వుండటమనేది చాలా అరుదుగా వుండాలే కాని, అదే నీ స్వభావమనే అభిప్రాయం ఇతరులకు కలగకూడదు.

*

పనిలో దక్షత, క్రమశిక్షణ అనేవి ఆవశ్యకమైనవి. పనిలో అవి కావలసినవే. ఏమయినా వాటిని బాహ్యపరిస్థితులతో కొంతవరకే సాధించగలుగుతాం. సాధారణ జీవితంలో అది ఖచ్చితంగా ఉన్నతాధికారి వ్యక్తిత్వం మీద, అతను తన క్రింద పనిచేసేవారి మీద చూపే ప్రభావం, అతని దృఢత్వం, వారితో మెలిగేటప్పుడు చూపే చాకచక్యం, దయాగుణం మీద ఆధారపడి వుంటుంది. *కాని సాధకుడు మాత్రం అంతరంగలోతులలోని శక్తి మీద,*

అతని అంతరంగ చైతన్యం, ఇంకా అతని ద్వారా పనిచేసే శక్తిమీద ఆధారపడి ఉంటాడు.

(*SABCL* Vol. 23, pp. 708-10)

అనువాదం: డా॥ టి. ప్రసన్న కృష్ణ

'నేను వేరు' అనే భ్రమ

మూలపదార్థం అణువణువులుగా చీలిపోయి భౌతికరూపములను దాల్చినది. పంచభూతాదు లావిర్భవించినవి. కాని అంతమాత్రాన తద్రూపములు మూలమును మరచిపోలేదు. ఈ విశ్వము, తదంగములు తమకంటె వేరుకాదని, తమవే ననే భావము వాటిలో ఎక్కడో దాగివున్నది. చెల్లాచెదరైపోయిన వాటి కృత్స్నరూపమును తిరిగిపొందాలి. కాని అదెలా సాధ్యము అనేదే ప్రశ్న. మనిషి అమాయకంగా తన శాయశక్తులతో పొందాలని చూస్తాడు. కాని అది సరి కాదు. భూమినంతా నువ్వు కొనలేవు కదా! ఆత్మజ్ఞానమును పొందినప్పుడు నువ్వు-నేను, నీది-నాది అనే భావము నశించి అంతా ఒకే ఒక మహాస్వరూపమనే స్ఫూర్తి కలుగుతుంది. — *అనువాదకుడు*

మన దేహము పాంచభౌతికము, ధాతుబద్ధము. కాని ఈ భౌతికము దోషభూయిష్టము. అందుకని మనము కూడ ఈ దోషములను తప్పించుకొనలేము. అంతరంగంలో నువ్వు గొప్ప సిద్ధులనే పొంది యుండవచ్చును, యథార్థజ్ఞానముతోను, మహాచైతన్యముతో ప్రకాశించవచ్చును. కాని ఏం లాభం? బాహ్యావ్యక్తి మట్టుకు శాపగ్రస్తము. అయితే దేహధారణములోని ఉద్దేశము ఈ ప్రతిబంధకములను అధిగమించి భౌతికపదార్థమును కూడ వుద్దీపింపజేయుటయే (Transformation of matter). మనకు ఈ ఆటంకము ఎదురైనప్పుడు ఆశ్చర్యపడనవసరము లేదు, అయ్యో ఏం దారి అని దుఃఖించనూ కూడదు.

ఈ దుస్థితికి కారణాలు రెండు స్థాయిలలో వుంటాయి. ఒకటి సర్వసాధారణమైనది కాగా, రెండవది వైయక్తికము. భౌతిక పదార్థము (తన ద్వారా బహిరాభివ్యక్తమగుటకు ప్రయత్నించే) సూక్ష్మశక్తులను గ్రహించలేకపోవుట మొదటి కారణము. ఇందుకు కారణములనేకములు. తరచి చూసినట్లయితే దాని అసలు కారణము తెలుస్తుంది. ప్రతియొక్క వ్యక్తి అవిచ్ఛిన్నమైన తన మూల స్వరూపమును విస్మరించి తన చుట్టూ ఓ గిరిగీసుకొని తాను వేరనుకొనుటయే – **all difficulties lie in the illusion of personality.**

అసలీ ప్రపంచ నిర్మాణంలో వేర్పాటుభావమెందుకు వచ్చింది? ఈ సమస్యను భూలోకమునకు, మానవులకు సంబంధించినంతవరకు మనం విచారించెదము. 'నేను వేరు' అనే భావము రెండు దోషములకు దారితీస్తుంది.

ఎప్పుడైతే 'నేను వేరు' అనే భావము కలిగిందో అప్పుడు సమస్తమును సొంతం చేసుకోవాలనే కోరిక మొలకెత్తుతుంది. ఈ భూమ్మీదవున్న సమస్త వస్తువులను సొంతం చేసుకొని నువ్వే వాటికి యజమాని కావాలి. ఈ కారణంవల్లనే మనిషి తన బుద్ధిబలాన్నంతా వుపయోగించి, సకల వస్తువులను కూడ పెట్టుకొని తను పెరగాలని ప్రయత్నిస్తాడు.

ఈ భావము వెనుకనున్న ఉద్దేశం మంచిదే – తన చేతనను విస్తరించి సమస్తభూతములను తన చేతనలో ఆకట్టుకొనుట. అంతేకాని ఈ భూమ్మీద వస్తుజాలమునంతను బాహ్యముగా తన సొంతము చేసుకొనుటయని కాదు.

ఈ కారణమే మరో వైపరీత్యానికి దారితీస్తుంది. అది విశాలత్వములేని సంకుచితస్వభావము (an excessively conservative spirit, a fixity of the whole nature) నీ బుద్ధి నీ చుట్టూ ప్రదక్షిణము చేస్తూ వుంటుంది. నీ నైతికబుద్ధి, భౌతికప్రకృతి కూడ అదే విధమైన సంకుచితత్వమునే భజించును. మనిషికి ఒక సంగతి తెలియకపోవటంవలనే అలా చేస్తాడు. విశ్వమంతా నిరంతరాభివృద్ధి చెందుతూ ప్రవర్ధమానమై ముందుకు సాగిపోతూ వుంటుంది. తను

చతికిలపడి కూర్చున్నా బయట ప్రపంచమంతా పరివర్తనమై పోతూ వుంటుంది. *ఈ లోకమెల్లప్పటికి శిథిలంగా ఒకే చోట కూర్చొని వుండదు. పురోగమనము ఈ సృష్టి ధర్మము. నువ్వు నీ చుట్టూ గిరి గీసుకొని కూర్చున్నతంమాత్రాన నీకోస మీ ప్రపంచ మాగిపోదు!*

మనిషి తను వేరు అనే భావముతో చేతులు కట్టుకొని కూర్చోటం మానేసి విశాల విశ్వప్రవాహంలో ప్రవేశించినప్పుడు తను కూడ శరవేగంతో ముందుకు సాగిపోతాడు. ఉన్నత సోపానములను అధిష్ఠిస్తాడు. మనిషి తమోమయ మూర్ఖత్వంతో ఒకే చోట చతికిలపడిపోకుండా యథేచ్ఛగా సమిష్టితో మార్పిడి, ఆదాన ప్రదానం (exchange) చెందుతే బాగుంటుంది.

ఈ విశాలవిశ్వంలో కొంతభాగమును నీ సొంతం చేసుకోవచ్చుననే పిచ్చినమ్మకంవలన నువ్వు నీ బుద్ధిని విశాలపరచుకో లేకపోతున్నావు. నీ శరీరములోని ధాతువులు నీ సొంతమే అనుకుని వాటినే పట్టుకొని వేళ్లాడుతూ వుంటావు. కాని నిజానికి నీలోని పదార్థము అఖండసత్తునుండి వేరుకాదు. యావత్పదార్థము నీదే కాబట్టి నువ్వా నైజాన్ని నిరూపించుకోవాలి. మరి నిన్ను నీవు ఇచ్చుకోకపోతే అదెలా సాధ్యమౌతుంది?

ఒక పెద్దగొలుసులో నువ్వు ఒక రింగు అనుకో. ఆ రింగు పెరగాలంటే మిగతా రింగులను మ్రింగటం వలన జరగదు కదా? నీ చేతనను మిగతా రింగుల కిచ్చినట్లయితే వాటి చేతన కూడ నీ కబ్బుతుంది. *ఇస్తినమ్మ వాయనం పుచ్చుకొంటినమ్మ వాయనం* అన్నమాట. *నీవెంత ఎక్కువగా, ఎంత త్వరగా ఎన్ని భూతాలకు నీ చైతన్యాన్నిస్తే నీకంత చైతన్యం తిరిగివస్తుంది. ఈ విధంగా నీకేమి అట్టేపెట్టుకోకుండా నీ సర్వస్వాన్ని వెచ్చించినట్లయితే సర్వము నీకే దక్కుతుంది.*

దీనిని గురించి మీకు వచ్చే కొన్ని సందేహాలను నేను ముందరే తీర్చేందుకు ప్రయత్నిస్తాను.

ప్రతి ఒక్కరు తాము వేరు అనుకోవటము ఒక భ్రమే కావచ్చును. అంతమాత్రాన అందరూ మూసలో పోసినట్లు ఒకే

రూపంలో వుండనక్కర్లేదు. దేవుడు ఒక్కొక్కరి ద్వారా ఒక్కొక్క రీతిలో అభివ్యక్తమౌతాడు. అది అభివ్యక్తములోని నానాత్వమే గాని, భిన్నత్వము గాదు. Differentiation does not mean division.

Why should there be so many countless links in the chain if each one did not have its own function?

ఈ విషయాన్ని మీకు విపులీకరించేందుకు మీకు మరో ఉపమానాన్ని చెపుతా వినండి. మనిషిలో అనేక జీవకణాలుంటాయి కదా. ప్రతి కణానికి దేని పని దానికుంటుంది. దేనికదే ముఖ్యం. అందుకని ఏ ఒక్క కణము స్వతంత్రించి ఆ కణసముదాయమునుండి విడిపోయి బయటకు వస్తే బ్రతకలేదు కదా!

ఈ విధమైన సామూహిక కార్యశీలతయే మనిషికి కూడ వర్తిస్తుంది. ఏ యోగాభ్యాసము అవసరం లేకుండానే ఈ విషయం సుస్పష్టంగా తెలుస్తుంది. నువ్వెంత impersonal గా నిన్ను అర్పించుకుంటే నువ్వు పోషించవలసిన ప్రత్యేక పాత్ర నీకంత స్పష్టంగా తెలియవస్తుంది.

*

It is a stage of evolution in which the being is ready for self-giving, for he is conscious of himself; but, as a result of the work of individualisation, of intellectualisation he has undergone, he has acquired the habit of considering everything in relation to himself and has carried the illusion of personality to its utmost limit.

Thus it is sometimes very difficult for him not to watch himself acting, feeling and thinking, and this results in a lack of spontaneity which verges on insincerity.

...it is indispensable to keep in mind that true impersonality does not consist only in forgetting ourselves in our acts, but above all in the fact of not being aware that we are forgetting ourselves.

In short, to be truly impersonal, we must stop noticing that we are being impersonal.

(*CWM* Vol. 2, pp. 52-58)

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

శ్రీమాత ప్రార్థన

హే ప్రభూ! జగదీశా! వందనము ప్రభూ! వందనము. కర్మ నిష్కామంగా ఆచరించగల శక్తిని ప్రసాదించు తండ్రీ! రూపాదుల మాయామోహంలో చిక్కుకొనకుండా స్వస్వరూపావిష్కరణకు శక్తిసామర్థ్యము లందించి నన్నాదరింపవే.

ఏకత్వ, సత్యదర్శనములందు, దృఢత్వము నొసంగి, అజ్ఞానాంధకారములనుండి విముక్తి నొసంగుమా.

ఓ! ప్రభూ! రూపాదులను అధిగమించుటకు అనుగ్రహింతువు గాక. ఈ ప్రక్రియ నీ నూతనావిష్కారమునకు సమర్థవంతములైన ఉపకరణములను తయారుచేయుగాక.

మాకు శీఘ్రముగా సిద్ధి ననుగ్రహించి, అందుకు నీ శక్తి యుక్తులు మా కొసంగవే.

నీ అపారకృపతో అగ్రాహ్యములైన నీ శక్తిసంపదలను వెల్లడింపవా!

భావాతీత ధ్యానావస్థలో సర్వరూపాదులు నీ దివ్యాభివ్యక్తి కొరకై ఆత్మనివేదనము గావించుకొనుచున్నవి.

(*CWM* Vol. 1, p. 183)

prayer dated June, 26, 1914.

అనువాదం: శ్రీ శరణ్

శ్రీమాత సంగీతంపై శ్రీఅరవిందుల వివరణ

యోగులేది చెప్పినా, చేసినా అది ఆధ్యాత్మిక శక్తితో తొణికిసలా డుతూ వుంటుంది. వారున్న ప్రదేశమంతా వారి శక్తితో ప్రదీప్తమై వుంటుంది. శ్రీమాత ఆర్గన్‌పై (పియానోలాంటి వాద్యవిశేషము) సంగీతాన్ని వాయించి శిష్యులకు వినిపించేవారు. అయితే అది కేవలం సంగీతమే కాదు. పైనుంచి దివ్యశక్తులను ఆహ్వానించే మాధ్యమము. కొన్ని సంగీత బాణులకు 'Concentration', 'Life in Eternity' అనే ప్రత్యేకమైన పేర్లు కూడ వున్నాయి. ఈ సంగీతంవలన పరమపవిత్రమైన వాతావరణము ఏర్పడుతుంది. కనుక శిష్యులు 'ధ్యానము' నకు సత్సంగాలకు 'మదర్స్ మ్యూజిక్' ను వాడుకుంటారు. — సంపాదకుడు

వారి సంగీతాన్ని ఆస్వాదించాలంటే సంగీతశాస్త్రము తెలియాల్సిన అవసరం లేదు. శ్రీమాత వాయించేది కూడా శాస్త్రజ్ఞానాన్ని ప్రదర్శించడానికి గాదు. కేవలం ఊర్ధ్వస్తరాలనుంచి దివ్యశక్తులను ఆహ్వానించుటకే ఆమె వాయిస్తారు. హృదయ కవాటాలను తెరిచినప్పుడు ఎవరైనా దాన్ని గ్రహించవచ్చు.

*

నీవు చెప్పినదంతా నిజమే. ఆమె వినిపించేది ప్రార్థనా గీతం కావచ్చు, శ్లోకం కావచ్చు.

*

ప్రశ్న: శ్రీమాత ఆర్గన్ వాద్యం వాయించేటప్పుడు ఉన్నతలోకాల్లోని దేవతలు దిగివచ్చి, మనకు సహాయపడతారు అన్న మాట నిజమేనా?

జవాబు: ఆమె ఇచ్ఛాపూర్వకంగా అలా చేయరు.

ప్రశ్న: అంటే ఆమె సంగీతానికి దేవతలే ఆకర్షితులై దిగివస్తారని అనుకోవచ్చా?

జవాబు: అయ్యుండవచ్చు.

ప్రశ్న: శ్రీమాత వాయించేటప్పుడు దేన్నైనా వెలుగులోకి తీసుకు వస్తారా?

జవాబు: అలా తేవడానికి కాకపోతే మరెందుకు వాయిస్తున్నట్లు?

*

శ్రీమాత సంగీతాన్ని సంగీతజ్ఞానంతో అర్థం చేసుకోలేము. తెలుసుకోవాలని పట్టుదలతో ప్రయత్నించినా సాధ్యం కాదు. అంతరంగంలో నిశ్శబ్దంగా వుండి హృదయకవాటాలను తెరిచి విన్నప్పుడు ఆ సంగీతసారం నీకు అనుభవమతుంది.

*

శ్రీమాత సంగీతాన్ని వింటూ 'క' అనే ఆయన అది భారతీయ సంగీతమేనని, ఫలానా రాగమనీ అంటూండేవారు. నిజం చెప్పాలంటే ఆమె వాయించేది ఏ ప్రాంతానికీ చెందదు. ఎప్పుడికప్పుడు తన మదిలో మెరసిన సంగీతాన్ని మాత్రమే వాయిస్తారు. భారతీయసంగీతాన్ని ఆమె నేర్చుకోనేలేదు.

*

శ్రీమాతకు పాశ్చాత్యసంగీతమంటేనే ఇష్టమనీ, భారతీయ సంగీతమంటే ఏమాత్రం అభిమానం లేదనీ నీవనటం విచిత్రంగా వుంది. పైపెచ్చు మనం బాధపడతామని భారతీయ సంగీతమంటే ఇష్టమున్నట్లు నటిస్తారా!!! నీ సంగీతాన్ని మెచ్చుకొని, నిన్ను ప్రోత్సహించిన సంగతి గుర్తుచేసుకో. అంతే కాకుండా నీ సంగీతం ఆధ్యాత్మిక పరిపూర్ణత్వం పొంది రాణించాలని తన శక్తిని కూడ నీకు మద్దతుగా ఇవ్వలేదూ? నీ కవితల విషయంలో అండగా నిలిచింది నేనే అయినా అది వేరు. శ్రీమాతకు మన భాష తెలియకపోవడంవల్ల అనువాదం మాత్రమే చదివి మెచ్చుకున్నారు. కాని నీ సంగీతాన్ని మాత్రం శ్రీమాత ఎంతో పొగిడారు. నేను రాసిన విషయాలన్ని నా అభిప్రాయమే అని నీ వనుకుని వుంటావు. సాధారణంగా మా ఇరువురి ఏకాభిప్రాయాన్ని ఆమె మాటల్లోనే నేను రాస్తుంటాను.

(*SABCL* Vol. 25, pp. 365-67)

తన సంగీతంపై శ్రీమాత వివరణ

1

ప్రశ్న: అమ్మా! ప్రతీ ఆదివారం మీరు ఎంతో చక్కగా ఆర్గన్ వాయిస్తుంటారు. అయితే ఒక్కొక్కసారి అది మరీ బాగుంటుంది.

నిజంగానా!

ప్రశ్న: ప్రతిసారీ వినసొంపుగానే వుంటుంది. కానీ కొన్నిసార్లు ఇంకా బాగుంటుంది.

కొన్నిసార్లు నీకా అనుభూతి కలుగుతుంది – కొన్నిసార్లు కలగదు. కొన్నిసార్లు ఇష్టపడతావు – కొన్నిసార్లు ఇష్టపడవు. ఒకప్పుడు నీకది అర్థమవుతుంది, ఒకప్పుడు కాదు. ఒకప్పుడు ఇంపుగా వాయిస్తాను. ఒకప్పుడు పిచ్చిగా వాయిస్తాను. (నవ్వు తారు)

ఇది అనేక విషయాలమీద ఆధారపడి ఉంటుంది. సంగీతం ద్వారా ఏవి వ్యక్తం కావాలనుకుంటున్నాయో ఆ లోకాల మీద ఎక్కువ ఆధారపడి వుంటుంది. అవి ఒక్కొక్కసారి తేలిగ్గా అందుబాటులో ఉంటాయి. కొన్ని అర్థం కావటం, గ్రహించడం కష్టమవుతుంది. ఏమైనప్పటికీ అది ముఖ్యంగా నీవుండే పరిస్థితి మీదే ఉంటుంది. నీ మూడ్ బాగుండి చక్కగా వున్నప్పుడు నీకు బాగా నచ్చుతుంది. బాగా లేనప్పుడు అర్థం కాదు. ఆ సంగీతం నిన్ను నిద్రపుచ్చిన సమయాలుంటాయి, నీకెంతో నచ్చిన రోజులుంటాయి. ఒక్కొక్కసారి అది నీలో కొత్త వెలుగులు నింపి నట్లుంటుంది. మరికొన్ని రోజుల్లో ఏమీ అర్థం కాకుండా తెలి యకుండా ఉంటుంది. అంతా నీ పరిస్థితి మీదే ఆధారపడి ఉంటుంది.

ప్రశ్న: జననీ, మీరు వాయించాలనుకున్నప్పుడు ఏ స్తరంలో నున్న సంగీతాన్ని వినిపించాలో ముందుగా నిర్ణయించుకుంటారా?

అంటే?



In 1953, the Mother resumed playing her organ, something she had not done since the end of the War. It happened in this way. Six girls decided to sing songs to her every Sunday afternoon when they went up to see her. With a delighted smile she started to accompany them on the organ in Pavitra-da's room. Often she continued playing after they had finished singing; so began what came to be called her Sunday music, which she played at mid-day. The Ashram courtyard would fill up with people and speakers were placed so that they could hear her play. This continued weekly till the end of 1958.

ప్రశ్న: ఆ సంగీతం ఎక్కడనుండి వస్తుంది?

ఉపక్రమించే ముందు ఏ రాగాలు వాయిస్తానో నాకే తెలియదు. ఏ స్తరాలనుంచీ అని అడిగితే సాధారణంగా అది ఎప్పుడూ ఒకే స్తరంనుంచే అని చెపుతాను. అది 'బెర్లియోజ్' (Berlioz) సంగీతం ఉత్పన్నమైన స్తరం నుంచి అని మాత్రం చెప్పగలను. అది నాకు బాగా తెలిసినటువంటి స్తరము. అయితే అక్కడ నుంచి ఎప్పుడు, ఏమి వెలువడుతుందో నేను చెప్పలేను. ఏ విధమైన అనుభూతిని, భావనను, ఏ చైతన్యస్థితిని వ్యక్తం చేయాలో కూడా నేను నిశ్చయించను. ముందుగా మనసులో ఏమి పెట్టుకోకుండా నిరామయస్థితిలో ఆర్గన్ వాయిద్యం దగ్గర కూర్చుంటాను. ఒకటి, రెండు నిమిషాలు ఏకాగ్రచిత్తురాలినై పైనుంచి ఆవేశాన్ని రానిస్తాను. వాయించినదేదో ఒక్కొక్కప్పుడు తర్వాత నాకు తెలుస్తుంది. మధ్యాహ్నమో, సాయంత్రమో రెండోసారి విన్నప్పుడు తెలుస్తుంది. అది నాలోనిది కాదనీ, బాహ్యంగా వచ్చిందనీ, దాని స్వరూపం అప్పుడు పూర్తిగా తెలుస్తుంది.

ప్రశ్న: దివ్యజననీ! మీరు ఏమి వాయించబోయేది ఒక రోజున చెప్పారు గదా!

నిజమే. ఆ రోజున ముందుగానే తెలిసింది. అలా ఒక్కొక్కప్పుడు జరుగుతుంది. ఒక్కొక్కసారి తెలియదు. అలా ముందు తెలిసినప్పుడు నా కనిపిస్తుంది – నా దగ్గర 200 మంది వాద్యగాళ్లుంటే అప్పుడు వచ్చిన సంగీతం వినిపించటానికి బాగుంటుందని. అది పూర్తిగా వినిపించాలంటే, అంటే అది పూర్తిగా వ్యక్తం కావటానికి అంత వాద్యబృందం కావాలి. అదంతా లేదు కాబట్టి, దాన్ని పట్టి వుంచి కొద్ది కొద్దిగా విడుదల చేయవలసి వస్తుంది. అందువల్ల అది క్షీణించిపోతుంది. అధికభాగం వెలువడే అవకాశం కూడా పోతుంది.

2

ప్రశ్న: శ్రీమాత పృథ్వీపై స్థాపింపదలచుకున్న ఉన్నతశక్తుల ప్రతిష్ఠాపనకు అవసరమైన ప్రకంపనాలు ఆమె ఆర్గన్ మీద పలికించే రాగాల ద్వారా ఉత్పన్నమవుతాయన్న విషయం నిజమేనా?

ఉన్నతమైన చైతన్యస్థాయిలో వుండేవారు చేసే పనుల్లోనూ, వారి ఆలోచనల్లోను, క్రియల్లోనూ అన్నిటిలోనూ ఊర్ధ్వ చైతన్య ప్రకంపనలు అభివ్యక్తమవుతూంటాయి. ఇవి భూమిపై ఆ వ్యక్తి ఉన్నంత మాత్రాన అభివ్యక్తమవుతాయి.

ఆశీస్సులు.

*

ప్రశ్న: మీ సంగీతంలో ఒక ప్రత్యేకమైన బాణి తరచుగా పునరుక్తమవుతూంటుంది.. దాని సంకేతార్థమేమిటి?

అది ఒక సమస్యను తొలిగించే పరిష్కార మార్గము. సాధారణంగా ఏదైనా కష్టంగానీ, గందరగోళ పరిస్థితిగానీ ఉత్పన్నమైనప్పుడు నేనా సంగీతం వినిపించడం మీరు గమనించారనుకుంటాను. ఒక్కొక్కసారి సాధనలో ఎదురయ్యే సమస్యలు, తప్పటగుడులు, గంద్రగోళ పరిస్థితులు మొ॥ అధిగమించామనుకున్నా, అవి పోయినట్టె పోయి రెట్టింపు శక్తితో మళ్లీ తిరిగి వస్తూంటాయి. దానికి సమాధానంగానూ, సహాయకరంగానూ ఉండి పురోగతికి తోడ్పడే స్వరాలను నా సంగీతంలో వాయిస్తాను. దానితో చైతన్యపు అడ్డుతెరలు విడిపోయి జ్ఞానప్రాప్తి కలుగుతుంది.

సాధారణంగా భారతీయసంగీతం వినే అలవాటున్న వారే నా సంగీతాన్ని అర్థం చేసుకోగలరేమో! భారతీయ రాగాలను పోలివున్న నా సంగీతంలోని భావాన్ని మిగతావారు అర్థం చేసుకోలేరు. ముఖ్యంగా పాశ్చాత్యులకిది అగమ్యగోచరంగానే వుంటుంది. మొత్తంమీద చూస్తే భారత సంగీతశాస్త్రానికి సంబంధించిన అన్ని సూత్రాలనూ కూడా ఇది విభేదిస్తుంది.

*

ప్రశ్న: ప్లేగ్రౌండ్‌లో ధ్యానసమయంలో మీ సంగీతాన్ని వినేటప్పుడు మేము ఏం చేయాలి?

నీలోని గాఢమైన అనుభూతులను జాగృతం చేయటమే నా సంగీతంలోని ఉద్దేశం. అందువలన ఆంతరంగిక నిశ్శబ్దత పాటించి నిర్లిప్తంగా ఉండి వినాలి. ఈ నిశ్శబ్దస్థితిలో నీలోని ఒక భాగం ఏమాత్రం ప్రతిస్పందించకుండా, పాల్గొనకుండా సాక్షీభూతంగా ఉండి గమనిస్తే, ఆ సంగీతం నీ భావోద్వేగాల మీద ఎటువంటి ప్రభావాన్ని కలుగచేస్తోందో తెలుసుకోగలవు. అది నీలో ఒక నిశ్చలతనూ, ఒక రకమైన సమాధి స్థితినీ కలుగచేస్తే అది ఎంతో మంచిది.

(*CWM* Vol. 6, pp. 383-85; Vol. 12, pp. 240-41)

3

శ్రీమాతతో మోనాసర్కార్ అనే సాధకుడు జరిపిన సంభాషణల సారాంశమే ఇది. 1960 ప్రాంతాల్లో జరిపిన ఈ సంభాషణలు ఫ్రెంచిభాషలో జరిగినవి. అది మోనాగారు ఆ రోజునే గుర్తుంచుకొని రాసి ఉంచారు. తర్వాత కూడ కొన్ని గుర్తుచేసుకొని రాశారు. ఇవి, మరికొన్ని కలిపి 'ది సుప్రీమ్' అనే పుస్తకంలో ఆశ్రమ ప్రచురణ విభాగంవారు ప్రచురించారు.

నా సంగీతం శరీరాన్ని ప్రశాంతపరచడమనేది నిజమే. ఆ సంగీతంలో నుండి ఒక ఆర్ద్రత వెలువడి వినేవాళ్లను పరివేష్టిస్తుంది. బురదనీటిలోని మట్టిని విరిచేసే ఇందుపగింజ మాదిరి కల్లోలంలోని అసామరస్యాన్ని విరిచేసే సామరస్యమే ఈ గానం. అది ప్రతిఘటన లున్నప్పుడు ప్రశాంతపరుస్తుంది. ఆకాంక్షను ప్రక్షాళించి నిర్మలంగా చేస్తుంది. ఇంకా నా సంగీతం జనకస్థానంలోని ఆదిమస్పందనలను వినిపిస్తుంది. అది నిన్ను పూర్తిగా వశీభూతుని చేసి అవ్యక్తభూమికలకు కొనిపోతుంది. నా సంగీతంతో అంతా ప్రశాంతమవుతుంది.

నా సంగీతం ఎక్కడనుంచి వస్తోందో తెలుసుకోవాలంటే సృష్టి ఆవిర్భవించిన మూలస్థానందాకా వెళ్లాల్సిందే! ఆదిలోని నిరపేక్ష నిశ్శబ్దంలో ఆవిర్భవించిన స్పందనవల్ల కలిగిన నాదమే నా సంగీతానికి మూలము. ఆ స్పందనవల్ల కలిగిన ప్రకంపనాలు, కదలికలే సృష్టికీ, విశ్వవికాసానికి ఆలంబనమై సృష్టికర్త తన్ను తాను మళ్ళీ, మళ్ళీ ఆవిష్కరించుకోవడమనే తతంగం జరుగుతోంది. అన్నిటికీ మూలమైన ఈ సుస్థిరనాదాలను వెతికి పట్టుకోవాలనీ, సృష్టిలో దాగివున్న పరమోత్కృష్ట విశ్వసౌందర్యంలో ఉండే సంతోషాన్ని కనిపెట్టాలనీ, సృష్టికర్త ఆవిష్కృత చైతన్యసాగరంలోని ఒక పాయను తన ప్రవాహంగా విశ్వంలోకి వదిలిపెట్టాడు. అది అదృశ్యలోకాలగుండా పయనిస్తూ చివరకు స్వరఝురిగా వెలువడింది. *ఇలా భూమిపైకి జాలువారిన స్వరఝురి సమస్త మానవజాతినీ పరమాత్ముని వైపు మళ్ళించగలదు. సంగీతానికున్న శక్తి అంత గొప్పది. నా సంగీతం పరమసత్యాన్ని వెలార్చడం ద్వారా ఆత్మానుభూతిని కలుగచేస్తుంది.* ఇంకా నా సంగీతాన్ని ప్రశాంతంగా విన్నప్పుడు నీకు అవ్యక్తమైన దివ్యసౌందర్యాన్ని, సంతోషాన్ని చవిచూపి అలౌకికానందంలో ఓలలాడిస్తుంది.

మానవసహజ అల్పగుణాలనుంచి, అజ్ఞానంతో వచ్చే సంకుచితత్వంనుంచి తప్పించి నా సంగీతం నిన్ను దివ్యకాంతి మెరుపులు, దివ్యానందాల వెల్లువల అనంతత్వంతో సంసర్గం కలిగేటట్లు ఉన్నతి కలిపిస్తుంది. తన స్వరతరంగాలతో నిన్ను పునీతుని చేసి నా సంగీతం నీ అంతరాంతరాల్లోని అనంతత్వపు నిగూఢ లయవిన్యాసాల ఘోషను ఆకాంక్షగా పైకి తెచ్చే ప్రయత్నం చేస్తుంది. ఇంకా మనలోని ఆత్మపదార్థాల నన్నిటినీ సంయోగపరచి అంటే మనలోని ఉదాత్త, దైవదత్త భాగాలనన్నిటిని ఊర్ధ్వోన్ముఖమొనర్చి సర్వోత్కృష్టమైన దివ్యోద్ధతి దిశగా నడిపిస్తుంది.

నా సంగీతాన్ని సంపూర్ణగా గ్రహించాలంటే సాధ్యమైనంత నిశ్శబ్దంగా, నిశ్చలంగా కూర్చుని వినాలి. మనస్సులో ఏ

విధమైన ఆలోచనలూ లేకుండా నిశ్శబ్దంగా ఉన్నప్పుడు సంగీతంలోని లయవిన్యాసాలన్నీ తమ ఆర్ద్రతను నీలో ముద్రించి శాంతి సౌభాగ్యాలనూ, పవిత్రతలోని ప్రశాంతతనూ నెలకొల్పి సనాతన సత్యదర్శనాలను కలిగించగలవు.

నా సంగీతం ద్వారా నిశ్చయత్వం ఏర్పడి ఆత్మకు శక్తి కలుగుతుంది.

నా సంగీతం దివ్యస్వర సమ్మేళనాల మర్మాన్ని, శాశ్వత సౌందర్యంయొక్క మహాద్భుతత్వాన్ని క్రిందికి తీసుకొస్తుంది. అంతేకాక మనకెవరికీ అంతుబట్టని లయవిన్యాసాలతో లోకాలన్నిటినీ ఐక్యంచేసి అనుసంధానం చేసే భువనమోహనత్వపు ఎనలేని మాయాజాలాన్ని కూడా అందుబాటులోకి తెస్తుంది. నా సంగీతం ఇంద్రియసంస్పర్శ ద్వారా జీవి అంతర్భాగాలలోకి చొచ్చుకొని వెళ్ళి చికాకులను, బాధలను తొలగిస్తుంది.

ఇదే నేను నా శరీరంపై ప్రయోగం చేసుకుంటున్నాను. శాంతిః శాంతిః శాంతిః సంగీతం ఒక రసఝరిగ వచ్చి నిన్ను ఆవహిస్తుంది. ఆ దైవమే నీలో ప్రవేశిస్తున్నాడా అన్న భావన నీకు కలుగుతుంది, అతి ప్రశాంతంగానూ, శుద్ధంగానూ సవ్వడి చేయకుండా జాగ్రత్తగా నీలో ప్రవేశిస్తుంది.

నా సంగీతం ఆకాశంలో భువనాల మధ్యనుండే సామరస్యాన్ని వ్యక్తం చేస్తుంటే చల్లచల్లగా ఆనందమయమైన మహా ప్రశాంతి దిగివస్తుంది. ఇంకా పెనుగాలులు వీచి తుఫాను మేఘాలను చెల్లాచెదరు చేసినట్లు నా సంగీతం అచేతననూ, అంధకారాన్ని పారద్రోలుతుంది, చూసే కన్నులుంటే అక్కడ జరుగుతున్నదాన్ని నీవు చూడగలవు.

సంగీతం వినేటప్పుడు అంతరంగంలోకి చొచ్చుకొనిపోయి నీ చైత్యపురుషుని దగ్గరకు చేర్చగల నీ చైతన్యభూమికలతో సంసర్గాన్ని పొందాలి. అప్పుడది పూర్తిగా నిన్ను ఆకట్టుకొని తన స్వరసమ్మేళనాశక్తితో నీకు అపరిమితానందపారవశ్యాన్ని కలుగచేస్తుంది. ఆత్మ సంతరించుకున్న అనంతత్వం నా సంగీతంలో వ్యక్తం అవుతుంది. అంటే భాస్వంతమైన అనంతత్వం

తనలోని ఆత్మానందాన్ని వెలువరించే పద్ధతి అది. అత్యంతమైన సొగసు, శక్తి కలిసి సూటిగా ప్రసన్నంగా జాలువారే నా గాన సుధ పరాప్రకృతినే వ్యక్తీకరిస్తున్న వెలుగునూ, పరమప్రశాంత తనూ, సమైక్యసామరస్యాన్ని తీసుకొనివస్తుంది.

ఈ సంగీతం వినడం ఒక అలౌకికానుభవము. అందులో నుంచి వెలువడే స్పందనను గ్రహించాలంటే అంతరంగంలోకి చొచ్చుకొనిపోవాలి. అలా వెళ్ళి వెళ్ళీ విస్తరించుకొని వినాలి. దానికి విశాలత్వాన్ని పొందడం నేర్చుకోవాలి (శ్రీమాత ముంచేతులు తెరిచి చేతులు చాచి చూపిస్తారు). అంటే చెవులతోనూ, హృదయంతోనూ, వినడంకాక నీ నరనరాలూ, శరీరకణాలు మొత్తం విప్పుకొని దాన్ని ఆస్వాదించినప్పుడు, ఆ ప్రకంపనలు నీ శరీరంలో విలీనమైపోతాయి. ఈ విధంగా వినడం నేర్చుకున్నప్పుడు ఆ సంగీతధ్వనులతో మొత్తం మారుమోగినట్లు శరీరంలో ఏమాత్రం బిగువు లేకుండా సడలిపోయి తేలికగా అవుతుంది. ఇక ఏ రకమైన అవరోధాలున్నా పటాపంచలైపోయి శరీరం గాలిలో తేలుతున్నట్లు దూదిపింజ మాదిరి తయారవుతుంది. ఈ వినూత్న అనుభవం సంగీతం ఆవిర్భవిస్తున్న జనక స్థానం దగ్గరకు నిన్ను చేరుస్తుంది. ఇంతవరకూ మాటలతో మీకు అర్థమయేటట్లు చెప్పాను. మాటలకందనిది ఇంకా ఎంతో ఉన్నది. అది తెలుసుకోవాలంటే దాన్ని ప్రత్యక్షంగా దర్శించాల్సిందే. అప్పుడే అది తెలుస్తుంది.

(*The Supreme*, pp. 45-48)

స్వేచ్ఛానువాదం: డా॥ ఎ. వెంకటరామ శాస్త్రి, డా॥ ఎ. ప్రభావతి

Music brought down celestial yearnings, song
Held the merged heart absorbed in rapturous depths,
Linking the human with the cosmic cry;

స్వామి దయానంద్

(శ్రీఅరవిందుల ప్రవచనములు)

నేటి భారత పునర్వికాసమును, భావిప్రజానీకము తలపోయునపుడు, తత్కర్తలుగా వారికి తోచు మహాపురుషులలో ఒక మహనీయుడు ప్రత్యేకముగా ప్రకాశింపగలడు. అతని శ్రేణి విలక్షణమైనది. అతని కార్యధోరణి అనన్యమైనది. ఉత్తుంగ మహాపర్వతము లింతలంతలై తరుగుల్మ లతాపరిశోభితమై, దర్శనీయమైన యొకానొక పర్వతపంక్తిలో పెద్దతడవు నడిచినంతట, ప్రత్యేకముగా వెలువడి పటిష్ఠమై, పార్శ్యముల నిరాచ్ఛాదితమై కేవలము కొండకొన నొక్క చెట్టు (దేవదారు) చదలంటనై సారోదకంబులు కోనలోనికి గ్రుమ్మరించు నిర్ఘరంబుతోటి పరిశుభ్రమైన నిట్రాతి కొండ యొకటి కంటి కగపడినట్లు ఆ మహనీయమూర్తి నా మనస్సునకు గోచరించుచున్నాడు. *ఆయనయే దయానంద స్వామి,* నవజీవనదాత, పునర్నిర్మాత. ఆ తేజస్వి జన్మస్థానము కథియవాడ. ఆ సీమ విలక్షణములు, నిసర్గ గుణములు అతనిలో అంతర్భూతమైనవి, అచటి గిర్నారు కొండల నిండారు దండితనము, అచటి తీరభూములపై నుర్వుగ్రక్కు పశ్చిమాంబుధి ఘోషణ గాంభీర్యము, అచటి జనముల శారీర మన స్సౌష్ఠవము, శుభలక్షణమై, ఆదిశక్తిసంపన్నమై తీర్చినచో అత్యుత్తమముగా తీరునదైన వారి ప్రకృతి – యివన్నియు కొంత కొంత ఆ మహానుభావు నావేశించి యున్నవి.

ఇతని స్వరూప స్వభావములను నేను నిర్వర్ణించుకొనునపుడు, తత్తుల్యులైన సమకాలిక పురుషులనుండి వీరిని వేఱుపఱచు గొప్పలక్షణములు రెండు మున్ముందు స్ఫురించుచున్నవి. నేటి భారతమునకు కర్తలైన మహాపురుషులు తమ అంతస్సును జాతి మనస్తత్వముతో సమ్మిళితము గావించి యేకీభూతమైనారు. భావికాలమున రూపనామములతో జన్మదాల్చ వలసియున్నదై

యిప్పుడు ఆర్ద్రము, అపరిస్ఫుటమునై యున్న జాతితత్త్వములో తాము ఆధ్యాత్మిక సమీకరణ మొందినారు. లోలోపల జాతికి ఒక కదలికను, ఒక పొంగును గలిగించు నిగూఢశక్తిగా వారు విలీనమైనారు. భరతాత్మలో వారు మహనీయులుగా మహోత్కార ణులుగా చిరంజీవులైనారు. వారు మనలోనే యున్నారు. వారు లేనిదే మన మిప్పుడున్నట్లుండు వారము గాము. కాని వారిలో నే యొక్కరింగూర్చి కూడ, 'అతడు నిర్దేశించినది ఇది, అతని తత్త్వ మిందులో రూపుదాల్చినది' అని మనము చెప్పజాలము.

ఈ శ్రేణికి మేలుబంతి మహాదేవ గోవిందరెనడే. అతి విస్తృత బహువ్యాప్తిగల జీవ పరిణామదశలో ఇట్టి వారవసరము. ఆర్థికవేత్త, సంస్కర్త, దేశారాధకుడునైన ఈ మహారాష్ట్రుని మన మింతగా గొనియాడుటకు 'ఇతడు చేసిన ఘనకార్యమేమి' అని పరదేశీయుడెవడైన ప్రశ్న వేసినచో ప్రత్యుత్తరమిచ్చుట కొంత కష్టమే. వారి శక్తిచే నుద్బోధితులై వారి భావముచే నుజ్జీవితులై నవభారతమును సేవించుచున్న పలువురు సుప్రసిద్ధ నాయకు లను మనము చూపి, 'యిది రెనడే చేసిన మహోపకారము' అన వలసియుండును. మరియు యిట్లడుగవలసి యుండును – 'రెనడే లేకున్నచో మహారాష్ట్రము ఈ రూపున నుండునా? మహారాష్ట్రము వినా భారతదేశము ఎట్లుండి యుండును' అని. రెనడె కన్న పరిస్ఫుటముగా తమ ప్రభావమును కార్యధోరణిలో వెలార్చిన వారింగూర్చి కూడ ప్రధానముగా నాకు ఈ భావనయే రూఢమై యున్నది. వివేకానందుని చూడుడు. ఆత్మశక్తి మూర్తీభవించిన వాడు, మానవమండలిలో సింహమువంటి వాడు. కాని అతని దిగా మనకు మిగిలియున్న కార్యసిద్ధి అతని శక్తిసామర్థ్యములకు చాలినంతది గాదు. ఇప్పటికిని అతని ప్రభావము పనిచేయుచునే యున్నది. ఎట్లో, ఎటనో, మన మెఱుగకయే, విస్తారముగా, విచిత్రముగా, లోలోపల భరతాత్మలో నుబుకు నొక వెల్లిగా నది కదలబాఱుచునేయున్నది. '*ఇదిగో వివేకానందుడు దేశమాత హృదయమందున్నాడు. తత్సంతానము నంతయు నావేశిం చియే యున్నాడు.*' అని మనము అనుకొనగల్గుచున్నాము. ఆ

మహాపురుషులందఱు అట్టివారే. వారు తమ కార్యకలాపమున కన్న కడు నధికులు. వారి ప్రభావము ఆకారరహితమై అతిశయ వ్యాప్తిగలదై యున్నది. కేవలం తత్సంబంధమైన కార్యరూప ములో మాత్రమే నిర్బంధించపడియున్నది గాదు.

దయానందుని మార్గమట్టిది గాదు. అనిర్దిష్టమైన వస్తు తత్త్వములో నిగూఢముగా నతడు లీనమైనవాడు గాడు. తన మూర్తిని తాను కంచుపోతపోసినట్లు జనములందును, సంస్థలం దును స్పష్టముగా ముద్రించుకొన్నాడు. అతని కార్యజాలము సర్వము అతని యాధ్యాత్మికశరీరము కన్న సంతానము. వాటికి రూపనామము లున్నవి. శక్తి, దార్ఢ్యత లున్నవి. జీవోపేతములై నవి. తత్కర్తవలెనే రూపు గొనియున్నవి. తానేపని తీర్చుట కవ తరించినది స్పష్టముగా నెఱిగిన వాడతడు. దానిని తదేకదీక్షతో నిర్వర్తించిన వాడతడు.

దివ్యదృష్టితో నాతడు వలయు వస్తువులను కూర్చుకొని, నిధుల నేర్పరించుకొని, జన్మసిద్ధమైన కర్మకౌశలముతో కృషిచేసి కార్యసిద్ధి బడసిన వాడు. *భగవంతుని కర్మాగారమున కార్యా రంభుడైన ఈ శక్తిమంతుని గూర్చి తలపోసినపు డెల్ల* పోరా టము, పరిశ్రమము, విక్రమము, విజయము – యివియే మనస్సున చిత్రపరంపరగా నిండుకొనును. భగవత్సృష్టిలో నితడొక యోధా గ్రేసరుడు, దివ్యతేజస్సును విస్తరింపజేయు వీరపురుషుడు. మాన వులను, సంస్థలను చక్కదీర్చు మహాశిల్పి, ఆధ్యాత్మిక మార్గ మున నడ్డువచ్చు భౌతికాంతరాయము లన్నిటి నతిక్రమించు మహాజేత – అని ఆ మహనీయుని గూర్చి అనుకొనుచుందుము. ఆధ్యాత్మిక కార్యకౌశల మిట్లు మూర్తీభవించెనని తోచును. పర స్పర విరుద్ధములుగా సామాన్యదృష్టికి దోచునవి ఆధ్యాత్మికత, కర్మకౌశలము యివి రెండును ఏకమగుట యేదో అదే దయా నందుని స్వరూపము.

ఆయన కార్యరూప మట్లుండగా ఈ తత్త్వముతో ఈ లక్ష్య ముతో నతడు పరిశ్రమించుట చేతనే భారతనిర్మాతలలో నాతనికి ప్రత్యేకస్థానము స్థిరపడినది. జాతిగుణమునకు ప్రాక్తనమైన ఆర్య

లక్షణము నొకదానిని మరల చేకూర్చినవాడతడు – అతని విశిష్ట తలో రెండవ యంశ మీ ఆర్యవిలక్షణత. ఇదియే తొలిదానికిని మూలాధారము. మనము నిర్దిష్ట లక్షణములతో స్థిరస్వరూపముతో జీవించువారము కాము. బహుళ భావప్రవాహములో తేలిపోవు చుందుము. ఆ భావ బాహుళ్యము మనలో చేరి మన మనశ్శక లములకు శతధా రూప మిచ్చుచుండును. ఒక విధమైన కార్యా రంభము తత్ఫలితముగా జరుగుచుండును. కాని అంతస్సంతయు మారదు, చేయు కార్యము అంతస్సున కంతకు జెందదు. అంత స్సులో కరుడుగట్టిన దంతయు మరల భావ ప్రవాహములో కొట్టుకొనిపోవుచుండును. మన జీవనప్రకారములు అనిశ్చిత ములు. సందర్భానుసారముగా వ్యాకోచ సంకోచములతో సాగి పోవుచుండును. ఇదిగో నిబ్బరముతో నెదు రీదుచున్నామని యబ్బునపుడును నిజముగా స్థిరబుద్ధులము గాక నిమిత్త ప్రయోజ నపరులమే యగుచున్నాము. దయానందుడు తన్ను జొచ్చిన భావవాహిని నంతయు తాను గ్రహించి, తనలోనే యిముడ్చు కొని, ధర్మముగా తనకు దృష్టమైన రీతిని, దానికి తనలో రూప మేర్పరచి స్వోద్దిష్టమైన ధర్మరూపములందు బహిః ప్రపంచమున వెల్వరింపజేసినాడు. అతని యత్యుద్ధతిగా తోచునదెల్ల తత్స్వ రూప నిర్ణయ సారమేగాని వేఱు గాదు.

ప్రకృతికి హస్తంగతు డగుటగాక ప్రకృతిని హస్తగత మొనర్చుకొని సృష్టికార్యము నిర్వహింపగల యధికారము తన కున్నదని ఋజువుచేసి కొన్నాడు. పురుషకారము కార్యధోరణి చాలినంత లేని మనల నిప్పటికిని అతని యాత్మ ఇట్లుద్బోధించు చునే యున్నది. 'భరతపుత్రా, అపర్యాప్తముగా నుండిపోవుట, అనిశ్చితముగా నెదుగుచుండుట, వీనితో తనివొందకు. నీ వెట్టి వాడవై యుండువలెనని భగవదిచ్ఛయో గ్రహింపుము. భగవత్ప్ర బోధము ననుసరించి నీవేమిగా వృద్ధిపొందవలయునో నిర్ణయిం పుము. నిర్ణయించి, మఱి దానిని నీలో నీవు చెక్కి సాధింపుము. సృష్టిలో చెక్కి సాధింపుము. *అంతర్ముఖుడవేకాక బహిర్ముఖు డవు కమ్ము. కేవలాత్మవే గాదు మానవుడవు నీవు. భగవం*

తుని సేవింపుము. ప్రకృతినే పాలింపుము' – *ఈ యుద్బోధ కాతడే లక్ష్యభూతము.* అతని కంఠస్సులో దైవము, కన్నులలో దివ్యదర్శనము, చేతులలో మహాశక్తి – తాను దృష్టించిన రీతిని జీవరాశిని చెండి చెక్కి తీర్చగలశక్తి – సమగ్రముగా నుండెను. కొండబండల చెండి మూర్తులను తీర్చినట్లు కొండవంటి యా దండిమానవుడు వస్తురూపకల్పనము గావించినాడు.

దయానందస్వామి జీవితములోని ప్రతి ఘట్టమునకు అతని ఆధ్యాత్మిక కార్యావేశము మిన్నంటియుండును. శక్తిసామర్థ్యము లాతని సర్వకార్యములపై నచ్చుగ్రుద్దినట్లు వెలయుచున్నవి. భారతజాతి పునర్జన్మ కాతడు బీజగ్రహణమెట గావించెనో చూడుడు. భారతజాతి జన్మారంభవేళ వికసిల్లిన పద్మకోశము భారత ధర్మ మూలాధారము వైపు చక్కగా దృష్టి బఱపినాడు. ఇది యేమి దివ్యదృష్టి! ఎంతటి దీ సాహసము! వేదము నతడు చేపట్టినాడు. అజ్ఞాన విలసితమైన వ్యాఖ్యానాదులచే రూపము చెడి, అనుద్బుద్ధుల యపోహలతో ఆదిమవాసుల వాగ్ధోరణిగా *న్యూనమొనరింపబడియున్న వేదమాతృకయొక్క యథార్థస్వరూపమును గ్రహించి, ఈ జాతిని, ఈ దేశమును తీర్చిన మన పూర్వర్షుల శక్తిమహిమల పరమాలయముగా, దివ్యజ్ఞానము, దివ్యారాధనము, దివ్యాచరణము నిరూపించు పరమగ్రంథముగా నాతడు మనకు ప్రకాశమొనరించినాడు.* దయానందులు స్వతంత్రించి వ్రాసిన వేదభాష్యము సరియని అందరు నంగీకరింతురో లేదే నేనెఱుగను. అగాధము, పరమాద్భుతమునైన వేదము యొక్క అర్థరీతులు కొన్ని కొన్ని వేఱుమార్గముల నిరూపించు ప్రయత్నముల కవకాశము కలదనియే నా యభిప్రాయము. కాని అదంత ముఖ్యము గాదు. దయానందుడు వేదమును స్వీకరించుట యన్నదే ముఖ్యము. *వేదమనగా భరతభూమికి కుల పర్వతము.* దానిని చేపట్టి దాని నాధారముగా జాతి విద్య, జాతి పౌరుషము, జాతి తత్త్వములను నిర్మింపబూనుట యన్నదే ముఖ్యము.

రామమోహనరాయలు బంగాళమును ఊగించినాడు. నదీ తీరమున కేదారోత్ప్రాంతమున ఆదగొని మైమఱచిన వంగజాతిని లేవగొట్టినాడు. కాని అతడు ఉపనిషత్తులతో ఆగినాడు. దయానందుడు అంతటితో నిలువక మన జాతికి మూలబీజమైన వేదమునే లక్షించినాడు. జాతిహృదయ మతనిలో స్పందించినది. దాని నతడు తేజోవంతము చేసినాడు. కావుననే అతని నిర్వాహము లెంత సంప్రదాయాతిక్రమణ చేసినను వస్తుతః జాతీయములేయై యున్నవి.

జాతీయమైన మనుగడ యనగా బ్రమాన్పడి నిలిచియుండుట గాదు. శక్తి సహితమైన ప్రాచీన వస్తువు నొకదానిని చేపట్టి నేటి జీవితవాహిని లోనికి దానిని విసరినప్పుడే నూతన నిర్మాణమునకు వలయు కదలిక, చైతన్యము పుట్టును. పూర్వ యుగశక్తితో ఈ కాలపు కరువున కాతడు ప్రాణము వోసినాడు. ఆదికాలసిద్ధమై మూలవస్తువునకు చేరువై, తొలియుబుకు నంగల యుత్సాహము, కల్మిమై సనాతనమైన దేదిగలదో అదియే జాతి యొక్క పునరుజ్జీవనమున కాధారము కాగలదు.

దయానందుని జీవితమునందును, చేతలందును అస్పష్టత, అనుమానము, అన్వేషము నన్నవి యుండవు. అతనికిగల నిర్మల పరిజ్ఞానము, ఆర్జవము, త్రికరణశుద్ధి – వీనివలన నన్ని కార్యములు వాని యంతట నవి స్పష్టరూపములతో నేర్పడిపోవును. విస్పష్టమైన మనోనిర్ణయము, పరిపూర్ణమైన సత్యపాలనము, స్వవర నిర్వచనము, విధివస్తునిర్ణయమున నిష్పక్షపాతము – ఇవి దుర్బలతత్త్వలైన మానవులలో లభించు టరుదు. ఆర్యమతానుయాయిల విజయమునకు, పై లక్షణములే కీలకము. గుమ్మము చేరి ధైర్యవిశ్వాసములతో స్పష్టముగా తలుపుగొట్టువారికి ప్రకృతి తప్పక వెంటనే గడియ తీసి ప్రవేశమిచ్చును. గురువుగారి యీ గొప్పగుణము తచ్ఛిష్యుల నావేశించి యుండుట సంతోషింపదగినది. ఒక పని న్యాయమని, అవసరమని తోచినపుడు, జంకు గొంకు లేక ఆ పని నెఱవేర్చుటకు నడుముకట్టిన సంఘ మొకటి

యీ దేశమున నిపు డేర్పడియున్న దనుటతో తప్పక ఆ పని నెఱవేఱగలదను విశ్వాసము మన కందఱకును కలుగగలదు.

ఋతము అతిసరళముగా గన్పించును కాని అత్యంత కష్ట సాధ్యము. వేదబోధకు ప్రధానము సత్యము. మనోవాక్కాయము లందు ఋతుపాలనమే పరమార్థము. ఆర్యుల నీతి తత్త్వమునకు ప్రధానము త్రికరణశుద్ధి, అంతస్సున ప్రసన్నత, వాక్కర్మల నవి భిన్నత – ఇదియే ఆర్జవము. ఆర్యుల కిది మూలగుణము. పరి శుద్ధసత్త్వమునకు ఆర్జవమే మూలాధారము. మానవుడు ప్రకృతి కోశమునకు దూరము కాలేదనుటకు తార్కాణము. అదియే దివ స్పుత్రుని దివ్యలక్షణము. దయానందస్వామి యొనర్చిన సర్వ కార్యములందును, అతడు స్థాపించిన సర్వసంస్థలందును ఈ లక్షణము ముద్రితమై యున్నది. ఆర్జవగుణమును బట్టియే యిది దయానందుని చేతయని గుర్తెఱుంగగలము. మన కందఱకు ముఖ్యముగా నిక్కాలమున వలసియున్నవైన శుద్ధసత్త్వము, సుప్ర సన్నత, దూరదృష్టి, కర్మకౌశలము, ధర్మవీరత – ఈ గుణములు మరల మన యందు ప్రకాశించునట్లు భారతదేశమున దయానం దుని తత్త్వము అపరిచ్ఛిన్నముగా నలరారు గాక.

(ఇంకా వుంది)

దయానందుల వేదార్థము

దయానందస్వామికి వేదము కులపర్వతము. వారి భావ ప్రపంచకమునకు అది పునాది. అంతర్జీవమునకు విధి నిర్ణేత. బహిర్జీవమునకు ఆధారము. ఇంతియ కాదు. సనాతనమైన బ్రహ్మ వాక్కు, ఐహికాముష్మిక పరిజ్ఞాన నిలయము.

(*SABCL* Vol. 17, pp. 331-36)

అనువాదం: శ్రీ గుర్రం వేంకట సుబ్రహ్మణ్యంగారు

*

వేదకల్పన భారతీయ వైజ్ఞానికదర్శనములకు చాల పూర్వమే యుద్భవించినది. ఆ యనాది ప్రజ్ఞాబోధము నేటి యభినవ మానవ

బుద్ధి కంగీకారయోగ్యమైన హేతువాదప్రయుక్తభావప్రకటనా విధానమునకు భిన్నమైన, నవీన వ్యవహార రీతి ప్రకారము నిషిద్ధమైన పద్ధతులతో కొనసాగినది. నాటి ప్రాజ్ఞులు సామాన్య దైనందిన జీవిత చర్యల కతీతమైన విజ్ఞానముకొఱకు సహజ మానుషేంద్రియానుభూతితో తృప్తిజెందక తమ యాంతరంగికానుభవముల మీద నంతర్జ్ఞానోపలబ్ధ ప్రదర్శనములమీద నాధారపడిరి. వారి లక్ష్యము జ్ఞానోద్దీపనమే గాని సహేతుక తార్కిక నిరూపణము కాదు. వారి బుద్ధిలో నాదర్శపురుష డీశ్వరప్రేరిత ద్రష్టయే గాని కుశాగ్రబుద్ధిగల తార్కికుడు మాత్రము కాదు. వేద మూలములయొక్క యీ వివరణమును భారతీయ సంప్రదాయము విశ్వసించి సంరక్షించినది. వేదసూక్తములు ఋషుల వ్యక్తిగత రచనలు కావు. వేదమందలి సనాతన సత్యమునకు, నపౌరుషేయ విజ్ఞానమునకు ఋషులు ద్రష్టలు, శ్రోతలు. అవి ఋషుల జ్ఞాన దృష్టి శ్రవణములందు సాక్షాత్కారించినవి. వేదవాక్యము స్వయంశ్రుతి; మానవశేముషీప్రజ్ఞతో కూర్చబడిన గీతములు కావు. ఆ ఛందోబద్ధమైన యంతర్వాణి ఋషి వినినది. ముందుగా నట్టి యపౌరుషేయవిద్యార్జన కర్హతను సంపాదించుకొని తయారుగానున్న తపోధనుని యాంతరంగికాకర్ణనమునకు పరమవ్యోమము నుండి ధ్వనించు దివ్యమంత్రములవి.

(*SABCL* Vol. 10, p. 8)

తెలుగు మూలం: నిగూఢ వేదరహస్యము, పు. 45

All her life's turns led her to symbol doors
Admitting secret Powers that were her kin;...
Her acts became gestures of sacrifice.

Sri Aurobindo

జాతీయకళాశాల విద్యార్థులకు శ్రీఅరవిందుల సందేశం[1]

నేను సలహా రూపేణా కొన్ని మాటలు మీతో చెప్పాలని మీరంతా కోరుకుంటున్నట్లు నాతో చెప్పారు. కాని ఈ రోజులలో, మాబోటి పెద్దవాళ్లకంటే, మీబోటి యువకులే మంచి సలహాలీయగలరని నే భావిస్తున్నాను. మీ చర్యలు నాలో కలిగించిన భావాలు, మీరేవిధంగా నా పట్లగల ప్రేమను చూపిందీ, వాటిని మాట లలో చెప్పటం నాకు సాధ్యం కాదు.

నేను నా పదవికి రాజీనామా చేశానని మీ అందరికీ తెలుసు. నిన్న జరిగిన సభలో, మీరు నా ప్రస్తుత కష్టాలనేవాటి పట్ల ఎలాంటి సానుభూతి వ్యక్తం చేసిందీ చూచాను. వాటిని ఎంతవరకు కష్టాలని పిలవాలో నాకు తెలియుటల్లేదు. నా చిన్న తనం నుంచి, నే తీసుకొన్న ఈ కార్యాన్ని ఆచరించటంలో ఇలాంటి అనుభవాలు తప్పవని నాకు ముందే తెలుసు. కాబట్టే ఏ విచారం లేకుండానే, నేనీ విషయాలకు దగ్గరవుతున్నాను.

మీరు నా కష్టాలపట్ల చూపే సానుభూతి కాదు, నేను ఏ ఆశయం కోసమై పనిచేస్తూ ఈ కష్టాలననుభవిస్తున్నానో, ఆ ఉద్దేశ్యంపట్ల మీకు సానుభూతి ఉందని, మీరు నాకు గట్టి మాటివ్వాలి సుమా! ఇప్పుడు పైకొస్తున్న యువతరం గనుక తామూ ఈ ఆశయసాధనకే పాటుపడుతున్నారని నాకు తెలిస్తే, నేనెక్కడికి వెళ్ళినా, నా ఈ కార్యసాధనకు నా వెనుక కొంత మందిని వదలి వెళుతున్నానని తెలిస్తే, నేనే మాత్రం విచారం లేకుండా వెళతాను.

---

[1] కలకత్తాలోని జాతీయకళాశాల ప్రిన్సిపాల్ శ్రీ అరవింద ఘోష్ వారి 'వందేమాతరం' పత్రిక వ్రాతలు వగైరాల కారణంగా, కళాశాలకు భంగం కలగరాదనే ఉద్దేశ్యంతో తమ ప్రిన్స్ పాల్ పదవికి రాజీనామా చేశారు. ఆ సందర్భంగా, విద్యార్థులంతా బరువెక్కిన హృదయాలతో తమ ప్రిన్సిపాల్‌కు వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. 1907 ఆగష్టు 23 న జరిగిన ఆ సభలో శ్రీఅరవిందుల వీడ్కోలు సందేశమిది.

ఈ నాడు నాకు మీరే మాత్రం గౌరవం చూపుతున్నా, అది నా పట్ల కాదనీ, నా ప్రిన్స్‌పాల్ పదవికీ కాదనీ, అది మీ దేశానికి, నాలో ఉన్న భారతమాతకనీ భావిస్తాను. ఎందుకంటే, నే చేసిన ఏ స్వల్పమైనా, చేసిందంతా ఆమె కోసమనీ, నేననుభ వించే స్వల్పబాధ కూడా, ఆమె కోసమే భరించబడుతుంది.

ఆ విధంగానే మీ సానుభూతిని స్వీకరించిన నేను ఒకవేళ నేను నా ఈ కార్యాన్ని కొనసాగించటంలో విఫలమయితే, ఈ పనికోసమే నా వెనుక చాలామందున్నారని నే భావిస్తాను.

నాకింకో సంతోషకరమైన విషయమేమిటంటే, మీ వలెనే నా దేశస్థులంతా నా పట్ల ఇలాంటి భావాలను కలిగివున్నారనీ, అదీ మీరనుకొనే కారణాలవల్లననీ. అన్ని వర్గాల ప్రజా ఏక కంఠంతో నా పట్ల తమ సానుభూతిని వ్యక్తం చేయటం, అంతే కాకుండా నా కేసు విచారణ సమయంలో సహాయం చేయటా నికి కూడా ముందుకు రావటం, నే సంతోషించటానికి మరో కారణం. నిజానికి నా అంతట నేనేమీ కాదు, నే చేసిందీ ఏమీ లేదు. నేనీ భ్రాతృభావాన్ని సంపాదించటానికి కారణం, నా దేశ స్థులందరి హృదయల్లోని ఉద్దేశ్యాన్నే నేను సేవిస్తూ వుండటమే.

నేనిప్పుడు మీ కివ్వగలిగిన ఒకే ఒక సలహా ఏమన ఏ కార్యక్రమానికయితే, ఏ ఉద్దేశ్యంతో ఈ కళాశాల స్థాపింపబడిందో – దానిని నిర్వర్తించండి. ఈ పాటికి మీరంతా ఆ ఉద్దేశ్యమేమిటో గ్రహించి ఉంటారనటంలో, నాకెంత మాత్రం సందేహం లేదు. మా పనులను వదలి, జీవితంలోని మిగతా అవకాశాలను వదలి, మేమీ కళాశాలను స్థాపించి, మా జీవితాలన్నింటినీ ఈ సంస్థ కోసమే ఎందుకు అంకితం చేశాం? ఈ పునాదిలో మేం జాతి యొక్క 'మూలబీజాన్ని' (nucleus of a nation) చూడాలని ఆశిం చాం. ఈ విచారాలు, బాధలు అనే రాత్రి తరువాత, నూత్న భారతం తన కార్యక్రమాన్ని ప్రారంభించాలనీ, ఈ ప్రపంచం కోసమే తన గొప్పతనం, యశస్సులతో పని చేసే దశను చూడా లని ఆశించాం.

మేమిక్కడ కోరేది, మీకు ఏదో కొంత సమాచారాన్నం దివ్వటం, కేవలం మీరు జీవనాధారాన్ని సంపాదించుకొని, మీ మీ వృత్తులలో నిమగ్నమవాలని కాకుండా, ఈ మాతృభూమి కోసమై పనిచేసే, ఆమె కోసం కష్టపడే పుత్రులను తయారు చేయటం కోసం. దాని కోసమే మేం ఈ కళాశాలను స్థాపించాం, ఆ పని కోసమే భవిష్యత్తులో మీకు మీ కాలాన్ని వినియోగిం చాలని నే కోరుకుంటున్నాను. ఏ పనినయితే మేం అసమగ్రంగా, అసంపూర్ణంగా ప్రారంభించామో, దానిని పూర్తి చేసి, సంపూర్ణ తను సాధించే బాధ్యత మీదే.

నే తిరిగి వచ్చిన తరువాత, మీలో కొందరిని ధనవంతు లుగా చూడాలని కోరుకుంటున్నా, ధనవంతులు కావటం మీ కోసం కాదు. మీ ధనంతో మాతృదేశాన్ని సుసంపన్నం చేయా లని. మీలో కొందరిని గొప్పవారుగా చూడాలని కోరుకుంటున్నా, ఆ గొప్పతనం మీ కోసం, మీ డాంబికం కోసం కాదు. ఆమె కోసం గొప్పవారు కావాలని, ఈ భారతదేశాన్ని గొప్పదాన్నిగా చేయటం కోసం, గొప్పవారు కావాలని, ఆమె ఈ జాతుల మధ్య సగర్వంగా తలెత్తుకొని నిలబడటం కోసం. ఒకప్పుడు ఈ ప్రపం చంలోని జాతులన్నీ జ్ఞానం కోసం ఆమెవైపే చూచేయి.

మీలో కొంతమంది బీదవారుగా, అనామకులుగానే మిగిలి పోవచ్చు. వారైనా తమ బీదతనం, అనామకత్వాన్ని కూడా మాతృ భూమికే వినియోగించండని కోరుతున్నా.

ఒక జాతి చరిత్రలో, కొన్ని సమయాలలో భగవంతుడు దాని ముందు ఒకే కార్యాన్ని, ఒకే ఉద్దేశ్యాన్ని ఉంచుతాడు. వాటి ముందు, అవెంత ఉన్నతమైనవైనా, గౌరవమైనవైనా మిగతా విషయాలన్నింటినీ త్యాగం చేయాల్సిందే. అలాంటి సమయం ఇప్పుడాసన్నమైంది. ఇప్పుడు ఆ మాతృభూమి సేవ తప్ప వేరేదీ ముఖ్యం కాని సమయం, ఆ అంతిమలక్ష్యం వైపే అన్ని పను లనూ కేంద్రీకరించవలసిన సమయం వచ్చింది.

మీరు చదివితే ఆ మాతృభూమి కోసమే చదవండి. మీ శరీరాన్ని, మనస్సునూ, ఆత్మనూ, ఆమె సేవకోసం కావలసిన

విధంగా మలుచుకోండి. ఆమె కోసం బ్రతికేందుకు మీరు మీ వేతనాలను ఆర్జించండి. ఆమె సేవ కోసం విజ్ఞానాన్ని తిరిగి ఈ దేశం తెచ్చేందుకు మీరు విదేశాలకు వెళతారు.

ఆమె వర్ధిల్లాలని పని చేయండి. ఆమె సంతోషం కోసం బాధల కోర్చుకోండి. నే చెప్పదలచుకొన్నదంతా ఆ ఒక్క సల హాలోనే ఉంది.

మీకు నా పట్ల సానుభూతి ఉంటే, అది కేవలం ఈ వ్యక్తి పట్ల సానుభూతిగా కాకుండా, నేనే ఆశయంకోసం పని చేస్తున్నానో, దాని పట్ల సానుభూతిగానే చూడాలని నా ఆశ. ఈ సానుభూతి ఒక కార్యక్రమంగా చూడాలని నా కోరిక. మీ జీవి తంలో గొప్ప ప్రయోజనాలు సాధిస్తారని, మీకు విద్యాగరపుటలో నేను కూడ కొంత కృషి చేశాననే గర్వం నాకుండాలనీ కోరు కుంటున్నాను.

ఇదే నా అంతిమ సందేశం

(SABCL Vol. 1, pp. 515-17)

వందేమాతరం, ఆగస్టు 23, 1907

అనువాదం: కాకుమాని తారానాథ్

> **All objects were to her shapes of living selves**
> **And she perceived a message from her kin**
> **In each awakening touch of outward things.**
>
> **Sri Aurobindo**

శ్రీమాత సంభాషణలు

సురేంద్రనాథ్ జోహార్ అనే ఒక శిష్యుడు, శ్రీమాతతో 11 మే 1967 న ఆంగ్లములో జరిపిన ఈ సంభాషణలు శ్రీమాత అనుమతితో మళ్లీ మళ్లీ వినేందుకు వీలుగా టేపు మీద రికార్డుచేసి పెట్టుకున్నాడు. ముందరే కొన్ని ప్రశ్నలను రాసి శ్రీమాత కివ్వగా ఆమె వాటిని చదివి జవాబులిచ్చారు.

13 ఆగస్టు 2003 నాడు సురేంద్రనాథ్ జోహార్ శత జయింతిని పురస్కరించుకొని, తారా జోహార్ ఒక విడియో చిత్రమును తయారుచేశారు. శ్రీమాత అమూల్యమైన చిత్రములతో ఆమె కంఠధ్వనితో కూడిన వీడియో CD లు, ఆడియో CD లు, టేపులు, వాటిని గురించిన వివరములకు రాయవలసిన చిరునామ: SABDA, Sri Aurobindo Ashram – Delhi Branch, Sri Aurobindo Marg, New Delhi 110 016

11 మే, 1967

నేటి ప్రపంచమంతా అల్లకల్లోలంగా వున్నది. పరిస్థితులు ఘోరంగా ఉన్నాయి. అందుకని ఎటుచూసినా నీకు కష్టాలే ఎదురౌతున్నందుకు ఆశ్చర్యపడనవసరం లేదు. ఒకవైపు నుంచి సత్యజ్ఞానశక్తులు ఈ ప్రపంచంలోకి దిగివచ్చి దానిని ఉద్దీపింపచేయాలని ప్రయత్నిస్తుండగా, మరోవైపు నుంచి ఈ ప్రపంచంలో కరడుగట్టుకుపోయిన పాతవ్యవస్థంతా దానిని ప్రతిఘటిస్తోంది. ఇక్కడ పీఠం వేసుకొని శిథిలమైపోయిన పాతశక్తులకు ఈ మార్పు ఇష్టముండదు. ఈ సంఘర్షణ వ్యక్తిగతంగా ప్రతివానిలోను ప్రతిబింబించినందువల్లనే వాళ్లకు కూడ కష్టములు ఎదురౌతాయి.

దీనికి పరిష్కారమేమిటో తెలుసా! సమర్పణ – బహుముఖమైన, నిశ్శేషమైన సంపూర్ణ సమర్పణ. కేవలం నీ చేష్టలే కాదు. సర్వకార్యములు, ప్రణాళికలు, ఆశయాలే కాదు, నీ ఫీలింగ్స్,

మనస్సులోని సమస్తమైన కదలికలు, *నీవు చేసే ప్రతి పని, ఒక టేమిటి నీ ఉనికినంతా దైవంకోసమే – నీ బ్రతుకంతా ఆయనకే అంకితము.*

అలా చేసినపుడు ఇక నిన్నెవ్వరూ ఏమీ చేయలేరు. ఎవ రైనా నీకు కీడు చేయదలచినా, దేవుని రక్షణ కవచము నిన్ను కాపాడుతూ ఉంటుంది. ఎప్పుడైతే నీకే విధమైన కోరికలు గాని, బంధనాలుగాని లేవో, ఎప్పుడైతే నీవు మానవుల ప్రశంసల కోసం ఆశించవో, ఎప్పుడైతే నువ్వు ప్రాపంచిక వస్తువులకు, సంపదలకు, మానవుల బంధపాశములకు అతీతముగా ఉండెదవో, ఎప్పుడైతే నువ్వు ఎట్టి ప్రశంసలనైన పురస్కారములనైన దైవమునుండి మాత్రమే కోరుకొందువో అప్పుడు *నీ హృదయ కుహరములో ఈ దైవసాన్నిధ్యము, ఈ శక్తి, ఈ అనుగ్రహము నిన్నంటిపెట్టు కొనివున్నట్లు తెలిసికొనెదవు.*

ఇదొక్కటే పరిష్కారము. అందరికి ఇదొక్కటే పరిష్కా రము. కొంతమంది కష్టాలతో బాధపడే వారుంటారు – పూర్తిగా సమర్పించుకోకపోవడమే వారి బాధలకు హేతువు. 'అయ్యో నేనెంత దురదృష్టవంతుడిని' 'పరిస్థితులెంత ఘోరంగా ఉన్నాయి' అనుకుండే బదులు 'నా సమర్పణ సంపూర్ణంగా లేదు' అని అను కుంటే బాగుంటుంది. దైవానుగ్రహము నిన్ను ఆవహిస్తుంది. నీకు సహాయపడి నిన్ను నడిపిస్తుంది. క్రమేపీ కొన్నాళ్లకు నీ మనస్సులోని గందరగోళమంతా సమసిపోతుంది. ఒకానొక శాంతి నిన్ను పూర్తిగా ఆవహించేస్తుంది. కోపతాపాలు మాయమైపో తాయి! And one day you emerge into that peace that nothing can trouble. You answer to all the contrary forces, the contrary movements, the attacks, the misunderstandings, the bad wills, with the same smile that comes from full confidence in the Divine Grace. ఇదొక్కటే పరిష్కారము. మరో దారి లేదు.

ఈ ప్రపంచం చాలా చెడ్డది. అది శాపగ్రస్తము. దుఃఖము, బాధలు, ఘర్షణలు ఇవే దాని మర్యాదలు; అది యింకా మార లేదు. మారేందుకు కొంతకాలం పడుతుంది. అయితే ఇందులోంచి

బయటపడే మార్గం ప్రతీవాళ్ళకు అందుబాటులో ఉన్నది. దైవా నుగ్రహాన్ని నీవు అంటిపెట్టుకొని ఉండటమే ఏకైక మార్గము. ఈ విషయాలు రెండు మూడు రోజులుగా నీ చెవులు హోరెత్తే టట్లు నీకు నూరిపోస్తూనే ఉన్నాను.

ఇంకేం కావాలి.

ఇప్పుడు నేనేం చేయాలి?

నీవు నీ పనిని చక్కగా నిర్వర్తిస్తున్నావు. చేయవలసిన విధంగానే చేస్తున్నావు కాబట్టి నేనింకేమి చెప్పనవసరం లేదు. నువ్వు చక్కగా పనిచేస్తున్నావు.

నేనడగదలచుకున్నదిది: ఈ పని అవసరమా కాదా? నేను దీని నెందుకు చేయాలి?

Excellent, go on doing it. నీవు చక్కగా పనిచేస్తున్నావు కదా! అయితే ఎవరూ నిన్ను మెచ్చుకోకపోవచ్చు. ఎప్పుడు మెచ్చుకోవాలో ఎప్పుడు మెచ్చుకోకూడదో మనుష్యులకు ఏం తెలుస్తుంది! ఎవ్వరైనా వాళ్ళకంటే బాగాచేస్తే వాళ్లు ఓర్చలేరు!

మనస్సును ఎట్లా కుదుటపర్చుకోవాలో తెలియడం లేదు.

నీ అంతరంగంలోకి చూడు. దైవసాన్నిధ్యము నీలోనే ఉన్నది. తప్పకుండా నీలోనే ఉన్నది. బయట ఎంత వెదికినా దొరకదు. లో చూపు కావాలి. నీలోనే ఉన్నది. The Presence is there. ఇతరుల మెప్పువలన నీకు ఉత్సాహం కలుగుతుందను కుంటున్నావేమో! ఆ సామర్థ్యము నీలోనే ఉంది. పరమలక్ష్యము, పరంజ్యోతి, పరాజ్ఞానము, పరమప్రేమ వీటినే నువ్వు కోరుకో వాలి. వీటికోసం పరితపించిపోవాలి. అవి నీకెక్కడ దొరుకుతా యిలే అని అనుమానిస్తావేమో. ఎక్కడో వెతుక్కోడమెందుకు? అవి నీలోనే ఉన్నాయి. నీలో ఉన్నాయి కాబట్టే నువ్వు వాటిని కనుగొనగలవు. అటులకాని యడల నీ కవి దొరకనే దొరకవు. నువ్వు నీ లోతులలోకి చొచ్చుకొనిపోయినపుడు అక్కడ జ్వలి స్తున్న ఈ గుణాలన్ని నీకు కనబడతాయి!

అదెలా చేయాలి బాబూ, చాలా కష్టమే అని అనుకుంటా వేమో! నీవు బాహ్యదృష్టితో చూస్తే నీకవి కనబడనే కనబడవు.

బాహ్యాలంబనం కోసం నువ్వు చూడనవసరం లేదు. నీ మనస్సును గట్టి చేసుకొని కూర్చో. ప్రార్థించు. లోనికి ప్రవేశించు. ఇక ఏ క్షణంలో ఏమి చేయాలో, ఎలా చేయాలో అంతరంగం లోనే నీకు తెలుస్తుంది. *'నేను' అనుకొనే నీ వునికినంతా, నీ సమస్తమైన చర్యలను సక్రమంగా చేయాలనే తపనతో కనుక చేసినట్లయితే లోపలినుంచి ఎవరో వస్తారు. నిన్నాదుకొని నీకు దారి చూపించి నడిపిస్తారు.* ఏ కష్టమొచ్చినా సరే నీవు దాంతో కుస్తీ పట్టకుండ దానిని దైవానికి సమర్పించుకో. ఇతరులు నిన్నే డిపించినా, భేదాభిప్రాయము కలిగినా, ఎవరైనా నీ మీద కసి తీర్చుకోవాలని నీ మీదకు దాడిచేసినా ఏం పరవాలేదు. దైవానికి ఇవన్నీ కరతలామలకములు. నువ్వు దైవానికి సమర్పితమైనపుడు ఇక నీ బాధ్యతే లేదు. బాధ్యతనంతా ఆయనే వహిస్తాడు. ఆయన కలగజేసుకొని ఏం చేయాలో ఎవ్వరితో ఎలా వ్యవహరించాలో అంతా ఆయనే చేస్తాడు. ఇదే పరిష్కారం. అర్థమయిందా!

కాని నేనేమి చేసినా కూడా మా వాళ్ళకది అర్థం కాదే! వాళ్లు నన్నర్థం చేసుకోలేరు.

వాళ్లు కూడా అందరిలాంటి వాళ్లే. అజ్ఞానంలో కొట్టుమిట్టాడుతుంటారు.

కాని నాకొకటనిపిస్తుంది. నేను మీ ఎదుట కూర్చోవడం ఎంత ప్రత్యక్షమైన విషయమో అది కూడ అంత ప్రత్యక్షమైన విషయమే అని నా కనిపిస్తుంది. నా పనులు చేసేది నేను కాదనీ, నేనేమీ చేయటమే లేదనీ చాలా స్పష్టంగా చాలా ఏళ్లనుంచీ నా కనిపిస్తోంది. నా పనులన్ని నేను చెయ్యటమే లేదు. మరో శక్తి చేస్తోంది. పనులన్ని సక్రమంగానే నిర్వర్తించబడుతున్నాయి. కాని....

నిజమే! కాని మామూలు మనుష్యులకు, మానవమాత్రులకు అది అర్థమయ్యే విషయమా? వారర్థం చేసుకోగలరా?

లేదు. వాళ్ల కర్థం కాకపోవచ్చు. నన్నెవరూ మెచ్చుకోనక్కర్లేదు. కాని నాకు వాళ్లు అడ్డుతగులుతూంటే....

నా కర్థమవుతుంది కదా! నీ గురించి నాకు బాగా తెలుసు. నేను నిన్ను అర్థం చేసుకోగలను. నా అండదండలు నీకున్నాయి. నేనెప్పుడైనా నువ్వు సరిగ్గా చేయటల్లేదన్నానా? సంపూర్ణంగా అహంకారాన్ని జయించి భగవంతునితో ఐక్యమొందిన యోగులకు కాని ఇవన్నీ అర్థం కావులే. వారెలా అర్థం చేసుకోగలరు? వారి దృష్టి బాహ్యాదృష్టి. చర్మచక్షువులతో వారికి కనబడేది కేవలం ఉపరితలమే కదా. వాళ్లు లోతుగా చూడరు. ఎప్పుడైతే నీవు మనుషుల ప్రశంసలకోసం ఆశించవో అప్పుడు నీవిక విచారపడనవసరం లేదు. ఒకవేళ వాళ్లు మెచ్చుకుంటే మంచిదే. మెచ్చుకోకపోయినా పరవాలేదు. వాళ్ల ఖర్మ వాళ్లది. వాళ్ల మెప్పు మెహర్బానీల కోసం మనం పనిచేయం కదా! విహిత కర్మలు నీవు చేయాలి కాబట్టి చేస్తున్నావు. అంతే.

వాళ్ల మెప్పుకోసం నేనెప్పుడూ ఆశించలేదు మదర్.

పరిస్థితులు బహుశా నిన్ను ఆ స్థాయికి చేర్చుతున్నాయిలే. అదే నీ విముక్తి, నిజమైన విముక్తి.

నేను గొప్పలు చెప్పుకోవడం లేదుదాని నేను సాధువును. నాకేమి అక్కర్లేదు.

అదంతా మంచిదే. కాని నీ కుటుంబసభ్యుల నుంచి మెప్పు ఆశించవద్దు.

నేను చేతకాని వాణ్ణి. ఒట్టి అర్భకుణ్ణి. నాకేమి అవసరం లేదు. పొగడ్తలు అక్కర లేదు.

అయితే నీవు బాధపడేందుకు అవకాశమే లేదు. అన్నిటికీ నీవు దైవం మీదనీ ఆధారపడగలవు. అట్టి దైవాధారం నీకుండనే వున్నది. నువ్వు బాధపడవలసిన అవసరమే లేదు.

కాని నేను బాధపడుతున్నానే మరి.

అవును. నీలోని ఘర్షణయే దానికి కారణం. నీలోని ఒక భాగము జ్ఞాని. మరో భాగం పరిస్థితుల చేతులో కీలుబొమ్మ.

(నిశ్శబ్దము)

ఇదంతా నీ విముక్తికే దారితీస్తుంది. దైవానుగ్రహము వలననే అలా జరుగుతున్నదని నీవనుకున్నట్లయితే వెంటనే ఫలితం

కనబడుతుంది. అంతా శాంతి, ప్రశాంతి, ఇక నిన్నెవరూ కలత పరచలేరు. సమత, సామర్థ్యము నిన్నిక వదలవు.

(చాలాసేపు నిశ్శబ్దము)

నేడు నీ పునర్జన్మ. నీ కొత్త జీవితం నేటి నుంచి ప్రారంభమవుతుంది.

అనువాదం: డా॥. ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

సమాచార పత్రం

పాండిచ్చేరిలో 12, 13, 14 ఆగస్టు తేదీలలో, వార్షికసమావేశములలో ఈ క్రింది ఉపన్యాసములు ఏర్పాటు చేయబడినవి.

Depending on the Divine by Kaivalya Smart

The Seven Ignorances by Prof. Kittu Reddy

What Happens to Karma by Dr. Ananda Reddy

Parapsychology in Yogic Light by Shri Sraddhalu

The Current Hindu Upsurge in Sri Aurobindo's Light by Dr. Mangesh Nadkarni

A Battle for the Soul of Humanity by Georges Van Vrekhem

Conversations with the Mother by Shri Mona Sarkar and

The Mother – The Guide Sublime by Prof. Manoj Das.

బీచ్ ఆఫీసులో 17 నవంబరు శ్రీమాత మహాసమాధినాడు, 24 నవంబరు సిద్ధి దినమునాడు ప్రత్యేక కార్యక్రమములు జరుపబడును. 21-23 నవంబరు తేదీలలో స్త్రీల విభాగము వారు 'Integral Progress' అనే విషయముపై ఒక సదస్సును నిర్వహించెదరు. పిదప 26 నవంబరు నుండి డిశంబరు 4 వరకు శ్రీఅరవిందుల గీతావ్యాసములపై మంగేష్ నడ్కర్ణి గారు ఉపన్యాసముల నిచ్చెదరు. *ఈ రెండు కార్యక్రమములకు అందరూ ఆహ్వానితులే.*

ఆగస్టు 2003 దర్శన సందేశం

It is because we have the complete experience that we can show a straighter and easier road to others – if they will only consent to take it. It is because of our experience won at a tremendous price that we can urge upon you and others, "Take the psychic attitude; follow the straight sunlit path, with the Divine openly or secretly upbearing you – if secretly, he will yet show himself in good time, – do not insist on the hard, hampered, roundabout and difficult journey."

Sri Aurobindo

మేమీ యోగంలోని సాధకబాధకాలన్ని అనుభవించాము కాబట్టి మీ కంతకంటె సులువైన, తిన్ననైన మార్గమును చూపించగలము – మీరు దానిని అవలంబించేందుకు ఇష్టపడినట్లయితే. మేమెన్నో వ్యయప్రయాసలను, కష్టనిష్ఠూరాలను భరించాము కాబట్టి నీకు గాని, ఇతరులకు గాని మేమిచ్చే సలహా ఇదే, చైత్య బుద్ధి (psychic attitude) నవలంబించండి.. దైవము నీకు తెలిసియో తెలియకయో, తెర వెనుక నుండియో నీకు మద్దతు నిస్తున్నప్పుడు కఠినమైన ముళ్లంకంచెల మీద, డొంకతిరుగుడు ప్రయాణమెందుకు? ఋజుమార్గమును, క్రాంతిపథము నవలంబించండి. ఒక వేళ ఆయన తెర మరుగున ఉన్నట్లయితే సకాలంలో బయటకు వచ్చి నీకు కనపడుతాడు.

శ్రీఅరవిందులు

సెప్టెంబరు 2003 అఖిలలో సవరణ:

పుట 51 పైన 32 బదులు 33 అని ఉండాలి.

6/11/2003.



గీతా సందేశము

శ్రీఅరవిందుల 'గీతా వ్యాసములు' లోని

చివరి అధ్యాయము

అఖిల

అఖిల భారత పత్రిక నవంబరు 2003

శ్రీఅరవిందుల రచనలను చదివే విధానం

(శ్రీమాత సలహా)

ఈ పారాయణంవలనగాని, లేక శ్రీఅరవిందుల విస్తారమైన ఏ ఇతర రచనలనుండిగాని లాభమును పొందవలెననిన నీవు అవలంబించవలసిన పద్ధతి – నీ చైతన్యము నంతను ఏకము గావించి, పఠనాంశమునందు లగ్నము చేసి, సావధానచిత్తుడవై యుండుము. మనస్సులో చెలరేగు ఆలోచనలను కొంచెమైన అదుపులో పెట్టుము – పూర్తిగా మౌనము గావించిన మరీ మంచిది – మనస్సును నిశ్చలము గావింపుము. మెదడులో యెట్టి స్పందనలు లేకుండా జేయుము. బుద్ధిని స్థిరపరచుము. అప్పుడు చిత్తమంతయు కుదుటపడి, అద్దమువలె, లేదా నిస్తరంగతటాకోపరితలము పగిది అచంచల మగును. ఇక నీవు చదివిన విషయములు నీ మనస్సువలన వికలము జెందక తిన్నగా నీ అంతరాళములోనికి ప్రవేశించును. చాలాకాలం తరువాత, ఆ లోతులనుండి, తిరిగి పైకుబికి తేటతెల్లముగా విదితమగును. ఈ జ్ఞానము, మామూలుగా చదివి తెలుసుకుండేదానివలె గాక, లోనుండి విదితమగు జ్ఞానజ్యోతివలె ప్రకాశించును.

ఇటుల చదివినయెడల నీ గ్రహణశక్తి అత్యుత్తమస్థాయినందుకొనును. అటులగాక మామూలు పద్ధతిలో – మనస్సు ఒక ప్రక్కన ఆలోచనలతో సతమతమవుతూ – చదివినయెడల, ఆ చదివిన విషయము నప్పటికప్పుడే అర్థము గావించుకొన యత్నించును. అప్పుడందులో నిక్షిప్తమైన శక్తి, జ్ఞానము, ఆ పరమ సత్యమంతయూ నాలుగింట మూడు వంతులు వృథా యగును. మరొక విషయము, నీలో వికసించిన ఈ జ్ఞానజ్యోతి, నీ ఉనికి నంతటను వ్యాపించి, దానిని తేజోమయము గావించును.

(*CWM* Vol. 10, p. 7)

అనువాదము: డా. ఆర్.యల్.యస్. శాస్త్రి
(అర్క సౌజన్యముతో)

6/11/20

విషయసూచిక

ఉపోద్ఘాతము

మన జ్ఞానభాండారము లయిన వేదములు, ఉపనిషత్తులు, భగవద్గీతలను శ్రీఅరవిందులు తన యోగనేత్రముతో దర్శించి అందలి రహస్యములను, వారి అమూల్యమైన వ్యాఖ్యానములతో సహా మన కందజేసారు. వాటిని చూసిన యెడల మన కనేక విషయములు తెలిసి, కనువిప్పు కలిగి, మన జీవితమును గురించి తీవ్రమైన జిజ్ఞాస కలుగుతుందనటంలో ఏమాత్రం సందేహం లేదు. ఆయన గీతా వ్యాసంగాన్ని సుదీర్ఘమైన 48 అధ్యాయాలలో కొనసాగించారు. దాని సారాంశము గీతాసందేశము అనే పేరుతో చివరి అధ్యాయంలో మన కందించారు. దానిని చదువుకుంటె మనకి దేవుడు, సృష్టి, మానవజీవితము, దాని నిజస్వరూపము, అతని కర్తవ్యము, గమ్యము, సాధన ఒకటేమిటి అనేక విషయములు తెలియగలవు. అది మనిషిని దీర్ఘసుషుప్తి నుండి తట్టిలేపి కార్యోన్ముఖుడిని చేస్తుందనటంలో ఏమాత్రం సందేహం లేదు. తెలుగులో కనువదించటంలో సాధ్యమైనంతవరకు నలుగురికి అర్థమయ్యేటట్లు సరళమైన భాషలో చేయుటకు ప్రయత్నించాముగాని ఎంతవరకు కృతకృత్యులమయ్యామో తెలియదు. ఏ సందేహం వచ్చినా, స్పష్టంగా అర్థం కాకపోయినా ఆంగ్లమూలము చూడండి.

సంపాదకుడు

శ్రీఅరవిందుల రచనలను చదివినపుడు మెరిసే మెరుపులు

(శ్రీఅరవిందుల 'సావిత్రి' నుంచి)

...when the mantra sinks in Yoga's ear,
Its message enters stirring the blind brain
And keeps in the dim ignorant cells its sound;
The hearer understands a form of words
And, musing on the index thought it holds,
He strives to read it with the labouring mind,
But finds bright hints, not the embodied truth:
Then, falling silent in himself to know
He meets the deeper listening of his soul:
The Word repeats itself in rhythmic strains:
Thought, vision, feeling, sense, the body's self
Are seized unalterably and he endures
An ecstasy and an immortal change;
He feels a Wideness and becomes a Power,
All knowledge rushes on him like a sea:
Transmuted by the white spiritual ray
He walks in naked heavens of joy and calm,
Sees the God-face and hears transcendent speech:...

(*SABCL* Vol. 29, p. 375)

గీతా సందేశము

శ్రీఅరవిందులు

జీవితమంటే ఏమిటి?
కర్మలయొక్క నిజస్వరూపమేమి?
ముక్తజీవికి కర్మలవసరమా?

'మన మెందుకు జీవించాలి' అనే ప్రశ్నకు నీకు తెలిసిన జ్ఞానాన్నిబట్టి నువ్వు సమాధాన మిస్తావు. మరి గీతాచార్యుడు ఏమంటాడో చూద్దాము. మానవజన్మ కేవలం దేశకాలములనే ప్రహరీ గోడల మధ్య బంధించబడిన ఒక తాత్కాలిక ఉదంతము మాత్రమే కాదని, కొన్ని నిమిషాలు మాత్రమే గాలిలో ఎగిరి చచ్చిపోయే కీటకము వంటిది కాదని, అనంతకాలంలో వర్తించే ఓ మహత్తరమైన, వైభవోపేతమైన దైవాంశ సంభూతమని అంటాడాయన.
— సంపాదకుడు

"మానవజీవితము ప్రకృతిపరమైన ప్రక్రియ మాత్రమే కాదు. ఒక క్షణమునకో, సందర్భమునకో, తరమునకో, యుగమునకో సంబంధించినది మాత్రమే కాదు. అది సర్వకాలములకు సంబంధించిన నిత్యసత్యప్రణాళిక. ఆత్మీయవ్యాసంగము. ఆత్మను అభివ్యక్తపరచు అనంత కార్యకలాపము. జీవాత్మ పరమాత్మను చేరుటకు సాగించు దివ్యసాధన. మానవజీవితమునకు విశ్వవిభుని అనంత ప్రణాళికతో అనుబంధమున్నది.

"జీవితలక్ష్యము కేవలము జీవించుట మాత్రమే కాదు. మనము జీవించునది మనకొఱకు మాత్రమే కాదు. పరమాత్ముని కొఱకు కూడ. ఆయన పరమలక్ష్యసాధన కొఱకు కూడ. ఆయన దివ్యసంకల్పము రూపుదాల్చుటలో ఉపకరణముగ ఉపయోగపడుటకు కూడ. జీవాత్మ పరమాత్ముని అంశయే.

"జీవనవ్యాసంగము కేవలము తిని తిరుగుటకు కాదు — అది జీవితమున ఒక సాధారణాంశ మాత్రమే — బాహ్యప్రయోజ

నములు సాధించుటకు గాని భవిష్యత్తులో బంగరుటూయలలో ఊగితూగుటకుగాని కాదు; ఆత్మజ్ఞానమును పొంది ఆత్మోపల బ్ధిని ఆత్మసాక్షాత్కారమును సిద్ధించుకొనుటకు.

నీ నిజస్వరూపము

"ఇది భగవంతుని సృష్టి ప్రపంచము లోని ప్రతివస్తువుకు, జీవికి ఒక ధర్మ ముంటుంది. అది మానవ మానసమునకుగాని, ఆలోచనలకుగాని అంతుబట్టునది కాదు. అది అంతరంగికము. సృష్టికర్త మీదను, ప్రకృతి గతమైన జీవుని మీదను ఆధారపడి వుంటుంది. *పర మోన్నతమైనది, అంతరంగిక అగాధాలలోనిది అయిన నీ నిజ స్వరూపమును కనుగొని తదనుగుణంగా జీవించుటయే నీ పర మధర్మము;* అంతేగాని బాహ్యాప్రేరణలను, పరిస్థితులను ప్రమా ణములను అనుసరించి కాదు. అంతవరకు నీ జీవితము, నీ కర్మలు దోషభూయిష్టములై ఒక సమస్యగా మిగిలిపోవును.

"నువ్వు నీ నిజస్వరూపమును కనుగొని, ఆ పరమసత్య మును దర్శించి, దాని ప్రకారము నివసించినపుడే ఈ సమస్య పరిష్కారమౌతుంది; కష్టములను, అవరోధములను అధిగమించి, నీ నిజస్వరూపమైన దైవాంశమునందు ప్రవర్తించినపుడే దివ్య కర్మలను నిర్వర్తించగలవు. నీ ఆత్మను తెలుసుకొనుము. అది దైవమే అనియు, ఇతరుల ఆత్మలతో ఏకమే అనియు, దైవము లోని ఒక భాగమే అనియు ఎరుగుము. నీకు తెలిసిన జ్ఞానము నందు జీవించుము. నీ ఆత్మలోను, పరాప్రకృతిలోను జీవించుము, దైవసంపర్కము జెంది దైవమువలె మెలగుము. మొదట నీ సర్వ కర్మలను, వర్తనములను నీలోని పరమోన్నతదైవానికి, పిదప ప్రపంచములోని పరమోన్నత దైవానికి బలిదానంగా సమర్పిం చుము. చివరకు కేవలం నీ కర్మలనే కాక, నీ ఉనికి యావ త్తును, నీ సమస్తమైన చర్యలను ఆయన ఇచ్ఛానుసారము, ప్రపం చంలో ఆయన ఇచ్ఛను నెరవేర్చుటకై, పరమాత్మకు, విశ్వాత్మకు సమర్పించుకొనుము. ఇదియే నేను నీకు చూపిస్తున్న మార్గము; ఇది తప్ప మరో మార్గ మేదియు లేదని చివరకు నీకే తెలిసిపో తుంది".

మనిషి ద్వంద్వ స్వరూపము – కర్మలను నిర్వహించునదెవరు?

జీవితాన్ని గురించిన రెండు విభిన్న దృక్పథాలను గురించి భగవద్గీత ఏమంటోందో చూద్దాం. నీ నిజస్వరూపమును కని పెట్టి నీలో దాగివున్న దైవాన్ని గురించి తెలుసుకోవటం అంత సులభమైన విషయం కాదు. ఒక వేళ నీ మనస్సుకు తెలిసినప్ప టికి నీ స్వరూపాన్నంతా పూర్తిగా దానితోనే నింపివేసి, నీ కర్మ లన్నింటిని దాని ఆధ్వర్యము క్రిందకు తెచ్చి, దానిచే నిర్వహింప చేయుట కూడ అంత తేలిక కాదు. *నీ చేతన అంతా ఆ జ్ఞాన ముతో మారుమ్రోగాలి. నీ ఉనికి, నీ సత్త్వము, నీ బ్రతుకు, నీ ప్రకృతి యందెల్లడల అది తప్ప వేరొండు వస్తు వుండరాదు.* నీ జీవితము, అందలి చర్యలు నువ్వందుకున్న చేతనాస్థాయిని బట్టి వుంటాయి. నీ శ్రద్ధను బట్టి, నువ్వు నిరంతరం దేనిని గురించి ధ్యానము చేస్తుంటావో, బాహ్యప్రాపంచిక విషయాలపై నీ దృష్టి ఏ విధంగా వుంటుందో నీ వ్యక్తిత్వము కూడ అలాగే వుంటుంది.

అయితే మానవచైతన్యము రెండు విధాలుగా వుంటుంది. బాహ్యస్వరూపము ఒకటి, అంతరంగిక సత్యమొకటి. నువ్వు కేవలము పైకి కనపడుతున్న రూపమే అని తలచినట్లయితే అది అజ్ఞానపు బ్రతుకే. ఆత్మజ్ఞానమును పొందినయెడల దివ్యజ్ఞాన ములో ఓలలాడుతూ వుంటావు.

మానవుని బాహ్యస్వరూపము

మానవుని బాహ్యస్వరూపము (శరీర మానసాదులు) ప్రాకృతము. ఆ ప్రకృతియొక్క రూపురేఖలే మిటో మనం తెలుసుకోవాలి. ప్రకృతి అనగా ఒక శక్తి. ఈ అస్థి పంజరమును నడిపించునది ప్రకృతి. ఈ జగత్తును సృష్టించునది ప్రకృతి. అయితే మనిషికి ఈ బాహ్యజగత్తుకుగల సంబంధ మేమిటి? ఈ సంబంధము మనస్సు, ఇంద్రియముల ద్వారా నడు స్తుంది. అందుకనే ప్రకృతి వాటిని సృష్టించింది. అహంకారము (ego-sense) ద్వారా తను వేరు అనే భావం కలుగుతుంది. తన

మనస్సు, శరీరము వాటి కార్యకలాపముల నంతా నడిపించునది ఈ అహంకారమే. మనిషి తనకి స్వేచ్ఛ వున్నదని అనుకుంటాడు. కాని 'నేను' అనుకునే ఈ దినుసుకు స్వతంత్రించి ప్రకృతి నధిగ మించే శక్తి ఎక్కడిది? తను కూడ ఆ ప్రకృతి చేసిన బొమ్మయే కదా.

He attributes indeed a certain freedom to his personal will, the will of his ego; but that in reality amounts to nothing, since his ego is only a sense which makes him identify himself with the creation that Nature has made of him, with the varying mind and life and body she has constructed. His ego is itself a product of her workings, and as is the nature of his ego, so will be the nature of its will and according to that he must act and he can no other.

మానవుని అంతఃస్వరూపము

అయితే ప్రకృతి నధిగమించే మార్గ మున్నది. తనలో ఆత్మ ఒకటున్నది. అది ప్రకృతి కాదు – పురుషుడు. సృష్టి యనగా ఈశ్వరుని శక్తియే, ఆయన క్రియారూపమే. ప్రకృతి యనగా పురుషుని శక్తిస్వరూపమే.

In this inner reality the truth of existence is no longer Nature but Soul and Spirit, Purusha rather than Prakriti. Nature herself is only a power of Spirit, Prakriti the force of the Purusha. A Spirit a Self, a being one in all is the master of this world which is only his partial manifestation. That Spirit is the upholder of Nature and her action and the giver of the sanction by which alone her law becomes imperative and her force and its ways operative. That Spirit within her is the Knower who illuminates her and makes her conscient in us; his is the immanent and superconscient Will that inspires and motives her workings. The soul in man, a portion of this Divinity, shares his nature. Our nature is our soul's manifestation, operates by its sanction and

embodies its secret self-knowledge and self-consciousness and its will of being in her motions and forms and changes.

అనువాదకులు: దయానిధి, ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

మానవుని నిజస్వరూపము

మానవజీవితంలో మార్పు రావాలంటే అతని మనస్సు మారాలి. ఆ మార్పు ఊరికే పైపై మెరుగులు కాదు. మనస్సుయొక్క స్వరూపమే మారాలి. ఇంతటి బృహత్తర పరిణామ మెలా సాధ్యము? నువ్వు జ్ఞానమును మనస్సులో దర్శించినంత మాత్రాన సరిపోదు. అది నరనరమునకు, రక్తమాంసములకు కూడ పట్టాలి. అదెలా సాధ్యము? సాధ్యమేనంటారు శ్రీఅరవిందులు. అంతేకాదు దివ్యాచార్యుడు కూడ "This is the great change and transfiguration", runs the message of the Godhead in man, the Avatar, the divine Teacher,..." అంటూ ఈ విధమైన పరిణామాన్నే సూచిస్తున్నట్లు తోస్తుంది.

సంపాదకుడు

మానవుడు బౌద్ధికజీవి. తన నిజస్వరూపమును గురించి బుద్ధితో తెలుసుకొనజాలడు. ఎందుకంటె అతడు కేవలం బాహ్యేంద్రియములలో చిక్కుకొని, బాహ్యజీవనములో నిమగ్నమై అదే సర్వస్వమని అనుకుంటాడు. తన అంతరంగిక వ్యక్తిత్వమును గురించి తనకు తెలియదు. ఎప్పుడైతే ఈ ప్రాకృతిక జీవితము నుండి వెనుదిరిగి అంతరంగిక సత్యమును దర్శిస్తాడో అప్పుడతనికి కనువిప్పు కలుగుతుంది. అప్పుడిక జీవితపు స్వరూపమే మారిపోతుంది. ఈ మామూలు శారీరక జీవితం కూడ అతి విశాలమౌతుంది, the largeness of a divine, immortal and spiritual Power. మన చేతన ఈ మనోప్రాణికములతో సతమౌతున్నది కాక అనంతమైన దివ్యచైతన్యమౌతుంది. నీ జీవితము, నీ బుద్ధి, కర్మలు కూడ అహంకారముతో మూసుకొనిపోయిన ఒక వ్యక్తివి

కాకుండా దివ్యజీవనమై, దైవేచ్ఛయే, దైవకార్యమే నీ ద్వారా నెర వేరుతుంది. ఈ పనులు చేయునది నీవు కాదు – వైశ్వానరయ పురుషుడు, సర్వగతమైన ఆత్మ, నీ ద్వారా యదేచ్ఛగా ప్రవ ర్తించే పరమేష్ఠి.

ఈ పరివర్తనమునకు అర్హులెవరు?

"ఇదియే మహాపరివర్తనము మఱియు రూపాంతరము" అని చెప్పి, మానవునియందలి భగవంతుడు, అవతారపురుష డగు దివ్యగురువుయొక్క సందేశము ఇంక యిలా సాగుతుంది. "ఇందు నిమిత్తమే నేను విశిష్టులను పిలుచుచున్నాను. పోతే ఎవరు ప్రకృతినిర్మిత కరణముల అజ్ఞానమునుండి మఱలించి, తమ ఇచ్ఛను అంతరాత్మయొక్క గభీరతను అనుభవమునకును, లోపలి ఆత్మ మఱియు సత్తను గుఱించిన వాని జ్ఞానమునకును, భగవంతునితో దాని సంపర్కమునకును, పురుషోత్తమునిలో ప్రవే శింప దానికిగల శక్తికిని త్రిప్పుదురో, అదిగో వారు విశిష్టులు. ఈ విశ్వాసమును, ఈ మహత్తర నియమమును ఆమోదించు వారందరును విశిష్టులే, 'ఇష్టులే'. ఏ మానవబుద్ధి తన అజ్ఞానమ నుండి జనించిన అస్పష్టరూపములందును, అర్ధప్రకాశములందును, మానవుని మానసిక, స్నాయవిక (nervous) మఱియు దైహిక విభాగముల అస్పష్టతర అభ్యాసములందును సక్తమై యుండునో, అట్టి బుద్ధికీ ఆమోదము మిక్కిలి కఠినమే; కాని ఒక్కసారి ఆమో దింపబడునేని అది యొక సునిశ్చిత, సముద్ధారక మహామార్గ మగును. కారణము, అది మానవసత్తయొక్క యథార్థ సత్యముతో ఏకము మఱియు అభిన్నము, మఱియు నది అతని ఆంతరతను మఱియు పరమప్రకృతియొక్క యథాభూత వ్యాపారము.

ఈ రూపాతంరము ఎలా జరుగుతుంది?

"కాని ఇది చాల పెద్దమార్పు. ఒక మహాపరివర్తనము" నీ సమస్త సత్తాప్రకృతులను పూర్తిగా మఱలించి, మార్చివేయునిదే, దానిని సాధించజాలవు. అందు నిమిత్తము సర్వోన్నతునికి, దేని

కినిగాక సర్వోన్నతునికి మాత్రమే, నీ ఆత్మ, నీ ప్రకృతి, మఱియు నీ జీవితములయొక్క సంపూర్ణ నివేదన మావశ్యకమగును. కారణము, ఆ పరమునికొఱకే నీవు సర్వమును ధరించవలెను. దేనినైనను, అది భగవంతుని యందున్న రూపమున దప్ప, భగవంతుని ఒక రూపముగాదప్ప, భగవంతునికొఱకుదప్ప, నీవు ఆమోదించ గూడదు. అటులే ఒక నూతన సత్యమునకు ప్రవేశ మిచ్చుటావశ్యకమగును. అనగా తాను మఱియు పరులు, విశ్వము మఱియు భగవంతుడు, అంతరాత్మ మఱియు ప్రకృతులను గుఱించిన ఒక నూతనజ్ఞానము దిశగా, ఒక ఏకతా జ్ఞానము దిశగా, వాసుదేవః సర్వమను జ్ఞానము దిశగా నీ మనస్సుయొక్క సంపూర్ణ పరివర్తన మావశ్యకమగును. ఈ జ్ఞానము మొదట బుద్ధియొక్క ఒక ఆమోదముగా నుండును గాని, చివరికది ఒక అంతర్దర్శనమగును, ఒక చేతన యగును, అంతరాత్మయొక్క ఒక శాశ్వత స్థితియు, దాని క్రియాధారము నగును.

ఈ పేరాకు ఆంగ్లమూలము:

"But the change is a very great one, an enormous transformation, and it cannot be done without an entire turning and conversion of your whole being and nature. There will be needed a complete consecration of your self and your nature and your life to he Highest and to nothing else but the Highest; for all must be held only for the sake of Highest, nothing accepted except as it is in God and a form of God and for the sake of the Divine. There will be needed an admission of new truth, an entire turn and giving of your mind to a new knowledge of self and others and world and God and soul and Nature, a knowledge of oneness, a knowledge of universal Divinity, which will be at first an acceptance by the understanding but must become in the end a vision, a consciousness, a permanent state of the soul and frame of its movements.

ఈ రూపాంతరము ఎలా జరుగుతుంది?

“ఈ నూతన జ్ఞానమును, అంతర్దర్శనమును, చేతనను తన క్రియాహేతువును, ఏకమాత్ర క్రియాహేతువు గావించుకొనునట్టి సంకల్పమును ఆవశ్యకమగును. మఱియునది అనిష్ఠము, పరిమిత మునగు ఒకానొక క్రియాహేతువు మాత్రమే గాక, ఏ కొలది ఆవశ్యక ప్రకృతికృత్యములకో, ఒక సాంప్రదాయక సిద్ధికి సహాయకముగా దోచునట్టి, ఒక మతప్రవృత్తికి ఉచితమగునట్టి ఏ కొలది వస్తువులకో, లేక ఒక వైయక్తిక విముక్తికో సంబంధించిన క్రియాహేతువు మాత్రమే గాక, సమమగు ఆత్మచే చేపట్టబడి, భగవంతుని కొఱకును, సర్వభూతహితార్థమును చేయబడు సర్వమానవ క్రియకును హేతువు గావలెను. ఇంకను పరమపురుషుని గోరు ఒక అనన్య ఆకాంక్షయందును, దివ్యపురుషుని పట్ల ఒక అనన్య ప్రేమయందును, ఒక అనన్య భగవదారాధనయందును హృదయమును పెకెత్తుటయు ఆవశ్యకమగును. మఱియు నిట్లు ప్రశాంతము, ప్రకాశపూర్ణము చేయబడిన హృదయము సర్వభూతముల యందునుగల భగవంతుని ఆలింగనము గావించుకొనుటకు దాని విశాలీకరణమును ఆవశ్యకమగును. చివరకు తానిపుడున్న రూపమున మానవునికే అభ్యాసగత మఱియు సాధారణ ప్రకృతిగలదో, అది ఒక పరమ మఱియు దివ్య ఆధ్యాత్మిక ప్రకృతిలోనికి మాఱవలెను. ఒక్క మాటలో నేది ఏకకాలమున ఒక పూర్ణజ్ఞానయోగము, ఒక పూర్ణసంకల్పము మఱియు దాని కర్మయోగము, ఒక పూర్ణప్రేమ, ఆరాధన మఱియు భక్తియోగము మఱియు సంపూర్ణసత్త, దాని సర్వవిభాగములు, శక్తులు, స్థితులు మఱియు గతులయొక్క ఒక పూర్ణ ఆధ్యాత్మిక సిద్ధియోగము – ఇవి యన్నియు నగునో అట్టి సమగ్రయోగము ఆవశ్యకమగును.

అందుకవసరమైన జ్ఞానము

“అయితే బుద్ధి అంగీకరించవలసిన, అంతరాత్మ విశ్వాసము ధరించవలసిన, మనో హృదయ ప్రాణములకు వాస్తవము,

సజీవము జేయుబడవలసిన ఈ జ్ఞాన మేది యగును? అది తమ ఏకతయందును, సమగ్రతయందును పరమాత్మ మఱియు పరమ సత్తయొక్క జ్ఞానమగును. ఏ ఏకమాత్రుడు నిత్యుడో, తన సవ్యక్తిక మఱియు నిర్వ్యక్తిక భూమికల కావలనెంతో పైనుండునో, ఎవనినుండి ఇది యంతయు ప్రభవించునో, నానావిధ ప్రకృతియందును, ఆమెయొక్క అసంఖ్యాక రూపములందును అభివ్యక్తము చేయునో, అట్టి ఏకేశ్వరుని జ్ఞానమది. తర్వాత ఆ ఏకేశ్వరునియొక్క ఏ నిర్వ్యక్తిక, సనాతన, అక్షరపురుషరూపము గలదో దాని జ్ఞానమది. ఈ అక్షరపురుషుడు మనము ఆత్మ యని పిలుచునట్టి శాంత, అనంతవస్తువు. ఈ క్షణభంగుర, బాహ్యజగత్తుయొక్క రూపములు, శక్తులు మఱియు పర్యవసానముల గాఢసంకులమునందును ఈ ఆత్మ చలించదు, మాఱదు, మాఱిపోదు. చివరకు ఆ ఏకేశ్వరునియొక్కయే, అదే సమయమున ప్రకృతియందు క్షణక్షణము మారుచునట్లు గన్పించు ఏ క్షరపురుషుడు మఱియు శక్తిరూపము గలదో, దానియొక్క జ్ఞానమది. ఈ క్షరపురుషుడు అంతర్నివాసిగా నుండి, ప్రతిరూపమునకు సరిపడునట్లు తన రూపమును మార్చుకొనును మఱియు తన శక్తియొక్క ప్రతి అంతస్తునకును, ప్రతి అంశమునకును, ప్రతిక్రియకును అనురూపముగా తనను దిద్దుకొనును. ఈ పురుషుడు ఈ సమస్తముకంటెను సదా అనంతగుణంబు లధికుడయ్యును, ఈ సమస్తము నగుచు, చరాచరములందును, విషయి విషయములందును, అంతరాత్మ మఱియు మనఃప్రాణద్రవ్యములందును, ప్రతిసత్తయందును, ప్రతిశక్తియందును, ప్రతిజీవితమునందును నివసించును.

భగవంతుని పూర్ణస్వరూపము

"సత్యముయొక్క ఏదో యొక పార్శ్వమునే అభిమానింతువేని, నీవీ యోగసాధన చేయలేవు. నీవు అన్వేషించవలసిన భగవానుడు, నీవు కనుగొనవలసిన సర్వాత్మ, నీ అంతరాత్మ ఎవని సనాతనాంశమో, ఆ పరమ పురుషుడు ఏకకాలమున ఈ మూడు (క్షర, అక్షర, ఉత్తమములు) నై యున్నది. ఒక పరమ ఏకతయందు

వానిని నీ వేకకాలమున ఎరుగవలెను. ఏకకాలమున ఆ మూడింటిలోనికి నీవు ప్రవేశించవలెను, మఱియు సర్వస్థితుల యందును, సర్వవస్తువుల యందును ఆ ఏకేశ్వరునే దర్శించవలెను. అతడు ప్రకృతియందు నివసించు క్షరపురుషుడు మాత్రమే యగుచో, అపుడొక శాశ్వత, విశ్వమయ సంభూతి (ప్రవాహము) మాత్రమే యుండును. నీ విశ్వాసమును, జ్ఞానమును ఆ పార్శ్వమునకే పరిమితము గావింతువేని, నీ వ్యక్తిత్వమును, క్షణక్షణము మాఱుచుండు దాని రూపములను ఎప్పుడును దాటిపోజాలవు; ఆ పునాదిపై నీవు సర్వదా ప్రకృతిభ్రమణములందు చిక్కుకొని యుందువు. కాని నీవు కాలమునందలి అంతరాత్మ – క్షణముల పరంపర మాత్రమే గావు. నీలో నీ వ్యక్తిత్వప్రవాహమునకు ఆధారముగా నుండు ఒక నిర్వ్యక్తిక ఆత్మ గలదు. అది భగవంతుని వ్యాపక, నిర్వ్యక్తిక తత్త్వముతో ఏకము, అభిన్నము. మఱియు నీ నిర్వ్యక్తికతా సవ్యక్తికతల కావల అగ్రగణ్యుడవై, ఇచ్చటి నీ సత్తయొక్క ఈ రెండు నిత్యధ్రువములపై నాధిపత్యము వహించును. సనాతన పరాత్పర సత్తయందు నీవు సనాతనుడవు, పరాత్పరుడవునై చెలంగుదువు".

అనువాదము: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి, చెలసాని నాగేశ్వరరావు
('గీతా వ్యాసముల' నుండి)

"A perfect perfection comes only by living in the supreme and the whole Divine. Then the soul of man is united with the Godhead of which it is a portion; then it is one with all beings in the self and spirit, one with them both in God and in Nature...

Sri Aurobindo

దైవం అంటే

కేవలం ఆద్యంతరహితమైన అమూర్త ఆత్మయేనా? నిజానికి మనం ఎవరం? ఎలా ఉండవలసి ఉంది?

దైవము సృష్టిజాలములో అమూర్తంగా మాత్రమే వ్యాపించి లేడు. ప్రతిజీవిలోను ఒక ప్రత్యేక రూపంలో మూర్తీభవించి కూడ వున్నాడు. కాబట్టి మనమాయనను అన్ని రూపాలలోను దర్శించాలి. జీవితంలోని ప్రతిక్షణము ఆయనను సాక్షాత్కరించుకోవాలి. జీవితాన్ని తిరస్కరించటమో లేక ఏదో కాలక్షేపంగా గడపటంలో అర్థం లేదు – వ్యర్థం నీ కంతకంటె చాల ముఖ్యమైన పాత్రను దేవుడు నిర్దేశించాడు. కాబట్టి ఆయన చేతిలో నువ్వొక అస్త్రమువై ఆయన కార్యమునకు నిమిత్తుడవు కమ్ము.

– సంపాదకుడు

"చేష్టగాని, సృష్టిగాని లేకపోవడమే ఆద్యంతరహితమైన అమూర్త ఆత్మలక్షణమని, అదే పరమసత్యమని – ఇలానే అనుకుంటూ ఉంటే – ఈ ప్రపంచమే కాదు – ఈ ప్రపంచంలోని నీ ఆత్మ కూడా వట్టి భ్రమే అవుతుంది కదా! మిగతా అంశాలతో ఏమాత్రం సంబంధం లేకుండా నీ విశ్వాసాన్ని, నీ విజ్ఞానాన్ని ఆత్మయొక్క ఈ ఒక్క లక్షణానికే పరిమితం చేస్తే – అప్పుడు ఇక జీవితాన్నీ, అలాగే నీ కర్మల్నీ ఉపసంహరించుకోవటమే శరణ్యం.

కాని నిజానికి అలా కాదే! ఈ ప్రపంచంలో భగవంతుడు వాస్తవం. అలాగే ఈ ప్రపంచంలో నువ్వూ వాస్తవమే కదా! ఈ ప్రకృతీ, నువ్వూ కూడా ఆ సర్వేశ్వరుని శక్తులే! ఆ పరాత్పరుని రూపాలే! అంతే తప్ప మరోటి కానేకాదు. కాబట్టి ఈ కర్మల్నీ, ఈ జీవితాన్ని అంగీకరించాలే గాని తృణీకరించకూడదు.

ఈ ఆత్మ పరమాత్మతో ఏకమై, ఆ సౌరభాన్ని గ్రహించడంవల్ల, ఆ దైవత్వంలోని సనాతన అంశమే ఆయనపట్ల అనంత

మైన ప్రేమగాను, అపారమైన ఆరాధనగానూ మారి, నీ ఆధ్యాత్మిక వ్యక్తిత్వాన్ని ప్రదీప్తం చేస్తుంది. నీ జీవితాన్ని, అసలు ఎలా ఉండాలో అలా మలుస్తుంది. నువ్వు దైవకార్యాలకు ఒక పరికరంగా, ఒక వాహికగా, ఒక దివ్యశక్తిగా రూపొందగలవు. నిజానికి అలానే వుండాలి.

కాని, ప్రస్తుతం జరుగుతున్నదేమిటి?

అజ్ఞానంవల్ల అయేతేనేమి, అపరిపక్వతవల్ల అయితేనేమి, నిమ్నప్రకృతివల్ల అయితేనేమి నీలోని ఆ దైవత్వం నాశనం కావడానికి నీ అహమే కారణం అవుతోంది. కాబట్టి ఆ సర్వోత్తముని ఆత్మలక్షణమైన దివ్యశక్తిని నింపుకుని, ఆయన ఆదేశాలకూ ఆయన కార్యక్రమాలకు ఒక వాహనంగా నీ జీవితాన్ని రూపొందించుకోవాలి. అలా రూపొందించుకోవడంలో అహంవల్ల ఏ మాత్రం అపకారం జరక్కుండా జాగ్రత్తపడాలి. తెలివిగా మసులుకోవాలి.

ఇలా చేస్తే నీ జీవితపరమసత్యాన్ని తెలుసుకొని ఆ బాటలో మనుగడ సాగించగలవు. భగవంతునితో సంపూర్ణ సమైక్యతను సాధించగలవు. లోపరహితమైన పూర్ణయోగమంటే ఇదే!

సర్వోత్తముణ్ణి తెలుసుకో

"భగవంతుడంటే – ఈ సకల దృశ్య ప్రపంచానికీ అతీతమైన నిత్యుడు. కాలం, ఆవరణా, ప్రేరణా వంటి వాటి పరిమితులకే కాదు అసంఖ్యాకమైన గుణాలకు లక్షణాలకు సైతం అతీతుడు. ఆయనే పురుషోత్తముడు. అలా అన్నంత మాత్రాన ఆ దివ్యసనాతనుడు ఐహిక సంబంధం లేనివాడని అర్థం కాదు. ఈ ప్రపంచంనుండి, ఈ ప్రకృతినుండి, ఈ జీవకోటినుండి విడిపోయి కేవలం ఏకాకిగా ఉంటాడని భావించకూడదు.

ఆయన నిర్గుణ పరబ్రహ్మ. సకల మూర్తిమత్వాలూ కలిగి ఉంటాడు, అమూర్త ఆత్మగానూ ఉంటాడు. ఆయనే ఇక్కడి చైతన్యమూ, ప్రాణమూ, పదార్థమూను, ఆత్మా ఆయనే, ప్రకృతీ ఆయనే! ఇంతెందుకు – సృష్టిలోని చిత్రవిన్యాసములన్నీ ఆ పర

మాత్ముని అనంతమైన దివ్యసంకల్పాలే. ఆయన సర్వశక్తిమంతుడు. He is the supreme transcendent Spirit and all comes into manifestation from him and are his forms and self-powers

ఆయన ఇక్కడ ఏకైక ఆత్మగా ఉండడంవల్ల సమానత్వం, వ్యాపకత్వం, నిస్వార్థంవంటి లక్షణాలు కలిగి ఉంటాడు. సర్వమానవుల్లోనూ, సమస్త జంతువుల్లోనూ, ఆఖరికి సకల వస్తువుల్లోను అదృశ్యంగా ఉంటాడు. ప్రకృతి ధర్మమూ, శక్తీ కూడా ఆయనే అవుతాడు. ఆయనే పరమాత్మ. మిగతా ఆత్మలన్నీ ఈ ఏకైక దివ్యాత్మలో ప్రజ్వలించే నిరంతర జ్వాలలే!

ఆ పురుషోత్తముడే ఇక్కడ ఆత్మల్లో ఉన్నప్పుడు పురుషుడు అవుతాడు. కాబట్టి ప్రతీ ప్రాణిలోనూ నాశరహితమైన కొన్ని దివ్యాంశాలు ఉంటాయన్న మాట. అన్ని రూపాలకు ఆయనే స్రష్ట; ఆయనే అధినేత. సకల లోకాలకు, వాటి జీవకోటికి ఆయనే అధినాధుడు. సమస్త చర్యలను ప్రభవింపజేసే సరశక్తిమంతుడు ఆయన. అయినా వేటికీ కట్టుబడి ఉండడు. మళ్లి క్రియ, కృషి, కర్మత్యాగం చేయునదీ ఆయనకే.

అన్నిటిలోనూ ఆయనే ఉంటాడు. అన్నీ ఆయనలో ఉంటాయి. అన్నీ ఆయనే కాగలడు – అన్నిటికీ అతీతంగానూ ఉండగలడు. సృష్టించనూ గలడు – ఆ సృష్టికి బంధింపబడకుండానూ ఉండగలడు.

సర్వోన్నతుడైన ఆ భగవంతుడు అవతారమూర్తిగా అవరోహణం చెందుతాడు. విభూతుల రూపంలో ఆయన శక్తిని పంపిస్తాడు. ప్రతీ వ్యక్తిలోనూ అదృశ్యంగా అలరారే దైవత్వం ఆయనే. మానవులు ఆరాధించే సకల దేవతలూ కేవలం ఆ ఏకేశ్వరుని వ్యక్తిత్వాలు, రూపాలు, నామాలు, మూర్తీభవించిన మనోరూపములు మాత్రమే.

ప్రపంచం పరమాత్ముని అవతరణ

"భగవంతుడు తన చైతన్య సారం లోంచి, అనంతసత్తనుండి ఈ ప్రపంచాన్ని ఆవిర్భవింపజేశాడు. అంతే కాదు. సాక్షాత్తు తను కూడ అనేక రూపాలలో అవతరి

స్తాడు. ఈ సకల వస్తుజాలము ఆయన శక్తులే. ఆయన రూపాలే! ఈ లీలలకు అంతం అనేది ఉండదు. ఆయనే అనంతుడు కదా! ఇక ఆయన లీలలకు మాత్రం అంతం ఎలా ఉంటుంది?

ఈ సమస్త విశ్వంలో అనంతకాలంలో జరిగే అనంత సృష్టిలో ఎటువంటి పక్షపాతంగాని, ఆధిక్యతగాని, స్వపరభేదం గాని లేకుండా సర్వే సర్వత్రా సమంగా వ్యాపించి ఉంటాడు. ఇటువంటి సర్వసమాన నిర్మలాత్మకు ప్రత్యేకంగా చర్యలేవీ ఉండవు. అయితే వ్యక్తుల, వస్తువుల చర్యలకు మాత్రం ఆ పర మాత్మ నిర్మమకారమైన బాసటగా ఉంటాడు.

సంకల్పంవల్ల మాత్రమే ఈ జగత్తులోని చర్యలను, సర్వ నిర్ణయాలను చేసే విశ్వచైతన్యంగా, కాలచైతన్యంగా ఆయన పురు షోత్తముడే! ఆయనకుగల బహుముఖ శక్తిసామర్థ్యాల ద్వారా ఈ జగత్కార్యాన్ని నిర్వహిస్తాడు. ఆ చైతన్యశక్తినే మనం ప్రకృతి అంటాం. ఆయన ఈ సర్వజగత్తుకీ సృష్టి స్థితి లయకారకుడు. అంతే కాదు. అన్ని జీవుల హృదయాల్లోను ఆయన అధివసించి ఉంటాడు.

అలా అదృశ్యశక్తిగా ఉంటూనే – అక్కణ్ణుంచే ప్రకృతి గుణంలోనూ, నిర్వహణలోను కొన్ని లీలలను ప్రదర్శిస్తాడు. ఈ సకలజీవకోటిని వాటి వాటి స్వభావాలకు తగ్గట్టు ప్రత్యేకంగా విడివిడిగా రూపొందిస్తూ వాటిలో క్రియాశీలతను ప్రవేశపెడ తాడు. జీవుని హృదయంనుంచే ఇవన్నీ నిర్విహిస్తున్నా, విశ్వంలో ఉన్నట్లుగానే ఆయన లీలలు ఉంటాయి. ఏ మాత్రం తక్కువ కావు. అదే ఆయన దివ్యత్వం ప్రత్యేకత. పరమాత్ముని నుండి తొలుత ఆవిర్భావం పొందిన దివ్యత్వం ఇదే. సమిష్టిగాను, వ్యష్టి గాను, సుస్థిరంగా జరిగే ఆయన అవతరణే విశ్వాన్ని సంక్లిష్టమ యంగా చేసింది.

దివ్యమానవుని మూడు దశలు

“దివ్యమానవునికి సంబంధించి నిత్యమూ, సత్యమూ అయిన మూడు దశలు ఉంటాయి. ఈ ప్రాణికోటి అంతకీ భూమిక, ఆధారము అయిన ఒకానొక నిరంతర నిర్వి

కార స్వరూపం ఉంటుంది. నిరంతరం ఉండే ఈ చైతన్యం ప్రకృతితో తాదాత్మ్యం చెంది సకల ప్రాణులలోను సదా ఆవిష్కారమై ఉంటుంది. ఎల్లవేళలా అలా కొలువు తీరి ఉండే ఈ అతీత దివ్యత్వం ఏకకాలంలోనే ఆత్మగానూ, పరమాత్మగానూ కూడా వ్యవహరిస్తుంది. ఒక స్వచ్ఛమైన నిశ్చలమైన (అక్షర) దివ్యశక్తిగానూ, అదే సమయంలో క్షరరూపంలోనూ ఉంటుంది. అంతే కాదు ఈ విశ్వంలో జీవన ఆవృతాలుగా కూడ ఉంటుంది. ఎందుకంటే ఈ రెండింటిని కలిపి చూసినా, విడివిడిగా చూసినా ఆ పరమాత్మ ఈ రెండింటికంటె భిన్నుడు. వాటికంటె అధికుడు. ఆధ్యాత్మిక చైతన్యమైన పరమాత్మ చిచ్ఛక్తే మనలో ఉన్న జీవుడు. ఆ జీవుడు తన అంతరాంతరాల్లో దైవాన్ని అంతర్భాగంగా పొంది ఉన్నాడు. ప్రకృతిలో ఆ జీవుడు విశ్వాత్మగా జీవిస్తున్నాడు. – no temporary creation but an eternal soul action and moving in the eternal Self, in the eternal Infinite.

ప్రకృతిలో మానవుడు తాదత్మ్యం చెందే దశ

"మనలోని చైతన్య ఆత్మ ఈ మూడు దివ్యదశలలో దేనినైనా సంతరించుకోవచ్చును. మానవుడు ప్రకృతిలో కలిసిపోయి దానిలో మాత్రమే జీవించగలడు. తన ఆత్మ వాస్తవాన్నీ, తనలో అధివసించి ఉన్న దైవాన్ని గమనించలేని మానవుడు ప్రకృతిని మాత్రమే గమనించగలడు. ఈ సకల సృష్టిని నిర్వహించేది ఆ ప్రకృతే అని ఆ ప్రకృతే సృష్టిశక్తి అని భావిస్తాడు, భ్రమిస్తాడు. ఆ ప్రకృతి తన ఆజ్ఞవల్లనే తనను, ఇతరులను, అనేక రకాల జీవకోటిని సృష్టించిందని కూడా అనుకుంటాడు. బాహ్యాచైతన్యాన్ని అధిగమించి తనలో ఏమి ఉందో తెలుసుకోలేకుండా ఇప్పుడు అతడు ఉన్న బాహ్యజీవితంలో అయితే అది అంతే.

ఈ బాహ్యచైతన్యాన్ని అధిగమించి తన అంతరంగంలో ఉన్న దానిని తెలుసుకొనేవరకు – మానవుని ఆలోచనలు, సిద్ధాంతాలు దీపం క్రింద క్రీనీడలు వంటివే. తెరపై పడే ఛాయాచిత్రాలు వంటివే. అతనిలోని దైవం తెరమరుగైపోవడంవల్ల కూడా ఇటు

వంటి అజ్ఞానం ఆవహించే అవకాశం ఉంది. మన పూర్తి అజ్ఞానంవల్ల ఆ పరమాత్మ మహిమను మనం దర్శించలేకపోతున్నాము.

His greater reality is lost to our view by the completeness with which he has identified himself in a partial appearance with his creations and images and absorbed the created mind in the deceptive workings of his own Nature. And it is possible also because the real, the eternal, the spiritual Nature which is the secret of things in themselves is not manifest in their outward phenomena.

అంటే మనం కళ్లతో చూచునది, మనస్సుతో ఆలోచించునది, శరీరంతో ప్రవర్తించునది – ఇదంతా మన అధోప్రకృతి – ఒక దొంగ. వాస్తవాన్ని మరుగుపరిచి పైపై ఆచ్ఛాదనలనే చూపడం వంటిది. ప్రయోజనంలేని అధమాధమ విలువ లన్నింటికి పట్టంగట్టి అందలమెక్కించే మాయలమారి దివ్య ఆవిర్భావానికిగల పూర్ణశక్తిగాని, పరమానందంగాని, మహిమగాని, మాధుర్యంగాని ఇందులో ఉండవు.

మనలోని ఇటువంటి లక్షణాన్నే 'మాయ' అంటాం. ఇది అహంకారంవల్ల పుడుతుంది. ఈ మాయ – ద్వంద్వాల సుడిగుండం. అజ్ఞానాల గూడు. లంపటాల సంపుటి. సాత్వికం, రజస్సు, తమస్సు అనే మూడు గుణాల మూట.

తనలో ఉన్న ఆత్మలోను, దివ్యత్వంలోను కాకుండా మానవుడు తన మనస్సుకు, ప్రాణానికి, శరీరానికి సంబంధించిన బాహ్య వాస్తవాల్లో జీవిస్తున్నంత వరకు అతడు భగవంతుణ్ణి చూడలేడు. అసలు తనను తానే చూసుకోలేడు.

ఇప్పుడున్న ఈ స్థితిలో ఈ ప్రపంచాన్ని ఈ మాయని అధిగమించలేదు. దాంతో మానవుడు చేయగలిగిందల్లా మాయ ఆడించినట్టే ఆడ్డమే.

నిర్వికార స్థితిలో మానవుడు జీవించే దశ

"ప్రస్తుతం అధోస్థితిలోని తన ప్రకృతిలో జీవిస్తున్న మానవుడు అక్కడినుండి పైకి వచ్చే ఆవకాశం ఉంది. అంధకారంనుండి తేజస్సు వైపుకు పురోగమించవచ్చును. శాశ్వతమైన నిర్వికార ఆత్మస్థితితో తేజస్సత్యమైన జీవనం సాగించవచ్చును. అప్పుడు మానవుడు సంకుచితమైన వైయక్తిక కారాగారానికి ఏమాత్రం బందీ కానక్కర లేదు. ఆలోచనల్లోనూ, ఆచరణల్లోనూ, అనుభూతుల్లోనూ తనను తాను కించపరుచుకో నక్కరలేదు. అతిచిన్న విషయానికే తనను బాధపెట్టి, ఇబ్బందులు పాలు చేసి ముప్పతిప్పలు పెట్టే క్షుద్ర అహం అవతలికి పారిపోతుంది.

అప్పుడు మానవుడు నిర్మలచైతన్యంలో సువిశాల, స్వేచ్ఛామయమైన అమూర్త ఆత్మస్థితిలో విలీనమై ఉంటాడు. నిర్గుణ పరబ్రహ్మ అయిపోతాడు. తనలోని ఆత్మ ఇతరుల ఆత్మకు అభేదం అని తెలుసుకుంటాడు. ఆ స్థితిలో మానవునికి అహం అనేది ఉండనే ఉండదు. సుఖదుఃఖాలు, రాగద్వేషాల వంటి ద్వంద్వాలకు అతీతుడౌతాడు. అప్పుడు కష్టాలలో కూరుకుపోవడంవల్లగాని, ఆనందాలకు ఆటంకం రావడంవల్లగాని దుఃఖం రాదు. కోరికలకు చలించడు. అంతెందుకు పుణ్యాలకు పొంగిపోడు. కష్టాలకు కుమిలిపోడు. అయితే ఐహిక ఛాయలు ఇంకా అతడిమీద కొన్ని మిగిలివున్నా వాటిని అతడు ఏమాత్రం పట్టించుకోడు. ప్రకృతి తన సహజలక్షణాలను ప్రసరింపజేస్తోంది అని అనుకుంటాడే గాని వాటికి ఏ విధంగాను స్పందించడు. వాటి మధ్యలో మనుగడ సాగిస్తున్నా అవి తనకు పెద్ద విషయాలుగా అనిపించవు.

ప్రకృతి తన సహజ యాంత్రికమైన ధోరణిలో తన పనిని తాను చేసుకుపోతూ ఉంటుంది. స్వచ్ఛమైన చైతన్యం మాత్రం క్రియారహితంగా, స్వేచ్ఛగా, ప్రశాంతంగా, నిర్వికారంగా, నిశ్శబ్దంగా ఉంటుంది. ప్రకృతి చర్యలేవీ ఆ చైతన్యానికి అంటవు. వాటన్నిటిని అది పరిపూర్ణ సమానత్వంతో గమనిస్తుంది. ఆ విష

యము లన్నింటికంటె తను విభిన్నమన్న విషయం తెలుసుకుం ంది.

ఈ రకమైన ఆధ్యాత్మికస్థితివల్ల స్థిరమైన శాంతి, స్వేచ్ఛ లభిస్తాయి. అయితే ఈ స్థితివల్ల చైతన్యవంతమైన దివ్యత్వంగాని, సమగ్ర పరిపూర్ణతగాని రాదు. అదొక గొప్ప దశ. అంతేగాని అదే సమగ్ర దివ్యజ్ఞానంగాని, ఆత్మజ్ఞానంగాని కాజాలదు.

సంపూర్ణ దివ్యత్వంలో మానవుడు మెసిలేదశ

"సర్వోత్తమంగా సర్వసమగ్ర దివ్యత్వంలో జీవిస్తున్నప్పుడు మాత్రమే కచ్చితమైన పరిపూర్ణత లభిస్తుంది. అప్పుడు మానవుని ఆత్మ దైవంతో సమైక్యమై తనలో ఒక భాగంగా సహజీవనం సాగిస్తుంది. ఆత్మపరంగాను, చైతన్య వంతంగాను కూడా మిగతా ప్రాణులతో తనూ ఒకటి కాగలగు తుంది. దైవమూ – ప్రకృతీ – ఈ రెండింటితోనూ సమైక్యం చెందగలుగుతుంది.

అటువంటి స్థితిలో ఆత్మకు స్వేచ్ఛతోపాటు పరిపూర్ణత కూడా లభిస్తుంది. ఉత్తమోత్తమ పరమానందంలో మునిగిపోవ డంతో ఆత్మ పరిపూర్ణతా శిఖరాన్ని అందుకోడానికి సంసిద్ధంగా ఉంటుంది. ఆ స్థితిలో అన్ని విషయాలలోను నిర్మమకారంలో నిమగ్నమౌతున్నప్పటికీ, మానవుడు తన ఆత్మను సనాతనమైన దివ్యచైతన్యంగా భావిస్తూనే ఉంటాడు. అతని భావంలో మార్పు వస్తుంది. త్రిగుణాల ప్రభావంవల్ల కేవలం యాంత్రికశక్తితో మాత్రమే ప్రకృతి తన పని తను చేసుకుపోతుందనే భావనను అతడు తోసిరాజంటాడు. దివ్యచైతన్యంవల్ల, భగవంతుని ఆవిర్భావ శక్తివల్లనే ప్రకృతి తన ప్రక్రియను సాగిస్తోందనే భావనను సంత రించుకుంటాడు.

నిమ్నప్రకృతిని చైతన్యక్రియయొక్క పరమసత్యంగా అతడు చూడడు. దివ్యత్వంయొక్క ఉత్తమోత్తమ చైతన్యలక్షణాన్ని తెలు సుకొనే స్థితిని అతడు సంతరించుకుంటాడు. ప్రస్తుతం మనస్సు లోను, శరీరంలోను అసంపూర్ణత చోటుచేసుకున్నదన్న పరమ

సత్యాన్ని తెలిపే శక్తికి ఆలవాలమైన ఉత్తమోత్తమ దివ్యచైత న్యాన్ని అవగాహన చేసుకుంటాడు.

అధోమానసికవ్యవస్థ నుండి ఈ ఉన్నత చైతన్యస్థాయికి ఎదగడంతో మానవుడు అహంనుండి విముక్తుడౌతాడు. సకల ప్రాణులతో అద్వైతభావన వల్లా, నిత్యచైతన్య క్రియాశీల లక్షణం వల్లా, దైవత్వంతో ఏకత్వం చెందిన శక్తి వల్లా, అనంత దివ్య త్వానికి చెందిన సనాతన ఆత్మవల్ల మానవుడు జ్ఞానసంపన్నుడు అవుతాడు. ఆ విజ్ఞాన సమాహారంతో అతడు తనను తాను దివ్యా త్మగా తెలుసుకుంటాడు.

అతడు సర్వేశ్వరునిలో సర్వాన్ని దర్శించగలుగుతాడు. సర్వంలోనూ సర్వేశ్వరుని సందర్శించగలుగుతాడు. ప్రపంచంలోని సర్వభూతములలోను వాసుదేవునే వీక్షిస్తాడు. ప్రియాప్రియాలు, సుఖదుఃఖాలు, ఆశానిరాశలు, పాపపుణ్యాలు వంటి ద్వంద్వాలకు అతీతుడౌతాడు. దివ్యేచ్ఛను, దివ్య కార్యాచరణను అవగాహన చేసుకోగలుగుతాడు. విశ్వాత్మగాను, విశ్వచైతన్యంలో భాగం గాను, విశ్వశక్తిగాను, అతడు జీవనం సాగిస్తూ ఉన్నతమైన మను గడ సాగిస్తాడు. అతనిలో అలౌకిక దివ్యానందము, దివ్యాహ్లా దము వెల్లివిరుస్తూ ఉంటాయి. ఆ ఉదాత్తస్థితిలో మానవచర్య లన్నీ దివ్యచర్యలే! అతని స్థితి ఉన్నతోన్నత దివ్యస్థితే!

He lives and acts as a soul and portion of the universal consciousness and power; he is filled with the transcendent divine delight, a spiritual Ananda. His action becomes the divine action and his status the highest spiritual status.

అనువాదం: పున్నమరాజు నాగేశ్వరరావు

As the one self he is here all-pervasive and equal and impersonal in man and animal and thing and object and every force of Nature.

Sri Aurobindo

జ్ఞానయోగము ద్వారా వ్యక్తిత్వము నధిగమించుట

నువ్వు నీ మానవస్థాయినుండి బయల్దేరి బ్రాహ్మీస్థాయిని జేరుటకు ఎన్ని మజిలీలు కావాలి? ఇది ఎంత సుదీర్ఘమైన ప్రయాణము? ఒక్కొక్క స్థాయిని జేరుకుండేందుకు ఎంత ప్రయత్నమవసరము? మొదట నీ చిత్తచాంచల్యమును జయించాలి. నీ ఆత్మను జేరుకోవాలి. మళ్లీ నీ ఆత్మలో అనేక శ్రేణులు. "నేనొక వేరు మనిషిని" అనే భావాన్ని దాటిపోవాలి. అంటే నిన్ను నీవు అవ్యక్తీకరణ మొనర్చుకోవాలి. నీ అంతర్వాణిని, అంతరంగంలో మ్రోగే దివ్యవాణిని వినటం నేర్చుకోవాలి. ఇది సాధ్యమేనా? సాధ్యమేనని గీతాచార్యుడు మన కభయమిస్తున్నాడు. — *సంపాదకుడు*

నిత్యమైన నీ అక్షరరూపోపలబ్ధి

ఎవ్వరైతే వారిలోని దైవవాణిని వినగలరో, ఎవ్వరైతే అకుంఠిత విశ్వాసముతో ఉన్నత జ్ఞానమును పొందగలరో అట్టివారికి నేనీ వరమును, ఈ పరిష్కారమును, ఈ విముక్తిని అనుగ్రహించగలను. అయితే ఈ మహోన్నతస్థాయికి చేరాల్నంటే నువ్వు నీ *అధోప్రకృతితో పూర్తిగా తెగతెంపులు చేసుకోవాలి;* నీ తెలివికంటెను, మనోహృదయములకంటెను, ఇంద్రియములు శరీరముకంటెను ఉన్నతమైన దానిమీద నీ బుద్ధిని కేంద్రీకరించాలి; చిరంతనము, అక్షరము, అవైయక్తికము (impersonal) సర్వజీవులయందు ఉన్న నీ స్వరూపమును పొందాలి.

అయితే నువ్వు నీ అహంకార, మానసికస్థాయిలలో నివసిస్తున్నంత కాలము గానుగెద్దువలె చక్రభ్రమణము చేస్తూ వుంటావేగాని ఫలితం సున్న. అంతర్ముఖుడవై నీ కోరికలకు, ఇంద్రియాకర్షణలకు అతీతంగా నీ బుద్ధిని మళ్లించు. Lift it upward beyond mind and its associations and attachments and its

bounded wish and thought and impulse. నీలో ఏమాత్రం కల వరపడకుండా ప్రశాంతంగా, శాశ్వతంగా, వ్యక్తులపట్ల, సంఘట నలపట్ల సమభావం కలిగి, నిష్పక్షపాతంగా పకృతివలన వికారం చెందకుండా ఉండే స్థాయిని పొందుము. ఆ స్థాయిలో సుస్థిరమై శాశ్వతాత్మను, బ్రహ్మీస్థాయిని పొందుము. నువ్వు నీ ఆధ్యాత్మిక స్థాయి నందుకుని అందులో శాశ్వతంగా స్థిరపడిన యెడల నీకిక తిరుగులేదు. నీ అహంకారముగాని మనస్సు నిర్మించిన రూప ముగాని నిన్ను బాధపెట్టి ఆ మహోన్నతమైన శాంతి, జ్ఞానశిఖ రముల నుండి నిన్ను పతనము గావించలేవు.

అహమును బహిష్కరించుము

నువ్వు నీ అహమునకు, దాని వ్యాపారములకు దాసుడవై ఉన్నంతవరకు నువ్వు నీ వ్యక్తిత్వాన్ని అధిగమించలేవు. నీలో కోరికలు చెలరేగుతున్నంత కాలం అహంకారము నిన్ను పీడి స్తూనే ఉందన్న మాట. కోరికలు నిన్ను – 'నేను, నాది' 'ఈ వస్తువులన్నీ నావి' అనీ, ప్రియాప్రియములు, ఆశానిరాశలు, సంతో షసంతాపములు, ప్రేమద్వేషములు, కోపతాపములూ నిన్ను బాధి స్తూనే ఉంటాయి. అన్ని విషయములలోను నీవే గెలవాలనీ, అన్నీ నీకు ప్రియముగానే ఉండాలనే భావమూ, దుఃఖము, బాధలు, ఓటములను భరించలేకపోవటమూ కూడ అందువలనే. కోరికలు న్నంత కాలం నీ మనస్సు నిర్మలంగా ఉండదు. నీ దృష్టి వికృ తమై జ్ఞానము మసగబారి నిన్ను ఎందుకు పనికిరాని చీకటి మనిషిగా చేస్తుంది. Desire and its preferences and violences are the first strong root of sin and error.

కోరికలున్నంత కాలం నీకు స్థిమితముండదు. నువ్వు వెలుగును చూడలేవు. మొక్కవోని జ్ఞానమును నువ్వు అనుభవిం చలేవు. కోరికలు (కామన, desire) వున్నంత కాలం ఆత్మజీవి (Right being) కాలేవు. ఎందుకంటే కోరిక యనగా, నీ నిజ రూపమును వికారపరచునది. నువ్వు సదాలోచనలుగాని, సత్క

ర్మలుగాని, సద్భావములుగాని చేయలేవు. (Right thought, action, feeling)

కోరికలను హతమార్చుము, మోహమును వీడుము

కోరికలను సంహరించుము. సకల వస్తువులను నీ సొంతం చేసుకోవాలనీ బాహ్యాముగా వాటి ననుభవించాలని చూడకు. బాహ్యాస్పర్శలకు, వ్యామోహములకు లొంగిపోకు. అంతరంగములో సుస్థిరముగా ఆసీనుడవై నీలోను, నీ మనస్సులోను, ఇంద్రియాల లోను చెలరేగే కోరికలను తిరస్కరించు. సుఖదుఃఖాలవలన చలింపకు. ఆశానిరాశలను, ఇష్టాయిష్టాలను, జుగుప్సాభావమును నీలో నుంచి బహిష్కరించు. వీటన్నిటి పట్ల ఉదాసీనంగా ఉండు. నిన్ను ఆకర్షించే వాటిపట్ల కూడ నిర్మలమనస్కుడవై వుండు. వీటన్నిటిని నువ్వు అతినిశ్చలమైన, ప్రశాంతమైన, అవైయక్తిక (impersonal) దృష్టితో మాత్రమే గమనించు.

విశ్వాత్మయొక్క శాంతిని పొందుము

సమదృష్టితో చూడుము

అప్పుడు నీలో చాలా గొప్పమార్పు వస్తుంది. అది చాల అద్భుతంగా ఉంటుంది. మనిషికి పక్షపాతం ఉంటుంది కానీ, దేవునికి పక్షపాతం ఉండదు గదా. సమమనస్కుడవై, సమహృదయుడవై ప్రియాప్రియములు మొదలైన సమస్తమైన ద్వంద్వములకు అతీతముగా నుండుము. మనుమలపట్ల కూడా అంతే. ఇక నీకు తనవారు పరాయివారు అనే బేధమే లేదు! దుష్టులు – మంచివారు, బ్రాహ్మణ శూద్రులు, మహాపురుషులు అల్పులు, అందరూ నీకొకటే. వాళ్ళతో నీకే విధమైన సంబంధమున్నా సరే మిత్రులు, శత్రువులు, ఆప్తులు, విరోధులు ఎవ్వరైనా నీకొక్కటే. ఈ ద్వంద్వములన్నీ నీ అహంకారానికి చిహ్నములు. అహంకారం నుండి విముక్తి పొందడము కదా మనకు కావలసినది. *ఇవన్నీ వ్యక్తిగత సంబంధములు. నీకు కావలసినది అవైయక్తిత్వము.* ఇవన్నియు వ్యక్తిగత, కాలగత భేదములు. వాటి ప్రభా

వమునకు నీవు లోను కాకూడదు. ఏ భేదము లేకుండ సమస్త మానవులలోను సర్వఘటనలలోను సమంగా ఒకే రీతిలో వర్తించే విశ్వాత్మయే నీకు కావాలి.

ప్రాకృతిక రూపం నుండి వెనుదిరిగి అంతరంగములో సుస్థిరముగ వసించుము

నిన్ను నీవు ఒక ప్రేక్షకునివలె గమనించవలెను. నీలో కర్మలు జరుగుతూనే ఉంటాయి. అయితే కర్తవు నీవు కాదు. నీలో ప్రకృతి పనిచేస్తూ ఉంటుంది. ప్రకృతి ఖేలనము, గుణ ముల విన్యాసము జరుగుతూనే ఉంటాయి. నువ్వందులో నిమ గ్నము కాకూడదు. నీ తల దూర్చకు. నీలో సంభవించే చాలన ములను (actions) ఒక ప్రేక్షకునివలె గమనించుము. నీ చుట్టు ప్రక్కల, ఇతరులలోను జరిగే ఖేల కూడ అంతే. *అయితే వాటి ఫలితములు నీవనుకున్నట్లుండవు. వాటి కర్తవు నీవు కాదు – ఒక మహాశక్తి విశ్వప్రకృతిలో చేయు కార్యములని ఎరుగుము. నీ బాహ్యరూపమునుండి వెనక్కు మళ్లి అంతస్థితుడవై యుండుము.* అక్కడున్నదెవరో తెలుసా? పురుషుడు, అచంచ లుడు. అయినప్పటికీ నీలో గుణముల ననుసరించి ప్రకృతి పని చేస్తూనే ఉంటుంది. నీవు మట్టుకు అచలంగా సుస్థిరుడవై అంత రంగంలో సుఖాసీనుడవై ఉండుము. **Live secure in the purity of an impersonal spirit, live untroubled by the mortal waves that persist in your members.**

"If you can do this, then you will find yourself uplifted into a great release, a wide freedom and a deep peace. Then you will be aware of God and immortal, possessed of your dateless self-existence, independent of mind and life and body, sure of your spiritual being, untouched by the reactions of Nature, unstained by passion and sin and pain and sorrow. Then you will depend for your joy and desire on no mortal or outward or worldly thing, but will possess inalienably the self-sufficient delight of a calm

and eternal spirit. Then you will have ceased to be a mental creature and will have become spirit illimitable, the Brahman. And into this eternity of the silent self, rejecting from your mind all seed of thought and all root of desire, rejecting the figure of birth in the body, you can pass at your end by concentration in the pure Eternal and a mighty transference of your consciousness to the infinite, the Absolute.

అనువాదం: డా. ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

నిరీశ్వరోపాసనకు భగవత్పర కర్మలను జోడించాలి. సర్వసంగపరిత్యాగమే ఉత్తమమార్గమని తలచరాదు.

ఆధ్యాత్మిక ప్రయాణము కొనసాగించిన కొద్దీ అనేక రహస్యములు తెలుస్తూ వుంటాయి. దైవము అనేక స్థాయిలలో ద్యోతకమౌతూ వుంటాడు. అంతమాత్రాన నువ్వు కర్మలను వదిలేసి జీవితాన్ని ఎడారి చేయకూడదు. అలా చేయటంవలన నువ్వు దైవకార్యానికి ద్రోహం చేసిన వాడివే అవుతావు. నువ్వేం చేయాలో ఏం చేయక్కర్లేదో నిర్ణయించునది ఆయనే. నీ కర్మలకు కర్త దైవమేకాని నువ్వు కాదు. కర్మలను నిర్వహిస్తూ దైవేచ్ఛని పాలించాలి. అది కూడ ఆధ్యాత్మిక జీవితంలోని భాగమే.

— సంపాదకుడు

"నీయందు స్థితమై యున్న నిత్యచైతన్యస్వరూప కార్యకర్తను నేనే" యని తెలుసుకో.

"అయితే కర్మయోగంయొక్క పరమార్థమిదేనని భావించటం తగదు. యోగలక్ష్యము, సాధనమార్గము ఉత్కృష్టమైనవే. కాని నీకు ఉచితమైన మార్గమిది గాదు. నీ యందున్న నిత్యచైత

న్యస్వరూపుడనైన నేనే కార్యకర్తను యని గ్రహించు. నీ నుంచి కేవలం కర్మలను మాత్రమే ఆశిస్తున్నానని తెలుసుకో. ఆ కర్మలను ఏదో మొక్కుబడిగా, నిరాసక్తతతో ఆచరించటం తగదు సుమా. నీవు ఆచరించు కర్మలు భగవత్పరమై, హృదయపూర్వకంగా నిమిత్తమాత్రుడవన్న భావనతో, 'సర్వేజనాః సుఖినోభవన్తు, లోకాస్సమస్తాః సుఖినోభవన్తు' యని ప్రతిధ్వనిస్తూ, భగవత్కైంకర్యం కావాలి. ఈ కైంకర్యభావనాపరమైన కర్మ, యోగసిద్ధికి హేతువు కాగలదు. అందువల్ల కర్మను ఎట్టి పరిస్థితులలోను త్యజించకుండ, ఆ కర్మను ఆచరించటం అత్యావసరమని గుర్తించు. కర్తవ్యనిర్వహణలో ఎవ్వరికీ, జీవన్ముక్తులకుగాని, సిద్ధపురుషులకుగాని, ముక్తాయింపు లేదని తెలుసుకో. అయితే జ్ఞానమార్గం తీరు వేరు సుమా! జ్ఞానయోగానికి మరిన్ని మెరుగులు పెట్టి, కర్మయోగం భగవత్సాన్నిధ్యానికి చేర్చగలదు. అనగా, కర్మలను జ్ఞానపూర్వకంగా ఆచరించాలని తాత్పర్యము. కర్మయోగసాధనతో ఈ జగమంతా రామమయమని, ఈ సర్వము తానేనని, విశ్వాత్ముడైన పరమాత్మకు, తనకు అబేధమని తెలుస్తుంది. ఇదే యోగరహస్యమని తెలుసుకో.

ముక్తకర్మ సమత్వంతో కూడుకొన్న బంధరహితకర్మ

"ద్విముఖమైన నిర్గుణతత్వానికి, నిస్సంకల్ప, నిష్క్రియ, బ్రాహ్మీస్థితి యొకటి కాగా, సర్వకర్మలకు మూలమైన నిత్యచైతన్యస్వరూపము రెండవది. ద్విపాత్రాభినయనం చేస్తున్న ఈ స్వరూపంలో, భగవత్సంకల్పం నిక్షిప్తమై, జీవునికి మార్గదర్శకము వహిస్తున్నది. అహంకారప్రేరిత కామ, క్రోధాది అరిషడ్వర్గముల విశృంఖలాలలో బడిన నీకు, ఈ భగవత్సంకల్పం ఊహింపతరం గాదు. ఈ సర్వస్వము ఆత్మస్వరూపమేనని, '*వాసుదేవస్సర్వమితి, ఈశ్వర స్సర్వభూతానాం*' యని భావించే స్థితికి, నీవు ఎదిగినప్పుడు మాత్రమే, భగవత్సంకల్పం నీకు భాసింపగలదు. ఈ చైతన్యస్వరూపము సర్వత్రా సకల జీవరాశులందు భాసించుట చేత, గుప్తమైన సంకల్పశక్తివల్ల, సృష్టియందు కర్తవ్య

నిర్వహణ సజావుగా జరిగిపోతుంది. అనగా, సృష్టికర్త కర్మాధ్య క్షుడైన, ఆ పరమాత్ముడే కర్తవ్యం నిర్వహిస్తాడని గ్రహించవచ్చును. ఈ విధమైన కర్మ, అనగా భగవత్సంకల్పమే సర్వకర్మలకు ప్రేరణ యన్న భావన, బంధరహితమై, ఆనందహేతువు కాగ లదు. అయినప్పటికీ, కరుణాసముద్రుడైన పరమాత్ముడు, జీవులను ఉద్ధరించటానికి, దివినుంచి భువిపై అవతరిస్తాడు. ఆ స్వరూ పము నీ యందే స్థితమైనదని తెలుసుకో. నీ యందే గాక, సర్వాం తర్యామియై, సర్వజీవుల గతిని నిర్దేశిస్తున్నాడు సుమా! నీవున్నూ ఏ విధమైన ప్రలోభాలకు లోనుగాకుండా భగవత్సంకల్పం కార్య రూపం గావించుటకు తీవ్రంగా కృషి చేయాలి. విశ్వశ్రేయస్సే లక్ష్యముగా కర్తవ్యం నిర్వహించు. సమత్వంతో కూడుకొని, కర్మ ఫలాపేక్షరహితమైన ఈ కర్మ ముక్తకర్మ యని గ్రహించు.

కర్మయోగ ప్రథమ సూత్రము – నిష్కామకర్మ

"ఎగువ వివరింపబడిన కర్మయోగంలో, ఫలాపేక్షరహితమై, కర్తవ్య నిర్వహణమే పరమావధిగా కర్మను ఆచరించటమే ప్రథ మసోపానమని గ్రహించు. కర్మ చేయువాడు, చేయించువాడు, పరమాత్ముడేనన్న భావన మదిలో బలపడగా, కర్మఫలమందు ఆసక్తి వీగిపోయి, కర్మఫలము భగవద్దత్తము కాగలదు. భగవ త్సంకల్పమే కర్మఫలమునకు మూలమై, అందుకు అనుగుణంగా లాభనష్టాలు, జయాపజయాలు విశ్వశ్రేయస్సు ననుసరించి సంభ విస్తాయని తెలుస్తుంది. కాబట్టి నిస్స్వార్థ ఫలాపేక్షరహిత కర్తవ్య నిర్వహణయే కర్మయోగసిద్ధికి ప్రప్రథమ సూత్రమని గ్రహించ వచ్చును. కర్మఫలమును ఆశించక, లాభనష్టాలుగాని, జయాపజ యాలుగాని ప్రశాంతచిత్తుడవై స్వీకరించు. కర్తవ్యనిర్వహణలో తొట్రుపడకుండా, పరమాత్ముడే మార్గదర్శకుడన్న చింతనతో ముందుకు సాగిపోవాలి.

నీవు ఆచరిస్తున్న కర్మలందు కర్తృత్వభావన తొలగించుకొని సర్వము భగవద్దత్తం చేయి.

"ఇది సాధన ప్రథమ సోపానము మాత్రమేనని తెలుసుకో. నీవు ఆచరించు కర్మలందుగాని, వాటి ఫలితములందుగాని అపేక్షారహితుడవు గావటం అవసరం. కర్మయందు కర్తృత్వభావన తొలగించుకొని, ఆ కర్మఫలమును ఆశింపక, సర్వస్వము ఈశ్వరార్పణ చేయి. నీ సహజప్రకృతి నీయొక్క కర్మను నిర్దేశిస్తుంది. నీ ప్రకృతి ననుసరించి నీ స్వభావము స్పందింపగా, తదనుగుణంగా, కర్తవ్యనిర్వహణకు నిన్ను ఆదేశిస్తుంది. అందువల్ల "నేను చేస్తున్నాను" అను భావనకు నీయందు తావుండకూడదు. నీవు ప్రతి నిత్యము ఆచరించే సర్వకర్మలందు 'నేను' 'నాది' యను భావనలను సమూలంగా నాశనం చేసుకొని ఆ కర్మలను తరతమ భేదం లేకుండా ఆచరిస్తూ, నీ సర్వస్వము ఆ పరమాత్మునికి ధారాదత్తం గావించాలి.

పరమాత్ముణ్ణే కర్తగా దర్శించు. నీవు ఆచరించు సర్వకర్మలకు, భగవత్సంకల్పమే మూలమని గ్రహించు

"నీవు నిత్యచైతన్యస్వరూపముయొక్క అంశమేనని నిరంతరము గుర్తుంచుకో. అంతేకాదు. నీవేనని నీవు భావించే నీ శక్తియుక్తులన్నీ, ఆ నిత్యచైతన్యస్వరూపముయొక్క ప్రతిరూపాలే సుమా! నీ పాత్ర ఒక భూమిక వరకే పరిమితమైనదన్న కఠోర సత్యం మరువవద్దు. ఆ నిత్యచైతన్యస్వరూపమే సర్వకాలాలలోను, సర్వావస్థలలోను భాసిస్తున్నదని గ్రహించు. అందువల్ల 'నేను చేస్తున్నాను' అనే భావన పూర్తిగా విస్మరించి, నీ ముందున్న నిత్యచైతన్యస్వరూపమునే కర్తగా దర్శించు. ఆ నిత్యచైతన్యస్వరూపము, సృష్టిలో నీ యందు వ్యక్తమవుతున్నదన్న పరమరహస్యం తెలుసుకో. కాబట్టి ఆ స్వరూపానికి నీ వొక సాధనము మాత్రమేనని ఎల్లప్పుడూ గుర్తుంచుకో.

“నీవు అవశ్యము నిస్సంకల్ప స్థితిని పొందు. ఇక జరుగు తున్న సర్వము భగవత్సంకల్పమేనని నీకు భాసింపగలదు. నీ సర్వస్వము ఈశ్వరార్పణగావించు. అయితే ఈశ్వరార్పణగావిం చటం సులభం కాదు. అహంకారపూరితమైన స్వార్థచింతన, ఇంద్రియప్రవృత్తులు ఆటంకం కల్గిస్తాయి సుమా. వీటితో కూడు కున్న కర్మయందు త్యాగనిరతి కొరవడి యోగసిద్ధి దూరమవు తుంది. అందువల్ల సర్వకర్మలందు త్యాగస్ఫూర్తి అలవరచుకొ నటం ప్రథమకర్తవ్యంకాగా, సమత్వం రెండవది. అపేక్షరహితంగా ఆచరింపబడు కర్మ సమత్వానికి చిహ్నం. సమత్వం నిత్యజీవి తంలో సర్వత్రా ప్రతిబింబించగా, జరుగుతున్నదంతా దైవేచ్ఛగానే నీకు భాసిస్తుంది.

ఇదే కర్మయోగసిద్ధి, ఆనందస్థితి యని గ్రహించాలి

“ఈ తీరుగా భగవత్పరంగా సర్వకర్మలను ఆచరించటం. సర్వసంగపరిత్యాగం కన్నా ఉత్కృష్టమై ముక్తి హేతువౌతుంది. ఈ జగత్తులో కర్మసన్యాసం ఎన్నటికీ తగదు. అనవసరం కూడ. కొన్ని పరిస్థితులలో ఈ ప్రక్రియ విపరీత పరిణామములకు దారి తీయవచ్చును. సృష్టిలో కర్తవ్యనిర్వహణయందు శ్రేష్టులు, సద్గుణ సంపన్నులను ఇతరులు అనుసరించటం మనము ఎరుగుదుము. తన ప్రకృతిని అనుసరించి జీవుడు కర్మను ఆచరించుచున్నాడు గదా. తన యందున్న నిత్యమైన, శాశ్వతమైన చైతన్యస్వరూపమే ఇందుకు మూలమన్న సత్యము గ్రహించిన విజ్ఞులు, మహాత్ములు ఈ సృష్టిలో కర్తవ్యనిర్వహణకు మనస్ఫూర్తిగా పూనుకొని, అర మరికలు లేకుండా, తమ కర్తవ్యం నిర్వహిస్తూ, సర్వజీవులకు, మార్గదర్శకులు కావాలి.

జీవన్ముక్తులు, ఆనందస్వరూపులైన వీరు ధన్యజీవులు గదా.”

అనువాదం: శ్రీ శరణ్

కర్మ జ్ఞానములకు ప్రేమను జోడించుట

యోగసిద్ధి అనగా ఒక్కసారి దైవసాక్షాత్కారమును పొందుటయే కాదు. దానికి అనేక పార్శ్యములున్నవి – జ్ఞానముతో తేజరిల్లుట, కర్మలలో దైవమును దర్శించుట మొ॥ గొప్ప విషయములే కాని హృదయమనే దొకటున్నది కదా – దానికి ఆర్ద్రత కావాలి. అది దివ్యప్రేమ ననుభవించాలి. ఆనందంలో ఓలలాడాలి. "...an integral knowledge brings a greater triple delight. It opens the gates of the Transcendents's bliss; it releases into the limitless delight of a universal impersonality; it discovers the rapture of all this multitudinous manifestation; for there is a joy of the Eternal in Nature.... Add to knowledge and works this crown of the eternal triune delight; admit this love, learn this worship; make it one spirit with works and knowledge. That is the apex of the perfect perfection"

– సంపాదకుడు

"జ్ఞాన మభిలషించు మనశ్శక్తియు – కర్మాసక్తమైన యిచ్ఛాశక్తియు మాత్రమే నీవు కావు. ఆనందము కోరు హృదయము నీలో నున్నది. ఈ యాత్మ సంతృప్తి కొరకు కానందమునకై బరితపించు నీ హృదయావేదనలో – దాని తేజములో – శక్తిలో – నీ స్వభావమును ముంచి పరివర్తనము గావించి భగవంతునితోటి ప్రజ్ఞాయుక్తమైన యానందము కొరకు దాని నుద్ధమింప జేయుము. నిర్గుణాత్మోపలబ్ధి దానికి తగిన యానందమును జేకూర్చుచున్నది. అవ్యక్తాత్మానందము కలదు. కాని యది స్వచ్ఛమైన యాత్మయొక్క యొకేయొక యానందము మాత్రమే. కాని సమగ్రమైన జ్ఞాన మానందమును త్రిగుణీకృతము జేయును. ఈ జ్ఞానము విశ్వాతీతానందముయొక్క కవాటములను విప్పారజేయుచున్నది. విశ్వగత నిర్గుణాత్మయొక్క మేరలేని యానందమును వెదజల్లుచున్నది. ఈ పరిణామములోని నానావిధ రూపములయొక్క పరవశతను నీ కున్మీలనము జేయును. ఎందుకన

ప్రకృతిలో సనాతనుడైన వా డానందమయ పురుషుడు. ఆ సనాతనుని యంశమైన జీవునిలో నీ యానందము ఆతని మూలకారణమైన భగవంతునిలోను నాతని పరమోన్నతమైన యాత్మలోను పొదుకోబడిన భావోన్మాదమై యున్నది. నిశ్శేషమైన భగవత్ప్రేమారాధనలు విశ్వమును – దానిలోని రూపములను – శక్తులను – జీవభూతములను – యాలింగనము జేసికొనును. అన్నిటిలోను భగవంతుని దర్శించెదవు. కనుగొందువు. ఆరాధించెదవు. సేవించెదవు. లేక అద్వితీయములో నున్నట్లు భావించెదవు. కర్మజ్ఞానములకు మరియు త్రివిధ శాశ్వతానందములకు చూడామణియైన భక్తి ననుసంధింపుము. ఈ భక్తికి స్థాన మిమ్ము. ఈ యారాధన నేర్చుకొనుము. కర్మజ్ఞానములతో దీని నేకము జేయుము. పరిపక్వమైన సంపూర్ణత కిది శిఖరము వంటిది.

భక్తి పారవశ్యము

"ఈ భక్తియోగ మాధ్యాత్మిక విస్తరతను – ఐక్యతను – విముక్తిని జేకూర్చగల విశేష శక్తిని నీ కొసంగ గలదు. కాని భగవత్ జ్ఞానముతో నేకీభవించగల ప్రేమగ నుండవలెను. కష్టపీడితుడైనపు డాదరణకొరకు సహాయ్యముకొరకు – కష్టముల బారినుండి విముక్తికొరకు భగవంతు నర్థించు భక్తి యొకటి కలదు. వరముల కొరకు – భగవంతుని సహాయ్య రక్షణలకొరకు – గోర్కెల నీడేర్చు నిధియని భగవంతు నన్వేషించు భక్తి యొకటి కలదు. జ్ఞానతేజముల నర్థించు మూఢభక్తిగూడ నొకటి కలదు. ఈ త్రివిధ రూపములైన భక్తికి నీవు కట్టుబడి నంతవరకు నీ భగవదాకాంక్షా భక్తు లెంత యున్నతోన్నతమైనను ఎంత యుదార సంపన్నమైనను త్రిగుణములయొక్క కార్యకలాపము నీలో విడువక యంటుకొని యుండును. భగవత్ ప్రేమోపాసి భగవత్జ్ఞాని కూడ యైనయడల నుపాసకు డుపాసనా మూర్తితో నైక్యమగుచున్నాడు. ఎందుకన నిట్టి భక్తిజ్ఞానములు గలవాడే భగవంతుని ప్రియుడు మరియు నాత్మచే నేరి యెన్నుకోబడిన మహనీయుడు. భగవంతునిలో లీనముజేయునట్టి భక్తిని నీలో

బెంపొంద జేసికొనుము. నికృష్ట స్వభావమునుండి విముక్తిబడి యాధ్యాత్మికముగ మార్చబడిన హృదయ మపారమైన భగవంతుని యునికిలోగల రహస్యముల నీకు బట్టబయలు జేయును. భగవచ్ఛక్తియొక్క ప్రవాహమును – మహిమను – స్పర్శను – నీలోనికి గొనితెచ్చును. మరియు నాశరహితమైన పరవశతయొక్క రహస్యముల నీకు వికసితము జేయును. సంపూర్ణమైన జ్ఞానమనకు సంపూర్ణమైన భక్తియే త్రోవ.

"ఈ సమగ్రమైన భగవద్భక్తి నీలోను సకల భూతములలోను వెలయు భగవానుని హితార్థము సమగ్రమైన కర్మ యత్యవసరమని శాసించుచున్నది. సామాన్య మనుజుడు కోర్కెలు పాపభూయిష్టమైనవో – లేక పుణ్యహితమైనవో – లేక యుచ్ఛమైనవో – మనోభిప్రాయములు సాధారణమైనవో – లేక శ్లాఘనీయమైనవో – కామప్రవృత్తులు నీచమైనవో – లేక యుచ్ఛమైనవో – లేక మిశ్రితమైన మనఃప్రాణోద్దేశ్యములో విధించిన రీతిగ గర్మల నాచరించుచున్నాడు. కాని నీ వాచరించు కర్మ కామ్యరహితమై స్వేచ్ఛగలిగి యుండవలెను. కామరహితమైన కర్మ ప్రతిక్రియను గాని బంధములనుగాని గలిగింపజాలదు. భగవదావేశములోను లేక సంపూర్ణమైన సమత్వములోను – చలింపని స్థిరతలోను – ప్రశాంతిలోను – జేయబడు కర్మ ప్రప్రథములో భారరహితమైన మోతయనదగు నాధ్యాత్మిక ధర్మముగ గనబడును. ఇదియే కర్తవ్యకర్మ. పిమ్మట నది భగవద్యజ్ఞముగ నుత్తేజమొందును. కర్మయొక్క యత్యున్నతస్థితి యందది క్రియాసమేతమైన యద్వితియతలో శాంత్యుత్సాహములతో మిళితమైన దన యామోదమును వెలిబుచ్చునట్టిది యగును. ఏకబద్ధమైన ప్రేమ యెంతెంతో నెక్కువ జేయగల్గును. ప్రతిక్రియలేని స్థిరతస్థానములో బలోపేతమైన పరవశతను నెలకొల్పును. ఈ పరవశత యహంకారేచ్ఛయొక్క క్షుద్రోత్సాహము కాదు. కాని యది యాద్యంతములు లేని యానందసాగరము. నిన్ను క్రియావేశునిగ జేయు నీ ప్రియుని సన్నిధానముయొక్క నిష్కల్మషమైన దివ్యావేశమును నీ కర్మలలోనికి గొని తెచ్చును. నీలోను సకలభూతములలోను వెలయు

భగవంతుని కొరకు పాటుబడుచున్నావను సంతోషము మాటి మాటి కనుభవించగలవు. కర్మలయొక్క చూడామణి – జ్ఞానము యొక్క మకుటాయమానము భక్తిప్రేమలు.

When God-love is the deep heart of action, the Lover feels the Presence of the Beloved into works also

"జ్ఞానరూపమైన యీ భక్తి – నీ కర్మకలాపముయొక్క హృదయనాళమైన యీ భక్తి – నిశ్శేషమైన నివేదనకు మరియు సంపూర్ణతకు ఫలప్రదాయినియగు గొప్పశక్తిగ నున్నది. పరిపూర్ణాధ్యాత్మిక జీవితమునకు వ్యక్తిగతసత్త భగవంతునితోటి కృత్స్న సంయోగము తప్పని విధియనుట నిస్సందేహము. కనుక నిశ్శేషముగ భగవంతున కున్ముఖుడ వగుము. నీ సర్వస్వభావమును భక్తిజ్ఞానకర్మలచే నాతనిలో నైక్యము జేయుము. అతనికి సంపూర్ణముగ నభిముఖుడవై నీ సర్వచైతన్యమును – నీ యింద్రియములను – శరీరమును సహితము భగవచ్చరణములకడ జంకుగొంకులేక యర్పింపుము. అతని దివ్యచైతన్యముయొక్క నిష్కళంకమైన మూసలో నీ చైతన్యము నామూలాగ్రముగ నాతనిచే పోతబోయబడుట కనుమతింపుము. నీ యిచ్ఛ యాతని దోషరహితమైన యిచ్ఛాశక్తిగ పరిణితము గానిమ్ము. నీ శరీరేంద్రియములు సహితమానంద పరవశలతో గూడుకొనిన భగవచ్ఛరీరమగునటుల నాకాంక్షింపుము. నీ సర్వస్వముతోటి యాతనికి క్రతువొనర్చి యాతనినే యారాధింపుము. నీ ప్రతియొక యాలోచనలోను – భావములోను – నావేశములోను – చేష్టలోను – నాతనినే జ్ఞప్తియందుంచుకొనుము. ఈ విషయము లన్నియు సంపూర్ణముగ నాతని పరమగువరకు సతతము పావన మొనర్చు నాతని సన్నిధానము పవిత్రమైన నీ యాత్మరంగమందున్న విధమున నీ సర్వ సామాన్య విషయములు – బాహ్యావిషయములు సహా యాతడు చేకొనువరకు పట్టువిడువక గృషి సల్పుము.

Let your very sense and body be the rapturous sensation and body of the Divine. Adore and sacrifice to him with all you

are; remember him in every thought and feeling, every impulsion and act. Persevere until all these things are wholly his and he has taken up even in most common and outward things as in the inmost sacred chamber of your spirit his constant transmuting presence.

అనువాదం: పి. బాలయ్య శ్రేష్ఠి ('గీతా సందేశము' నుండి)

పరమ సిద్ధి

ఈ మూడూ ఒకటైన మార్గమే నీవు నీ క్రిందిస్థితినుండి మహోన్నత – ఆధ్యాత్మికస్థితికి సమగ్రంగా చేరుకోవడానికి తగిన సాధనం. అది నిగూఢంగా దాగివున్న పరమచైతన్య ప్రకృతి. ఉన్నతుడు, అనంతుడు మరియు దివ్యుడైన జీవుడు అందులో ఒక భాగమై, దానితో సాధర్మ్యం కలవాడై, ఆ సత్య తత్త్వంలోనే ఉంటున్నాడు. కాని బాహిరమైన మాయలో ఏ మాత్రం లేడు. మహోన్నతమైన విశ్వాతీతపు టునికిలో ఈ సమ గ్రతనూ, ఐక్యతనూ దాని సహజస్థితిలో విడిగా అనుభవించ వచ్చు.

కాని ఈ మానవశరీరంలో, భౌతికజగత్తులో కూడా నీవు దాన్ని సాక్షాత్కరించుకోవచ్చు, సాక్షాత్కరించుకోగలవు. ప్రశా తంగా, అకర్మణ్యుడవై, గుణరహితుడవై నీలో నీ వుంటూ బాహ్య జగత్తులో వాటి యాంత్రికమైన చర్యను గమనించడం, అనాస క్తంగా దానిని కొనసాగనివ్వడం ఇక్కడ ఏమాత్రం సరిపోదు. ఎందుకంటే క్రియాశీలమైన స్వభావాన్ని, ఆత్మనూ దైవానికి సమ ర్పించి తుదకు దైవంగానే మారిపోవాలి గదా! నీవు నీ యావత్స్వ రూపాన్నీ ఆ పురుషోత్తమునితో సాధర్మ్యం కలదిగా చేసుకో వాలి. ప్రతిదీ అందులో 'నేనే అది' (మద్భావం) అనే భావాన్ని పొందాలి. అక్కడ పరిపూర్ణమైన శరణాగతి (ఆత్మసమర్పణ) అవ

సరం. నీ స్వభావానికి చెందిన సర్వసజీవస్థితులతో సహా అన్ని మార్గాలలోనూ 'నన్నే' రక్షకుడుగా గ్రహించు. ఎందుకంటే అలా గ్రహించడం మాత్రమే గొప్ప మార్పునూ, సమగ్రతనూ సాధించగలదు.

మానవుని అసమగ్రతకు ఏకైక హేతువు, దాని నివారణోపాయము

ఉన్నతమైన ఈ యోగపరిపూర్ణత వెనువెంటనే కర్మసమస్యను పరిష్కరిస్తుంది, లేదా దానిని సమూలంగా ధ్వంసం చేసివేస్తుంది. మానవుని కర్మ పెక్కు సంకటాలతోనూ, చిక్కులతోనూ కూడి వున్నది. అది తనలోనుండి వెలుపలికి వెళ్ళడానికి దారిని సుగమం చేయక తనలోనికి మాత్రమే తీసుకొని వెళ్లే చీకటి మార్గాలతో కూడినదై విభ్రాంతిని కల్గిస్తున్నది. అయితే మానవుడు మానసిక – ప్రాణిక – భౌతిక ప్రకృతులకు చెందిన అజ్ఞానంలో బంధింపబడి వుండడం అనే ఒకే ఒక కారణంవల్లనే ఈ కష్టము, సంక్లిష్టత కల్గుతున్నాయి.

అయితే అతనిలో అంతర్గతమై వున్న ఏదో ఒక తత్త్వం అతడు ఆత్మ అనీ, ఇప్పుడు తాను ఏదిగా లేడో, అదిగా – అంటే ప్రకృతిని నియమించే ప్రభువుగా ఉండాలనీ భావింపజేస్తున్నది. అతని జీవన నియమాలన్నీ, ధర్మాలన్నీ ఈ పరిస్థితిలో అసమగ్రమైనవిగా, తాత్కాలికమైనవిగా, కొన్ని నిబంధనలకు లోబడినవిగా ఉండక తప్పడం లేదు. అవి కేవలం పాక్షికంగా మాత్రమే సరి అయినవిగా, సత్యమైనవిగా ఉనికి గల్గి ఉన్నాయి. అతడు తాను తననూ; తాను నివసిస్తున్న ఈ జగత్తుయొక్క నిజమైన స్వరూపాన్నీ; దేనినుండి తాను వచ్చాడో, దేనిలో, దేనిచేత తాను ఉనికి గల్గియున్నాడో, దాన్నీ ఎప్పుడు తెలుసుకొంటాడో అప్పుడు మాత్రమే ఈ అసమగ్రతలన్నీ తొలగిపోతాయి.

ఎప్పుడతడు నిజమైన చైతన్యాన్నీ, జ్ఞానాన్నీ సాధిస్తాడో, అప్పుడిక ఏ సమస్యా ఉండదు. ఎందుకంటే అప్పుడతడు, తన మహోన్నత స్వభావానికి తగిన సహజజీవనం కొనసాగించగ

లడు, తదనుగుణంగా ప్రవర్తించగలడు. పరిపూర్ణస్థితిలో, తన జ్ఞానానికి చెందిన మహోన్నతావస్థలో అతడు తనకు తానుగా ప్రవర్తించగలడు. ఏకమాత్రమై, సనాతనమై, అనంతమైన దైవశక్తే అతనిలో ఉండి విడుదల పొందిన అతని విజ్ఞానము, శక్తి, సమగ్రతలలో వ్యక్తమై అతనిద్వారానే ప్రవర్తిస్తుంది.

సామాన్య మానవుడు అందుకోగల ఉన్నతస్థాయి

మానవుడు తన సహజస్థితిలో ఈ ప్రకృతిలోని సాత్త్విక, రాజసిక, తామసిక ప్రాణిగా ఉంటున్నాడు. ఇందులో ఏదో ఒక ప్రకృతి గుణం తనలో అధికమై ఉండడంవల్ల అతడు దాని కనుగుణమైన కర్మగతినీ, జీవనపద్ధతినీ రూపొందించుకొని దాని ననుసరిస్తున్నాడు. స్తబ్ధతకూ, భయానికీ మరియు అజ్ఞానానికీ కట్టుబడిన అతని తామసిక, భౌతిక స్మృతులలో కూడిన చిత్తం పాక్షికంగా తన చుట్టూ వున్న పరిస్థితులనో, కామనలకు చెందిన అనిశ్చిత ప్రేరణలనో అనుసరిస్తున్నది. లేదా అనుస్యూతమైన, చురుకుదనం లేని, తనకు అలవాటైన తెలివిని మాత్రమే అనుగమిస్తుంది. కోరికలతో నిండిన రాజసిక చిత్తం తనకు నెలవైన ఈ జగత్తుతో పోరాడుతున్నది. సదా క్రొత్త వస్తువులు, ఇతరులపై పెత్తనం, సమరం, విజయం, ఉత్పాదనం, విధ్వంసం, చేర్చిపెట్టడం – వీటి కోసం ప్రయత్నిస్తుంది. అది ఎల్లవేళలా జయాపజయాలు, సుఖదుఃఖాలు, పొంగడం క్రుంగడం – వీటి మధ్య ఊగిసలాడుతూ సాగిపోతుంది. అది ఏ పద్ధతి ననుసరించినా, నిజంగా నిమ్నాత్మకూ, అహంకారానికీ చెందిన, విశ్రాంతిలేని, అలుపెరుగని, ఆత్మవినాశకరమైన, సర్వాన్నీ మ్రింగివేసే ఆసురిక – రాక్షసతత్త్వాన్నే నిజంగా అనుసరిస్తుంది.

సాత్త్విక ప్రజ్ఞ కొంతవరకూ ఈ స్థితిని దాటిపోతుంది. కోరికలకూ, అహంకారానికీ భిన్నమైన ఒక మంచిమార్గాన్ని అనుసరించాలని అది భావిస్తుంది. అందుకు తగినట్లే సాంఘిక – నైతిక – ధార్మికనియమావళినీ, ధర్మాన్నీ, శాస్త్రాన్నీ నిర్మించుకొని తనపై విధించుకొంటుంది. ఆదర్శమైన, ఆచరణసాధ్యమైన

విధానాన్నీ, తలంపునూ మనోనియంత్రణకై నిర్మించుకొని సాధ్య మైనంత మేరకు దీనికి విధేయంగా జీవితంలో, ప్రవృత్తిలో అను శీలించడమే సామాన్య మానవుని మనస్సు అందుకోగల ఉదాత్త మైన గమ్యమవుతుంది. ఈ సాత్త్వికచిత్తాన్ని తన మహోన్నత స్థితి నందుకొనే వరకూ అభివృద్ధి చేసుకోవాలి. అది ఆ స్థితిలో తన అహంకారాన్ని దూరం చేయడంలో విజయం సాధించేవరకు వైయక్తికం కాని సాంఘిక, నైతిక, ధార్మిక ఆదర్శాన్ని తన అభ్యు న్నతికై పాటించాలి. అది కర్తవ్యకర్మ కాబట్టి నిష్కామంగా ఆచరించాలి.

ప్రతి మనిషీ తన అభివృద్ధియొక్క పురోగమనశీలమైన నియమాన్నే అనుసరిస్తున్నాడు – మరియు స్వధర్మం కలిగి వున్నాడు.

ప్రకృతియొక్క ఈ చర్యకు చెందిన యదార్థతత్వం బాహ్యా నికి స్వల్పంగా మానసికంగానూ, ఆంతర్యంలో అత్యధికంగానూ వున్నది. భౌతిక మానసిక ప్రకృతిలో సంలగ్నమైన ఆత్మగా మానవుడు ఉండడమంటే ఇదే. అందులో అతడు తన అభివృద్ధి కవసరమైన పురోగతికి చెందిన విధిని అనుసరిస్తాడు. దాన్ని నిర్ణయించేది అతనిలోని సహజమైన స్వభావమే. ప్రతివ్యక్తికీ ఒక స్వధర్మం ఉన్నది. దాని నతడు పరిశీలించి కనుగొని పాటించక తప్పదు. అతని స్వభావం నిర్ణయించిన చర్యలే అతని స్వధర్మం. దాని ననుసరించడమే అతని అభివృద్ధి కనుగుణమైన నిజమైన విధానం. అందుండి వైదొలగడమంటే భ్రాంతినీ, అభివృద్ధి నిరో ధాన్నీ, తప్పిదాన్నీ కొనితెచ్చుకోవడమే. తన స్వధర్మాన్ని పరిశీ లించి అనుసరించడానికి సహకరించే సాంఘిక – నైతిక – ధార్మికాలైన, లేక ఆంతర విధానాలే, ఆదర్శాలే అతనికి శ్రేయో దాయకాలు.

సమగ్రమైన శరణాగతిని సాధించేవరకూ స్వధర్మాన్ని పాటించు.

ఈ ప్రక్రియ (action) ఎంత శ్రేష్ఠమైనదైనా మానసికమైన అజ్ఞానానికీ, గుణాలకు లోబడి వుండవలసినదే. మానవుని ఆత్మ ఎప్పుడు తన స్వరూపాన్ని గ్రహిస్తుందో, అప్పుడే అతడు తన ఎఱుకనుండి అజ్ఞానాన్నీ, గుణాలవల్ల కలిగే భ్రాంతినీ అతిక్రమించి వాటిని తుడిచివేయగలడు. నిన్ను నీవు గుర్తెరిగినా, నీ ఆత్మలో నీవు జీవిస్తున్నా, నీ స్వభావం మాత్రం పూర్వపుటలవాట్ల ప్రకారమే ప్రవర్తిస్తుంది. అలా కొంతకాలం హీనమైన వైఖరుల ననుసరించి నడచుకొంటుంది. కాని ఇప్పుడు నీవు ఆ ప్రవృత్తిని సమగ్రమైన ఆత్మజ్ఞానంతో పసిగట్టగలవు. నీ వునికికి కారణమైన యజమానికి దానిని సమర్పించగలవు. అందువల్ల నీ స్వధర్మాన్ని అనుసరించు. నీ స్వభావాని కనుగుణమైన పని అదెలాంటిదైనా అనుష్ఠించు. నీవు నీ సర్వస్వాన్నీ ఆ పురుషోత్తమునికి సమగ్రంగా అర్పించగల దశ వచ్చేవరకూ అహంకారంతో కూడిన ఉద్దేశాలనూ, స్వార్థంతో కూడిన ప్రేరణలనూ, అన్ని కోరికలనూ తిరస్కరించు.

ఎప్పుడు నీ సర్వస్వాన్నీ, స్వభావాన్నీ సమర్పించడం పూర్తి అవుతుందో –

నీవు అలా చేయడానికి, మనఃపూర్వకంగా ఎప్పుడు సమర్థుడ వవుతావో, అప్పుడే నీలో వున్న పరమాత్మకు నిశ్శేషంగా నీ సమస్త కర్మలను త్యాగం చేసే సమయం ఆసన్నమవుతుంది. అప్పుడు నీవు ప్రవర్తనా నియమావళినుండీ, అన్ని ధర్మాల నుండీ విముక్తుడ వవుతావు. నీలోని దైవశక్తి, దైవసాన్నిధ్యం పాపంనుండి నిన్ను విముక్తుణ్ణి కావిస్తుంది. సాధారణ మానవ ధర్మస్థితి నుండి నిన్నది మహోన్నతస్థితికి తీసుకుపోతుంది. అంతట నీవు స్వతంత్రమైన, స్వేచ్ఛాపూర్వకమైన ధర్మంలో దైవీ

ప్రకృతిలోనూ, ఆధ్యాత్మికపు ఉనికిలోనూ జీవిస్తూ దాని కనుగుణంగా ప్రవర్తించగలవు.

అప్పుడు నీ ఉద్దేశానికి బదులు దైవం తన ఉద్దేశాన్నీ, క్రియలనూ నీ ద్వారా నెరవేరుస్తుంది. అలా చేయడం హీనమైన నీ వైయక్తిక సౌఖ్యాలకై, కోరికలకై కాక, సమస్త విశ్వప్రయోజనానికీ, నీ దివ్యశ్రేయస్సుకీ, అందరి నిగూఢ శ్రేయస్సుకే సుమా! అప్పుడు నీవు దివ్యప్రకాశంలో మునిగి కాలం నిర్వర్తించే క్రియలనూ, దాని ప్రయోజనాన్నీ గ్రహించగలవు. ఈ విశ్వంలో దేవుని స్వరూపాన్ని దర్శించగలవు. ఆయన ఆదేశాన్ని వినగలవు. నీ స్వభావం ఆయన ఇచ్ఛనే, అదెట్టిదైనా సరే, తన పరికరంగా గ్రహిస్తుంది. 'ఇదేమిటి?' 'ఇలా ఎందుకుచేయాలి?' అని అడగకుండా దాన్ని నెరవేరుస్తుంది. నీ ప్రతిచర్యలోనూ, పైనుండీ, అలాగే నీలోనుండీ దివ్యవిజ్ఞానానికీ, దాని ప్రాముఖ్యానికీ ఆవశ్యకమైన జ్ఞానం, ఒక తేజోవంతమైన అనుమతి సిద్ధిస్తుంది. ఇక బాధ్యతంతా ఆయనదే. ఆ సమరం, విజయం, సామ్రాజ్యం అంతా ఆయనవే.

ఈ జీవితంలో దివ్యత్వ వ్యక్తీకరణ సాధించడమనేది ఇదే

ఈ జగత్తులో, శరీరంలో నీవు సాధించిన సమగ్రత అనేది ఇదే. అప్పుడు తాత్కాలికమైన పుట్టుకతో కూడిన ఈ విశ్వానికి ఆవల మహోత్తమమై, శాశ్వతమైన పరమాత్మ చైతన్యం నీదవుతుంది. నీవు నీ మహోత్తమమైన పురుతోత్తమ స్థితిలో శాశ్వతంగా నిల్చిపోతావు. అప్పుడు జననమరణ చక్రం నిన్ను బాధించదు. ఎందుకంటే ఇక్కడే – ఇహైవ – ఈ జీవితంలోనే నువ్వు దివ్యత్వాన్ని అనుభవంలోకి తెచ్చుకొంటావు. నీ ఆత్మ మనస్సులోను, శరీరంలోనూ, ప్రవేశించినప్పటికీ సువిశాలమైన అనంత తత్త్వంలోనూ, దివ్యసామ్రాజ్యంలోనూ విరాజిల్లుతూ వుంటుంది.

ముగింపు

సమగ్రంగా నీ ఆత్మనూ, నీ స్వభావాన్నీ ఆ పరమపురుషునికి సమర్పించుకోవడమే సర్వోన్నతమైన పరమప్రక్రియ. నీ మహోన్నత స్వరూపమైన దైవానికి ధర్మాలనన్నింటినీ పరిత్యజించడమే, నీలోని అంశాలన్నింటి ఆకాంక్షను అవశ్యంగా పరమాత్మకు అంకితం గావించడమే ఇది. ఒక్కసారి నీవు దీన్ని, ప్రారంభదశలోగానీ, లేదా నీ మార్గంలో కొంతకాలం తరువాతగానీ సాధించగలిగావంటే, అప్పుడు నీవు ఏ స్థితిలో వున్నా, బాహ్యప్రకృతి ఎలా ఉన్నా, నీ మార్గం సరి అయినదే. నీకు పరిపూర్ణత సిద్ధించి తీరుతుంది. పరమాత్మ నీలో స్థిరవాసమేర్పరుచుకొని నీ యోగాన్ని పై మార్గంలో నడిపించి నీ స్వభావానికి అనుగుణమైన పూర్ణఫలప్రాప్తికి తీసుకుపోతుంది. ఆ తరువాత నీ జీవనవిధానం, నీ చర్యలు ఎట్టివైనా, నీవు నీకు తెలిసేవిధంగానే ఆ దైవంలో జీవిస్తావు, ప్రవర్తిస్తావు. ఆ దైవశక్తి నీ ద్వారా బాహ్యమూ, ఆంతరమూ అయిన నీ ప్రతిచర్యలోనూ తానే పనిచేస్తుంది.

ఇదే పరమమైన మార్గం. ఎందుకంటే ఇదే మహోత్తమ రహస్యం, మరియు అందరూ క్రమక్రమంగా అనుసరించగల అంతరంగిక ప్రక్రియ, నీ ఆధ్యాత్మిక జీవితపు పరమసత్యము.

అనువాదం: శిరోమణి సముద్రాల లక్ష్మణయ్య

సమాప్తి

Cast away liking and disliking, destroy preference and hatred, root out shrinking and repugnance.... Look on them with the silent and tranquil regard of an impersonal spirit.

Sri Aurobindo

గీతాయోగము – పూర్ణయోగము

మానవజీవితం సాధారణంగా మానసిక ఆదర్శాలను పాటిస్తూ నైతిక నిబంధనలకు లోబడి కోరికలను తృప్తిపరచుకొంటూ సాగిపోతుంది. గీతాయోగము కర్మలను (works) భగవంతుని కర్పించి యజ్ఞభావముతో చేయుట, కోరికలను జయించుట, నిరహంకార, నిష్కామ కార్యాచరణము (desireless action[1]) దైవము యెడ భక్తి, విశ్వచైతన్యమును పొందుట, సమస్త జీవకోటితో ఐక్యత, దైవముతో తాదాత్మ్యము చెందుట; మన యోగము (పూర్ణయోగము, integral yoga) అంతటితో ఆగక అతిమానస జ్యోతిని, శక్తిని కిందికి తెచ్చి (చరమ లక్ష్యము) ప్రకృతిని రూపాంతరీకరింపజేయుట.

*

శ్రీఅరవిందుల సందేశంలోని మూలసత్యాన్ని గీత మన ముందు ఉంచుతోంది – అనడం వాస్తవం కాదు; ఏలన, ప్రపంచమున జన్మరాహిత్యాన్నే చరమలక్ష్యంగా, లేక కనీసం యోగంయొక్క చరమసిద్ధిగా గీత అంగీకరించుతున్నట్లు కన్పించుతోంది; ఆధ్యాత్మిక పరిణామభావాన్నికాని, ఉచ్ఛతర భూమికలకు, అతిమానస సత్య-చేతనకు సంబంధించిన భావాన్నిగాని అది ముందుకు తెచ్చి స్పష్టపరచలేదు; కావున పార్థివ జీవనం సంపూర్ణ పరివర్తనానికి సాధనంగా ఆ చేతనను క్రిందికి దించాలనే భావం అసలే లేదు. [2]శ్రీఅరవిందుని వ్యాఖ్యానము ననుసరించి, సత్య-చేతనారూపమైన అతిమనస్సు ప్రస్తావన ఋగ్వేదంనందూ, ఉపషత్తులలో ఒకటి రెండు చోట్లా కలదు; కాని ఉపనిషత్తుల్లో మానసిక, ప్రాణిక, దైహిక పురుషులను అతిక్రమించి ఉండే విజ్ఞానమయ పురుషని భావనయందు బీజరూపాన మాత్రమే అది

---

[1] శ్రీఅరవిందులు work, action అనే రెండు పదములతో వేర్వేరు అర్థచాయలను సూచిస్తారు. work - పనులు. action -ఆలోచించటం మొ॥ అన్నివిధములైన ప్రవర్తన.

[2] శ్రీఅరవిందులు తన నిక్కడ 'నేను' అని కాక, ప్రథమ పురుషలో ప్రయోగించుకుంటున్నాడు.

– అనువాదకుడు

ఉంది; కాగా ఋగ్వేదమందు దాని బీజమేకాక, దాని భావన ఉందిగాని, సూత్రరూపంగా మాత్రమే ఉంది; ఆ సూత్రాన్ని అక్కడ అభివృద్ధిపరచలేదు. అంతేకాదు, హిందువుల తర్వాత సంప్రదాయమందు ఆ సూత్రం సైతం అదృశ్యమయింది.

ఇలాంటి విషయాలే, హిందూ సంప్రదాయంతో పోల్చిన పుడు, శ్రీఅరవిందుని సందేశానికిగల నవ్యతను సమకూర్చుతాయి — ప్రపంచం మాయాసృష్టి కాదు, లేక అది భగవంతుని లీల మాత్రమే కాదు, లేక దేనినుంచి మనం తప్పించుకోవాలో, అజ్ఞానమందు తిరిగే అట్టి ఒక జన్మచక్రం కాదు, కింతు ప్రపంచం ఒక అభివ్యక్తి-క్షేత్రం, ఈ క్షేత్రమునందు అంతరాత్మ మరియు ప్రకృతియొక్క అధికాధిక పరిణామం జరుగుతూ ఉంటుంది. ముందు ద్రవ్యమందు, తర్వాత ద్రవ్యంనుండి ప్రాణ, మనస్సుల ద్వారా, ఏది మనస్సున కావల ఉందో, దాని దిశగా ఈ పరిణామం ప్రవర్తించి, జీవనమందు సచ్చిదానందాల సంపూర్ణ అభివ్యక్తివరకు అది కొనసాగుతుంది. ఇదిగో, ఈ భావమే ఈ పూర్ణయోగానికి ప్రాతిపదిక, ఈ భావమే జీవితానికి ఒక నూతన అర్థమిస్తుంది.

*

మన యోగం, గీతా సారాంశమంతా దానిలో ఇమిడి ఉన్నప్పటికి, గీతాయోగంతో సమం మాత్రమే కాదు. మన యోగమందు (సరాసరి) సంపూర్ణ సమర్పణయొక్క భావము, సంకల్పము, ఆకాంక్షలతోనే ఆరంభించుతాము; కాని అదే సమయాన మనం నిమ్నప్రకృతిని నిరాకరించాలి — ఉచ్ఛతర ప్రకృతియందలి స్వేచ్ఛలోని కారోహించే ఉచ్ఛతర ఆత్మచేత నిరాకరించాలి, నిరాకరించి నిమ్నప్రకృతినుండి చేతనను ఉద్ధరించాలి. మన మీ ద్వివిధ పక్రియ నవలంబించకపోతే, తామసిక, కావున ఒక మిథ్యాసమర్పణ మాత్రమే చేసే ప్రమాదంలో పడిపోతాం. అట్టి సమర్పణయందు ఎట్టి ప్రయత్నం ఉండదు. ఎట్టి తపస్య ఉండదు, కావున ఎట్టి ప్రగతి ఉండదు; అథవా మనమొక రాజసిక సమర్పణ చేసే ప్రమాదం ఉంది; ఈ సమర్పణ మనం భగవంతునికి

కాక, భగవంతుని గురించి మనం స్వయంగా కల్పించిన ఒక భావానికో, ఒక విగ్రహానికో చేస్తాం; కాగా ఈ భావము, విగ్రహము మనము రాజసిక అహంకారానికి ముసుగుగానో, అంత కంటె నికృష్టంగానో ఉంటాయి.

*

I may say that the way of the Gita is itself a part of the yoga here and those who have followed it, to begin with or as a first stage, have a stronger basis than others for this yoga.

(*SABCL* Vol. 23, p. 669; Vol. 22, pp. 69-70; Vol. 23, p. 580)

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి, చెలసాని నాగేశ్వరరావు ('యోగంపై లేఖల' నుండి)

సమాచార పత్రం

17 నవంబరు 2003 నాటికి నిరోద్‌బరన్ గారు 100 ఏళ్లు పూర్తి చేసుకుంటారు. వారికి మన కృతజ్ఞతాపూర్వకమైన, హృదయ పూర్వకమైన శుభాకాంక్షలు. వారికి శ్రీఅరవిందులతోగల సంబంధమును గురించి వారి మాటలలోనే "శ్రీఅరవిందులకు కాలి ఎముక విరిగినప్పుడు మేము వారికి ఉపచారములు చేయుచుంటిమి. ఒకనాడు శ్రీమాత ఆ గదిలోకి వచ్చి నేనూ, శ్రీఅరవిందులు మంచంమీద కూర్చొని పసిపిల్లలల్లే ఆడుకుంటున్నట్లు ఒక దృశ్యమును చూచిరట". ఆహా ఎంత అద్భుతమైన దృశ్యము!

నిరోద్‌బరన్‌గారు ఇంగ్లండులోని ఎడిన్‌బరోలో డాక్టరు చదివి కొన్నాళ్లు ప్రాక్టీసు చేసేరు. 30 ఏళ్ల వయస్సులో 1933 లో ఆశ్రమంలో చేరారు. శ్రీఅరవిందులు వారిని కవిత్వములోను, సాహిత్యములోను ప్రవేశపెట్టారు. ఆ తరువాత 1938 నుంచి 1950 వరకు 12 ఏళ్లపాటు ఆయన వారి పర్సనల్ ఎట్టన్‌డెంటుగా పని


6/12/2003
ఆధ్యాత్మిక జీవనానికి మార్గము
ల
అఖిల భారత పత్రిక
డిసెంబరు 2003

ఆధ్యాత్మిక జీవనానికి మార్గము

శ్రీఅరవిందుల ప్రవచనములు

శ్రీమాత ప్రవచనములు

ఆధ్యాత్మిక మనగా నేమి?

సాధారణ జీవితము, మతపరమైన జీవితము, ఆధ్యాత్మిక జీవితము మూడు వేరు వేరు విషయాలు. మనుషులు సాధారణంగా నైతిక జీవితాన్నవలంబిస్తుంటారు. మనం వీటి భేదాలను స్పష్టంగా గుర్తించి, మనకు కావలసిన జీవిత విధానాన్నెంచుకోవాలి.

శ్రీఅరవిందులు

(*SABCL* Vol. 22, p. 137)

(శ్రీమాతారవిందుల రచనలనుండి సంకలితము)

మన ఏకైక గమ్యము

శ్రీఅరవిందులు

సాధారణ జీవితం గానుగెద్దులాగా ఒక నిర్ణీతమార్గంలో సాగిపో తూంటుంది. శరీరమనఃప్రాణాల అజ్ఞానవలయంలో చిక్కుకొని, తన స్వస్థానమైన దివ్యసత్యంనుండి దూరమై, అజ్ఞానాంధకారంలో కొట్టుమిట్టాడుతూంటుంది.

ఆధ్యాత్మికజీవనం ఎకాయెకీ పరిణతచైతన్యంతో – అంటే సాధారణచేతనను ఉన్నతీకరించటంద్వారా ఊర్ధ్వముఖం చేయటం ద్వారా – సత్యాసత్య విభేదాన్ని దర్శించి – పరమచైతన్యం వైపు చేసే ప్రయాణం. దీని ధ్యేయం స్వస్వరూపావగతి – స్వాత్మావలోకనం, దివ్యతత్త్వంలో లీనం కావటం. ఆత్మాన్వేషణ కలవాని కర్తవ్యం చైతన్యంలో మార్పు కల్గించి దానిని విస్తృతం చేసుకోవటమే.

అనువాదం: తుమ్మపూడి కోటీశ్వరరావు

(*SABCL* Vol. 22, p. 137)

సాధారణ జీవితం

శ్రీఅరవిందులు

ధనకనకవస్తువాహనాదుల సముపార్జనమే నేటి మానవజీవితానికి పరమావధి. ఇదంతా మనోప్రాణికముల నిర్వాకమే. అయితే దీనివలన మనిషికి శాశ్వతమైన తృప్తి కలగదు, అది అతని పవిత్రతృష్ణను తీర్చనూ లేదు. ఎందుకంటె అంతరంగములోని మానవాకాంక్షను ఇది గుర్తించి దానిని వ్యక్తీకరింపజేయలేదు, సఫలీకృతము గావించలేదు.

– సంపాదకుడు

మానవజీవితం సామాన్యముగా, కొంతవరకు స్థిరములూ కొంత వరకు అస్థిరములూనైన పెక్కు లోపభూయిష్ఠప్రవృత్తులతో నిండి యుండును. ఇంద్రియజ్ఞానములు, మానసిక చింతనలు, హృద యావేశములు, ప్రాణతృష్ణలు, అభ్యాసవశముచే పునఃపునః ప్రవ ర్తమానములగు దుర్బలచేష్టలు మున్నగు నీ ప్రవృత్తులన్నియూ అహంకారము నాశ్రయించుకొని నడయాడుచుండును.

*

మనుషులు సాధారణంగా ప్రాణికప్రేరణలకి లోబడి, ధనపిపాస, భోగతృష్ణ, కాంచనాదులకోసమే తమ శక్తియుక్తులను వెచ్చిస్తూ తాపత్రయాలకు లోనై జీవయాత్ర కొనసాగిస్తూ వుంటారు.

*

సాధారణంగా మానవజీవితం, కొన్ని నైతికనిబంధనలకి, ఆదర్శా లకి లోబడి స్వార్థపూరిత కోర్కెలు తీర్చుకొనే ప్రయత్నంతో సత మతమౌతూ వుంటుంది.

*

మరి నువ్వు మానవుని మామూలు విజయాలను గురించి అంత గొప్పగా అనుకుంటున్నావే – చివరకి దుఃఖమే దాని పర్యవసా నమని నీకు తెలియదా? ఈ ప్రాణికము చాలా చిత్రమైనది. "నాకు ఇంతకంటె గొప్పదైన దివ్యచైతన్యము వద్దు. నేనీ మానవ చైతన్యాన్నే అంటిపెట్టుకొని వుంటాను" అంటే ఈ బాధలు, దుఃఖమే కావాలి అని మూర్ఖంగా ప్రవర్తిస్తుంది అన మాట. మానసికంగా, ప్రాణికంగా కొంత తృప్తి, సంతోషము కలిగి కొంత ఉపశమనము కలిగే మాట నిజమే. కాని అది ఏపాటిది? ఎప్పటికైననూ ఈ రకమైన జీవనానికి స్వస్తి చెప్పక తప్పదు. మేధోపరమైన ఆనందాలు, సృజనాత్మక కార్యకలాపాలు ఓ రకంగా మనిషికి సంతృప్తి నిస్తాయి కాని అతని ఆత్మ అంత కంటె ఇంకా ఘనవిజయం కోసం ఆకాంక్షిస్తూంటుంది. నీ ఉన్నత మానసిక ప్రాణికాలు కూడ అలాగే వాటి తృప్తికోసం ఉవ్విళూ రుతూంటాయి.

*

నైతికజీవనం సాధారణజీవితంలో ఒక అంశ. బాహ్యప్రవర్తనను నియంత్రించుకునేటందులకు, బుద్ధిజనిత ఆదర్శాల కనుగుణంగా శీలాన్ని తీర్చిదిద్దుకోటానికి మనసు పడే యాతనే నీతి.

*

నీతినియమాలు సంప్రదాయబద్ధంగా ఉంటాయి. సాధారణజీవనానికి ఆవశ్యకమే. ఇది లేకపోతే ప్రాణికస్థాయి జీవనం విశృంఖల శక్తులకు బలియైపోతుంది. మహామహా మేధావులు కూడా సంప్రదాయాలను కూలద్రోసినా, వాటి స్థానంలో క్రొత్తవాటిని సృష్టించుకోకుండా ఉండలేకపోయారు. మనోమయకోశాన్ని దాటితేనే సంప్రదాయాల కతీతంగా, మనగలిగేది. శ్రీకృష్ణునికది సాధ్యపడింది. ఆయన మరి సాధారణ మనోమయపురుషుడు కాదుగా!

*

నైతికమానవుడు నా అంత నీతిమంతుడు లేడనే దురహంకారంతో విఱ్రవీగవచ్చు. ఆధ్యాత్మికజీవనుడు నిరహంకారి కావాలి. అలా కాకపోతే దృష్టి తననుంచి దైవంపై ప్రసరించలేడు.

అనువాదం: కమలాకర వేంకటరావు. చెలసాని నాగేశ్వరరావు, కర్రా వెంకటేశ్వర్లు.

(*SABCL* Vol. 20, p. 82; Vol. 23, p. 669; Vol. 22, pp. 84, 137, 413; Vol. 23, p. 574)

నీకు ఆధ్యాత్మిక జీవనమే కావాలనుకుంటే ఇతర ఆలోచన లేవీ లేకుండా, నిస్సందేహంగా, నిస్సంకోచంగా ఆ దివ్యమహాసాగరంలోకి అమాంతంగా దుమకవలసిందే!

శ్రీమాత

మత జీవితం

శ్రీఅరవిందులు

నాగరికత పెరుగుతున్న కొద్ది మానవజీవితం అంతకంతకు దుర్భరమౌతోందేగాని సమస్యలకు పరిష్కారం మట్టుకు దొరక టల్లేదు. సమాజాన్ని కొంతవరకు తీర్చిదిద్దేందుకని మతము లేర్పడినవి. దీని పర్యవసానమేమిటి? పూర్వకాలం రాజులు నిరంకుశంగా పరిపాలించేవారు. వారి స్థానంలో మతగురువులు వచ్చి వారి శాసనాలను నడిపించేరు. ఎవరో అన్నట్టు Religion is the opium of the masses – అంతకు మించి దాని ప్రయోజ నము సున్న. – *సంపాదకుడు*

మతజీవితం సంగతి చూద్దాం. మానవచైతన్యం అజ్ఞానంనుండి బయలుదేరి పైకి పయనించే మార్గంలో ఒక స్థాయి, భౌమజీవితం నుండి దివ్యజీవనంవైపు పయనించే ప్రయత్నంలో మొదటిదశ అని అనవచ్చు. కాని ఈ ప్రయత్నం ఎలా చేయాలో తెలియక ఏవేవో పూజలు, పునస్కారాలు అనేక విధులు చేసినట్లయితే ముక్తి లభిస్తుందనే ప్రక్రియలే మతము – ఆధ్యాత్మికానికి తొలి మెట్టు అనుకోండి. అది కేవలం క్రతువులు, ఉత్సవాలు, వ్రతాలు, నియమాలు మొ॥ పటాటోపాలతో కూడుకున్నదే కాని మనని గమ్యానికి చేర్చలేదు.

*

నువ్వు చెప్పింది నిజమే. మతమనగా మనిషికి ఏవేవో పైపైన పులిమే రంగులేకాని అతని ప్రకృతిని మార్చలేదు. అన్ని మతాలు అనతికాలంలోనే కేవలం లాంఛనాలు, ఆచారాలుగా మాత్రమే మిగిలిపోతాయి.

*

The highest ideal of human life is to establish over the whole being the control of a clear, strong and rational mind and a right and rational will, to master the emotional vital, and physical

being, create a harmony of the whole and develop the capacities whatever they are and fufill them in life. In the terms of Hindu thought, it is to enthrone the rule of the purified and sattwic *buddhi*, follow the *dharma*, fulfilling one's own *svadharma* and doing the work proper to one's capacities, and satisfy *kama* and *artha* under the control of the *buddhi* and the *dharma*....

This ideal involves the building of mind and character and is always a slow and difficult process demanding patient labour of years, sometimes the better part of the life-time. The chief difficulty in the way with almost everybody is the difficulty of controlling the desires and impulses of the vital being.

*

పరోపకారశీలత, భూతదయాపరత్వము, మానవసేవానిరతి, – ఇవి మానసికచేతనలోనుండి పుట్టినవి. ఉత్తమపక్షమున, విశ్వజనీనమైన దివ్యప్రేమకివి కుంటి యనుకరణములు. అహంకారమునుండి మనకివి విముక్తి నియ్యవు. దాని నింకనూ విస్తరింపజేసి, దాని కధికతర సంతృప్తిని సాధించును. మానవుని ప్రాణమయ జీవనమునూ, ప్రవృత్తినీ మార్చివేయజాలక, దాని దోషములను మాత్రము కొంత విరిచి, దాని యహంకారలక్షణమును కనుపడకుండునట్లు పైపూతలు పెట్టజూచును. ఒకవేళ, సమగ్రమైన సంకల్పశుద్ధితో వాటి ననుష్ఠించిననూ, వాటివలన మన ప్రకృతి విపరీతమైన పాక్షికాభివృద్ధి మాత్రమే గాంచినదగును. మన జీవాత్మ విశ్వగత విశ్వాతీత తత్వములోనికి సర్వతోముఖముగా దివ్యపరిణతి గాంచగల లక్షణ మేమాత్రమూ గానరాదు.

*

సకల కర్మాచరణ ప్రమాణములు, నిబంధనలు జడపదార్థములో నుండి ఆత్మపదార్థములోనికి ప్రయాణ సందర్భములో అహంకారపు అవసరములు ననుసరించి చేయబడిన తాత్కాలిక కల్పనలే. ప్రయాణములోని మజిలీలతో మనము సంతృప్తి చెందుచు, అన్నమయ, ప్రాణమయ, మనోమయ జీవనాసక్తులమై యుండునంత

కాలము, లేక ఆధ్యాత్మిక తేజస్స్ఫుర్శగల మనోమయ భూమికా విశేషములయందే స్థిరముగా పాదుకొని యుండునంతకాలము, ఈ కల్పనలు ఒక విధముగా అనివార్యములే యగుచుండును. కాని, *వీటికి ఆవల, ఎల్లలులేని అతిమానస అనంత చేతన యొకటి కలదు. తాత్కాలిక కల్పన లన్నియు నచట అంతరించిపోవలసి నదే.*

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి, కమలాకర
వేంకటరావు (యోగ సమన్వయము)

(SABCL Vol. 22, pp. 137, 139; Vol. 24, pp. 1656-67; Vol. 20, pp. 143, 197)

ఆధ్యాత్మికత – ఒక పరిశీలన

శ్రీఅరవిందులు

నువ్వు నీ లేఖలో సత్వగుణప్రధానమైన సదాచార సంపన్నులను గురించి సుందరంగా వర్ణించి చెప్పావు.[1] ఈ గుణగుణాలు ఆధ్యాత్మిక జీవితానికి తొలిమెట్టు గావచ్చుగాని, ప్రధాన మెన్నటికీ కానేరవు. ఆధ్యాత్మికమనగా సద్గుణసంపత్తి, సచ్ఛీలము, ఆత్మార్పణము, వైరాగ్యము, దాతృత్వము, పరధర్మము, మానవసేవ మాత్రమే కాదు. పుడమిలో ఈ గుణసంపదయొక్క ఉచ్చస్థితియే

[1] పరిపూర్ణత్వము (perfection) సర్వదా శుభప్రదమైనది. సృష్టిలో జీవుని బహుముఖప్రజ్ఞకు సూచిక. రూపాదులందు గుప్తమైయున్న చేతన తనను తాను వ్యక్తీకరింప చేసుకొనటమేనని గ్రహించవచ్చును. పరిపూర్ణత్వము సృష్టిలో అనేక విధములుగా గోచరమవుతున్నది. ఉదా॥ జంతువుల విషయం చూడగా వాటి శౌర్య, బల పరాక్రమములు, వేగము, ప్రజ్ఞ, మమత మొ॥ పరిపూర్ణత్వమును సూచింపగలవు. అలాగే లలితకళలైన సంగీతసాహిత్యములలో ప్రావీణ్యము, మేధోపరమైన సర్వ ప్రక్రియలున్నూ, రాజనీతిదక్షుడు, రణరంగధీరుడు, కళాస్రష్టలు మొ॥ వారు, శారీరక పరిపూర్ణత్వమునకు కండబలము, సచ్ఛీలము వీటన్నిటికీ జీవుని పరిణామదశలో ఉచితమైన స్థానమున్నదని మరువరాదు. జీవునియందు నిక్షిప్తమై, అంతర్గతమైన ఉత్సుకత కారణంగా దీనిని ఆధ్యాత్మికతగా భావించటం ఔచిత్యమేనానని ప్రశ్నించుకొంటే, ఈ తీరు మున్ముందు ఆధ్యాత్మికత పుష్పించుటకు దోహదము చేయగల్గితే, ఔచిత్యమేనని జవాబు వస్తుంది.

డైన బుద్ధవిగ్రహముకంటె, గ్రీకు దేశస్థ గ్రంథకర్తయైన హోమర్ పండితునియొక్క పాడుబడిన విగ్రహంలో ఆధ్యాత్మికత తొణికిస లాడుతున్నట్లు భ్రమ కలుగుతుంది.

ఇక మరికొందరు ఉదరపోషణార్థం ధనార్జన చేయటం, కుటుంబ సామాజికసేవలో పాల్గొనటం, మంచిమనీషిగా, ఉత్తమ పౌరుడుగా చెలామణిగావటం, మానవసేవయే మాధవసేవగా తలచి అందు పాల్గొనటం మొదలగునవే ఆచరణ యోగ్యమని. ఆధ్యాత్మజీవన సూచికలని, ఎక్కడో మారుమూలల్లో, కోనల్లో, కొండల్లో జనారణ్యాలకు దూరంగా ఉండి సాధించిన ధ్యాన యోగాదులే పరాతత్వాన్వేషణ కన్న మిన్నయని బోధిస్తున్నారు. దాతృత్వం, పరధర్మము, సేవానిరతి, నిష్కామంగా పరోపకారము మొ॥ ఆధ్యాత్మ జీవనానికి పరాకాష్ఠయని చాటుతున్నారు.[2] దీనిలో కొంతవరకు సత్యం లేకపోలేదు. స్వార్థరహిత త్యాగ నిరతి గుణము సర్వజన సంక్షేమము, ఆత్మబలిదానము మొ॥ వాటిలో మనము దర్శిస్తాము. అసత్యం కాదు. అంతే కాదు. తన ఆధ్యాత్మప్రగతికై కృషిచేయుటం, బహుముఖమైన నిత్యజీవితాని కతీతమైన స్థితిని చేరుకోవటానికి అంతర్ముఖుడు గావటం, దైవ సాన్నిధ్యాన్ని పొందటానికి ఆర్తితో ఉపాసించటం మొ॥ అహంకార ప్రవృత్తి మారు రూపాలేనని, ఆధ్యాత్మజీవనం కాదని, అది ఒక విపరీత చేష్టయేయని, ఆధ్యాత్మజీవన మెన్నటికి కాజాలదని ఈ ప్రబుద్ధులు ఉటంకిస్తున్నారు!

---

[2] కాని అధ్యాత్మికత స్వప్రకాశమేగాని ఇతరత్రా ఆధారభూతము కాదు, ఆధ్యాత్మచైతన్య రహితమైన, అంతరంగ మార్పు రహితమైన వేటితోను సంబంధాలు కల్గించుకోదు. నిత్యము మనకు కన్పించే కాషాయాంబరధారులు, మతాచార ఛాందసులు, మంత్ర తంత్రోపాసకులు మొ॥ వారిని మనము ఆధ్యాత్మవేత్తలని తలస్తున్నాము. అయతే నిత్యపూజాదులు నిర్వర్తించు చున్నప్పటికీ వీరికి ఆధ్యాత్మికత కొరవడవచ్చును. జనశ్రుతిలో మానవాతీతశక్తుల ప్రదర్శన, యోగులయొక్క ప్రక్రియల వైపరీత్యము, మహత్తులు, మీరంతా ఎరిగియున్న యతీశ్వరుని వళ్లు జలదరించే చేష్టలను ఆధ్యాత్మికసిద్ధియని, యోగసిద్ధియని తలచటం జరుగుతున్నది. మానవాతీతశక్తులు, విపరీతయోగ ప్రక్రియలున్నప్పటికి, ఆధ్యాత్మికత లోపించవచ్చును. ఆ పదము యొక్క తత్వమును లోతుగా పరిశీలిస్తే, ఆత్మసాక్షాత్కారప్రాప్తి, సామీప్య, సాయుజ్యములుగాని వాటికై నిరంతర తపనగాని యని, గ్రహించవచ్చును. నిత్యము నిరంతర సత్యాన్వేషణ ఫలమే ఆధ్యాత్మిక పరిపూర్ణత్వమని (spiritual perfection) గ్రాహ్యము.

ఈ పెద్దలు వచించిన విషయము కొందరు విపరీతమని తలిస్తే, ఇతరులు సత్యమని భావింపవచ్చును. ఈ వాక్కుల తీరే అంత. సృష్టిలో ఈ వాక్కుల ఔచిత్యము, వాటికి ఆధారభూతమైన పూర్వపక్షమున్నూ సత్యమే అయినచో వాటిని శంకింప నక్కర లేదు. అయితే ఈ పూర్వపక్షమేమిటి యని తిరిగి ప్రశ్నించుకొంటే నిత్యజీవితంతో ముడిపడి భ్రాంతి, మిథ్యగా ముద్రపడిన మనోమయ, ప్రాణమయ, దేహమున కతీతమైన స్వరూప తత్వాన్వేషణ యని సమాధానము వస్తుంది. ఈ తత్వము సత్యమేనని. దాని యందు తృష్ణ, అన్వేషణయే జీవితపరమార్థమని భావిస్తే, ఖండనలకు తిరస్కారాలకు తావు లేదు. ఈ సాధన తప్పక ఫలిస్తుంది. ఈ నిగూఢసత్యస్వరూపం సాక్షాత్కరించేంతవరకు సాధన సాగిపోతుంది. ఈ స్వరూపస్పర్శను పొందినవారు తగిన రీతిలో స్పందిచటంకన్నా మరో మార్గం లేదు. అవసరమైతే ఈ స్వరూపప్రాప్తికి, సర్వాన్ని త్యజించి, సృష్టిలో తాము ఇతరత్రా విలోకించే అపురూప సౌందర్య, వైభవాదులు తాము దర్శించే నిర్గుణ చైతన్యస్వరూప ధగధగలకు సాటికాదని గ్రహించగలరు. మనోవికాసానికి అనుగుణంగా, జీవుని అన్వేషణ చీకటిలో తరచి తరచి సాగుతున్నట్లు గాను, అనంతరం శీఘ్రంగాను తన అంతరంగములోను, సృష్టిలోను గుప్తమైయున్న ఒకానొక పరాతత్వ సాక్షాత్కారమునకై, ఈ అన్వేషణ సాగిపోగలదు. ఈ నిత్యమైన పరాతత్వము అశాశ్వతమైన శరీరాదులకన్న సత్యమని, ఈ మనోమయ, ప్రాణమయ, శరీరాదుల చైతన్యము కంటె భిన్నాతిభిన్నమైన ఒకానొక అపురూపమైన నూతన చైతన్యావిష్కరణయే ఈ సాక్షాత్కార ప్రభావమని గ్రహించవచ్చును. (To arrive at that can come only by a change of consciousness, a reversal of consciousness, a new basis of consciousness which is not this lesser instrumental consciousness of mind, life and body.)

పరిణామక్రమములో నూతనజాతి ఆవిర్భవించినప్పుడల్లా క్రొత్త క్రొత్త మార్పులు, క్రొత్త భూమికలు సహజం. జడపదార్థము పరిణమించగా జీవరాసులు ఏర్పడినవి. మొక్కలో జీవము

తన ప్రాథమికదశలో పైకి ఎదుగుతూ, నలుమూలలా వ్యాపిస్తూ, గతి, మతి, స్పర్శానుభావాన్వేషియై యుండగలదు. ఇక ముల్లక్షణ ములతో కూడుకొన్న పశువు మనస్సున్నప్పటికీ, వివేచనార హిత జీవనం సాగిస్తున్నది. తన జీవితసత్యాన్ని గ్రహించటం గాని, నియంత్రించుటకుగాని అశక్తురాలు. చివరగా మానవుణ్ణి విచారిస్తే, ఇతడు వివేచన, నియంత్రణ, గ్రహణ, ఆధిపత్య, స్వస్ఫు హాలతో కూడుకొన్న చైతన్యాత్మకమని తెలుస్తుంది ఈతని మనస్సు ఆత్మ చైతన్యస్వరూపాన్ని విస్మరించినది. ఈ స్వరూప అన్వేషణ నూతనస్థితులకు నాంది కాగలదు. ఇక అవిద్య, మిడి మిడిజ్ఞానము. మధ్యావస్థలకు ఆస్కారం లేదు. కావలసినది, పొంద వలసినది ఆత్మచైతన్యస్వరూపమే. షోడశకళలలో దేదీప్యమా నంగా ప్రకాశించే సత్యస్వరూపమే. (It must base itself on soul consciousness, consciousness of the spirit and self – for so only can there evolve the full light, the spontaneous mastery, the intimate and real knowledge.)

అనువాదం: శ్రీ శరణ్

(*Bulletin* Aug 2003, p. 30)

ఆధ్యాత్మిక మనగా నేమి?

శ్రీఅరవిందులు

ఆధ్యాత్మిక మనగా:

ఈ మనస్సుకంటె జీవితముకంటె గొప్ప వస్తువొకటున్న దని గుర్తించుట, మనోప్రాణికముల మామూలుస్థాయి కంటె గొప్పచైతన్యం కొరకు ఆకాంక్షించుట.

మానవాత్మ ఈ హీనప్రకృతి నుండి పొంగిపొరలి బైటికి వచ్చి అతనిలోని గొప్ప రహస్యచేతన వైపు పయనించుట.

*

ఆధ్యాత్మిక మనగా:

అహంకారంకంటె భిన్నమైన మరో చైతన్యాన్ని గురించి తెలుసుకొనుట,

అందులోనే నివసించుట,

అంతకంతకు దానిచే ప్రభావితమగుట,

విశాలమైన, అనంతమైన స్వయంభువు, అహంకారరాహిత్యములను Spirit (Self, Brahman, Divine) పొందుట

*

We... define spirituality as the attempt

to know and live in the highest self, the divine,

the all-embracing unity

and to raise life in all parts

to the divinest possible values...

*

ఆధ్యాత్మిక మనగా:

మేధాసంపత్తిగాని, ఆదర్శముగాని,

నైతికవాదముగాని, నిరాడంబరతగాని,

మతపరాయణతగాని, ఆవేశముగాని,

వీటి సంపుటి గాని కాదు.

ఈ లక్షణాలన్ని మనోవికాసానికి, జీవితానికి కావలసిన విషయాలే. కాని ఆధ్యాత్మిక జీవితానికి మట్టుకు మనిషిని సంస్కరింపజేయు మొదటిదశ మాత్రమే.

ఇవన్నియు మానసికపరిణామ దశకు చెందిన విషయాలు మాత్రమే. ఆధ్యాత్మిక పరిణామముగాని, అనుభూతిగాని, సిద్ధిగాని కానేరవు.

ఆధ్యాత్మిక లక్షణములు:

నీ అంతరంగిక సత్యమును,

నీ మనస్సు, శరీరము, జీవితములకంటె ఇతరమైన

Spirit, Self, Soul అనుభూతులను పొందుట. విశ్వవ్యాప్తమైన సత్యమును,

మనలో కూడ వున్న సత్యమును
తెలుసుకోవలెనన్న ఆకాంక్ష
దానితో సాంగత్యము జెంది దానితో ఐక్యమగుట.

తదాకాంక్ష, తత్ స్పర్శ, తదైక్యత వలన మారి, నూతనముగా సంభూతమై, నూతనతత్త్వము, నూతనాత్మ, నూతనరూపమును దాల్చుట.

మన యావత్ ప్రకృతి అటువైపు మరలి, పరిణమించి, రూపాంతరీకరణము జెందుట.

*

The meaning of spirituality is
a new and greater inner life of man
founded in the consciousness of his true,
his inmost, highest and largest self and spirit
by which he receives the whole of existence as
a progressive manifestation of the self in the universe
and his own life as a field of
a possible transformation in which
its divine sense will be found,
its potentialities highly evolved,
the now imperfect forms changed into
an image of the divine perfection,
and an effort not only to see but to live out
these greater possibilities of his being.

*

The divine perfection is always there above us;
but for man to become divine in consciousness and act
and to live inwardly and outwardly the divine life
is what is meant by spirituality;
all lesser meanings given to the word are
inadequate fumblings or impostures.

Alll spiritual life is in its principle
a growth into divine living.

అనువాదం డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*SABCL* Vol. 14, p. 65; Vol. 23 p. 877; Vol. 14, p. 433; Vol. 19, p. 857; Vol. 9, p. 251; Vol. 15, p. 247; Vol. 19, p. 1018)

ఆధ్యాత్మిక జీవనానికి మార్గము – I

ఆధ్యాత్మికంవలన నీ సమస్యలన్నీ తీరిపోతాయి నిజమే. అయితే ఇంత గొప్ప మార్పు, నీలో ఈ పరివర్తనము ఎలా జరుగుతుంది? ఊరికే అనుకున్నంత మాత్రాన జరగదు కదా. నీ బుద్ధినంతా, నీ బలాన్నంతా ఆ ఒక్క ఆశయాన్ని నెరవేర్చుటకై వెచ్చించాలి. నీలోని సర్వావయవములు, నీ సకల ప్రవృత్తులు, ఆ ఒక్క ఆశయసిద్ధికై కేంద్రీకృతమైనప్పుడే ఏమైనా ఫలితానికి అవకాశముంటుంది. అంతేగాని కప్పల తక్కెడల్లే నీలోని ఒక్కొక్క అంగము ఒక్కొక్కవైపు లాగుతుంటే ఎట్లా?

– సంపాదకుడు

నువ్వు నీ జీవితాన్ని ఆధ్యాత్మిక దిశగా నడిపించాలని యెదలో ఆవేశము జెందినప్పుడు నీకు మార్గదర్శకుడూ దొరుకుతాడు, ఒక మార్గమూ నీ యెదట ఆవిష్కారమౌతుంది. *కేవలం మనస్సుతో అన్వేషించినంత మాత్రాన ఆధ్యాత్మిక ద్వారములు తెరవబడవు. నీ ఆత్మ తహతహలాడినప్పుడే అది జరుగుతుంది.*

*

సామాన్య మానవజీవనమును దివ్యజీవనముగా రూపాంతరమొందించుటయే యీ సాధనకు ముఖ్యప్రయోజనము. సంకుచితమైన మన మిడిమిడి జ్ఞానమును సుప్రగాఢమూ, సువిశాలమూనైన ఆధ్యాత్మికచేతనగా పరివర్తనము నొందించవలసి యున్నది. అస

మగ్రమైన మన సత్తను బహిరంతరములయందు సమగ్రమైన దానినిగా రూపొందించవలసి యున్నది. ఈశ్వరునకు మన సకల ప్రకృతిని సమర్పణ మొనర్చుటయే ఈ పరమలక్ష్య సాధన కుపాయము.

మన హృదయాంతర్వర్తియగుటతోపాటు సర్వమయుడూ, సర్వాతీతుడూనైన పరమేశ్వరునకు మన సర్వస్వమూ సమర్పితమైపోవలెను. ఏకకాలముననే ఏకరూపుడూ, బహురూపుడూనైన ఆ భగవానునియందు మన బుద్ధి, మన హృదయమూ, మన యిచ్ఛ సంపూర్ణముగ నేకాగ్రత చెందవలెను. ఆ పరమాత్మునికే మన సకల సత్తయూ నిశ్శేషముగ నివేదితమై పోవలెను. (An absolute concentration of our will, our heart and our thought on that one and manifold Divine, an unreserved self-consecration of our whole being to the Divine alone....) అహంకారము ఈశ్వరాభిముఖమై, ఈశ్వరునకు తనను దానర్పణ మొనర్చుకొని, అవశ్యముగా నీశ్వరాధీనమైపోవుట కనువైన సునిశ్చిత సాధనప్రక్రియ ఇది.

*

సంకుచితమైన మన మానసిక వ్యాపారముల నన్నిటినీ పూర్తిగా వదలివైచి, నిఖిలమునకు ప్రభువు, సకల ప్రాణులకు సుహృత్తు అయిన పరమేశ్వరుని చేతులలోనికి నిశ్చితంగా మనలను మనము సమర్పించుకోగల శ్రద్ధ, ధైర్యము మనకు లేనిచో, నిత్యము, అనంతమునైన ఆ ఆధ్యాత్మికసత్యములోనికి పూర్ణప్రవేశము సాధ్యము కానేరదు. ముక్తము, అనంతమునైన ఆ పరతత్వమహోదధిలోనికి ఎట్టి సంకోచము, ధర్మసందేహము, జంకు బొంకు లేకుండ ఒక్క క్షణములో మనము లంఘించవలెను. ధర్మముయొక్క పరిమితులను దాటిన పిమ్మటనే నిక్కమైన స్వాతంత్ర్య సిద్ధి, వైయక్తిక ధర్మము. వైశ్వాన్వయధర్మము, సార్వజనీనధర్మముల కావలనే దివ్యస్వాతంత్ర్యోపేత సర్వాతీత శక్తివిలసనము, నిటారైన ఆరోహణానంతరమే సువిశాలమైన శిఖరప్రదేశములలోనికి ప్రవేశము.

ఆరోహమునందు మూడుదశలు కలవు. అట్టడగు దశ శారీరక జీవనమునకు, దాని అవసరములకు కామితములకు సంబంధించినది. మధ్యదశ మానసిక, హార్దిక, చైత్యపరిపాలితములైన ఉన్నత ప్రయోజనములు, ఆకాంక్షలు, అనుభూతులు, ఆశయములకు సంబంధించినవి. శిఖరస్థాయిలో మొదట గంభీరమైన చైత్యానుభూతులు, ఆధ్యాత్మికానుభూతుల విలసనములు. అటుపిమ్మట మన సకలాకాంక్షలు, సకలాన్వేషణలు తమ ఆంతర్యసిద్ధిని పొందగలిగే అతిమానస నిత్యచైతన్యసాక్షాత్కార సంపన్నత.

శారీరక మానసిక జీవనములు:

శారీరక జీవనదశయందు మొదట వైయక్తిక, సామూహిక కామితములు, అవసరములు, పిమ్మట ఆ వ్యక్తికి, సమూహామునకుగూడ మేలొనగూర్చు ప్రయోజనములు ప్రాధాన్యము వహించును. మానసిక జీవనమునందు పూర్ణసత్యవేషముతో చలామణి కాజూచెడి అర్ధసత్యములనదగు భావములను, వికాసదశ యందుండియూ నింకనూ అపరిపక్వములైన అంతఃస్ఫురణానుభూతులను అనుసరించి మనస్సుచే కల్పితమైన ఆదర్శములును ప్రాధాన్యము వహించును. మానసికజీవన ప్రాబల్యము హెచ్చి, శారీరకజీవన ప్రాబల్యము తగ్గినప్పుడెల్ల, మనోమయపురుషుడగు మానవుడు వైయక్తిక జీవనమును తన ఆదర్శానుసారము తీర్చిదిద్దుటకు మనోమయప్రకృతి ప్రేరణను పొందినటుల భావించుచుండును. జటిలతరమైన సంఘజీవనము సైతము కడకు ఆ సూక్ష్మవిధానము ననుసరించునట్లుగా ప్రేరేపించబడును.

ఆధ్యాత్మిక జీవనము:

ఆధ్యాత్మికజీవనమున, అనగా మనస్సుకంటె ఉచ్చతరమైన శక్తి యొకటి అభివ్యక్తమై ప్రకృతిని కైవసమొనర్చుకొనుట సంభవించినపుడు, ఈ సంకుచిత ప్రేరణలు వెనుకకు తగ్గి క్షీణగతినొంది కడకు అంతరించిపోవును. మనస్సున కతీతమైన ఆత్మస్వరూపుడై, సర్వగత, సర్వాతీత తత్వమగు పరమపురుషుడే

మనలో ప్రభువై దీపించును. మన ప్రకృతి ధర్మపు ఉచ్చతమ, విస్తృతతమ, పూర్ణతమాభివ్యక్తి కనుగుణముగా మన సుస్వరూప వికాస పారమ్యమును యథేచ్ఛగా రూపొందించవలసి యున్నది. కడకు ఆ ప్రకృతియే పూర్ణసత్యమున సుప్రతిష్ఠితమగుచు, పూర్ణ సత్యపు సహజ స్వాతంత్ర్యముతో మనలో వ్యవహరింప నేర్చును. అయ్యది విధేయమగునది నిత్యుడగు పరముని దివ్యశక్తికి మాత్రమే. ఇకపైన వ్యక్తి పొందదగినది వేరేమియు లేదు. నెరవేరవలసిన కామితమును ఏదియు నుండదు. నిత్యుడైన పరముని అక్షర స్వరూపమునందు, లేక విరాట్పురుష స్వరూపమునందు అత డంతర్భాగమైనాడు.

జీవితములో పరమాత్ముని ఖేలనను, అభివ్యక్తినీ కొనసాగించుటయు, ప్రపంచగతిని దాని దివ్యగమ్యము దెసకు నడిపించుకొనిపోవుటయు, నివిదక్క కార్యాచరణ కాతనిని ప్రేరేపించునది ఇతర మేదియు నుండదు. మానసిక భావనలు, అభిప్రాయములు, కల్పనలు ఇక అతనివి కావు. ఏలయన, అతని మనస్సు నీరవస్థితిని పొందినది. ఇప్పుడది దివ్యజ్ఞానపు సత్యతేజః ప్రసారణకు వాహకము మాత్రమే. అతని ఆత్మవిస్తృతియందు ఆదర్శముల నంకుచితికి అవకాశము లేదు. *పరమపురుషుని అనంత మహాసాగర తరంగము లతని యందంతటనూ లేచిపడుచు, అతని సకల ప్రవృత్తులనూ సదా ప్రేరేపించుచుండును.*

అనువాదం: కమలాకర వేంకటరావు ('యోగ సమన్వయము' నుండి)

(*SABCL* Vol. 22, p. 138; Vol. 20, pp 82, 197-198)

నీ జీవితాన్ని ఆధ్యాత్మికవెలుగులో నడిపించటం నీ మేధకు అతీతమైన విషయము. హృదయాకాంక్ష, ఆంతరంగిక తపనల వలననే అది సాధ్యము.

శ్రీఅరవిందులు

ఆధ్యాత్మిక జీవనానికి మార్గము – II

The Little Ego

This puppet ego the World-Mother made,
This little profiteer of Nature's works,
Her trust in his life-tenancy betrayed,
Makes claim on claim, all debt to her he shirks.

Each movement of our life our ego fills;
Inwoven in each thread of being's weft,
When most we vaunt our selflessness, it steals
A sordid part, no corner void is left.

One way lies free our heart and soul to give,
Our body and mind to Thee and every cell,
And steeped in Thy world-infinity to live.
Then lost in light, shall fade the ignoble spell.

Nature, of her rebellion quit, shall be
A breath of the Spirit's vast serenity.

Sri Aurobindo

తెలుగు అనువాదం:

ఈ అహంకారపు తోలుబొమ్మ విశ్వమాత సృజన; తల్లినే దోచు కొనే స్వార్థం,
సహజ ప్రకృతిసంపదలను సొంతలాభానికి కొల్లగొట్టటమే పర మార్థం,

తెలివిగా తప్పించుకొని తన భారాన్ని పదేపదే తల్లిఖాతాలో పద్దు
వ్రాసిన కుటిలుడు,
తనపై తల్లి ఉంచిన విశ్వాసాన్ని మనుగడలో మంటగలిపిన
కుపుత్రుడు.
అహం – జీవితపు ప్రతి కదలికలో గూడు కట్టుకుంది;
మగ్గంపై నూలులా కలిసిపోయింది, – చేతులు కాలాయి – అహం
ఆధారాల నన్నింటినీ తొలచివేసింది, ఏ మూలమూ లేదు, –
మనలో
చాలామందిప్పుడు – స్వార్థం వదలి – ఆకులు పట్టుకొంటున్నారు
గొప్పగా!
మా హృదయాన్నీ, ఆత్మనీ, దేహాన్నీ మనసునూ ఏకంగా
అణువణువునూ సాకల్యంగా నీ కర్పించే ఓ మార్గం సదా తెరిచే
ఉంటుంది.
కేవలమైన నీ విశ్వ అనంత తత్త్వంలో మనుగడ సాగించటానికి,
అక్కడ అనంతజ్యోతిలో విముక్తమై అల్పాహంకార మోహం
అదృశ్యమౌతుంది.
ఈ అహంకార విముక్తి పోరాటంలో ప్రకృతి తన
అనంత ప్రశాంతవీచికలను విస్తరించాలి నిత్యంగా – తాను
శ్వాసయై పరిఢవిల్లుతూ.

అనువాదం: అన్నవరం ఆదిశేషయ్య

(*SABCL* Vol. 5, p. 146)

దివ్యపురుషుడు నీలోని రహస్యమందిరం లోంచి బయటకు వచ్చి నీ మనస్సును స్వాధీనపరచుకున్నప్పుడే ఆధ్యాత్మిక జీవనము మొదలవుతుంది.

శ్రీఅరవిందులు

ధ్యానమా, కర్మలా?

(అంతరంగము – బాహ్యజీవితము)

విరాగముచే గానిండు, ధ్యానపరతచే గానిండు, ఏకాంతభక్తిచే గానిండు. నిత్యజీవిత కర్మలను పూర్తిగా త్యజించుట యనునది ఇందుండదు. ఉండుట కాస్కారము లేదు. ధ్యానములో నిమగ్నులై నిష్క్రియులై యుండవలెననిగాని, ప్రాణశక్తినీ దాని వ్యాపారములనూ నిరసించి త్రెంచుకొనిపోవలెననిగాని పృథ్వీప్రకృతి యందలి అభివ్యక్తిని త్రోసిపుచ్చవలెననిగాని యీ యోగము చెప్పదు. చెప్పజాలదు. ఒక్కొక్కప్పుడు డెప్పుడైననూ సాధకుడు తనలోనికి దన్ను తా నుపహరించుకొని, తన యంతరాత్మయందు నిమగ్నుడై, అజ్ఞానభూయిష్ఠమైన జీవితపు గందరగోళమునుండి తిరోహితుడు కావచ్చును. కాని, అది ఒక విధమైన అంతఃపరివర్తనము కలుగనంతవరకు మాత్రమే. జీవితరంగమున శక్తిమంతముగ వ్యవహరింపగలుగుట కత్యవసరమైన యంతఃపరివర్తనమది. తాత్కాలికమైన అవసరమునుబట్టియో, ఒక విధమైన ఆధ్యాత్మిక సన్నాహము కొరకో సాధకుడిట్లు నిత్యజీవిత వ్యవహారమునకు పరాఙ్ముఖుడగునే కాని, తన యోగసాధన కది ముఖ్యలక్షణ మనెడి యుద్దేశ్యముతో గాదు.

మానవజీవిత వ్యవహారములను మతవిషయకములనియో, నైతికములనియో విభాగముచేసి, ఏవేవో పూజావిధులనుగాని మానవసేవా కృత్యములను గాని నిర్వర్తించుటతో గిరిగీసుకొని కూర్చుండుట పూర్ణయోగాంతర్యమునకు పూర్తిగ విరుద్ధము. మానసికములైన నియమములూ విధినిషేధములూ పూర్ణయోగ సాధనకు పూర్తిగ విజాతీయములు. ఈ సాధనయందు సకలమునూ మానసికస్థాయినుండి ఆధ్యాత్మికస్థాయికి పైకెత్తవలెను. జీవితము పాక్షికముగగాక సమగ్రముగ బాహ్యాభ్యంతర పరివర్తనము చెందునట్లు చూడవలెను. ఇట్టి పరివర్తనమునకు దోహదము చేయగలదాని నెల్ల ఆమోదించుచూ దానికి కలిసిరానిదాని నెల్ల త్రోసిపుచ్చుచుండవలెను.

ఎట్టి బాహ్యరూపములతోగాని, జీవితవిధానములతోగాని,
ప్రవృత్తి విశేషములతోగాని బంధించుకొనరాదు. అవసరమైనచో
సకలమునూ త్యజించుటకు సిద్ధముగ నుండవలెను. *దివ్యజీవన
మున కుపకరణముగ పరమేశ్వరుడు దేనిని నిర్దేశించిన దాని
నెల్ల గ్రహించుట కాయత్తమై యుండవలెను. ఈ త్యజించుటగాని,
గ్రహించుటగాని మనస్సుతో చేయు పని కాదు.* కామవిశిష్టమైన
ప్రాణప్రవృత్తితోడనూ, నైతికబుద్ధితోడనూ చేయునదియు కాదు.
అంతరాత్మ ప్రేరణచే, యోగేశ్వరుడగు జగద్గురుని ఆదేశముచే,
ఉన్నతాత్మ దర్శనభాగ్యముచే, పరమేశ్వరుని మార్గదర్శకత్వముచే
జరుగవలసిన పనులవి. ఆత్మప్రవృత్తిమార్గము మనఃప్రవృత్తి
మార్గముకంటె భిన్నమైనది. ఆత్మమార్గమును మానసికచేతన
నిర్దేశింప జాలదు. దానియందు మనలను నడిపింపనూ జాలదు.

అట్లే, ఆధ్యాత్మికచేతననూ, మానసికచేతననూ, లేక ఆధ్యా
త్మికచేతననూ, ప్రాణికచేతననూ జోడించుటగాని, రెండింటికినీ
ఏదో విధముగ పొత్తుగూర్చుటగాని, బాహ్యజీవనము మారకుండ
కేవలము ఆంతరజీవనము మార్చుటగాని ఈ యోగలక్ష్యము గానే
రదు. రూపాంతరప్రాప్తి సకలజీవనమునకునూ గలుగవలెను.
మనోమయప్రకృతి కతీతమైన విజ్ఞానమయప్రకృతియందు సక
లమూ ఆత్మాభివ్యక్తివిశేషముగా మారిపోవలెను. భౌతికజగత్తున
అభివ్యక్తము కావలసియున్న ఆత్మవికాసమునకిది శిఖరప్రాయము.
ప్రాణమయమైన జంతుస్థితినుండి మనోమయమైన మానవస్థితి
లోనికి మార్పు జీవనముయొక్క స్వరూపమునే ఎట్లు మార్చి
వైచినదో, అట్లే భౌతికశరీరధారియగు మనోమయజీవుడు విజ్ఞాన
మయ ఆధ్యాత్మిక పురుషుడుగా మార్పుచెందునపుడు, — జడము
నకు వశంవదుడుగాక జడమునే వశంవదము చేసికొను ఆధ్యా
త్మిక పురుషుడుగా మార్పుచెందునపుడు, — జీవితమున కిప్పు
డున్న లోపభూయిష్ఠమైన పరిచ్ఛిన్నస్వరూపము పోయి, కేవల
మొక కొంగ్రొత్తరూపము దాల్చకతప్పదు.

ఈ మార్పునకు తట్టుకొనలేని జీవితవిశేషము లంతరించి,
దానిని తట్టుకొనజాలినవి మాత్రమే నిలువద్రొక్కుకొనినవై ఆత్మ

సామ్రాజ్యమున బ్రవేశించును. దివ్యశక్తి యొకటి మనలో పని జేయుచూ, ఏ క్షణమున ఏది చేయవలెనో, ఏది చేయగూడదో, తాత్కాలికముగగాని, శాశ్వతముగగాని దేనిని స్వీకరించవలెనో, దేనిని త్రోసిపుచ్చువలెనో నిర్దేశించుచుండును. మన కామప్రవృత్తికిగాని, మన అహంకారమునకుగాని, తావివ్వక, దివ్యశక్తినే మనలో పనిచేయనిత్తుమేని, అదియే సర్వసమర్థమై, మనసున కందరాని, మనస్సుచే నిర్ణీతములుకాని సాధన విధానములతో మనలను నడిపించుకొనిపోవును. ఇందులకు మన అంతరాత్మ నిత్యమూ జాగరితమై, జాగరూకమై యుండి, మనలను బయటనుండిగాని, లోపలనుండిగాని అపమార్గమున బెట్టజూచు అసుర ప్రవృత్తిని ప్రతిఘటించుచుండవలెను. ఈ మార్గము చాల కష్టబహుళము, ప్రమాదభరితము ననుమాట నిజమే కాని, ఇంతకంటె మెరుగైన మార్గాంతరము లేదు.

ఇందలి కష్టమునుగాని, ప్రమాదమునుగాని తగ్గించుకోవలెననిన, రెండు ముఖ్యవిషయములను పాటించవలెను. ఒకటి, — అహంకారమునుండియూ, ప్రాణమయకామచేతన నుండియూ, కేవల మనోమయచేతననుండియూ, దాని యసమర్థపు హేతువాదమునుండియూ, — ఈ యజ్ఞానరూప విశేషము లన్నిటినుండియూ బయల్వెడుదానినెల్ల మనము నిరాకరించుచుండవలెను. *రెండు, — మన అంతరాత్మ పిలుపును, మన యంతరమునందలి జగద్గురుని యుపదేశమును, జగదీశ్వరుని యాజ్ఞను, జగన్మాత నిర్దేశమును ఆలకించి అనుసరించు నేర్పు నలవరచుకొనవలెను.*

శారీరకములైన వాంఛలనూ, దౌర్బల్యములనూ, అజ్ఞానసంక్షుభితమైన ప్రాణికోద్వేగములనూ, ఉత్తమజ్ఞానసందీప్తముగాక కలగుండువడు వ్యక్తిగత మానసికాదేశములనూ ఎవడు విడువలేకయుండునో, అట్టివానికి యథార్థమైన అంతరజీవన ధర్మసాక్షాత్కారము కలుగనేరదు. దివ్యజీవనసిద్ధి కతనిని దూరము చేయు ప్రతిబంధకము లెన్నియో అడ్డుతగులుచుండును. ఎవడీ యజ్ఞానోపకరణములను బరిహరించి, వివేకముతో బహిరంతర్వర్తియగు

జగద్గురు ననుసరించునో, అతనికే ఆధ్యాత్మిక ధర్మసాక్షాత్కారము, అతనికే పూర్ణయోగ లక్ష్యసిద్ధి.

చేతనను సమూలముగనూ, సమగ్రముగనూ పరివర్తనము నొందించుటయే పూర్ణయోగసాధన ముఖ్యలక్ష్యము. అంతేకాదు, నానాటి కధికతరశక్తితో, అభ్యుదయసూచకములైన వివిధ దశలతో, అట్టి పరివర్తనమును గొనసాగించుటయే దాని ముఖ్యవిధానము గూడ.

బహిర్ముఖమైన మన సంకుచితాహంకారమును పారద్రోలి, దాని స్థానమున మన ప్రకృతికి అధినేతగా పరమేశ్వరు నధిష్ఠింపజేయుటయే మన యోగాశయము. ఇందుకు మొట్టమొదటగా కామమును బహిష్కరించుట యత్యవసరము. కామోపభోగమే మన ముఖ్యాశయముగ పరిగణించుట మానివేయవలెను. ఆధ్యాత్మికజీవనమునకు పరిపుష్టి గూర్చునది కామము కాదు. మూలసత్తయందలి స్వార్థరహిత విశుద్ధానందముచే నయ్యది పోషింపబడుచుండును. *ఇట్లు కామముద్రితమైన మన ప్రాణమయ ప్రకృతియే కాదు, – మన మనోమయప్రకృతి సైతమూ నవోదయము గాంచి రూపాంతరము నందవలసియున్నది.*

పరిచ్ఛిన్నమూ, పరిమితమూ, అహంకారభూయిష్ఠమూ, అజ్ఞానయుతమూనైన మన బుద్ధివృత్తి యంతరించవలెను. దాని స్థానములో, సామరస్య విశిష్టమై, నిర్దుష్టఖేలనమున నర్తించు నిరంజన దివ్యజ్ఞానజ్యోతిఃపూరము మనలోనికి ప్రవహించవలెను. అట్లే అహంకార ప్రేరితమై, సంకుచిత లక్ష్యోపేతమై, కలవరపాటులతో గందరగోళపడుచూ ప్రవర్తిల్లు మన యిచ్ఛాక్రియావృత్తులడంగి పోవలెను. వాటికి మారుగ, తీవ్రబలసమన్వితమైన దివ్యశక్తి మనయందు పూర్ణముగ విజృంభించుట కవకాశ మేర్పడవలెను. ఈశ్వరేచ్ఛతో అనాయాసముగ మేళనముబొంది, ఎట్టి పొరపాటులూ, తడబాటులూ లేకుండ బనిసేయు అపౌరుషేయమైన మహనీయేచ్ఛ మన సకలకర్మలకూ మూలకందము గావలెను.

అదే విధముగ, అహంకారికములై, అసంతృప్తికరములై, బాహ్యాతలములయందు మాత్రమే సంచరించు దుర్బల భావావేశ

ములకు మన హృదయమునుండి ఉద్వాసము చెప్పవలెను. వాటికి వెనుక, స్వీయావిష్కరణకై తరుణముకొరకు వేచియున్న అంత ర్హృదయము – అగాధమూ, అపారమునైన గుప్తహృదయము ప్రక టితము గావలెను. ఈశ్వర నివాసస్థానమైన యీ అతర్హృదయ ముచే ప్రేరితములై, మన భావములన్నియూ నప్పుడు, దివ్యప్రేమ తోపాటు బహుళానందమును వెలార్చుకొను యుగళభావావేశపు ప్రశాంత ప్రగాఢ వృత్తులుగ మారిపోవును.

అనువాదం: కమలాకర వేంకటరావు ('యోగ సమన్వయము' నుండి)

(*SABCL* Vol. 20, pp. 174-76, 83-84)

నిత్యజీవితంలో ఆధ్యాత్మికపు పాత్ర

శ్రీఅరవిందులు

ఆధ్యాత్మికము సృజనశీలి. దాని వ్యవహారదక్షత అమోఘము. (అది తలచుకొంటే లోకాలను కూడా నిర్మించగలదు.) మనము భారతీయులమై వుండికూడ ఆధ్యాత్మికమనగా కేవలం ముక్కు మూసుకొని జపం చేయడమే అనియు, దానికి ప్రపంచంతో ఏ విధమైన సంబంధం లేదనియు, మానవజీవితానికి అది పూర్తిగా విరుద్ధమనియు అనుకోవటం చాల సిగ్గుచేటు. ఇది ఏమాత్రం నిజం కాదు. మానవజీవితంలోని అన్ని రంగములను – సంగీత, సాహిత్య, కళారంగములు సామాజిక, రాజకీయ, సైనికతంత్రము లన్నిటిని ఉద్దీపింపజేసి మనస్సుకంటె వెయ్యిరెట్లు అధికమైన శక్తిసామర్థ్యములతో తీర్చిదిద్దవచ్చును. మనము ఈ విషయాన్ని తెలుసుకొని ఆచరించిననాడు మన దేశము అన్నిరంగముల లోను పురోగమించగలదు. *– సంపాదకుడు*

"సామాజిక జీవితము, రాజకీయాలు, కళ, సాహిత్యరంగాలకు ఆధ్యాత్మిక మేవిధముగా దోహదము చేయగలదు?" అని మన భారతీయులే నేడు ప్రశ్నించుట చాలా విచిత్రముగా వున్నది. నేటి రాజకీయ, సామాజిక సమస్యలను ఇది ఏవిధంగా తీర్చగ లదు? ఇదంతా పాశ్చత్య నాగరికత ప్రభావమే. వాళ్ల ఉద్దేశ్యంలో లౌకికజీవితము, దైవచింతన, ఒకదాని కొకటి సంబంధములేని వేరువేరు విషయాలు. మతాభినివేశము, మంత్రములు, తంత్రములు వైరాగ్యానికే దారితీస్తాయిట. మన పురాతనసంస్కృతికి నిత్యజీవి తంతో ఏవిధమైన సంబంధము లేదట. నేటి పరిస్థితులలో జీవిం చుటకు మనం కూడా పాశ్చాత్యులనే అనుకరించవలెనట. ఈ వాదనలెంతవరకు విజం! ఆధ్యాత్మిక విధానములవలన ఈ దేశాన్ని పునరుద్ధరించగలమా, లేదా!

ఆధ్యాత్మికమనగా మనకుండే భావన చాల విడ్డూరమై నది. కాషాయిబట్టలు వేసుకొని ఏ కొండగుహాల్లోనో, హిమాల యపర్వతాలలోనో, తపస్సు చేసుకొంటూ ఈ శరీరాన్ని, లౌకిక జీవితాన్ని లెక్కచేయక విదేహాముక్తి నాశించుట మన మతము కాదు. ఒకానొకప్పుడు అటువంటి భావన తలయెత్తి యుండవ చ్చును. కాని అదే అసలు సత్యమని చెప్పేందుకు వీలు లేదు. అలా అని దేశమంతటా ఒకే మతం ఉండాలని, అందరు మను ష్యులూ ఒకే విధమైన కట్టుబాట్లకు, ఆచారవ్యవహారములకు కట్టు బడి వుండాలని చెప్పడం కూడా యథార్థానికి దూరమవుతుంది. హిందూ, మహమ్మదీయ, క్రిస్టియను మతములు, వాటినుండి ఏర్పడిన అనేక ఉపమతముల వైవిధ్యమున్న దేశములో ఒకే విధ మైన శాసనమే వున్నదని చెప్పడం విపరీతభావనేగాని సత్యము కాదు. ఆధ్యాత్మికమనగా ఏ ఒక్క మతముయొక్క బోధనలను అనుకరించుట కాదు. 'మతము' అన్న పదానికి సంకుచితమైన అర్థము కాకుండా we shall understand in the future man's seeking for the eternal, the divine, the greater self, the source of unity and his attempt to arrive at some equation, some approxi-

mation of the values of human life with the eternal and divine values.

మనోవాక్కాయములు మానవుని ప్రాపంచిక జీవితానికి సాధనములు. వీటి నభివృద్ధిపరచుటవలనే మానవజీవితము అభివృద్ధి చెందుతుంది. కాబట్టి జీవితాన్ని వల్లకాదని త్రోసిపుచ్చుట సృష్టి ధోరణికే విరుద్ధము. గ్రీకుసంస్కృతి మనోవికాసానికి ప్రాముఖ్యత నిచ్చినట్లుగానే మనవాళ్లు మనస్సును, జీవితాన్ని, శరీరాన్ని చాలా ముఖ్యముగా పరిగణించి లౌకికజీవితాన్ని సాధ్యమయినంత వైభవముగా పరిణతి చెందింప దలచితిరి. శాస్త్రాలు, కళలు, తర్కము, వేదాంతము, శరీరారోగ్యము, సౌష్టవము జాతిని భౌతిక, ఆర్థిక మార్గములలో పురోగమింపజేయుట, సైనిక, రాజకీయ, సామాజిక జీవితములను పరిపోషించుట, ఇవన్ని భారతీయ సంస్కృతికి చాలా ముఖ్యమైన విషయాలు. దారిద్యము, వైరాగ్యము, ఎప్పుడూ మన ఆదర్శములు కావు.

అయితే జీవితమంటే ఏమిటో అర్థం చేసుకొనేందుకు కేవలం మనస్సుగాని, పదార్థవాదముగాని చాలవు. అది ఆధ్యాత్మికదృష్టికే సాధ్యము. ఆ దృష్టిలో మానవుని మనస్సు, జీవితము, శరీరము ఉపకరణములు మాత్రమేగాని అతని యావత్ స్వరూపము కాదు. మనుషులకు, సర్వభూతములకు తెర వెనుక అనంతమయిన స్వరూపముంటుంది. మనం ఎప్పుడైతే దానిని గుర్తించి, నిత్యజీవితంలోకి తెచ్చి దానిని ప్రభావితం చేస్తామో అప్పుడే నేటి మానవజీవితము ఈ పరిమితరూపమును దాటి అంతకంటె ఘనమైన, వైభవమైన స్థాయిని చేరుకోగలదు. "*శరీరం ఖలు ధర్మసాధనం*" అని మనవాళ్లు ఊరికే అనలేదు.

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*SABCL* Vol. 14, pp. 426-30)

భారతదేశము, ఆధ్యాత్మికత, మానవజాతి భవిష్యత్తు

శ్రీఅరవిందులు

మానవజీవితమునకు ఆధ్యాత్మికతయే మూలస్తంభము. జీవితముయొక్క సర్వావసరములు ఆ దృఢమైన ప్రాతిపదిక మీద నిర్మించవలసినదే. పశ్చిమదేశములు దీనికి పూర్తిగా వ్యతిరేకము. వారు కేవలం భౌతికపదార్థమునే ప్రధానముగా ఎంచి, విజ్ఞానశాస్త్రమును తీర్చిదిద్ది, దాని సహాయముతో జీవితమును సంస్కరింపబూనిరి. కాని అది ఎటువంటి అనర్థములకు దారి తీసిందో మనం చూస్తూనే వున్నాము. అసలు రహస్యము మన మహర్షులు ఎప్పుడో కనిపెట్టారు. అది మన చేతుల్లోనే వున్నది. కాని పాశ్చాత్య వ్యామోహంలో పడి మనము దానిని విస్మరించాము. ఇప్పుడైనా కళ్లు తెరచి ఆ రహస్యమును వెలికితీసి, ఆ వెలుగులో ఒక నూతన విజ్ఞానశాస్త్రమును నిర్మించి, జీవితమును తీర్చిదిద్దుటయే మానవజీవితమునకు ఉన్న ఏకైక పరిష్కారము. ఇది పాశ్చాత్యులకు అంతుబట్టని విషయము. ఒక్క భారతదేశమే ఈ బాధ్యతను వహించగలదు. — సంపాదకుడు

భారతజాతి భవిష్యత్తుకు, భారతదేశ భవిష్యత్తుకు రూపుదిద్దే గొప్ప పరివర్తనకు నాంది పల్కడానికి, అందుకు మార్గాలను సన్నద్ధం చేయడానికి మనం ప్రయత్నం చేయాలి. ఆత్మప్రాభవంలోకి మానవాళి అందలి నూతన జన్మ నెత్తాలి. ఇదీ మన ఆదర్శం. అటువంటి మహోన్నత వినూతన జీవనానికి, సృష్టికి ప్రోదిచేసే మహత్కార్య ప్రణాళికను రూపొందించడానికి ఆధ్యాత్మిక విస్ఫూర్తితో మన జీవితం వెలిగిపోవాలి.

మన ఆధ్యాత్మిక ఆదర్శము

ఆధ్యాత్మిక ఆదర్శమే ఎల్లప్పుడూ భారతదేశపు విశిష్ట లక్షణంగా, ఆకాంక్షగా వున్నది. కాని కాలక్రమేణ మానవాళి అవ

సరం దృష్ట్యా, ఆ ఆదర్శానికి కొత్త రూపు, కొత్త ప్రాధాన్యత మనం ఇవ్వవలసి వుంది. కాలోచిత ప్రయోజనం సిద్ధించాలంటే, పాతపద్ధతులు, పాతరూపాలు ఇక ఎంతమాత్రం చాలవు. భవిష్యత్తులో భారతదేశం వేసే పెద్ద అడుగుల దృష్ట్యా, సంకుచితమైన మార్గాలలో ఎంతమాత్రం తనకుతాను సఫలీకృతం కాలేదు.

జీవితముపై ఆధ్యాత్మిక పతాకము

జరాకృశమైన, ప్రపంచమంటే విసుగుజెంది, మిథ్యాభావనతో కృంగిపోయిన ఆధ్యాత్మికత కాదు మనది. భగవంతుని మహనీయమైన సృష్టిలోని అనంత శక్తి సంపదలను ఉపయోగించుకోలేని విషాదకర ఆధ్యాత్మికత కాదు మనది. జీవితంనుండి ఉపసంహరించుకునే ఆధ్యాత్మికత మన ఆదర్శం కాదు. ఆత్మ మహత్తరశక్తి వైభవంలో జీవితాన్ని జయించే ఆధ్యాత్మికత మన ఆదర్శం కావాలి. ప్రపంచాన్ని దైవత్వపు మహత్వ అభివ్యక్తికి వేదికగా మనం ఆమోదించాలి. అంతేగాదు. ఇంతవరకు కృతకృత్యంగాని మరింత మహనీయ దివ్య అభివ్యక్తి ద్వారా మానవాళి పరివర్తనకు మహా ప్రయత్నం సాగాలి. మనిషికి, భగవంతునికి మధ్యగల తెరను చీల్చివేయాలి. మనకు సాధ్యమైన దివ్యమానవత్వం సిద్ధింపజేసుకోవాలి. ఆత్మ వెదజల్లే సత్య, శక్తి, రోచిర్నివహంలో మన జీవితాన్ని పునర్నిర్మించుకోవాలి. మన కర్తృత్వానికి అధినేత అయిన భగవానునికి మన కర్మ లన్నింటినీ పరిత్యాగం చేయాలి. మనిషిలోని మరింత ఉన్నతమైన ఆత్మ అభివ్యక్తికి అవి దోహదం చేయాలి. సమస్తజీవితాన్ని, యోగంగా మలుచుకోవాలి.

పశ్చిమదేశముల తప్పుడు త్రోవ

మానవునిలోని మేధస్సు, ఉద్వేగాలు, ప్రాణిక, భౌతికశ్రేయస్సు, వికాసమే తన ఆదర్శంగా చేసుకొంది పాశ్చాత్య ప్రపంచం. కాని అతని ఆధ్యాత్మిక జీవనసంభావ్యతలకు తిలోదకాలు వదిలింది. పురోగతి, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, హేతువు, విజ్ఞానశాస్త్రం, అన్ని రకాల సామర్థ్యం, మరింత మెరుగైన రాజకీయ, ఆర్థిక, సామాజిక వ్యవస్థ, ఐక్యత, భువిపై పొందే

సుఖసంతోషాలు – ఇవి పాశ్చాత్య ప్రపంచం పూజించిన ఆద ర్శాలు. ఇవి గొప్పగా సాధించిన ప్రయత్నాలు కాని సంవేదనలు, మనోభావనల ద్వారా మాత్రమే వాటిని సాధించలేవని, అనేక ప్రయోగాలు నిర్ద్వంద్వంగా నిరూపించాయి. వాటి అసలు సత్యం, ఆచరణ ఆత్మపునాదులపైన మాత్రమే సిద్ధిస్తాయి. పాశ్చాత్య ప్రపంచం సైన్సులోను, యంత్రవ్యవస్థలోను విశ్వాసం పెంచుకుంది. అదే సైన్సు, పాశ్చాత్య ప్రపంచాన్ని నాశనం చేస్తున్నది. రాకాసి యంత్రాల క్రింద నలిగిపోతున్నది. తన ఆదర్శాలు సఫలీకృతం కావడానికి ఆధ్యాత్మిక పరివర్తన అవసరమని పాశ్చాత్య ప్రపంచం గుర్తించలేదు. ఆ ఆధ్యాత్మిక పరివర్తన రహస్యం ప్రాగ్దేశాలకు తెలుసు. కాని ఎన్నో యుగాలనుండి ఈ ప్రాక్ప్రపంచం తన దృష్టిని భూమినుండి మరల్చి ఆకాశంవైపు మళ్ళించింది. ఈ విభజనను, ఈ అగాధాన్ని రూపుమాపి, జీవితాన్ని, ఆత్మను సమైక్యం చేసే కాలం ఇప్పుడు వచ్చింది.

_జీవితమంతా ఆత్మసామ్రాజ్యమే_

భారతదేశానికి ఈ రహస్యం కూడా తెలుసు. కాని చాలినంతగా ఆచరణలో పెట్టలేదు. భగవద్గీతలోని *"యోగస్థః కురు కర్మాణి"* అన్న మంత్రంతో దీని సంగ్రహసారం ఇవ్వబడింది. యోగంలో, భగవంతునితో సమైక్యమైన స్థితిలో, అత్యున్నతమైన ఆత్మపునాదులపై, ఆత్మశక్తి ప్రచోదితమై మనలోని ఇంద్రియాల ద్వారా సమస్త కర్మాచరణ సాగించడం భగవద్గీత ముఖ్య సిద్ధాంతం. మనిషికి ఇది సాధ్యమే. అంతేకాదు. అతని సమస్యలకు, కష్టాలకు నిజమైన పరిష్కారసూత్రం అదే అని మా నమ్మకం. నిత్యం ధ్యానం చేసే సందేశం ఇది. ప్రబుద్ధమవుతున్న యువ ప్రపంచానికి మేము అందించే ఆదర్శం ఇదే. సమస్త మానవ కర్మాచరణలను తనలో ఇముడ్చుకోగల ఆధ్యాత్మిక జీవనం ఇదే. రాబోతున్న మహాయుగంలో ప్రపంచాన్ని మార్చే సాధనసంపత్తి ఇదే.

జీవనమర్మము భారతదేశపు సొత్తు

ఈ రహస్యాన్ని ప్రాచీనకాలంనుండి తనలో దాచుకున్న భారతదేశం మాత్రమే ఈ పృథ్వి మహాపరివర్తనమునకు మార్గం చూపగలదు. అటు నడపగలదు. వర్తమాన యుగసంధ్య రాబోయే ఈ మార్పునకు వైతాళిక రోచిస్సు. సర్వమానవాళి సముద్ధరణలో భారతావని లక్ష్యం, సేవ ఇది – వ్యక్తిశ్రేయస్సుకు ఆంతరంగిక ఆధ్యాత్మిక జీవనమార్గం కనుగొన్నట్లే, మానవజాతి అంతటికీ సమగ్ర సంపూర్ణ సమైక్య ఆధ్యాత్మిక మార్గాన్ని కనుగొనాలి. అందరికీ ఒక నూతన ఆధ్యాత్మిక, సామాజిక జీవనవ్యవస్థను సంస్థాపించాలి.

ఆధ్యాత్మిక పరివర్తనము

మన తొలి లక్ష్యం: ఈ ఆదర్శాన్ని ప్రకటితం చేయాలి. ఆధ్యాత్మిక పరివర్తన తొలి ఆవశ్యకత – దానిని అంగీకరించిన వారిని, అటువంటి పరివర్తనను సఫలీకృతం చేయడానికి సన్నద్ధంగా వున్నవారి నందరిని ఒక చోటకు చేర్చాలి. ముందు ఈ విషయం అందరికీ నచ్చచెప్పాలి. రెండవది: ఈ సిద్ధాంత ప్రాతిపదికపై వ్యష్టిజీవనం మాత్రమేగాక సమిష్టిజీవనాన్ని కూడ సంస్థాపించాలి. బాహ్యక్రియాత్మక జీవనంతోబాటు ఆంతరంగిక పరివర్తన కూడ అవసరం. అది ఆధ్యాత్మిక, సాంస్కృతిక, విద్యా, సామాజిక, ఆర్థిక, జీవనవ్యాపారంగా వుండాలి. దాని పరిధి వ్యష్టికి మాత్రమేకాక, సమిష్టి జీవనానికి, ప్రాంతీయ, జాతీయ స్థాయికి విస్తరించాలి. క్రమంగా జాతికి మాత్రమేగాక, ఈ సమస్త మానవ జాతికి కూడ వర్తింపజేయాలి.

ఆధ్యాత్మిక విద్యతో నూతన సృష్టి

ఈ బాహ్యజీవన వ్యాపార తక్షణ లక్ష్యం ఒక నవ సృష్టి, ఆధ్యాత్మిక విద్య వికాసం, సంస్కృతి. విభజనపై కాకుండా ఐక్యతపై, వ్యక్తి పరిపూర్ణ వికాసం, స్వేచ్ఛలపై, ఇతరులతో సమైక్యమై, దేశప్రజలలో, ప్రపంచప్రజలలో ఉన్నత ఆత్మకు అంకితం చేసుకొంటూ ఒక సువిస్తృతమైన సామాజిక చైతన్యస్ఫూర్తి ఈ లక్ష్యంలో భాగాలుగా ఉంటాయి.

పాశ్చాత్య ప్రణాళికల ఆదర్శంగా కాకుండా, భారతదేశానికి అనువుగా ఉండే సమష్టి (సామాజిక) సిద్ధాంతం పునాదులపై ఆర్థిక సమస్యను పరిష్కరించే ప్రయత్నాన్ని ప్రారంభించాలి.

నూతన ప్రపంచ నిర్మాతలు

భారతదేశంలోని యువకులకే మా పిలుపు; వారే నూతన ప్రపంచ నిర్మాతలు; పాశ్చాత్యదేశాలతో పోటీపడే వ్యష్టి వాదం, పెట్టుబడిదారీ విధానం, భౌతికవాద కమ్యూనిజం భారత దేశపు భవిష్యత్ ఆదర్శంగా ఆమోదించేవారు కాదు. పాతబడిన మతచాంధస భావాల చట్రంలో బానిసలుగా జీవించేవారు, ఆత్మ ప్రాభవోజ్యల మహత్వంతో జరిగే జీవనపరివర్తనను నమ్మలేని వారు కూడా కాదు. మరింత పూర్ణమైన సత్యాన్ని స్వీకరిస్తూ, మరింత మహనీయమైన ఆదర్శంకోసం పాటుపడుతూ, మనస్సు, హృదయాలలో స్వేచ్ఛగా ఊపిరిపీల్చేవారే నవనిర్మాతలు. గతానికి, వర్తమానానికి కాకుండా భవిష్యత్తుకు తమ జీవితాలను అంకితం చేసుకొనేవారు మాత్రమే నవప్రపంచ నిర్మాతలుగా భాసిల్లుతారు. నిమ్న ఆత్మ భూమికను అధిగమించడానికి తమ జీవితాలను అంకితం చేసుకొనడం, తమలోను, అందరిలోను దైవాన్ని సాక్షాత్కరింపచేసుకోవడం, జాతి అభ్యున్నతి కొరకు, సర్వమానవాళి సంక్షేమంకొరకు నిండుమనస్సుతో అలుపులేని పరిశ్రమ సాగించడం ఎంతయినా అవసరం. ఈ ఆదర్శం ఇంకా అతిచిన్న బీజంగానే వుండవచ్చు. ఆదర్శాన్ని ధరించిన జీవితం అణురూపమే కావచ్చు. ఈ బీజం ఒక పెద్ద వృక్షం కాగలదని, అణురూప ఆదర్శజీవనం నిరంతరం విస్తరించే విశ్వసామ్రాజ్యంగా వర్ధిల్లుతుందని మా గట్టి ఆశ. నశించిపోతున్న పాతప్రపంచపు అల్లకల్లోలంలో ఆవిర్భవించడానికి సతమతమవుతున్న ఒక వినూతన మహామానవాళికి మార్గనిర్దేశం చేసే నూతన యుగావిష్కర్తలుగా, మమ్మల్ని ప్రదీప్తం చేసే విస్ఫూర్తిలో పూర్ణవిశ్వాసంతో మేము ముందడుగు వేస్తాం.

కృశించి, శుష్కించిపోయిన ప్రాచీన భారతమాత మహనీయరూపాన్ని, పునః ప్రజ్వలితం చేయడానికి పునర్జన్మనిస్తున్న

మరింత మహోజ్వల భారతావనికి, భవిష్యత్ భారతావనికి మేము పథనిర్దేశకులం కాగలమనే నిండు నమ్మకంతో ప్రపంచానికి చాటుతున్నాం.

అనువాదం: కె. యజ్ఞన్న

(*SABCL* Vol. 16, pp. 329-31)

వైతాళికులకు పిలుపు

శ్రీఅరవిందులు

యుగయుగాల మానవచరిత్రను, రాబోవు పరిణామాలను 'ది హ్యూమన్ సైకిల్' అనే పుస్తకంలో శ్రీఅరవిందులు మనోవైజ్ఞానికశాస్త్రదృష్ట్యా చాల క్షుణ్ణంగా పరిశీలించారు. నేటివరకు జాంతవికమానవుడు పరిణమించి, మానసిక మానవునిగా రూపొందాడు. అదే విధంగా భవిష్యత్తులో మానసాతీతస్థాయిని జేరుకుంటాడు. ఈ పరిణామము మొదట కొద్దిమంది వ్యక్తులలో మాత్రమే జరుగుతుంది. వారే భావిమానవజాతికి మార్గమును తీర్చిదిద్దే వైతాళికులు. – సంపాదకుడు

ఆత్మతత్వంవైపు పురోగమించడమే మొత్తం మానవజీవితాన్ని మలుచుకోవడం ముఖ్యధ్యేయం కావాలి. మనిషి స్వర్గంవైపు పురోగమించడం ప్రధానం కాదు. మృణ్మయతత్త్వ ప్రధానమైన మానవస్వభావంలోకి ఆత్మతత్వ ప్రదీపనోద్దీపనం చాలా ఆవశ్యకమైనది. ఇందుకై మరణానంతరజీవితం అనేది మార్గాంతరం కానే కాదు. జననమరణకలాపాల సందోహంనుండి విముక్తం కావడమే మానవజన్మ చరమలక్ష్యం కావాలి. ఇందు కవసరమయిన ఆత్మతత్వ ప్రదీపనం అందరిలోను జరగాలి.

ఆధ్యాత్మిక పరిణామం

ఈ కర్తవ్యాన్ని అర్థం చేసుకొని మానవజాతి సముజ్జ్వల భవితవ్యానికై ఉద్యమించే సహమానవులను ఆత్మతత్వోపాసకులుగా పరి

వర్తింపచేయగల వ్యక్తులు, వారి అకుంఠిత దీక్షాయుతసాధనం నేటి అవసరం. వీరివలన ఆత్మోన్నతి చెందిన నవమానవ సమాజం పరిణామం చెందుతుంది. జంతుతత్వం నుంచి మానవతత్వం రూపొందించిన ప్రత్యేకభూమికగల జీవిగా మనిషి పరిణామం ఊర్ధ్వముఖంగానే జరిగింది. ఇకపై మానవస్వభావంనుంచి ఆధ్యాత్మిక ప్రదీపనగల తత్త్వభూమికలోకి ఈ మానవజాతి పురోగమించాలి. ఊర్ధ్వగమనం చేయాలి. ఇది ఈనాటి మనిషి అవసరం, ప్రకృతి సంకల్పం కూడా అదే అనిపిస్తుంది. మానవమస్తిష్కం, ప్రకృతి వైశ్వికనియమమేధ అటువైపే పయనిస్తున్నాయి. అయితే కొన్ని భావాలకు, నమ్మకాలకు, కట్టుబాట్లకు బందీ అయిన మానవనైజం ఆంతరిక రహస్యనియమాన్ని యథాతథంగా అంగీకరించే స్థితిలో ప్రస్తుతం లేదు. తమకుగల బలమైన అభిప్రాయాల చట్రంలో మనుషులు శృంఖలాబద్ధులయిపోవడమే ఇందుకు కారణం. ఇది పరిమితబుద్ధి వికృతి తప్ప పరిణతమనోచైతన్యం అనిపించుకోదు. ద్రవ్యరాశిలోంచి ప్రకృతిరహస్యానికి భాష్యం చెప్పే మేధ వికసించిన సత్యాన్ని విశ్వసించిన మనిషి ఈ మేధో యవనికపై అతీంద్రియకల్పన చమత్కృతికి కనిపిస్తుందనే ఆలోచనను అంగీకరించలేకపోవడం విడ్డూరం.

బాహ్యప్రణాళికలు విఫలము

ఇది వైయక్తికంగా మనిషికిగల ఆలోచనా పరిమితియే తప్ప అదే తురీయ ఆలోచన అనిపించుకోదు. అంతర్ముఖులయిన సాధకులు ఈ అతీంద్రియ ఆత్మతత్త్వభూమికను దర్శించగలరు. దాని అపరిమిత సృజనకలాపాన్ని అనుభవించగలరు, ఆనందించగలరు. అటువంటివారే సకల మానవజాతియొక్క ఆత్మతత్వవికాస కార్యక్రమానికి వైతాళికులు కాగలుగుతారు. ఇక్కడ పాశ్చాత్యుల జీవనవిధానాలకు తూర్పుదేశాల జీవనవిధానాలకు మధ్యగల అంతరాన్ని గుర్తించాలి. భౌతికప్రపంచసుఖానుభవమే శరీరానికి అనుభూతి అయిన తత్త్వం అని పాశ్చాత్యులు విశ్వసిస్తారు. ప్రాచ్యదేశాలవారు అలౌకిక భౌతికాతీతమైన మనోభూమికలోని పరికల్పనయొక్క దృశ్యచిత్రాల సంస్పర్శనం చేస్తారు.

చూస్తూన్న అనుభవానికి వస్తున్న వస్తుప్రపంచపు నేపథ్యంలో మనోయవనిక చేసే చిద్విలాస క్రియాకలాపం ఇదే. స్థూలప్రపంచానికి వెనుకగల సూక్ష్మప్రపంచపు నగ్నచిత్రం ఇది. దీనిని అంతర్ముఖులైన సాధకులు మాత్రమే దర్శించగలరు. ఇదే ఆత్మ చైత న్యభూమిక. ఆధ్యాత్మిక యోగసాధనా ఫలితం.

వైతాళికులు క్రియాశీలురు

అంచేత వైతాళికులు భవిష్య మానవజాతి జాజ్జ్వల్యానికై ఉపక్రమించాలి. మొత్తం మానవజాతి ఉద్ధరణ తమ కార్యక్షేత్రంగా ఎంచుకోవాలి. తమ దేహేంద్రియ మనోవ్యాపారాలకు అతీతంగా ఏదో ఉందని వీరు అంగీకరించరు. ఏదీ తమకు వైదేహికము, వైదేశికము అని వీరు భావించనే భావించరు. మనిషి జీవితంలోని ప్రతీ అంశానికి వెనుక తాత్త్వికభూమిక వుందని వీరు సంభావన చేస్తుంటారు. అది మేధోపరమైనది కావచ్చు. చైతన్యవంతమైనది కావచ్చు, భౌతిక అంతరంగికాలకు చెందినది కావచ్చును. ప్రతి అంశానికి వెనుక అంతర్నిహితంగా ఒక తత్త్వభూమిక వుందని వీరు భావిస్తారు. ఆ భూమికలో మార్పుని ఆహ్వానించడం సులభం. పకృతి పరిణామక్రమంలో ఎంచుకొనే భూమిక యిదే. విశ్వవ్యాప్తంగా దైవత్వం అంతర్నిహితమై ఉన్నదనే స్ఫురణయే ఈ భూమికలోని కీలకాంశం. ఈ భావనాస్థాయిలో మార్పునకు, పరిణామానికి, పరిణతికి అడ్డంకులు ఏం వుండవు. ప్రకృతి మార్గాన్నే తన మార్పునకు ఆధారం చేసుకొంటుంది. మానవజీవనాన్ని దివ్యజీవనోన్నత శిఖరాలవైపు పరివర్తింపజేయడం, ఉద్గమనం చేయించడం ఈ తత్త్వంయొక్క అంతశ్చేతన. దీనిని గ్రహించిన వైతాళికులే రేపటి దివ్యమానవ సమాజస్రష్టలు!

అనువాదం: పురాణపండ రంగనాథ్

(*SABCL* Vol. 15, pp. 250-51)

మానవజాతి సమస్యలకు పరిష్కారం

శ్రీఅరవిందులు

ఆధ్యాత్మికోన్నతికి మనిషి ఒక్కసారి తన సమ్మతిని ఇవ్వగలిగితే ప్రతీదీ మార్పుచెందుతుంది. కాని, అతని మానసిక, ప్రాణిక, భౌతికప్రకృతి అందుకొప్పుకోదు. పైగా ఎదురు తిరుగుతుంది. అతడు తన మూర్ఖత్వాన్నే ప్రేమిస్తాడు.

దైవమే మన అస్తిత్వపు నైజం. ఈ మనోప్రాణికదైహికాలు దాని కురూపములు, దాని ముసుగులు; కాని స్వరూపమునందు దానికి పాత్రలు. ఆధ్యాత్మికుడవటం మాత్రమే సరిపోదు. అది స్వర్గానికి వెళ్లగలిగే ఎన్నో ఆత్మలను తయారుచేస్తుంది. కాని, ఈ భూప్రపంచాన్ని ఎలా వున్నదో అలాగే వదలివేస్తుంది. అదే కాక, మోక్షం ద్వారా విమోచనం పొందుదామనుకోడం కూడా ఆమోదయోగ్యం కాదు.

ప్రపంచానుభవానికి వచ్చిన విప్లవాలు మూడు. గట్టి ఫలితాన్నిచ్చేవి, భౌతికపరమైనవి అయితే, నైతికపరమైనవి, మేధాసంపత్తికి సంబంధించినవి పరిధిలో అపారమైన విస్తృతి కలిగినవై, ఇంకా ఎక్కువ ఫలితాల నొసగగలవి. కాని, ఆధ్యాత్మికతకు సంబంధించినది శ్రేష్టమైన విత్తనాలు నాటడం వంటిది.

ఈ త్రిపుటి (మనోప్రాణికదైహికాలు) మార్పు గనుక ఒక దానితో ఒకటి ఏకమై పరిపూర్ణమైన అనుసంధానంతో జరిగితే దోషరహితమైన పని జరుగుతుంది. కాని, మానవ మనోశరీరాలు అతివేగంతో తోసుకువచ్చే గట్టి ఆధ్యాత్మిక తీవ్రతను పరిపూర్ణంగా పట్టి వుంచలేవు. దానిలో చాలా భాగం తునాతునకలైపోగా, మిగిలినదానితో చాలా మట్టుకు భ్రష్టుపట్టిపోతుంది. ఎన్నో మేధోపరమైన, భౌతికపరమైన మన పృథ్వికి సంబంధించిన విప్లవాత్మకమైన పరిణామాలు జరగడానికి అవసరమైనది, అతిపెద్ద ఆధ్యాత్మిక వ్యవసాయం నుంచి పొందే కొద్ది ఫలితం.

ప్రతి మతం మానవజాతికి ఉపకారం చేసింది. ప్రకృతి ఆరాధననే చెప్పే మతం (Paganism) మానవునిలో సౌందర్యపిపాసను, జీవితంలో విశాలత్వాన్ని, ఉన్నతిని, అనేకరకాలైన పరిపూర్ణతలకు సంబంధించిన లక్ష్యాన్ని అతనిలో ఎక్కువ చేసింది. క్రీస్తుమతం దైవప్రేమ, దాతృత్వాల దృష్టి నిచ్చింది. బౌద్ధమతం వివేకం, నమ్రత, పవిత్రతలతో మహోదాత్తంగా వుండే పద్ధతిని చూపించింది. జూడోమతం (Judaism), ఇస్లాం మతం మతనిబద్ధతతో కర్మల నాచరించడం, పరమోత్సాహంతో ఆరాధించడం ఎలాగో చెప్పాయి. హిందూమతం మహోత్కృష్టమైన, ప్రగాఢమైన ఆధ్యాత్మిక అవకాశాలను బహిర్గతం చేసింది. ఈ దైవపరమైన దృశ్యాలన్ని ఒకదాని నొకటి పెనవేసుకొని, మరొకదాని లక్షణాలతో మమేకమైపోతే, అప్పుడు అది గొప్ప కార్యానికి శుభారంభమవుతుంది.[3] కాని మేధావుల సిద్ధాంతాలు, మతమౌఢ్యపు అహం దాని దారికి అడ్డు.

మతాలన్ని ఎన్నో ఆత్మలను ఉద్ధరించాయి. కాని ఏ మతం కూడా ఇప్పటికీ మానవజాతిని ఆధ్యాత్మీకరించ లేకపోయాయి. దానికి, మతాల, ఇతర వర్గాల అవసరమే లేదు. కావలసినదల్లా, మొక్కవోని, సర్వసమగ్రమైన ప్రయత్నంతో కూడిన ఆధ్యాత్మిక ఆత్మపరిణామం (self-evolution)

ఈ రోజుల్లో ప్రపంచంలో మనం చూసే మార్పులను వాటి ఆదర్శాలతో, ధోరణులతో పరికిస్తే అవి మేధోపరమైనవిగా, నైతికపరమైనవిగా, భౌతికపరమైనవిగా కనపడతాయి. ఆధ్యాత్మిక విప్లవం తన సమయంకోసం వేచియున్నది. మధ్య మధ్యలో కొన్ని

---

[3] The Mother clarifies:

It is not in the mental consciousness that these things can be harmonised and synthesised. For this it is necessary to rise above and find the idea behind the thought. Sri Aurobindo shows here, for example, what each of these religions represent in human effort, aspiration and realisation. Instead of taking these religions in their outward forms which are precisely dogmas and intellectual conceptions, if we take them in their spirit, in the principle they represent, there is no difficulty in unifying them. They are simply different aspects of human progress which complete each other perfectly well... (*CWM* Vol.9,.p. 76)

అలలను పైకి ఎగసిపడేస్తున్నది. అది వచ్చేవరకు మిగతావాటి అంతరార్థం అర్థం కాదు. అంతవరకు, ఇప్పుడు జరుగుతున్న విషయాలకు సంబంధించిన అన్నిరకాల వివరణలు, మానవ భవితవ్యం గురించిన భవిష్యవాక్కులు వ్యర్థప్రసంగాలు. ఎందువల్లనంటే, దాని (ఆధ్యాత్మిక విప్లవం) స్వభావం, శక్తి, గతి రాబోయే మానవజాతికి సంబంధించి నూతన కల్పాన్ని నిర్ణయిస్తుంది.

అనువాదం: టి. ప్రసన్నకృష్ణ

(*SABCL* Vol. 16, pp. 393-94)

ఆధ్యాత్మిక జీవితం కొనసాగించడం ఎలా?

శ్రీమాత

ఆధ్యాత్మిక జీవితం గడపాలనుకునేవారు ఏమాత్రం పరధ్యాస లేకుండా అనునిత్యం కడుజాగ్రత్తతో మెలగాలి. దాన్ని నడిసంద్రపు నావ ప్రయాణంతో పోల్చవచ్చు. ఒక పెద్ద నదీప్రవాహంలో కానీ, అల్లకల్లోలిత సముద్రంలో కానీ నావలో వెళ్లాలనుకున్నప్పుడు హాయిగా కునుకుతీస్తూ ప్రవాహపురౌద్రాన్ని పట్టించుకోకుండా వుంటే చివరకు చేరవలసిన తీరానికి బదులు ఆవలతీరానికి చేరినట్లే, జీవితంలో అప్రమత్తులై వుండకపోతే అనుకున్న గమ్యం చేరలేరు.

సాధారణంగా జరిగేదదే. చైతన్యాత్మకంగా మెలగటానికి బదులు పరధ్యాసగ జీవితం గడిపేస్తూ పరిస్థితులనూ, తమ దురదృష్టాన్నీ నిందించడం మొదలుపెడతారు. లేకపోతే నిందలను ఎవరి మీదో నెట్టేస్తారు. అలా చేయటం వారికి సదుపాయంగా వుండవచ్చు. అంతేకానీ తమ తప్పులను తెలుసుకునే ప్రయత్నం చెయ్యరు. తమ లోపాలను గ్రహించగలగటానికి ఎంతో విశాలమైన చైతన్యస్థాయిని కలిగి వుండాలి. సాధారణంగా చైతన్యవం

తులై వున్నామనుకున్న వారిలో కూడా జరిగినదంతా తమ పొర పాటేగాని మరొకటి కాదని స్పష్టంగా తెలుసుకోగలిగే వారు చాలా తక్కువ. వారు వారి దురదృష్టానికి నిందను ఎవరిపైనో గాని, పరిస్థితుల ప్రభావంపై గానీ వేయటానికే ప్రయత్నిస్తారు. నిజానికి నీవు నీవుగాకపోతే జరిగినది ఇలా కాక మరోలా వుండేది కదా!

*

నీవు ఎటువంటి పరిస్థితుల్లో వున్నప్పటికీ ఆధ్యాత్మిక వాతావర ణాన్ని ఏర్పరుచుకొని ఆధ్యాత్మికజీవితం కొనసాగించవచ్చు. ఇతర ఆలోచనలేవి లేకుండా ఎప్పుడూ నీ సాధన గురించే తల పోస్తూ, ఏ పని చేస్తున్నప్పటికి దానినే ఆధ్యాత్మిక సాధనగా కొనసాగిస్తూ, కొరగాని ఆశలకూ, పనికిరాని బాహ్య కార్యక్ర మాలకూ స్వస్తిచెప్పి అంతర్గత జీవనంపై శ్రద్ధ వహించి, నీ చుట్టూరా వుండే విషయాలకూ, సంఘటనలకూ, భావనలకూ, పనులకూ దూరమైపోయినప్పుడే చక్కని ఆధ్యాత్మిక వాతావరణం నీ చుట్టూ తయారవుతుంది. అంతేకాక నీవు చదివే విషయాలను, మాట్లాడే తీరును కూడా పరిశీలించుకొని నియంత్రణ చేసుకో వాలి. నీ సాధనా మార్గానికి పనికివచ్చే విషయాలు మాత్రమే చదవటం అలవాటు చేసుకోవాలి; ఆత్మసిద్ధికి దోహదం చేసే మార్గంలో మాత్రమే నడుస్తూ దానికి పనికొచ్చే పనులు మాత్రమే చేయాలి. బాహ్యజీవితంపై ఆసక్తి కలిగించే ఆశలనూ, ఆవేగాలనూ, రద్దుచేసుకొని మనస్సును ప్రశాంతపరచి, ప్రాణికజీవుని శమింప చేసి, బయటనుంచి వచ్చే సూచనలను లోనికి ప్రవేశించకుండా నిలుపుచేసి, నీ దగ్గరున్న మనుష్యుల ప్రభావాలకు లోనుకాకుండా నిలిచినప్పుడు నీ వాతావరణాన్ని ఎంతో పటిష్టంగా ఏర్పాటు చేసుకోగలవు. ఇక అప్పుడు ఏ విధమైన బాహ్యసంఘటనలూ, సంపర్కాలు నిన్నంటుకోలేవు. అంటే ఆధ్యాత్మికజీవితం గడపాల నుకున్నప్పుడు మనసా, వాచా, కర్మణా వేరే దృష్టి లేకుండా సాధనామార్గంపైనే ఏకాగ్రత నిలిపి దానికి పనికివచ్చే పనులు మాత్రమే చేస్తూంటే నీకు కావలసిన ఆధ్యాత్మిక వాతావరణం

ఏర్పడుతుంది. అలాకాక ఎవరేమి చెప్తే అది వింటూ, చెప్పినవి చేస్తూ, ఇది కావాలి, అది కావాలి అని ఇటూ అటూ పరిగెడుతూంటే ఎప్పటికీ ఆధ్యాత్మిక వాతావరణం నెలకొల్పలేవు. అందరూ గడిపే మామూలు బ్రతుకుల వాతావరణమే నీకూ వుంటుంది.

*

ఈ ఆధ్యాత్మిక పురోగతి సమంగా సాగుతున్నదా లేదా అని తెలుసుకోటానికి నీవు బాగా ధ్యానం చేయగలగడం కొలబద్ద కాదు. ఎన్నో గంటలు ఏకాగ్రంగా ధ్యానంలో కూర్చున్నంత మాత్రాన ఏదో సాధించావనుకో కూడదు. *అప్రయత్నంగా ధ్యానంలోకి వెళ్లిపోవడం, ధ్యానంలోనుంచి బాహ్యచైతన్యంలోకి రావాలంటే పెద్ద ప్రయత్నం చేయవలసి రావడమే ఆధ్యాత్మిక పురోగతికి గుర్తు.* అటువంటి వాళ్లకు భగవంతుని తలుచుకోకుండా ఉండటమంటేనే చాలా కష్టం. భగవచ్చింతన, ధ్యానం వారి జీవితానికి ఆలంబనలైపోతాయి. ఈ విధంగా నిరంతరం కొనసాగుతూ, ఉదయంనుంచి రాత్రి దాకా ఏ పనిచేస్తున్నప్పటికీ భగవధ్యాసలోనే ఉండాలి. పని చేస్తున్నా సరే, ధ్యానం చేస్తూన్నా సరే అంతా దైవచింతనగానే వుండాలి.

ఇక్కడ చేస్తున్నది కూడా ఆ విధంగా ప్రతి క్షణం, ప్రతి పనిలో, ప్రతి కదలికలో దైవంపై దృష్టి కేంద్రీకరించాలనే ప్రయత్నమే.

*

నీవు ఏం చేస్తున్నావనేది ముఖ్యం కాదు. ఏ దృష్టితో ఎలా చేస్తున్నావనేది, అంటే ఏ చైతన్యంతో చేస్తున్నావనేదే లెక్క. అదే ఆధ్యాత్మిక జీవనానికి ఆధారప్రమాణం. అన్ని వేళలా భగవంతుని మనసులో నిలుపుకుంటే చేసే వాటన్నిటిలో ఆయన వునికే వ్యక్తమవుతుంది. చేసే పనులన్నిటినీ భగవదర్పణంగా చేస్తే హీనమైన పనులు, మేటిపనులు, అనే తేడా లేకుండా అన్నిటికీ ఒకే రకమైన గుర్తింపు వుంటుంది. అర్పణాభావంతో చేయటంవల్ల పనికి విలువ కలుగుతుంది.

ఆధ్యాత్మికజీవిత మార్గాన్ని ఎంచుకోవటం నడిసముద్రంలోకి దూకినట్లే. అదే దైవజలధిలో మునకలు వేయడం. ఇక అక్కడ ఎలా వుండాలో నేర్చుకోవాలి. *అంతేకానీ గట్టు మీదే వుండి "ఎటు పడతామో ఏమో? ఆ తర్వాత ఏం జరుగుతుందో అని సందేహపడుతూంటే" నీ మనసు నిన్ను ఎప్పటికీ దూకనివ్వదు!* దుముక తలుచుకున్నప్పుడు ఆలోచనలు, అనుమానాలు లేకుండా నిశ్చింతగా దూకేసెయ్యాల్సిందే!

ప్రశ్న: సముద్రం కళ్లకు కనబడుతుంది కాబట్టి సూటిగా దూకేయవచ్చు కానీ ఆధ్యాత్మిక జీవనం అలా కాదు గదా?

నిజమే కానీ సముద్రాన్ని చూసినట్లుగానే భగవంతుని వునికి లీలగా నీక్కొంత తెలిసే వుంటుంది. సాధారణంగా జాగృతమైన చైత్యపురుషునివల్ల నీకు ఆ విధంగా భగవంతుని వునికి గోచరమై యుండవచ్చు. అది కాకపోతే సుస్థిరమైన నీ మనఃప్రాణికాల్లో నీకు కొంత భగవత్స్పర్శ అనుభవమై యుండవచ్చు. లేక నీ చుట్టుపట్ల భగవంతుని వునికి స్పష్టంగా నీకు తెలిసి వుండవచ్చు. ఆయన వూర్పు నీకు సోకి వుండవచ్చు. ఈ విధమైన అనుభూతుల్లో నీవు తలమునకలుగా వున్నప్పుడు బాహ్యప్రపంచపు వత్తిడులు నిన్ను వుక్కిరిబిక్కిరి చేసి అందు నుంచి తప్పించుకోవాలని ఆరాటపడేటట్లు తలపించవచ్చు. ఇక అప్పుడు సంపూర్ణంగా భగవంతుని శరణుజొచ్చి నీవే తప్ప ఇతః పరం బెరుగనంటూ ఆయన రక్షణలోనే వుండిపోవాలి. అంతవరకూ సాధారణ జీవితం గడుపుతూ అప్పుడప్పుడూ భగవచ్చింతన చేస్తూండవచ్చు. లేక మానసికంగానో, వాచకంగానో కొంత సాధన చేస్తూండవచ్చు కానీ ఇక ఇప్పటినుంచీ సర్వదా భగవదారాధనలోనే లీనమవాలి. దీన్నే ఆధ్యాత్మజలధిలోకి దుమకటమని చెప్పాను. ఇలా చేయనప్పుడు నీవు ఎంతకాలం యోగసాధన చేసినప్పటికీ ఆధ్యాత్మజీవనమంటే ఏమిటో తెలుసుకోలేవు. ఈ విధంగా సంపూర్ణంగా ఆధ్యాత్మజీవనంలోకి దిగిపోతే బాహ్యా

జీవితంలో వుండే చికాకు లన్నిటినుంచీ విముక్తి పొంది యథార్థ మైన అనుభవం సంపాదిస్తావు.

ప్రశ్న: దివ్యజననీ, సత్యమైన ఆధ్యాత్మజీవనం ఎక్కడ నుంచి మొదలవుతుంది?

అంతర్గత చైత్యపురుమని సంస్పర్శను పొంది, అక్కడ భగవం తుని చైతన్యాన్ని నిరంతరం అనుభవంలోకి తెచ్చుకుంటూ జీవితం గడపగలిగితే ఆధ్యాత్మజీవనం సాగిస్తున్నట్లే. అంతకు ముందర ఏం చేసినా అది నిజమైన ఆధ్యాత్మికత కాదు.

ఇంకో రకంగా చెప్పాలంటే చైత్యపురుమనితో సమాగమం పొంది, భగవంతుని చైతన్యంలో వుండి చేసే పనులకు కావల సిన ప్రేరణను అక్కడనుంచే గ్రహిస్తూ తన సంకల్పమే దైవసం కల్పానికి సహకారిగా తయారైనప్పుడు అదే ఆధ్యాత్మజీవితానికి నాంది. అంతకు ముందు ఆకాంక్షావాదిగానే వుంటారు కానీ ఆధ్యాత్మిక జీవితం వారి కుండదు.

స్వేచ్ఛానువాదం: ఎ. ప్రభావతి, ఎ.వి.ఆర్ శాస్త్రి

(*CWM* Vol. 6, pp. 97, 356-57; Vol. 3, p. 20; Vol. 14, p. 36; Vol. 3, pp. 21-22; Vol. 8, p. 136)

ఆధ్యాత్మిక జీవితమనగా 24 గంటలు ధ్యానం చేయుటం కాదు. నువ్వు ధ్యానమే చెయ్యి, కర్మలే ఆచరించు – దైవమును స్మరిస్తూ ఏం చేసినప్ప టికీ అది దైవకార్యమే అవుతుంది.

శ్రీమాత

ఆధ్యాత్మిక మనగా పునర్జన్మ

శ్రీమాత

1. ప్రతి క్షణం పాతబంధాలను తెగతెంపులు చేసుకుంటూ, తాజా జీవితాన్ని మొదలుపెట్టుట. (spiritual rebirth means the constant throwing away of our previous associations and circumstances and proceeding to live as if at each virgin moment we were starting life anew.)

2. కర్మలనబడే పాతవాసనలు – కార్యకారణ సంబంధాలను పూర్తిగా విస్మరించుట.

3. అప్పుడే నీకు నిజమైన స్వేచ్ఛ – కేవలం మనస్సులోనే కాకుండా శరీరమందెల్లడలా లభిస్తుంది.

4. నీ గతజీవితాన్ని వదిలించుకోవాల్నంటే, అసలు 'అది జరిగింది' అనే విషయాన్నే మరిచిపోవాలి.

5. దైవములోని భాగమై, ఎల్లప్పుడు భగవంతునికే సమర్పితమైవున్న చైత్యపురుమని చైతన్యంలోకి ప్రవేశించినప్పుడు, ఇక ఎట్టి బంధము నిన్ను పీడించదు. ఇక నీకంతా స్వేచ్ఛయే, ఎట్టి వ్యధ లేని ఆనందమే.

6. ప్రతి క్షణం జీవితం కొత్తగా మొదలవుతుంది. పాతగంధమంతా మాయమైపోతుంది.

7. To give you an idea of the final height of spiritual rebirth, I may say that there can be a constant experience of the whole universe actually disappearing at every instant and being at every instant newly created!

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*CWM* Vol. 3, pp. 176-77)

The Mother's Guidance

Q: Mother, what is that will help me always remember that I am living a spiritual life?

The Mother's Reply

The awareness of the Divine Presence in all things and always

(*CWM* Vol. 16, p. 155)

The Mother's Benedictions

Peace, Peace upon all the earth!

May all escape from the ordinary consciousness and be delivered from the attachment for material things; may they awake to the knowledge of Thy divine presence, unite themselves with Thy supreme consciousness and taste the plenitude of peace that springs from it.

(*CWM* Vol. 1, p. 74)

సమాచార పత్రం

సొసైటీ బీచ్ ఆఫీసులో 23 ఫిబ్రవరి నుంచి 5 మార్చి 2004 వరకు డా॥ ఎమ్. వి. నడ్కర్ణిగారు సావిత్రి అధ్యయన కార్యక్రమ మును నిర్వహించెదరు. దీని కందరు ఆహ్వానితులే. శ్రీఅరవిం దుల పద్యముల తమిళానువాదము ప్రథమ సంపుటి ప్రచురింపబ డినది. చందాదారుల చిరునామా మారినయడల ఒక నెల ముందే మాకు తెలియజేయవలెను. పత్రిక అందకపోతే కూడా నెలరోజుల లోపలనే మాకు తెలియజేయగలరు. అంతకంటె ఆలస్యం చేస్తే పాతసంచికలను వుంచటం లేదు కాబట్టి పంపబడవు. వడోదరా (గుజరాతు) లో డా॥ కరణ్‌సింగుగారు శ్రీఅరవిందుల ప్రతిమను (bust) 31 ఆగస్టునాడు ఆవిష్కరించిరి. 31 ఆగస్టునుండి వారం రోజులపాటు డా॥ ఎమ్.వి. నడ్కర్ణి, తదితరులచే వుపన్యాసము లను ఏర్పరచిరి. వల్లభ విద్యానగర్ (గుజరాతు) సర్దార్ పటేలు యూనివర్సిటీవారు 25 ఆగస్టు లగాయితు డా॥ ఎమ్.వి. నడ్కర్ణి గారిచే వారం రోజుల వుపన్యాసములు నిర్వహించిరి. ఓం పూరి (గుజ రాతు) స్త్రీ విభాగము ౨౩ ఆగస్టున "The Women – the vehicle of the Divinity" అనే విషయముపై ఒక కార్యక్రమమును నిర్వహించిరి. నదియా (గుజరాతు), అగర్తలా (త్రిపుర), హాల సంగీ (కర్ణాటక), చెన్నై, నైవేలి (తమిళనాడు), సిమ్లా (హిమాచలప్రదేశ్), అనవట్టి (కర్ణాటక), కాలికట్ (కేరళ), నాగపూర్ (మహారాష్ట్ర), బర్ధవాన్ (పశ్చిమ బెంగాల్), మైథోన్ డామ్ (ఝూర్‌ఖండ్), నైరోబీ (కెన్యా), లలో అనేక కార్యక్రమ ములు, వుపన్యాసములు జరుపబడినవి.

నవంబరు 2003 సంచికలో సవరణ

1 వ పేజీ క్రిందినుంచి మూడవ పంక్తిలో ఈ విధంగా వుండాలి.

పరమసిద్ధి ... 36